మూత్రవృద్ధిక్షయోత్థాంశ్చ మేహాకృచ్ఛ్రచికిత్సయా ।

వ్యాయామాభ్యంజనస్వేద మద్యైః స్వేదక్షయోద్భవాన్ ॥ 33.

తా॥ దోషధాతువృద్ధి క్షయముల కిటుల చికిత్స జెప్పబడియుండినను విశేషముగా రక్తవృద్ధిచే గలిగిన వికారములను రక్తమోక్షణ విరేచనములచే జికిత్సింపవలయును మాంసవృద్ధిచే గలిగిన వికారములయందు శస్త్రక్షారాగ్నికర్మలచేతను, మేదోవృద్ధిచే గలిగిన వికారములయందు ద్వివిధోపక్రమణీయాధ్యాయమున జెప్పబడు స్థౌల్యోపచారముచేతను, మేదఃక్షయముచే గలిగిన వికారములయందు ద్వివిధోపక్రమణీయాధ్యాయమున జెప్పబడు కార్శ్యోపచారముచేతను, అస్థిక్షయముచే గలిగిన వికారములయందు తిక్తద్రవ్యములతోగూడియుండు క్షీరఘృతములు, తిక్తద్రవ్యముతోగూడియుండు వస్తిక్రియలు వీనిచేతను చికిత్సింపవలయును. పురీషవృద్ధిచే గలిగిన వికారములయందు అతిసారమునకు జెప్పియుండు చికిత్సలం జేయవలయును. పురీషక్షయముచే గలిగిన వికారములయందు గొర్రె, మేకపోతు వీనియొక్క మధ్యము (అనగా కంఠమునకు పైభాగము. నాలుగుకాళ్ళు, తోక, వృషణములు ఇవితప్ప తక్కిన శరీరమధ్యప్రదేశమునందుండు మాంసము) చేతను, అర్ధపాకముచేయబడినవియు, ఇంగువ ఘృతము వీనితోగూడియుండునవియునగు యవలు, మినుములు, అలసందలను కారామణులు, కాకాండోలా అను తృణధాన్యవిశేషము, దూలగొండి అనువానిచేతను, చికిత్సింపవలయును. మూత్రవృద్ధిచే గలిగినవికారములయందు మేహరోగచికిత్సలచేతను, మూత్రక్షయముచే గలిగిన రోగములయందు మూత్రకృచ్ఛ్రచికిత్సలచేతను, స్వేదక్షయముచే గలిగిన వికారములయందు వ్యాయామాదులచేతను చికిత్సింపవలయును.

"మజ్జశుక్లామయానాంతు భోజనంస్వాదుశీతలమ్ । శుద్ధివ్యవాయవ్యాయామా యచ్చాన్యచ్ఛుక్రశోధనమ్ ॥"

మజ్జవృద్ధిచేజనించిన రోగమునందు మధురముగ, శీతలముగనుండు భోజనము హితకరమయినది. శుక్రవృద్ధిచేజనించినరోగమునందు మైథునము, వ్యాయామము, శుక్రమును వృద్ధిజేయునట్టి ఆహారాదులు హితకరమైనవి అని అష్టాంగసంహితయందు జెప్పబడియున్నది.

### రసాది - ధాతువృద్ధి - క్షయకారణము.

శ్లో॥ స్వస్థానస్థస్యకాయాగ్నేరంశాధాతుషుసంశ్రితాః ।

తేషాంసాదాతిదీప్తిభ్యాం ధాతువృద్ధిక్షయోద్భవః ॥ 34.

పూర్వోధాతుఃపరంకుర్యా ద్వృద్ధఃక్షీణశ్చతద్విధమ్ ।



తా॥ స్వస్థానమునందుండు జాఠరాగ్నియొక్క భాగములు రసాదిధాతువుల నాశ్రయించియుండును. మఱియు నాజాఠరాగ్నిభాగములయొక్క మాంద్యమువలన వృద్ధియు; అతితీక్ష్ణతవలన క్షయమును రసాదిధాతువులకు గలుగును.

"పిత్తంపంచాత్మకంతత్తు పక్వామాశయమధ్యగమ్"

అను వచనప్రకారము పక్వాశయ, ఆమాశయములయొక్క మధ్యస్థానము జాఠరాగ్నికి స్వస్థానమనబడును. మొదటిదియగు రసధాతువు వృద్ధిజెందినచో రెండవదియగు రక్తధాతువుకూడా వృద్ధిజెందును. అటులనే మొదటిదియగు రసధాతువుక్షయించినచో రెండవదియగు రక్తధాతువుకూడా క్షయించును.

### వాతాది - ప్రకోపమువలన - రసాది దుష్టత్వము.

శ్లో॥ దోషాదుష్టారసైర్ధాతూన్ దూషయంత్యుభయేమలాన్ ॥ 35.

అధోద్వేస ప్తశిరసి ఖానిస్వేదవహానిచ ।

మలామలాయనానిస్యు ర్యథాస్వం తేష్వతోగదాః ॥ 36.

తా॥ మిథ్యాయోగముగ, అయోగముగ, అతియోగముగ సేవించబడిన మధురాదిషడ్రసములచే వాతాదిదోషములు కుపితంబులై రసాదిధాతువులను దోషయుక్తములుగజేసును. అటుల కుపితంబులైన వాతాదిదోషములును, రసాదిధాతువులునుజేరి పురీషమూత్రాదిమలములను దోషయుక్తములుగజేసును. అటుల దుష్టమైనమలములు మలస్థానములను (అనగా శరీరముయొక్క అధోభాగమునందుండు గుదము, శిశ్నము అనునీ 2-ని, శిరమునందుండు నేత్రములు 2, కర్ణములు 2, నాసారంధ్రములు 2, నోరు 1 టి అనునీ 7 యింద్రియములను, సర్వశరీరములో స్వేదమునువహించుచుండు రోమకూపద్వారములను) దోషయుక్తములుగజేసును. ఏయేమలస్థానములు దోషయుక్తములుగనగునో ఆయామలస్థానములయందు రోగముగలుగును.

"మలాయనానిబాధ్యంతే దుష్టైర్మాత్రాధికైర్మలైః"

దోషయుక్తముగను, స్వప్రమాణాధిక్యముగనుండు మలములచే గుదాదిమలస్థానములు పీడించబడును. అని చరకాచార్యుడుకూడా జెప్పియున్నాడు.

### ఓజో నిరూపణము.

శ్లో॥ ఓజస్తు తేజోధాతూనాం [illegible]త్తానాంపరంస్మృతమ్ ।

హృదయస్థమపి[illegible]దేహస్థితినిబంధనమ్ ॥ 37.

స్నిగ్ధంసోమాత్మకంశుద్ధ మీషల్లోహితపీతకమ్ ।
యన్నాశేనియతంనాశో యస్మిం స్తిష్ఠతితిష్ఠతి ॥ 38.
నిష్పద్యంతేయతోభావా వివిధాదేహసంశ్రయాః ।

తా॥ రసధాతువు మొదలు శుక్రధాతువువరకుండు ధాతువులయొక్క ఉత్కృష్టమయిన తేజస్సే ఓజస్సని మునులచే జెప్పబడును. మఱియు 6 బిందువులస్వరూపము గల యాఓజస్సుకు హృదయము విశేషముగా స్థానముగనుండును. మఱియు నాఓజస్సు హృదయమునందుండినను సకలశరీరమునందు వ్యాపించుచుండును. అది దేహముయొక్క స్థితికి (అనగా జీవితమునకు) ముఖ్యమయినకారణముగనుండును. ఎదినాశమును జెందిన ప్రాణియు నవశ్యముగా నాశము జెందునో, ఎదిబాగుగనుండిన ప్రాణియు జీవించియుండునో, దేనిలోనుండి దేహసంబంధమైన నానావిధభావములుగలుగునో అదియే ఓజస్సని తెలియవలయును. అట్టి ఓజస్సు స్నిగ్ధముగ, నిర్మలముగ, ఒకింత రక్తవర్ణము పీతవర్ణముగలదిగ, సోమస్వరూపముగలదిగనుండును. ఈ యర్థమే,—

"మృదుసోమాత్మకంశుద్ధం రక్తమీషత్సపీతకమ్"
అనువచనముచే అష్టాంగసంగ్రహమునందును జెప్పబడియున్నది.

"హృదితిష్ఠతియచ్ఛుద్ధం స్నిగ్ధమీషత్సపీతకమ్ । ఓజశ్శరీరేసంఖ్యాతం తన్నాశేనవినశ్యతి ॥"

అనగా హృదయమునందు శుద్ధముగ, నిర్మలముగ, స్నిగ్ధముగ, ఒకింత పీతవర్ణముగలదిగనుండునట్టివస్తువే శరీరములోని ఓజస్సని జెప్పబడును. అదినాశము జెందినచో దేహియు నవశ్యముగా నాశము జెందును. అని ఓజోలక్షణమును చరకాచార్యుడుకూడా పైప్రకారమే జెప్పియున్నాడు.

## ఓజఃక్షయ స్వరూపౌషధము.

శ్లో॥ ఓజఃక్షీయేతకోపక్షు ద్ధ్యానశోకశ్రమాదిభిః ॥ 39.
బిభేతిదుర్బలోఽభీక్ష్ణం ధ్యాయతివ్యథితేంద్రియః ।
విచ్ఛాయోదుర్మనారూక్షో భవేత్ క్షామశ్చతత్క్షయే ॥ 40.
జీవనీయౌషధక్షీర రసాద్యాస్తత్రభేషజమ్ ।

తా॥ ఆ ఓజస్సు కోపము, ఆకలి, ధ్యానము, దుఃఖము, శ్రమ యీ మొదలగువానిచేక్షయించును. (అనగా కొరవడును.) అది క్షయించినచో మనుజుడు విశేషముగా భయమునుజెందును. శరీరమునకు విశేషముగా దౌర్బల్యముగలుగును. ఇంద్రియములన్నియు మిగులవ్యథను జెందుటచే నెల్లపుడు చింతాక్రాంతుడుగనగును. శరీరకాంతినశించును. ఎల్లపుడు దుఃఖాక్రాంతుడుగ, రూక్షతోగూడినవాడుగ, కృశమైన శరీరముగలవాడుగనగును. కాబట్టి ఓజఃక్షయమునందు జీవనసంజ్ఞగల జీవంతి మొదలగు 10 విధములైన ఔషధములను, మధురమైన యితరద్రవ్యములను, క్షీరము, మాంసరసము, కాకాండోల, దూలగొండి, ఘృతము యీ మొదలగుద్రవ్యముల నుపయోగపరచవలయును. ఇదియె ఓజఃక్షయమునందౌషధము.



## ఓజోవృద్ధివలన దేహవృద్ధి.

శ్లో॥ ఓజోవివృద్ధౌదేహస్య తుష్టిపుష్టిబలోదయః ॥ 41.

తా॥ ఓజస్సువృద్ధిజెందినచో శరీరమునకు సంతోషము, పుష్టి, బలము, ఇవి విశేషముగా వృద్ధిజెందును.

## దోషవృద్ధి - క్షయ శమనోపాయము.

శ్లో॥ యదన్నంద్వేష్టియదపి ప్రార్థయేతావిరోధితు ।
తత్తత్త్యజన్సమశ్నంశ్చ తౌతౌవృద్ధిక్షయౌజయేత్ ॥ 42.

తా॥ మనుజుడే యన్నమునందు సంతోషించుటలేదో, ఏయన్నమును విశేషముగా కోరుచుండునో అట్టిదానిలో ద్వేషముగలదిగ, విరుద్ధమైనదిగనుండు యన్నమును పరిహరించి ఇష్టముగలదిగ, విరోధము కాకుండునదిగనుండు యన్నమును భుజించవలయును. అటులజేసినచో దోషసంబంధముచే జనించిన వృద్ధిక్షయ వికారములు శాంతిజెందును.

## వాతాదివృద్ధి - క్షయ కృత్యము.

శ్లో॥ కుర్వతేహిరుచిందోషా విపరీతసమానయోః ।
వృద్ధాఃక్షీణాశ్చభూయిష్ఠం లక్షయంత్యబుధాస్తున ॥ 43.

తా॥ వాతాదిదోషములు వృద్ధినిజెందియుండునపుడు స్వస్వగుణములకంటె తరుచుగ విపరీతముగనుండు వస్తువులయందును, క్షయమును జెందియుండునపుడు స్వస్వగుణములతో తరుచుగ సమానముగనుండువస్తువులయందును యథాక్రమముగ (అనగా వాతవృద్ధియందు విపరీతగుణములుగల స్నిగ్ధ, అమ్ల, మధురరసములతోడను, పిత్తవృద్ధి

యందు విపరీతగుణములుగల శీత, మధుర, రూక్ష, తిక్త, కషాయరసములతోడను, శ్లేష్మవృద్ధియందు విపరీతగుణములుగల రూక్ష, అమ్ల, కటు, తిక్తరసములతోడను, వాతక్షయమునందు సమానగుణములుగల రూక్ష, కషాయరసములతోడను, పిత్తక్షయమునందు సమానగుణములుగల ఆమ్ల, లవణరసములతోడను, శ్లేష్మక్షయమునందు సమానగుణములుగల స్నిగ్ధ, మధుర, అమ్ల, లవణరసములతోడను గూడియుండు అన్నాదులయందు) విశేషముగా ప్రీతినిగలుగజేసును. మఱియును వాతాదిదోషములు తమ విచిత్ర గమనమువలన పైజెప్పిన క్రమమునకు విపరీతముగకూడా వస్తువులయందు ప్రీతినిగలుగజేసును. అదియెట్లనగా:—ఒకానొకమనుజునికి వాతముక్షయించియుండు నపుడుకూడా స్నిగ్ధమధురరసములతోగూడియుండు అన్నాదులయందు ప్రీతినిగలుగజేయుచున్నది. అటులనే పిత్తమువృద్ధిజెంది యుండునపుడుకూడా ఆమ్లలవణరసములతోగూడియుండు అన్నాదులయందును, శ్లేష్మము వృద్ధిజెందియుండునపుడు కూడా మధురఆమ్లరసములతోగూడియుండు అన్నాదులయందును ప్రీతిని గలుగజేసును. కాబట్టి పైజెప్పిన విపరీత సమానవస్తున్యాయము అన్నిస్థలములయందు తరుచుగారానేరదని తెలియపరచుటకై ''భూయిష్ఠం'' అనుపదము ప్రయోగించబడినది. ఇటుల వాతాదులయొక్కగతి విచిత్రముగనుండుటవలన ఆ పండితులగు వారలు దోషములు వృద్ధిజెందినవా, లేక క్షయించినవా అను విషయమును దెలిసికొనలేకనున్నారు. వృద్ధిజెందుటయనగా—స్వప్రమాణమునకంటె నధికపడుటయని యర్థము.

వాతాదివృద్ధి - క్షయ లక్షణము.

శ్లో॥ యథాబలంయథాస్వంచ దోషావృద్ధావితన్వతే।
రూపాణిజహతిక్షీణా స్సమాఃస్వంకర్మకుర్వతే॥ 44.

తా॥ వాతాదిదోషములు వృద్ధిజెందినచో తమతమబలము నతిక్రమించకుండా తమతమగుణకర్మలను వృద్ధిజేసును. వాతాదిదోషములు క్షయించినచో తమతమబలము నతిక్రమించకుండా తమతమగుణకర్మలనుత్యజించును. అదియెట్లనగా:—వాతమువృద్ధిజెందినచో రూక్ష, శైత్యము, పారుష్యము, స్రంసను, వ్యాసము యీ మొదలగు గుణకర్మలను వృద్ధిజేసును. వాతముక్షయించినచో పైజెప్పిన రూక్షాది గుణకృత్యములను విడుచును. ఇటులనే పిత్తశ్లేష్మములకును గుణకృత్యములను తెలియవలయును. మఱియును వాతాదిదోషములు వృద్ధినిజెందక క్షయించక సమంబులై తమతమ ప్రమాణమునంకుండినచో ఉత్సాహము, ఎగయూపిరి యీ మొదలగుస్వస్వకృత్యములను గలుగజేసును. కావున నాలక్షణములచే వాతాదులయొక్క వృద్ధిక్షయసమత్వములను తెలిసికొనవలయును.



వాతాదులకు - వృద్ధిక్షయములు - గలుగకుండా రక్షించుట.

శ్లో॥ యఏవదేహస్యసమావివృద్ధ్యై తఏవదోషావిషమావధాయ।
యస్మాదతస్తేహితచర్యయైవ క్షయాద్వివృద్ధేరివరక్షణీయాః॥45.

తా॥ వృద్ధిక్షయములనుజెందక స్వప్రమాణమునందుండు వాతాది దోషములు దేహవృద్ధికి కారణముగనగును. మఱియు నావాతాదిదోషములే స్వప్రమాణమునకంటె వృద్ధిజెందినను, లేక క్షయించినను దేహనాశమునకు కారణముగనగును, కాబట్టి ఆ వాతాదిదోషములు క్షయవృద్ధులను జెందకుండునటుల హితకరమైన చర్యలవలన వానిని రక్షించుచుండవలయును. వాతాదులు వృద్ధిజెందకుండునటుల రక్షించునటులనే క్షయించకుండునటులకూడా ఉపేక్షించక నవశ్యముగారక్షించవలయును.

ఏకాదశాధ్యాయము, ముగిసెను.

శ్రీ రస్తు.

# ద్వాదశాధ్యాయము.

దోషాదివిజ్ఞానీయాధ్యాయానంతరము దోషముల యొక్క భేదజ్ఞానము లేకనే దోషజ్ఞానము గలుగనేరదు; కాబట్టి దోషభేదీయాధ్యాయము జెప్పబడుచున్నది.

## దోష - భేదీయాధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతో దోషభేదీయ మధ్యాయంవ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయో మహర్షయః ॥

తా॥ దోషాదివిజ్ఞానీయాధ్యాయానంతరము దోషములయొక్క స్థాన నామ విభాగాదులచే గలిగియుండు భేదముల నెఱుంగుటకు హితకరమైన దోషభేదీయాధ్యాయమును వివరించెదము.

### వాత స్థానము.

శ్లో॥ పక్వాశయకటీసక్థి శ్రోత్రాస్థిస్పర్శనేంద్రియమ్ ।
స్థానంవాతస్యతత్రాపి పక్వాధానంవిశేషతః ॥ 1.

తా॥ పక్వాశయము, పిఱుదులు, తొడలు, చెవులు, అస్థులు, స్పర్శనేంద్రియము, అనునీ 6-ను వాతమునకుస్థానంబులు. వానిలో పక్వాశయము వాతమునకు ముఖ్యస్థానము. మఱియును పక్వాశయము వాతమునకు ముఖ్యస్థానమని మొదటి యధ్యాయమునందు "తేవ్యాపినోపిహృన్నాభ్యోః" అను శ్లోకముచే జెప్పబడియున్నది. కావుననే వాతవ్యాధియందు వస్తిచికిత్స ప్రధానముగ జెప్పబడియున్నది. వాతాదులు విచిత్రమైన గతిగలవియగుటచే ప్రాణాదిభేదములవలన వానికివేర్వేరుగా స్థానకర్మములుకూడా జెప్పబడును.

### పిత్త స్థానము.

శ్లో॥ నాభిరామాశయఃస్వేదో లసీకారుధిరంరసః ।
దృక్స్పర్శనంచపిత్తస్యనాభిరత్రవిశేషతః ॥ 2.



తా॥ నాభి, ఆమాశయము, స్వేదము, లసీకా (అనగా త్వక్కు, మాంసము వీని మధ్యమున జలసదృశముగనుండు రసము) రక్తము, రసము, నేత్రములు, స్పర్శనేంద్రియము (అనగాత్వక్కు) ఇవి పిత్తమునకుస్థానములు. వానిలో నాభి పిత్తమునకు ముఖ్యస్థానము. స్పర్శనేంద్రియము వాతమునకు స్థానమని పైనజెప్పబడియున్నది. అట్లగుటచే నాస్పర్శనేంద్రియమే పిత్తమునకు నెటుల స్థానంబగుననెడిశంకగలుగును. అయితే "అగ్నిఃపిత్తంచవహ్నిః" అనువచనముచేత అగ్నిస్వరూపమైన పిత్తమునకు వాయువు సహాయముగనుండుటవలన వాత, పిత్తములకు స్థానంబొకటిగనుండుట యుక్తంబేను.

### శ్లేష్మ స్థానము.

శ్లో॥ ఉరఃకంఠశిరఃక్లోమ పర్వాణ్యామాశయోరసః ।
మేదోఘ్రాణంచజిహ్వాచ కఫస్యసుతరామురః ॥ 3.

తా॥ ఱొమ్ము, కంఠము, శిరము, క్లోమము (అనగా కడుపులో కుడిప్రక్కనుండు మాంసఖండము), గణుపులు, ఆమాశయము, రసము, మేదస్సు, నాసికము, నాలుక ఇవి కఫమునకు స్థానంబులు. వానిలో ఱొమ్ము కఫమునకు ముఖ్యస్థానము.

### వాతమునకు - పంచవిధ స్వరూపము.

శ్లో॥ ప్రాణాదిభేదాత్పంచాత్మావాయుః

తా॥ వాతము చలనస్వభావముగలది. అది ఒకటేవిధము గలదియైనను ప్రాణ ఉదాన వ్యాన సమాన అపానములను భేదములవలన 5 విధములుగనగును. అది యెట్లన్న:—దేవదత్తుడనువాడొక్కడే తాజేయుక్రియల కనుగుణమైన లావకపాచకాది సంజ్ఞలజెందునటులనే వాతాదులును తమతమక్రియల కనుగుణమైన ప్రాణాపానాది సంజ్ఞలను జెందును.

### ప్రాణవాత - స్థాన కృత్యములు.

శ్లో॥ ప్రాణోత్రమూర్ధగః ।
ఉరఃకంఠచరోబుద్ధి హృదయేంద్రియచిత్తధృక్ ॥ 4.
నిష్ఠీవనక్షవథూద్గారనిః శ్వాసాన్నప్రవేశకృత్ ।

తా॥ పైజెప్పిన ప్రాణాదులలో ప్రాణమనువాయువు ముఖ్యముగ శిరమునందుండును. అది వక్షస్థలము, కంఠము వీనియందుసంచరించుచు బుద్ధి, హృదయము, ఇంద్రియములు, చిత్తము వీనికి ధారకముగనుండును. నిష్ఠీవనము (అనగా నోట

యూరుజలమును కారివుమియుట) తుమ్మ, ఉద్గారము (అనగా తేనుపు) నిశ్వాసము అన్నప్రవేశము యీమొదలగుక్రియలను చేయుచుండును.

### ఉదానవాత - స్థాన - కృత్యములు.

శ్లో॥ ఉరఃస్థానముదానస్య నాసానాభిగళాంశ్చరేత్ ॥ 5.
వాక్ప్రవృత్తిప్రయత్నోర్జా బలవర్ణస్మృతిక్రియః ।

తా॥ ఉదానమను వాతము రొమ్ముయందుండును. అది నాసికము, నాభి, కంఠము వీనియందు సంచరించుచు సంభాషణము, కార్యములయందు ప్రయత్నము, ఉత్సాహము, బలము, వర్ణము, పూర్వానుభూతస్మరణము యీ మొదలగు క్రియలను లను చేయుచుండును.

### వ్యానవాత - స్థాన కృత్యములు.

శ్లో॥ వ్యానోహృదిస్థితఃకృత్స్న దేహచారీమహాజవః ॥ 6.
గత్యపక్షేపణోత్క్షేప నిమేషోన్మేషణాదికాః ।
ప్రాయస్సర్వాఃక్రియాస్తస్మిన్ ప్రతిబద్ధాశ్శరీరిణామ్॥ ॥ 7.

తా॥ వ్యానమను వాయువు హృదయమునందుండి సర్వశరీరమునందు సంచరించుచుండును. అది ప్రాణాదివాయువులకంటె నతిశీఘ్రమైన గమనముగలదై సంచారము, అపక్షేపణము (అనగా అంగములను అధోభాగమునందు జాచుట.) ఉత్క్షేపము (అనగా అంగములను పొడవుగనెత్తుట) నిమేషము (అనగా కనురెప్పవాల్చుట) ఉన్మేషము (అనగా కనుఱెప్పలువిచ్చుట) యీమొదలగువానిని (అనగా అవలింతలు అన్నమును భుజించుట) అనునీ సర్వక్రియాలను తఱుచుగా చేయుచుండును.

### సమానవాత - స్థాన కృత్యములు.

శ్లో॥ సమానోగ్నిసమీపస్థః కోష్ఠేచరతిసర్వతః ।
అన్నంగృహ్ణాతిపచతి వివేచయతిముంచతి ॥ 8.

తా॥ సమానమను వాయువు పాచకమను అగ్నిసమీపమునందుండినదై కోష్ఠమునందంతట సంచరించుచుండును. అది పక్వమైనయన్నమును ఆమాశయమునందుజేర్చి వంటవానివలెనే జాఠరాగ్నిని జ్వలింపజేసి అన్నమును పాకముజేసును. ఉంటగనుండు యన్నమును పాకార్థమై విభజనజేసును. మలమూత్రముల నధోభాగమునకు దోసును.



### అపానవాత - స్థాన కృత్యములు.

శ్లో॥ అపానోపానగఃశ్రోణి వస్తిమేఢ్రోరుగోచరః ।
శుక్రార్తవశకృన్మూత్ర గర్భనిష్క్రమణక్రియః ॥ 9.

తా॥ అపానమనువాయువు ముఖ్యముగా అపానస్థానమునాశ్రయించి పిఱుదులు, వస్తి, శిశ్నము, తొడలువీనియందుసంచరించుచు రేతస్సు, ఆర్తవము, మలము, మూత్రము, గర్భము వీనిని వెలిపరచుచుండును. ఇదియ దానియొక్కకృత్యము. ఇటుల వాతభేదములైదును జెప్పబడినవి.

### పాచకమను - పిత్త కృత్యము.

శ్లో॥ పిత్తంపంచాత్మకంతత్ర పక్వామాశయమధ్యగమ్ ।
పంచభూతాత్మకత్వేపి యత్తైజసగుణోదయాత్ ॥ 10.
త్యక్తద్రవత్వంపాకాది కర్మణానలశబ్దితమ్ ।
పచత్యన్నంవిభజతే సారకిట్టౌపృథక్తథా ॥ 11.
తత్రస్థమేవపిత్తానాం శేషాణామప్యనుగ్రహమ్ ।
కరోతిబలదానేన పాచకంనామతత్స్మృతమ్ ॥ 12.

తా॥ పిత్తము 5 విధములుగనుండును. వానిలో పక్వాశయ, ఆమాశయముల మధ్యమునందుండునదియును, పంచభూతాత్మకమైయుండగా తేజోగుణాధిక్యము వలన ద్రవస్వరూపమునువదలి కాఠిన్యమునుజెందియుండునదియును, వాతాదులతోజేరి పాకదాహాదిక్రియలుచేయుటచే అగ్నియనుపేరం బఱంగునదియునగు పిత్తము పాచకమనబడును. అది అన్నమును పాకముజేసి సారమును, మలమును వెవ్వేరుగ విభజించును. మఱియు నది పక్వాశయ, ఆమాశయమధ్యమునందుండినదై ధాతువుల నాశ్రయించియుండు రంజకాది యితర పిత్తములకు బలమునిచ్చి సహాయము చేయుచుండును.

### రంజక పిత్తము.

శ్లో॥ ఆమాశయాశ్రయంపిత్తం రంజకంరసరంజనాత్ ।

తా॥ ఆమాశయమునందుండు పిత్తము రసధాతువునకు రాగమును గలుగజేసుట వలన రంజకమనబడును.

### సాధకమను పిత్తము.

శ్లో॥ బుద్ధిమేధాభిమానాద్యై రభిప్రేతార్థసాధనాత్ ॥ 13.
సాధకంహృద్గతంపిత్తం

తా॥ హృదయమునందుండు పిత్తము, బుద్ధి, మేధ, అభిమానము యీ మొదలగు వానిచే తాగోరుకార్యములను సాధించుటవలన సాధకమనబడును.

### ఆలోచక పిత్తము.

శ్లో॥ రూపాలోచనతఃస్మృతమ్ । దృక్స్థమాలోచకం

తా॥ నేత్రమునందలి నల్లగుడ్డు లోపలనుండుపిత్తము రూపాదులను గ్రహించునట్టి శక్తిగలదియగుటవలన ఆలోచకమనబడును.

### భ్రాజక పిత్తము.

శ్లో॥ త్వక్స్థం భ్రాజకం భ్రాజనాత్త్వచః ॥ 14.

తా॥ త్వక్కునందుండు పిత్తము శరీరమునందు కాంతిని గలుగజేసుటవలన భ్రాజకమనబడును. ఇది అభ్యంగము, లేపము, పరిషేకము యీ మొదలగువాటిని పాకముజేసును.

### శ్లేష్మమునకు - పంచవిధత్వము.

శ్లో॥ శ్లేష్మాతుపంచధోరస్థః

తా॥ శ్లేష్మము 5 విధములుగనుండును.

### అవలంబక - శ్లేష్మ స్వరూపము.

శ్లో॥ సత్రికస్యస్వవీర్యతః ।
హృదయస్యాన్నవీర్యాచ్చ తత్స్థఏవాంబుకర్మణా ॥ 15.
కఫధామ్నాంచశేషాణాం యత్కరోత్యవలంబనమ్ ।
అతోవలంబకఃశ్లేష్మా

తా॥ ఆ శ్లేష్మము హృదయమునందుండినదై తన ప్రభావముచే ముడ్డిపూసకు అవలంబనమును (అనగా స్వకృత్యమునందు సామర్థ్యమును) గలుగజేసుటచేతను, మఱియు రసరూపముగ పరిణామమునుజెందిన అన్నముయొక్కవీర్యమువలన హృదయమునకు తన ప్రభావముచే మిక్కుటముగ అవలంబనమునుజేసుటచేతను, క్లేదసంశ్లేష్మాదిరూపమైన జలవ్యాపారముచే నితరమైన కఫస్థానములకు అవలంబనమును గలుగజేసుటచేతను, అవలంబకమనబడును. అవలంబకమను పేరంబరంగు శ్లేష్మము స్వభావముగనే హృదయమునకు అవలంబనమును జేయుచుండినను,—

“ హృదయంమనసఃస్థాన మోజసశ్చింతితస్యచ । మాంసపేశీచయోరక్త



పద్మాకారమధోముఖమ్ । యోగినోయత్రపశ్యంతి సమ్యగ్జ్యోతిస్సమాహితాః । రసోయస్వచ్ఛతాంయాతః సతత్రైవావతిష్ఠతే । తతోవ్యానేనవిక్షిప్తః కృత్స్నందేహంప్రపద్యతే ॥ ”

అనెడి ఆగమవచనముచొప్పున మనస్సు, ఓజస్సు, తేజస్సు, వీనికి ఆధారముగను, ఎఱ్ఱతామరపుష్పాకారముగను, అధోముఖముగను, మాంసపేశీస్వరూపముగలదిగనుండు హృదయమును తొలుత అన్నరసముజెంది పిదప వ్యానమనువాతముచే చలింపజేయబడినదై శరీరమంతటనువ్యాపించుటవలన హృదయమునకు విశేషముగా అవలంబనమును జేసును. అని తెలియజేయుటకై మూలశ్లోకమునందు “ అన్నవీర్యాచ్చ ” అని చకారము ప్రయోగించబడినది.

### క్లేదక శ్లేష్మము.

శ్లో॥ యస్త్వామాశయసంస్థితః ॥ 16.
క్లేదకఃసోన్నసంఘాతక్లేదనాత్

తా॥ ఆమాశయమునందుండు శ్లేష్మము అన్నసముదాయమునకు క్లేదమును గలుగ జేసుటవలన క్లేదకమనబడును.

### బోధక శ్లేష్మము.

శ్లో॥ రసబోధనాత్ । బోధకోరసనాస్థాయీ

తా॥ నాలుకయందుండు కఫము మధురాదిరసముల దెలియజేయుటవలన బోధకమనబడును.

### తర్పక శ్లేష్మము.

శ్లో॥ శిరఃసంస్థోక్షతర్పణాత్ ॥ [తర్పకః] 17.

తా॥ శిరమునందుండు శ్లేష్మము ఇంద్రియములకు తృప్తినిగలుగజేసుటవలన తర్పకమనబడును.

### శ్లేషక శ్లేష్మము.

శ్లో॥ సంధిసంశ్లేషాత్ శ్లేషకస్సంధిషుస్థితః ।

తా॥ సంధులయందుండుశ్లేష్మము పరస్పరము సంధులనుజేర్చుటవలన శ్లేషకమనబడును.

శ్లో॥ ఇతిప్రాయేణదోషాణాం స్థానాన్యవికృతాత్మనామ్ ॥ 18.
వ్యాపినామపిజానీయా త్కర్మాణిచపృథక్పృథక్ ।

తా॥ వికారమును జెందకుండా స్వభావమునందుండునట్టి వాతాది దోషములు సర్వశరీరమునందు సంచరించుచుండును. ఐననట్టి వాతాదిదోషములయొక్క స్థాన కృత్యములను తెలుచుగా పైజెప్పిన ప్రకారము వెవ్వేరుగా తెలిసికొనవలయును.

[వాతాదిదోషములకు వృద్ధి, క్షయము, అనునవి 2-ను వికృతియనబడును. ఆ వృద్ధిచయము, ప్రకోపము అని ద్వివిధంబుగనుండును - దోషాదివిజ్ఞానీయాధ్యాయములో సామాన్యముగ వృద్ధిక్షయలక్షణములు జెప్పబడినవి. ఇపుడు చయ, ప్రకోపరూపమైన వృద్ధి నిదానము సంక్షేపముగా జెప్పబడుచున్నది.]

### వాతచయ - ప్రకోప నిదానము.

శ్లో॥ ఉష్ణేనయుక్తారూక్షాద్యా వాయోఃకుర్వంతిసంచయమ్ ॥ 19.
శీతేనకోపముష్ణేన శమంస్నిగ్ధాదయోగుణాః ।

తా॥ ప్రథమాధ్యాయమునందుజెప్పబడిన వాయువుయొక్క రూక్ష మొదలగు 6 గుణములు విరుద్ధముగనుండు. ఉష్ణగుణముతోజేరినచో వాతమునకు చయమునుగలుగజేసును. ఉష్ణమువిరుద్ధంబగుటచే వాతమునకు ప్రకోపమునుగలుగజేయనేరదు. మఱియు నారూక్షాదిగుణములే శీతగుణముతోజేరినచో వాతమునకు ప్రకోపమునుగలుగజేసును. ఉష్ణముతోగూడియుండు స్నిగ్ధాదిగుణములు వాతమునకు శమనమును గలుగజేసును.

### పిత్తచయ - ప్రకోప నిదానము.

శ్లో॥ శీతేనయుక్తాస్తీక్ష్ణాద్యా శ్చయంపిత్తస్యకుర్వతే ॥ 20.
ఉష్ణేనకోపంమందాద్యాః శమంశీతోపసంహితాః ।

తా॥ తీక్ష్ణము మొదలగు పిత్తగుణములు శీతగుణముతోజేరినచో పిత్తమునకు చయమునుగలుగజేసును. మఱియు నాతీక్ష్ణాదిగుణములే ఉష్ణముతోగూడినచో పిత్తమునకు ప్రకోపమునుగలుగజేసును. మందాదిగుణములు శీతగుణముతోజేరినచో పిత్తమునకు శమనమును గలుగజేసును.

### శ్లేష్మచయ - ప్రకోప నిదానము.

శ్లో॥ శీతేనయుక్తాఃస్నిగ్ధాద్యాః కుర్వతేశ్లేష్మణశ్చయమ్ ॥ 21.
ఉష్ణేనకోపంతేనైవ గుణారూక్షాదయశ్శమమ్ ।



తా॥ స్నిగ్ధాదిగుణములు శీతగుణముతోజేరినచో కఫమునకు చయమును గలుగజేసును. మఱియు నాస్నిగ్ధాదిగుణములే ఉష్ణగుణముతోగూడినచో కఫమునకు ప్రకోపమును గలుగజేసును. ఉష్ణగుణముతోగూడియుండు రూక్షాదిగుణములే కఫమునకు శమనమునుగలుగజేసును. స్నిగ్ధాదిగుణములతోగూడియుండు శీతగుణముచేకఫమునకు చయముగలుగును. శీతగుణమునకు విరుద్ధమైన ఉష్ణముచే కఫము లయించును; కాబట్టి ఉష్ణమువలన కఫమునకు ప్రకోపముగలుగును. రూక్షాదులతో గూడియుండుయా ఉష్ణము కఫమునకు విరుద్ధంబగుటచే కఫశమనమును గలుగజేసును.

### చయ లక్షణము.

శ్లో॥ చయోవృద్ధిఃస్వధామ్న్యేవ ప్రద్వేషోవృద్ధిహేతుషు ॥ 22.
విపరీతగుణేచ్ఛాచ

తా॥ వాతాదిదోషములకు తమస్థానమునందే గలుగునట్టివృద్ధి చయమనబడును. వాతము చయమును జెందియుండునపుడు వాతవృద్ధికిహేతువుగనుండు రూక్షాదిగుణములయందు ద్వేషము, రూక్షాదులకు విరుద్ధముగ వాతక్షయహేతువుగనుండు స్నిగ్ధాదిగుణములయందభిలాష గలుగును. ఇటులనే పిత్తకఫములయొక్క చయమును తెలిసికొనవలయును. వాతము చయమును జెందకుండా స్వప్రమాణమునందుండినను లేక క్షయమును జెందినను "గర్భిణికి దోహదవశముచే విరుద్ధమైనయన్నమునందిచ్ఛగలుగునటులనే" పురుషునికి నొకానొకపుడు అభ్యాసవశముచే వాతవృద్ధికి హేతువుగనుండురూక్షాదులయందు ద్వేషముగలుగక నిచ్ఛయేగలుగును. కాబట్టి వాతవృద్ధికి హేతువుగనుండు పదార్థములయందు గలుగునట్టి ద్వేషముచేతనే వాతచయము నెఱుంగుటకు అసాధ్యము. కావుననే వాతవృద్ధికి హేతువుగనుండువస్తువులయందు ద్వేషమును, రూక్షాదులకు విరుద్ధమైనగుణములుగలవస్తువులయందభిలాషయుగలుగుట వాతచయముయొక్కలక్షణమని యాతంత్రకారుడు జెప్పియున్నాడు. ఏకకాలమునందు వాతవృద్ధికి హేతువుగనుండువస్తువులయందు ద్వేషమును, వాతక్షయహేతువుగనునుండువస్తువులయందు నభిలాషయు గలుగునపుడు వాతము బాగుగ చయమును జెందియున్నదని నిశ్చయించుకొనవలయును.

### ప్రకోపలక్షణము.

శ్లో॥ కోపస్తూన్మార్గగామితా ।
లింగానాందర్శనంస్వేషా మస్వాస్థ్యంరోగసంభవః ॥ 23.

తా॥ వాతాదిదోషములు తమస్థానమునువదలి మార్గాంతరమునందుసంచరించుట ప్రకోపమనబడును. దానియందు దోషాదివిజ్ఞానీయాధ్యాయములో జెప్పబడినట్టియు,

వాతవ్యాధి నిదానమునందిక జెప్పబడునదియునగు వాతాదిప్రకోపలక్షణంబులన్నియు గలుగుటయే గాక వాతాదులస్వరూపమును మారియుండును. అట్టి వాతాదిప్రకోపముచే ననేకవిధములైన రోగములుగలుగును.

"స్వస్థానస్థస్య సమతా వికారాసంభవశ్శమః"

స్వస్థానమునందుండు వాతాదిదోషములకు సమత్వము, వికారముగలుగకుండుట శమమనబడును.

### వాతాదిచయ - ప్రకోపశమన కాలము.

శ్లో॥ చయప్రకోపప్రశమా వాయోర్గ్రీష్మాదిషుత్రిషు ।
వర్షాదిషుతుపిత్తస్య శ్లేష్మణఃశిశిరాదిషు ॥ 24.

తా॥ గ్రీష్మము, వర్షము, శరత్తు, అనునీ 3 ఋతువులయందు వాతమునకు చయ, ప్రకోప, శమనములు గలుగును. వర్షము, శరత్తు, హేమంతము, అనునీ 3 ఋతువులయందు పిత్తమునకు చయ, ప్రకోప, శమనములుగలుగును. శిశిరము, వసంతము, గ్రీష్మము, అనునీ 3 ఋతువులయందు కఫమునకు చయ, ప్రకోప, శమనములు గలుగును.

### గ్రీష్మాదులయందు - వాతాదిచయ నిదానము.

శ్లో॥ చీయతేలఘురూక్షాభి రోషధీభిస్సమీరణః ।
తద్విధస్తద్విధేదేహే కాలస్యౌష్ణ్యాన్నకుప్యతి ॥ 25.
అద్భిరమ్లవిపాకాభి రోషధీభిశ్చతాదృశమ్ ।
పిత్తంయాతిచయంకోపం నతుకాలస్యశైత్యతః ॥ 26.
చీయతేస్నిగ్ధశీతాభి రుదకౌషధిభిఃకఫః ।
తుల్యేపికాలేదేహేచ స్కన్నత్వాన్నప్రకుప్యతి ॥ 27

తా॥ లఘు, రూక్షగుణములుగలవాతము గ్రీష్మకాలములో ఆదానకాలస్వభావమువలన లఘువుగ, రూక్షగనుండు దేహమునందు లఘువుగ, రూక్షగనుండు యౌషధములచే చయమునుజెందునేకాని ఆ గ్రీష్మకాలముయొక్క ఔష్ణ్యమువలన ప్రకోపమును జెందనేరదు. అమ్లమైనవిపాకముగల పిత్తము వర్షాకాలమునందు అమ్లమయినవిపాకముగల ఓషధులచేతను, ఉదకముచేతను చయమునుజెందునేకాని ఆవర్షాకాలముయొక్క శీతస్వభావమువలన ప్రకోపమునుజెందనేరదు. స్నిగ్ధముగ శీతలముగనుండు కఫము శిశిరకాలమునందు కాలస్వభావమువలన స్నిగ్ధముగ శీతలముగనుండు దేహమునందు స్నిగ్ధముగ శీతలముగనుండు ఉదకము, ఓషధులు వీనిచేచయమునుజెందునేకాని స్కన్నముగనుండుటవలన ప్రకోపమునుజెందనేరదు.



శ్లో॥ ఇతికాలస్వభావోయం

తా॥ ఇటుల పైజెప్పినవాతాదులయొక్క చయ, ప్రకోప, శమనములు కాలస్వభావమువలన గలుగును.

### దోషచయాదులకు - ఆహార ప్రాధాన్యము.

శ్లో॥ ఆహారాదివశాత్పునః ।
చయాదీన్యాంతిసద్యోపి దోషాఃకాలేపివానతు ॥ 28.

తా॥ వాతాదిదోషములు అన్నపానాదిరూపమైన ఆహారాదులయొక్క సామర్థ్యమువలన తత్క్షణముననే (అనగా కాలమునపేక్షించకనే) చయప్రకోపశమనములనుజెందును. అన్నము, పానము, రసాయనము, వాజీకరణము, వమనము, విరేచనము యీమొదలగువానియొక్క సామర్థ్యమువలన వాతాదిదోషములు పైన చెప్పియుండు చయాదికాలములయందు కూడా చయప్రకోపశమనములను జెందకనేయుండును. (అనగా వాతాదిచయాదికాలములకంటె చయప్రకోప శమనములకు ఆహారాదులే ముఖ్యమని భావము.)

### ప్రకుపిత - వాతాది - విచిత్ర గమనము.

శ్లో॥ వ్యాప్నోతిసహసాదేహ మాపాదతలమస్తకమ్ ।
నివర్తతేతుకుపితో మలోల్పాల్పంజలౌఘవత్ ॥ 29.

తా॥ "పర్వతనదులయొక్క జలప్రవాహము మిట్టపల్లములుగనుండు సమస్తప్రదేశములయందు శీఘ్రముగ వ్యాపించి మరల కొంచెకొంచెముగా తగ్గునటులనే" ప్రకోపమునుజెందియుండు వాతాదిదోషములు అతిశీఘ్రముగా నరకాలు మొదలు శిరఃపర్యంతమువ్యాపించి మరల కొంచెకొంచెముగ తగ్గును.

### రోగహేత్వాది - సామాన్యకథన ప్రతిజ్ఞ.

శ్లో॥ నానారూపైరసంఖ్యేయై ర్వికారైఃకుపితామలాః ।
తాపయంతితనుంతస్మా త్తద్ధేత్వాకృతిసాధనమ్ ॥ 30.
శక్యంనైకైకశోవక్తు మతస్సామాన్యముచ్యతే ।

తా॥ ప్రకోపించినవాతపిత్తశ్లేష్మములు అనేకవిధములుగను, సంఖ్యాతీతముగనుండు జ్వరాదిరోగములచే శరీరమునకు విశేషముగా తాపమునుగలుగజేసును; కావున

నా జ్వరాదిరోగములయొక్క హేతు, లక్షణ, చికిత్సలను ప్రత్యేకముగా జెప్పుట కసాధ్యంబు. (అనగా ఇట్టిది ఫలానిరోగమునకు హేతువని, ఇట్టిది ఫలానిరోగమునకు లక్షణమని, ఇట్టిది ఫలానిరోగమునకు చికిత్సయని విభజించి ప్రత్యేకముగా జెప్పుట కసాధ్యమని యర్థము.) కాబట్టి రోగహేతువు, లక్షణము, చికిత్స, ఇవి సామాన్యముగా జెప్పబడును.

### వాతాదులకు - సర్వరోగ కారణత్వము.

శ్లో॥ దోషాఏవహిసర్వేషాం రోగాణామేకకారణమ్॥ 31.
యథాపక్షీపరిపతన్ సర్వతస్సర్వమప్యహః ।
ఛాయామత్యేతినాత్మీయాం యథావాకృత్స్నమప్యదః॥ 32.
వికారజాతంవివిధంత్రీన్ గుణాన్నాతివర్తతే ।
తథాస్వధాతువైషమ్య నిమిత్తమపిసర్వదా॥ 33.
వికారజాతంత్రీన్దోషాన్

తా॥ ఆడుడేగ మొదలగుపక్షులు అన్నిచోట్ల సంచరించుచు పగటియందంతట తన ఛాయనెట్టుల నతిక్రమించకుండునో (అనగా తనఛాయనువదలి యెట్టులనొకక్షణమైనానుండకుండునో) సమస్తమైన స్థావరజంగమాదిభేదములతోగాని, లేకజరాయుజ అండజభేదములతోగాని గూడి నానా ప్రకారములుగనుండు యీ ప్రపంచవికారము రజస్సత్వతమనులను గుణత్రయముల నెట్టులనతిక్రమించకుండునో (అనగా నొకక్షణమైనా రజస్సత్వతమోరూపమైన గుణత్రయముల నెట్టులవదలకుండునో) అట్టులనే తమతమ దోషధాతుమలములయొక్క వైషమ్యమునే కారణముగగల రోగసమూహము వాతాదిదోషత్రయముల నెపుడు నతిక్రమించకుండును. అనగా త్రిదోషరహితముగ నుండు రోగసమూహంబేదియు లేదనిభావము. కాబట్టిసమస్తమైనరోగములకువాతాది దోషములే ప్రధానకారణము. ధాతువైషమ్యము ప్రతిరోగమునందు వేర్వేరువిధముగ నుండుటచే నానావిధములుగనుండును. ఆయాధాతు వైషమ్యమువలన గలుగునట్టి వికారం బాయా ధాతుసంబంధముగలదిగనుండును. దేవగ్రహాదులను కారణముగాగల రోగములుఆగంతుకరోగములగుటచే వానియందుదోషసంబంధములేకుండును.ఆగంతుక రోగములయందు తొలుతరోగముగలిగితదనంతరము వాతాదిదోషములు ప్రకోపమును జెందును. నిజరోగములయందు తొలుత వాతాదిదోషములు ప్రకోపమునుజెంది తదనంతరము రోగములనుగలుగజేసును. కాబట్టి నిజాగంతుకరోగములయొక్క పరస్పర భేదము నిటులదెలిసికొనవలయును.



### అనుచితార్థ - సంయోగాదులచే - వాతాది ప్రకోపము.

శ్లో॥ తేషాంకోపేతుకారణమ్ ।
అర్థైరసాత్మ్యైస్సంయోగః కాలఃకర్మచదుష్కృతమ్॥ 34.
హీనాతిమిథ్యాయోగేన భిద్యతేతత్పునస్త్రిధా।

తా॥ అనుచితములైనశబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అను నీ యర్థములతో శ్రోత్రము, త్వక్కు, నేత్రము, రసనము, ఘ్రాణము అనునీ ఇంద్రియములకుగలుగునట్టిసంయోగము, శీతోష్ణవర్షరూపమైనకాలము, ప్రకృతజన్మార్జితంబును, జన్మాంతరార్జితంబునైన అశుభకర్మ అనునవి 3-నువాతాదిదోషములయొక్క ప్రకోపమునకు హేతువుగనుండునేకాని రూక్షాదిపదార్థసేవనముమాత్రము కారణముగ కానేరదు. పైజెప్పిన అనుచితేంద్రియార్థసంయోగము మొదలగునవికూడా వాతాదిప్రకోపమునకు ముఖ్యకారణముగనుండునని తెలియపరచుటకై సముచ్చయార్థమైన (తు) అను శబ్దము యీతంత్రకారునిచే ప్రయోగించబడినది. మఱియును అనుచితేంద్రియార్థసంయోగాదిభేదముచే పై జెప్పినప్రకారము 3 విధములుగనుండు వాతాదిదోష ప్రకోపకారణము మరలను హీన, మిథ్యా, అతియోగభేదములచే త్రివిధంబుగ నగును.

### ఇంద్రియార్థములకు - హీనమిథ్యాతియోగ నిరూపణము.

శ్లో॥ హీనోర్థేనేంద్రియస్యాల్ప స్సంయోగఃస్వేననైవవా॥ 35.
అతియోగోతిసంసర్గ స్సూక్ష్మభాసురభైరవమ్ ।
అత్యాసన్నాతిదూరస్థం విప్రియంవికృతాదిచ॥ 36.
యదక్ష్ణావీక్ష్య తేరూపంమిథ్యాయోగస్సదారుణః ।
ఏవమత్యుచ్చపూత్యాదీ నింద్రియార్థాన్యథాయథమ్॥ 37.
విద్యాత్

తా॥ శబ్దాద్యర్థములతో శ్రోత్రాదీంద్రియములకుగలుగు అల్పమైన సంయోగముగాని, లేక ఆయా యింద్రియములకు తమతమయర్థములతో సంయోగమే లేకుండుటగాని హీనయోగమనబడును. శ్రోత్రాదీంద్రియములకు శబ్దాదులైన తమతమ యర్థములతోగలుగు అతిసేవారూపమైన అధికసంయోగము అతియోగమనబడును. అతిసూక్ష్మమైనవస్తువు, మిగుల ప్రకాశముగలవస్తువు, అతిభయంకరమైనవస్తువు, అతిసమీపమునందు, అతిదూరమునందు వుండువస్తువు, అనిష్టమైనవస్తువు, అతి వికా

రముగలవస్తువు యీ మొదలగువానిని నేత్రములచే జూచుట నేత్రేంద్రియమునకు మిథ్యాయోగమనబడును. అదితిమిరాదిరోగములకు హేతువగుటవలన నతిదారుణమైనది. నేత్రేంద్రియమునకు జెప్పియుండునటులనే యితరమైన యింద్రియములకును మిథ్యాయోగము నూహించుకొనవలయును. అదియెట్లన్న:—అతిబిగ్గరగ, క్రూరముగ, ఇష్టవినాశరూపముగ, భయంకరముగనుండు అనిష్టశబ్దము మొదలగువానిని వినుట శ్రోత్రేంద్రియమునకు తనయర్థమైనశబ్దముతోడ మిథ్యాయోగమనియును, పూతివిష్ఠము మొదలగు అనిష్టమైన గంధము నాఘ్రాణించుట ఘ్రాణేంద్రియమునకు తనయర్థమైన గంధముతోడ మిథ్యాయోగమనియును, స్నానము, అనులేపనాదులు, శీతోష్ణమైనస్పర్శ వీనియొక్క అక్రమమైనస్పర్శను స్పర్శనేంద్రియమునకు తనయర్థమయిన స్పర్శముతోడ మిథ్యాయోగమనియును, విరుద్ధమైన రసమును అపథ్యద్రవ్యయుక్తరసమును గసనేంద్రియముచే గ్రహించుట రసనేంద్రియమునకు తనయర్థమైన రసముతోడ మిథ్యాయోగమనియును తెలియవలయును.

### కాలమునకు - హీనమిథ్యాతియోగ నిరూపణము.

శ్లో॥ కాలస్తుశీతోష్ణవర్ష భేదాత్త్రిధామతః ।
సహీనోహీనశీతాది రతియోగోతిలక్షణః ॥ 38.
మిథ్యాయోగస్తునిర్దిష్టో విపరీతస్వలక్షణః ।

తా॥ శీతము, వుష్ణము, వర్షము అని కాలము ఋషులచే 3 విధములుగా జెప్పబడియున్నది. వానిలో శీతకాలము హేమంతశిశిర రూపముగనుండును. ఉష్ణకాలము వసంతగ్రీష్మరూపముగనుండును. వర్షాకాలము వృష్టితోగూడియుండును. హీనమైన శీతోష్ణాదులతో గూడియుండుకాలము హీనయోగస్వరూపముగలది. అధికమయిన శీతాదులతోగూడియుండు కాలము అతియోగస్వరూపముగలది. విరుద్ధమయిన శీతోష్ణాదులతోగూడియుండుకాలము మిథ్యాయోగస్వరూపముగలది. ఎట్లన్న.—హేమంతకాలమునందు శీతముస్వల్పముగనుండుట ఆ హేమంతకాలమునకు హీనయోగమనియును, అధికమయిన శైత్యముగలిగియుండుట అతియోగమనియును, అధికమైన ఉష్ణముగలిగియుండుట మిథ్యాయోగమనియును తెలియవలయును. ఇటులనే శరద్వసంతఋతువులకు హీనయోగ, అతియోగ, మిథ్యాయోగముల నూహించుకొనవలయును.

### కాయికాదికర్మలకు - హీనమిథ్యాతియోగ నిరూపణము.

శ్లో॥ కాయవాక్చిత్తభేదేన కర్మాపివిభజేత్త్రిధా॥ 39.



కాయాదికర్మణాంహీనా ప్రవృత్తిర్హీనసంజ్ఞికా ।
అతియోగోతివృత్తిస్తు వేగోదీరణధారణమ్ ॥ 40.
విషమాంగక్రియారంభః పతనస్ఖలనాదికమ్ ।
భాషణంసామిభుక్తస్య రాగద్వేషభయాదిచ॥ 41.
కర్మప్రాణాతిపాతాది దశధాయచ్చనిందితమ్।
మిథ్యాయోగస్సమస్తోసా విహచాముత్రవాకృతమ్ ॥ 42.

తా॥ శరీరము, వాక్కు, మనస్సు అనునీ భేదములచే క్రియలుకూడా 3 విధములుగనుండును. శరీరక్రియ, వాక్క్రియ, మానసికక్రియఅనువానికి హీనమైనప్రవృత్తి హీనయోగమనబడును. శరీరాదిక్రియలకు అతిప్రవృత్తి అతియోగమనబడును. మలమూత్రాదులు రాకుండునపుడు వానిని విసర్జించుట, వచ్చునపుడు వానినడ్డగిచుట, విషమమైన అంగముచే నొక కృత్యమునుచేయుట, ఇహపరలోకములకు విరుద్ధమైన క్రియలనుచేయుట, విషమముగా భూమిపైబడుట, విషమమైన స్ఖలనము (అనగా తడబడుట, వక్రముగనడుచుట) యీ మొదలగునవి శారీరాదిక్రియలకు మిథ్యాయోగమనబడును. సగము భుజించిమాట్లాడుట యీ మొదలగునవి వాచికక్రియలకు మిథ్యాయోగమనబడును. రాగము, ద్వేషము, భయము యీ మొదలగువానియొక్క ప్రవృత్తిమానసికక్రియలకు మిథ్యాయోగమనబడును. మఱియును "హింసాస్తేయమిత్యాది" గ్రంథముచే దినచర్యాధ్యాయమునందు చెప్పబడిన జీవహింసమొదలగు దశవిధక్రియలును యీ లోకమునందును, లోకాంతరమునందును చేయబడినసకలమైన అశుభకృత్యములును శారీరాదిక్రియలకు మిథ్యాయోగమని తెలిసికొనవలయును.

### రోగ కారణము.

శ్లో॥ నిదానమేతద్దోషాణాం కుపితాస్తేననైకధా ।
కుర్వంతివివిధాన్వ్యాధీన్ శాఖాకోష్ఠాస్థిసంధిషు ॥ 43.

తా॥ పైజెప్పినవంతయు వాతాదిదోష ప్రకోపమునకు ముఖ్యకారణముగనుండును. అట్టి ముఖ్యకారణముచే ప్రకోపమునుజెందియుండు వాతాదిదోషములు శాఖ, కోష్ఠము, అస్థి, సంధులు వీనియందు నానావిధరోగములను గలుగజేసును.

### బాహ్య - రోగ స్థానము.

శ్లో॥ శాఖారక్తాదయస్త్వక్చ బాహ్యరోగాయనంహితత్ ।
తదాశ్రయామసవ్యంగ గండాలజ్యర్బుదాదయః ॥ 44.

బహిర్భాగాశ్చదుర్నామ గుల్మశోఫాదయోగదాః ।

తా॥ రక్తము మొదలగు 6 ధాతువులు, త్వక్కు ఇవి శాఖయనబడును. ఇది బాహ్యరోగములకు స్థానముగనుండును. కాబట్టి యీ బాహ్యరోగస్థానము నాశ్రయించి యుండు మష, వ్యంగము, గండము, అలజి, అర్బుదము యీ మొదలగు రోగములును దుర్నామము, గుల్మము, శోఫ మొదలగురోగములును ; బాహ్యరోగములనబడును. వ్యంగాదియను "ఆది" శబ్దమువలన విసర్పము, విద్రధి, పిప్లు, కుష్ఠము మొదలగు రోగములను గ్రహించుకొనవలయును.

ఆంతరరోగ స్థానములు.

శ్లో॥ అంతఃకోష్ఠమహాస్రోతఆమపక్వాశయాశ్రయః॥ 45.
తత్ స్థానాశ్ఛర్ద్యతీసార కాస * శ్వాసోదరజ్వరాః ।
అంతర్భాగంచశోఫార్శో గుల్మవీసర్పవిద్రధి॥ 46.

తా॥ అంతఃప్రదేశము, మహాస్రోతస్సు, ఆమాశయము, పక్వాశయము, ఇవి కోష్ఠమనబడును. దానియందు జనించినఛర్ది, అతిసారము, కాసము, శ్వాసము, ఉదరరోగము, జ్వరము, శోఫ, అర్శస్సు, గుల్మము, విసర్పము, విద్రధి అనునీ రోగములు అంతర్భాగజనితరోగములని (అనగా అంతరరోగములని) చెప్పబడును.

మధ్యమరోగ స్థానము.

శ్లో॥ శిరోహృదయవస్త్యాది మర్మాణ్యస్థ్నాంచసంధయః।
తన్నిబద్ధాస్సిరాస్నాయు కండరాద్యాశ్చమధ్యమాః ॥ 47.
రోగమార్గఃస్థితాస్తత్ర యత్పామపక్షవధార్దితాః ।
మూర్ధాదిరోగాస్సంధ్యస్థి త్రికశూలగ్రహాదయః ॥ 48.

తా॥ శిరస్సు, హృదయము, వస్తి మొదలగునవియును మర్మములు, అస్థిసంధులు, అస్థులలో కీలియుండు సిరలు, స్నాయువులు, కండరములు, ధమనీకూర్చములు, మొదలగునవియును మధ్యమరోగస్థానంబులు. ఇవి రోగమార్గములనియు చెప్పబడును. క్షయరోగము, పక్షఘాతము, అర్దితవాతము, శిరస్సు, హృదయము, వస్తి వీనియందు జనించు రోగములను, సంధులు, అస్థులు, ముష్కపూస వీనియందు గలుగుశూలలును, పట్లును, మన్యగ్రహాదివాత వికారములును, పైచెప్పిన మధ్యమరోగస్థానము నాశ్రయించియుండును. క్షయరోగము మర్మము, సంధులు, అస్థి వీనినాశ్రయించియుండుటచే తొలుత చెప్పబడినది.

* శ్వాసాదుదితిపా.



వాత కృత్యము.

శ్లో॥ స్రంసవ్యాసవ్యధస్వాప సాదరుక్తోదభేదనమ్ ।
సంగాంగభంగసంకోచ వర్తహర్షణతర్షణమ్ ॥ 39.
కంపపారుష్యసౌషిర్యశోషస్పందనవేష్టనమ్।
స్తంభఃకషాయరతావర్ణఃశ్యావోరుణోపివా॥ 50.
కర్మాణివాయోః

తా॥ కటిమర్లు మొదలగువానిసంధులు జారుట, ఆక్షేపకాది వాతములయందు వలెనే సర్వాంగములయందు విక్షేపణముగలుగుట, శరీరమునందు కఱ్ఱతోగొట్టినటులుండుట, కృత్యములయందు అజ్ఞానము, అంగములకు కృత్యములయందశక్తి, ఎల్లపుడు శరీరమునందుశూలగలుగుట, అంగములయందు సూదులచేబొడుచునటులుండుట, శరీరమును బీల్చునటులుండుట, మూత్రపురీషాదులు తమతమ స్థానములయందుండి వెలిపడకుండుట, మోకాళ్ళు, తొడలు మొదలగుయంగములకు భంగముగలుగుట, సిరాదులు సంకోచమునుజెందుట, పురీషాదులు ఉంటకట్టుట, రోమములు నిక్క బొడిచికొనుటదప్పి, కంపము, పురుషత్వము అస్థులయందు ద్వారముగలుగుట, శరీరముశోషించుట, శరీరము కొంచెకొంచెముగకదలుట, చుట్టుకొనుట, చేతులు, తొడలు, పిక్కలుమొదలగునవి స్తంభించుట (అనగా ముడుచుటకు చాచుటకు శక్తిలేకుండుట), కషాయ రసమునందురుచి, కపిశవర్ణము, లేక ఎఱుపువర్ణముగలుగుట, ఇవి వాతముయొక్క కృత్యములు.

పిత్త కృత్యము.

శ్లో॥ పిత్తస్య దాహరాగోష్మపాకితాః ।
స్వేదఃక్లేదఃస్రుతిఃకోథః సదసంమూర్ఛనంమదః ॥ 51.
కటుకామ్లారసౌవర్ణః పాండురారుణవర్జితః ।

తా॥ శరీరమంతటనుతాపము, రక్తవర్ణము ఉష్ణము, జీర్ణశక్తి, స్వేదము, క్లేదము (అనగా రక్తాదులయందు వికారము), స్రావము, కోథము (అనగా పైచెప్పిన క్లేదాధిక్యము) క్రియలయందశక్తి, భ్రమ, ఉత్తరత్రచెప్పబడు మదమనురోగము, కారము, పులుసు యీరసములయందరుచి, తెలుపు, ఎఱుపువర్ణములుతప్ప యితరమయిన నానావిధవర్ణములుగలుగుట, ఇవి పిత్తముయొక్క కృత్యములు.

కఫ కృత్యము.

శ్లో॥ శ్లేష్మణఃస్నేహకాఠిన్య కండూశీతత్వగౌరవమ్ ॥ 52.

బంధోపలేపస్తైమిత్య శోఫాపక్త్యతినిద్రతాః ।
వర్ణః శ్వైత్యో రసౌ స్వాదు లవణౌ చిరకారితా ॥ 53.

తా॥ స్నేహము, కాఠిన్యము, దురద, శైత్యము, గురుత్వము, స్రోతోబంధము, అస్థ్యాదులను ఉపలేపము, స్తైమిత్యము (అనగా అవయవములకు పటుత్వము లేకుండుట) శోఫ, అజీర్ణము, అతినిద్ర, శరీరమునందు తెలుపువర్ణము, మధురలవణరసముల యందు రుచి, కార్యమునందాలస్యము, ఇవి కఫము యొక్క కృత్యములు. ఇటుల వాతాదిదోషములయొక్క కృత్యములు జెప్పబడినవి.

* * * * „ అశీతిర్వాతజారోగా శ్చత్వారింశచ్చపిత్తజాః। వింశతిః శ్లేష్మజాశ్చైవ స్థూలానానాత్వజామతాః । నఖభేదఃపాదశూలం శుప్తిభ్రంశోవిపాదికా । ఖుడోగుల్ఫగ్రహోజాను విశ్లేషోజానుకుంచనమ్ । పిండికోద్వేష్టనంపాద శోశ్చోరో స్తంభశ్చగృధ్రసీః । పాంగుళ్యం భ్రంశశూలంచ గుదే స్తంభస్తుమేహనే । ముష్కాక్షేప శ్శ్రోణిభేదో వంక్షణానాహఏవచ । ఉదావర్తోథవిడ్భేదః పార్శ్వపృష్ఠత్రికగ్రహాః । ఖంజవామనకుబ్జత్వం హృద్ద్రవోదరవేష్టకౌ । హృన్మోహోవక్షనిస్తోద శ్శోషోద్వాతౌ తథోరసః । బాహుశోషో హనుగ్రీవా మన్యాస్తంభోష్ఠభేదనమ్ । దంతభేదోథశైథిల్యాం కంఠధ్వంసోథవాగ్రహః । కషాయాస్యత్వమూకత్వే ముఖశోషోరసాజ్ఞతా । ఘ్రాణనాశోహో జ్ఞతాగంధే శబ్దోచ్చైః శ్రవణంతథా । బాధిర్యం కర్ణశూలంచ వర్త్మస్తంభన కుంచనమ్ । తిమిరంచాక్షి శూలంచ భ్రూవ్యుదా సోథనేత్రయోః । లలాటశంఖభేదౌచ కేశభూమిస్ఫుటనంతథా । శిరోరుజార్దితంజృంభా ప్రలాపోసేపథుర్భ్రమః । ఏకాంగవ్యాధిరాయామః పక్షాఘాతోపతంత్రకః । దండకస్స్వప్ననాశశ్చ గ్లానిఃపాముష్యరూక్షతా । విషాదశ్చానవస్థాన మరుణశ్యామవర్ణతా । ఇత్యశీతిస్సమాఖ్యాతా రోగావాతసముద్భవాః । అంతర్దాహోవిదాహశ్చ ప్లోషోధవనవథుర్ద్రవః । అత్యూష్మాచాంసదాహశ్చ స్వేదోత్యమ్లకధూమకౌ । రక్తక్లేదోంగగంధశ్చ గాత్రావయవశాతనమ్ । త్వఙ్మాంససరణోమాంస క్లేదశ్చర్మదళ స్తథా । రక్తవిస్ఫోటకఃకోఠః పిత్తాసృగ్రక్తమండలే । సిలికాకామలాకక్షా గాత్రే



హారితపీతతా । పూతితిక్తాస్యతాతృష్ణా లోహగంధాస్యతాతథా । జీవాదానమతృప్తిశ్చ ప్రవేశ స్తమస స్తథా । గళాస్యగుదమేఢ్రాక్షి పాకో హారిద్రపీతతా । నఖాక్షిమూత్రశకృతాం చత్వారింశత్తుపిత్తజాః । స్తైమిత్యంగౌరవంతృప్తి రాలస్యమతినిద్రతా । తంద్రాస్యస్రావమాధురే ప్రలేపోహృదయస్యచ । సాదఃకంఠప్రలేపశ్చ శ్లేష్మోద్గిరణమేవచ। మలాధిక్యమతిస్థౌల్యం వమనంప్రతిసంచయమ్ । ఉదర్దోగళగండశ్చ శైత్యంశ్వేతా వభాసతా । విణ్మూత్రనఖనేత్రాణాం శుక్లతాచ కఫామయాః। యథాస్థూలంవికారాణాం చత్వారింశమిదంస్మృతమ్। హృదాదౌశూలవద్దాహో యోంతర్దాహస్సకీర్తితః । పాణిపాదాంసమూలేషు సంతాపోవివిధస్తుయః । అగ్నిర్యశ్చేషేవనిస్స్వేదో విదాహస్సనిగద్యతే । ఓషస్సర్వాంగికస్తీవ్రో దాహస్వేదారతిప్రదః । దవథుశ్చక్షురాదిభ్యః తీవ్రఊష్మాప్రవర్తతే । ముఖోష్ఠతాలుషుదవో అమ్లోద్గిరణమమ్లకః । ధూమాయనంశిరోఘ్రాణ కంఠతాలుషుధూమకః । ప్రమీలకస్తుస్తైమిత్యం గురుతాంగస్యగౌరవమ్ । ఆహారానభిలాషస్తు తృప్తిస్యాద్విషయాగ్రహః । నిద్రార్తస్యైవతంద్రాస్యాత్ శేషాః ప్రథితనామకాః॥ ”

వాతప్రకోపమువలన గలిగినరోగములు 80, పిత్తప్రకోపమువలనగలిగినరోగములు 40, శ్లేష్మప్రకోపమువలనగలిగిన రోగములు 20. అని స్థూలముగా రోగములు జెప్పబడియున్నవి. నఖభేదము, పాదశూల, సుప్తిభ్రంశము, విపాదిక, ఖుడము, గుల్ఫగ్రహము, జానువిశ్లేషము, జానుకుంచనము, పిండికోద్వేష్టనము, ఊరుసాదము, ఊరుస్తంభము, గృధ్రసి, పాంగుళ్యము, గుదభ్రంశము, గుదశూల, గుదస్తంభము, మేహనస్తంభము, ముష్కాక్షేపము, శ్రోణిభేదము, వంక్షణానాహము, ఉదావర్తము, విడ్భేదము, పార్శ్వము, పృష్ఠము, ముడ్డిపూస వీనియందుపట్లు, ఖంజత్వము, వామనత్వము, కుబ్జత్వము, హృద్ద్రవము, ఉదరవేష్టకము, హృన్మోహము, వక్షనిస్తోదము, హృదయశోషము, హృదయోద్వాతము, బాహుశోష, హనుస్తంభము, గ్రీవాస్తంభము, మన్యాస్తంభము, ఓష్ఠభేదనము, దంతభేదనము, శైథిల్యము, కంఠధ్వంసము, కంఠగ్రహము, కషాయాస్యత్వము, మూకత్వము, ముఖశోష, రసాజ్ఞత్వము, ఘ్రాణనాశము, గంధాజ్ఞత్వము, శబ్దోచ్చైశ్రవణము, బాధిర్యము, కర్ణశూల, వర్త్మస్తంభనము, వర్త్మకుంచ

నము, తిమిరము, అక్షిశూల, భ్రూవ్యుదాసము, నేత్రవ్యుదాసము, లలాటభేదము, శంఖభేదము, కేశస్ఫుటనము, భ్రూస్ఫుటనము, శిరోరుజము, అర్దితము, జృంభ, ప్రలాపము, వేపథు, భ్రమ, ఏకాంగవ్యాధి, ఆయామము, పక్షాఘాతము, అపతంత్రకము, దండకము, స్వప్ననాశము, గ్లాని, పారుష్యము, రూక్షత, విషాదము, అనవస్థానము, అరుణశ్యావవర్ణత్వము, అను 80-దియు వాతమువలన గలిగినరోగములని మునులచేజెప్పబడియున్నది. అంతర్దాహము, విదాహము, ప్లోషము, దవథు, దవము, ఆతూష్మ, అంసదాహము, స్వేదము, అత్యమ్లకము, ధూమకము, రక్తక్లేదము, అంగగంధము, గాత్రావయవశాతనము, త్వఙ్మాంసదరణము, మాంసక్లేదము, చర్మదళము, రక్తవిస్ఫోటము, కోఠము, పిత్తరక్తము, రక్తమండలము, నీలిక, కామల, కక్షు, శరీరమునందు హరితపీతవర్ణము, పూత్యాస్యత్వము, తిక్తాస్యత్వము, తృష్ణ, లోహగంధాస్యత్వము, జీవాదానము, అతృప్తి, తమఃప్రవేశము, గళము, ఆస్యము, గుదము, మేఢ్రము, నేత్రము, వీనియందు పాకము, నఖము, నేత్రము, మూత్రము, మలము, వీనియందు హారిద్రపీతవర్ణములు, అను 40-దియు పిత్తమువలన జనించినరోగములు. స్తైమిత్యము, గౌరవము, తృప్తి, ఆలస్యము, అతినిద్ర, తంద్ర, ఆస్యస్రావ అస్యమాధుర్యము, హృదయప్రలేపము, హృదయసాదము, కంఠప్రలేపము, శ్లేష్మోద్గిరణము, మలాధిక్యము, అతిస్థౌల్యము, వమనము, ప్రతిసంచయము, ఉదర్దము, గళగండము, శైత్యము, శ్వేతావభాసము, మలము, మూత్రము, నఖము, నేత్రము వీనియందు శుక్లవర్ణము; అను 20-దియు కఫరోగములు. ఇట్టుల వాతాదిదోషములయొక్క రోగములు స్థూలముగాజెప్పబడినవి, హృదయము మొదలగువానియందు శూలవలె గలుగునట్టి తాపము అంతర్దాహమనబడును. హస్తము, పాదము, అంసమూలము వీనియందు అగ్నిజ్వాలవలె నానావిధమయిన తాపముగలుగుట విదాహమనబడును. సర్వాంగమునందు వ్యాపించి తీవ్రముగాస్వేదము, అరతి వీనినిగలుగజేయునట్టి తాపము దాహమనబడును. నేత్రములు మొదలగువానియందు అతితీవ్రమైన ఉష్ణముగలుగుట దవథుయనబడును. ముఖము, ఓష్ఠము, తాలు, వీనియందుగలుగు ఉష్ణము దవ అనబడును. పుల్లనితేనుపులు అమ్లకమనబడును. శిరస్సు, నాసికము, కంఠము, నోటిలోపలి దౌడ వీనియందు ధూమమువలెనుండుట ధూమకమనబడును, స్తబ్ధముగనుండుట స్తైమిత్యమనబడును. అంగములయొక్క గురుత్వము గౌరవమనబడును. ఆహారమునం దభిలాష గలుగకుండుట తృప్తియనబడును. నిదురచే పీడింపబడినవానివలె విషయజ్ఞానములేకుండుట తంద్రయనబడును. శేషించియుండు రోగములను వానినామముచేతనే వాని స్వరూపమును తెలిసికొనవలయును. అని వాతాది దోషవికారములయొక్క లక్షణభేదములు అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.



## దోషలక్షణ ప్రయోజనము.

శ్లో॥ ఇత్యశేషామయవ్యాపి యదుక్తం దోషలక్షణమ్ ।
దర్శనాద్యైరవహిత స్తత్సమ్యగుపలక్షయేత్ ॥ 54.
వ్యాధ్యవస్థావిభాగజ్ఞః పశ్యన్నార్తా న్ప్రతిక్షణమ్ ।

తా॥ ఇటుల వ్యాధులయొక్క కాలకృతమైన అవస్థలను, విభాగములను (అనగా ఇట్టిది ఫలానివ్యాధియొక్క అవస్థ యిట్టిది వేరువ్యాధియొక్క అవస్థ అని అవస్థాభేదములను, ఒకటే విధముగనుండు జ్వరములో నూతనజ్వరముయొక్క అవస్థయిట్టిది, పురాణజ్వరముయొక్క అవస్థయిట్టిది, అని వ్యాధివిభాగమును) వ్యాధిచికిత్సలను బాగుగా నెఱింగినవాడు, బహుజాగరూకుడునగువైద్యుడు రోగులను ప్రతిక్షణము బాగుగచూచి దర్శనము, స్పర్శనము, ప్రశ్నయీమొదలగు నుపాయములచే పై జెప్పిన లక్షణములతో గూడినదియును, సర్వరోగములయందు వ్యాపించి యుండునదియునగు వాతాదిదోష స్వరూప, కర్మ, వికారములను బాగుగా తెలిసికొనవలయును.

## అభ్యాసావశ్యకత్వము.

శ్లో॥ అభ్యాసాత్ప్రాప్యతేదృష్టిః కర్మసిద్ధిప్రకాశినీ ॥ 55.
రత్నాదిసదసత్ జ్ఞానం నశాస్త్రాదేవజాయతే ।

తా॥ రత్నములు, బంగారు, అపరంజి యీమొదలగువానిలో ఫలానిదిమంచిది, ఫలానిదిచెడ్డదియను జ్ఞానము శాస్త్రాభ్యాసమువలనకాకుండా పలుమారుచేయునట్టి అభ్యాసవిశేషమువలన మాత్రముగలుగునటులనే కార్యసిద్ధిని సూచించునట్టి జ్ఞానము కేవలశాస్త్రపరిచయమువలనకాకుండా చికిత్సయందు పలుమారుచేయునట్టి అభ్యాసవిశేషమువలనమాత్రమే గలుగును. (అనగా రత్నశాస్త్ర పరిచయముచేతను, రత్నములను పలుమారుచూచుటచేతను, రత్నపరీక్షాజ్ఞానము బాగుగ గలుగునటులనే సర్వదా వైద్యశాస్త్ర పరిచయముచేతను, పలుమారు రోగులనుచూచుటచేతను చికిత్సయందు విశేషమైన జ్ఞానముగలుగునని భావము.) కేవలశాస్త్రజ్ఞానముచేతను, కేవలచికిత్సభ్యాసముచేతను చికిత్సయందు జ్ఞానము గలుగనేరదని సూచించుటకై “శాస్త్రాదేవ” అను ఏవకారము ప్రయోగించబడినది.

## త్రివిధ రోగములు.

శ్లో॥ దృష్టాపచారజఃకశ్చి త్కశ్చిత్పూర్వాపరాధజః ॥ 56.
తత్సంకరాద్భవత్యన్యో వ్యాధిరేవం త్రిధాస్మృతః ।

తా॥ కొన్ని వ్యాధులు దృష్టాపచారజములు. (అనగా యీలోకములో ప్రత్యక్షముగా కనుబడునట్టి రోగకారణమువలన గలిగినవి.) కొన్ని వ్యాధులు పూర్వాపరాధజములు. (అనగా పూర్వజన్మమునందు తనచేజేయబడిన యశుభకర్మలవలన గలిగినవి.) మఱికొన్ని వ్యాధులు సంకరజములు. (అనగా పైజెప్పిన దృష్టాపచార, పూర్వాపరాధములవలన గలిగినవి.) ఇటుల వ్యాధులు 3 విధములని ఋషులచే జెప్పబడియున్నవి.

త్రివిధ - రోగ లక్షణము.

శ్లో॥ యథానిదానందోషోత్థః కర్మజోహేతుభిర్వినా ॥ 57.
మహారంభోల్పకేహేతౌ వాతంకోదోషకర్మజః ।

తా॥ లఘురూక్షాది స్వనిదానమువలన ప్రకోపించిన వాతాదిదోషములచే జనించినరోగము దోషజమనబడును. ఇదియె దృష్టాపచారజనితరోగము. వాతాది ప్రకోపరూపమైన నిదానములేకనే జనించిన రోగము కర్మజమనబడును. ఇదియె పూర్వాపరాధ జనితరోగము. నిదానము స్వల్పముగనుండగా జనించినదియును, ప్రబలమయిన పూర్వరూపములతో గూడినదియును, కడు ప్రయాసచే చికిత్సించతగినదియునైన రోగము దోష, కర్మజనితమనబడును. ఇదియె సంకరజనితరోగము.

త్రివిధ - రోగశమన క్రమము.

శ్లో॥ విపక్షశీలనాత్పూర్వాః కర్మజాఃకర్మసంక్షయాత్ ॥ 58.
గచ్ఛన్త్యుభయజన్మానో దోషకర్మక్షయాత్క్షయమ్ ।

తా॥ పైజెప్పిన దోషజమను వ్యాధి దోషమును శమింపజేసునట్టి యౌషధసేవవలన నివర్తించును. కర్మజమను వ్యాధి కర్మము క్షయించగానే నివర్తించును. సంకర రోగము (అనగా వాతాది దోషములచేతను, పూర్వజన్మార్జిత అశుభకర్మముచేతను జనించినరోగము) దోషములు, అశుభకర్మలు, ఇవిక్షయించగానే నివర్తించును.

మరల - రోగ ద్వైవిధ్యము.

శ్లో॥ ద్విధాస్వపరతంత్రత్వా ద్వ్యాధయోంత్యాఃపునర్ద్విధా ॥ 59.

తా॥ వ్యాధులు స్వతంత్రము, పరతంత్రము, అని ద్వివిధములుగనుండును. (అనగా కొన్ని రోగములు స్వతంత్రములుగ, కొన్ని పరతంత్రములుగ నుండునని యర్థము.) మఱియును పరతంత్రమను రోగము పూర్వరూపము, ఉపద్రవము అని ద్వివిధముగ నుండును.

ద్వివిధ - రోగ నిరూపణము.

శ్లో॥ పూర్వజాఃపూర్వరూపాఖ్యా జాతాఃపశ్చాదుపద్రవాః ।



తా॥ తొలుత జనించినరోగము పూర్వరూపమను పేరంబఱంగును. తదనంతరము జనించినరోగము ఉపద్రవమను పేరంబఱంగును.

స్వతంత్ర - రోగ లక్షణము.

శ్లో॥ యథాస్వజన్మోపశయాః స్వతంత్రాఃస్పష్టలక్షణాః ॥ 60.

తా॥ శాస్త్రములో జెప్పియుండు ప్రకారము ఉత్పత్తి, సుఖానుబంధము వీనితో గూడినవియును, స్పష్టమైన లక్షణములతో గూడినవియునైన రోగములు స్వతంత్ర రోగములనబడును. చికిత్సయొక్క గురుత్వలాఘవముల దెలిసికొనుటకై తంత్రకారుడిచట వ్యాధులకు స్వతంత్ర పరతంత్ర సంజ్ఞలనేర్పరచెను.

"పూర్వరూపరూపాదిక్రమేణజ్వరాదావుత్పన్నే తత్పరివారాయేవ్యాసాదయఉత్పద్యంతేతేదు పశయేచోపశేరతే న తేస్వతంత్రాఃజ్వరాదయ ఏవతుమూలవ్యాధిరూపత్వాత్స్వతంత్రా ఇత్యుచ్యంతే"

నిదానపూర్వరూపాదిక్రమముగా జ్వరాదిరోగములు జనించియుండునపుడు వానిననుసరించి జనించిన యితరరోగములు స్వతంత్రరోగములు కానేరవు. తొలుత జనించిన జ్వరాది రోగములే ప్రధానంబులుగనుండుటవలన స్వతంత్రరోగములనబడును. అని తంత్రాంతరమునందు జెప్పబడియున్నది.

పరతంత్ర - రోగ లక్షణము.

శ్లో॥ విపరీతాస్తతోఽన్యేతు

తా॥ స్వతంత్రరోగములకంటె నితరమైన పరతంత్రరోగములు విపరీతస్వరూపముగలవిగనుండును. (అనగా పరతంత్రరోగము స్వతంత్రరోగములవలె స్పష్టమైన లక్షణములును, శాస్త్రములో జెప్పియుండు ప్రకారము ఉత్పత్త్యాదులును లేకుండునని భావము.)

వాతాదులకు - స్వతంత్ర పరతంత్రత్వము.

శ్లో॥ విద్యాదేవంమలానపి ।

తా॥ రోగములను స్వతంత్ర, పరతంత్రభేదములచే నెఱుంగునటులనే వాతాది దోషములనుకూడా స్వతంత్రపరతంత్రభేదములచేతనే వైద్యుడు తెలిసికొనవలయును.

వాతాది - స్వతంత్ర - పరతంత్ర జ్ఞానము.

శ్లో॥ తాంల్లక్షయేదవహితో వికుర్వాణాన్ప్రతిజ్వరమ్ ॥ 61.

తా॥ ప్రతిరోగమునందు ప్రకోపమును జెందియుండునట్టియు, పైజెప్పిన ప్రకారము స్వతంత్ర పరతంత్రరూపము గలిగినట్టియు వాతపిత్తకఫములను మిగుల జాగరూకుడై వైద్యుడు తెలిసికొనవలయును.

## స్వతంత్ర - పరతంత్ర - రోగ చికిత్సాక్రమము.

శ్లో॥ తేషాంప్రధానప్రశమే ప్రశమో౽శామ్యత స్తథా।
పశ్చాచ్చికిత్సేత్తూర్ణంవా బలవంతముపద్రవమ్॥ 62.

తా॥ స్వతంత్రరోగములు శమనమును జెందినచో పరతంత్రరోగములుఁగూడా శమనమును జెందును. ఇటుల జెప్పుటచే పరతంత్రరోగములకు ప్రత్యేకముగా చికిత్స జేయవలసినది లేదనిభావంబగుచున్నది. పరతంత్రరోగములు శాంతి జెందకుండినచో తచ్ఛమనార్థమయి స్వతంత్రరోగచికిత్సనే చేయవలయును. పరతంత్రరోగములో ఉపద్రవమధికముగ నుండినయెడల నాపరతంత్రరోగమునకే తొలుత చికిత్సచేయవలయును. అటులజేయక నుపేక్షించినచో అసాధ్యముగనగును.

## బలిష్ఠ - పరతంత్రరోగ పూర్వచికిత్స.

శ్లో॥ వ్యాధిక్లిష్టశరీరస్య పీడాకరతరో హి సః।

తా॥ వ్యాధిచేపీడింపబడిన శరీరముగలపురుషునికి జనించిన ఉపద్రవమనుపేరుగల పరతంత్రరోగము మిక్కుటముగా పీడనుగలుగజేసును. కాబట్టి దానికి తొలుత చికిత్స చేయవలయును. (అనగా స్వతంత్రరోగము దుర్బలముగనుండు పక్షములో నది ప్రధానచికిత్సచేతనే శాంతి జెందును. స్వతంత్రరోగమునకు పిదప జనించిన పరతంత్రరోగము స్వతంత్రరోగచికిత్సచే శాంతిజెందకుండు పక్షములో దానికి పిదప చికిత్స చేయవలయును. పరతంత్రరోగము బలిష్ఠముగనుండుపక్షములో అది అతి పీడాకరంబగుటచే స్వతంత్రరోగమునకు పూర్వమే దానికి చికిత్సచేయవలయును అని భావము.)

## సర్వరోగ - చికిత్సావశ్యకత్వము.

శ్లో॥ వికారనామాకుశలో నజిహ్రీయాత్కదాచన॥ 63.
నహిసర్వవికారాణాం నామతో౽స్తి ధ్రువాస్థితిః।

తా॥ సర్వరోగములకు పేరువలన నిశ్చయించబడిన స్థానము లేకుండుటచే రోగనామములు తెలియనివైద్యుడు లజ్జపడకుండా చికిత్సనవశ్యముగా చేయవలయును.



## సర్వరోగస్థానాజ్ఞాన కారణము.

శ్లో॥ సఏవకుపితోదోష స్సముత్థానవిశేషతః॥ 64.
స్థానాంతరాణిచప్రాప్య వికారాన్కురుతేబహూన్।

తా॥ వాతాదిదోషములలో నేదైనానొకటి హేతువిశేషముచే స్వస్థానమును వదలి వేరుస్థానమునుజెందిన అనేకమైన రోగములను గలుగజేసును. కాబట్టి సర్వరోగములయొక్క నామములను స్థానములను నెఱుంగుట యశక్యము.

" యో౽న్తఃశరీరసంధీనావిశతి తేన జృంభాజ్వరశ్చోపజాయతే। యస్త్వామాశయమభ్యుపైతి తేన రోగాభవంత్యురస్యరోచకశ్చ। యఃకంఠమభిప్రపద్యతేకంఠస్తతోభ్రంశతేస్వరశ్చావసీదతి। యఃప్రాణవహాని స్రోతాంస్యన్వేతిశ్వాసః ప్రతిశ్యాయశ్చతేనోపజాయతే॥"

వాతాదిదోషములలో నేదైనానొకటి శరీరసంధులయందుప్రవేశించినచో ఆవలింతలు, జ్వరముగలుగును. ఆమాశయమునుజెందినచో హృదయరోగము, అరోచకముగలుగును. కంఠమునుజెందినచో కంఠభ్రంశము, స్వరసాదము గలుగును. ఏది ప్రాణవహమయిన స్రోతస్సులనుజెందునో అట్టిదానివలన శ్వాసము, ప్రతిశ్యాయముగలుగును అని తంత్రాంతరమునందు జెప్పబడియున్నది.

## రోగనిదానాది - జ్ఞానావశ్యకత్వము.

శ్లో॥ తస్మాద్వికారప్రకృతీ రధిష్ఠానాంతరాణిచ॥ 65.
బుద్ధ్వాహేతువిశేషాంశ్చ శీఘ్రంకుర్యాదుపక్రమమ్॥

తా॥ జ్వరాదిరోగోత్పత్తికి ముఖ్యకారణముగనుండు వాతాదిదోషములను, రోగహేతుభేదములను, స్థానవిశేషములను, నిదానభేదములను (అనగా వాతంబిపుడు రూక్షమైన హేతువువలన, ప్రకోపమునుజెందియున్నదా లేక లఘువుగ, శీతలముగనుండు హేతువువలన ప్రకోపమునుజెందియున్నదా అను వాతాదిదోషములయొక్క నిదానమును, రోగహేతువుయొక్క స్థానభేదమును) బాగుగా నెఱింగి శీఘ్రముగా చికిత్సచేయవలయును.

## దూష్యాది - జ్ఞానావశ్యకత్వము.

శ్లో॥ దూష్యందేశంబలంకాల మనలంప్రకృతింవయః॥ 66.
సత్వంసాత్మ్యంతథాహార మవస్థాశ్చపృథగ్విధాః।

సూక్ష్మసూక్ష్మాఃసమీక్ష్యైషాం దోషౌషధనిరూపణే ॥ 67.

యోవర్తతేచికిత్సాయాం నసస్ఖలతిజాతుచిత్ ।

తా॥ వాతాదిదోషములను హరీతక్యాద్యౌషధములను బాగుగా పర్యాలోచనజేసి దూష్యము, దేశము, బలము, కాలము, జాఠరాగ్ని, ప్రకృతి, వయస్సు, సత్వము, సాత్మ్యము, ఆహారము యీ మొదలగువానిని, పై జెప్పినదూష్యాదులయొక్క యతిసూక్ష్మమయిన నానావిధ అవస్థాభేదములను బాగుగాచూచి తెలిసికొని చికిత్సచేయుటకు యత్నించువైద్యు డొకపుడు నపరాధికానేరడు.

## వ్యాధ్యాకార - జ్ఞానావశ్యకత్వము.

శ్లో॥ గుర్వల్పవ్యాధిసంస్థానం సత్వదేహబలాబలాత్ ॥ 68.

దృశ్యతేప్యన్యథాకారం తస్మిన్నవహితోభవేత్ ।

తా॥ గొప్పగ, అల్పముగనుండువ్యాధులయొక్క యాకారములు ధైర్యము, స్థూలకృశములుగనుండు దేహములు, బలము, దుర్బలము, వీనియొక్క భేదములచే వెవ్వేరుగ గన్పట్టును. కాబట్టి గురువుగ లేక అల్పముగనుండు రోగములయొక్క యాకారవిషయమునందు వైద్యుడు బహుజాగరూకుడై యుండవలయును. (అనగా అధికదేహబలముగల పురుషునికిజనించినవ్యాధి గొప్పదిగనుండినప్పటికి నా దేహమునందుండు సత్వబలాధిక్యములవలన స్వల్పమయిన యాకారముకలదిగనే గన్పట్టును. అటులనే హీనమయినబలము, దేహము, సత్వముగలపురుషునికి జనించిన రోగము స్వల్పముగనుండినప్పటికి నాబలాదులయొక్క హీనతవలన గొప్పయాకారముగలదిగనే గన్పట్టును. కాబట్టి వ్యాధియొక్క యాకారవిషయమునందు వైద్యుడు మిగుల జాగరూకుడుగనుండవలయునని భావము.)

## కుత్సితవైద్య - చికిత్సాక్రమము.

శ్లో॥ గురుంలఘుమితివ్యాధిం కల్పయంస్తుభిషగ్బ్రువః ॥ 69.

అల్పదోషాకలనయా పథ్యేవిప్రతిపద్యతే ।

తా॥ రోగస్వరూపజ్ఞానములేని వైద్యుడు వ్యాధియొక్క యాకారమును మాత్రముజూచి గొప్పదిగనుండు వ్యాధిని స్వల్పమయినదియని నిశ్చయించుకొని దోషములు స్వల్పముగానున్నవియను యీనిశ్చయజ్ఞానమువలన చికిత్సావిషయమునందు మోహమునుజెందును. ఇటులనే స్వల్పమైన వ్యాధిని గొప్ప వ్యాధియని నిశ్చయించుకొని చికిత్సావిషయమునందు మోహమునుజెందును. (అనగా గొప్పవ్యాధియందు అల్పమయినవ్యాధికి యోగ్యమయినఔషధమును, అల్పమయినవ్యాధియందు గొప్పవ్యాధికి యోగ్యమయిన ఔషధమును ప్రయోగించుటచే చికిత్సావిషయమునందు మోహమును జెందుచున్నాడని భావము.)



## కుత్సితవైద్య - చికిత్సచే శరీరనాశము.

శ్లో॥ తతోల్పమల్పవీర్యంవా గురువ్యాధౌప్రయోజితమ్ ॥ 70.

ఉదీరయేత్తరాంరోగాన్ సంశోధనమయోగతః ।

శోధనంత్వతియోగేన విపరీతంవిపర్యయే ॥ 71.

క్షిణుయాన్నమలానేవ కేవలంవపురస్యతి ।

తా॥ అల్పప్రమాణముగలిగినట్టియు, అధికశక్తిలేనట్టియు శోధనరూపమయిన యౌషధము రోగస్వరూపజ్ఞానములేని వైద్యునిచే గొప్ప వ్యాధియందు ప్రయోగించబడినయెడల నాయౌషధము హీనయోగముగలదియగుటవలన రోగములనువిశేషముగా వృద్ధిజేసును. అల్పముగనుండువ్యాధియందు ప్రయోగించబడిన అధికప్రమాణముఅధికవీర్యముగల శోధనరూపమైనయౌషధము మలాదులను విశేషముగా క్షయింపజేసి శరీరమునుకూడా హింసించును.

"అల్పముత్క్లేశయేద్దోషం బహుప్రాణాన్నిహంతిచ । తస్మాన్నిరూప్య భిషజా దేయంయుక్తంవిరేచనమ్ ॥"

గొప్పవ్యాధియందు ప్రయోగించబడినస్వల్పమైనయౌషధము దోషములనువృద్ధిజేసును. స్వల్పమైనవ్యాధియందు ప్రయోగించబడిన మహత్తయిన యౌషధము ప్రాణములను కూడా హరింపజేసును. కాబట్టి వైద్యుడు వ్యాధియొక్క యాకారమును బాగుగా పర్యాలోచనజేసి యుక్తమైన శోధనౌషధముల నివ్వవలయునని ఖరనాదుడుకూడా జెప్పియున్నాడు. జ్వరగుల్మాదిరోగములకు చికిత్సజేసునపుడు వానిలోగొప్పవిగనుండు వ్యాధియందు అల్పప్రమాణము, అల్పవీర్యముగల యౌషధము నుపయోగించకూడదని పై దృష్టాంతముచేతనే తెలిసికొనవలయును.

## ఔషధ - ప్రయోగ క్రమము.

శ్లో॥ అతోభియుక్తస్సతతం సర్వమాలోచ్యసర్వథా ॥ 72.

తథాయుంజీతభైషజ్య మారోగ్యాయయథాధ్రువమ్ ।

తా॥ పైజెప్పినప్రకారము రోగములయొక్కగతి నెఱుంగుట మిగులయసాధ్యం బగుటవలన నెల్లపుడు ఆయుర్వేదపఠన, తదనుష్ఠానములయందు మిగులప్రయత్నముగల

వైద్యుడు పైజెప్పినసమస్తమయిన దూష్యము మొదలగు వస్తుసమూహమును పర్యాలోచనజేసి సర్వప్రకారములచే (అనగా నాయుర్వేదము ననుసరించియుండు స్వబుద్ధి చేతను, ఆయుర్వేదమును తెలిసినవారియొక్క సంభాషణాది సహవాసముచేతను, చికిత్సయందుగల అభ్యాసాధిక్యముచేతను) బాగుగా పర్యాలోచనజేసి యెవ్విధముగ నౌషధమును ప్రయోగించిన అవశ్యమారోగ్యముగలుగునో అవ్విధముగ నౌషధమును ప్రయోగించవలయును.

## వృద్ధిక్షయభేదమువలన - వాతాదిదోషభేద నిరూపణము.

శ్లో॥ వక్ష్యంతేతఃపరందోషా వృద్ధిక్షయవిభేదతః॥ 73.

తా॥ ఇందుకుపైన వాతాదిదోషములు వృద్ధిక్షయభేదములచే వివరించబడును.

శ్లో॥ పృథక్త్రీన్వృద్ధిసంసర్గ స్త్రిధాతత్రతుతాన్నవ ।

తా॥ వెవ్వేరుగా స్వప్రమాణమునకంటె వృద్ధిజెందియుండు వాతాదిత్రిదోషములు రోగమునకు హేతువుగనుండును. అది యెట్లనగా:— (1) వాతము వృద్ధిజెంది పిత్తకఫములు సమముగనుండుట 1. (2) వాతకఫములు సమముగనుండి పిత్తము వృద్ధిజెందియుండుట 1. (3) వాతపిత్తములు సమముగనుండి శ్లేష్మమువృద్ధిజెందియుండుట 1. ఇటుల వెవ్వేరుగా వృద్ధిజెందిన వాతపిత్తకఫములు 3-ను జెప్పబడినవి. వాతాది దోషములయొక్క సంసర్గము 3 ప్రకారములు. వానిలో స్వప్రమాణమునకంటెనధికముగనుండు దోషభేదములు 9 విధములుగనుండును. ఆ 9 విధంబులును రోగమునకు హేతువుగనుండునని తెలియవలయును.

శ్లో॥ త్రీనేవసమయావృద్ధ్యా షడేకస్యాతిశాయనే ॥ 74.

తా॥ న్యూనాధిక్యము లేకుండా సమముగనుండు సంసర్గదోషభేములు 3 విధంబులు. అవి యెవ్వియనగా:— (4) వాతపిత్తములువృద్ధిజెంది కఫము సమముగనుండుట 1. (5) వాతకఫములువృద్ధిజెంది పిత్తము సమముగనుండుట 2. (6) పిత్తశ్లేష్మములు వృద్ధిజెంది వాతము సమముగనుండుట 3. ఇటులన్యూనాధిక్యము లేకుండా సమముగనుండు సంసర్గదోషములు 3-ను జెప్పబడినవి. మతియు నాసంసర్గదోషములలో ఒక్కొకదోషముయొక్క అధికమైనవృద్ధివలన 6 దోషభేదములు గలుగును. అవి యెట్లనగా:— (7) వాతమువృద్ధమై పిత్తము వృద్ధతరమై కఫముసమముగనుండుట 1. (8) పిత్తమువృద్ధమై వాతమువృద్ధతరమై కఫముసమముగనుండుట 2. (9) కఫము వృద్ధమై పిత్తమువృద్ధతరమై వాతముసమముగనుండుట 3. (10) పిత్తమువృద్ధమైకఫము వృద్ధతరమై వాతముసమముగనుండుట 4. (11) కఫమువృద్ధమై వాతమువృద్ధతరమై



పిత్తముసమముగనుండుట 5. (12) వాతమువృద్ధమై కఫమువృద్ధతరమై పిత్తము సమముగనుండుట 6. ఇటుల నొక్కొకదోషాధిక్యవృద్ధిచేగలిగిన సంసర్గదోషభేదములు 6-ను జెప్పబడినవి. ఈ 6 దోషభేదములును, పైజెప్పినప్రకారము న్యూనాధిక్యము లేక సమముగనుండు 3 దోషభేదములును చేరి వెరసి 9 సంసర్గభేదములగు నగునని తెలియవలయును.

శ్లో॥ త్రయోదశసమస్తేషు

తా॥ మూడుదోషములు వృద్ధిజెందియుండునట్టి సకల సన్నిపాతములయందు దోషభేదములు 13 విధములుగనుండునని తెలియవలయును.

శ్లో॥ షట్ద్వ్యేకాతిశయేనతు ।

తా॥ పైజెప్పిన 13 దోషభేదములలో 2 దోషములయొక్కయు లేక ఏకదోషముయొక్కయు అధికవృద్ధివలన 6 సన్నిపాతభేదములు గలుగును. అవి యెవ్వియనగా:— (13) కఫము వృద్ధమై వాతపిత్తములు వృద్ధతరమయియుండుట 1. (14) పిత్తము వృద్ధమై వాతకఫములు వృద్ధతరమయియుండుట 2. (15) వాతము వృద్ధమై పిత్తకఫములు వృద్ధతరమయియుండుట 3. ఇటుల 2 దోషములయొక్క అధికవృద్ధివలనగలిగిన సన్నిపాతభేదములు 3-ను జెప్పబడినవి. (16) పిత్తకఫములు వృద్ధమై వాతమువృద్ధతరమయియుండుట 1. (17) వాతకఫములువృద్ధమై పిత్తమువృద్ధతరమయియుండుట 2. (18) వాతపిత్తములు వృద్ధమై కఫమువృద్ధతరమైయుండుట 3 ఇటు లనేకదోషములయొక్క అధికవృద్ధివలనగలిగిన సన్నిపాతభేదములు 3-ను జెప్పబడినవి. పై జెప్పినప్రకారము 2 దోషములయొక్కయు, ఏకదోషముయొక్కయు అధికవృద్ధిజేరి సన్నిపాతదోషభేదములు 6 విధములుగనగునని తెలియవలయును.

శ్లో॥ ఏకంతుల్యాధికైః

తా॥ (19) దోషములన్నియు సమముగా వృద్ధిజెందియుండునట్టి సన్నిపాతభేదము ఒకటియని తెలియవలయును.

శ్లో॥ షట్చతారతమ్యవికల్పనాత్ ॥ 75.

తా॥ సన్నిపాతమునందుండు దోషములయొక్క తారతమ్య భేదములవలన నాసన్నిపాతములకు 6 భేదములుగలుగునని తెలియవలయును. అవి యెట్లనగా:— (20) వాతమువృద్ధముగ, పిత్తమువృద్ధతరముగ, కఫము వృద్ధతమముగ నుండుట 1. (21) వాతమువృద్ధముగ, కఫమువృద్ధతరముగ, పిత్తము వృద్ధతమముగనుండుట 2. (22) పిత్తమువృద్ధముగ, కఫమువృద్ధతరముగ, వాతము వృద్ధతమముగనుండుట 3.

(23) పిత్తమువృద్ధముగ, వాతము వృద్ధతరముగ, కఫము వృద్ధతమముగనుండుట 4.
(24) కఫమువృద్ధముగ, వాతము వృద్ధతరముగ, పిత్తము వృద్ధతమముగనుండుట 5.
(25) కఫము వృద్ధముగ, పిత్తము వృద్ధతరముగ, వాతము వృద్ధతమముగనుండుట 6.
ఇటుల సన్నిపాతమునందలి వాతాదిదోషములయొక్క తారతమ్యభేదమువలన నా సన్నిపాతదోషములు 6 విధములుగనుండునని జెప్పబడినవి.

"సన్నిపాతజ్వరస్యోర్ధ్వం త్రయోదశవిధస్యతు । ప్రాక్సూత్రితస్య వక్ష్యామిలక్షణంవైపృథక్పృథక్ । భ్రమఃపిపాసాదాహశ్చ గౌరవంశిరసోతిరుక్ । వాతపిత్తోల్బణేవిద్యాల్లింగంమందకఫజ్వరమ్ । శైత్యంకాసోరుచిస్తంద్రా పిపాసాదాహరుగ్వ్యథా । వాతశ్లేష్మోల్బణేవ్యాధౌ లింగంపిత్తావరేవిదుః । ఛర్దిఃశైత్యంముహుర్దాహ స్తృష్ణామోహోస్థివేదనా । మందవాతేధ్యవస్యంతి లింగంపిత్తకఫోల్బణే । సంధ్యస్థిశిరసశ్శూలంప్రలాపోగౌరవంభ్రమః । వాతోల్బణేస్యాద్ద్వ్యనుగే తృష్ణాకంఠాస్యశుష్కతా । రక్తవిణ్మూత్రతాదాహః స్వేదస్తృడ్బలసంక్షయః । మూర్ఛాచేతిత్రిదోషేస్యాల్లింగంపిత్తగరీయసి । ఆలస్యారుచిహృల్లాసదాహవమ్యరతిభ్రమైః।కఫోల్బణంసన్నిపాతం తంద్రాకాసేనచాదిశేత్। సమందోషైస్త్రిభిర్వృద్ధైః సన్నిపాతస్యలక్షణమ్। ముహుర్దాహోముహుశ్శీతం కర్ణక్ష్వేడనపార్శ్వరుక్ । మోహశ్ఛర్దిర్దివానిద్రా రాత్రౌజాగరణంతథా। ప్రతిస్యాచ్ఛర్దిరాలస్యం తంద్రారుచ్యగ్నిమార్దవమ్ । హీనవాతేపిత్తమధ్యే చిహ్నంశ్లేష్మాధికేమతమ్ । హారిద్రమూత్రనేత్రత్వగ్దాహస్తృష్ణాభ్రమోరుచిః । హీనవాతేమధ్యకఫే లింగంపిత్తాధికేమతమ్ । శిరోరుగ్వేపథుశ్శ్వాసః ప్రలాపశ్ఛర్ద్యరోచకౌ । హీనపిత్తేమధ్యకఫే లింగంవాతాధికేమతమ్ । శీతకోగౌరవంతంద్రా ప్రలాపోస్థిశిరోతిరుక్ । హీనపిత్తేమధ్యవాతే లింగంశ్లేష్మాధికేవిదుః । వర్చోభేదోగ్నిదౌర్బల్యం తృష్ణాదాహారుచిర్భ్రమః । కఫహీనేవాతమధ్యే లింగంపిత్తాధికేమతమ్ । శ్వాసఃకాసఃప్రతిశ్యాయో ముఖశోషోతిపార్శ్వరుక్ । కఫహీనేపిత్తమధ్యే లింగంవాతాధికేస్మృతమ్ ॥"



పైజెప్పిన 18 విధములైన సన్నిపాతజ్వరములకు వేర్వేరుగా లక్షణములను వచించెద. భ్రమ, దప్పి, సర్వాంగతాపము, గురుత్వము, శిరమునందతిశూల యీ లక్షణములు వాతపిత్తాధిక్యము, స్వల్పకఫముగలదిగనుండు సన్నిపాతజ్వరమునకు గలిగియుండు నని తెలియవలయును. శైత్యము, కాసము, అరుచి, తంద్ర, దప్పి, సర్వాంగమునందు తాపము, పీడ యీ లక్షణములు వాతశ్లేష్మములధికముగ, పిత్తముతక్కువగనుండు సన్నిపాతజ్వరమునకు గలిగియుండునని ఋషులువచియించెదరు. ఛర్ది, శైత్యము, సర్వాంగతాపము, పలుమారుదప్పి, మోహము, ఎముకలయందునొప్పి యీ లక్షణములు పిత్త కఫములధికముగ, వాతము తక్కువగనుండు సన్నిపాతముజ్వరమునకు గలిగి యుండునని ఋషులువచియించెదరు. సంధులు, అస్థులు, శిరస్సు వీనియందుశూల, ప్రలాపము, గురుత్వము, భ్రమ, దప్పి, గలుగుట, కంఠమునోరు యెండుట యీ లక్షణములు వాతము అధికముగ పిత్తశ్లేష్మములు తక్కువగనుండు సన్నిపాతజ్వరమునకు గలిగియుండును. మలమూత్రములకు రక్తవర్ణము, సర్వాంగతాపము, స్వేదము, దప్పి, బలహాని, మూర్ఛ యీ లక్షణములు పిత్తము అధికముగ వాతశ్లేష్మములు తక్కువగ నుండు సన్నిపాతజ్వరమునకు గలిగియుండును. ఆలస్యము, అరుచి, హృల్లాసము, సర్వాంగతాపము, వమనము, అరతి, భ్రమ, తంద్ర, కాసము యీ లక్షణములు కఫము అధికముగ వాత పిత్తములు తక్కువగనుండు సన్నిపాతజ్వరమునకు గలిగి యుండును. పలుమారు సర్వాంగములయందు తాపము, పలుమారు శైత్యము, కర్ణక్ష్వేడనము, పార్శ్వశూల, మోహము, ఛర్ది, పగటినిద్ర, రాత్రులయందు జాగరణము యీ లక్షణములు వాతపిత్తశ్లేష్మదోషములు 3-ను సమముగనుండు సన్నిపాతజ్వరమునకు గలిగియుండును. పలుమారు వమనములగుట, ఆలస్యము, తంద్ర, అరుచి, అగ్నిమాంద్యము యీ లక్షణములు వాతము కొంచెముగ, పిత్తము మధ్యమముగ, శ్లేష్మము అధికముగనుండు సన్నిపాతజ్వరమునందు గలిగియుండును. మూత్రము, నేత్రములు, చర్మము ఇవి పసపువర్ణముగనుండుట, సర్వాంగములయందు తాపము, దప్పి, అరుచి, భ్రమ, యీ లక్షణములు వాతము హీనముగ, కఫము మధ్యమముగ, పిత్తము అధికముగనుండు సన్నిపాతజ్వరమునందు గలిగియుండును. శిరోవేదన, వాఫు, శ్వాసము, ప్రలాపము, ఛర్ది, అరోచకము, యీ లక్షణములు పిత్తముహీనముగ, కఫము మధ్యమముగ, వాతము అధికముగనుండు సన్నపాతజ్వరమునందు గలిగియుండును. అధికమైన శీతలము, గురుత్వము, తంద్ర, ప్రలాపము, అస్థులు, శిరస్సు వీనియందు విశేషమైన పీడ యీ లక్షణములు పిత్తముహీనముగ, వాతము మధ్యమముగ, శ్లేష్మము అధికముగనుండు సన్నిపాతజ్వరమునందు గలిగియుండునని ఋషులువచించెదరు. మలభేదము, అగ్నిమాంద్యము, దప్పి, సర్వాంగతాపము, అరుచి, భ్రమ

యీ లక్షణములు కఫముహీనముగ, వాతము మధ్యమముగ, పిత్తము అధికముగనుండు సన్నిపాతజ్వరమునందు గలిగియుండును. శ్వాసము, కాసము, ప్రతిశ్యాయము, ముఖశోష, పార్శ్వములయందతి వేదన యీ లక్షణములు కఫముహీనముగ, పిత్తముమధ్యముగ, వాతము అధికముగనుండు. సన్నిపాతజ్వరమునందు గలిగియుండునని ఋషులు వచించెదరు. అనిచరకమునందు 13 విధములైన సన్నిపాతజ్వరములకు లక్షణములు జెప్పబడియున్నవి.

శ్లో॥ పంచవింశతిమిత్యేవంవృద్ధైః

తా॥ పైజెప్పిన ప్రకారము వాతాదిదోషములయొక్క వృద్ధివలన వృద్ధిజెందిన దోషభేదములు 25 సంఖ్యగలవిగనుండును.

శ్లో॥ క్షీణైశ్చతావతిః ।

తా॥ క్షయావస్థనుజెందియుండు వాతాదిదోషమువలన దోషభేదములు పైజెప్పినప్రకారము 25 సంఖ్యగలవిగనుండునని తెలియవలయును. అవియెట్లనగా:— (26) పిత్తకఫములుసమమై వాతముక్షీణముగనుండుట 1. (27) పిత్తముక్షీణమై వాతకఫములు సమముగనుండుట 1. (28) కఫముక్షీణమై వాతపిత్తములు సమముగనుండుట 1. ఇటుల ప్రత్యేకముగా క్షయమునుజెందియుండు దోషములు 3. క్షయమునుజెందియుండు వాతాదులయొక్క సంసర్గమువలన 9 దోషభేదములు గలుగును. అవియెట్లనగా—(29) వాతపిత్తములుక్షీణమై కఫము సమముగనుండుట 1. (30) పిత్తకఫములు క్షీణమై వాతముసమముగనుండుట 1. (31) వాతకఫములు క్షీణమై పిత్తము సమముగనుండుట 1. ఇటుల సమముగాక్షయించియుండు దోషసంసర్గభేదములు 3-ను జెప్పబడినవి. (32) వాతముక్షీణమై పిత్తముక్షీణతరమై కఫము సమముగనుండుట 1. (33) పిత్తముక్షీణమై వాతముక్షీణతరమై కఫము సమముగనుండుట 2. (34) వాతముక్షీణమై కఫముక్షీణతరమై పిత్తము సమముగనుండుట 3. (35) కఫము క్షీణమై వాతముక్షీణతరమై పిత్తము సమముగనుండుట 4. (36) కఫము క్షీణమై పిత్తముక్షీణతరమై వాతము సమముగనుండుట 5. (37) పిత్తముక్షీణమై కఫముక్షీణతరమై వాతము సమముగనుండుట 6. ఇటుల క్షీణసంసర్గదోషములు 6 జెప్పబడినవి. వాతాది సమస్తదోషములు క్షయించియుండు సన్నిపాత దోషభేదములు 13 విధములుగనుండును. అవియెట్లనగా:—(38) వాతము క్షీణమై పిత్తకఫములు క్షీణతరములైయుండుట 1. (39) పిత్తముక్షీణమై వాతకఫములు క్షీణతరములైయుండుట 2. (40) కఫముక్షీణమై పిత్తవాతములు క్షీణతరములైయుండుట 3. (41) వాతపిత్తములుక్షీణమై కఫముక్షీణతరమైయుండుట 1. (42) పిత్తకఫములు క్షీణమై వాతము క్షీణతరమయియుండుట 2. (43) వాతకఫములుక్షీణమయి పిత్తము క్షీణతరమయియుండుట 3. (44) వాతపిత్తకఫములు 3-ను సమముగా క్షీణమయియుండుట 1. (45) కఫముక్షీణమయి పిత్తము క్షీణతరమయి వాతముక్షీణతమమయియుండుట 1. (46) వాతముక్షీణమయి కఫము క్షీణతరమయి పిత్తము క్షీణతమమయియుండుట 2. (47) పిత్తముక్షీణమయికఫముక్షీణతరమయి వాతముక్షీణతమమయియుండుట 3. (48) కఫముక్షీణమయి వాతముక్షీణతరమయి పిత్తము క్షీణతమమయియుండుట 4. (49) వాతముక్షీణమయి పిత్తము క్షీణతరమయి కఫము క్షీణతమమయియుండుట 5. (50) పిత్తము క్షీణమయి వాతము క్షీణతరమయి కఫము క్షీణతమమయియుండుట 6. ఇటుల క్షీణమయియుండు వాతాదిదోషభేదములు 25-ను జెప్పబడినవి.



శ్లో॥ ఏకైకవృద్ధిసమతా క్షయైఃషట్ తే

తా॥ పైజెప్పినసన్నిపాతదోషములలో వాతాదిదోషములు ప్రతిదానియొక్క వృద్ధి, సమత్వము, క్షయము వీనిచే 6 విధములుగనగును. అవి యెట్లనగా:— (51) వాతమువృద్ధిజెంది పిత్తము సమముగ కఫము క్షీణముగనుండుట 1. (52) పిత్తము వృద్ధిజెంది వాతముసమముగ కఫము క్షీణముగనుండుట 2. (53) కఫమువృద్ధిజెంది పిత్తము సమముగ వాతముక్షీణముగనుండుట 3. (54) కఫమువృద్ధిజెంది వాతము సమముగ పిత్తము క్షీణముగనుండుట 4. (55) వాతమువృద్ధిజెంది కఫముసమముగ పిత్తము క్షీణముగనుండుట 5. (56) పిత్తము వృద్ధిజెంది కఫముసమముగవాతము క్షీణముగనుండుట 6. ఇటుల వాతాదులలో ప్రతిదానియొక్కవృద్ధి, సమత్వము, క్షయము వీనిచేగలిగిన సన్నిపాతదోషభేదములు 6-ను జెప్పబడినవి.

శ్లో॥ పునశ్చషట్ ॥ 76.
ఏకక్షయద్వంద్వవృద్ధ్యా సవిపర్యయయాపితే ।
భేదాద్విషష్టిర్నిర్దిష్టాః

తా॥ మఱియు వాతాదిదోషములలో నొక్కొకదానికి గలుగునట్టి క్షయము, 2 దోషములకుగలుగునట్టి వృద్ధి, 2 దోషములకుగలుగునట్టిక్షయము, ఒక దోషమునకు గలుగునట్టివృద్ధి యీభేదములచే మరల నాసన్నిపాతదోషములు 6 విధములుగనగును. అవియెట్లనగా:— (57) వాతముక్షీణమయి పిత్తకఫములు వృద్ధిజెందియుండుట 1. (58) పిత్తము క్షీణమయి వాతకఫములు వృద్ధిజెందియుండుట 2. (59) కఫము క్షీణమయి వాతపిత్తములు వృద్ధిజెందియుండుట 3. (60) వాతపిత్తములు క్షీణమయి శ్లేష్మము వృద్ధిజెందియుండుట 4. (61) వాతకఫములుక్షీణమయి పిత్తము వృద్ధిజెందియుండుట 5. (62) పిత్తకఫములుక్షీణమయి వాతమువృద్ధిజెందియుండుట 6. ఇటుల

సన్నిపాతదోషభేదములు 6-ను జెప్పబడినవి. పైజెప్పిన 5 భేదములవలనదోషభేదముల మొత్తము 62 విధములుగనగుననని ఋషులచే జెప్పబడియున్నది.

శ్లో॥ త్రిషష్టస్స్యాత్స్వాస్థ్యకారణమ్ ॥ 77.

తా॥ 63 వదియగు దోషభేదములో వాతపిత్త కఫదోషములు 3-ను స్వప్రమాణమునందుండి సమముగా సంచరించుచుండుటచే నా 63 వదియైన దోషభేదము మాత్రము శరీరారోగ్యమునకు కారణముగనుండును. పైజెప్పిన 62 దోషభేదములలో వాతాదిదోషములు స్వప్రమాణమునందుండక పరస్పరము విషమముగ సంచరించుచుండుటచే నా 62 దోషభేదములు రోగమునకు కారణముగనుండును అని తెలిసికొనవలయును.

## రసాదిసంసర్గముచే - వాతాదిదోష భేదానంత్యము.

శ్లో॥ సంసర్గాద్రసరుధిరాదిభిస్తథైషాం దోషాంస్తుక్షయసమతావి
వృద్ధిభేదైః । ఆనంత్యంతరతమయోగతశ్చయాతాన్ జానీ
యాదవహితమానసోయథాస్వమ్ ॥ 78.

తా॥ పై జెప్పిన దోషభేదములు యథాక్రమముగా రసరక్తాదులయొక్క సంయోగమువలనను, ఆ రసరక్తాదులయొక్క క్షయ సమత్వ వృద్ధిభేదములవలనను, తారతమ్యయోగములవలనను సంఖ్యాతీతములుగనగును. కాబట్టి సంఖ్యాతీతమయిన ఆ దోషభేదములను వైద్యుడు బహు జాగరూకతగల మనస్సుగలవాడై తెలిసికొనవలయును. మఱియు నట్టి సంఖ్యాతీతమయిన దోషభేదములను వివరింపబూనినచో గ్రంథవిస్తరమునకు కారణమగుచున్నది; కాబట్టి అట్టి సంఖ్యాతీతములైన దోషభేదములను సంక్షేపముగా తెలిసికొనుటకు తగినమార్గం బేమనగా:—

"పృథక్ త్రీన్ వ్యాద్యేకత్యాది"

అను పూర్వోక్తశ్లోకములో జెప్పబడినప్రకారము రస వాత పిత్తకఫములు వెవ్వేరుగా 3 భేదములను జెందును. అటులనే వానిసంసర్గముకూడా 3 భేదములను జెందును. అ సంసర్గములో రసము నుద్దేశించియుండునవి 9 విధంబులు. అవియెవ్వియనగా:—

"త్రీనేవసమయాన్పృథ్వ్యాపదేకస్యాతిశాయనే"

అను పూర్వోక్తవచనముచేత రసమునుద్దేశించియుండు సంసర్గమునుజేర్చి సన్నిపాతము నందూహించికొనవలయును. అదియెట్లనగా:—

"త్రయోదశసమస్తేషు షట్ ద్వ్యేకాతిశయేసతు । ఏకంతుల్యాధికైః షట్చ తారతమ్యవికల్పనాత్ ॥"

వృద్ధిక్షయభేదములచే (62) విధములుగనగు వాతాదిదోషములను సులభముగ తెలియజేయునట్టి పటము.

| సంఖ్య. | వాతము. | పిత్తము. | కఫము. |
|---|---|---|---|
| 1 | వృద్ధము | సమము | సమము |
| 2 | సమము | వృద్ధము | సమము |
| 3 | సమము | సమము | వృద్ధము |
| 4 | వృద్ధము | వృద్ధము | సమము |
| 5 | వృద్ధము | సమము | వృద్ధము |
| 6 | సమము | వృద్ధము | వృద్ధము |
| 7 | వృద్ధము | వృద్ధతరము | సమము |
| 8 | వృద్ధతరము | వృద్ధము | సమము |
| 9 | సమము | వృద్ధతరము | వృద్ధము |
| 10 | సమము | వృద్ధము | వృద్ధతరము |
| 11 | వృద్ధతరము | సమము | వృద్ధము |
| 12 | వృద్ధము | సమము | వృద్ధతరము |
| 13 | వృద్ధతరము | వృద్ధతరము | వృద్ధము |
| 14 | వృద్ధతరము | వృద్ధము | వృద్ధతరము |
| 15 | వృద్ధము | వృద్ధతరము | వృద్ధతరము |
| 16 | వృద్ధతరము | వృద్ధము | వృద్ధము |
| 17 | వృద్ధము | వృద్ధతరము | వృద్ధము |
| 18 | వృద్ధము | వృద్ధము | వృద్ధతరము |
| 19 | వృద్ధము | వృద్ధము | వృద్ధము |
| 20 | వృద్ధము | వృద్ధతరము | వృద్ధతమము |
| 21 | వృద్ధము | వృద్ధతమము | వృద్ధతరము |
| 22 | వృద్ధతమము | వృద్ధము | వృద్ధతరము |
| 23 | వృద్ధతరము | వృద్ధము | వృద్ధతమము |
| 24 | వృద్ధతరము | వృద్ధతమము | వృద్ధము |
| 25 | వృద్ధతమము | వృద్ధతరము | వృద్ధము |
| 26 | క్షీణము | సమము | సమము |
| 27 | సమము | క్షీణము | సమము |
| 28 | సమము | సమము | క్షీణము |
| 29 | క్షీణము | క్షీణము | సమము |
| 30 | సమము | క్షీణము | క్షీణము |
| 31 | క్షీణము | సమము | క్షీణము |
| 32 | క్షీణము | క్షీణతరము | సమము |
| 33 | క్షీణతరము | క్షీణము | సమము |
| 34 | క్షీణము | సమము | క్షీణతరము |

| సంఖ్య. | వాతము. | పిత్తము. | కఫము. |
|---|---|---|---|
| 35 | క్షీణతరము | సమము | క్షీణము |
| 36 | సమము | క్షీణతరము | క్షీణము |
| 37 | సమము | క్షీణము | క్షీణతరము |
| 38 | క్షీణము | క్షీణతరము | క్షీణతరము |
| 39 | క్షీణతరము | క్షీణము | క్షీణతరము |
| 40 | క్షీణతరము; | క్షీణతరము | క్షీణము |
| 41 | క్షీణము | క్షీణము | క్షీణతరము |
| 42 | క్షీణతరము | క్షీణము | క్షీణము |
| 43 | క్షీణము | క్షీణతరము | క్షీణము |
| 44 | క్షీణము | క్షీణము | క్షీణము |
| 45 | క్షీణతమము | క్షీణతరము | క్షీణము |
| 46 | క్షీణము | క్షీణతమము | క్షీణతరము |
| 47 | క్షీణతమము | క్షీణము | క్షీణతరము |
| 48 | క్షీణతరము | క్షీణతమము | క్షీణము |
| 49 | క్షీణము | క్షీణతరము | క్షీణతమము |
| 50 | క్షీణతరము | క్షీణము | క్షీణతమము |
| 51 | వృద్ధము | సమము | క్షీణము |
| 52 | సమము | వృద్ధము | వృద్ధము |
| 53 | క్షీణము | సమము | వృద్ధము |
| 54 | సమము | క్షీణము | వృద్ధము |
| 55 | వృద్ధము | క్షీణము | సమము |
| 56 | క్షీణము | వృద్ధము | సమము |
| 57 | క్షీణము | వృద్ధము | వృద్ధము |
| 58 | వృద్ధము | క్షీణము | వృద్ధము |
| 59 | వృద్ధము | వృద్ధము | క్షీణము |
| 60 | క్షీణము | క్షీణము | వృద్ధము |
| 61 | క్షీణము | వృద్ధము | క్షీణము |
| 62 | వృద్ధము | క్షీణము | క్షీణము |
| 63 | సమము | సమము | సమము |



అను పూర్వోక్తవచనముచేత రసము నొకదానినుద్దేశించి చెప్పియుండుటవలనను,—

“ పంచవింశతిమిత్యేవం వృద్ధిః క్షీణైశ్చతావతః ”

అను పూర్వోక్తవచనముచేతను వృద్ధిక్షయ భేదములను తెలిసికొనవలయును. ఇటులనే రక్తమాంసాదుల సంసర్గముచేతను భేదములను తెలిసికొనవలయును. పైజెప్పిన ప్రకారము 63 భేదములతోఁగూడియుండు దోషములకు రసాదిసప్తధాతువులయొక్క సంసర్గమువలన 441 దోషభేదములుగలుగును. ఇవియునుగాక మలాదులయొక్క సంసర్గమును, క్షీణతరతమాది భేదములను చింతించినచో దోషములు సంఖ్యాతీతములుగనగును. కావున నీరసభేదములను, దోషభేదములను వైద్యుడు చక్కగా తెలిసికొనినయెడల వానికి రోగహేతువు, లక్షణము, చికిత్స వీనియందెపుడును భ్రమ గలుగనేరదు. మఱియు నీయర్థమే,—

“ యస్యాద్ద్రవ్యవికల్పజ్ఞ స్స్యాచ్చదోషవికల్పవిత్ । ననముహ్యేద్వికారాణాం హేతులింగోపశాన్తిషు ॥ ”

అను వచనముచేత చరకాచార్యుఁడుకూడా చెప్పియున్నాఁడు.

ద్వాదశాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు.

# త్రయోదశాధ్యాయము.

వికారమునుజెందియుండు దోషములకు శీఘ్రముగా చికిత్సచేయవలయునని పూర్వాధ్యాయమునందు చెప్పబడియుండుటచే నట్టి దోషములకు చికిత్సాక్రమమును తెలియపరచుటకై దోషోపక్రమణీయాధ్యాయము జెప్పబడుచున్నది.

## దోషోపక్రమణీయాధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతో దోషోపక్రమణీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ దోషభేదీయాధ్యాయానంతరము దోషములకుచికిత్స అవశ్యకంబగుటవలన నా దోషచికిత్సనెఱుంగుటకు హితకరమయిన దోషోపక్రమణీయాధ్యాయమును వివరించెదము.

### వాత - ప్రకోప చికిత్స.

శ్లో॥ వాతస్యోపక్రమఃస్నేహ స్స్వేదస్సంశోధనంమృదు ।
స్వాద్వమ్లలవణోష్ణాని భోజ్యాన్యభ్యంగమర్దనమ్ ॥ 1.
వేష్టనంత్రాసనంసేకో మద్యంపైష్టికగౌడికమ్ ।
స్నిగ్ధోష్ణావస్తయోవస్తి నియమస్సుఖశీలతా ॥ 2.
దీపనైఃపాచనైస్సిద్ధా స్స్నేహాశ్చానేకయోనయః ।
విశేషాన్మేధ్యపిశిత రసతైలానువాసనమ్ ॥ 3.

తా॥ స్నేహపానము, స్వేదకర్మ, మృదువైన సంశోధనౌషధసేవనము, మధురముగ, అమ్లముగ, లవణముగ, ఉష్ణముగనుండు భక్ష్యాదులను సేవించుట, అభ్యంగస్నానము, హస్తాదులచే శరీరమునుమర్దించుట, వస్త్రము మొదలగువానిచే శరీరమును



వేష్టనముచేయుట, భయపరచుట, దశమూలములయొక్క కషాయాదులచే సేకము, పైష్టికము, గౌడికము అను మద్యపానము, స్నిగ్ధముగ, ఉష్ణముగనుండు వస్తిక్రియలు, "ప్రాక్స్నేహ ఏకఃపంచాతః" అనివాతరోగచికిత్సయందు ఉత్తరత్రయథాక్రముగా జెప్పబడు 53 వస్తిక్రియానియమములు, సౌఖ్యముగనుండుట, దీపనపాచనకరద్రవ్యములచే సిద్ధముచేయబడిన నువ్వులు, మొరలి, అక్షోటము యీ మొదలగువానియొక్క స్నేహపానము ఇవి ప్రకోపించియుండు వాతమునకు చికిత్సలని తెలియవలయును. పుష్టికరమైన మాంసరసము, తైలము, అనువాసనము ఇవివాతమునకు విశేషమయిన చికిత్సలు. వాతమునకు స్నేహము ముఖ్యమయినదగుటచే నదితొలుత జెప్పబడినది. భయము, శోకము యీమొదలగునవి వాతప్రకోపమునకు హేతువని "క్రియాతియోగభీశోక" అనువచనముచే ఉత్తరత్ర జెప్పబోవుటవలన నిచటభయపరచుట వాతమునకు చికిత్సయని చెప్పినది యసంగతమని కొందరాక్షేపించెదరు. అయితే భయము వాతప్రకోపమునకు హేతువగనుండును. భయపరచుట మాత్రము వాతమునుశమింపజేసును. కాబట్టి వాతశాంత్యర్థము భయపరచుటయుక్తంబేను. అటులనే
"వాతోన్మాదేహర్షణశ్వాస త్రాసభయతాడనమ్"
అని ఉత్తరత్రజెప్పబడును. "స్నిగ్ధోష్ణావస్తయః" అని చెప్పినందుచేతనే రూక్షశీతలముగలవస్తి వాతచికిత్సయందు యుక్తమయినదికాదని తెలియవలయును.

### పిత్త - ప్రకోప చికిత్స.

శ్లో॥ పిత్తస్యసర్పిషఃపానం స్వాదుశీతై ర్విరేచనమ్ । స్వాదుతిక్త
కషాయాణి భోజనాన్యౌషధానిచ ॥ 4 ॥ సుగంధశీతహృ
ద్యానాం గంధానాముపసేవనమ్ । కంఠేగుణానాంహారాణాం
మణీనామురసాధృతిః ॥ 5 ॥ కర్పూరచందనోశీరై రనులేపః
క్షణేక్షణే । ప్రదోషశ్చంద్రమాస్సౌధం హారిగీతంహిమో
నిలః ॥ 6 ॥ అయంత్రణసుఖంమిత్రం పుత్రస్సందిగ్ధముగ్ధ
వాక్ । ఛందానువర్తినోదారాః ప్రియాశ్శీలవిభూషితాః ॥
7 ॥ శీతాంబుధారాగర్భాణి గృహాణ్యుద్యానదీర్ఘికాః । సుతీ
ర్థవిపులస్వచ్ఛ సలిలాశయసైకతే ॥ 8 ॥ సాంభోజజలతీరాంతే
కాయమానేద్రుమాకులే । సౌమ్యాభావాఃపయస్సర్పి ర్విరే
కశ్చవిశేషతః ॥ 9.

తా॥ ఘృతపానము, మధురముగ, శీతలముగనుండువస్తువులచే విరేచనము, మధురముగ, తిక్తముగ, కషాయముగనుండు భోజనములు, ఔషధములు, సువాసనగలదిగ, శీతలముగ, హృదయమునకు హితకరముగనుండు గంధముల నాఘ్రాణించుట, ముక్తాహారములను కంఠమునందుధరించుట, మరకతచంద్రకాంతపద్మరాగాది మణులను ఱొమ్మునందు ధరించుట, పచ్చకర్పూరము, చందనము, వట్టివేరు వీటినిపలుమారు మేనవలదికొనుట, సాయంకాలము, గారచే తెల్లగనుండు గృహమునందు వసించుట, చంద్రుడు, మనోహరమయిన సంగీతసేవనము, శీతలమయిన వాతసేవనము, యథేచ్ఛగనుండు మిత్రసేవనము, అస్పష్టమయిన వాక్కుగల పుత్రులయొక్క సంసర్గాదులు, ఇష్టానుసారులుగ, మిగులప్రేమగలవారుగ, మంచిస్వభావముగలవారుగనుండు పత్నులయొక్క సంయోగాదులు, శీతలముగుజలప్రవాహముగల గృహములు, ఉద్యానవనము, నడబావి వీనియందువసించుట ఇవి ప్రకోపించియుండు పిత్తమునకు చికిత్సలనితెలియవలయును. మంచిదిగను స్వచ్ఛముగనుండు జలముల తటాకమధ్యమునందలి ఇసుకదిబ్బ యందుండునదియును, గట్టుయొక్క అంచులయందు తామరపుష్పములు, నానావిధవృక్షములు వీనితోగూడియుండునదియునగు పందిలిలోవాసము, సౌమ్యమయిన పదార్థసేవనము ఇవి ప్రకోపించియుండు పిత్తమును శమింపజేసును. ఘృతము, విరేకము, అనునీ 2-ను పిత్తమునకు విశేషమయిన చికిత్సలని తెలియవలయును.

## శ్లేష్మ - ప్రకోప చికిత్స.

శ్లో॥ శ్లేష్మణోవిధినాయుక్తం తీక్ష్ణంవమనరేచనమ్ ।
అన్నంరూక్షాల్పతీక్ష్ణోష్ణం కటుతిక్తకషాయకమ్ ॥ 10.
దీర్ఘకాలస్థితంమద్యం రతిప్రీతిప్రజాగరః ।
అనేకరూపోవ్యాయామశ్చింతారూక్షంవిమర్దనమ్ ॥ 11.
విశేషాద్వమనంయూషః క్షౌద్రంమేదోఘ్నమౌషధమ్ ।
ధూమోపవాసగండూషా నిస్సుఖత్వంసుఖాయచ ॥ 12.

తా॥ శాస్త్రప్రకారము ప్రయోగించబడిన తీక్ష్ణమయిన వమనవిరేచనములు, రూక్షగ, అల్పముగ, తీక్ష్ణముగ, ఉష్ణముగ, కటువుగ, తిక్తముగ, కషాయముగనుండు అన్నభక్షణము, మిక్కుటముగ ప్రాతబడినమద్యపానము, సురత సౌఖ్యము, విశేషముగా జాగరణము, ధనురాకర్షణము మొదలగునానావిధమగు వ్యాయామము, చింత, రూక్ష, శరీరమర్దనము, ఇవి ప్రకోపమును జెందియుండు శ్లేష్మమునకు చికిత్సలని



తెలియవలయును. వమనము, యూషము, మాక్షికము, మేదోహరమయిన యౌషధములు, ధూమపానము, ఉపవాసము, గండూషము, అసౌఖ్యము, ఇవి కఫమునకు విశేషమయిన చికిత్సలు. వీనిచే కఫముశమించి సుఖముగలుగును.

## సంసర్గ - సన్నిపాత చికిత్స.

శ్లో॥ ఉపక్రమఃపృథగ్దోషాణా యోయముద్దిశ్యకీర్తితః ।
సంసర్గసన్నిపాతేషు తంయథాస్వంవికల్పయేత్ ॥ 13.

తా॥ ప్రకోపమునుజెందియుండు వాతాదులవిషయమై ప్రత్యేకముగాజెప్పియుండు చికిత్సనే సంసర్గ సన్నిపాతములయందు యథాక్రమముగా (అనగా ప్రకుపితమగు వాయాదోషాదులను నిరూపించి తదనుసారముగా) చేయవలయును. అదియెట్లన్న:—వాతపిత్తసంసర్గమునందు వాతపిత్తచికిత్సలను, వాతకఫసంసర్గమునందు వాతకఫచికిత్సలను మిశ్రముగాచేయవలయునని భావము. ఇటులనే సన్నిపాతమునందుకూడా ఆయాదోషములను నిరూపించి తదనుసారముగా చికిత్సనుచేయవలయును.

## వాతపిత్త - సంసర్గాదిచికిత్సా - క్రమము.

శ్లో॥ గ్రైష్మఃప్రాయోమరుత్పిత్తే వాసంతఃకఫమారుతే ।
మరుతోయోగవాహిత్వాత్కఫపిత్తేతుశారదః ॥ 14.

తా॥ వాతపిత్త సంసర్గమునందు లవణరసాదులనువర్జించి మధురముగనుండు అన్నమును భుజించవలయునని గ్రీష్మఋతుచర్యయందు,—
"అతోఽస్మిన్పటుకట్వమ్ల వ్యాయామార్కకరాంస్త్యజేత్ । భజేన్మధురమేవాన్నం"
అనువచనముచే జెప్పబడియుండుక్రమములను తలుచుగా నాచరించవలయును. కఫవాతసంసర్గమునందు వాతముయోగవాహిగనుండుటచే,—
"తీక్ష్ణైర్వమనవస్యాద్యైః"
అనువచనముచే వసంతఋతుచర్యయందు జెప్పబడియుండుక్రమములను తలుచుగా నాచరించవలయును. కఫపిత్తసంసర్గమునందు శరదృతుచర్యయందు చెప్పబడియుండుక్రమముల నాచరించవలయును. సన్నిపాతమునందు,—
"భజేత్ సాధారణంసర్వం"
అనువచనముచే వర్షర్తుచర్యయందు చెప్పబడియుండు క్రమమును తలుచుగానాచరించవలయును.

## వాతాది - ప్రకోపచికిత్సా కాలము.

శ్లో॥ చయఏవ జయేద్దోషం కుపితంత్వవిరోధయన్ ।
సర్వకోపేబలీయాంసం శేషదోషావిరోధతః ॥ 15.

తా॥ ప్రకోపమును జెందియుండుదోషములకు విరోధముగలుగకుండా వాతాది దోషములను చయకాలమునందే శమింపజేయవలయును. సర్వదోషములు ప్రకోపమును జెందియుండునపుడు వానిలో మిగుల బలిష్ఠముగనుండు దోషమును యితరమైన 2 దోషములకు విరోధముగలుగకుండా శమింపజేయవలయును.

## శ్రేష్ఠ ప్రయోగము.

శ్లో॥ ప్రయోగశ్శమయేద్వ్యాధిం యోన్యమన్యముదీరయేత్ ।
నాసౌవిశుద్ధశ్శుద్ధస్తు శమయేద్యోనకోపయేత్ ॥ 16.

తా॥ ఒకవ్యాధిని శమింపజేసి యితరమైనవ్యాధిని ప్రకోపింపజేసెడి ప్రయోగము శ్రేష్ఠమయినదికాదు. అయితే నొకవ్యాధిని శమింపజేసి యితరమయిన వ్యాధిని ప్రకోపింపజేయకుండెడి ప్రయోగమే శ్రేష్ఠమయినది. కాబట్టి యితరమయినవ్యాధికి విరోధముగలుగకుండా ప్రకృతవ్యాధికి చికిత్సచేయవలయును.

## వాతాదులు - శాఖాస్థిసంధులను - జెందు క్రమము.

శ్లో॥ వ్యాయామాదూష్మణస్తైక్ష్ణ్యా దహితాచరణాదపి ।
కోష్ఠాచ్ఛాఖాస్థిమర్మాణి ద్రుతత్వాన్మారుతస్యచ ॥ 17.
దోషాయాంతి

తా॥ వ్యాయామము, ఉష్ణము, తైక్ష్ణ్యము, అహితసేవనము, యీ కారణములవలనను, వాతము అతివేగముగ సంచరించుచుండుటవలనను వాతాదిదోషములు కోష్ఠములోనుండి (అనగా ఉదరమధ్యములోనుండి) శాఖలను (అనగా హస్తపాదములను) అస్థులను మర్మములను జెందును. అదియెట్లనగా:—వ్యాయామముచే నధికముగా శ్రమజెందియుండువానికి వాతము ఊర్ధ్వప్రదేశమును జెంది వ్యాయామజనితక్షోభశ్రమోష్ణాదులవలన చంచలమయియుండుదోషమును స్వస్థానములోనుండి జారునటులజేసి పైజెప్పిన శాఖాదులలో తోసివేయును. ఇటులనే అగ్ని, ఎండ యీ మొదలగువాని యొక్క ఉష్ణముచేతను, తైక్ష్ణ్యముచేతను దోషములుద్రవించి స్రోతోముఖములు తెరవబడియుండునపుడు పైజెప్పిన శాఖాస్థిమర్మములను జెందును. అటులనే అహితసేవనమువలన వాతాదిదోషములు స్వప్రమాణమునకంటె వృద్ధిజెంది కోష్ఠమును పూరింపజేసి, వర్షాకాలమునగలిగిన జలప్రవాహమునిమ్నోన్నతప్రదేశములను జెందునటులనే, శాఖాస్థిమర్మములను జెందును.



## శాఖాదులలోనుండి - దోషములు కోష్ఠమును జెందుట.

శ్లో॥ తథాతేభ్యః స్రోతోముఖవిశోధనాత్ ।
వృద్ధ్యాభిష్యందనాత్పాకాత్కోష్ఠంవాయోశ్చనిగ్రహాత్ ॥ 18.

తా॥ స్రోతోముఖములు తెరవబడియుండుటవలనను, వృద్ధి (అనగా స్వప్రమాణాధిక్యము) క్షీరము మొదలగు అభిష్యంది పదార్థభోజనము, పాకము, వాతప్రతిబంధము వీనివలనను, వాతాదిదోషములు శాఖాదులలోనుండి కోష్ఠమును జెందును. అదియెట్లనగా;—వృద్ధిజెందియుండు దోషములు తమతమ స్రోతస్సులను పూరింపజేసి, మరల కోష్ఠమును జెందును. మఱియు నాదోషములే పాకమువలననే స్థలమునందునిలువక కోష్ఠమునే జెందును.

## కోష్ఠాదిగత - దోషరోగోత్పాదన క్రమము.

శ్లో॥ తత్రస్థాశ్చవిళంబేరన్ భూయోహేతుప్రతీక్షిణః ।
తేకాలాదిబలంలబ్ధ్వా కుప్యంత్యన్యాశ్రయేష్వపి ॥ 19.

తా॥ ఆ కోష్ఠమునందుండుదోషములు మరల హేతువుల నిరీక్షింపుచుండుటవలన శీఘ్రములోనే రోగమును గలుగజేయనేరవు. (అనగా వృద్ధిజెందుచుండు దోషములు కోష్ఠమునుగాని లేక శాఖాదులనుగాని లేక వేరేమార్గమునుగాని, జెందియుండునపుడు వానిశక్తి తగ్గియుండుటవలన రోగములను గలుగచేయుటకు సమర్థములుకానేరవని భావము.) అయితే కోష్ఠము నాశ్రయించియుండు యీ దోషములు సమానమైన గుణముగల కాలము, దేశము, దూష్యము, ప్రకృతి, అపథ్యము వీనిచే ప్రబలమును జెంది యితరస్థానములయందు (అనగా కోష్ఠము నాశ్రయించియుండు దోషములు శాఖాదిమర్మస్థానములయందును, శాఖార్మాదుల నాశ్రయించియుండు దోషములు కోష్ఠమునందును) వికారమునుగలుగజేసును. మఱియు స్వస్థానమునందుండుదోషములు మాత్రమే ప్రకోపమును జెందునసెడి నియమములేదు. కాబట్టి యితరస్థానములయందుండుదోషములుకూడా ప్రకోపమును జెందునని తెలియవలయును.

## అన్యస్థాన - దోషచికిత్సా క్రమము.

శ్లో॥ తత్రాన్యస్థానసంస్థేషు తదీయామబలేషుచ ।
కుర్యాచ్చికిత్సాంస్వామేవ బలేనాన్యాభిభావిషు ॥ 20.
ఆగంతుంశమయేద్దోషంస్థానినంప్రతికృత్యవా ।

తా॥ ఆ వాతాదిదోషములు అన్యస్థానమునందుండునపుడు దుర్బలముగనుండిన యెడలమాత్రమే ఆ అన్యస్థానదోషమునకై జెప్పియుండు చికిత్సలను చేయవలయును. అన్యస్థానమునందుండు దోషములు తమశక్తిచే అన్యస్థానమునందలి దోషములను తిరస్కరింపుచుండగా స్వకీయమయిన చికిత్సనే చేయవలయును. స్వస్థానమునందుండు దోషము ఆగంతుకదోషములకు చికిత్స చేయుటవలన నెవ్విధవికారమును గలుగజేయకుండునటుల నా స్వస్థానదోషమునకు చికిత్సజేసి పిదప స్వస్థానదోషమునకై చెప్పియుండు ప్రకారము బలిష్ఠమైన ఆగంతుకదోషమునకు తొలుత చికిత్స చేయవలయును. అన్యస్థానమునందుండు ఆగంతుకదోషములు బలిష్ఠముగనుండునపుడు ఆ స్థానదోషమునకై చెప్పియుండు చికిత్సను చేయుటయే గాక ఆగంతుకదోషచికిత్సను కూడా చేయవలయును. లేక నాస్థానదోషము బలవత్తరమయిన ఆగంతుకదోషమువలన తిరస్కరించబడినచో దుర్బలముగనగును. కావున నాస్థానదోషమునకు చికిత్స చేయకనే ఆగంతుకదోషమునకే చికిత్సజేయందగును.

తిర్యగ్గత - దోష - చికిత్సాక్రమము.

శ్లో॥ ప్రాయస్తిర్యగ్గతా దోషాః క్లేశయంత్యాతురాంశ్చిరమ్ ॥ 21.
కుర్యాన్న తేషు త్వరయా దేహాగ్నిబలవిత్క్రియామ్ ।
శమయేత్తాన్ప్రయోగేణ సుఖం వా కోష్ఠమానయేత్ ॥ 22.
జ్ఞాత్వా కోష్ఠప్రపన్నాంశ్చ యథాసన్నం వినిర్హరేత్ ।

తా॥ తిర్యగ్గతమైనదోషములు రోగులను చిరకాలమువరకు తఱుచుగా పీడించుచుండును. మఱియు నాతిర్యగ్గతదోషములలో దేహబలము, అగ్నిబలము వీనినెఱిగియుండు వైద్యుడు శీఘ్రముగా చికిత్సజేయంజనదు. మఱియు నాతిర్యగ్గతమయిన దోషములను వైద్యశాస్త్రములో జెప్పియుండు ప్రయోగములవలన శమనముజేయవలయును. లేక దేహమునకు పీడగలుగకుండునటుల క్రమముగా (అనగా పూర్వముజెప్పియుండు వృద్ధ్యభిష్యందనాది క్రమమువలన) కోష్ఠమును జెందునటులనైనా జేయవలయును. దోషములు కోష్ఠమును జెందియుండుటను బాగుగా తెలిసికొని ఆయాదోషములకు సమీపమునందుండు మార్గములవలన (అనగా గుదము, లేక ముఖము, లేక ఘ్రాణము వీనివలన) వానిని వెలిపడునటుల జేయవలయును. (అనగా వమనవిరేచనాదులవలన బైలుపరచవలయునని భావము.)

సామ - నిరామ - మల లక్షణము.

శ్లో॥ స్రోతోరోధబలభ్రంశ గౌరవానిలమూఢతాః ॥ 23.



ఆలస్యాపక్తినిష్ఠీవ మలసంగారుచిక్లమాః * ।
లింగం మలానాం సామానాం నిరామాణాం విపర్యయః ॥ 24.

తా॥ స్రోతఃప్రతిబంధము, బలహాని, గురుత్వము, వాతము బాగుగా సంచరించకుండుట, తంద్ర, అన్నాదులు జీర్ణముకాకుండుట, కారియుమియుట, మలమూత్రాదులు బైలువెడలకుంట, అన్నమునందిచ్ఛ గలుగకుండుట, గ్లాని, ఇవి ఆమముతోగూడియుండు మలముయొక్క లక్షణములని తెలియవలయును. పైజెప్పిన స్రోతఃప్రతిబంధాదులు లేకుండుటయే ఆమరహితమలలక్షణము.

ఆమ స్వరూపము.

శ్లో॥ ఊష్మణోల్పబలత్వేన ధాతుమాద్యమపాచితమ్ ।
దుష్టమామాశయగతం రసమామం ప్రచక్షతే ॥ 25.

తా॥ జాఠరాగ్నియొక్క దౌర్బల్యమువలన పాకమునుజెందకను, ఆమాశయగతముగను, వాతాదులచే దుష్టముగనునుండు రసమను పేరుగల మొదటిధాతువును ఆమమని ఆచార్యులువచించెదరు.

మతాంతరమునందు - ఆమోత్పత్తి క్రమము.

శ్లో॥ అన్యేదోషేభ్య ఏవాతి దుష్టేభ్యోన్యోన్యమూర్ఛనాత్ ।
కోద్రవేభ్యో విషస్యేవ వదంత్యామస్య సంభవమ్ ॥ 26.

తా॥ ఆళ్ళలోనుండి విషము ఉత్పత్తియగునటులనే పరస్పర మిశ్రీభావమును జెందియుండు అతిదుష్టమైన వాతాదిదోషములలోనుండి ఆమముజనించునని యితర ఆచార్యులు వచించెదరు.

---

* విణ్మూత్రనఖదంతత్వక్చక్షుషాం పీతతా భవేత్ । రక్తత్వమతికృష్ణత్వం పృష్ఠాస్థికటిసంధిరుక్ । శిరోరుగ్జాయతే తీవ్రా నిద్రా విరసతా ముఖే । క్వచిచ్ఛ్వయథుర్గాత్రే జ్వరోతీసారహర్షణమ్ ।
మలము, మూత్రము, నఖములు, దంతములు, చర్మము, నేత్రములు వీనియందు పసుపువర్ణము, లేక రక్తవర్ణము, లేక మిక్కుటముగ కృష్ణవర్ణము, వీపు, అస్థులు, కటిప్రదేశము, సంధులు వీటియందుశూల, శిరమునందు మిక్కుటముగశూల, నిద్ర, నోటియందు విరసత్వము, కొన్ని అంగములయందు వాపు, జ్వరము, అతిసారము ఇవి యన్నియు ఆమముతోగూడియుండుమలములకు లక్షణమని కొన్నిగ్రంథములయం దధికపాఠము గన్పట్టుచున్నది.

రోగములకు - ఆమ సంజ్ఞ.

శ్లో॥ ఆమేన తేనసంపృక్తా దోషాదూష్యాశ్చదూషితాః ।
సామాఇత్యుపదిశ్యంతే యేచరోగాస్తదుద్భవాః ॥ 27.

తా॥ పైజెప్పిన ఆమముతోగూడియుండునట్టియు, వాతాదులచే దూషింపబడినవియునైన వాతాదిదోషములును, రసాదిదూష్యములును వైద్యతంత్రమునందా యాస్థలములయందు సామమని జెప్పబడును. మఱియు నటులనే ఆమముతోగూడియుండు వాతాదిదోషములవలన జనించిన జ్వరాదిరోగములుకూడా:—

"అజీర్ణ ఇవశూలఘ్నం సామేతీవ్రరుజిజ్వరే"

అని యీతంత్రమునందు:—

"సామేజ్వరే"

అని చెప్పియుండునటులనే వైద్యతంత్రమునందా యాస్థలములయందు సామమని జెప్పబడును.

"ద్రవంగుర్వనేకవర్ణం హేతుస్సర్వరోగాణాంస్నిగ్ధం పిచ్ఛిలమామంతంతువదనుబద్ధంశూలదుర్గంధి"

అనగా ఆమము ద్రవముగ గురువుగ నానావర్ణములుగలదిగ సర్వరోగములకు హేతువుగ స్నిగ్ధముగ పిచ్ఛిలముగ తంతువులతోగూడినదిగ అనేకోపద్రవకారిగ దుర్గంధయుక్తముగనుండునని కొందఱాచార్యులు ఆమలక్షణమును చెప్పుచున్నారు.—

"వాయురామాన్వయస్సార్ద్రి రాధ్మానకృదసంచరః।దుర్గంధమసితంపిత్తం కటుకేంబలహాంగురు । ఆవిలస్తంతుమాంస్త్యానః ప్రలేపీపిచ్ఛిలఃకఫః । విపర్యయేతుపక్వత్వం తథాతామ్రంసమేచకమ్ । పీతంచపిత్తమచ్ఛంచ శ్లేష్మాచ్ఛఃపిండితోథవా । విశదశ్చసఫేనశ్చ ధవలోమధురోరసః ॥"

ఆమముతోగూడియుండు వాతము ఉపద్రవకారిగ, కడుపునుబ్బించునదిగ, సంచారరహితముగనుండును. ఆమముతోగూడియుండు పిత్తము దుర్గంధయుక్తముగ, నల్లగ, కటురసముగలదిగ, బలమును హరింపజేయునదిగ, గురువుగనుండును. ఆమముతోగూడియుండు కఫము కలకబారినదిగ, తంతువులతోగూడినదిగ, దట్టముగ, ప్రలేపకారిగ (అనగా అంటుకొనునదిగ) పిచ్ఛిలముగనుండును. ఆమరహితముగనుండువాతము పక్వముగ ఎఱ్ఱగ కొంచెమునల్లగనుండును. ఆమరహితముగనుండు పిత్తము స్వచ్ఛముగ పీతవర్ణముగలదిగనుండును. ఆమరహితముగనుండు శ్లేష్మము స్వచ్ఛముగ ఉంటకట్టినదిగ



శుద్ధముగ నురుగుతోగూడినదిగ తెల్లగ మధురముగనుండును అని ఆమముతో గూడియుండు వాతాదులకు ప్రత్యేకముగా లక్షణములు అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నవి.—

"వాయుస్సామోవిబంధాగ్ని శ్వాసస్తంభాంత్రకూజనైః । వేదనాశోఫనిస్తోదైః క్రమశోంగానిపీడయేత్ । విచరేద్యుగపచ్చాపి గృహ్ణాతికుపితోభృశమ్ । స్నేహాద్యైర్వృద్ధిమాయాతి మేఘసూర్యోదయేనిశి । నిరామోవిశదోరూక్షో నిర్విబంధోల్పవేదనః । విపరీతగుణైశ్శాంతిం స్నిగ్ధైర్యాతివిశేషతః । దుర్గంధంహారితంశ్యావం పిత్తమమ్లంఘనంగురు । అమ్లికాకంఠహృద్దాహకోష్ణమామంవినిర్దిశేత్ । ఆతామ్రపీతమత్యుష్ణం రసేకటుకమస్థిరమ్ । పక్వంవిగంధివిజ్ఞేయం రుచిపక్తిబలప్రదమ్ । అవిలస్తంభనస్త్యానః కంఠదేశేవతిష్ఠతే । సామోబలాసోదుర్గంధీ క్షుదుద్గారవిఘాతకృత్ । ఫేనవాన్పిండితఃపాండుర్నిస్సారోగంధఏవచ । పక్వస్సఏవవిజ్ఞేయః ఛేదవాన్వక్త్రశుద్ధిదః ॥"

ఆమముతోగూడియుండు వాతము మలబంధమును, జాఠరాగ్ని, శ్వాసము వీని స్తంభనమును, ప్రేగులయందుకూతను, శరీరమునందుశూల, వాపు, పోట్లు యీ మొదలగు నుపద్రవములను గలుగజేసును. మఱియు నావాతము ప్రకోపించిన యెడల విశేషముగా నేక కాలమునందు సంచరించుచు మేఘోదయము, సూర్యోదయము, రాత్రి వీనియందు స్నేహాదులచే వృద్ధిజెందును. ఆమ సంబంధములేనివాతము విశదముగ, రూక్షగ, మలబంధమునుచేయనదిగ, స్వల్పవేదనతోగూడినదిగ నుండును. మఱియు నదివిపరీతమైన గుణములచేతను, స్నిగ్ధమైనవస్తువులచేతను మిక్కుటముగ శాంతినిజెందును. ఆమముతో గూడియుండు పిత్తము దుర్గంధముగ, హారిత, శ్యామవర్ణములుగలదిగ, ఆమ్లరసయుక్తముగ, దట్టముగ, గురువుగ, పులితేనుపులతోగూడినదిగ, కంఠము, హృదయము వీనియందుమంటతోగూడినదిగ, స్వల్పోష్ణముగలదిగనుండును. ఆమసంబంధములేకుండా పక్వముగనుండు పిత్తము కొంచెము రక్తవర్ణము, పసుపువర్ణముగలదిగ, అత్యుష్ణముగ, కటురసముగలదిగ, గంధరహితముగనుండుటయేగాక రుచి, పాకము, బలము వీనిని గలుగజేసును. ఆమముతోగూడియుండు శ్లేష్మము కలకబారినదిగ, స్తంభనకారిగ, మిక్కుటముగ కంఠప్రదేశమునందువ్యాపించునదిగ, దుర్గంధముగలదిగనుండును. ఆకలిని తేనుపులను అడ్డగించును. ఆమసంబంధములేకుండాపక్వముగనుండు

ఆశ్లేష్మము నులుగు క్లేదను తెలుపువర్ణము వీనితోగూడినదిగ, ఉంటకట్టియుండునదిగ పారము లేనిదిగ, గంధరహితముగనుండును నోటియందు శుద్ధిని గలుగజేసును. అని అష్టాంగసంహితయందు ఆమముతోగూడియుండు వాతాదిదోషములకు లక్షణము జెప్పబడియున్నది.

కొన్ని సామరోగములయందు - వమనాది నిషేధము.

శ్లో॥ సర్వదేహప్రవిసృతాన్ సామాన్ దోషాన్న నిర్హరేత్ ।
లీనాన్ ధాతుష్వనుత్క్లిష్టాన్ ఫలాదామాద్రసానివ ॥ 28.
ఆశ్రయస్య హి నాశాయ తే స్యుర్దుర్నిర్హరత్వతః ।

తా॥ సర్వదేహమునందు వ్యాపించినదిగను, రసాదిధాతువులయందు లీనమైనదిగను, స్వస్థానములోనుండి చలించకుండునదిగను, ఆమముతోగూడినదిగనుండు వాతాదిదోషములను శుద్ధిజేయుట కశక్యంబగుటచే వానిని వమనాదులచే శుద్ధిచేయంజనను. ఏలననగా;—అపక్వమయిన మామిడి మొదలగు ఫలములలోనుండి తీయబడిన రసము ఆశ్రయమయిన ఫలమునకు నాశనము గలుగచేయునటులనే వమనాదులచే శుద్ధిజేయబడిన అ వాతాదిదోషములు ఆశ్రయమయిన శరీరమునకు నాశమును గలుగజేసును. భోజనానంతరము వచ్చెడిజ్వరమునందును, నూతనమయిన అతిసారమునందును వమనాదులచే శుద్ధిజేయునటులనే ఆమముతోగూడియుండు వాతాదిదోషములు సర్వశరీరమునందు వ్యాపించుటకుమునుపే శాస్త్రోక్తప్రకారము వమనాదులచే వానిని శుద్ధిజేయుటకు గ్రంథకర్తచే ననుజ్ఞ యివ్వబడుచున్నది.

సర్వశరీరగత - సామరోగ - చికిత్సా క్రమము.

శ్లో॥ పాచనైర్దీపనైః స్నేహైస్తాన్ స్వేదైశ్చ పరిష్కృతాన్ ॥ 29.
శోధయేచ్ఛోధనైః కాలే యథాసన్నం యథాబలమ్ ।

తా॥ జ్వరాద్యధ్యాయములయందు జెప్పబడునట్టియు, అగ్నిదీపనకారియు, పాచనకారియునైన స్నేహస్వేదములచే సంస్కారము చేయబడిన ఆమయుక్త వాతాదిదోషములను యథాసన్నముగను (అనగా ఆయాదోషములకు సమీపమునందుండు మార్గములవలనను) బలానుసారముగను (అనగా రోగియొక్క ఉత్తమ, లేక మధ్యమ, లేక అధమమయిన బలానుగుణ్యముగను) మృదువుగ లేక మధ్యమముగ లేక తీక్ష్ణముగనుండు శోధనౌషధములచే శాస్త్రమునందు చెప్పియుండు కాలమునందు శోధించవలయును.



శోధన - ద్రవ్యోపయోగ మార్గము.

శ్లో॥ హంత్యాశు యుక్తం వక్త్రేణ ద్రవ్యమామాశయాన్ మలాన్ ॥ 30.
ఘ్రాణేన చోర్ధ్వజత్రూత్థాన్ పక్వాధానాద్గుదేన చ ।

తా॥ నోటిమూలముగా పానము చేయబడిన శోధనద్రవ్యము ఆమాశయములోనుండు మలమును శీఘ్రముగ హరింపజేసును. నాసికమువలన పానము చేయబడిన శోధనద్రవ్యము మెడకొంకులకు పైభాగమునందుండు మలములను శీఘ్రముగ హరింపజేసును. గుదమార్గముగ ప్రయోగించబడిన శోధనద్రవ్యము పక్వాశయమునందుండు మలములను శీఘ్రముగ హరింపజేసును.

ఆమధారణ నిషేధము.

శ్లో॥ ఉత్క్లిష్టానధ ఊర్ధ్వం వా న చామాన్ వహతః స్వయమ్ ॥ 31.
ధారయేదౌషధైర్దోషాన్ విధృతాస్తే హి రోగదాః ।
ప్రవృత్తాన్ ప్రాగతో దోషానుపేక్షేత హితాశినః ॥ 32.
విబద్ధాన్ పాచనైస్తైస్తైః పాచయేన్నిర్హరేత వా ।

తా॥ స్వస్థానములోనుండిచలించి అధోమార్గమువలనకాని, ఊర్ధ్వమార్గమువలనగాని ప్రయత్నము లేకనే స్వయముగ వెలిపడునట్టి ఆమదోషములను స్తంభనౌషధములచే ధరింపంజనదు. ధరించినయెడల జ్వరాదిరోగములను గలుగజేసును. కాబట్టి బయలువెడలునట్టిదోషములను తొలుత నుపేక్షించవలయును. (అనగా ఔషధాదులచే ధరింపజనదని భావము.) కొంచెము బైలువెడలి శేషించియుండుదోషములను శాస్త్రమునందు జెప్పియుండు ఆయా పాచనౌషధములచే జీర్ణంబగునటులగాని లేక శోధనౌషధంబులచే వెలిపడునటులగాని జేయవలయును.

వాతాదిదోష - శోధన కాలము.

శ్లో॥ శ్రావణే కార్తికే చైత్రే మాసి సాధారణే క్రమాత్ ॥ 33.
గ్రీష్మవర్షాహిమచితాన్ వాయ్వాదీనాశు నిర్హరేత్ ।

తా॥ గ్రీష్మకాలమునందు వృద్ధిజెందియుండు వాతమును శ్రావణ మాసమునందును, వర్షాకాలమునందు వృద్ధిజెందియుండు పిత్తమును శరత్కాలమునందును, హేమంత శిశిర కాలములయందు వృద్ధిజెందియుండు కఫమును వసంతకాలమునందును యథాక్రమముగ శుద్ధిజేయవలయును. వృద్ధిజెందినదోషములను యథాక్రమముగ శుద్ధిజేయుటకివియ సాధారణమైనకాలములు. కాబట్టి అట్టి దోషముల నీకాలములయందు

శుద్ధిజేయుట యుక్తంబు. ఈయర్థమే,—

"త్రయస్సాధారణాస్తేషా మంతరే ప్రావృడాదయః। ప్రావృట్ శుక్రనభౌ తత్ర శరదూర్జ సహౌస్మృతౌ। తపస్యోమధుమాసశ్చ వసంతశ్శోధనం ప్రతి। ఏతానృతూన్వికల్ప్యైవం దద్యాత్సంశోధనంభిషక్॥"

అను వచనముచే అష్టాంగసంహితయందును చెప్పబడియున్నది.

### గ్రీష్మాదులయందు - శోధన నిషేధము.

శ్లో॥ అత్యుష్ణవర్షశీతాహి గ్రీష్మవర్షాహిమాగమాః॥ 34.
సంధౌసాధారణేతేషాం దుష్టాన్దోషాన్విశోధయేత్।

తా॥ గ్రీష్మకాలము, వర్షాకాలము, హేమంతశిశిరకాలములు ఇవియథాక్రమముగ అధికమయినఉష్ణము, వర్షము శీతముగలవై యుండును. కాబట్టి ఆ గ్రీష్మాది కాలములయొక్క సాధారణమయినసంధిలో (అనగా శీత, ఉష్ణ, వర్షములు సమముగ నుండుకాలములో) వికారమును జెందియుండు వాతాదిదోషములను శోధనౌషధములచే బయలుపరచవలయును. గ్రీష్మకాలములో ప్రాణులయొక్క శరీరము ఆదానకాలముచే మిగులవాడి అతిక్రూరమయిన సూర్యకిరణములచే తపించబడి దప్పి, క్లమములచే మిగుల వ్యాకులమయి మిక్కుటముగ ద్రవించినదోషములతోగూడి మిగుల శిథిలముగ నుండుటవలన గ్రీష్మాదికాలములు శోధనమునకు కాలములుకానేరవు. మఱియును గ్రీష్మకాలములో నౌషధముకూడా అతితీక్ష్ణముగనుండు సూర్యకిరణసంతాపమువలన అత్యుష్ణముగ, అతి తీక్ష్ణముగనగును. కాబట్టి ఆగ్రీష్మకాలమునందుపయోగించబడిన యౌషధము అతియోగముగనగును. వర్షాకాలమునందు సర్వప్రదేశము అధికమయిన మేఘములచే వ్యాప్తంబగుటవలన ప్రపంచములో జాఠరాగ్ని మిగులదుర్బలముగనగును. అటులనే శరీరముకూడా ఆదానకాలమువలన మిగులదుర్బలముగనగును. మఱియు నోషధులుకూడా మేఘజలముచే తడుపబడిన మూలములుగలవియగుటంజేసి అల్పవీర్యముగలవిగనగును. భూమియొక్క ఉష్ణసంబంధమువలన నోషధులు విదగ్ధావస్థను జెందియుండును. కాబట్టి ఆట్టికాలమునం దుపయోగించబడు నౌషధములు అయోగముగనగును. శీతకాలములో శైత్యాధిక్యముచే జెరుపబడిన శరీరము వాతాధిక్యముతోడను, దోషాధిక్యముతోడను, అధికమైన గురుత్వముతోడను గూడుకొనియుండును. కావున నట్టికాలమునందు శోధనార్థముపయోగించబడిన అత్యుష్ణమయిన యౌషధము కూడా మంచుచేజెరచబడి అల్పవీర్యముగలదిగనై అయోగముగనగును. కాబట్టి గ్రీష్మవర్ష హేమంత శిశిరకాలములు స్వస్థశరీరునికి శోధనకాలము కానేరదనుట యుక్తంబేను.



### రోగాధిక్యమునందు - శోధన కాలము.

శ్లో॥ స్వస్థవృత్తమభిప్రేత్య వ్యాధౌవ్యాధివశేనతు॥ 35.
కృత్వాశీతోష్ణవృష్టీనాం ప్రతీకారంయథాయథమ్।
ప్రయోజయేత్క్రియాం ప్రాప్తాం క్రియాకాలంనహాపయేత్॥

తా॥ పైజెప్పబడిన శోధనకాలములన్నియు స్వస్థశరీరునిగురించినవని తెలియవలయును. వ్యాధిఅధికముగనుండినచో నాయావ్యాధిననుసరించి శోధనకాలమును నిశ్చయించుకొనవలయును. అదియెట్లనగా:—శోధనమునకు అయుక్తమైన కాలమునందుకూడా శీతము, ఉష్ణము, వృష్టిఅనువానికి యథాక్రమముగ ప్రతీకారమును (అనగా కృత్రిమమైన ఋతుగుణమును) జేసి ఆవశ్యకమైన శోధనాదిక్రియలను చేయవలయును. కృత్రిమమయిన ఋతుగుణంబెట్టిదనిన:—హేమంతకాలములో గర్భగృహము మొదలగు వానియందును, గ్రీష్మకాలములో ధారాగృహము మొదలగువానియందును వసించుటయ. వ్యాధి ప్రాణములను హరింపజేసును. కావుననావశ్యకముగా చేయవలసిన శోధనాదులకాలము నుపేక్షింపంజనదు.

### ఔషధ కాలము.

శ్లో॥ యుంజ్యాదనన్నమన్నాదౌ మధ్యేంతేకబలాంతరే।
గ్రాసేగ్రాసేముహుస్సాన్నం సాముద్గంనిశిచౌషదమ్॥ 37.

తా॥ భుజించినయౌషధము జీర్ణమైన పిదప నాహారమునుభుజించుటఅనన్నౌషధమనియును, ఔషధము నుపయోగించినతోడనే ఆహారమును భుజించుట అన్నాదియందౌషధమనియును, ఆహారమధ్యమునందుభుజించబడుఔషధము మధ్యౌషధమనియును, ఆహారముయొక్క అంతమునందు భుజించబడు ఔషధము అంతౌషధమనియును, తొలుతనొక కబళమును పిదప నౌషధమును భుజించి మఱల అన్నకబళమునుభుజించుట కబళాంతరౌషధమనియును, ప్రతికబళమునందు ఔషధమునుజేర్చిభుజించుట గ్రాసగ్రాసౌషధమనియును, ఆహారమునుభుజించినను భుజించకున్నను పలుమారౌషధమును భుజించుట ముహురౌషధమనియును, ఆహారముతోజేర్చి భుజించబడు ఔషధము సాన్నౌషధమనియును, తొలుత నౌషధమునుభుజించి తోడనే ఆహారమునుభుజించి మఱల నౌషధమును తోడనే భుజించుట సాముద్గౌషధమనియును, శయనకాలమునం

[illegible] భుజించుట నిశ్యౌషధమనియును బఱంగును. కాబట్టి యీకాలములనెఱింగి [illegible] ప్రయోగము చేయవలయును. ఇటుల నౌషధసేవాకాలము 10 విధంబులు.

### నిరన్నౌషధ - ప్రయోగ క్రమము.

శ్లో॥ కఫోద్రేకేగదేనన్నం బలినోరోగరోగిణోః ।
అన్నాదావిగుణేఽపానే సమానేమధ్యఇష్యతే ॥ 38.
వ్యానేంతే ప్రాతరాశస్య సాయమాశస్యతూత్తరే ।
గ్రాసగ్రాసాంతయోః ప్రాణే ప్రదుష్టేమాతరిశ్వని ॥ 39.
ముహుర్ముహుర్విషచ్ఛర్ది హిధ్మాతృట్ శ్వాసకాసిషు ।
యోజ్యంసభోజ్యంభైషజ్యం భోజ్యైశ్చిత్రైరరోచకే ॥ 40.
కంపాక్షేపకహిధ్మాసు సాముద్గంలఘుభోజనామ్ ।
ఊర్ధ్వజత్రువికారేషు స్వప్నకాలే ప్రశస్యతే ॥ 41.

తా॥ కఫాధిక్యముగల రోగమునందు రోగము రోగి బలిష్ఠముగనుండిన యెడల పై జెప్పిన అనన్నౌషధమును ప్రయోగించవలయును. (అటుల ప్రయోగించబడిన అనన్నౌషధము అతివీర్యముగలదిగనగును. రోగిబలిష్ఠుడుగనుండునపుడు మాత్రమే అనన్నౌషధమును ప్రయోగించవలయునేకాని దుర్బలుడుగనుండునపుడు ప్రయోగించంజనదు. దుర్బలునికి అన్నసహితముగ అనన్నౌషధము ప్రయోగించబడినను నది ఉపద్రవకారికానేరదు.) అపానమను వాతము ప్రకోపించి యుండునపుడు అన్నము యొక్క ఆదిలోనౌషధమును ప్రయోగించవలయును. (అనగా ఔషధమునుభుజించి తోడనే ఆహారమును భుజించవలయునని భావము.) సమానమనువాయువు ప్రకోపించియుండునపుడు ఆహారముయొక్క మధ్యలో నౌషధమును ప్రయోగించవలయును. వ్యానమనువాయువు ప్రకోపించియుండునపుడు పూర్వాహ్నములో భుజించబడు ఆహారము యొక్క అంతమునందు ఔషధమును ప్రయోగించవలయును. ఉదానమనువాయువు ప్రకోపమును జెందియుండునపుడు అపరాహ్ణమున భుజించబడు ఆహారము యొక్క అంతమునందు ఔషధమును ప్రయోగించవలయును. ప్రాణమను వాయువు ప్రకోపమును జెందియుండునపుడు కబళసహితముగను, 2 కబళములకుమధ్యను ఔషధమును ప్రయోగించవలయును. విషము, ఛర్ది, హిధ్మ, దప్పి, శ్వాసము,



కాసము, వీనియందు భుజించియుండినను, లేకుండినను పలుమారుఔషధమును ప్రయోగించవలయును. అరుచియందు నానావిధమయిన యాహారములతోడ నౌషధమునుచేర్చి ప్రయోగించవలయును. కంపము, ఆక్షేపకము, హిధ్మ అనునీరోగములయందు సాముద్గమను ఔషధమును ప్రయోగించవలయును. (అనగా భోజనమునకు ముందును పిదపను ఔషధమును ప్రయోగించవలయునని భావము.) లఘుభోజనము చేయువారికే సాముద్గప్రయోగమును చేయవలయును. మెడకొంకులకుపైన రోగములు గలవారికి రాత్రిశయన కాలమునందౌషధమును ప్రయోగించుట ప్రశస్తము.

త్రయోదశాధ్యాయము, ముగిసెను.

శ్రీ రస్తు.

# చతుర్దశాధ్యాయము.

దోషోపక్రమణీయాధ్యాయములో సామాన్యముగా దోషచికిత్స జెప్పబడియుండుటవలన విశేషముగా దోషచికిత్సలను బోధించుటకై ద్వివిధోపక్రమణీయాధ్యాయము జెప్పబడుచున్నది.

## ద్వివిధోపక్రమణీయాధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోద్వివిధోపక్రమణీయమధ్యాయంవ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః॥

తా॥ దోషోపక్రమణీయాధ్యాయానంతరము దోషవిశేషచికిత్సాజ్ఞానం బావశ్యకంబగుటచే 2 విధములైన చికిత్సలనెఱుంగుటకు హితకరమయిన ద్వివిధోపక్రమణీయమను యధ్యాయమును వివరించెదము.

### చికిత్సా ద్వైవిధ్యము.

శ్లో॥ ఉపక్రమ్యస్యహిద్విత్వా ద్విధైవోపక్రమోమతః।

తా॥ ఉపక్రమ్యము (అనగా చికిత్సార్హమైన రోగములు) 2 విధములుగ నుండుటవలన ఉపక్రమము (అనగా చికిత్సలు) కూడా రెండేవిధములుగ నుండుననుట ఆచార్యులయొక్క యభిప్రాయము. కొందరాచార్యులుచికిత్సలు 4 విధములుగ నుండుననివచించెదరు. అయిన నా 4 విధములైన చికిత్సలుకూడా నీ 2 విధచికిత్సలలోనే అంతర్గతంబగుటవలన చికిత్సలు రెండేవిధములని తెలియపరచుటకై "ద్విధైవా" అను ఏవకారము ప్రయోగించబడినది.

### ద్వివిధ - చికిత్సా వివరణము.

శ్లో॥ ఏకస్సంతర్పణ స్తత్ర ద్వితీయశ్చాపతర్పణః॥ 1.
బృంహణోలంఘనశ్చేతి తత్పర్యాయావుదాహృతౌ।
బృంహణంయద్బృహత్వాయ లంఘనంలాఘవాయయత్॥ 2.
దేహస్యభవతః ప్రాయో భౌమాపమితరచ్చతే।



తా॥ ఆ 2 విధములైన ఉపక్రమములలో మొదటిది సంతర్పణరూపముగ, రెండవది అపతర్పణరూపముగనుండును. సంతర్పణ అపతర్పణములకే యథాక్రమముగ బృంహణము, లంఘనము అను పర్యాయనామములుగలిగియుండును. దేహమునకుపుష్టిని గలుగజేసెడి ఉపక్రమము బృంహణమనియు, లఘుత్వమునుగలుగజేసెడి ఉపక్రమము లంఘనమనియు జెప్పబడును. సంతర్పణము, అపతర్పణము అనునీ 2 ఉపక్రమములు ప్రాయశః యథాక్రమముగ భూమ్యుదకస్వరూపముగలవిగను, అగ్ని, వాయు ఆకాశస్వరూపముగలవిగనుండును. (అనగా భూమి ఉదకము వీనిసంబంధముగలవి సంతర్పణమనియును, అగ్ని వాయువు ఆకాశము వీనిసంబంధముగలవి అపతర్పణ మనియును తాత్పర్యము.) అయితే యవలు, చిరుసెనగలు, మకుష్ఠము, తండులీయ యీ మొదలగువస్తువులు భూసంబంధముగలవియైనను అపతర్పణరూపముగనుండును. శొంఠి, పిప్పలి యీమొదలగువస్తువులు అన్న వాయువు వీనిసంబంధముగలవియైనను సంతర్పణరూపముగనుండును. కాబట్టి పైజెప్పిన సంతర్పణ అపతర్పణక్రమము కొన్నిస్థలములయందు భేదించునని తెలియపరచుటకై "ప్రాయః" అను పదము ప్రయోగించబడినది.

### స్నేహనాదులకు - సంతర్పణాపతర్పణాంతర్భావము.

శ్లో॥ స్నేహనంరూక్షణంకర్మ స్వేదనంస్తంభనంచయత్॥ 3.
భూతానాంతదపిద్వైధ్యా ద్ద్వితయంనాతివర్తతే।

తా॥ పృథివ్యాదిభూతములు సంతర్పణము, అపతర్పణము అని 2 విధములుగ నుండుటవలన స్నేహనము, రూక్షణము, స్వేదనము, స్తంభనము అను 4-గు విధములైన కర్మలు సంతర్పణ, అపతర్పణరూపముగల 2 కర్మల నతిక్రమించనేరవు. (అనగా సంతర్పణాపతర్పణములయందే అంతర్భావమగుచున్నవని భావము.)

### లంఘన ద్వైవిధ్యము.

శ్లో॥ శోధనంశమనంచేతి ద్విధాతత్రాపిలంఘనమ్॥ 4.

తా॥ బృంహణము, లంఘనము అను పర్యాయనామములుగల సంతర్పణ, అపతర్పణములలో లంఘనమను అపతర్పణము శోధనము, శమనము అని 2 విధములుగ నుండును.

### శోధనౌషధ - లక్షణ భేదములు.

శ్లో॥ యదీరయేద్బహిర్దోషాన్ పంచధాశోధనంచతత్।
నిరూహోవమనంకాయ శిరోరేకో స్రవిస్రుతిః॥ 5.

తా॥ లోననుండు వాతాదిదోషములను బయలుపరచునట్టియౌషధము శోధనమని బరంగును. మఱియు నా శోధనౌషధము నిరూహము (అనగా వస్తికర్మ) వమనము, కాయవిరేకము (అనగా శిరము మొదలగు సర్వశరీరములోనుండి అధోభాగముగా మలమును బయలుపరచుట,) శిరోవిరేకము (అనగా శిరములోనుండి ఊర్ధ్వమలములను ఘ్రాణేంద్రియమువలన వెలిపరచుట), రక్తస్రావము అని 5 విధంబులు.

## శమనౌషధ - లక్షణ భేదములు.

శ్లో॥ నశోధయతియద్దోషాన్ సమాన్నోదీరయత్యపి ।
సమీకరోతివిషమాన్ శమనంతచ్చసప్తధా ॥ 6.
పాచనందీపనంక్షుత్తృ డ్వ్యాయామాతపమారుతాః ।

తా॥ లోననుండు వాతాదిదోషములను బైలుపరచక స్వప్రమాణమునందుండు వాతాదిదోషములను ప్రకోపింపజేయక స్వప్రమాణమునకంటె నధికముగగాని, లేక న్యూనముగగానినుండు వాతాదిదోషములను సమముగ (అనగా స్వప్రమాణమునందుండునటుల) చేయునట్టి యౌషధము శమనౌషధమనబడును. ఆ శమనౌషధము పాచనము, దీపనము, క్షుణ్ణిగ్రహము, తృష్ణానిగ్రహము, వ్యాయామము. ఆతపము, మారుతము అని 7 విధంబులు. అన్నాదులను పాకముచేయునట్టి జాఠరాగ్నికి అధికమయిన శక్తిని గలుగజేయతగిన నేలవేము, తుంగముస్తెలు యీమొదలగు ద్రవ్యములు లంఘనాదిక్రియలు పాచనమనబడును. ఘృతాదులు దీపనమనబడును.

“పాచనంపాచయేద్దోషాన్ సామాన్ శమనమేవతు । దీపనంహ్యగ్నికృచ్చామం కదాచిత్పాచయేన్నవా ॥”

ఆమముతోగూడియుండు దోషములను పాకముచేయునది పాచనమనబడును. దోషములను శమనముచేయునది శమనమనబడును. అగ్నిదీప్తిని గలుగజేయునది దీపనమనబడును. అది ఒకానొకపుడు ఆమమును పాకముజేసును. మఱియొకపుడుచేయకుండును అని ఊరపాణి చెప్పియున్నాడు.

“యదగ్నికృత్పచేదామం దీపనంతద్యథాఘృతమ్। పాచనంతద్విపర్యస్తం యథావత్స్యామిలక్షణమ్ ॥”

ఘృతమువలె అగ్నిదీపనమునుగలుగజేసి ఆమమును పాకముచేయునది దీపనమనబడును. పాచనమనునది దీనికి విరుద్ధముగనుండునని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది.

శ్లో॥ బృంహణంశమనంత్వేవ వాయోఃపిత్తానిలస్యచ ॥ 7.



తా॥ శోధనస్వభావముగల బృంహణముకూడా బృంహణస్వభావముగల క్షీరము మొదలగుద్రవ్యములవలె శోధనముగనగును. అయితే బృంహణశోధనము కేవల వాతమునుగాని, లేకపిత్తయుక్తవాతమునుగాని శమనముజేసునేకాని లంఘనశోధనమువలె ఒకానొకపుడును ప్రకోపింపజేయనేరదు.

## బృంహణ క్రియార్హులు.

శ్లో॥ బృంహయేద్వ్యాధిభైషజ్య మద్యస్త్రీశోకకర్శితాన్ ।
భారాధ్వోరఃక్షతక్షీణ రూక్షదుర్బలవాతలాన్ ॥ 8.
గర్భిణీసూతికాబాల వృద్ధాన్ గ్రీష్మేఽపరానపి ।
మాంసక్షీరసితాసర్పి ర్మధురస్నిగ్ధవస్తిభిః ॥ 9.
స్వప్నశయ్యాసుఖాభ్యంగ స్నానవిర్వృతిహర్షణైః ।

తా॥ వ్యాధి, ఔషధము, మద్యము, స్త్రీసంభోగము, శోకము, భారమును మోయుట, మార్గసంచారము, ఉరఃక్షతము, వీనిచే కృశించినవారికిని, రూక్ష దౌర్బల్యము వాతప్రకృతిగలవారికిని, గర్భిణిస్త్రీ, ప్రసవించినస్త్రీ, బాలురు, వృద్ధులు అను వారికిని, గ్రీష్మఋతువులో సకలమయినవారికిని, మాంసము, క్షీరము, శర్కర, నెయ్యి, మధురముగ, స్నిగ్ధముగనుండు వస్తిక్రియలు, నిద్ర, శయ్యాసుఖము (అనగా మంచము మెత్త మొదలగువానిపై పరుండుట) అభ్యంగస్నానము, మనోవ్యాకులము లేకుండుట, సంతోషమునుగలుగజేసుట యీమొదలగువానిచే బృంహణక్రియను చేయవలయును. అయితే వ్యాధిచేకృశించినవారికి పై జెప్పినమాంసాదులచే విశేషముగా బృంహణక్రియను చేయవలయును.

## లంఘన క్రియార్హులు.

శ్లో॥ మేహామదోషాతిస్నిగ్ధ జ్వరోరుస్తంభకుష్ఠినః ॥ 10.
విసర్పవిద్రధిప్లీహ శిరఃకంఠాక్షిరోగిణః ।
స్థూలాంశ్చలంఘయేన్నిత్యం శిశిరేత్వపరానపి ॥ 11.

తా॥ మేహము, ఆమదోషము, అతిస్నిగ్ధత్వము, జ్వరము, ఊరుస్తంభము, కుష్ఠువు, విసర్పము, విద్రధి, ప్లీహము, శిరోరోగము, కంఠరోగము, నేత్రరోగము, శరీరస్థౌల్యము యీ రోగములుగలవారికి యెల్లపుడు లంఘనక్రియనే చేయవలయును. మఱియును శీతకాలములో స్వస్థులుకూడా లంఘనక్రియనే చేయవలయును.

### శోధన వివరణము.

శ్లో॥ తత్రసంశోధనైఃస్థౌల్య బలపిత్తకఫాధికాన్ ।
ఆమదోషజ్వరచ్ఛర్ది రతీసారహృదామయైః ॥ 12.
విబంధగౌరవోద్గార హృల్లాసాదిభిరాతురాన్ ।
మధ్యస్థౌల్యాదికాన్ ప్రాయఃపూర్వంపాచనదీపనైః ॥ 13.
ఏభిరేవామయైరార్తాన్ హీనస్థౌల్యబలాదికాన్ ।
క్షుత్తృష్ణానిగ్రహైర్దోషై స్త్వార్తాన్మధ్యబలైర్దృఢాన్ ॥ 14.
సమీరణాతపాయాసైః కిముతాల్పబలైర్నరాన్ ।

తా॥ లంఘనమునకు యోగ్యులుగనుండువారిలో అధికమయిన స్థౌల్యము, బలము, పిత్తము, కఫము ఇవిగలవారికిని; ఆమదోషము, జ్వరము, ఛర్ది, అతిసారము, హృద్రోగము, మలమూత్రాదిబంధము, గురుత్వము, ఉద్గారము, హృల్లాసము యీ మొదలగువానిచే పీడింపబడుచుండువారికిని; సంశోధనమను పేరుగల లంఘనములవలన లంఘనక్రియను చేయించవలయును. మధ్యమమయిన స్థౌల్యము, బలము, పిత్తము, కఫము ఇవి అధికముగనుండువారికిని; పైజెప్పియుండు ఆమదోషాదులవలన పీడింపబడుచుండువారికిని; తలుచుగ పాచన, దీపన స్వరూపముగల లంఘన భేదములవలన లంఘనము చేయించవలయును. హీనమైన స్థౌల్యము, బలము, పిత్తము, కఫము ఇవి గలవారికిని; పైజెప్పియుండు ఆమదోషాదులచే పీడింపబడుచుండువారికిని; బుభుక్ష, పిపాస, వేగవిధారణము అను లంఘనవిశేషములవలన లంఘనక్రియను చేయించవలయును. మధ్యమమయినబలముగల వాతపిత్తకఫములచే పీడితులై దృఢశరీరముగలిగియుండువారికి వాతము, వ్యాయామము, ఎండ యీ మొదలగువానిచే లంఘనక్రియను చేయించవలయును. అల్పమయిన బలముగల వాతాదులచే పీడింపబడుచుండువారికి పైజెప్పినవాతాదులచేతనే లంఘనక్రియను చేయించవలయును.

### బృంహణ - క్రియా నిషేధము.

శ్లో॥ నబృంహయేల్లంఘనీయాన్

తా॥ లంఘనక్రియకు అర్హులుగనుండువారికి మేహము, ఆమదోషము యీ మొదలగురోగములు గలిగియుండినచో బృంహణక్రియను చేయంజనదు.

### బృంహణ - క్రియార్హులకు లంఘనము.

శ్లో॥ బృంహ్యాంస్తుమృదులంఘయేత్ ॥ 15.



యుక్త్యావాదేశకాలాది బలతస్తానుపాచరేత్ ।

తా॥ బృంహణక్రియలకు అర్హులుగను, లంఘనక్రియాసాధ్యమగు రోగముచే పీడితులుగనుండువారికి మృదువైన లంఘనక్రియచేత లంఘనమునే చేయించవలయును. లేక యుక్తిచే (అనగా సంతర్పణ, అపతర్పణములు చేరియుండు ప్రయోగముచే) దేశకాలాదులననుసరించియైనను చికిత్సింపవలయును.

### బృంహిత లక్షణము.

శ్లో॥ బృంహితేస్యాద్బలంపుష్టి స్తత్సాధ్యామయసంక్షయః ॥ 16.

తా॥ బృంహణక్రియ చేయబడినచో బలము, పుష్టిగలుగును. మఱియు నా బృంహణమునకు సాధ్యమైనరోగములు శమనమునుజెందును.

### లంఘిత లక్షణము.

శ్లో॥ విమలేంద్రియతాసర్గో మలానాంలాఘవంరుచిః ।
క్షుత్తృట్సహోదయశ్శుద్ధ హృదయోద్గారకంఠతా ॥ 17.
వ్యాధిమార్దవముత్సాహ స్తంద్రానాశశ్చలంఘితే ।

తా॥ లంఘనక్రియచేయబడినచో ఇంద్రియములకు పాటవము, మలమూత్రాదులు వెలిపడుట, శరీరలఘుత్వము, రుచి, ఆకలి, దప్పి అను నీ 2 నేకకాలమువందు గలుగుట, హృదయము, తేనుపులు, కంఠము, ఇవి శుద్ధముగనగుట, వ్యాధి మృదువుగనుండుట, ఉత్సాహము, తంద్రానాశము ఇవి గలుగును. పైజెప్పిన ఇంద్రియపాటవము మొదలగువానిలో 1, 2, లేక 3 లక్షణములు దోషదేశాదులననుసరించిగలిగినను లంఘితలక్షణము సంపూర్ణమయినదని తెలియవలయును.

“ వాతమూత్రపురీషాణాం విసర్గేగాత్రలాఘవే।హృదయోద్గారకంఠస్య శుద్ధౌతంద్రాక్లమేగతే । స్వేదేజాతేరుచౌచైవ క్షుత్పిపాసాసహోదయే। కృతంలంఘనమాదేశ్యం నిర్వ్యథేచాంతరాత్మని ॥”
అనెడి చరకవచనముకూడా పైయర్థమునే బోధించుచున్నది.

### న్యూనాధిక - బృంహణ - లంఘనోపద్రవములు.

శ్లో॥ అనపేక్షితమాత్రాది సేవితేకురుతస్తుతే । 18.
అతిస్థౌల్యాతికార్శ్యాదీన్ వక్ష్యంతేతేచసౌషధాః ।

తా॥ బృంహణము, లంఘనము, వీనిని మాత్రాదుల నపేక్షించకుండా సేవించినచో అతిస్థౌల్యము, అతికార్శ్యము యీ మొదలగువానిని గలుగజేయును. అతిస్థౌల్య, అతికార్శ్యాదిరోగములు, వానియౌషధములు ఉత్తరత్ర జెప్పబడును.

### బృంహణ - లంఘనాతియోగ లక్షణము.

శ్లో॥ రూపంతైరేవచజ్ఞేయ మతిబృంహితలంఘితే ॥ 19.

తా॥ అతిబృంహితునియందుగల అతిస్థౌల్యాదులచే బృంహణాదియోగ లక్షణమును, అతిలంఘితునియందుగల అతికార్శ్యాదులచే లంఘనాతియోగ లక్షణమును తెలిసికొనవలయును.

### బృంహణాతి - యోగజనిత రోగములు.

శ్లో॥ అతిస్థౌల్యాపచీమేహ జ్వరోదరభగందరాన్ ।
కాసనంన్యాస * కృచ్ఛ్రామ కుష్ఠాదీనతిదారుణాన్ ॥ 20.

తా॥ అతిబృంహణము అతిదారుణమైన స్థౌల్యము, అపచి, మేహము, జ్వరము, ఉదరరోగము, భగందరము, కాసము, సంన్యాసము, మూత్రకృచ్ఛ్రము, ఆమరోగము యీమొదలగురోగములను గలుగజేసును.

### అతిస్థౌల్యాది చికిత్స.

శ్లో॥ తత్రమేదోనిలశ్లేష్మ నాశనంసర్వమిష్యతే।

తా॥ పైజెప్పిన అతిస్థౌల్యాదిరోగ నివారణార్థమై మేదస్సు, వాతము, శ్లేష్మము, వీనిని హరింపజేయునట్టి అన్నపానౌషధాదులను సేవించవలయును.

### అతిస్థౌల్య హరౌషధములు.

శ్లో॥ కుళుత్థజూర్ణశ్యామాక యవముద్గమధూదకమ్ ॥ 21.
మస్తుదండాహతారిష్ట చింతాశోధనజాగరమ్ ।
మధునాత్రిఫలాంలిహ్యా ద్గుడూచీమభయాంఘనమ్ ॥ 22.
రసాంజనస్యమహతః పంచమూలస్యగుగ్గులోః ।
శిలాహ్వస్యప్రయోగశ్చ సాగ్నిమంథరసోహితః ॥ 23.
విడంగంనాగరంక్షారః కాలలోహరజోమధు ।
యవామలకచూర్ణంచ యోగోతిస్థౌల్యదోషజిత్ ॥ 24.

తా॥ ఉలవలు, జొన్నలు, చామలు, యవలు, పెసలు, తేనె, ఉదకము, మస్తు (అనగా పెరుగుమీదితేట), నీళ్ళుకలియనిచల్ల, అరిష్టమునుగురించిన చింత, శోధనౌషధము, జాగరణము వీని సేవనముచేతను; త్రిఫలములు, తిప్పతీగె, కరక్కాయ,

* కృచ్ఛ్రామ ఇతిపా.



తుంగగడ్డలు, వీనిలోదేనినేని తేనెలోజేర్చి నాకుటచేతను, రసాంజనము, మహాపంచమూలము, గుగ్గిలము, శిలాజిత్తు, వీనిచూర్ణమును తక్కాలిరసములోజేర్చి ప్రయోగించుటచేతను; వాయువిడంగములు, శొంఠి, క్షారము (అనగాసర్జక్షారము, యవక్షారము) లోహచూర్ణము, తేనె, యవలు, ఉసిరికె వీనిచూర్ణమును సమభాగములుగజేర్చి ప్రయోగించుటచేతను అతిస్థౌల్యము హరించును.

శ్లో॥ వ్యోషకట్వీవరాశిగ్రు విడంగాతివిషాస్థిరాః ।
హింగుసౌవర్చలాజాజీ యవానీధాన్యచిత్రకాః ॥ 25.
నిశేబృహత్యౌహపుషా పాఠామూలంచకేంబుకాత్ ।
ఏషాంచూర్ణంమధుఘృతం తైలంచసదృశాంశకమ్ ॥ 26.
సక్తుభిష్షోడశగుణై ర్యుక్తంపీతంనిహంతితత్ ।
అతిస్థౌల్యాదికాన్సర్వాన్ రోగానన్యాంశ్చతద్విధాన్ ॥ 27.
హృద్రోగకామలాశ్విత్ర శ్వాసకాసగళగ్రహాన్ ।
బుద్ధిమేధాస్మృతికరం సన్నస్యాగ్నేశ్చదీపనమ్ ॥ 28.

తా॥ త్రికటుకములు, కటుకరోహిణి, త్రిఫలములు, మునుగ, వాయువిడంగములు, అతివస, ముయ్యాకుపొన్న, ఇంగువ, సౌవర్చలవణము, జీలకఱ్ఱ, అజామోదము, ధనియాలు, చిత్రమూలము, పసుపు, మ్రానిపసుపు, ములక, వ్రాకుడు, బోడతరము, పాటవేరు, కేంబుకము, అనునీ 24 ద్రవ్యముల చూర్ణము సమాంశములుగా 1 భాగము. చూర్ణమునకు సమాంశమైన తేనె 2-వ భాగము. చూర్ణమునకు సమాంశమైననెయ్యి 3-వ భాగము. చూర్ణమునకు సమాంసమైన తైలము 4-వ భాగము. ఇటులనీ 4-గు భాగములను మిశ్రముచేసి అటుల మిశ్రముచేసిన దానికంటె 16 భాగము లధికముగ యవసక్తుపునుచేర్చి కలిపి పానముజేసిన అతిస్థౌల్యము మొదలగు సమస్తరోగములను, బృంహణక్రియవలన గలిగిన యితరరోగములను, హృద్రోగము, కామల, శ్విత్రము, శ్వాసము, కాసము, గళగ్రహము, యీరోగములను హరింపజేసి బుద్ధి, మేధ, స్మృతి, వీనినివృద్ధిజేసుటయేగాక మందముగనుండు జాఠరాగ్నికి దీపనమునుకూడా గలుగజేసును.

### లంఘనాతి - యోగజనిత రోగములు.

శ్లో॥ అతికార్శ్యంభ్రమఃకాస స్తృష్ణాధిక్యమరోచకః ।
స్నేహాగ్నినిద్రాదృక్శ్రోత్ర శుక్రౌజఃక్షుత్స్వరక్షయః ॥ 29.
వస్తిహృన్మూర్ధజంఘోరు త్రికపార్శ్వరుజాజ్వరః ।

ప్రలాపోర్ధ్వానిలగ్లాని ఛర్ది ఃపర్వాస్థిభేదనమ్ ॥ 30.
విణ్మూత్రాదిగ్రహాద్యాశ్చ జాయంతేతివిలంఘనాత్ ।

తా॥ అతికృశత్వము, భ్రమ, కాసము, అతిదప్పి, అరోచకము, స్నేహక్షయము, అగ్నిమాంద్యము, నిద్రానాశము, నేత్ర శ్రోత్రేంద్రియములకు హాని, శుక్రము, ఓజస్సు క్షయించుట, ఆకలిలేకుండుట, స్వరహాని, వస్తి, హృదయము, శిరస్సు, పిక్క, తొడలు, ముడ్డిపూస, పార్శ్వములు, వీనియందు శూలగలుగుట, జ్వరము, ప్రలాపము, అర్ధాంగవాతము, గ్లాని, వాంతి, గణుపులు, అస్థులు వీనియందు భేదించునటులుండుట, మలమూత్రాది ప్రతిబంధము యీ రోగములు అతిలంఘనమువలన జనించును.

## స్థౌల్యమునకంటె - కృశత్వము శ్రేష్ఠము.

శ్లో॥ కార్శ్యమేవవరంస్థౌల్యా న్నహిస్థూలస్యభేషజమ్ ॥ 31.
బృంహణంలంఘనంనాల మతిమేదోగ్నివాతజిత్ ।

తా॥ స్థూలునికి మాంసము, క్షీరము మొదలగు బృంహణద్రవ్యములు, ఆళ్ళు, చామలు మొదలగు లంఘనద్రవ్యములు, అనునీ 2-ను సమర్థమైన ఔషధములు కానేరవు. ఏలననగా:—మాంసాదిబృంహణ ద్రవ్యములవలన స్థూలునికి మేదస్సు అధికముగ వృద్ధిజెందును. ఆళ్ళు మొదలగు లంఘనద్రవ్యములవలన మేదస్సు క్షయించినను అగ్ని వాతము అనునీ 2-ను వృద్ధిజెందును. కాబట్టి మేదస్సును క్షయింపజేయునదిగ అగ్నిమాంద్యమును గలుగజేయునదిగ, వాతహరమైనదిగ నుండునట్టి వస్తువే స్థూలునికి ఔషధముగనుండును. అట్లగుటచే అతిస్థౌల్యమునకంటె అతికృశత్వమే శ్రేష్ఠంబు. అతిస్థూలులుగ, అతకృశులుగ నుండువారికే లంఘన, బృంహణ రూపమైన చికిత్స ప్రకృతమునందు వివక్షితంబగుటవలన నిచట కార్శ్య స్థౌల్యశబ్దములకు అతికార్శ్యము అతిస్థౌల్యము అని అర్థముజేసికొనవలయును.

శ్లో॥ మధురస్నిగ్ధసౌహిత్యై ర్యత్సౌఖ్యేనవినశ్యతి ॥ 32.
కృశిమాస్థవిమాత్యంత విపరీతనిషేవణైః ।

తా॥ మధురముగ స్నిగ్ధముగనుండువస్తువులు, మనస్తృప్తి, వీనిచే కృశత్వము అనాయాసముగ శమించును. స్థౌల్యము విపరీతమైన (అనగా తిక్త, కటు, కషాయ రసములుగల) అన్నపానౌషధములచే శమనమునుజెందును. కాబట్టి కృశత్వము స్థౌల్య

ప్రలాపోర్ధ్వానిల ఇతిపా॥



మునకంటె శ్రేష్ఠంబు. స్థూలుడు, కృశుడు, వీరలకు బృంహణసాధ్యముగను, సమానముగనుండు వ్యాధిగలిగినయెడల స్థూలునికి విరుద్ధమైన చికిత్సలు చేయవలసియుండుటవలన నావ్యాధికృశునికివలె శీఘ్రముగ శమించుటలేదు. ఇందుకు దృష్టాంతమేమనగా, లంఘన సాధ్యముగనుండు విసూచికాదిరోగములు కృశస్థూలకుగలిగినచో నవి కృశునికి సులభమైన చికిత్సలచేతనే శీఘ్రముగ శమనమునుజెందును. స్థూలునికైననో విరుద్ధోపక్రమముగలవియగుటంజేసి సులభము శమనమును జెందకుండును. అదియేలననగా:—విసూచికాదిరోగములయందు ముఖ్యమైనచికిత్స స్వేదకర్మ. "నస్వేదయేదతిస్థూలం" అనువచనముచే అతిస్థూలునికి స్వేదకర్మ నిషేధించబడియుండుటవలన స్థూలుని విషయములో స్వేదకర్మను ప్రయోగింపంజనదు.

"స్రోతస్సుమేదోరుద్ధేషు వాయుఃకోష్ఠేవిశేషతః । చరన్ ప్రజ్వలయత్యగ్నింక్షుత్తృషౌ స్తస్తతోధికమ్।స్థూలంకోటరవద్వృద్ధా దహాతోగ్న్యనిలౌచతౌ ॥"

అనగాస్థూలునికి లంఘనక్రియనుచేసినచో స్రోతోమార్గములు మేదస్సుచేనడ్డగింపబడి కోష్ఠములోనే వాయువు విశేషముగ సంచరించుచు జాఠరాగ్నిని విశేషముగ జ్వలింపజేసును. దానివలన విశేషముగా ఆకలి దప్పిగలుగును. ఒక వృక్షముయొక్క తొఱ్ఱను వృద్ధిజెందియుండుఅగ్ని వాతములు దహింపజేసువటులనే స్థూలునిదేహమును అగ్ని వాతము ఇవిదహింపజేసును, అనిచెప్పియుండుటవలన నతిస్థూలునికి లంఘనక్రియను చేయంజనదని యేర్పడుచున్నది. బృంహణచికిత్సను జేసినచో ఆమదోషాదిరోగములు విశేషముగవృద్ధిజెందును. దానంజేసియే స్థూలునికిజనించిన విసూచికాదిరోగములు సులభమైనచికిత్సలచే శమనమును జెందకుండును. కృశునికిగలిగిన విసూచికాదిరోగములైననో అవిరుద్ధోపక్రమముగలవిగ నుండుటవలన సుఖముగనే శమనమునుజెందును. కాబట్టి అతిస్థౌల్యమునకంటె అతికృశత్వమే శ్రేష్ఠమనిచెప్పబడినది.

## కార్శ్యమునందు చికిత్స.

శ్లో॥ యోజయేద్బృంహణంతత్ర సర్వంపానాన్నభేషజమ్ ॥ 33.

తా॥ కృశునికి బృంహణమైన సమస్తమగు అన్నపానాద్యౌషధముల నుపయోగించవలయును.

శ్లో॥ అచింతయాహర్షణేన ధ్రువంసంతర్పణేనచ ।
స్వప్నప్రసంగాచ్చకృశో వరాహఇవపుష్యతి ॥ 24.

తా॥ మనస్సునకుశోకము, కార్యము యీమొదలగు వ్యాకులము లేకుండుటచేతను, మనస్సంతోషముచేతను, శరీరమునకు పుష్టినిచ్చునట్టి ఆహారవిశేషాదులచేతను,

అధికముగా నిద్రను సేవించుటచేతను కృశుడు వరాహమువలె శరీరధాతుపుష్టిగలవాడుగ నగును. కృశించినవారికి పుష్టికిహేతుకరమైన సర్వచికిత్సలకంటె అధికనిద్రాసేవనమే ప్రధానమని తెలియపరచుటకై యిచట వరాహముదృష్టాంతముగ జెప్పబడినది. వరాహమునకు నిద్రతప్ప శరీరపుష్టికి కారణమైన ఆహారవిశేషాదు లెవ్వియును నుండునటుల కానంబడదు.

"మేదోమాంసాదివృద్ధత్వా చ్చలస్ఫిగుదర స్తనః । అయథోపచయోత్సాహోనరోతిస్థూలఉచ్యతే.శుష్కస్ఫిగుదరగ్రీవో ధమనీజాలసంతతః । త్వగస్థిశేషోతికృశః స్థూలపర్వానరోమతః॥"

మేదస్సు, మాంసము ఇవి అధికముగ వృద్ధిజెందియుండుటవలన చలింపుచుండు పిఱుదులు ఉదరము స్తనముగలవాడుగ, శరీరస్థౌల్యమునకుతగిన పొడవులేనివాడుగనుండునట్టి పురుషుడు అతిస్థూలుడని చెప్పబడును. శుష్కమయిన పిఱుదులు, ఉదరము, మెడగలవాడుగ, బోలునరములయొక్క సమూహముచే వ్యాప్తుడుగ, చర్మము, అస్థి, అనునీ 2 మాత్రము మిగిలినవాడుగ, స్థూలమైనగణుపులుగలవాడుగ నుండుమనుజుడు అతికృశుడనబడును. అని అతిస్థూలత్వము అతికృత్వముగల మనుజుల లక్షణము చరకమునందు చెప్పబడియున్నది.

## మాంస - భక్షణముచే స్థౌల్యము.

శ్లో॥ నహిమాంససమంకించి దన్యద్దేహబృంహత్వకృత్ ।
మాంసాదమాంసంమాంసేన సంభృతత్వాద్విశేషతః ॥ 35.

తా॥ శరీరమునకు బృంహణమును గలుగచేయునట్టి వస్తువగు మాంసముతో సమానమైన వస్తువుయేదియును లేదు. మాంసభక్షణముచేయునట్టి జంతువులయొక్క మాంసము మాంసముచేతనే పుష్టినిజెందినదగుటంజేసి దేహమునకు విశేషముగా పుష్టిని గలుగజేసును.

## స్థూలకృశులకు - సామాన్య చికిత్స.

శ్లో॥ గురుచాతర్పణంస్థూలే విపరీతంహితంకృశే ।

తా॥ గురువుగ, అపతర్పణకారిగనుండు మాక్షికము, జాజికాయ మొదలగు ద్రవ్యములన్నియు స్థూలశరీరముగలవారికి మిగుల హితకరంబులు. ఏలననగా:— అవి రూక్షగలవియగుటచే మేదస్సును క్షయింపజేసును. గురుత్వముగలవి యగుటచే శీఘ్రములో జీర్ణమును జెందకుండును. పైజెప్పినగుణములకంటె విపరీతమైన (అనగా లఘువుగ, సంతర్పణరూపముగనుండునట్టి) గుణములుగల ఎఱ్ఱరాజనాలు, షష్టికము,



ఆడుజింకమాంసము, లావుకపిట్ట, కపింజలము (అనగా ఱెక్కలయందు చిత్రవర్ణముగల బట్టవన్నెపక్షి) యీమొదలగువస్తువులు అతికృశులకు హితకరంబులు. ఏలననగా- అతికృశులకు జాఠరాగ్నికూడా కృశముగనేయుండును. కాబట్టి వారికిగురుకరమయిన అన్నపానౌషధాదులు నుపయోగింపంజనదు. ఉపయోగించినచో అగ్నిమాంద్యము గలుగును. లఘువుగ, బృంహణముగనుండువస్తువు నుపయోగించినచో మరలవిశేషముగా కార్శ్యమేగలుగును. "గురుచ" అను చకారప్రయోగమువలన లఘువుగ అపతర్పణరూపముగనుండుచాములు, ఆళ్ళు, మొదలగునవియును, గురుత్వము, లఘుత్వము కాని ద్రవ్యములును; మేదస్సును హరింపజేయునవియగు జాగరణము, మైథునము, వ్యాయామము, చింత యీమొదలగునవియును, అతిస్థూలునికి హితకరములని తెలియవలయును.

శ్లో॥ యవగోధూమముభయో స్తద్యోగ్యాహితకల్పనమ్ ॥ 36.

తా॥ స్థూలుడు, కృశుడు, వీరలకు ఉచితమైనసంయోగ సంస్కారాదులతో గూడియుండుయవలు, గోధుమలు, అనునీ 2-ను హితకరముగనుండును. (అనగాయవలు స్థూలునికి, గోధుమలు కృశునికి హితకరమని యర్థము.)

శ్లో॥ దోషగత్యాతిరిచ్యంతే గ్రాహిభేద్యాదిభేదతః ।
ఉపక్రమానతేద్విత్వా ద్భిన్నాఅపిగదాఇవ ॥ 37.

తా॥ వెవ్వేరు రూపముగలవిగ, సంసర్గసన్నిపాత తారతమ్యభేదములవలన సంఖ్యాతీతములుగనుండునట్టి వాతాదిదోషములయొక్క స్థాన, వృద్ధి, క్షయ స్వరూపముగలిగినట్టియు, అడ్డముగ, ఊర్ధ్వముగ, అధోముఖముగనుండునట్టియు శాఖలు, కోష్ఠము, అస్థి, సంధి అనులక్షణములతోగూడినట్టియు గతులవలనను; గ్రాహి, భేదయీమొదలగున నేకౌషధభేదములవలనను చికిత్స పలువిధములుగ నగుచున్నవి. అటులనయినప్పటికిన్ని వాతాదిదోషవశమువలన జనించు జ్వరాదిరోగములు నానా విధములుగనుండినను అవిబృంహణ, లంఘన రూపచికిత్సలను, సామ, నిరామత్వములనతిక్రమించకుండునటులనే పైజెప్పినచికిత్సలుకూడా సంతర్పణము, అపతర్పణము అనునీ 2 ప్రకారములకంటె నధికముగనగుటలేదు. (అనగా ఆచికిత్సలకు సంతర్పణ, అపతర్పణరూపములకంటె వేరురూపము లేదని యర్థము.)

చతుర్దశాధ్యాయము, ముగిసెను.

శ్రీ రస్తు.

# పంచదశాధ్యాయము.

దోషోపక్రమణీయాధ్యాయమునందును, ద్వివిధోపక్రమణీయాధ్యాయమునందును నానావిధమైనచికిత్సలు జెప్పబడియున్నవి. అటువంటిచికిత్సలు మ్రంగ, అతి మధురము యీ మొదలగు ఓషధులనాశ్రయించి యుండును. కాబట్టి సర్వవిధ చికిత్సలను యోగ్యంబును, శోధనాదులకు ఉపయోగకారియునైన ఓషధులను సంగ్రహముగ జెప్పుటకై ద్వివిధోపక్రమణీయాధ్యాయానంతరము శోధనాదిగణ సంగ్రహాధ్యాయము చెప్పబడుచున్నది. మఱియు నాశోధనము వమనము, విరేచనము, ఆస్థాపనము, శిరోవిరేచనము అని నాలుగు విధంబులు, వానిలో వమనరూపముగల శోధనగణము తొలుత జెప్పబడుచున్నది.

## శోధనాదిగణ - సంగ్రహాధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతశ్శోధనాదిగణ సంగ్రహమధ్యాయంవ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః ॥

తా॥ ద్వివిధోపక్రమణీయాధ్యాయానంతరము ఉపక్రమములు (అనగా చికిత్సలు) మ్రంగ, అతిమధురము, యీమొదలగునోషధుల నాశ్రయించియుండుటవలన శోధనద్రవ్యగణము, వాతహరద్రవ్యగణము యీమొదలగుద్రవ్యగణములను సంగ్రహముగ బోధించెడి శోధనాదిగణసంగ్రహాధ్యాయమును వివరించెదము. గణమనగా:— సమూహము, సంగ్రహమనగా:— అచటచట చెదరియుండుపదార్థముల నొకచోట రాశిగజేర్చుటయని యర్థము. శోధనగణము సర్వదోషములను జయించతగిన దగుటచే ప్రధానంబు. దానంజేసి శోధనగణము తొలుత జెప్పబడుచున్నది.



## వమనకర ద్రవ్యగణము.

శ్లో॥ మదనమధుకలంబానింబబింబీవిశాలా త్రపుసకుటజమూర్వా
దేవదాలీకృమిఘ్నమ్।విదులదహనచిత్రాః కోశవత్యౌకరంజః
కణాలవణవచైలాసర్షపాశ్ఛర్దనానీ ॥ 1.

తా॥ మ్రంగ, అతిమధురము, అనుగు, వేప, దొండ, పెద్దపావర, చేదుదోస కొడిసె, చాగ, దేవదాళి అనగా డావరడంగి, వాయువిడంగములు, నీఱుప్రబ్బలి, చిత్రమూలము, ఎలుకచెవి, చేదుబీర, పెద్దబీర, క్రానుగు, పిప్పళ్ళు, సైంధవలవణము వస, ఏలకలు, ఆవాలు, ఇవి వమనముచేయించునట్టి ద్రవ్యములు. (వానిలో మ్రంగ, పెద్దపావర, చేదుదోస, కొడిసె, వాయువిడంగములు, ఏలకలు, ఆవాలు అను వాని ఫలములు వమనకారులు. అతిమధురము, నీరుప్రబ్బలి, చిత్రమూలము, నాగదంతి, వస వీనియొక్క వేళ్ళు వమనకారులు. లొద్దుగు, స్వర్ణక్షీరి, కంపిల్లము, వీని పట్టలు వమనకారులు. శేషించియుండు ఓషధులయొక్క ఫలములు, పత్రములు, పుష్పములు ఇవి వమనకారులని కొందరు వ్యాఖ్యానముచేయుచున్నారు.)

## విరేచన ద్రవ్యగణము.

శ్లో॥ నికుంభకుంభత్రిఫలాగవాక్షీ స్నుక్శంఖినీనీలినితిల్వకాని।
శమ్యాకకంపిల్లకహేమదుగ్ధా దుగ్ధంచమూత్రంచవిరేచనాని॥ 2.

తా॥ నాగదంతి, తెగడ, త్రిఫలములు, పాపరబుడమ, పెద్దపావర, జెముడు, శంఖిని (అనగా పద్మపుతీగె) నల్లదింటెన, లొద్దుగు, రేల, కంపిల్లకము, హేమదుగ్ధా (అనగా స్వర్ణక్షీరి) పాలు, మూత్రము, ఇవి విరేచనకర ద్రవ్యములు.

## నిరూహణ - సాధన ద్రవ్యములు.

శ్లో॥ మదనకుటజకుష్ఠదేవదాలీ మధుకవచాదశమూలదారురాస్నాః।
యవమిసికృతవేధనంకులుత్థో మధులవణంత్రివృతానిరూహణాని॥

తా॥ మ్రంగకాయ, కొడిసె, చెంగల్వకోష్ఠు, దేవదాళి, యష్టిమధుకము, వస, దశమూలములు, దేవదారు, సన్నరాస్నము, యవలు, పెద్దసదాప, ఆవడ, ఉలవలు, తేనె, సైంధవలవణము, తెగడ, ఇవి నిరూహక్రియాసాధన ద్రవ్యములు.

## శిరశ్శోధన ద్రవ్యగణము.

శ్లో॥ వేల్లాపామార్గవ్యోషదార్వీసురాలా బీజంశైరీషంబార్హతంశైగ్రవంచ। సారోమాధూకః సైంధవంతార్క్ష్యశైలం
త్రుట్యౌపృథ్వీకాశోధయంత్యుత్తమాంగమ్ ॥ 4.

తా॥ వాయువిడంగములు, ఉత్తరేణు, త్రికటుకములు, మ్రానిపసుపు, శ్రేష్ఠమైన సర్జరసము, దిరిసెనపువిత్తులు, ములకవిత్తులు, ఇప్పపూలసారము, సైంధవలవణము ఎండినరసాంజనము, బొంతయేలకలు, పిన్నఏలకలు, హింగుపత్రి, ఇవి శిరోవిరేచనకరద్రవ్యములు. (అనగా శిరమును శోధించునట్టి ద్రవ్యములు.)

### వాతహర ద్రవ్యగణము.

శ్లో॥ భద్రదారునతంకుష్ఠం దశమూలంబలాద్వయమ్ ।
వాయుంవీరతరాదిశ్చ విదార్యాదిశ్చనాశయేత్ ॥ 5.

తా॥ దేవదారు, గ్రంథితగరము, చెంగల్వకోష్ఠు, దశమూలములు, పిన్నముత్తవపులగము, పెద్దముత్తవపులగము, ఉత్తరత్రజెప్పబడు వీరతరాది విదార్యాదిగణములు, ఇవివాతమును హరింపజేసును.

### పిత్తహర ద్రవ్యగణము.

శ్లో॥ దూర్వానంతానింబవాసాత్మగుప్తా గుంద్రా౽భీరుశ్శీతపాకీ
ప్రియంగుః । న్యగ్రోధాదిఃపద్మకాదిఃస్థిరేద్వే పద్మంవన్యం
శారిబాదిశ్చపిత్తమ్ ॥ 6.

తా॥ గరికె, రేగటిదూలగొండి, వేము, అడ్డసరము, దూలగొండి, గుంద్ర అనగా కాకివెదురు, పిల్లిపీచర, గురువింద, ప్రేంకణము, ఇవి దూర్వాదిగణమనబడును. ఈ గణమును, ఉత్తరత్రజెప్పబడు న్యగ్రోధాదిగణము, పద్మకాదిగణము, ముయ్యాకుపొన్న, నక్కతోకపొన్న, తామర, దుండిలము, శారిబాదిగణము ఇవియునుపిత్తమును వశింపజేసును.

### శ్లేష్మహర ద్రవ్యగణములు.

శ్లో॥ ఆరగ్వధాదిరర్కాది ర్ముష్కకాద్యోసనాదికః ।
సురసాదిస్సముస్తాదిర్వత్సకాదిర్బలాసజిత్ ॥ 7.

తా॥ ఆరగ్వధాదిగణము, అర్కాదిగణము, ముష్కకాదిగణము, ఆసనాదిగణము, సురసాదిగణము, ముస్తాదిగణము, వత్సకాదిగణము, అనునీ (7) గణములు శ్లేష్మమును హరింపజేసును.

### జీవనీయ గణము.

శ్లో॥ జీవంతీకాకోల్యౌమేదే ద్వేముద్గమాషపర్ణ్యౌచ ।
ఋషభకజీవకమధుకంచేతి గణోజీవనీయాఖ్యః ॥ 8.



తా॥ మనుబాల, 2 విధములైనకాకోలీ (అనగా కవడీసంజ్ఞగలకాకోలీ, పయస్వినీ సంజ్ఞగలక్షీరకాకోలీ) 2 విధములైన మేదలు (అనగా మణిఛిద్రాయను సంజ్ఞగలమేద, వృక్షుసహాయను సంజ్ఞగలమహామేద) పిల్లిపెసర, కారుమినుములు, ఋషభకము, జీవకము, యష్టిమధుకము, ఇవి జీవంత్యాదిగణమనబడును. దీనికే జీవనీయగణమనియు నామాంతరముగలదు. మఱియు మధురముగను, శీతలముగను, స్నిగ్ధముగనుండుపాలు, చెఱుకు, ద్రాక్ష, అక్షోడము, నేలగుమ్మడు యీమొదలగు ద్రవ్యములనుకూడా జీవనీయగణములో జేర్చికొనందగును.)

### విదార్యాదిగణ తద్గుణము.

శ్లో॥ విదారిపంచాంగులవృశ్చికాలీ వృశ్చీవదేవాహ్వయశూర్పపర్ణ్యః
కండూకరీజీవనహ్రస్వసంజ్ఞే ద్వేపంచకేగోపసుతాత్రిపాదీ ॥ 9.
విదార్యాదిరయంహృద్యో బృంహణోవాతపిత్తహా ।
* శోషగుల్మాంగమర్దోర్ధ్వ శ్వాసకాసహరోగణః ॥ 10.

తా॥ తెల్లనేల గుమ్మడు, చిట్టాముదము, తేలుమణి, లేకవద్ది, గలిజేరు, దేవదారు, పిల్లిపెసర, కాఱుమినుములు, దూలగోవిల, జీవకమను పేరుగల పంచమూలము (అనగా “ఆభీరువీరాజీవంతీ జీవకర్షభకైఃస్మృతం” అనువచనప్రకారము పెద్దపిల్లిపీచర, పిన్నపిల్లిపీచర, కాకోలి, మనుబాల, జీవకము, ఋషభకము, అనునవి) హ్రస్వపంచమూలము (అనగా వాకుడు, ములక, ముయ్యాకుపొన్న, నక్కతోకపొన్న, పల్లేరు అనునవి) సుగంధిపాల, హంసపాది అనగా చెప్పుతట్ట, ఇవి విదార్యాదిగణమనబడును. ఈ గణము హృదయమునకు హితముజేసును. శరీరమునకు పుష్టినిగలుగజేసును. వాతపిత్తములు, శోష, గుల్మము, అంగమర్దము, ఊర్ధ్వశ్వాసము, కాసము వీనిని హరింపజేసును.

### శారిబాదిగణ తద్గుణము.

శ్లో॥ శారిబోశీరకాశ్మర్య మధూకశిశిరద్వయమ్ ।
యష్టీపరూషకంహంతి దాహపిత్తాస్రతృడ్జ్వరాన్ ॥ 11.

తా॥ సుగంధిపాల, వట్టివేరు, పెగ్గుమ్మడు, ఇప్ప, తెల్లచందనము, రక్తచందనము, అతిమధురము, చిట్టీదు, ఇవిశారిబాదిగణమనబడును. ఈ గణముసర్వాంగతాపము, పిత్తరక్తము, దప్పి, జ్వరము వీనిని హరింపజేసును.

---

* శోఫ ఇతి పా.

### పద్మకాదిగణ తద్గుణము.

శ్లో॥ పద్మకపుండ్రౌ వృద్ధితుగర్ద్ధ్యః శృంగ్యమృతాదశజీవనసంజ్ఞాః ।
స్తన్యకరాఘ్నంతీరణపిత్తం ప్రీణనజీవనబృంహణవృష్యాః ॥ 12.

తా॥ పద్మకమనగా హేమపద్మము, ప్రపౌండరీకము, ఋద్ధి, వృద్ధి, తవాక్షీరి, కర్కాటకశృంగి, తిప్పతీగె, జీవంత్యాదిగణములో జెప్పబడిన 10 ద్రవ్యములు, ఇవిపద్మకాదిగణమనబడును. ఈ గణము చనుబాలను వృద్ధిజేసును. వాతపిత్తములను హరించజేసును. ప్రీతి, ఓజోవృద్ధి, శరీరపుష్టి, శుక్రవృద్ధి వీనిని గలుగజేసును.

### పరూషకాదిగణ తద్గుణము.

శ్లో॥ పరూషకంవరాద్రాక్షా కట్ఫలం * కతకాత్ఫలమ్ ।
రాజాహ్వందాడిమంశాకం తృణ్మూత్రామయవాతజిత్ ॥ 13.

తా॥ చిట్టీదు, త్రిఫలములు, ద్రాక్ష, గుమ్మడిరేగు, చిల్లగింజ, పాలమాను, దానిమ్మ, టేకు, ఇవి పరూషకాదిగణమనబడును. ఈగణము దప్పి, మూత్రరోగము, వాతము, వీటిని హరింపజేసును.

### అంజనాదిగణ తద్గుణము.

శ్లో॥ అంజనంఫలినీమాంసీ పద్మోత్పలరసాంజనమ్ ।
సైలామధుకనాగాహ్వం విషాంతర్దాహపిత్తసుత్ ॥ 14.

తా॥ అంజనము (అనగా స్రోతోంజనము, సౌవీరాంజనము) ప్రేంకణము, జటామాంసి, పుష్కరమూలము, నల్లకలువ, రసాంజనము, ఏలకలు, యష్టిమధుకము, నాగకేసరములు ఇవి అంజనాదిగణమనబడును. ఈగణము విషము, అంతస్తాపము, పిత్తము వీనిని హరింపజేసును.

### పటోలాదిగణ తద్గుణము,

శ్లో॥ పటోలకటురోహిణీచందనం మధుస్రవగుడూచిపాఠాన్వితమ్ ।
నిహంతికఫపిత్తకుష్ఠజ్వరాన్ విషంవమిమరోచకంకామలామ్ ॥

తా॥ చేదుపొట్ల, కటుకరోహిణి, చందనము, చాగ, తిప్పతీగె, పాఠ అనగా అంబష్ఠా, ఇవి పటోలాదిగణమనబడును. ఈగణము కఫము, పిత్తము, కుష్ఠము, జ్వరము, విషము, వాంతి, అరోచకము, కామల వీనిని హరింపజేసును.

---

* కతకోత్పలం ఇతి పా.



### గుడూచ్యాదిగణ తద్గుణము.

శ్లో॥ గుడూచీపద్మకారిష్ట ధాన్యకారక్తచందనమ్ ।
పిత్తశ్లేష్మజ్వరచ్ఛర్ది దాహతృష్ణాఘ్నమగ్నికృత్ ॥ 16.

తా॥ తిప్పతీగె, (పద్మకం అనగా తీగెతురిమిడి) వేప, ధనియాలు, రక్తచందనము, ఇవి గుడూచ్యాదిగణమనబడును. ఈ గణము పిత్తము, శ్లేష్మము, జ్వరము, వాంతి, సర్వాంగతాపము, దప్పి, వీనినిహరింపజేసును. అగ్నిదీపనమును గలుగజేసును.

### ఆరగ్వధాదిగణ తద్గుణము.

శ్లో॥ ఆరగ్వధేంద్రయవపాటలికాకతిక్తా నింబామృతామధురసా
స్రువవృక్షపాఠాః । భూనింబసైర్యకపటోలకరంజయుగ్మ
సప్తచ్ఛదాగ్నిసుషవీఫలబాణఘోంటాః ॥ 17 ॥ ఆరగ్వధాది
ర్జయతి ఛర్దికుష్ఠవిషజ్వరాన్ । కఫంకండూం ప్రమేహాంచ
దుష్టవ్రణవిశోధనః ॥ 18.

తా॥ రేల, కొడిసెపాల, కలిగొట్టు, గురిజ, వేము, తిప్పతీగె, చాగ, కానరేగు, పాఠ అనగా అంబష్ఠా, నేలవేము, ములుగోరింట, చేదుపొట్ల, సెమలు, క్రానుగు, ఏడాకులపొన్న, చిత్రమూలము, ఆరెతీగె, మ్రంగకాయ, నల్లగోరింట, పోక, ఇవి ఆరగ్వధాదిగణమనబడును. ఈగణము వాంతి, కుష్ఠము, విషము, జ్వరము, కఫము, దురద, ప్రమేహము వీనిని హరింపజేసును. దుష్టవ్రణములనార్చును.

### అసనాదిగణ తద్గుణము.

శ్లో॥ అసనతినిశభూర్జ శ్వేతవాహప్రకీర్యా ఖదిరకదరభండీశింశు
పామేషశృంగ్యః । త్రిహిమతలపలాశాజోంగకశ్శాకసాలా
క్రముకధవకలింగచ్ఛాగకర్ణాశ్వకర్ణాః ॥ 19 ॥ అసనాదిర్విజ
యతే శ్విత్రకుష్ఠ * కఫక్రిమీన్ । పాండురోగం ప్రమేహాంచ
మేదోదోషనిబర్హణః ॥ 20.

తా॥ వేగిస, నెమ్మి, భుజపత్రి, మద్ది, నెమలడుగుమ్రాను, చంద్ర, తెల్లచంద్ర, దిరిసెనము, ఇలుగుడు, ఒద్ది, త్రిహిమము (అనగా చందనము, రక్తచందనము, పీతచందనము) తాటి, మోదుగు, అగరు, టేకు, ఏపిబంక, పోక, ధవవృక్షము,

---

* వమి ఇతి పా.

కుళింగం (అనగా కర్కాటకశృంగి,) ఛాగకర్ణం (అనగా వల్లమద్ది) అశ్వకర్ణం (అనగా తెల్లమద్ది,) ఇవి అసనాదిగణమనబడును. ఈగణము శ్విత్రము, కుష్ఠము, కఫము, కృమిరోగము, పాండురోగము, ప్రమేహము, మేదోదోషము వీనిని హరింపజేసును.

### వరణాదిగణ తద్గుణము.

శ్లో॥ వరణాసైర్యకయుగ్మశతావరీ దహనమోరటబిల్వవిషాణికాః ।
ద్విబృహతీద్వికరంజజయాద్వయం బహలపల్లవదర్భరుజాకరాః ॥
వరణాదిఃకఫంమేదో మందాగ్నిత్వంనియచ్ఛతి ।
* అధోవాతంశ్శిరశ్శూలం గుల్మంచాంతస్సవిద్రధిమ్ ॥ 22.

తా॥ ఉలిమిరి సైర్యకయుగ్మం (అనగాఎఱ్ఱనిపుష్పములుగలగోరింట, పచ్చని పుష్పములుగల గోరింట) పిల్లిపీచర, చిత్రమూలము, చాగ, మారేడు, ఒద్ది, 2 విధములైనబృహతులు (అనగా వ్రాకుడు,ములక) 2 విధములైనక్రానుగులు (అనగా క్రానుగు, సెమలు) 2 విధములగుకరక్కాయలు (అనగా తర్కారి, హారీతకీ,) మునుగ, కుశదర్భ, ఆదొండ, ఇవివరణాదిగణమనబడును. ఈగణము కఫము, మేదస్సు, అగ్నిమాంద్యము, అధోవాతము, శిరశ్శూల, గుల్మము, అంతర్విద్రధి వీటిని హరింపజేసును.

### ఊషకాదిగణ తద్గుణము.

శ్లో॥ ఊషకస్తుత్థకంహింగు కాసీసద్వయసైంధవమ్ ।
సశిలాజతుకృచ్ఛ్రాశ్మ గుల్మమేదఃకఫాపహమ్ ॥ 23.

తా॥ ఊషకం (అనగాజముడు,) తుత్థము, ఇంగువ, 2 విధములైనకాసీసములు (అనగా పాంశుకాసీసము, పుష్పకాసీసము,) సైంధవలవణము, శిలాజిత్తు ఇవి ఊషకాదిగణమనబడును. ఈ గణము మూత్రకృచ్ఛ్రము, అశ్మరీరోగము, గుల్మము, మేదోరోగము, కఫము వీటిని హరింపజేసును.

### వీరతరాదిగణ తద్గుణము.

శ్లో॥ వేల్లంతరారణికబూకవృషాశ్మభేద గోకంటకోత్కటసహాచర
బాణకాశాః । వృక్షాదనీనలకుశద్వయ † గుంఠగుంద్రాభ
ల్లూకమోరటకురంటకరంభపార్థాః ॥ 24 ॥ వర్గోవీరతరా

* అధ్వవాతం ఇతిపా. † గుచ్ఛ ఇతిపా.



ద్యోయం హంతివాతకృతాన్గదాన్ । అశ్మరీశర్కరా
మూత్రకృచ్ఛ్రాఘాతరుజాహరః ॥ 25.

తా॥ వెణుతురు, తక్కలి, మోదెవ, ఆడ్డసరము, పాషాణభేది, పల్లేరు, జిలుగు, పచ్చ ములుగోరింట, నల్లపుష్పములుగలగోరింట, రెల్లు, బదనిక, కిక్కసగడ్డి, కుశద్వయము (అనగా సూక్ష్మదర్భ, స్థూలదర్భ,) గుంఠ (అనగా పులుగు) గుంద్రా (అనగా పదయేరకం), దుందిలము, చేకొణీది, కోలగురుగు, దుష్టుపు, పార్థ (అనగా ఆదిత్యభక్తి, లేక లింగమెరుగుడు,) ఇవి వీరతరాదిగణమనబడును. ఈగణము వాతము వలన జనించినరోగములు, అశ్మరి, శర్కర, మూత్రకృచ్ఛ్రము, మూత్రాఘాతము వీనిని హరింపజేసును.

### రోధ్రాదిగణ తద్గుణము.

శ్లో॥ రోధ్రశాబరకరోధ్రపలాశా * జింగిణీసరలకట్ఫలయుక్తాః ।
కుత్సితాంగకదలీగతశోకాః సైలవాలుపరిపేలవమోచాః ॥ 26.
ఏషరోధ్రాదికోనామ మేదఃకఫహరోగణః ।
యోనిదోషహరస్స్తంభీ † వర్ణ్యోవిషవినాశనః ॥ 27.

తా॥ లొద్దుగు, తెల్లలొద్దుగు, ఆలుగంట్లకచోరము, గిలిగిరింత, సరళదేవదారు, గుమ్మడిరేగు, సన్నరాస్నము, దీనినే దింటెనయని కొందరు, కడిమి, అరటి, అశోకము, కూతురుబుడమ, తుంగముస్తెలు, అందుగు, ఇవి రోధ్రాదిగణ మనబడును. ఈగణము మేదోరోగము, కఫము, యోనిదోషము, వీనిని హరింపజేసును. వాతాది దోషములను, మూత్రాదిమలములను స్తంభింపజేసును. శరీరమునకు వర్ణమును గలుగజేసును. విషదోషములను హరింపజేసును.

### అర్కాదిగణ తద్గుణము.

శ్లో॥ అర్కాలర్కౌనాగదంతీ విశల్యాభార్గీరాస్నావృశ్చికాలీప్రకీర్యా ।
ప్రత్యక్పుష్పీపీతతైలోదకీర్యా శ్వేతాయుగ్మంతాపసానాంచ
అయమర్కాదికోవర్గః కఫమేదోవిషాపహః । [వృక్షః ॥
కృమికుష్ఠప్రశమనో విశేషాద్వ్రణశోధనః ॥ 29.

తా॥ జిల్లేడు, తెల్లజిల్లేడు, దీనిపుష్పములు తెల్లగనుండును. నాగదంతి, చన్న చర్లగడ్డ, గంటుభారంగి, దుంపరాస్నము, తేలుమణి, నెమలడుగు, ఉత్తరేణు, పీత

* జిఙ్ఝిణీ ఇతిపా. † ప్రణ్యో ఇతిపా.

తైలా (అనగా కాకిదొండ) సెమలు, 2 విధములగు శ్వేతలు (అనగా గినియా, పసరు గినియ), గారచెట్టు, ఇవి అర్కాదిగణమనబడును. ఈగణము కఫము, మేదోరోగము, విషము, కృములు, కుష్ఠము, వీనిని శమింపజేసును. విశేషముగా వ్రణములను శోధించును.

### సురసాదిగణ తద్గుణము.

శ్లో॥ సురసయుగఫణిజ్జం కాలామాలావిడంగం ఖరబుసవృషకర్ణీ
కట్ఫలంకాసమర్దః । క్షవక * సరసిభార్గీకాముకాకాకమాచీ
కులహలవిషముష్టీభూస్తృణోభూతకేశీ ॥ 30॥ సురసాదిగణః
శ్లేష్మ మేదఃకృమినిషూదనః । ప్రతిశ్యాయారుచిశ్వాస కాస
ఘ్నో వ్రణశోధనః ॥ 31.

తా॥ తులసి, నల్లతులసి, గగ్గెర, నల్లగగ్గెర, వాయువిడంగములు, మరువము, ఎలుకచెవి, గుమ్మడుశేగు, కసివెంద, తుమ్మి, సరసి (అనగా చాతలాళి), గంటుభారంగి, పిప్పలికాయ, దీనినే బండిగురువిందయని కొందరుచెప్పెదరు. కాచి, నేలకనుము, విషముష్టి, కామంచిపూరి, జటామాంసి, లేక నల్లవావిలి ఇవి సురసాదిగణమనబడును. ఈ గణము శ్లేష్మము, మేదోరోగము, కృములు, పీనసము, అరుచి, శ్వాసము, కాసము, వీనిని హరింపజేసును. వ్రణమును శుద్ధిజేసును.

### ముష్కకాదిగణ తద్గుణము.

శ్లో॥ ముష్కకస్నుగ్వరాదీపి పలాశధవశింశపాః ।
గుల్మమేహాశ్మరీపాండు మేదోర్శఃకఫశుక్రజిత్ ॥ 32.

తా॥ ముక్కపుచెట్టు, బ్రహ్మజెముడు, త్రిఫలములు, చిత్రమూలము, మోదుగ, ధవవృక్షము, ఇరుగుడు, ఇవి ముష్కకాదిగణమనబడును. ఈ గణము గుల్మము, మేహము, అశ్మరీరోగము, పాండువు, మేదోరోగము, అర్శస్సు, కఫము, శుక్రదోషము వీనిని హరింపజేసును.

### వత్సకాదిగణ తద్గుణము.

శ్లో॥ వత్సకమూర్వాభార్గీకటుకా మరిచంఘుణప్రియాచగండీరమ్ ।
ఏలాపాఠాజాజీకట్వంగ ఫలాజమోదసిద్ధార్థవచాః ॥ 33.

* ఝుంసి ఇతిపా.



జీరకహింగువిడంగంపశుగంధాపంచకోలకంహంతి ।
చలకఫమేదఃపీనస గుల్మజ్వరశూలదుర్నామ్నః ॥ 34.

తా॥ కొడిసె, చాగ, గంటుభారంగి, మిరియములు, కటుకరోహిణి, తెల్లఅతివస, ఏలకలు, పాత, బ్రహ్మజెముడు, తెల్లజీలకర్ర, పెద్దమ్రానుపండు, దీనినే కొందరు దుండిలపుఫలమని వచించెదరు. ఓమము, తెల్లఆవాలు, వస, జీలకర్ర, ఇంగువ, వాయువిడంగములు, వాయింట, పంచకోలకములు, ఇవి వత్సకాదిగణమనబడును. ఈ గణము వాతము, కఫము, మేదోరోగము, పీనసము, గుల్మము, జ్వరము, శూల, దుర్నామరోగము, వీనిని హరింపజేసును.

### వచాది - హరిద్రాదిగణ తద్గుణములు.

శ్లో॥ వచాజలదదేవాహ్వ నాగరాతివిషాభయాః ।
హరిద్రాద్వయయష్ట్యాహ్వ కలశీకుటజోద్భవాః ॥ 35.
వచాహరిద్రాదిగణా వామాతీసారనాశనౌ ।
మేదఃకఫాఢ్యపవన స్తన్యదోషనిబర్హణౌ ॥ 36.

తా॥ వస, ముస్తెలు, దేవదారు, లేక భద్రముస్తెలు, శొంఠి, అతివస కరక్కాయ ఇవి వచాదిగణమనబడును. పసపు, మ్రానిపసపు, యష్టిమధుకము, నక్కతోకపొన్న, కొడిసెపాల, ఇవిహరిద్రాదిగణమనబడును. వచాదిగణము, హరిద్రాదిగణము, అనునీ 2-ను ఆమాతీసారము, మేదోరోగము, కఫరోగము, ఆఢ్యవాతము, స్తన్యదోషము, వీనిని హరింపజేసును.

### ప్రియంగ్వాది - అంబష్ఠాదిగణ తద్గుణము.

శ్లో॥ ప్రియంగుపుష్పాంజన యుగ్మపద్మా పద్మాద్రజోయోజన
వల్ల్యనంతా।* మానద్రుమోమోచరసస్సమంగా పున్నాగ
శీతంమదనీయహేతుః ॥ 37 ॥ అంబష్ఠామధుకం నమస్కారీ
నందీవృక్షపలాశకచ్ఛురాః। రోధ్రంధాతకిబిల్వపేశికేకట్వం
గఃకమలోద్భవంరజః ॥ 38॥ గణౌ ప్రియంగ్వంబష్ఠాదీపక్వాతీ
సారనాశనౌ।సంధానీయౌహితౌపిత్తే వ్రణానామపిరోపణౌ॥

తా॥ ప్రేంకణము, పుష్పాంజనము, స్రోతోంజనము, సౌవీరాంజనము, ఒలితామర, తామరఅగరులు, మంజిష్ఠి, ప్రాచితీగె, బూరుగు, బూరుగుబంక, మెట్ట

* సాలద్రుమో ఇతిపా,

తామర, పొన్న చందనము, ఏరుజాజి, ఇవి ప్రియంగ్వాదిగణమనబడును. అంబష్ఠా (అనగా అంబాళము లేక మయూరశిఖీ), యష్టిమధుకము, మెట్టతామర, నందివర్ధనము, మోదుగు, పిన్నరేగటి దూలగొండి, లేక తీగెతురిమిడి, లొద్దుగు, ఏరుజాజి, బిల్వమజ్జ, దుందిలము, పద్మరేణుః ఇవి అంబష్ఠాదిగణమనబడును. ప్రియంగ్వాదిగణము, అంబష్ఠాదిగణము అనునీ 2-ను పక్వాతీసారమును నశింపజేసును. విరిగిన యంగాదుల నొకటిగజేర్చును. పిత్తరోగమునందు పథ్యకరమయినవి. వ్రణము నార్చును.

## ముస్తాదిగణ తద్గుణము.

శ్లో॥ ముస్తావచాగ్ని ద్వినిశాద్వితిక్తా భల్లాతపాఠా త్రిఫలావిషాఖ్యాః । కుష్ఠంత్రుటీహైమవతీచయోని స్తన్యామయఘ్నా మలపాచనాశ్చః 40.

తా॥ తుంగముస్తెలు, వస, చిత్రమూలము, పసపు, మ్రానిపసపు, 2 విధములైన తిక్తలు (అనగా కటుకరోహిణి, కాకతిక్త అనగా గురిజ), జీడి, పాఠ, త్రిఫలములు, తెల్ల అతివస, చెంగల్వకోష్ఠు, ఏలకలు, తెల్లవస ఇవి ముస్తాదిగణమనబడును. ఈ గణము యోనిరోగమును చనుబాలను హరింపజేసును. మలమును పాకముజేసును.

## న్యగ్రోధాదిగణ తద్గుణము.

శ్లో॥ న్యగ్రోధపిప్పలసదాఫలరోధ్రయుగ్మం జంబూద్వయార్జున కపీతనసోమవల్కాః । * ప్లక్షామ్రవంజులప్రియాల పలాశ నందీ కోలీకదంబవిరలామధుకంమధూకమ్ ॥ 41 ॥ న్యగ్రోధాదిర్గణో వ్రణ్యస్సంగ్రాహీభగ్నసాధనః । మేదఃపిత్తాస్రతృట్దాహ యోనిరోగనిబర్హణః ॥ 42.

తా॥ మఱ్ఱి, రావి, మేడి, 2 విధములైన రోధ్రములు (అనగా లొద్దుగు, తెల్ల లొద్దుగు), 2 విధములైన జంబూవృక్షములు (అనగా అల్లోనేరేడు, కాకినేరేడు), మద్ది, కలురావి, సోమిండ, జువ్వి, మామిడి, ప్రబ్బలిమొరలి, మోగుగు, నందివర్ధనము, రేగు, కడిమి, తుమికి, యష్టిమధుకము, ఇప్పపూలు ఇవి న్యగ్రోధాదిగణమనబడును. ఈ గణము వ్రణములనార్చును. మలమునుగట్టిపరచును. విరిగినయంగాదుల నొకటిగజేర్చును. మేదస్సు, పిత్తరక్తము, దప్పి, సర్వాంగతాపము, యోనిరోగము వీటిని హరింపజేసును.

* వృక్షామ్లం ఇతిపా.



## ఏలాదిగణ తద్గుణము.

శ్లో॥ ఏలాయుగ్మ తురుష్కకుష్ఠ ఫలినీమాంసీ జలధ్యామకమ్ । స్పృక్కాచోరకచోచపత్ర తగరస్థౌణేయజాతీరసాః । శుక్తిర్వ్యాఘ్రనఖోమరాహ్వమగురుః శ్రీవాసకంకుంకుమం చండాగుగ్గులుదేవధూపఖపురాః పున్నాగనాగాహ్వయమ్ ॥ 43 ॥ ఏలాదికోవాతకఫౌ విషంచవినియచ్ఛతి।వర్ణప్రసాదనః కండూపిటికాకోఠనాశనః ॥ 44.

తా॥ రెండు విధములైన ఏలకలు (అనగా బొంతయేలకలు, పిన్నయేలకలు,) తురుష్కధూపము, చెంగల్వకోష్ఠు, ఫలినీ (అనగా ప్రేంకణము,) జటామాంసి, కురువేరు, ధ్యామకము, (అనగా దవదగ్ధకము) స్పృక్కా, కచోరము, లవంగపుచెక్క తమాలపత్రము, గ్రంధితగరము, దవనము, బోళము, శుక్తి (అనగా నఖము), వ్యాఘ్రనఖము, దేవదారు, అగరు, శ్రీవాసకము (అనగా శ్రీవేష్టకము), కుంకెమపువ్వు, చండా (అనగా కోపనా), మహిసాక్షి, సర్జరసము, ఖపురః (అనగాకందురుష్కము) సురపొన్న, నాగకేసరములు ఇవి ఏలాదిగణమనబడును. ఈగణము, వాతము, కఫము, విషము, దురద, పిటిక, కోఠరోగము వీనిని హరింపజేసును. శరీరమునకు కాంతినిచ్చును.

## శ్యామాదిగణ తద్గుణము.

శ్లో॥ శ్యామాదంతీద్రవంతీక్ర ముకకుటరణీశంఖినీ చర్మసాహ్వ స్వర్ణక్షీరీగవాక్షీశిఖరిరజనకాఛిన్న రోహాకరంజాః।బస్తాంత్రీ వ్యాధిఘాతో బహలబహురస స్తీక్ష్ణవృక్షాత్ఫలాని శ్యామాద్యోహంతి గుల్మంవిషమరుచి కఫౌహృద్రుజం మూత్రకృచ్ఛ్రమ్ ॥ 45.

తా॥ నల్లతెగడ, నేలదంతి, ఎలుకచెవి, పట్టికాలోధ్రము, తెల్లతెగడ, శంఖినీ (అనగా పద్మపుతీగె), చర్మసాహ్వ (అనగా సంబరేణు) దీనినే బ్రాహ్మియని కొందరు; స్వర్ణక్షీరి (అనగాకంఠుష్ఠము,) తెల్లదింటెన, దీనినే పాపరబుడమయని కొందరుచెప్పెదరు. ఉత్తరేణు, రజనకః (అనగాకంపిల్లకము) తిప్పతీగె, కరంజః (అనగాకరివేము,) గొలిమిడి, ఈల, చెఱుకు, వరగోగుపండు, ఇవి శ్యామాదిగణమనబడును. ఈగణము గుల్మము, విషము, అరుచి, కఫము, హృద్రోగము, మూత్రకృచ్ఛ్రము వీనిని హరింపజేసును.

### ద్రవ్యాలాభమునందు - తుల్యద్రవ్య గ్రహణానుజ్ఞ.

శ్లో॥ త్రయస్త్రింశదితి ప్రోక్తా వర్గా స్తేషుత్వలాభతః ।
యుంజ్యాత్తద్విధమన్యచ్చ ద్రవ్యంజహ్యాదయౌగికమ్ ॥ 46.

తా॥ ఈప్రకారముగా (33) వర్గములు చెప్పబడినవి. ఈవర్గములలో నేదైనా నొకద్రవ్యము దొరకనియెడల రసవీర్యవిపాకములవలన తత్సమానముగలవేరేద్రవ్యము యిందు జెప్పబడకుండినను దాని నుపయోగించుకొనవలయును, ఈవర్గములలో జేరియుండు వస్తువులో నేదైనను ఔషధయోగములకు అయుక్తముగనుండినచో దానిని త్యజించవలయును. (అనగా దోషము, రోగము, రోగి వీనినపేక్షించి ఏగణము ఒకపురుషునియొక్క ఎట్టివయస్సు, ఎట్టికాలమునందు తత్సాధ్యమయిన సకలరోగ శమనార్థంబై యుక్తముగనుండునో అటువంటి గణములో 1, లేక 2, లేక 3 వస్తువులు దొరకనిచో వానికి సమానమయిన గుణముగల వేరే 1టి-లేక 2డు-లేక 3 డు-వస్తువులనుజేర్చి ప్రయోగించవలెను. అటుగాక సర్వవస్తువులను వేరుగాజేర్చి ప్రయోగించంజనదు అని తాత్పర్యము.) ఈయర్థమునే,—

"సమీక్ష్యదోషభేదాంశ్చ గణాన్భిన్నాన్ప్రయోజయేత్ । పృథఙ్మిశ్రాన్సమస్తాంశ్చ గణాన్వావ్యస్తసంహతాన్ ॥"

అనెడి సుశ్రుతవచనముకూడా బోధించుచున్నది. పై జెప్పిన వర్గమువలె నింక ననేకవర్గములు గలవు. అయినను వానిలో పై జెప్పిన 33 వర్గములే ప్రధానమని తెలియపరచు నిమిత్తము యీతంత్రకారుడు "త్రయస్త్రింశత్" అనిసంఖ్యాపూర్వకముగ జెప్పియున్నాడు.

### వర్గప్రయోగ గుణము.

శ్లో॥ ఏతేవర్గాదోషదూష్యాద్యపేక్షం కల్కక్వాథస్నేహలేహ్యాది
యుక్తాః । పానేనస్యేఽన్వాసనేంత ర్బహిర్వాలేపాభ్యంగై
ర్ఘ్నంతిరోగాన్సుకృచ్ఛ్రాన్ ॥ 47.

తా॥ పై జెప్పిన వర్గములు వైద్యునిచే దోషము, దూష్యము, వయస్సు, బలము, వీనికనుసరించి కల్కము, క్వాథము, స్నేహము, లేహము, కషాయము యీమొదలగువానియందును పానము, నస్యము, అనువాసనవస్తి, అంతర్లేపము, బహిర్లేపము, అభ్యంగము యీమొదలగువానియందును ప్రయోగించబడినయెడల కష్టసాధ్యముగనుండు రోగములను హరింపజేయును.

పంచదశాధ్యాయము, ముగిసెను.

---

శ్రీరస్తు.

## షోడశాధ్యాయము.

"స్నేహస్వేదావనభ్యస్య" అను వచనప్రకారము స్నేహస్వేదములను వదలి శోధనము సంభవించనేరదు. కాబట్టి శోధనాదిగణసంగ్రహాధ్యాయానంతరము స్నేహస్వేదాధ్యాయము జెప్పబడుచున్నది.

### స్నేహ - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతఃస్నేహవిధి మధ్యాయంవ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః ॥

తా॥ శోధనాది గణసంగ్రహాధ్యాయానంతరము స్నేహస్వేదములు లేకుండా శోధధము సంభవించనేగదు. కాబట్టి ఘృతాదిస్నేహవిధులను తెలియజేయునట్టి స్నేహవిధ్యధ్యాయమును వివరించెదము.

### స్నేహన - విరూక్షణౌషధ స్వరూపము.

శ్లో॥ గురుశీతసరస్నిగ్ధ మందసూక్ష్మమృదుద్రవమ్ ।
ఔషధంస్నేహనంప్రాయో విపరీతంవిరూక్షణమ్ ॥ 1.

తా॥ గురువు, శీతలము, సరము, స్నిగ్ధము, మందము, సూక్ష్మము, మృదు, ద్రవము, అనునీ గుణములతో గూడియుండునట్టి ద్రవ్యము తఱచుగ స్నేహనౌషధముగనగును. ఈ గుణములకంటె విరుద్ధమైనగుణములతో (అనగా లఘు, ఉష్ణ, స్థిర, రూక్ష, తీక్ష్ణ, స్థూల, కఠిన, సాంద్రగుణములతో) గూడియుండు ద్రవ్యము తఱచుగ విరూక్షణౌషధముగనగును. ఆవనూనె, మేక, క్షీరము అనుద్రవ్యములు విష్కరము, ప్రతుదము, మృగము అనుపేరంబఱంగు 3 వర్గములు ఇవి లఘువుగనుండినను స్నేహనౌషధముగనగును. మత్స్యములు, మహిషమాంసము ఇవి ఉష్ణముగనుండినను స్నేహనౌషధముగనగును. యవధాన్యము, అలచందలు ఇవి గురుత్వము, శీతలము, సరత్వము యీ మొదలగు గుణములతోగూడియుండినను విరూక్షణౌషధముగనగును. కావుననే తఱచుగ అను అర్థమును బోధించెడి "ప్రాయః" అనుపదము మూలశ్లోకమునందు ప్రయోగించబడినది.

## స్నేహములలో - ఘృతమునకు శ్రేష్ఠత్వము.

శ్లో॥ సర్పిర్మజ్జావసాతైలం స్నేహేషు ప్రవరంమతమ్ ।
తత్రాపిచోత్తమంసర్పి స్సంస్కారస్యానువర్తనాత్ ॥ 2.

తా॥ క్షీరము, అనూపమాంసము యీ మొదలగు స్నేహద్రవ్యములలో ఘృతము, మజ్జ, వస, తైలము, అనునీ 4 స్నేహములు శీఘ్రకారిత్వగుణము గలవియగుటంజేసి మిగుల శ్రేష్ఠంబులు. మఱియు నానాలుగింటిలో ఘృతము సంస్కారగుణముల ననుసరించియుండుటవలన మిగుల శ్రేష్ఠంబైనది.

“ సంస్కారస్యానువర్తనాత్ ”

అనువచన ప్రకారము ఘృతము సంస్కారగుణముల ననుసరించుపక్షములో మిరియములు, చిత్రమూలము యీ మొదలగు ద్రవ్యములతో కూడా సంస్కారము చేయబడిన ఘృతమునకు శైత్యాదిగుణములు లేకుండునటుల సంభవించునుగదా; అటులనా ఘృతమునకు శైత్యాది గుణములు నశించి ఉష్ణము మొదలగు గుణములుగలుగుట ప్రత్యక్ష విరుద్ధము. కాబట్టి ఘృతము సంస్కారగుణముల ననుసరించుననుట అయుక్తమనే శంకగలుగును. అయితే ఘృతము స్వగుణమైన శైత్యాదిగుణములను వదలకుండా సంస్కారగుణములనుకూడా ననుసరించుచు యితర ద్రవ్యగుణములచే జెరచబడకుండుటంజేసి యిది సర్వస్నేహములలో శ్రేష్ఠంబైనది. కాబట్టి ఘృతమునకు “ సంస్కారస్యానువర్తనాత్ ” అని చెప్పియుండుట యుక్తంబేను. తైలము, వస, మజ్జ అనునవి యైననో సంస్కారవశముచే తమగుణములను వదలి సంస్కారగుణము ననుసరించును. ఈ విషయములో చందనాది తైలము దృష్టాంతముగనుండును. మఱియును తైలాదిగుణములు యితర ద్రవ్యములచే జెరచబడుటవలన ఘృతమునకంటె తైలాదులు నికృష్టంబులు. కాబట్టి ఘృతసాధ్యమగు వాత పిత్త జ్వరాదిరోగములయందు తైలము చెరుపునుజేసును. కావున నది యౌషధముగ తంత్రకారులచే నంగీకరింపబడదయ్యె. తైలసాధ్యమగు రోగములయందు రోగశమనార్థమై తచ్ఛాంతికరమైన ద్రవ్యములచే సంస్కారము చేయబడిన ఘృతము చెరుపుకు హేతువుగనుండకుండుటంజేసి నది యౌషధముగ తంత్రకారులచే నంగీకరింపబడియున్నది. కావుననే సర్వస్నేహములలో ఘృతమే మిగుల శ్రేష్ఠంబైనది.

“ మాధుర్యాదవిదాహిత్వా జ్జన్మాద్యావచ్ఛశీలనాత్ ”

ఘృతము మధురముగ నుండుటవలనను, విదాహకారి కాకుండుటవలనను, జన్మము మొదలుకొని అభ్యసించబడియుండుటవలనను అన్నిటిలోను శ్రేష్ఠంబైనది.



## ఘృతాదులకు - పిత్తహరత్వ గుణము.

శ్లో॥ పిత్తఘ్నాస్తేయథాపూర్వ మితరఘ్నాయథోత్తరమ్ ।

తా॥ పైజెప్పినఘృతము, మజ్జ, వస, తైలము, అనునీ 4 స్నేహములలో యథాపూర్వమునందుండునవి (అనగా ఒక్కొకదానికంటె ముందుండునవి) యథాక్రమముగ పిత్తమును విశేషముగా హరింపజేసును. (అనగా వస పిత్తమును హరింపజేసుననియును, మజ్జ దానికంటె విశేషముగా పిత్తమునుహరింపజేసుననియును, ఘృతము అన్నిటికంటె విశేషముగా పిత్తమును హరింపజేసుననియును భావము.) పూర్వోక్త చతుర్విధస్నేహములలో యథోత్తరము వుండునవి (అనగా ఒక్కొకదానికంటె ఉత్తరమునందుండునవి) యథాక్రమముగ వాతకఫములను విశేషముగా హరింపజేసును. (అనగా మజ్జ వాతశ్లేష్మమును హరింపజేసుననియును, దానికంటె విశేషముగా వస వాతకఫములను హరింపజేసుననియును, తైలము అన్నిటికంటె విశేషముగా వాతశ్లేష్మములను హరింపజేసుననియును భావము.) “ ఇతరఘ్నాః ” అను సామాన్యశబ్దము ప్రయోగించబడియుండినను శ్లేష్మరోగములో స్నేహము నిషేధింపబడియుండుటవలన ప్రకృతమునందు “ ఇతరఘ్నాః ” అనుపదమునకు వాతహరమనియే యర్థము చేయవలయునని కొందరువ్యాఖ్యానము చేయుచున్నారు.

## ఘృతాదులకు గురుత్వము.

శ్లో॥ ఘృతాత్తైలంగురువసా తైలాన్మజ్జాతతోపిచ ॥ ౩.

తా॥ ఘృతమునకంటె తైలము మిగుల గురువుగనుండును. తైలమునకంటె వస మిగుల గురువుగనుండును. వసకంటె మజ్జ విశేషముగా గురుతరముగనుండును.

## యమకాది - స్నేహ వివరము.

శ్లో॥ ద్వాభ్యాంత్రిభిశ్చతుర్భిస్తై ర్యమకస్త్రివృతోమహాన్ ।

తా॥ రెండు స్నేహములు చేరినయెడల యమకమనబడును. 3 స్నేహములు చేరినయెడల త్రివృతమనబడును. 4 చేరినయెడల మహాస్నేహమనబడును. 2 స్నేహములుజేరునట్టి క్రమంబెట్లనగా:—ఘృతము వస, ఘృతము తైలము, ఘృతము మజ్జ అని తెలియవలయును. ఇటులనే 3, 4, స్నేహములుజేరునట్టి క్రమమునుకూడా బుద్ధిమంతులగువారు ఊహించుకొనవలయును.

## స్నేహకర్మ యందర్హులు.

శ్లో॥ స్వేద్యసంశోధ్యమద్యస్త్రీ వ్యాయామాసక్తచింతకాః ॥ 4.

వృద్ధబాలాబలకృశా రూక్షాః క్షీణాస్రరేతసః ।
వాతార్తస్యందతిమిర దారుణప్రతిబోధినః ॥ [స్నేహ్యాః] 5.

తా॥ స్వేద్యుడు (అనగా స్వేదమునకర్హుడు), సంశోధ్యుడు (అనగా శోధనార్హుడు), మద్యము, స్త్రీ, వ్యాయామము, వీనియందు విశేషముగా నాసక్తిగలవాడు, ఎల్లప్పుడు చింతతోగూడి యుండువాడు, వృద్ధులు, బాలురు, దుర్బలులు, కృశులు, రూక్షతోగూడియుండువారు, రక్తము క్షయించినవారు, శుక్రక్షయముగలవారు, వాతపీడితులు, స్రోతోబంధముగలవారు, తిమిరమను నేత్రరోగముగలవారు, కడుకష్టముమీద నేత్రములు తెరచిచూచువారు వీరలు స్నేహకర్మకు అర్హులగనుండెదరు.

స్నేహకర్మానర్హులు.

శ్లో॥ నత్వతిమందాగ్ని తీక్ష్ణాగ్నిస్థూలదుర్బలాః ।
ఊరుస్తంభాతిసారామ గళరోగగరోదరైః ॥ 6.
మూర్ఛాచ్ఛర్ద్యరుచిశ్లేష్మ తృష్ణామద్యైశ్చపీడితాః ।
అపప్రసూతాయుక్తేచ నస్యేవస్తౌవిరేచనే ॥ 7.

తా॥ మిక్కుటముగ మందాగ్నిగలవారు, అతితీక్ష్ణాగ్నిగలవారు, అతిస్థూలురు, అతిదుర్బలులు, ఊరుస్తంభము, అతిసారము, ఆమదోషము, కంఠరోగము, విషము, ఉదరరోగము, మూర్ఛ, వాంతి, అరుచి, శ్లేష్మము, దప్పి, మద్యము, వీనిచేపీడింపబడినవారు, గర్భస్రావముగలస్త్రీ, వీరలు స్నేహకర్మకనర్హులుగనుండెదరు. మఱియును నస్య, వస్తి, విరేచనకర్మలు చేయించుకొనినవారందరు స్నేహకర్మకనర్హులుగనుండెదరు. స్నేహకర్మముచే అతితీక్ష్ణాగ్నిగలవానికి మిక్కుటముగ అగ్నివృద్ధిజెందును. అతిస్థూలునికి అగ్ని, మేదస్సు అనునీ 2-ను వృద్ధిజెందును. అతిదుర్బలునికి జీర్ణశక్తిలేకుండుటవలన స్నేహదోషముగలుగును.

ఘృత ప్రయోగార్హులు.

శ్లో॥ తత్రధీస్మృతిమేధాగ్ని కాంక్షిణాంశస్యతేఘృతమ్ ।

తా॥ బుద్ధి, స్మృతి, మేధ, అగ్నిబలము, వీనినపేక్షించువారికి పైజెప్పిన స్నేహములలో ఘృతము మిగుల ప్రశస్తంబైనది.

తైల ప్రయోగార్హులు.

శ్లో॥ గ్రంథినాడీకృమిశ్లేష్మ మేదోమారుతరోగిషు ॥ 8.
తైలంలాఘవదార్ఢ్యార్థి క్రూరకోష్ఠేషుదేహిషు ।



తా॥ గ్రంథిరోగము, నాడీరోగము, కృమిరోగము, శ్లేష్మరోగము, మేదోరోగము, వాతరోగము, ఇవిగలవారికిని; శరీరలాఘవము, దార్ఢ్యము, వీనినపేక్షించునట్టి క్రూరమైన కోష్ఠముగల ప్రాణులకును; తైలము ప్రశస్తమైనది.

మజ్జాది ప్రయోగార్హులు.

శ్లో॥ వాతాతపాధ్వ * భారస్త్రీవ్యాయామక్షీణధాతుషు ॥ 9.
రూక్షక్లేశక్షమాత్యగ్ని వాతావృతపథేషుచ । శేషా

తా॥ వాతము, ఎండ, మార్గసంచారము, భారమునుమోయుట, స్త్రీ సంగమము, వ్యాయామము, వీనిచే ధాతువుక్షయించినవారికిని, రూక్ష, క్లేశము వీటిని సహించువారు, అత్యగ్నిగలవారు, వాతముచే నడ్డగించబడిన ఛిద్రమార్గముగలవారు, యీ మొదలగువారికిని శేషించియుండుమజ్జ, వస, అనునీ 2 స్నేహములు ప్రశస్తంబులు.

సంధిరోగాదులయందు - వసా ప్రయోగము.

శ్లో॥ వసాతుసంధ్యస్థి మర్మకోష్ఠరుజాసుచ ॥ 10.
తథాదగ్ధాహతభ్రష్ట యోనికర్ణశిరోరుజి ।

తా॥ సంధి, అస్థి, మర్మము, కోష్ఠము వీనియందు జనించియుండు రోగములయందును, దగ్ధరోగము, ఆహతరోగము, భ్రష్టయోనిరోగము, కర్ణరోగము, శిరోరోగము యీ మొదలగువానియందును వస విశేషముగా ప్రశస్తంబు.

కాలభేదముచే - స్నేహోపయోగ క్రమము.

శ్లో॥ తైలంప్రావృషివర్షాంతే సర్పిరన్యౌతుమాధవే ॥ 11.

తా॥ తైలము వర్షాకాలమునందే ప్రశస్తము. ఘృతము వర్షాకాలముయొక్క అంతమునందే ప్రశస్తము. వస, మజ్జ అనునీ 2-ను వసంతకాలమునందే ప్రశస్తము.

శ్లో॥ ఋతౌసాధారణేస్నేహః శస్తోహ్నివిమలేరవౌ ।

తా॥ సాధారణమయిన ఋతువులో (అనగా శ్రావణాదిమాసములయందు) మధ్యాహ్నమున సూర్యుడు మేఘాదులచేగప్పబడక బాగుగ ప్రకాశించుచుండునపుడు తైలము మొదలగు స్నేహములు సంశోధనమునకు తోలుత ప్రశస్తములుగనుండును.

* భాష్యస్త్రీ ఇతిపా.

### శీతకాలమునందు తైలానుజ్ఞ.

శ్లో॥ తైలంత్వరాయోంశీతేపి

తా॥ రోగచికిత్సకు యుక్తమైనకాలములో స్నేహక్రియజేయవలసిన ఆవశ్యకము కలిగియుండినయెడల శీతమయిన హేమంత శిశిరఋతువులయందు కూడా సంశోధనమునకు తొలుత స్నేహకర్మయందు తైలము ప్రశస్తముగనుండును. కావున నా కాలమునందు యితరస్నేహములు అప్రశస్తంబులు.

### గ్రీష్మకాలమునందు ఘృతానుజ్ఞ.

శ్లో॥ ఘర్మేపిచఘృతంనిశి ॥ 12.
నిశ్యేవపిత్తేపవనే సంసర్గేపిత్తవత్యపి ।

తా॥ పిత్తముగాని, లేక పిత్తమువలనగలిగిన రోగముగాని, లేక వాతముగాని, లేక వాతమువలన గలిగినరోగముగాని ప్రకోపించి స్నేహకర్మచే సాధ్యముగనుండునపుడు ఘృతమును గ్రీష్మఋతువునందు కూడా రాత్రులయందుపయోగించందగును. అయితే గ్రీష్మఋతువునందు ఘృతమును మధ్యాహ్నమునం దుపయోగించంజనదు. అటులనే పిత్తాధిక్యముగల వాతపిత్త సంసర్గముగాని, లేకశ్లేష్మపిత్తసంసర్గముగాని, లేక యీరెంటియొక్క సంసర్గమువలనగలిగినరోగముగాని ప్రకోపించి స్నేహకర్మచే సాధ్యముగనుండునపుడు గ్రీష్మకాలమునందుకూడా రాత్రులయందే ఘృతము నుపయోగించవలయును. తైలము, వస, మజ్జ, వీనిని గ్రీష్మకాలములో నుపయోగించం జనదు.

### విరుద్ధకాలమునందు - తైలాదులనుపయోగించుటవలన - జనించు రోగములు.

శ్లో॥ నిశ్యన్యథావాతకఫా ద్రోగాఃస్యుఃపిత్తతోదివా ॥ 13.

తా॥ పైజెప్పిన క్రమమునకంటె వేరువిధముగజేసినచో (అనగా శీతకాలములో రాత్రియందు ఘృతమును ప్రయోగముజేసినయెడల) వాతకఫమువలన రోగములుగలుగును. అటులనే గ్రీష్మకాలములో మధ్యాహ్నమునందు తైలమునుప్రయోగముజేసినయెడల పిత్తమువలన రోగములుగలుగును. వస, మజ్జ, అనునీరెంటియొక్క స్వరూపంబిట్టిదని నిశ్చయింపబడి యుండనందువలన వానియొక్క ఉపయోగక్రమము ఉష్ణకాలమునందును, శీతకాలమునందును చెప్పబడియుండలేదు. అయితే నుపయోగపరచవలసిన నావశ్యకముగలుగునపుడుమాత్రము వానిఉపయోగక్రమము తంత్రకారులచే చెప్పబడియున్నది. అయితే :—



"యథాసత్వంతుశైత్యోష్ణే వసామజ్జ్ఞోస్తునిర్దిశేత్"
అనువచనప్రకారము ఆయాజంతువుల ననుసరించి వస, మజ్జ వీనియొక్క శైత్యోష్ణములను తెలిసికొనవలయునని తంత్రాంతరములయందు చెప్పబడియున్నది.

### స్నేహప్రయోగ క్రమము.

శ్లో॥ యుక్త్యావచారయేత్స్నేహం భక్ష్యాద్యన్నేనవస్తిభిః ।
నస్యాభ్యంజనగండూష మూర్ధకర్ణాక్షితర్పణైః ॥ 14.

తా॥ మాత్ర, కాలము, క్రియ, భూమి, దేహము, దోషము, యీస్వభావము గల యోగముచే ఘృతము మొదలగు స్నేహములను భక్ష్య, భోజ్య, లేహ్య, పేయ రూపమైన యన్నముతోడను, వస్తికర్మ (అనగా నిరూహవస్తి, అనువాసన వస్తి, ఉత్తరవస్తి) తోడను, నస్యము, అభ్యంజనము, గండూషము, శిరోవస్తియను పేరంబఱంగు మూర్ధతర్పణక్రియ, కర్ణపూరణమను పేరంబఱంగు కర్ణతర్పణక్రియ, తర్పణపుటపాకవిధియందు జెప్పబడిన అక్షితర్పణక్రియ, యీ మొదలగు వానితోడను ఉపయోగించవలయును. భక్ష్యము అనగా శశాంకకిరణము మొదలగునవి యని యర్థము. ఆది శబ్దమువలన,—

"ఓదనశ్చవిలేపీచ రసోమాంసంపయోదధి । యవాగూస్సూపశాకేచ యూషఃకాంబళికఃఖలః । సక్తవస్తిలపిష్టంచ మద్యంలాజాస్తథైవచ । భక్ష్యమభ్యంజనంవస్తి స్తథైవోత్తరవస్తయః ॥"

అనెడి చరకవచనమునుబట్టి అన్నము, విలేపి, మాంసరసము, మాంసము, క్షీరము, పెఱుగు, యవాగు, సూపము, శాకము, యూషము, కాంబళికము, ఖలము, సక్తువు, తిలపిష్టము, మద్యము, వరిపేలాలు, భక్ష్యము, అభ్యంజనము, వస్తికర్మ, ఉత్తరవస్తికర్మలు, యీ మొదలగు వానిని గ్రహించుకొనవలయునని తాత్పర్యము.

### స్నేహమునకు - అరువదినాలుగు విచారములు.

శ్లో॥ రసభేదైకకత్వాభ్యాం చతుష్షష్టిర్విచారణాః ।
స్నేహస్యాన్యాభిభూతత్వా దల్పత్వాచ్చక్రమాత్స్మృతాః ॥

తా॥ "ఏకైకహీనాః" ఇత్యాది శ్లోకములచే రసభేదీయాధ్యాయమున జెప్పబడిన (63) సంఖ్యగల రసభేదములతోజేర్చి ప్రయోగించబడు స్నేహములు 63. రసముతో జేర్చకనే ప్రయోగించునట్టి కేవలస్నేహము 1. ఇటుల (64) సంఖ్యగల స్నేహప్రయోగములుగలవు. భక్ష్యము మొదలగు అన్నముతోడను, రసభేదము

తోడను, మూర్ధకర్ణ అక్షితర్పణముతోడను ప్రయోగించబడు పైజెప్పిన 64 స్నేహములు యథాక్రమముగ అన్యాభిభూతమైయుండుటవలనను (అనగా బహువిధమైన భక్ష్యాదులచేతను, రసభేదములచేతను అభిభూతమైయుండుటవలనను) మూర్ధాక్షితర్పణాదిక్రియలయందు స్వల్పముగ నుపయోగించుటవలనను, పానమునందధికముగ నుపయోగించునటుల మూర్ధాక్షితర్పణాది క్రియలయం దుపయోగించుట యసాధ్యముగ నుండుటవలనను పైజెప్పిన 64 విధములైన స్నేహప్రయోగములకు విచారణలను నామముగలిగినదని ఆయుర్వేదకర్తలచే జెప్పబడియున్నది.

## అచ్ఛపేయ - స్నేహమునకు - విచారణా సంజ్ఞాభావము.

శ్లో॥ యథోక్తహేత్వభావాచ్చ నాచ్ఛపేయోవిచారణా ।

తా॥ స్నేహమునకు విచారణయను సంజ్ఞగలుగుటకై పైనజెప్పియుండు హేతువులు అచ్ఛపేయమను స్నేహమునందు లేకుండుటవలన (అనగా అచ్ఛపేయమను స్నేహము దేనితోజేర్చబడకుండా విశేషముగ నుపయోగింపబడుటవలన) ఆ అచ్ఛపేయమను స్నేహమునకు విచారణయను సంజ్ఞగలుగనేరదు. అచ్ఛపేయమనగా; ఇతరవస్తువుల సంబంధములేని స్నేహమును పానముచేయుటయని యర్థము. అయితే శిరోవస్త్యాది తర్పణక్రియతో నుపయోగింపబడు కేవలస్నేహోపయోగమునకు విచారణయను పేరుగలుగును. కాబట్టి వస్త్యాదులయం దుపయోగించబడు కేవలస్నేహమునకు విచారణయను సంజ్ఞగలుగుననియు, కేవలస్నేహపానమునకు విచారణయను సంజ్ఞ గలుగనేరదనియు జెప్పియుండుట పరస్పరవిరుద్ధముకాదు.

## అచ్ఛపేయ - స్నేహమునకు శ్రేష్ఠత్వము.

శ్లో॥ స్నేహస్యకల్పస్సశ్రేష్ఠః స్నేహకర్మాశుసాధనాత్ ॥ 16.

తా॥ అచ్ఛపేయమనుస్నేహప్రయోగము స్నేహకృత్యమైన తర్పణమార్దవాదులను శీఘ్రముగ గలుగజేయుటవలన మిగుల శ్రేష్ఠంబైనది.

## స్నేహ - త్రివిధమాత్రా లక్షణము.

శ్లో॥ ద్వాభ్యాంచతుర్భిరష్టాభి ర్యామైర్జీర్యంతియాః క్రమాత్ ।
హ్రస్వమధ్యోత్తమామాత్రా స్తాస్తాభ్యశ్చహ్రసీయసీమ్ ॥ 17.
కల్పయేద్వీక్ష్యదోషాదీ న్ప్రాగేవతుహ్రసీయసీమ్ ।

తా॥ ప్రయోగించబడిన స్నేహముయొక్క యేమాత్ర జాఠరాగ్నిసంయోగముచే 2 యామములవలన జీర్ణమునుజెందునో అది ఆస్నేహమునకు హ్రస్వమాత్రయానబడును. స్నేహముయొక్క యేమాత్ర జాఠరాగ్ని సంయోగముచే 4 యామములవలన జీర్ణమునుజెందునో అది ఆస్నేహమునకు మధ్యమమాత్రయనబడును. స్నేహముయొక్క యేమాత్ర 8 యామములవలన జీర్ణమునుజెందునో అది ఆస్నేహముయొక్క ఉత్తమమాత్రయనబడును. పైజెప్పిన హ్రస్వ, మధ్య, ఉత్తమమాత్రలకంటె మిగుల హ్రస్వముగనుండునట్టి మాత్రను (అనగా 2 యామములవలన జీర్ణమునుజెందునట్టి హ్రస్వమైన మాత్రను, దానికంటె తక్కువైనకాలములో జీర్ణమునుజెందునట్టి మిగుల హ్రస్వమైనమాత్రను) వైద్యుడు నిశ్చయించుకొనవలయును. దోషము, ఔషధము, దేశము, కాలము, బలము, శరీరము, ఆహారము, సత్వము, సాత్మ్యము, ప్రకృతి యీ మొదలగువానిని బాగుగ నాలోచించి తొలుత తెలిసికొనబడని కోష్ఠముగల పురుషునియందు ఉత్తమమాత్రా విషయములో నత్యంతము హ్రస్వముగనుండునట్టి మాత్రను ప్రయోగించవలయును. పిదప హ్రస్వమాత్రను, దానికి పిదప మధ్యమమాత్రను, దానికి పిదప ఉత్తమమాత్రను ప్రయోగించవలయును. ఇటులనే మధ్యమమాత్రా విషయమునందును. హ్రస్వమాత్రా విషయమునందును తొలుత మిగుల హ్రస్వమైన మాత్రనే ప్రయోగించవలయును. అటుకాదేని మిగుల నాపత్తుగలుగును.—

“ అజ్ఞాతకోష్ఠేహిబహుః కుర్యాజ్జీవితసంశయమ్ ”

తెలిసికొనబడని కోష్ఠముగలపురుషునియందు ప్రయోగించబడిన ఉత్తమమైనమాత్ర ఆ మనుజునికి ప్రాణసంశయమును గలుగజేయును, అని అష్టాంగసంగ్రహమునందుచెప్పబడియున్నది. 2 పలములు హ్రస్వమాత్రయని, 4, పలములు మధ్యమమాత్రయని, 6 పలములు ఉత్తమమాత్రయని కొందరు వచించెదరు. జాఠరాగ్నియొక్క శక్తిననుసరించకూడా ప్రయోగించబడిన స్నేహమాత్ర ఆపత్తునుగలుగజేయును. కావుననీగ్రంథకర్త పైజెప్పిన పలప్రమాణమును మాత్రగనంగీకరించలేదు. ఇటులనే పలప్రమాణము మాత్రయనుట చరకాచార్యునికికూడా అనభిమతము. అనగా సమ్మతము కాదని భావము. ఇందుకు ప్రమాణము. చరకే॥

“ అహోరాత్రమహః కృత్స్న మర్ధాహంచ ప్రతీక్ష్యతే। ప్రధానా మధ్యమాహ్రస్వా స్నేహమాత్రాజరాంప్రతి ”

ఉత్తమమైన స్నేహమాత్ర ఒక అహోరాత్రమును, మధ్యమమైన స్నేహమాత్ర పూర్ణమైన ఒక అహస్సును, హ్రస్వమైన స్నేహమాత్ర ఊర్ధ్వాహమును, జీర్ణమునుగురించి ప్రతీక్షించుచుండును.

## శోధన - స్నేహ - ప్రయోగ క్రమము.

శ్లో॥ హ్యస్తనేజీర్ణఏవాన్నే స్నేహోచ్ఛశ్శుద్ధయేబహుః ॥ 18.

తా॥ మొదటిదినమునందు భుజించబడిన యాహారము బాగుగ జీర్ణమైనతోడనే శోధనార్థము ఉత్తమమాత్రతో గూడియుండునట్టి కేవలస్నేహము పానమునందు ప్రశస్తమైనది. "జీర్ణఏవాన్నే" అనగా అన్నముజీర్ణమైనతోడనే యనిచెప్పియుండుటవలన అన్నమునందిచ్ఛ గలుగు కాలములో శోధనార్థము స్నేహపానము చేయాంజనదని స్పష్టమగుచున్నది. అన్నమునందిచ్ఛ గలుగుకాలములో (అనగా ఆకలి కలిగియుండునపుడు) పానముచేయబడిన స్నేహముజాఠరాగ్ని దీప్తముగనుండుటవలన శోధనరూపమైన కార్యమునుచేయకనే అతిశీఘ్రముగ జీర్ణమునుజెందును. ఆకలితో గూడియుండువానికి కఫముకొరవడియుండును. కాబట్టి వమనముకూడా చేయించం జనదని సూచించునిమిత్తమే "జీర్ణఏవాన్నే" అనిగ్రంథకారుడుజెప్పియున్నాడు.

## శమన - స్నేహ - ప్రయోగ క్రమము.

శ్లో॥ శమనఃక్షుద్వతోఽనన్నో మధ్యమాత్రశ్చశస్యతే।

తా॥ శమనరూపమైన స్నేహమును (అనగా రోగశమనార్థ ముపయోగింపబడు స్నేహమును) ఆకలి గలిగియుండునపుడు భక్ష్యాద్యాహార రహితముగ మధ్యమ మాత్రచే ప్రయోగించుట ప్రశస్తము. భుజించిన యన్నముజీర్ణమునుజెందినతోడనే ఆకలి గలుగకుండునపుడు శోధనరూపమైన స్నేహమును ప్రయోగించునటుల శమన రూపమైన స్నేహమును' ప్రయోగింపంజనదు. ప్రయోగించినచో అట్టి సమయమునందు స్రోతోమార్గములు కఫముచే వ్యాప్తంబై యుండుటవలన నాశమనస్నేహము సర్వశరీరమునందు వ్యాపించనేరదు. అందువలన నాస్నేహము నచ్చటచ్చటనుండు దోషములను శమనముజేయుటయం దసమర్థంబుగనగును. మఱియు నాశమనరూప స్నేహమును బాగుగ నాకలిగలిగియుండు కాలమునందే ప్రయోగించినయెడల నదిసర్వ శరీరమునందు వ్యాపించి నచ్చటచ్చట ప్రకోపమునుజెందియుండు దోషములను శమనముజేసును. కాబట్టి విశేషముగా ఆకలిగలుగు కాలమునందు శమనరూపమైన స్నేహము ప్రశస్తమైనదని తెలియపరచుటకై "క్షుద్వతః" అనుపదము ప్రయోగించబడినది. శమనరూపమైన స్నేహవిషయములో ఉత్తమమైన మాత్ర ప్రయోగించబడినయెడల స్నేహపానదినానంతరము పథ్యముచేయువలయును. మరుదినమునందు మరల స్నేహప్రయోగమును చేయువలయును. మరుదినమునందు పథ్యము నాచరించవలయును. మధ్యమమాత్రను ప్రయోగించినయెడల లఘుభోజనము చేయువానికి ఒక యామకాలములో అన్నమునందిచ్ఛ గలుగనేరదు. రాత్ర్యారంభమునందు (అనగా రాత్రియొక్క పూర్వభాగమునందు) స్నేహపానము చేయుపక్షములో రాత్రి యందర్ధయామము గతించిన పిదప రసప్రాయముగనుండు భోజన



మును స్వల్పముగ భుజించవలయును.—

"ఉపచారస్తుశమనే కార్యస్స్నేహావిరిక్తవత్"

అని యాతంత్రకారుడే శమనరూపస్నేహమునందు స్వల్పభోజనమే పథ్యకారియని ఉత్తరత్ర జెప్పబోవుచున్నాడు—

"పరిషిచ్యాద్భిరుష్ణాభి ర్జీర్ణస్నేహంతతఃపరమ్। యవాగూంపాయయేదుష్ణా మక్లిన్నామల్పతండులామ్। పేయోయూషోరసోవాస్యా దకృతస్సారభాయుతః।కృతోవాప్యల్పసర్పిష్కో విలేపీవావిధీయతే॥"

శమనరూపమైన స్నేహము జీర్ణమైన పిదప స్వల్పముగ నుష్ణోదకమును పానముజేసి పిదప నొకింతబియ్యముతోగూడినదియును, అక్లిన్నముగ నుష్ణముగనుండునదియునైన యవాగును పానము చేయించవలయును. మఱియు అకృతమైన యూషమునుగాని, లేకమాంసరసమునుగాని పానముచేయించవలయును. స్వల్ప ఘృతముతోగూడియుండు కృతరసమునుగాని లేక విలేపిగాని, ప్రశస్తమైనది అనిసుశ్రుతమునందుజెప్పబడియున్నది.

## బృంహణ - స్నేహ - ప్రయోగ క్రమము.

శ్లో॥ బృంహణోరసమద్యాద్యైస్సభక్తోఽల్పః

తా॥ బృంహణరూపమైన స్నేహమును మాంసరసము, మద్యము యీ మొదలగువానితోడను, అన్నముతోడను మిగుల హ్రస్వమాత్రగ ప్రయోగించుటయే ప్రశస్తము. మూలశ్లోకమునందు "రసః" అనిసామాన్యముగా జెప్పియుండినను,—

"రసఇత్యవిశేషోక్తౌ జ్ఞేయోమాంసభవోరసః"

అనెడి తంత్రాంతరవచనమునుపట్టి "రసః" అనుశబ్దమునకు మాంసరసమని యర్థము. మద్యాదియను ఆదిశబ్దమువలన ద్రవస్వరూపమైన క్షీరము, ఖండము యీ మొదలగునవి గ్రాహ్యంబులు.

## బృంహణ స్నేహార్హులు.

శ్లో॥ హితస్నచ॥ 19.
బాలవృద్ధపిపాసార్త స్నేహద్విణ్మద్యశీలిషు।
స్త్రీస్నేహనిత్యమందాగ్ని సుఖితక్లేశభీరుషు॥ 20.
మృదుకోష్ఠాల్పదోషేషు కాలేచోష్ణేకృశేషుచ।

తా॥ బాలురు, వృద్ధులు, దప్పిచేత్ పీడితులు, స్వభావముగనే స్నేహమును ద్వేషించువారు, సర్వదామద్యపానముచేయువారు, స్త్రీలయందెల్లపుడునాసక్తిగలవారు,

స్నేహమునందెల్లపుడు నాసక్తిగలవారు, అగ్నిమాంద్యముగలవారు, సుఖమును జెందియుండువారు, క్లేశకరమైన వ్యాపారములచే భయమునుజెందువారు, మృదువైన కోష్ఠముగలవారు, స్వల్పమైనదోషముగలవారు, కృశులు, వీరలకు పైజెప్పిన బృంహణస్నేహము హితకరముగనుండును. మఱియునది ఉష్ణకరమైన గ్రీష్మాది కాలములయందును హితకరమైనది.

### బృంహణ - స్నేహ - ప్రయోగ ఫలము.

శ్లో॥ ప్రాఙ్మధ్యోత్తరభక్తోఽసా వధోమధ్యోర్ధ్వదేహజాన్ ॥ 21.
వ్యాధీన్ జయేద్బలంకుర్యా దంగానాంచయథాక్రమమ్ ।

తా॥ ఆబృంహణస్నేహమును ఆహారమునకు పూర్వకాలమునందును, మధ్యకాలమునందు, ఉత్తరకాలమునందును ప్రయోగించినయెడల యథాక్రమముగా అధోదేహము, మధ్యదేహము, ఊర్ధ్వదేహము వీనియందు గలిగియుండు వ్యాధులను హరింపజేయును. (అనగా భోజనాత్పూర్వము ప్రయోగించబడిన స్నేహము అధోదేహమునందు జనించియుండు వ్యాధులను, భోజనమధ్యమునందు ప్రయోగించబడిన స్నేహము మధ్యదేహమునందు జనించియుండు వ్యాధులను, భోజనోత్తరము ప్రయోగించబడిన స్నేహము ఊర్ధ్వదేహమునందు జనించియుండువ్యాధులను హరింపజేసునని భావము.) మఱియు నాస్నేహము యథాక్రమముగ అధోభాగము, మధ్యభాగము, ఊర్ధ్వభాగము వీనియందలి అంగములకు విశేషముగా బలమునుగలుగజేసును. (అనగా భోజనాత్పూర్వము ప్రయోగించబడిన స్నేహము అధోభాగమునందలి శరీరావయవములకును, భోజనమధ్యమునందు ప్రయోగించబడిన స్నేహము మధ్యభాగమునందలి శరీరావయవములకును, భోజనోత్తరము ప్రయోగించబడిన స్నేహము ఊర్ధ్వభాగమునందలి శరీరావయవములకును బలమునుగలుగజేసునని భావము),—

"మారుతేభ్యధికేసర్పి స్సహాసలవణంహితమ్ । కేవలంచాధికేపిత్తే కఫే సత్ర్యూషణంతథా ॥"

వాతము అధికముగ నుండునపుడు లవణముతోగూడియుండు ఘృతము హితకరము. పిత్తము అధికముగనుండునపుడు కేవలఘృతము హితకరము. కఫము అధికముగనుండునపుడు త్రికటుకములతోగూడియుండు ఘృతము హితకరము అనితాత్పర్యము.

### అచ్ఛపేయ - స్నేహానుపాన క్రమము.

శ్లో॥ వార్యుష్ణమచ్ఛేనుపిబేత్ స్నేహేతత్సుఖపక్తయే ॥ 22.



ఆస్యోపలేపశుద్ధ్యైచ తౌవరారుష్కరేనతు ।
జీర్ణాజీర్ణవిశంకాయాం పునరుష్ణోదకంపిబేత్ ॥ 23.
తేనోద్గారవిశుద్ధిఃస్యా త్తతశ్చలఘుతారుచిః ।

తా॥ అచ్ఛపేయమను స్నేహమును ఉత్తమ, మధ్యమ, హ్రస్వమాత్రలచే నుపయోగించునపు డది సుఖముగ పాకముజెందుటకును, ఆ స్నేహలేపముతోగూడియుండు నోటియొక్క శుద్ధికొరకును పిదప ఉష్ణోదకమును పానముచేయవలయును. తువరసంబంధమైన తైలమును, భల్లాతకతైలమును, అచ్ఛపేయముగ ప్రయోగించునపుడు అవి 2-ను అత్యుష్ణవీర్యముగలవియగుటవలన పిదప నుష్ణోదకమును పానము చేయంజనదు. స్నేహమునుపానముచేసి చిరకాలమయిన పిదప, జీర్ణాజీర్ణమునుగురించి సంశయముగలుగుచుండగా మరల నుష్ణోదకమును పానముచేయవలయును. అటులజేసినయెడల ఉద్గారవిశుద్ధిగలుగును. దానిచే స్నేహపానముచేసినవానికి అధికమయిన శరీరలాఘవము, రుచి గలుగును.

"తతోగురుప్రావరణో నివాతేశయనేస్థితః । జరణాంతంప్రతీక్షేత తృష్యన్నుష్ణాల్పవారిపః । శిరోరుగ్భ్రమనిష్ఠీవ మూర్ఛాదాహారుచి క్లమైః । జానీయాద్భేషజంజీర్ణం జీర్ణంతచ్ఛాంతిలాఘవాత్ । అనులోమానిలస్వాస్థ్యక్షుత్తృష్ణోద్గారశుద్ధిభిః ॥"

స్నేహపానాంతరము దళమైనదుప్పటిని కప్పుకొని గాలిలేకుండునట్టి శయనమునందు పరుండి దప్పిగలుగునపుడు అనుష్ణమైనజలమును స్వల్పముగ పానముచేయుచు జీర్ణమగువరకు నిరీక్షించుచుండవలయును. తలనొప్పి, భ్రమ, నిష్ఠీవము, మూర్ఛ తాపము, అరుచి, క్లమము ఇవిగలిగినయెడల నాయౌషధము అజీర్ణముగనున్నదని తెలిసికొనవలయును. అటుగాక తలనొప్పిమొదలగునవి శమించి శరీరలాఘవము, అనులోమవాతము, శరీరస్వాస్థ్యము, ఆకలి, దప్పిగలిగి తేనుపులు శుద్ధముగ వెడలుచుండినఔషధము జీర్ణమైనదని తెలిసికొనవలయును అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

### స్నేహపానానంతరము - ఆహారాది క్రమము.

శ్లో॥ భోజ్యోన్నంమాత్రయాపాస్యన్ శ్వఃపిబన్పీతవానపి ॥ 24.
ద్రవోష్ణమనభిష్యంది నాతిస్నిగ్ధమసంకరమ్ ।
ఉష్ణోదకోపచారీస్యా ద్బ్రహ్మచారీక్షపాశయః ॥ 25.

నవేగరోధీవ్యాయామ క్రోధశోకహిమాతపాన్ ।
ప్రవాతయానయానాధ్వ భాష్య * భ్యాసనసంస్థితిః ॥ 26.
నీచాత్యుచ్చోపధానాహః స్వప్నధూమరజాంసిచ ।
యాన్యహానిపిబేత్తాని తావంత్యన్యాన్యపిత్యజేత్ ॥ 27.
సర్వకర్మస్వయం ప్రాయో వ్యాధిక్షీణేషుచ క్రమః ।

తా॥ మరుదినము స్నేహపానము చేయవలయునని నిచ్చయించువాడు, ఆదినమునందే స్నేహపానము చేసియుండువాడు, ఇంతకుముందు స్నేహపానము చేసినవాడునైన పురుషులు ద్రవముగ, ఉష్ణముగ, మద్యయూషాదులతోగూడినదిగ, ఉష్ణమయి కఫమును చేయనదిగ, కొంచెముస్నిగ్ధముగ, అపథ్యవస్తుసంబంధములేనిదిగనుండుయన్నమును మాత్రగా (అనగా నెంతపరిమాణముగల యన్నమునుభుజించిన సరియైనకాలములో జీర్ణమును జెందునో అట్టిపరిమాణముగలఅన్నమును స్వల్పముగ) భుజించునటులం చేయువలయును. స్నేహపానము చేయువాడు ఉష్ణోదకోపచారిగను, స్త్రీసంగమ రహితుడుగను, రాత్రులయందు నిద్రించుస్వభావముగలవాడుగను, (అనగా దివాస్వప్న రాత్రిజాగరణరహితుడుగను) మలమూత్రాది వేగముల నడ్డగించనివాడుగను నుండవలయును. వ్యాయామము, క్రోధము, శోకము, మంచు, ఎండ, పైనుగాలియందు సంచారము, మద్యపానము, వాహనముపైనెక్కుట మార్గసంచారము, అధిక సంభాషణము, విద్యాదులనభ్యసించుట, మిగుల పల్లముగనుండు తలగడనుగాని, మిగులవున్నతముగనుండుతలగడనుగాని వేసికొనిపరుండుట, పగటినిద్ర, పొగ, ధూళి యీ మొదలగువానిని తైలపానము చేయువన్ని దినములును, తదనంతరంబన్నిదినములును వర్జించవలయును. వమనవిరేచనాది సమస్తకర్మలయందును పైజెప్పిన "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విధినే యనుసరించవలయును. మఱియును వ్యాధిచే క్షయించినవారుకూడా పైజెప్పిన "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విధినే "ప్రాయశః" అనుసరించవలయును. అతిసారాదులయందు దివాస్వాపము అంగీకరించబడియున్నది అట్లగుటచేతనే ప్రాయశః అను పదము మూలశ్లోకమునందు ప్రయోగించబడినది.

శమన - స్నేహోపచార క్రమము.

శ్లో॥ ఉపచారస్తుశమనే కార్యస్స్నేహేవిరిక్తవత్ ॥ 28.

తా॥ శమనస్నేహమును ప్రయోగించునపుడు విరిక్తునివిషయమై చెప్పబడియుండు పేయాదిక్రమవిధానమునే యనుసరించవలయును.

* త్యశన ఇతి పా.



"స్నేహస్యపాచనాత్పూర్వం పాతవ్యంమృదుభేషజమ్ । యత్తైజసం హుతాశస్య కోష్ఠలాఘవకారిచ ॥"
శమనస్నేహము పాకమును జెందుటకుమునుపు జాఠరాగ్నిదీప్తికరంబును, కోష్ఠమునకు లఘుత్వకారియునగు మృదువైనయౌషధమును భుజించవలయును అని అధికపాఠము కొన్నిగ్రంథములయందు గన్పట్టుచున్నది.

స్నేహపాన - దిన సంఖ్య.

శ్లో॥ త్ర్యహమచ్ఛంమృదౌకోష్ఠే క్రూరేసప్తదినంపిబేత్ ।
సమ్యక్స్నిగ్ధోథవాయావ దతస్సాత్మీభవేత్పరమ్ ॥ 29.

తా॥ అచ్ఛస్నేహమును మృదువైన కోష్ఠముగలమనుజుడు 3 దినములను, క్రూరకోష్ఠముగలవాడు 7 దినములును, మధ్యకోష్ఠముగలవాడు 6 దినములును పానముచేయవలయును.

"చత్వార్యహాని పంచవాస్నేహంపిబేత్ ॥ మధ్యమకోష్ఠస్తుషడ్రాత్రం పిబేత్"

మృదుకోష్ఠముగలవానికి 3 దినములలో స్నేహపానమువలన స్నిగ్ధలక్షణము బాగుగ గలుగకుండినయెడల వాడుమరల 4 లేక 5 దినములు ఆ స్నేహపానమును చేయవలయును. మధ్యకోష్ఠముగలవానికి స్నిగ్ధలక్షణము గలుగకుండినయెడల 6 దినములు ఆ స్నేహపానమును చేయవలయును. మృదు, మధ్య, క్రూరకోష్ఠములుగల వారలు ఆ స్నేహపానము 7 దినములుజేసియు స్నిగ్ధలక్షణముగలుగకుండు పక్షములో 7 దినములకుపైనకూడా బాగుగ స్నిగ్ధలక్షణముగలుగువరకు నాస్నేహపానము చేయుచుండవలయును. అందుకుపైన ఆ స్నేహము శరీరమునకు సాత్మ్యముగనగును.

"సాత్మీభూతేచకురుతే నమలానాముదీరణమ్ । అతియోగేనవావ్యాధీన్ యథాంధోద్యోతయోజనాత్ ॥"
సాత్మ్యముగనుండు యీస్నేహము మలములను బైలుపరచనేరదు. అయితే అతియోగమువలన వ్యాధులనుమాత్రము గలుగజేసును. అని సాత్మ్యస్నేహదోషము. అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది; అ స్నేహలక్షణము 7 దినములవలనకూడా బాగుగ గలుగకుండినయెడల 1 దినమువదలి మరల నాస్నేహమును ప్రయోగించవలయునని వైద్యశ్రేష్ఠులువచించెదరు.

స్నేహ - సమ్యగ్యోగాతి లక్షణము.

శ్లో॥ వాతానులోమ్యం దీప్తోగ్ని ర్వర్చః స్నిగ్ధమసంహతమ్ ।
స్నేహోద్వేగః క్లమస్సమ్యక్ స్నిగ్ధేరూక్షే విపర్యయః ॥ 30.
అతిస్నిగ్ధేతు పాండుత్వం ఘ్రాణవక్త్రగుదస్రవాః ।

తా॥ బాగుగస్నిగ్ధుడైన పురుషునికి వాతమునకు అనులోమగతి, అగ్నిదీప్తి, స్నేహయుక్తముగ, శిథిలముగనుండు మలము, స్నేహపానమునందు భయము, క్లమము, ఇవిగలుగును. స్నేహలక్షణము గలుగకుండువానికి పైజెప్పిన వాతానులోమగతి మొదలగునవి గలుగకుండును. స్నేహముయొక్క అతియోగమువలన పాండురవర్ణము, నాసికము, నోరు, గుదము వీనియందు స్రావముగలుగును.

మాత్రారహిత - స్నేహాదిజనిత రోగములు.

శ్లో॥ అమాత్రయాఽహితోఽకాలే మిథ్యాహారవిహారతః ॥ 31.
స్నేహః కరోతి శోఫార్శ స్తంద్రా స్తంభవిసంజ్ఞతాః ।
కండుకుష్ఠజ్వరోత్క్లేశ శూలానాహభ్రమాదికాన్ ॥ 32.

తా॥ మాత్రారహితముగ పానముచేయబడిన ఘృతము మొదలగుస్నేహములు, ఆయా మనుజునికి నిషేధించబడిన స్నేహములు, పూర్వము నిషేధించబడిన గ్రీష్మాది కాలములయందు పానముచేయుబడిన స్నేహము, ఇవి శోఫ, అర్శస్సు, తంద్ర, స్తంభము, సంజ్ఞానాశము, దురద, కుష్ఠము, జ్వరము, ఉత్క్లేశము, శూల, అనాహము, భ్రమ, యీ మొదలగురోగములను గలుగజేసును. భ్రమాదియనుఆదిశబ్దమువలన అష్టాంగసంగ్రహమునందు జెప్పియుండు బలక్షయము, జడత్వము, వాగ్బంధనము యీ మొదలగువానిని గ్రహించుకొనవలయును. స్నేహము మిథ్యాహారమువలన (అనగా పైజెప్పిన "ద్రవోష్ణమిత్యాది" ఆహారమునకంటె విరుద్ధమైన యాహారమువలన) మిథ్యావిహారమువలన (అనగా పైజెప్పిన "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విహారమునకంటె విరుద్ధమైన విహారములవలన) పైజెప్పిన శోఫమొదలగు రోగములను గలుగజేసును.

స్నేహ - వ్యత్యాసమునందు చికిత్స.

శ్లో॥ క్షుత్తృష్ణోల్లేఖనస్వేద రూక్షపానాన్నభేషజమ్ ।
తక్రారిష్టఖలోద్దాల యవశ్యామాకకోద్రవాః ॥ 33.



పిప్పలీత్రిఫలాక్షౌద్ర పథ్యాగోమూత్రగుగ్గులు ।
యథాస్వం ప్రతిరోగంచ స్నేహవ్యాపదిసాధనమ్ ॥ 34.

తా॥ స్నేహవిధివ్యత్యాసమువలన గలుగురోగములయందు ఆకలిని దప్పిని నిగ్రహించుట, వమనము, స్వేదకర్మ, రూక్షకరమైన అన్నపానౌషధములు, తక్రము, అరిష్టము, ఖలము (అనగా వ్యంజనవిశేషము), ఉద్దాలము (అనగా శాలిధాన్యవిశేషము), యవలు, శ్యామాకము, కోద్రవము, పిప్పలి, త్రిఫలములు, క్షౌద్రము, కరక్కాయ, గోమూత్రము, గుగ్గులు ఇవి వాతాదిదోషానుసారముగ నాయాయధ్యాయమునందాయారోగమునకు జెప్పియుండు ఔషధానుగుణముగ చికిత్సలుగనుండును.

విరూక్షణ - సమ్యగ్యోగాతియోగ లక్షణము.

శ్లో॥ విరూక్షణేలంఘనవ త్కృతాతికృతలక్షణమ్ ।

తా॥ విరూక్షణము (అనగా రూక్షకర్మ) యొక్క సమ్యగ్యోగ, అతియోగ లక్షణములను లంఘనమునకు జెప్పియుండు ప్రకారమే తెలిసికొనవలయును. అది యెట్లనగా :— బాగుగచేయబడిన లంఘనమునకుజెప్పియుండు విమలేంద్రియత్వాది లక్షణములే బాగుగచేయుబడిన విరూక్షణమునకు లక్షణములనియు, అధికముగ లంఘనము చేయుబడినవానికి జెప్పియుండు కృశత్వాదిలక్షణములే అధికముగజేయబడిన విరూక్షణమునకు లక్షణమనియు తెలియవలయును. స్నేహవిధి వ్యత్యాసము యొక్క చికిత్స విరూక్షణ స్వభావముగలదిగ నుండుటవలన ప్రసంగముచే నావిరూక్షణకర్మ యొక్క సమ్యగ్యోగ, అతియోగలక్షణములు యిచట జెప్పబడినవి.

విరేచన - వమన క్రమము.

శ్లో॥ స్నిగ్ధద్రవోష్ణధన్వోత్థ రసభుక్ స్వేదమాచరేత్ ॥ 35.
స్నిగ్ధస్త్ర్యహంస్థితః కుర్యా ద్విరేకం వమనం పునః ।
ఏకాహందినమన్యచ్చ కఫముత్క్లేశ్యతత్కరైః ॥ 36.

తా॥ తొలుత స్నేహకర్మజేసికొనియుండు పురుషుడు పిదప మిగులస్నిగ్ధముగ, ద్రవముగ, ఉష్ణవీర్యముగలదిగ, అగ్ని సంయోగముచే నుష్ణముగనుండు జాంగలదేశ మాంసరసమును భుజించినవాడై 3 దినములు స్వేదకర్మను చేయించుకొని పిదప విరేకమునుచేయించుకొనవలయును. వమనము చేయించుటకుమునుపు స్నేహకర్మను చేయించుకొని పిదప పైజెప్పినప్రకారము మిగులస్నిగ్ధముగ, ద్రవముగ, ఉష్ణవీర్యముగలదిగ, అగ్ని సంయోగముచే నుష్ణముగనుండు జాంగల దేశమాంసరసము నొకదినముభుజించిన

వాడై స్వేదకర్మను చేయించుకొని 2-వ దినమునందు కఫకరములగు మినుములు, పాలు, మత్స్యములు, బెల్లము యీమొదలగువస్తువులచే కఫమును స్వస్థానములోనుండి వెలుపరచి వమనము చేయించవలయును.

### మాంసవృద్ధ్యాదులయందు - శోధన క్రమము.

శ్లో॥ మాంసలా మేదురాభూరి శ్లేష్మాణోవిషమాగ్నయః ।
స్నేహోచితాశ్చయేస్నేహ్యా స్తాన్పూర్వంరూక్షయేత్తతః ॥
సంస్నేహ్యశోధయేదేవం స్నేహవ్యాపన్నజాయతే ।
అలంమలానీరయితుం స్నేహశ్చాసాత్మ్యతాంగతః ॥ 38.

తా॥ మాంసవృద్ధి, అధిక మేదస్సు, అధికశ్లేష్మము, విషమాగ్ని ఇవిగలవారు; స్నేహాభ్యాసముగలవారు ; స్నేహకర్మకర్హులుగనుండువారు అట్టివారికితొలుత రూక్షకర్మను, పిదప స్నేహకర్మను కడపట శోధనకర్మను చేయించవలయును. ఇటుల జేసినయెడల స్నేహదోషము గలుగనేరదు. ఇంతయుగాక ఆ స్నేహము అసాత్మ్యమును జెంది వాతాదిమలములను పురీషాదిమలములను బాగుగా వెళ్ళపరచును.

### బాలాదులకు - సద్యస్స్నేహ ప్రయోగము.

శ్లో॥ బాలవృద్ధాదిషుస్నేహ పరిహారాసహిష్ణుషు ।
యోగానిమాననుద్వేగాన్ సద్యస్స్నేహాన్ ప్రయోజయేత్ ॥

తా॥ బాలురు, వృద్ధులు యీమొదలగువారికిని స్నేహవిషయమునందు పరిహారమయిన శీతోదకాదులను సహించనేరనివారికిని, కష్టమును కలుగచేయకుండునట్టియు ఉత్తరత్రశ్లోకములో జెప్పబడునట్టియు సద్యస్స్నేహమను పేరుగల యోగములను ప్రయోగించవలయును.

### సప్తవిధ - సద్య స్స్నేహములు.

శ్లో॥ ప్రాజ్యమాంసరసాస్తేషు పేయావాస్నేహభర్జితా ।
తిలచూర్ణశ్చసస్నేహ ఫాణితఃకృశరాతథా ॥ 40.
క్షీరపేయాఘృతాఢ్యోష్ణా దధ్నోవాసగుడస్సరః ।
పేయాచపంచప్రసృతా స్నేహైస్తండులపంచమైః ॥ 41.
సప్తైతేస్నేహనాస్సద్య స్స్నేహాశ్చలవణోల్బణాః ।
తద్ధ్యభిష్యంద్యరూక్షంచ సూక్ష్మముష్ణంవ్యవాయిచ ॥ 42.



తా॥ అధికమయినమాంసరసము 1, స్నేహములచేవేయించబడిన పేయా 2, ఘృతాదిస్నేహములు, ఫాణితము (అనగా క్షుద్రగుడము) వీనితోగూడియుండు తిలచూర్ణము 3 కృసరము 4, ఘృతాధిక్యముతోగూడి ఉష్ణముగనుండుక్షీరపేయా 5, బెల్లముతోగూడియుండు పెరుగుమీదితేట 6, ఘృతము, తైలము, వస, మజ్జ, బియ్యము వీనిలో ప్రతిదాని నొక్కొక ప్రసృతముచొప్పునజేర్చి సిద్ధము చేయబడిన పంచప్రసృతయను పేరంబరంగు పేయా 7, అను నీ 7 యోగములు సద్యస్స్నేహములనబడును. మఱియును లవణము, స్రోతస్సులను ప్రవింపజేయునదిగ, రూక్షలేనిదిగ సూక్ష్మమైన స్రోతస్సులయందు సంచరించునదిగ, ఉష్ణముగ, సర్వదేహమునందు వ్యాపించి పచనముచేయునదిగనుండును. కావున నధిక లవణముతోగూడినదిగను, ఉష్ణముగనుండు ఘృతము, తైలము, వస, మజ్జ అనునీ 4-గు స్నేహములుకూడా సద్యస్స్నేహములనబడును. ప్రసృతమనగా:— "ద్వేపలేప్రసృతంవిదుః" అను వచనప్రకారము రెండుపలములని యర్థము.

### కుష్ఠాదులకు - స్నేహకర్మయందు - గుడాది నిషేధము.

శ్లో॥ గుడానూపామిషక్షీర తిలమాషసురాదధి ।
కుష్ఠశోఫప్రమేహేషు స్నేహార్థంనప్రకల్పయేత్ ॥ 43.

తా॥ కుష్ఠము, శోఫ, ప్రమేహము అను నీ రోగములయందు స్నేహక్రియ చేయుకాలములో బెల్లము, అనూపదేశమాంసము, క్షీరము, నువ్వులు, మినుములు, సుర, పెరుగు, వీనిని జేర్చంజనదు.

### కుష్ఠాదులకు - స్నేహ క్రమము.

శ్లో॥ త్రిఫలాపిప్పలీపథ్యా గుగ్గుల్వాదివిపాచితాన్ ।
స్నేహాన్యథాస్వమేతేషాం యోజయేదవికారిణః ॥ 44.

తా॥ పైజెప్పిన కుష్ఠాదిరోగములకు ఆయాయధ్యాయములయందు పథ్యకరములనిచెప్పబడినత్రిఫలములు, పిప్పలి, కరక్కాయ, గుగ్గులు యీమొదలగువానిచేసిద్ధము చేయబడినవియును, వికారమును గలుగజేయకుండునవియునైన స్నేహములనుప్రయోగించవలయును.

### వ్యాధిచే - క్షయించినవారికి - స్నేహోపయోగ క్రమము.

శ్లో॥ క్షీణానాంత్వామయైరగ్ని దేహసంధుక్షణక్షమాన్ ॥ 45.

తా॥ వ్యాధులచే క్షయించియుండుపురుషులకు అగ్ని దీపనకారిగ, శరీరపుష్టి కారిగనుండు స్నేహములను ప్రయోగించవలయును. ఏలననగా:— వ్యాధులచే క్షయించియుండుపురుషులకు జాఠరాగ్ని క్షీణించియుండును. కావున నట్టివారివిషయములో కేవలము పుష్టికరమయిన స్నేహములను ప్రయోగించినచో నవి అగ్నిమాంద్యమును గలుగజేసును. కేవలము అగ్నిదీప్తికరములైన స్నేహముల నుపయోగించినచో నవి శరీరపుష్టిని గలుగజేయనేరవు.

స్నేహ - సేవన ఫలము.

శ్లో॥ దీప్తాంతరాగ్నిః పరిశుద్ధకోష్ఠః ప్రత్యగ్రధాతుర్బలవర్ణయుక్తః ।
దృఢేంద్రియో మందజరః శతాయుః స్నేహోపసేవీ పురుషః ప్రదిష్టః ॥

తా॥ పలుమారు స్నేహసేవనచేయుచుండుపురుషుడు జాఠరాగ్నిదీప్తి, పరిశుద్ధమైన కోష్ఠము, శ్రేష్ఠమైనధాతువులు, బలము, వర్ణము, దృఢమైనఇంద్రియములు, స్వల్పమైనముసలితనము గలవాడుగను, 100 సంవత్సరములు జీవించువాడుగనునగునని సద్వైద్యులచే జెప్పబడియున్నది.

షోడశాధ్యాయము, ముగిసెను.

---

శ్రీరస్తు.

# సప్తదశాధ్యాయము.

శోధనప్రసంగమువలన స్నేహోపయోగముపూర్వాధ్యాయమునందు చెప్పబడినది. స్నిగ్ధమైనదేహములో దోషములు మృదుత్వమునుజెందుటకై స్వేదకర్మమిగుల నావశ్యకము కాబట్టి స్వేదజ్ఞానార్థమై స్వేదకర్మవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

స్వేదవిధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతః స్వేదవిధి మధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయో మహర్షయః ॥

తా॥ స్నేహవిధ్యధ్యాయానంతరము స్నిగ్ధమైనదేహములో దోష మృదుత్వ సంపాదనార్థమై స్వేదోపయోగం బావశ్యకంబగుటవలన స్వేదవిధ్యధ్యాయమును వివరించెదము.

చతుర్విధ స్వేదములు.

శ్లో॥ స్వేదస్తాపోపనాహోష్మ ద్రవభేదాచ్చతుర్విధః ।

తా॥ తాపము, ఉపనాహము, ఊష్మము, ద్రవము అను నీ భేదములవలన స్వేదము 4-గు విధములుగనుండును.

తాపస్వేద లక్షణము.

శ్లో॥ తాపోగ్నితప్తవసన ఫాలహస్తతలాదిభిః ॥ 1.

తా॥ అగ్నిచే తప్తమగువస్త్రము, అయోమయమైన ఫాలము (అనగా ఇనుప కాఱు), హస్తతలము (అనగా అరచెయ్యి) యీమొదలగువానిచే జేయబడుస్వేదకర్మ తాపమనుపేరంబఱంగును. “హస్తతలాదిభిః” అనుఆదిశబ్దమువలన మ్రాసు, ఇసుక, మట్టిపిడ్డత, కంచుపాత్ర యీమొదలగునవి గ్రాహ్యంబులు.

## ఉపనాహ - స్వేద లక్షణము.

శ్లో॥ ఉపనాహోవచాకిణ్వ శతాహ్వాదేవదారుభిః ।
ధాన్యైఃసమస్తైర్గంధైశ్చ రాస్నైరండజటామిషైః ॥ 2.
ఉద్రిక్తలవణై స్స్నేహ * చుక్రతక్రపయఃప్లుతైః ।
కేవలేపవనేశ్లేష్మ సంసృష్టేసురసాదిభిః ॥ 3.
పిత్తేనపద్మకాద్యైస్తు సాల్వణాఖ్యైఃపునఃపునః ।

తా॥ స్నేహము, పులికడుగు, తక్రము, క్షీరము, వీనిచే కలియబెట్టబడినదియును, అధికలవణముతో గూడినదియునైన వస, కిణ్వము (అనగా సురాప్రకృతి), సదాప, దేవదారు, అనువానిచేతను, నువ్వులు, అగసివిత్తులు, మినుములు, యీ మొదలగు ఉష్ణవీర్యముగల ధాన్యములచేతను, సమస్తమైనగంధ ద్రవ్యములు (అనగా చెంగల్వకోష్టు, అగురు, గ్రంథితగరము, తులసి) యీ మొదలగువానిచేతను, దుంపరాస్నము, ఏరండము. జటామాంసి, మాంసము అనువానిచేతను, చేయబడిన స్వేదకర్మ ఉపనాహమనబడును. కేవలవాతములో పైజెప్పిన వస మొదలగువానిచే ఉపనాహమను స్వేదకర్మనుచేయవలయును. శ్లేష్మముతోగూడి యుండువాతములో సురసయుగాదిగణముచే ఉపనాహమను స్వేదకర్మను చేయవలయును. పిత్తముతోగూడియుండు వాతములో పద్మకాదిగణముచే ఉపనాహమను స్వేదకర్మనుజేయవలయును. స్వల్పపిత్తముతో గూడియుండు వాతములోనే పద్మకాదిగణములవలన ఉపనాహమను స్వేదకర్మను చేయవలయునేకాని అధికపిత్తముతోగాని, లేక సమానపిత్తముతోగాని గూడియుండు వాతములో పద్మకాదిగణమువలన ఉపనాహస్వేదకర్మను చేయంజనదు. ఏలననగా:—"గ్రైష్మఃప్రాయోమరుత్పిత్తేవిధిఃకార్యః" (అనగా వాతపిత్తములో గ్రీష్మఋతువునందు చెప్పబడినవిధినే తలుచుగ జేయవలయునని చెప్పి స్వేదకర్మను చెప్పక నుపేక్షించియుండుటవలన అని తెలియవలయును.) పైచెప్పిన 3 విధములగు ఉపనాహస్వేదములను కేవలవాతమునందును, కఫయుక్తవాతమునందును, పిత్తయుక్తవాతమునందును, యథాక్రమముగా పలుమారు ప్రయోగించవలయును. పైచెప్పిన 3 విధములగు ఉపనాహస్వేదములకు సాల్వణమను నామాంతరము కలిగియుండును.

"ఉపనహ్యాతేబద్ధ్యతేచర్మపట్టాదిదా"

అనువ్యుత్పత్తినిబట్టి చర్మపట్టాదులచే కట్టబడుటవలన నీస్వేదకర్మ ఉపనాహమను పేరంబరంగును. ఉపనాహమను పేరంబరంగునదియును, సాల్వణమను నామాంతరము

* శుక్త ఇతిపా.



గలదియునైన యీస్వేదకర్మవలె నితరమయిన స్వేదకర్మలు ఉత్కృష్టములైనవికావు. ఉపనాహమను స్వేదమునకుతంత్రాంతరములయందు సాల్వణమను ప్రసిద్ధనామము కలిగియున్నది.

"కాకోల్యాదిస్సవాతఘ్న స్సర్వామ్లద్రవ్యసంయుతః । సానూపౌదకమాంసస్తు సర్వస్నేహసమన్వితః । సుఖోష్ణస్స్పృష్టలవణ స్సాల్వణఃపరికీర్తితః ॥"

అనెడి ధన్వంతరి వచనప్రకారము వాతహరద్రవ్యములు, సమస్తమైన ఆమ్లద్రవ్యములు, అనూపోదకమాంసములు వీనితోగూడినదిగ, సమస్త స్నేహయుక్తముగ, సుఖోష్ణముగ, అధికలవణముగలదిగనుండు కాకోల్యాదిస్వేదము సాల్వణమని చెప్పబడును.

## ఉపనాహ - స్వేదబంధన క్రమము.

శ్లో॥ స్నిగ్ధోష్ణవీర్యైర్మృదుభి శ్చర్మపట్టైరపూతిభిః ॥ 4.
అలాభేవాతజిత్పత్ర కౌశేయావికశాటకైః ।
రాత్రౌబద్ధందివాముంచే న్ముంచేద్రాత్రౌదివాకృతమ్ ॥ 5.

తా॥ స్నిగ్ధముగ, ఉష్ణవీర్యముగలదిగ, దుర్గంధరహితముగ, మృదువుగనుండునట్టి చర్మపట్టములచే ఉపనాహమను స్వేదమునందు బంధనముచేయవలయును. చర్మపట్టములు దొరకనిచో ఏరండపత్రము, కౌశేయవస్త్రము, కంబళము, శాటకము యీ మొదలగువానిచే బంధనముచేయవలయును. చర్మపట్టాదులచే రాత్రులయందు కట్టినకట్టును మధ్యాహ్నమునందును, మధ్యాహ్నమునందు కట్టినకట్టును రాత్రులయందును యిప్పివేయవలయును.

## ఊష్మ - స్వేద లక్షణము.

శ్లో॥ ఊష్మాతూత్కారికాలోష్ఠ కపాలోపలపాంసుభిః ।
పత్రభంగేనధాన్యేన కరీషసికతాతుషైః ॥ 6.
అనేకోపాయసంతప్తైః ప్రయోజ్యోదేశకాలతః ।

తా॥ అనేకవిధమయిన యుపాయములచే తప్తము చేయబడిన ఉత్కారికా (అనగా యవలు, మినుములు, ఆముదపువిత్తులు, అగసివిత్తులు, కుసుంబావిత్తులు వీనిని అర్ధపాకముచేసి ముద్దగజేసి లపసికాకారముగజేయబడిన స్వేదనోపాయ ద్రవ్యము) మంటిగడ్డలు, చిల్లపెంకు, ఱాయి, ధూళి, ఆకులసమూహము, ధాన్యము, కరీషము (అనగా ఏరు పిడకలచూర్ణము) ఇసుక, ఊమక, వీనిచే జేయబడినస్వేదము ఊష్మ

యనిబడుచుండును. దేశము, కాలము, దోషము, దూష్యము, వీనిని బాగుగనాలోచించి ఉపనాహస్వేదమును ప్రయోగించవలయును. ఎట్లనగా:—మంటిగడ్డ, చిల్ల పెంకు, రాయి యీ మొదలగువాని నగ్నిపయిబెట్టిగ కాల్చి కమ్మరవానిపటకారుచే నెత్తుకొని స్వేదకర్మకర్హుడగువానియొక్క దోషాదులను విచారించి అమ్లములో (అనగా పుల్లని నీళ్ళలోగాని, ధాన్యామ్లములోగాని, శుక్తాదులలోగాని) ముంచుటచే గలుగుధూమము వలన శయనములోపరుండియుండువానికి స్వేదకర్మ చేయించవలయును. లేక పేడను ముంటగజేసి అగ్నిలోనుష్ణముగజేసి దానిచే స్వేదకర్మ చేయించవలయును. ఇది పిండ స్వేదమనబడును. లేక ఏరండాది ద్రవ్యములతోగూడియుండు యవాదిధాన్యములను, అమ్లకాదులను ఒకకుండలోవేసి దానిముఖమును బాగుగమూసి బాగుగపక్వముచేసి గాలిలేకుండునట్టి గృహములో శయనముపై జల్లి దానిపై కంబళము, కౌశేయవస్త్రము, ఆముదపాకులు వీనిలో దేనినైననుపరచి దానిపై స్వేదకర్మ కర్హుడుగనుండువానిని పరుండబెట్టి వానిపై దుప్పి యనుమృగముయొక్క చర్మమునుగాని, లేక దృఢమైన వస్త్రమునుగాని కప్పవలయును. లేక తొలుతజెప్పిన స్వేదోపయుక్త ద్రవ్యములను నోరు వెడల్పుగా లేకుండునట్టి యొకకుండలోవేసి బాగుగనుడికించి స్వేదకర్మకు అర్హుడగువాడు గట్టిగనుండు వస్త్రమును కప్పుకొని కుంభసమీపమునకూర్చుండి దానిలోనుండి వెడలునట్టి పొగను గ్రహించుచుండవలయును. ఇది సంస్తర స్వేదమనబడును. ఈ ప్రకారము అనేకోపాయములవలన తపింపజేయబడిన వస్తువులను దోష దూష్యాదులను విచారించి స్వేదకర్మమునందు ప్రయోగించవలయును.

### ద్రవస్నేహ లక్షణము.

శ్లో॥ శిగ్రు * వీరణకైరండ కారంజసురసార్జకాత్ ॥ 7.
శిరీషవాసావంశార్క మాలతీదీర్ఘవృంతతః ।
పత్రభంగైర్వచాద్యైశ్చ మాంసైశ్చానూపవారిజైః ॥ 8.
దశమూలేనచస్నేహైః సహితైర్వాయథామలమ్ ।
స్నేహవద్భిఃసురాశుక్త వారిక్షీరాదసాధితైః ॥ 9.
కుంభీర్గలంతీర్నాడీర్వా పూరయిత్వారుజార్దితమ్ ।
వాసపాచ్ఛాదితంగాత్రం స్నిగ్ధంసించేద్యథాసుఖమ్ ॥ 10.

తా॥ మునుగ, వీరణము, చిట్టాముదము, క్రానుగు, తులసి, గగ్గర, దిరిసినము, అడ్డసరము, వెదురు, జిల్లేడు, జాజి, పెద్దమాను, వీనియాకులు వచాదిగణ

* వారణ ఇతి పా.



ములో జెప్పబడిన ద్రవ్యములు, అనూపదేశజనితంబును, జలమునందు జనించినవియు నైన మాంసములు, దశమూలములు, వీనిని వెవ్వేరుగగాని, లేక 2-డు లేక 3 ద్రవ్యములనుగాని, లేక సర్వమునుగాని, దోషహరమైన ఘృతము మొదలగు స్నేహములలో దేనియందేని వాతాది దోషానుగుణ్యముగజేర్చి సుర, శుక్తము, జలము, క్షీరము వీనిచే వాతాది దోషానుగుణ్యముగ సిద్ధముచేయబడిన కషాయముల నొకకుండలోగాని, గరిగ పిగతలోగాని, వెదురు గొట్టములోగాని పూరింపజేసి పీడితుడుగనుండువాని శరీరమును వస్త్రముచేమూసి సుఖస్పర్శముగ (అనగా దోషపీడాను గుణ్యముగ ఒకానొకపుడు అత్యుష్ణముగ, మఱియొకపుడు కించిదుష్ణముగ) ఆకషాయముచే తడుపుచుండవలయును. ఇది ద్రవస్వేదమని చెప్పబడును.

### అవగాహ - స్వేద లక్షణము.

శ్లో॥ తైరేవవాద్రవైఃపూర్ణం కుండంసర్వాంగగేనిలే ।
అవగాహ్యాతురస్తిష్ఠే దర్శఃకృచ్ఛ్రాదిరుక్షుచ ॥ 11.

తా॥ వాతముసర్వశరీరమునందు వ్యాపించియుండువపుడును, అర్శస్సు, మూత్రకృచ్ఛ్రము యీ మొదలగు కష్టమయిన రోగములయందును, పైజెప్పినద్రవ్యములచే పూరింపబడిన ఒక తొట్టిలో రోగి ప్రవేశించి కూర్చుండవలయును. "కృచ్ఛ్రాది" అను ఆదిశబ్దమువలన హస్త పాదపీడాదులనుకూడా గ్రహించుకొనవలయును.

"శయనస్యాధోవిస్తారద్విగుణఖాతే కృతేవాతహరదారుకరీషాద్యన్యతరపూర్ణదగ్ధేవిగతధూమేస్వాస్తీర్ణశయనస్థంస్వేదయేదితికూపస్వేదః । కుటీంనాత్యుచ్చవిస్తారవృత్తామచ్ఛిద్రాముపనాహ ద్రవ్యకల్కఘనప్రదిగ్ధకుడ్యాంసర్వతో విధూమప్రదీప్తఖదిరాంగారపూర్ణ హసంతికాసమూహపరివృతాంవిధాయతన్మధ్యస్థితశయ్యాస్థంస్వేదయేదితికుటీస్వేదః ॥ పద్మోత్పలాదిభిస్స్రక్తు పిండ్యావాచ్ఛాద్యచక్షుషీ । శీతైర్ముక్తావలీపద్మముకులోత్పలభాజనైః। ముహుఃకరైశ్చసజలైఃస్విద్యతోహృదయంస్పృశేత్ ॥"
అనగా మంచమునకు క్రింది ప్రదేశమునందు దాని పరిమితికంటె ద్విగుణముగ పల్లమునుత్రవ్వి, దానిలో వాతహరమైనకట్టెలు, కరీషము యీ మొదలగువానిలో దేనినేనివేసి పూరించి అగ్గి తగిలించి ఆ కట్టెలు బాగుగకాలి పొగలేకుండునపుడు దానిపై మంచమునువేసి రోగినిపరుండబెట్టి స్వేదకర్మ చేయవలయును. ఇది కూప స్వేదమన

బడును. మిగుల యెత్తు వెడల్పు లేకుండా గుండ్రముగను, ఛిద్రరహితముగనుండు గుడిసెను నిర్మించి దాని లోప్రదేశముయొక్క గోడలయందు ఉపనాహ స్వేదోక్తద్రవ్య కల్కములను దృఢముగపూసి 4-గు ప్రక్కలయందును పొగలేకుండునట్టి చంద్రనిప్పులచే సంపూర్ణముగనుండు కుంపటులనునిచి ఆగుడిసెమధ్యలో శయనమును వేసి దానిపై రోగిని పరుండబెట్టి స్వేదకర్మను చేయవలయును. ఇది కుటీస్వేదమనబడును. స్వేదకర్మజేయునపుడు పద్మోత్పలాదులవలనగాని లేక వేపుడుబియ్యపుపిండియొక్క ఉంటవలనగాని, నేత్రములనుమూసి శీతలముగనుండు ముక్తాహారము, తామరమొగ్గలు, నల్లకలువ, పాత్రలు, జలముతోగూడియుండు అఱచెయ్యి, వీనిచే స్వేదకర్మ జేసుకొనువాని హృదయమును పలుమారుస్పృశించుచుండవలయునని అష్టాంగసంగ్రహమునందు కూపకుటీస్వేద విధులు చెప్పబడియున్నవి.

## స్వేదయోగ్య స్థలము.

శ్లో॥ నివాతేంతర్బహిఃస్నిగ్ధో జీర్ణాన్నఃస్వేదమాచరేత్ ।
వ్యాధివ్యాధిత దేశర్తు వశాన్మధ్యవరావరమ్ ॥ 12.

తా॥ స్నేహపానముచే అంతఃస్నిగ్ధుడు, అభ్యంగాదులచే బహిఃస్నిగ్ధుడునైన పురుషుడు పూర్వదినమునందు భుజించినయన్నము బాగుగ జీర్ణమైన పిదప గాలిలేకుండుప్రదేశమున రోగము, దేశము, ఋతువు, ధాతువు వీనికనుగుణముగా మధ్యమముగగాని లేకఉత్కృష్టముగగాని లేకహీనముగగానినుండు స్వేదకర్మను చేయించుకొనవలయును. ఇటుల జెప్పుటచే స్వేదకర్మకు అర్హుడైనపురుషుడు స్వేదకర్మ నవశ్యముగ జేయించుకొనవలయుననియును, ఆమాజీర్ణాదులవలన పీడించబడిన పురుషుడు అన్నము జీర్ణముకాకుండునపుడు స్వేదకర్మను చేసికొనగూడదనియును భావంబగుచున్నది.

## కఫరోగమునందు - స్వేద క్రమము.

శ్లో॥ కఫార్తోరూక్షణంరూక్షో రూక్షస్నిగ్ధంకఫానిలే ।

తా॥ కఫపీడితుడుగనుండుపురుషుడు లోనను బయిటను అస్నిగ్ధుడై రూక్షమైన స్వేదకర్మను చేయించుకొనవలయును. శ్లేష్మవాతములవలన పీడింపబడినవానికి లోనియంగములయందు స్నిగ్ధముగను, బయటియంగములయందు రూక్షముగనుండు స్వేదకర్మను చేయవలయును.

## ఆమాశయ - గతవాత - స్వేద క్రమము.

శ్లో॥ ఆమాశయగతేవాయౌ కఫేపక్వాశయాశ్రితే ॥ 13.



రూక్షపూర్వంతథా * స్నేహపూర్వంస్థానానురోధతః ।

తా॥ వాతరోగము ఆమాశయమును జెందియుండునపుడు స్థానానుగుణముగా (అనగా శ్లేష్మస్థానమైన ఆమాశయములో వాతము ఆగంతుకమైనదికావున నాశ్లేష్మస్థానానుగుణముగా) తొలుత రూక్షకరమైన స్వేదకర్మనుచేసి పిదప స్నిగ్ధమైన స్వేదకర్మను చేయవలయును. కఫరోగము పక్వాశయమును జెందియుండునపుడు స్థానానుగుణముగా (అనగా వాతస్థానమైన పక్వాశయములో కఫము ఆగంతుకమైనది కావున నా వాతస్థానానుగుణముగా) తొలుత స్నిగ్ధమైన స్వేదకర్మనుచేసి పిదప రూక్షకరమయిన స్వేదకర్మను చేయవలయును.

“తత్రాన్యస్థానసంస్థేషుతదీయాం”
అనియును,—
“ఆగంతుంశమయేద్దోషం స్థానినంప్రతికృత్యచ”
అనియును తొలుత స్థానసంబంధమైనదోషమునకు చికిత్సజేసి పిదప ఆగంతుకదోషములకు శమనముచేయవలయునని యిదివరకే జెప్పబడియున్నది.

## గజ్జలు - మొదలగువానియందు - స్వేద క్రమము.

శ్లో॥ అల్పంవంక్షణయోఃస్వల్పం దృఙ్ముష్కహృదయేనవా ॥ 14.

తా॥ గజ్జలయందల్పముగను, నేత్రములు, వృషణములు, హృదయము వీనియందత్యల్పముగను స్వేదకర్మ చేయవలయును. లేక నేత్రములు, వృషణములు, హృదయము వీనియందు స్వేదకర్మమే చేయంజనదు.

## బాగుగా - స్వేదకర్మ - జేసికొనినవానియొక్క లక్షణోపచారము.

శ్లో॥ శీతశూలక్షయేస్విన్నో జాతేంగానాంచమార్దవే ।
స్యాచ్ఛనైర్మృదితఃస్నాత స్తతఃస్నేహవిధింభజేత్ ॥ 15.

తా॥ శైత్యము, శూల, ఇవితీఱయించి హస్తములు, పాదములు యీమొదలగునంగములకు మృదుత్వముకలుగుచుండగా మనుజుడు స్విన్నుడుగనగును. స్విన్నుడుగనుండుపురుషుడు అంగములయందు మృదువుగ మర్దనముచేయించుకొని ఉష్ణోదకములో స్నానముచేసి స్నేహప్రకరణములో జెప్పియుండు ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది విధుల ననుసరించవలయును.

---

* స్నిగ్ధ ఇతి పా.

### స్వేదాతి - యోగజనిత రోగములు.

శ్లో॥ పిత్తాస్రకోపతృణ్మూర్ఛా స్వరాంగసదన భ్రమాః ।
సంధిపీడాజ్వరశ్యావ రక్తమండలదర్శనమ్ ॥ 16.
స్వేదాతియోగాచ్ఛర్దిశ్చ తత్ర స్తంభనమౌషధమ్ ।
విషక్షారాగ్న్యతీసార చ్ఛర్దిమోహాతురేషుచ ॥ 17.

తా॥ స్వేదకర్మయొక్క అతియోగమువలన రక్తపిత్తప్రకోపము, దప్పి, మోహము, స్వరభంగము, శరీరపీడ, భ్రమము, సంధులయందుపీడ, జ్వరము, శ్యామ రక్తవర్ణములుగల మండలములు, వాంతి గలుగును. వీనియందు స్తంభనౌషధము ప్రయోగించవలయును. అటులనే విషము, క్షారకర్మ, అగ్నికర్మ, అతిసారము, వాంతి, మోహము వీనిచే పీడింపబడినవారికిని స్తంభనౌషధము ప్రశస్తమయినది.

### స్వేదోపయుక్త ద్రవ్యములు.

శ్లో॥ స్వేదనంగురుతీక్ష్ణోష్ణం ప్రాయః స్తంభనమన్యథా ।

తా॥ గురువుగ, తీక్ష్ణముగ, ఉష్ణముగనుండు ద్రవ్యము ప్రాయశః స్వేదకరముగనుండును. పూర్వోక్తగుణములకంటె విపరీతగుణములుగల ద్రవ్యము ప్రాయశః స్తంభనకారిగనుండును.

### స్వేదన - స్తంభన ద్రవ్యములు.

శ్లో॥ ద్రవస్థిరసరస్నిగ్ధ రూక్షసూక్ష్మంచభేషజమ్ ॥ 18.
స్వేదనం స్తంభనంశ్లక్ష్ణం రూక్షసూక్ష్మసరద్రవమ్ ।

తా॥ ద్రవము, స్థిరము, సరము, స్నిగ్ధము, రూక్ష, సూక్ష్మము అను నీ గుణములతో గూడియుండు ద్రవ్యము స్వేదనమనబడును. శ్లక్ష్ణత్వము, రూక్ష, సూక్ష్మము, సరము, ద్రవము అను నీగుణములతోగూడియుండు ద్రవ్యము స్తంభనమనబడును,

### రసములచే - స్తంభనకర ద్రవ్యములు.

శ్లో॥ ప్రాయస్తిక్తంకషాయంచ మధురంచసమాసతః ॥ 19.

తా॥ తిక్తము, కషాయము, మధురము అను నీరసములతో గూడియుండు ద్రవ్యము తరుచుగ స్తంభనకారిగనుండును.



### స్తంభిత లక్షణము.

శ్లో॥ స్తంభితఃస్యాద్బలేలబ్ధే యథోక్తామయసంక్షయాత్ ।

తా॥ స్తంభనక్రియాసాధ్యములని వైద్యతంత్రములో జెప్పబడిన రోగములు క్షయించి శరీరమునందు బలముగలిగినయెడల మనుజుడు స్తంభితుడుగనగును.

### అతి స్తంభిత లక్షణము.

శ్లో॥ స్తంభత్వక్స్నాయుసంకోచ కంపహృద్వాగ్ఘనుగ్రహైః ॥ 20.
పాదోష్ఠత్వక్కరైశ్శ్యావై రతిస్తంభితమాదిశేత్ ।

తా॥ స్తబ్ధత్వము; చర్మము, స్నాయువులు వీనికి సంకోచము; శరీరము వణుకుట; రొమ్ము, నోరు, కటుముర్లు, వీనియందుపట్లు; పాదము, పెదవి, చర్మము, హస్తము, వీనియందు శ్యావవర్ణము; ఇవిగలమనుజుడు అతి స్తంభితుడని తెలియవలయును.

### స్వేదకర్మ నిషిద్ధులు.

శ్లో॥ నస్వేదయేదతిస్థూల రూక్షదుర్బలమూర్ఛితాన్ ॥ 21.
స్తంభనీయక్షతక్షీణ క్షామమద్యవికారిణః ।
తిమిరోదరవీసర్ప కుష్ఠ * శోషాఢ్యరోగిణః ॥ 22.
పీతదుగ్ధదధిస్నేహ మధూన్కృతవిరేచనాన్ ।
భ్రష్టదగ్ధగుదగ్లాని క్రోధశోకభయాన్వితాన్ ॥ 23.
క్షుత్తృష్ణాకామలాపాండు మేహినఃపిత్తపీడితాన్ ।
గర్భిణీంపుష్పితాంసూతాం మృదువాత్యయికేగదే ॥ 24.

తా॥ అతిస్థూలుడు, రూక్షుడు, దుర్బలుడు, మూర్ఛితుడు, స్తంభనక్రియకు అర్హుడు, క్షతక్షీణుడు, కృశించినవాడు, మద్యపానముచే వికారమునుజెందినవాడు, తిమిరరోగము, ఉదరరోగము, విసర్పి, కుష్ఠము, శోష, ఆఢ్యరోగము (అనగా వాతరక్తము) అనునీ రోగములుగలవారు, పాలు, పెరుగు, స్నేహము, తేనె, వీనిలోదేనిసేని పానముజేసినవాడు విరేచనమునకు సేవించినవాడు, అతిసారము క్షారాగ్నికర్మలు యీమొదలగువానిచే భ్రష్టముగ దగ్ధముగనుండు గుదముగలవాడు, బడలిక, క్రోధము, శోకము, భయము వీనితోగూడియుండువాడు, ఆకలి దప్పికలవాడు,

* శోఫా ఇతిపా.

కామల, పాండువు, మేహము అనునీ రోగములుగలవారు, పిత్తముచేపీడింపబడినవారు గర్భిణిస్త్రీ, పుష్పవతియైనస్త్రీ, ప్రసవించినస్త్రీ, వీరలకు స్వేదకర్మ చేయింపంజనదు. ఏలననగా :—స్వేదకర్మచే అతిస్థూలునికి మేదస్సుక్షయించి మిక్కుటముగ శరీర క్షోభ గలుగును. రూక్షుడు మొదలగువారికి అతికృశత్వముగలుగును. ఆకలికలవానికి మిక్కుటముగ శరీరమునందు బడలికగలుగును. కామల పాండువు అనునీ రోగములు గలవారికిపిత్తవృద్ధివలన రోగమువృద్ధిజెందును. పిత్తపీడగలవానికి రోగమువృద్ధిజెందును. గర్భిణికి గర్భమునకు ఆపత్తుగలుగును. రజస్వలకు అధికముగరక్తస్రావము కలుగును. ప్రసవించినస్త్రీకి కార్శ్యముగలుగును. అయితే పైజెప్పిన అతిస్థూలులు మొదలగు వారికి విసూచిక మొదలగు ఆత్యంతికమైన (అనగా ప్రాణహరమైన) వ్యాధి గలిగి యుండునపుడు మృదువుగ స్వేదకర్మచేయించవలయును.

## శ్వాసాదులయందు స్వేదకర్మ.

శ్లో॥ శ్వాసకాసప్రతిశ్యాయ హిధ్మాధ్మానవిబంధిషు ।
స్వరభేదానిలవ్యాధి శ్లేష్మామస్తంభగౌరవే ॥ 25.
అంగమర్దకటీపార్శ్వ పృష్ఠకుక్షిహనుగ్రహే ।
మహత్వేముష్కయోఃఖల్ల్యా మాయామేవాతకంటకే ॥ 26.
మూత్రకృచ్ఛ్రార్బుదగ్రంథి శుక్రాఘాతాఢ్యమారుతే ।
స్వేదంయథాయథంకుర్యా త్తదౌషధవిభాగతః ॥ 27.

తా॥ శ్వాసము, కాసము, పీనసము, హిధ్మ, ఆధ్మానము, మలబంధము, స్వరభేదము, వాతవ్యాధి, శ్లేష్మము, ఆమరోగము, శరీరస్తంభము, గురుత్వము, ఒడలునొప్పి, కటిప్రదేశము, పార్శ్వములు, పృష్ఠము, కుక్షి, కటుమర్లు వీనియందు పట్లు, అండవృద్ధి, ఖల్లి, ఆయామవాతము, వాతకంటకము, మూత్రకృచ్ఛ్రము, అర్బుదము, గ్రంధిరోగము, శుక్రాఘాతము, అఢ్యవాతము, అనునీ రోగములుగలవారికి ఆ యా రోగములకుచెప్పియుండు ఔషధోపయోగములవలన స్వేదకర్మను యథాక్రమముగ, (అనగా ఒకరోగమునందు తాపమనుస్వేదకర్మను, ఒకరోగమునందు ఉపనాహమను స్వేదకర్మను, ఒకరోగమునందు ఊష్మయనుస్వేదకర్మను, ఒకరోగమునందు ద్రవమను స్వేదకర్మను) చేయవలయును.

“కర్ణనాసాశిరఃకోష్ఠ జంఘాపాదోరురుత్సుచ ”
కర్ణరోగము, నాసారోగము, శిరోరోగము, కోష్ఠరోగము, జంఘారోగము, పాద



రోగము, ఊరురోగము వీనియందుకూడా స్వేదకర్మనుచేయించవలయునని అష్టాంగ సంగ్రహములో జెప్పబడియున్నది.

## వాతరోగవిశేషమునందు - అనాగ్నేయ స్వేదోపయోగము.

శ్లో॥ స్వేదోహిత స్త్వనాగ్నేయో వాతేమేదఃకఫావృతే ।

తా॥ మేదస్సు, కఫము, వీనిచే వ్యాప్తంబైయుండు వాతరోగమునందు అనాగ్నేయమనుస్వేదకర్మ హితకరము.

## అనాగ్నేయ స్వేదవివరము.

శ్లో॥ నివాతంగృహమాయాసో గురుప్రావరణంభయమ్ ॥ 28.
ఉపనాహాహవక్రోధ భూరిపానం * క్షుధాతపః ।

తా॥ గాలిలేకుండునట్టి గృహము, వ్యాయామము, దళముగనుండు రల్లకమను కంబళిమొదలగునవి. భయంకర వస్తుదర్శనముచే గలిగినభయము,—
“స్నిగ్ధోష్ణవీరై ర్వర్శమృదుభిశ్చర్మపట్టైః”
అనువచనముచే నిదివరకుచెప్పబడిన ఉపనాహమనుస్వేదము, యుద్ధము, క్రోధము, అధికమద్యపానము, ఆకలి, తపస్సు, ఇవి అనాగ్నేయ (అనగా అగ్నిసంబంధములేని స్వేదములనబడును.

## స్వేదకర్మ ఫలము.

శ్లో॥ స్వేదక్లిన్నాఃకోష్ఠగాధాతుగావా స్రోతోలీనాయేచశాఖాస్థి
సంస్థాః ॥ 29 ॥ దోషాఃస్వేదై స్తేద్రవీకృత్యకోష్ఠం నీతా
స్సమ్యక్ఛుద్ధిభిర్నిర్హ్రియంతే ॥ 29½.

తా॥ కోష్ఠగతంబులుగ, రసాదిధాతుగతంబులుగ, స్రోతస్సులయందు లీనమైనవిగ, హస్తపాదములు అస్థులు వీనిని జెందినవిగనుండు దోషములు స్వేదకర్మలచే ద్రవించి కోష్ఠగతంబులై వమనవిరేచనాది శుద్ధులచే బాగుగ హరింపజేయబడును.

సప్తదశాధ్యాయము, ముగిసెను.

---

* క్షుదాతపః ఇతిపా.

శ్రీరస్తు.

# అష్టాదశాధ్యాయము.

స్వేదవిధ్యధ్యాయముయొక్క అంతమునందు "సమ్యక్శుద్ధి భిర్నిర్హ్రియంతే" అని చెప్పబడినది; గనుక నాశుద్ధులయొక్క స్వరూపమును తెలియజేయు నట్టి వమనవిరేచనవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

## వమనవిరేచన - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోవమనవిరేచన విధిమధ్యాయంవ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః॥

తా॥ స్వేదవిధ్యధ్యాయానంతరము "శుద్ధిభిర్నిర్హ్రియంతే" అను వాక్యాను సరణి వమనవిరేచనాదిశుద్ధి క్రమమును తెలియజేయునట్టి వమనవిరేచన విధ్యధ్యాయ మును వివరించెదము.

### కఫము - పిత్తము - వీనియందు వమనవిధి.

శ్లో॥ కఫేవిదధ్యాద్వమనం సంయోగేవాకఫోల్బణే।
తద్వద్విరేచనంపిత్తే

తా॥ శ్లేష్మమునందును, కఫాధిక్యముగల దోషసంయోగమునందును, వమనము చేయించవలయును. ఇటులనే పిత్తమునందును, పిత్తాధిక్యముగల దోష సంయోగము నందును విరేచనము చేయించవలయును.

### వమన కర్మార్హులు.

శ్లో॥ విశేషేణతువామయేత్॥ 1.
నవజ్వరాతిసారాధః పిత్తాసృగ్రాజయక్ష్మిణః।
కుష్ఠమేహాపచీగ్రంథి శ్లీపదోన్మాదకాసినః॥ 2.
శ్వాసహృల్లాసవీసర్ప స్తన్యదోషోర్ధ్వరోగిణః।



తా॥ నూతనజ్వరము, అతిసారము, అధఃపిత్తము, పిత్తరక్తము, రాజయక్ష్మ, కుష్ఠము, మేహము, అపచి, గ్రంథి, శ్లీపదము, ఉన్మాదము, కాసము, శ్వాసము, హృల్లాసము, విసర్పము, స్తన్యదోషము, ఊర్ధ్వరోగము, అనునీ రోగములుగలవారికి విశేషముగా వమనము చేయించవలయును.

### వమన కర్మానర్హులు.

శ్లో॥ అవామ్యాగర్భిణీరూక్షః క్షుధితోనిత్యదుఃఖితః॥ 3.
బాలవృద్ధకృశస్థూల హృద్రోగిక్షతదుర్బలాః।
ప్రసక్తవమథుప్లీహ తిమిరక్రిమికోష్ఠినః॥ 4.
ఊర్ధ్వప్రవృత్తవాయ్వ స్రదత్తవస్తిహతస్వరాః।
మూత్రాఘాత్యుదరీగుల్మీ దుర్వమోత్యగ్నిరర్శసః॥ 5.
ఉదావర్తభ్రమాష్ఠీలా పార్శ్వరుగ్వాతరోగిణః।

తా॥ గర్భిణి, రూక్షుడు, ఆకలిగలవాడు, ఎల్లపుడు దుఃఖించువాడు, బాలురు, వృద్ధులు, కృశుడు, స్థూలుడు, హృద్రోగము గాయముగలవారు, దుర్బలులు, వమనము చేయుచుండువాడు, ప్లీహము, తిమిరము, కృమిరోగము, కోష్ఠరోగము, ఊర్ధ్వభాగ మునుజెందియుండునట్టి వాతరక్తము ఇవిగలవారు, వస్తికర్మ చేయించుకొనినవాడు, స్వరదోషము, మూత్రాఘాతము, ఉదరరోగము, గుల్మరోగము, అర్శస్సు, ఉదా వర్తము, భ్రమ, అష్ఠిలా, పార్శ్వరోగము, వాతరోగము అనునీ రోగములుగలవారు, మిక్కుటముగ అగ్నిదీపనముగలవాడు, అతికష్టముమీద వమనముచేయువాడు, వీరలు వమనకర్మయందనర్హులు. అట్లగుటచే వమనకర్మవలన గర్భిణికి గర్భభ్రంశముగలుగును. ఆకలిగలవానికి బలక్షయముగలుగును. బాలురు మొదలగువారలు ఔషధబలమును సహించనేరరు కావున వారికిబలహానిగలుగును. హృద్రోగముగలవానికి హృదయ మునకు చెరుపుగలుగును. వాంతిచేయుచుండువానికి ఉదానవాయువు ఊర్ధ్వభాగ మునుజెంది ప్రాణములనుకూడా హింసించును. వమనకర్మ కనర్హులగు నితరరోగులకు వమనము చేయించినయెడల రోగములుగలుగునని పై జెప్పిన ప్రకారమే ఊహించు కొనవలయును.

### విషాది - సంబంధమునందు వమనానుజ్ఞ.

శ్లో॥ ఋతేవిషగరాజీర్ణ విరుద్ధాభ్యవహారతః॥ 6.

తా॥ విషసంబంధము, గరసంబంధము, అజీర్ణము, విరుద్ధాన్నభక్షణము ఇవి గలిగియుండునపుడు తప్ప యితర కాలములయందు పై జెప్పిన బాలురు మొదలగు

వారికి వమనకర్మ చేయించంజనదు. (అనగా పైజెప్పిన బాలాదులకు విషాదిసంబంధము గలిగియుండునపుడు మాత్రము అవశ్యముగ వమనము చేయించవలయుననిభావము.)

ధూమపానాది - కర్మవర్జ్యులు.

శ్లో॥ ప్రసక్తవమథోః పూర్వే ప్రాయేణామజ్వరేపిచ ।
ధూమాంతైః కర్మభిర్వర్జ్యాః సర్వైరేవత్వజీర్ణినః ॥ 7.

తా॥ పైజెప్పినగర్భిణిమొదలగు దశవిధరోగులు, ఆమజ్వరముగలవాడు వీరలకు ధూమపానము, గండూషము, యీ మొదలగుకృత్యములను తరుచుగజేయించంజనదు. 8 మాసములుగల గర్భిణిస్త్రీకి నిరూహవస్తికర్మము చేయించంజనదని తెలియపరచుటకై “ప్రాయేణ” అనుపదము ప్రయోగించబడినది. అజీర్ణరోగముగలవానికి ధూమపానము, గండూషము యీ మొదలగునే కృత్యమును చేయించంజనదు. అజీర్ణముగలవారికి తత్క్షణమువవమనము తంత్రకారులచే నంగీకరింపబడియున్నది.

వమన - విరేచనముల కర్హులు.

శ్లో॥ విరేకసాధ్యాగుల్మార్శో విస్ఫోటవ్యంగకామలాః ।
జీర్ణజ్వరోదరగరచ్ఛర్దిప్లీహహలీమకాః ॥ 8.
విద్రధిస్తిమిరంకాచః స్యందః పక్వాశయవ్యథా ।
యోనిశుక్రాశయారోగాః కోష్ఠగాః క్రిమయో వ్రణాః ॥ 9.
వాతాస్రమూర్ధ్వగంరక్తం మూత్రాఘాతశ్శకృద్గ్రహః ।
వమ్యాశ్చకుష్ఠమేహాద్యాః

తా॥ గుల్మము, అర్శస్సు, విస్ఫోటము, వ్యంగము, కామల, జీర్ణజ్వరము, ఉదరరోగము, విషము, ఛర్ది, ప్లీహము, హలీమకము, విద్రధి, తిమిరము, కాచము, స్యందము, పక్వాశయమునందుపీడ, యోనిరోగము, శుక్రరోగము, కోష్ఠగరోగము, కృమిరోగము, వ్రణములు, వాతరక్తము, ఊర్ధ్వగతరక్తము, మూత్రాఘాతము, మలబంధము, అనునీరోగములుగలవారును, వమనక్రియకు అర్హులనిచెప్పబడిన కుష్ఠమేహాది రోగములుగలవారును, విరేచనకర్మకు అర్హులుగనుండెదరు. మఱియును “వమ్యాశ్చ” అనుచకారమువలన పైజెప్పినవారు వమనకర్మకుకూడా అర్హులుగనుండెదరని భావంబగుచున్నది.

విరేచ నిషిద్ధులు.

శ్లో॥ నతురేచ్యోనవజ్వరీ ॥ 10.



అల్పాగ్న్యధోగపిత్తాస్రక్షతపాయ్వతిసారిణః ।
సశల్యాస్థాపితక్రూరకోష్ఠాతిస్నిగ్ధశోషిణః ॥ 11.

తా॥ నూతనజ్వరము, అల్పముగనగ్నిదీపనము, అధోగతమయిన పిత్తరక్తము, క్షతమైనగుదము, అతిసారగము ఇవి గలవారు, శల్యముతోగూడియుండువాడు, ఆస్థాపనము (అనగా నిరూహవస్తి) చేసుకొనినవాడు, క్రూరమైన కోష్ఠము గలవాడు, అతిస్నిగ్ధుడు, క్షయరోగముగలవాడు, వీరలకెపుడును విరేచనకర్మచేయించంజనదు. ఏలననగా:—నూతనజ్వరితునికి అపక్వమైన దోషములువెలివడి వాతప్రకోపము గలుగును. అల్పముగ నగ్నిదీపనముగలవాడు దుర్బలుడుగనుండుటచే నౌషధవేగమును సహించనేరడు. అధోగతమైన రక్తపిత్తముగలవానికి అధికముగ విరేచనంబులై ప్రాణహానికూడాగలుగును. క్షతమైన గుదముగలవానికి ప్రాణహరమైన యుపద్రవములుకలుగును. శల్యముతోగూడియుండువానికి గాయమునందు వాతము ప్రవేశించి ప్రాణమును హరింపజేయును. నిరూహవస్తి చేయించుకొనినవాడు ఔషధవేగమును సహించనేరడు. కాబట్టివానికి బలహానికలుగును. క్రూరమైన కోష్ఠముగలవానికి దోషములు బయలువెడలక హృదయశూల, గణుపులు బద్ధలగుట, ఆనాహము, ఛర్ది, మూర్ఛ, బడలిక, యీ మొదలగు నుపద్రవములుకలిగి ప్రాణహానికలుగును. అతిస్నిగ్ధునికి అతియోగముగనగును. (అనగా మిక్కుటముగా విరేచనములగునని భావము.) క్షయరోగముగలవానికి ధాతువులు క్షయించియుండుటచే దేహనాశము కలుగును.

వమనౌషధ - సేవన క్రమము.

శ్లో॥ అథసాధారణేకాలే స్నిగ్ధస్విన్నంయథావిధి ।
శ్వోవమ్యముత్క్లిష్టకఫం మత్స్యమాషతిలాదిభిః ॥ 12.
నిశాంసుప్తంసుజీర్ణాన్నం పూర్వాహ్ణేకృతమంగళమ్ ।
నిరన్నమీషత్ స్నిగ్ధంవా పేయయాపీతసర్పిషమ్ ॥ 13.
వృద్ధబాలాబలక్లీబభీరూన్ రోగానురోధతః ।
ఆకంఠంపాయితాన్ మద్యం క్షీరమిక్షురసంరసమ్ ॥ 14.
యథావికారవిహితాం మధుసైంధవసంయుతామ్ ।
కోష్ఠంవిభజ్యభైషజ్యమాత్రాంమంత్రాభిమంత్రితామ్ ॥ 16.
బ్రహ్మదక్షాశ్విరుద్రేంద్రభూచంద్రార్కానిలానలాః ।
ఋషయస్సౌషధిగ్రామాః భూతసంఘాశ్చపాంతువః ॥ 16.

రసాయనమివర్షీణా మమరాణామివామృతమ్ ।
సుధేవోత్తమనాగానాం భైషజ్యమిదమస్తుతే ॥ 17.
ఓంనమో భగవతేభైషజ్య గురవేవైడూర్యప్రభరాజాయ
తథాగతాయార్హతే సమ్యక్సంబుద్ధాయ । తద్యథా ॥ ఓం
భైషజ్యేభైషజ్యేమహాభైషజ్యేసముద్గతేస్వాహా॥ ప్రాఙ్ముఖం
పాయయేత్

తా॥ పై జెప్పినప్రకారము విరేచనకర్మయొక్క యోగ్యాయోగ్యత్వమును తెలుసుకొని సాధారణమైన శ్రావణాదికాలములో స్నేహస్వేదాధ్యాయములయందు చెప్పియుండు విధిప్రకారము స్నిగ్ధుడుగ, స్విన్నుడుగ, వమనకారియగుమత్స్యములు, మినుములు, నువ్వులు యీమొదలగువానిచే స్వస్థానమునుండి వెలిపరచబడినకఫము గలవాడుగ, రాత్రియందు పూర్ణముగా నిద్రించినవాడుగ, బాగుగ జీర్ణమయిన యాహారముగలవాడుగ, ప్రాతఃకాలమునందు దేవ, బ్రాహ్మణ, అగ్ని, గురు, వృద్ధ, పూజాస్వస్త్యయనాదుల జేసినవాడుగ, ఆహారహితుడుగనుండునట్టి వమనార్హపురుషునికి రోగానుగుణ్యముగా సిద్ధముజేయబడినదియును, మధుసైంధవ లవణములతో గూడినదియును, బ్రహ్మరక్షాశ్విరుద్రేత్యాదిమంత్రములచే నభిమంత్రించబడినదియు నగు వమనౌషధమాత్రను మృదు, మధ్య, క్రూరకోష్ఠభేదములను బాగుగ విచారించి ప్రాఙ్ముఖముగ (అనగా తూర్పుముఖముగ) పానముచేయించవలయును. మఱియును వమనార్హుడు దుర్బలుడుగనుండినచో పై విధిప్రకారమే పేయతోగూడియుండు ఘృతమును పానముచేయించి పిదప వమనౌషధమును పానము చేయించవలయును.
“ భీరుకృశబాలసుకుమారత్వదోషానురోధేనాకంఠం పీతయాపేయక్షీర
మాంసరసమద్యతుషోదకయవాగూమండాన్యతమమ్ ॥”
అనెడి అష్టాంగసంగ్రహవచనప్రకారము వృద్ధుడుగగాని, బాలుడుగగాని, స్త్రీగగాని, భయపడువాడుగగాని, నపుంసకుడుగగాని నుండినచో ఆయా రోగానుగుణ్యముగా కంఠమువరకు (అనగా సంపూర్ణముగా) మద్యము, క్షీరము, చెఱుకురసము, మాంసరసము, వీనిలోదేనినైన నొకదానిని పానముజేయించి పిదప పూర్వోక్తప్రకారము అభిమంత్రించబడిన వమనౌషధమును పానముచేయించవలయును. శ్లేష్మాధిక్యమువలన మృదుకోష్ఠమనియు, శ్లేష్మమధ్యమమువలన మధ్యమకోష్ఠమనియు, శ్లేష్మహీనతవలన క్రూరకోష్ఠమనియు నిటుల కోష్ఠస్వరూపమును తెలిసికొనవలయును.



వమన ప్రతీక్షణము.

శ్లో॥ పీతంముహూర్తమనుపాలయేత్ । తన్మనాః

తా॥ ఔషధమాత్రను పానముచేసియుండురోగి వమనమునుగురించి ఒక ముహూర్తకాలమువరకు ప్రతీక్షించవలయును.

వమనముచేయు క్రమము.

శ్లో॥ జాతహృల్లాస ప్రసేకశ్ఛర్దయేత్తతః ॥ 18.
అంగుళీభ్యామనాయస్తో నాలేనమృదునాథవా ।
గలతాల్వరుజన్ వేగాన ప్రవృత్తాన్ ప్రవర్తయన్ ॥ 19.
ప్రవర్తయన్ ప్రవృత్తాంశ్చ జానుతుల్యాసనేస్థితః ।

తా॥ పిదప మోకాలంతపొడవుగల ఆసనమునందు కూర్చుండినవాడై హృల్లాసము (అనగా వొమ్మడచుట,) కారియుమియుట, ఇవిగలిగినపుడు 2 వ్రేళ్ళచేగాని, మృదువుగనుండు సువర్చలా ఏరండాదినాళములచేగాని, కంఠము, నోటిలోపలిదౌడ, వీనియందు పీడగలుగకుండా రాకుండునట్టి వమనవేగమును ప్రేరేపించి అపుడుగలుగునట్టి వమనవేగమునడ్డగించకుండా వమనము చేయవలయును.

వమన కాలోపచారము.

శ్లో॥ ఉభేపార్శ్వేలలాటంచ వమతశ్చాస్యధారయేత్ ॥ 20.
ప్రపీడయేత్తథానాభిం పృష్ఠంచప్రతిలోమతః ।

తా॥ వమనముచేయుచుండునపుడు ఆ మనుజునియొక్క 2 పార్శ్వములను, లలాటమును పరిచారకులు పట్టుకొని పృష్ఠమును, నాభిని ప్రతిలోమముగ మర్దించుచుండవలయును.

కఫాదులయందు - వమన క్రమము.

శ్లో॥ కఫేతీక్ష్ణోష్ణకటుకైః పిత్తేస్వాదుహిమైరితి ॥ 21.
వమేత్ * స్నిగ్ధామ్లలవణైః సంసృష్టేమరుతాకఫే ।
పిత్తస్యదర్శనంయావచ్ఛేదోవాశ్లేష్మణోభవేత్ ॥ 22.

తా॥ కఫమునందు తీక్ష్ణముగ, ఉష్ణముగ, కటువుగనుండు ద్రవ్యములచేతను; పిత్తమునందు మధురముగ, శీతలముగనుండు ద్రవ్యములచేతను, వాతయుక్త కఫము

* స్నిగ్ధోష్ణ ఇతిపా.

నందు స్నిగ్ధముగ, ఆమ్లముగ, లవణముగనుండు ద్రవ్యములచేతను; పిత్తము బయలు వెడలువరకుగాని లేక కఫము నశించువరకుగాని వమనము చేయించవలయును.

### హీనవేగమునందు - ఔషధ ప్రయోగము.

శ్లో॥ హీనవేగఃకణాధాత్రీ సిద్ధార్థలవణోదకైః ।
వమేత్పునఃపునః

తా॥ హీనవేగముగల పురుషుడు పిప్పళ్ళు, ఉసిరికెపప్పు, తెల్లావాలు, సైంధవలవణము వీనితోగూడియుండు ఉదకపానముచే పలుమారు వమనము చేయవలయును.

### వమనాయోగ లక్షణము.

శ్లో॥ తత్ర వేగానామప్రవర్తనమ్ ॥ 23.
ప్రవృత్తిస్సవిబంధావా కేవలస్యౌషధస్యవా ।
అయోగస్తేననిష్ఠీవ కంఠూకోఠజ్వరాదయః ॥ 24.

తా॥ వమనముచేయునపుడు వమనవేగము గలుగకుండుట, ప్రతిబంధకముతో వమనంబగుట, దోషరహితముగ నౌషధము మాత్రము వమనంబగుట, ఇవి వమనకర్మ యొక్క అయోగమనబడును. దీనిచే నిష్ఠీవము, దురద, కోఠరోగము, జ్వరము యీ మొదలగునవి గలుగును.

### వమన - సమ్యగ్యోగ లక్షణము.

శ్లో॥ నిర్విబంధం ప్రవర్తంతే కఫపిత్తానిలాః క్రమాత్ ।
సమ్యగ్యోగే

తా॥ కఫపిత్తవాతములు యథాక్రమముగ నిర్విఘ్నముగ బైలువెడలుట వమన కర్మయొక్క సమ్యగ్యోగ మనబడును.

### వమన - కర్మాతియోగ లక్షణము.

శ్లో॥ తియోగేతు ఫేనచంద్రకరక్తవత్ ॥ 25.
వమితంక్షామతాదాహః కంఠశోషస్తమోభ్రమః ।
ఘోరావాయ్వామయామృత్యుః జీవశోణితనిర్గమాత్ ॥ 26.

తా॥ నురుగు, చంద్రకము (అనగా నెమలిపురికన్నులవలెగుండ్రముగ మండలములగుబడుట) రక్తము, వీనితోయుక్తముగ వమనంబగుట, శరీరదౌర్బల్యము, తాపము,



కంఠశోష, తిమిరదర్శనము, భ్రమ, దారుణమయినవాతరోగము, జీవరక్తము బయలు వెడలుటవలన మరణము, ఇవి వమనకర్మయొక్క అతియోగమనబడును.

### వమనానంతర కర్తవ్యము.

శ్లో॥ సమ్యగ్యోగేనవమితం క్షణమాశ్వాస్యపాయయేత్ ।
ధూమత్రయస్యాన్యతమం స్నేహాచారమథాదిశేత్ ॥ 27.

తా॥ సమ్యగ్యోగముగ వమనంబైయుండగా వమనముచేసినవానికి వైద్యుడొక ముహూర్తకాలము శీతవాతాదులచే ఓదార్చి స్నిగ్ధ, మధ్య, తీక్ష్ణమను పేళ్లుగల ధూమత్రయములలో దేనినైనానొకదానిని పానము చేయించి పిదప స్నేహ విషయమై చెప్పియుండు "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విధులననుష్ఠించునటుల నుపదేశించ వలయును.

### వమనానంతరము - పేయాది క్రమము.

శ్లో॥ తతస్సాయం ప్రభాతేవా క్షుద్వాన్స్నాతఃసుఖాంబునా ।
భుంజానోరక్తశాల్యన్నం భజేత్పేయాదికం క్రమమ్ ॥ 28.

తా॥ పిదప వమనముచేసినవాడు అపరాహ్ణమునగాని పూర్వాహ్ణమునగాని ఆకలి గలిగినపుడు ఉష్ణోదకములో స్నానముచేసి ఎఱ్ఱరాజనాలయొక్క అన్నమును భుజించి పేయాదిక్రమము ననుష్ఠించవలయును.
"పురాణరక్తశాలీనా మస్నేహలవణోషణం"
స్నేహము, లవణము, కారము వీనిరహితముగ ప్రాతఎఱ్ఱరాజనాలయొక్క అన్నమును భుజించవలయునని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

### పేయాది - క్రమ స్వరూపము.

శ్లో॥ పేయాంవిలేపీమకృతంకృతంచ యూషంరసం త్రీనుభయం
తథైకమ్ । క్రమేణసేవేతనరోన్నకాలాన్ ప్రధానమధ్యా
వరశుద్ధిశుద్ధః ॥ 29.

తా॥ ఉత్కృష్టశుద్ధి, మధ్యమశుద్ధి, అధమశుద్ధి అనువానిచే శుద్ధుడైనమనుజుడు పేయాదులను 3 అన్నకాలములయందును, 2 అన్నకాలములయందును, ఒక అన్నకాలము నందును, యథాక్రమముగా సేవించవలయును. అనగా ఉత్కృష్టశుద్ధిచే శుద్ధుడైన మనుజుడు ప్రథమదివసమున రెండుఅన్నకాలములయందు పేయనుసేవించవలయును. ద్వితీయదివసమున ఒక అన్నకాలమునందును, తృతీయదివసమున రెండుఅన్నకాలముల

యందును విలేపిని సేవించవలయును. చతుర్థదివసమున రెండుఅన్నకాలములయందును, పంచమదివసమున మొదటి అన్నకాలమునందును ఇటుల మూడుఅన్నకాలములయందు అకృతమైన (అనగా కొంతి లవణము యీమొదలగు వానిచే అసంస్కృతమైన) యూషమును సేవించవలయును. ఇటులనే మూడుఅన్నకాలములను విభజనజేసికృతాకృతరసములను సేవించవలయును. 7 దినములు గతించిన పిదప క్రమముగ స్వాభావికమైన భోజనమును సేవించవలయును. ఇటులనే మధ్యమశుద్ధిచే శుద్ధుడైనవానికిని, అధమశుద్ధిచే శుద్ధుడైనవానికిని యథాక్రమముగ పేయాదక్రమము నూహించుకొనవలయునని భావము.

"విరేకేపమనే శ్రేష్ఠే పేయాదీనాం త్రికక్రమః । త్రిశోద్వ్యేకోమధ్యమేస్యా దేకశస్తుకనీయసీమ్ ॥"

అనిపై యర్థమునే ఖరనాదుడుకూడా జెప్పియున్నాడు:—

"అథైనంసాయాహ్నే అపరేవాహ్ని సుఖోదకపరిషిక్తం పురాణానాం లోహితశాలితండులానాంస్వనక్లిన్నాంమండపూర్వాముష్ణాంయవాగూం పాయయేదగ్నిబలమభిసమీక్ష్య । ఏవంద్వితీయే తృతీయేచాన్నకాలే । చతుర్థేతుతథావిధానామేవశాలీనాంసుస్విన్నాంవిలేపీముష్ణోదకద్వితీయామస్నేహలవణామల్పస్నేహలవణాంవాభోజయేత్ । ఏవంపంచమేషష్ఠేచాన్నకాలే । సప్తమేత్వన్నకాలేతథావిధానామేవశాలీనాంద్విఃప్రసృతం సుస్విన్నమోదన ముష్ణోదకానుపానంతనునాతను స్నేహలవణోప పన్నేన ముద్గయూషేణభోజయేత్ । ఏవమష్టమేనవమేన్నకాలే౽శమేత్వన్నకాలే లావకపింజలాదీనామన్యతమస్య మాంసస్యరసేనగకలావణికేన నాతిసారవతాభోజయేదుష్ణోదకానుపానమ్ । ఏవమేకాదశేద్వాదశేవాన్నకాలే । అతఊర్ధ్వమన్నగుణాన్ క్రమేణోపయుంజానస్సప్తాహాత్ ప్రభృతిభోజనమాగచ్ఛేత్ ॥"

పిదప శుద్ధికర్మజేసికొనినవాడు సాయంకాలమునందుగాని, మరుదినము ప్రాతఃకాలమునందుగాని ఉష్ణోదకములో స్నానముచేసి పురాతనమైన ఎఱ్ఱరాజనాలబియ్యముచే బాగుగపాకము చేయబడినదియు మండముతోగూడి యుండునదియు, ఉష్ణమయినదియునగు యవాగును జాఠరాగ్నిబలానుగుణముగా పానముచేయవలయును. ఇటులనే 2-వ అన్నకాలమునందును, 3-వ అన్నకాలమునందును పానముచేయవలయును. 4-వ



అన్నకాలములో పురాతనమైన ఎఱ్ఱరాజనాల బియ్యముతోడ బాగుగ పాకముచేయబడినదియు, ఉష్ణోదకముతోగూడినదియునగు విలేపిని స్నేహలవణరహితముగగాని, లేక స్వల్పస్నేహ లవణయుక్తముగగాని భుజించవలయును. ఇటులనే 5, 6 అన్నకాలములయందు భుజించవలయును. 7-వ అన్నకాలమునందు పురాతనమైన ఎఱ్ఱరాజనాల బియ్యమును బాగుగ పాకముచేసి 2 మార్లు గంజివార్చి బాగుగపక్వమైన యీ అన్నమును తేటగ, స్వల్పస్నేహ లవణయుక్తముగనుండు ముద్గయూషముతోడ ఉష్ణోదకాను పానసహితముగ భుజించవలయును. ఇటులనే 8, 9 అన్నకాలములయందు భుజించవలయును. 10-వ అన్నకాలములో మిగులసారములేనిలావకము, కపింజలము యీ మొదలగు పక్షులలోనేదైనా నొకదానియొక్క మాంసరసముతోడ ఎఱ్ఱరాజనాలయొక్క అన్నమును ఉష్ణోదకాను పానసహితముగా భుజించవలయును. ఇటులనే 11-వు, 12-వు అన్నకాలములయందును భుజించవలయును. అందుకుమీద 7-వ దినము మొదలుకొని క్రమముగ స్వాభావికమైన భోజనమును భుజించవలయును. అని చరకాచార్యుడు చెప్పియున్నాడు.

## పేయాదిక్రమ - సేవన ప్రయోజనము.

శ్లో॥ యథాణురగ్నిస్తృణగోమయాద్యైః సంధుక్ష్యమాణోభవతి
క్రమేణ । మహాన్ స్థిరస్సర్వపచస్తథైవ శుద్ధస్య పేయాదిభిరం
తరాగ్నిః ॥ 30.

తా॥ స్వల్పముగనుండు అగ్ని తృణములు, గోమయము యీ మొదలగువానిచే జ్వలింపజేయబడి క్రమముగ, గొప్పగ, దృఢముగనై సర్వమును పాకముచేయు నటులనే శుద్ధుడుగనుండుపురుషునియొక్క జాఠరాగ్నియు పేయాదులచే క్రమముగ గొప్పదిగ, దృఢముగనై సర్వమును పాకముజేయును.

## వమనవిరేక - వేగ సంఖ్య.

శ్లో॥ జఘన్యమధ్యప్రవరేతువేగా శ్చత్వార ఇష్టావమనేషడష్టౌ ।
దశైవతేద్విత్రిగుణావిరేకే ప్రస్థ స్తథాస్యాద్విచతుర్గుణశ్చ ॥

తా॥ అధమ, మధ్యమ, ఉత్తమమైన వమనమునందు యథాక్రమముగ 4, 6, 8 వేగములు తంత్రకారులకు అభిమతంబులు. అటులనే అధమ, మధ్యమ, ఉత్తమమైన విరేకమునందు యథాక్రమముగ 10- 20- 30-ది వేగములు తంత్రకారులకు అభిమతంబులు. ఆ వేగములయొక్క పరిమితి యథాక్రమముగ ప్రస్థము, 2 ప్రస్థములు, 4 ప్రస్థములు.

## వమన - విరేచన ప్రమాణము.

శ్లో॥ పిత్తావసానంవమనంవిరేకా దర్ధంకఫాంతంచవిరేకమాహుః ।

తా॥ పిత్తము బైలువెడలువరకు వమనముచేయించవలయును, ఆవమనము విరేకముసందర్ధభాగముగలదిగ నుండవలయుననియును, కఫము బైలువెడలువరకు విరేకము చేయించవలయుననియును తంత్రకారులుజెప్పుచున్నారు.

## విరేచన - వమన - గణనా ప్రకారము.

శ్లో॥ ద్విత్రాన్సవిట్కానపనీయవేగాన్మేయంవిరేకేవమనేతుపీతమ్॥

తా॥ మలముతోగూడియుండు 2 లేక 3 వేగములను (అనగామలోత్సర్జనములను) వదలి విరేచన సంఖ్యను గణనము చేయవలయును. అటులనే పానముచేయబడిన యౌషధముతోడ బైలువెడలిన వమనమునువదలి వమనమును గణనముచేయవలయును.

## వమితునికి పునర్విరేచనము.

శ్లో॥ అథైనంవామితంభూయః స్నేహస్వేదోపపాదితమ్ ।
శ్లేష్మకాలేగతేజ్ఞాత్వా కోష్ఠంసమ్యగ్విరేచయేత్ ॥ 33.

తా॥ పిదప వమనముచేయించబడిన పురుషునికి మరల స్నేహస్వేదకర్మలను చేయించి మృదు, మధ్య, క్రూర, కోష్ఠభేదములను బాగుగనెఱింగి శ్లేష్మకాలమును (అనగా సంవిభాగప్రహరమును) వదలి బాగుగ విరేచనము చేయించవలయును.

## మృదు - కోష్ఠ స్వరూపము.

శ్లో॥ బహుపిత్తోమృదుఃకోష్ఠః క్షీరేణాపివిరేచ్యతే ।

తా॥ అధిక పిత్తముతోగూడియుండు కోష్ఠము మృదువుగనుండును. అది క్షీరముచేత కూడా విరేచనంబగును. అపిశబ్దమువలన తేల మొదలగువానిచేకూడా విరేచనంబగునని భావము.

## క్రూర - కోష్ఠ స్వరూపము.

శ్లో॥ ప్రభూతమారుతఃక్రూరః కృచ్ఛ్రాచ్ఛ్యామాదికైరపి ॥ 34.

తా॥ అధిక వాతముతోగూడియుండు కోష్ఠము క్రూరముగనుండును. అది నల్లతెగడ మొదలగువానిచే నతిప్రయాసవలన విరేచనంబులగును. ఆదిశబ్దమువలన కంకుష్ఠము, జెముడు మొదలగువానివలనను, అపిశబ్దమువలన తేల మొదలగువానివలనను విరేచనంబులగునని తాత్పర్యము.



## పిత్తాదులయందు - వమనౌషధ క్రమము.

శ్లో॥ కషాయమధురైఃపిత్తే విరేకఃకటుకైకఫే ।
స్నిగ్ధోష్ణలవణైర్వాయౌ

తా॥ పిత్తములో కషాయముగ, మధురముగనుండు తేల మొదలగువానిచే విరేచనము చేయించవలయును. కఫమునందు కటువుగనుండు వస్తువులచే విరేచనము చేయించవలయును. వాతమునందు స్నిగ్ధముగ, అమ్లముగ, లవణముగనుండు ఏరండ తైలాదులచే విరేచనముచేయించవలయును.

## విరేచనము - కాకుండునపుడు - చేయతగిన యుపచారము.

శ్లో॥ వప్రవృత్తౌతుపాయయేత్ ॥ 35.
ఉష్ణాంబుస్వేదయేదస్య పాణితాపేనచోదరమ్ ।

తా॥ విరేచనము కాకుండుపక్షములో ఉష్ణోదకమును పానము చేయించవలయును. మఱియును రోగియొక్క ఉదరమునందు పాణితాపమువలన (అనగా అరచేతులను నిప్పులోకాచి వానియుష్ణమువలన) స్వేదముకూడా చేయించవలయును.

## స్వల్పముగ - విరేచనములై - యుండునపుడు చేయవలసిన క్రమము.

శ్లో॥ ఉత్థానేఽల్పేదినేతస్మిన్ భుక్త్వాన్యేద్యుఃపునఃపిబేత్ ॥ 36.

తా॥ విరేచనమునకు సేవించినదినమునందు స్వల్పముగ విరేచనములై యుండినయెడల ఆ దినము భోజనముచేసి మరుదినమునందు మరల విరేచనౌషధమును సేవించవలయును.

## అదృఢస్నేహ - కోష్ఠునికి - విరేచన క్రమము.

శ్లో॥ అదృఢస్నేహకోష్ఠస్తు పిబేదూర్ధ్వందశాహతః ।
భూయోప్యుపస్కృతతనుః స్వేదస్నేహైర్విరేచనమ్ ॥ 37.
యౌగికంసమ్యగాలోచ్య స్మరన్పూర్వమనుక్రమమ్ ।

తా॥ రోగికి దృఢమైన స్నేహకోష్ఠము గలిగియుండినయెడల మరల స్వేద స్నేహకర్మలవలన శరీరమునకు సంస్కారముచేయించి 10 దినములుగడచినపిదప,— "ఔషధమాత్రాంమంత్రాభిమంత్రితామ్" అని పైజెప్పియుండువిధిప్రకారము యౌగికమైన విరేచనౌషధమును పానముచేయించ

వలయును. అటుల జేయించియు విరేచనము కాకుండినచో ఉష్ణాంబుపానమును పాణితాపస్వేదకర్మలను చేయించవలయును.

విరేకా - యోగ లక్షణము.

శ్లో॥ హృత్కుక్ష్యశుద్ధిరరుచి రుత్క్లేశశ్శ్లేష్మపిత్తయోః ॥ 38.
కండూర్విదాహఃపిటికా పీనసో వాతవిడ్గ్రహః ।
అయోగలక్షణం

తా॥ హృదయకుక్షులయందశుద్ధి, అరుచి, శ్లేష్మ, పిత్తయుక్తముగా ఉత్క్లేశము, దురద, శరీరమునందు తాపము, పిటిక, పీనసము, వాత, మలప్రతిబంధము, ఇవి విరేచనముయొక్క అయోగలక్షణమని తెలియవలయును.

విరేచన - సమ్యగ్యోగ లక్షణము.

శ్లో॥ యోగో వైపరీత్యేయథోదతాత్ ॥ 39.

తా॥ పైజెప్పినప్రకారము హృదయకుక్షులయందశుద్ధి మొదలగునవిలేకుండుటయే విరేచనముయొక్క సమ్యగ్యోగలక్షణమని తెలియవలయును.

విరేచన - అతియోగ లక్షణము.

శ్లో॥ విట్పిత్తకఫవాతేషు నిస్సృతేషు క్రమాత్స్రవేత్ ।
నిశ్లేష్మపిత్తముదకం శ్వేతంకృష్ణంసలోహితమ్ ॥ 40.
మాంసధావనతుల్యంవా మేదఃఖండాభమేవవా ।
గుదనిస్సరణంతృష్ణా భ్రమోనేత్రప్రవేశనమ్ ॥ 41.
భవంత్యతివిరిక్తస్య తథాతివమనామయాః ।

తా॥ మలము, పిత్తము, కఫము, వాతము ఇవి క్రమముగ బయలువెడలిన పిదప శ్లేష్మపిత్తసంబంధములేకుండా తెల్లగ, నల్లగ, కొంచెమురక్తయుక్తముగగాని, లేక మాంసమునుకడిగిన ఉదకముతో తుల్యముగగాని లేక మేదస్సుయొక్క ఖండముతో తుల్యముగగానినుండు ఉదకము బయలువెడలుట, మిక్కుటముగ దప్పి, భ్రమగలిగి నేత్రములు లోనికేగుట, అధికముగ వమనంబులగుట, శరీరముకృశించుట యీ లక్షణములు అధిక విరేచనములైనవానికి గలుగునని తెలియవలయును.

విరేచనానంతర కర్తవ్యము.

శ్లో॥ సమ్యగ్విరిక్తమేనంచ వమనోక్తేనయోజయేత్ ॥ 42.



ధూమవర్జ్యేనవిధినా తతోవమితివానివ ।
క్రమేణాన్నానిభుంజానో భజేత్ప్రకృతిభోజనమ్ ॥ 43.

తా॥ బాగుగ విరేచనంబైయుండు పురుషునికి వమనకర్మయందుచెప్పియుండు విధులలో ధూమపానముతప్ప తక్కిన విధులనన్నిటిని చేయించవలయును. పిదప వమనకర్మ చేయించుకొనిన వానివలెనే పూర్వోక్తక్రమప్రకారము శక్తశాల్యన్నముతో గూడియుండు పేయాదులను భుజింపజేసి పిదప స్వాభావికమైన భోజనమును భుజింపజేయవలయును.

విరేచనౌషధ - సేవనమునందు లంఘనము.

శ్లో॥ మందవహ్నిమసంశుద్ధ మక్షామందోషదుర్బలమ్ ।
అదృష్టజీర్ణలింగంచ లంఘయేత్పీతభేషజమ్ ॥ 44.

తా॥ విరేచనౌషధ సేవనానంతరము మందాగ్ని, అసంశుద్ధుడు (అనగా విరేచనము కానివాడు) అక్షాముడు (అనగా శరీరబడలికను జెందనివాడు) దోషముచే దుర్బలుడు. విరేచనౌషధము జీర్ణముజెందనివాడు యీ 5 గురికి లంఘనము చేయించవలయును.

లంఘన గుణము.

శ్లో॥ స్నేహస్వేదౌషధోత్క్లేశ సంగైరితినబాధ్యతే ।

తా॥ ఇటుల లంఘనము చేయించినయెడల స్నేహము, స్వేదము, ఔషధము ఉత్క్లేశము, మలబంధము వీనిచే పైజెప్పిన మందాగ్ని మొదలగు రోగములుగలవారు, పీడను జెందకుందురు.

పేయాది - సేవనయందు యుక్తి.

శ్లో॥ సంశోధనాస్రవిస్రావ స్నేహయోజనలంఘనైః ॥ 45.
యాత్యగ్నిర్మందతాంతస్మాత్ క్రమంపేయాదిమాచరేత్ ।

తా॥ బాగుగ శరీరశుద్ధి, రక్తమోక్షణము, స్నేహయోగము, లంఘనము, వీనిచే పురుషునియొక్క జాఠరాగ్ని మాంద్యమును జెందును. కాబట్టి పైజెప్పిన పేయాదిక్రమము ననుష్ఠించవలయును. శుద్ధ్యాదులవలన అగ్నిమాంద్యము కలుగునని యిచట జెప్పబడినది. "శుద్ధఃప్రసాదమిత్యాది" శ్లోకమువలన శుద్ధిచేనగ్ని దీపనము కలుగునని ఉత్తరత్ర జెప్పబడును. కాబట్టి నీ 2 వచనములు పరస్పరవిరుద్ధము

లనే శంకగలుగును. అయితే కాలభేదమువలన దోష శుద్ధిజేయునపుడు అగ్నిమాంద్యముకలుగును. దోష శుద్ధ్యనంతరము పేయాదిక్రమము ననుసరించుచుండగా అగ్నిదీపనముకలుగును. కావుననీ 2 వచనములకు పరస్పరవిరోధములేదు.

### పేయా నిషేధము.

శ్లో॥ స్రుతాల్పపిత్తశ్లేష్మాణం మద్యపంవాతపైత్తికమ్ ॥ 46.
పేయాంనపాయయేత్తేషాం తర్పణాదిక్రమోహితః ।

తా॥ బైలువెడలిన అల్పపిత్త శ్లేష్మములుగలవాడు, మద్యపానముచేసినవాడు వాతపిత్త రోగముగలవాడు యీ ముగ్వురికిని పేయనుపానము చేయించంజనదు. అయితే వారలకు మొదటి యన్నకాలమునందు లాజసక్తువులును, రెండువ అన్నకాలమునందు మాంసరసోదకమును భుజించుట యీ మొదలగునవి హితకరంబులు.

### వమనమునందు - పాక ప్రతీక్షా నిషేధము.

శ్లో॥ అపక్వంవమనందోషాన్ పచ్యమానంవిరేచనమ్ ॥ 47.
నిర్హరేద్వమనస్యాతః పాకంనప్రతిపాలయేత్ ।

తా॥ వమనము అపక్వముగ నుండినదై దోషములను వెలిపరచును. విరేచనము పాకమును జెందుచు దోషములను వెలిపరచును. కాబట్టి వమనముయొక్క పాకమును నిరీక్షింపఁబనిలేదు;—

"ఊర్ధ్వాధోరేచనంయుక్తం వైపరీత్యేనజాయతే। యదాతదాఘర్దయతః సించేదుష్ణేనవారిణా । పాదౌశీతేనచోర్ధ్వాంగం విపరీతంవిరేచనే॥"

ప్రయోగించబడిన ఊర్ధ్వవిరేచనము విపరీతముగ నైనయెడల (అనగా వమనౌషధముచే విరేచనంబులైనయెడల) శీతోదకముచే పాదములను, ఉష్ణోదకముచే ఊర్ధ్వాంగములను తడుపవలయును. అధోవిరేచనము విపరీతముగనైన యెడల (అనగా విరేచనౌషధముచే వమనంబులైనయెడల) ఉష్ణోదకముచే పాదములను, శీతోదకముచే ఊర్ధ్వాంగములను తడుపవలయును అని అష్టాంగసంహితలో జెప్పబడియున్నది.

### దుర్బలోపచార క్రమము.

శ్లో॥ దుర్బలోబహుదోషశ్చ దోషపాకేసయస్స్వయమ్ ॥ 48.
విరిచ్యతేభేదనీయై ర్భోజ్యైస్తముపపాదయేత్ ।



తా॥ దుర్బలుడుగను, అధిక దోషయుక్తుడుగనుండు యేమనుజుడు దోషపాకమువలన నౌషధము లేకనే విరేచనముజేసునో అట్టివానికి భేదనీయములుగనుండు భోజ్యభక్ష్యములచే నుపచరించవలయును.

### దుర్బలాదులకు - విరేచన క్రమము.

శ్లో॥ దుర్బలశ్శోధితఃపూర్వ మల్పదోషఃకృశోనరః ॥ 49.
అపరిజ్ఞాతకోష్ఠశ్చ పిబేన్మృద్వల్పమౌషధమ్ ।
వరంతదసకృత్పీత మన్యథాసంశయావహమ్ ॥ 50.
హరేద్బహూంశ్చలాన్ దోషా నల్పానల్పాన్ పునఃపునః ।

తా॥ దుర్బలుడు, శుద్ధిజేసుకొనినవాడు, అల్పమైనదోషముగలవాడు, కృశుడు, తెలియబడని కోష్ఠముగలవాడు వీరలుమృదువుగ, అల్పముగనుండు విరేచనౌషధమును పానముచేయవలయును. పైజెప్పిన దుర్బలుడు మొదలగువారలకు మృదువుగ, స్వల్పముగనుండు విరేచనౌషధమును పలుమారుపానము చేయించుటయుక్తము. అటుగాక అధికముగ, తీక్ష్ణముగనుండు విరేచనౌషధమును పానము చేయించినయెడల అదిప్రాణసందేహమును గలుగజేసును. మృదువుగ అల్పముగను పలుమారు ప్రయోగించబడిన విరేచనౌషధము అధికమైన దోషములను స్వల్పస్వల్పముగ బైలుపరచి బలహీనతను గలుగజేయకనే దోషములను శమింపజేసును.

### దుర్బలునికి - శోధన క్రమము.

శ్లో॥ దుర్బలస్యమృదుద్రవ్యై రల్పాన్ సంశమయేత్తుతాన్ ॥ 51.
క్లేశయంతిచిరంతేహి హన్యురేనమనిర్హృతాః ।

తా॥ దుర్బలుడుగనుండు మనుజునియొక్క దోషములు స్వల్పముగనుండునపుడే మృదుద్రవ్యములచే శమనము చేయవలయును. అటులజేయక నుపేక్షించినచో చిరకాలముగజేరియుండు యాదోషములు రోగినిచంపును.

### మందాగ్న్యాదులయందు - శోధన క్రమము.

శ్లో॥ మందాగ్నింక్రూరకోష్ఠంచ సక్షారలవణైర్ఘృతైః ॥ 52.
సంధుక్షితాగ్నింవిజిత కఫవాతంచశోధయేత్ ।

తా॥ మందాగ్నిగలవాడు, క్రూరకోష్ఠుడు, వీరలకు క్షారలవణములతోగూడియుండు ఘృతములచే యథాక్రమముగ అగ్నిదీపనమును గలుగజేసి కఫమునుపోగొట్టి శుద్ధిచేయించవలయును.

శ్లో॥ రూక్షబహ్వనిలక్రూరకోష్ఠవ్యాయామశీలినామ్ ॥ 53.
దీప్తాగ్నీనాంచభైషజ్య మవిరేచ్యైవజీర్యతి ।
తేభ్యోవస్తింపురాదద్యా త్తతఃస్నిగ్ధంవిరేచనమ్ ॥ 54.
శకృన్నిర్హృత్యవాకించి త్తీక్ష్ణాభిఃఫలవర్తిభిః ।
ప్రవృత్తంహిమలంస్నిగ్ధో విరేకోనిర్హరేత్సుఖమ్ ॥ 55.

తా॥ రూక్షుడు, అధిక జాఠరాగ్నిగలవాడు, క్రూరకోష్ఠుడు, వ్యాయామము చేయువాడు, అగ్నిదీపనముగలవాడు, వీరలకు ప్రయోగించబడు విరేచనౌషధము విరేచనము చేయించకనే జీర్ణమగును. కావుననట్టివారికి తొలుత వస్తికర్మనుచేయించి పిదప ఏరండతైలము, బిందుఘృతము యీమొదలగు విరేచనౌషధములను ప్రయోగించవలయును. లేక తీక్ష్ణమైన ఫలవర్తులచే మలమునుకొంచెముగ బైలుపరచి పిదప స్నిగ్ధమైన విరేచనౌషధము నొసంగవలయును. ఏలననగా:—స్నిగ్ధమైన విరేచనౌషధము స్వల్పముగా బైలువెడలుచుండు మలమును సుఖముగా బైలుపరచును.

విషాదిపీడితులకు - శోధన క్రమము.

శ్లో॥ విషాభిఘాతపిటికా కుష్ఠ * శోకవిసర్పిణః ।
కామలాపాండుమేహార్తా న్నాతిస్నిగ్ధాన్విరేచయేత్ ॥ 56.

తా॥ విషము, అభిఘాతము, పిటిక, కుష్ఠము, శోకము, విసర్పి, కామల, పాండువు, మేహము, వీనిచే పీడింపబడినవారికి కొంచెముగ స్నేహకర్మజేయించి విరేచనము చేయించవలయును.

శ్లో॥ సర్వాన్స్నేహవిరేకైశ్చ రూక్షైస్తుస్నేహభావితాన్ ।

తా॥ కొంచెము స్నిగ్ధులుగనుండు విషాదిపీడితులకు స్నేహవిరేకములవలన శుద్ధి చేయించవలయును. స్నిగ్ధులుగనుండుపురుషులకు రూక్షమైన విరేకములవలన శుద్ధి చేయించవలయును.

శోధనమునందు - స్నేహస్వేద - ప్రయోగ క్రమము.

శ్లో॥ కర్మణాంవమనాదీనాం పునరప్యంతరేంతరే ॥ 57.
స్నేహస్వేదౌప్రయుంజీత స్నేహమంతేబలాయచ ।

* శోఫ ఇతిపా.



తా॥ వమనాదికర్మలకు మధ్యమధ్య మరల స్నేహస్వేదములను ప్రయోగించవలయును. వమనాదికర్మలయొక్క అంతమునందు శరీరమునకు బలముగలుటకై స్నేహమును ప్రయోగించవలయును. అదియెట్లనగా:—తొలుత స్నేహస్వేదములను, పిదప వమనమును, మరల స్నేహస్వేదములను, పిదప విరేచనమును, మరల స్నేహస్వేదములను, పిదప అనువాసనమును, మరల స్నేహస్వేదములను, పిదప నిరూహవస్తిని అని తెలియవలయును.

శ్లో॥ * మలోహిదేహాదుత్క్లేశ్య హ్రియతేవాససోయథా ॥ 58.
స్నేహస్వేదైస్తథోత్క్లేశ్య హ్రియతేశోధనైర్మలః ।

తా॥ మురికి శరీరములోనుండి వస్త్రముచే బైలుపరచబడి పోగొట్టబడునటులనే మలములు స్నేహస్వేదములచే స్వస్థానములోనుండి బైలుపరచబడి శోధనౌషధములచే పోగొట్టబడును.

స్నేహస్వేదా - నభ్యాసమునందు దోషము.

శ్లో॥ స్నేహస్వేదావనభ్యస్య కుర్యాత్సంశోధనంతుయః ॥ 59.
దారుశుష్కమివానామే శరీరంతస్యదీర్యతే ।

తా॥ స్నేహస్వేదములను పరిశీలించక శోధనమును మాత్రము చేసుకొనునట్టి మనుజునియొక్క శరీరము వంచబడిన యెండిన కాష్ఠమువలెనే విరిగిపోవును.

శోధన ఫలము.

శ్లో॥ బుద్ధిప్రసాదంబలమింద్రియాణాంధాతుస్థిరత్వంజ్వలనస్యదీప్తిమ్॥
చిరాచ్చపాకంవయసఃకరోతి సంశోధనంసమ్యగుపాస్యమానమ్ ॥

తా॥ బాగుగ సేవించబడిన సంశోధనము బుద్ధికితెలివిని, ఇంద్రియములకు బలమును, ధాతువులకు స్థైర్యమును, అగ్ని దీప్తిని, చిరకాలానంతరము ముసలితనమును గలుగజేసును.

అష్టాదశాధ్యాయము, ముగిసెను.

* ఊష్మాదిభిర్యథోత్క్లేశ్యహ్రియతేవాససోమలః ।
తథైవవపుషః స్నేహస్వేదమాషతిలాదిభిః ॥ ఇతిపా.

శ్రీరస్తు.

# ఏకోనవింశాధ్యాయము.

పూర్వాధ్యాయమునందు మలనిర్గమనోపాయము చెప్పబడినది. వస్తికర్మవలనకూడా మలనిర్గమనము జేయందగును. కాబట్టి వమనవిధ్యనంతరము వస్తివిధి యీయధ్యాయమునందు చెప్పబడుచున్నది. వస్తి యనగా:—"వస్తిభిర్దీయతేయస్మాత్తస్మాద్వస్తిరితి స్మృతః" అనెడి వచనముచొప్పున చిమ్మనగ్రోవిలో నీరునాకర్షించి దానిని వెడలింపజేయుటకై మధ్యన బంధింపబడియుండు దండమనియర్థము.

## వస్తివిధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోవస్తివిధి మధ్యాయంవ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః॥

తా॥ వమన విధ్యనంతరము మలనిర్గమనోపాయంబైన వస్తికర్మను తెలియ పరచునట్టి వస్తివిధ్యధ్యాయమును వివరించెదము.

### వాతాధిక్య - దోషమునందు వస్తికర్మ.

శ్లో॥ వాతోల్బణేషుదోషేషు వాతేవావస్తిరిష్యతే।

తా॥ వాతాధిక్యముగల దోషము లేక కేవలవాతము లేక వాతపిత్తము లేక వాతశ్లేష్మము, వీనియందు వస్తికర్మ ఆచార్యులచే చికిత్సగ జెప్పబడియున్నది.

### వస్తికర్మ త్రైవిధ్యము.

శ్లో॥ ఉపక్రమాణాంసర్వేషాం సోగ్రణీస్త్రివిధశ్చసః॥ 1.
నిరూహోనువాసనోవస్తి రుత్తరః

తా॥ సర్వచికిత్సలలోను వస్తికర్మ మిగుల ప్రధానంబు. అదినిరూహము, అనువాసనము, ఉత్తరవస్తి, అని త్రివిధంబుగనుండును.



"కషాయక్షీరతైలైర్యోనిరూహస్సనిగద్యతే"
అనెడి ప్రమాణముచొప్పున కషాయములు, పాలు తైలములు వీనిని చిమ్మనగ్రోవితో చిమ్ముట నిరూహవస్తియనబడును.—
"యస్స్నేహైర్దీయతేసస్యాదనువాసననామకః"
అనెడి వచనమునుపట్టి ఘృతము, తైలము మొదలగు స్నేహములను చిమ్మనగ్రోవితో చిమ్ముట అనువాసనవస్తియనబడును. ఉత్తరమార్గమైన మేఢ్రాదుల మూలముగా ప్రయోగించబడునది ఉత్తరవస్తియనబడును.

### నిరూహవస్తి చికిత్సార్హులు.

శ్లో॥ తేనసాధయేత్। గుల్మానాహఖుడప్లీహశుద్ధాతీసారశూలినః॥ 2.
జీర్ణజ్వరప్రతిశ్యాయశుక్రానిలమలగ్రహాన్।
వర్ధ్మాశ్మరీరజోనాశాన్ దారుణాంశ్చానిలామయాన్॥ 3.

తా॥ గుల్మము, ఆనాహము, ఖుడస్తంభము, ప్లీహము, శుద్ధాతీసారము, శూల, జీర్ణజ్వరము, పీనసము, రేతోబంధము, వాతగ్రహము (అనగా శరీరమునందు వాతము సంచరించకుండుట) మలబంధము, వర్ధ్మ, అశ్మరీరోగము, స్త్రీలయొక్క పుష్పనాశము, దారుణమైన వాతవ్యాధి వీనిచే పీడితులుగనుండు రోగులను నిరూహవస్తిచే చికిత్సింప వలయును.

### నిరూహవస్తి కర్మానర్హులు.

శ్లో॥ అనాస్థాప్యాస్త్వతిస్నిగ్ధః క్షతోరస్కోభృశంకృశః।
ఆమాతిసారీవమిమాన్ సంశుద్ధోదత్తనావనః॥ 4.
కాసశ్వాసప్రమేహార్శో హిధ్మాధ్మానాల్ప * వర్చసః।
శూనపాయుఃకృతాహారో బద్ధఛిద్రోదకోదరీ॥ 5.
కుష్ఠీచమధుమేహీచ మాసాన్సప్తచగర్భిణీ।

తా॥ అతిస్నిగ్ధుడు, ఱొమ్మునందు గాయముగలవాడు, అతికృశుడు, ఆమాతీసారపీడితుడు, వమనముచేయువాడు, శుద్ధిచేయించుకొనినవాడు, నస్యకర్మ చేయించుకొనినవాడు, కాసము, శ్వాసము, ప్రమేహము, అర్శస్సు, హిధ్మ, ఆధ్మానము, అనునీ రోగములుగలవాడు, అల్పమలముగలవాడు, సంకుచితమైన

* వహ్నయః ఇతిపా.

గుదముగలవాడు, ఆహారముచేసినవాడు, బద్ధమైనద్వారముగలవాడు, మూత్రబంధముగలవాడు, ఉదరబంధముగలవాడు, కుష్ఠురోగి, మధుమేహముగలవాడు, 7 నెలలగర్భిణిస్త్రీ వీరలకు నిరూహవస్తిచేయంజనదు. ఏలననగా:—నిరూహవస్తి అతిస్నిగ్ధునికి దోషములను స్వస్థానములోనుండి బైలుపరచి వాపును, ఉదరరోగమును గలుగజేసును. ఆమాశయమునందు గాయముగలవాడు, కృశించినవాడు, వీరలకు శీఘ్రముగ శరీరనాశమును గలుగజేసును. ఆమాతీసారముగలవానికి దోషములను బాగుగ శమింపజేయక శరీరమునకు మిక్కుటముగ పీడను గలుగజేసును. వమనముచేయువానికి దోషములను స్వస్థానములోనుండి బైలుపరచి ఊర్ధ్వభాగమునకు తీసుకొనిపోయిజేర్చును. వమనవిరేకములు జేయించుకొనినవానికి అసారముగనుండు దేహమును "క్షారము గాయమును దహింపజేయునటులనే" దహింపజేసును. నస్యకర్మజేయించుకొనినవానికి ఊర్ధ్వస్రోతో మార్గములు తెరువబడియుండుటచే ఆపత్తునుగలుగజేసును. కాసము, శ్వాసము, యీమొదలగురోగములుగలవారికి దోషములు స్వస్థానములోనుండి బైలుపడియుండుటచే నాదోషములను ఊర్ధ్వభాగమునకు తీసుకొనిపోయిజేర్చును. అర్శస్సు మొదలగురోగములుగలవారికి మరణమును గలుగజేసును. అల్పమలముగలవారికి స్తబ్ధత్వమును, జడత్వము మొదలగువానిని గలుగజేసును. గర్భిణికిగర్భనాశమును గలుగజేసును.

## అనువాసన - వస్తికర్మకు అర్హులు.

శ్లో॥ ఆస్థాప్యాఏవచాన్వాస్యావిశేషాదతివహ్నయః ॥ 6.
రూక్షాః కేవలవాతార్తాః

తా॥ నిరూహవస్తికి అర్హులుగనుండువారలు అనువాసన వస్తికికూడా అర్హులుగనుండెదరు. అధికముగ అగ్నిదీపనముగలవారు, రూక్షులు, కేవలవాతమువలన పీడించబడినవారు వీరలుకూడా విశేషముగా అనువాసన వస్తికర్మకు అర్హులుగనుండెదరు.

## అనువాసన - వస్తికి అనర్హులు.

శ్లో॥ నానువాస్యాస్తఏవచ ।
యేనాస్థాప్యాస్తథాపాండు కామలామేహపీనసాః ॥ 7.
నిరన్నప్లీహవిట్ భేది గురుకోష్ఠకఫోదరాః ।
అభిష్యంది * కృశస్థూల కృమికోష్ఠాఢ్యమారుతాః ॥ 8.
పీతేవిషేగరేఽపచ్యాం శ్లీపదీగలగండవాన్ ।

* భృశ ఇతిపా.



తా॥ నిరూహవస్తికి అనర్హులుగనుండు వారందరు అనువాసనవస్తికికూడా అనర్హులు. అటులనే పాండువు, కామల మేహము, పీనసము, అనునీరోగములుగలవాడు, ఆహారములేనివాడు, ప్లీహము, మలబంధము, గురుత్వము, కోష్ఠరోగము, కఫరోగము, ఉదరరోగముగలవారు, కృశుడు, స్థూలుడు, కృమికోష్ఠము, ఆఢ్యవాతముగలవారు, విషము, గరము, వీనిని పానముచేసినవాడు, అపచి, శ్లీపదము, గలగండము, అనునీరోగములుగలవారు, వీరలందరు అనువాసన వస్తికర్మకు అనర్హులు. ఏలననగా:— అనువాసనవస్తి పైజెప్పిన పాండువు మొదలగు రోగములుగలవారికి దోషములను స్వస్థానములోనుండి బైలుపరచి ఉదరరోగమును గలుగజేసును.—
"అభుక్తదత్తశ్చతథా స్నేహోవస్తిర్విపద్యతే"
అనెడి ఖరనాదవచనముచొప్పున స్నేహవస్తి (అనగా అనువాసనవస్తి) భోజనముచేయనివానికి చెరుపునుజేసును. ప్లీహము మొదలగు రోగములుగలవారికి స్తబ్ధత్వము, జడత్వము యీ మొదలగురోగములను గలుగజేసును. కృమికోష్ఠముగలవానికి క్రిములు చిరకాలముగ సంచితమై కోష్ఠమునిండియుండుటవలన క్రిములునిశ్చేష్టముగ బైలుపడక హృదయమునందు పీడనుగలుగజేసి వమనముచేయించును. ఆఢ్యవాతములగవానికి దోషములను బాగుగా బైలుపరచక ఆమవృద్ధిని గలుగజేసును:—
"అభుక్తేరిక్తకోష్ఠస్య ప్రయుక్తమనువాసనమ్ । సరద్వయస్య సూక్ష్మత్వాత్ క్షిప్రమూర్ధ్వం ప్రపద్యతే। తేనవాయోర్జయోనస్యాత్ వాతధామన్యతిష్ఠతా । కాయాగ్నేరాశునాశశ్చ విశేషాదనివర్తనాత్ । స్నేహస్సద్యోఽశితాహార రుద్ధేత్వామాశయేనిలమ్ । పక్వస్థం హంతిపక్వస్థశ్చ్యవతేచాన్నపాకతః నిరూహశ్చసమీరశ్చ తీక్ష్ణవేగావుభావపి । తావన్నమూర్ఛితౌతీక్ష్ణౌ వధోన్నేనసహాగతౌ । ఊర్ధ్వంవాశకృతాసార్ధం సంస్థితౌ కోష్ఠఏవవా । సమలాహారవిష్టబ్ధౌ హరేతామాశుజీవితమ్ । భుక్తవాననువాస్యోస్మాన్ననిరూహ్యోహ్యభుక్తవాన్ ॥"
భోజనములేని శూన్యమైన కోష్ఠముగల పురుషునియందు ప్రయోగించబడిన అనువాసనవస్తి నాడులు అతిసూక్ష్మముగ నుండుటవలన వాతాశయమునందు నిలువక శీఘ్రముగా ఊర్ధ్వభాగమునుజెందును. అటుల వాతాశయమునందుండక కుండునట్టి ఆ అనువాసనవస్తిచే వాతజయమునుగలుగనేరదు. దానిచే శీఘ్రముగా జాఠరాగ్ని నశించును. భుజించగానే ప్రయోగించబడిన అనువాసనవస్తిభుజించబడిన యాహారముచే నడ్డగించబడి ఆమాశయమునందుండినదై పక్వాశయమునందుండు వాతమునునశింప

జేనును. పిదప నా అనువాసనవస్తి పక్వాశయమునుజెంది అన్నపాకమువలన జీర్ణమునుజెందును. భోజనముచేసినవానికి నిరూహవస్తిజేసినచో యా నిరూహవస్తి, వాతము, అనునీ 2 నతివేగముగలదియగుటచే అన్నమువలన ప్రకోపమునుజెంది అధోభాగమునందన్నముతో జేరిగాని, లేక ఊర్ధ్వభాగమునందు మలముతో జేరిగాని, కోష్ఠమునందే యుండి మలము, ఆహారము అనునీ రెంటిచే స్తబ్ధముగనై అతి శీఘ్రముగ ప్రాణములను హరింపజేసును. కాబట్టి భోజనము చేయనివానికి అనువాసనవస్తియు, భోజనముచేసినవానికి నిరూహవస్తియు చేయంజనదు. అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

## వస్తి - యంత్ర లక్షణము.

శ్లో॥ తయోస్తునేత్రంహేమాది ధాతుదార్వస్థివేణుజమ్ ॥ 9.
గోపుచ్ఛాకారమచ్ఛిద్రం శ్లక్ష్ణర్జుగుళికాముఖమ్ ।

తా॥ నిరూహవస్తి, అనువాసనవస్తి వీనియందుపయోగించు నేత్రము (అనగా యంత్రము) సువర్ణము, రజతము, ఇత్తడి, ఇనుము, కంచు, తగరము, సీసము యీ మొదలగు ధాతువులు, ఇరుగుడు మొదలగుమ్రాను, ఏనుగు మొదలగుజంతువులయొక్క అస్థులు, వెదురు, వీనిలో దేనిచేనైనా చేయబడినదిగను, ఆవుతోకతో సమానమైన యాకారముగలదిగను, సందులేకుండునదిగను నునుపుగలదిగను, వంకరలేనిదిగను, గుళికకు (అనగా వుంటకు) సమానమైన ముఖముగలదిగనుండవలయును.

## వస్తి - యంత్ర ప్రమాణము.

శ్లో॥ ఊనేఽబ్దేపంచపూర్ణేస్మి న్నాసప్తభ్యోంగులానిషట్ ॥ 10.
సప్తమేసప్తతాన్యష్టౌ ద్వాదశేషోడశేనవ ।
ద్వాదశైవపరంవింశాత్

తా॥ నేత్రము (అనగా చిమ్మనగ్రోవి) 1 సంవత్సరమునకు కొంచెముతక్కువ వయస్సు గలవానికి రోగియొక్క 5 అంగుళముల ప్రమాణము నిడుపుగలదిగ నుండవలయును. 1 సంవత్సరము పూర్ణమైనపిదప 7-వ సంవత్సరమువరకు రోగియొక్క $\frac{1}{2}$ అంగుళముల ప్రమాణమునిడుపును, 7-వ సంవత్సరమున 7 అంగుళముల ప్రమాణము నిడుపును, 12-వ సంవత్సరమున 8 అంగుళముల ప్రమాణము నిడుపును, 16-వ సంవత్సరమున 9 అంగుళముల ప్రమాణము నిడుపును, 20-ది సంవత్సరములకు పైబడిన వారికి 12 అంగుళముల ప్రమాణము నిడుపునుగలదై యుండవలయును. 12 అంగుళ



ములకుపైన ప్రమాణములేదని తెలియపరచునిమిత్తము "ద్వాదశైవ" అను ఏవకారము ప్రయోగించబడినది.

## వయోబలానుగుణముగా - వస్తియంత్ర వృద్ధి.

శ్లో॥ వీక్ష్యవర్షాంతరేషుచ ॥ 11.
వయోబలశరీరాణి ప్రమాణమభివర్ధయేత్ ।

తా॥ తొమ్మిది, 10, మొదలగు సంవత్సరములను, వయోబలశరీరములను పర్యాలోచనజేసి నేత్రముయొక్క ప్రమాణమును వృద్ధిచేయవలయును.

## వస్తియంత్ర - దైర్ఘ్యస్థౌల్య ప్రమాణము.

శ్లో॥ స్వాంగుష్ఠేనసమంమూలే స్థౌల్యేనాగ్రేకనిష్ఠయా ॥ 12.

తా॥ నేత్రము మూలభాగమునందు రోగియొక్క బొట్టన వ్రేలితో సమానమయిన స్థౌల్యము, అగ్రభాగమునందు చిటికెనవ్రేలితో సమానమయిన స్థౌల్యముగలదిగ నుండవలయును:—

"వస్తినేత్రమృజుశుక్లం సద్వృత్తంగుళికాముఖమ్ । భవేత్ గోపుచ్ఛసంస్థానం ప్రవాహం త్రికర్ణికమ్ । యూత్రిభాగప్రణయనే మర్యాదా కర్ణికాభవేత్ । ద్వేకర్ణికేచోపరిష్టాత్ వస్త్యాధారేఽథవాంతరే । స్వాంగుష్ఠకపరీణాహం మూలంనేత్రస్యశస్యతే । మధ్యంత్వనామికాతుల్య మగ్రం తుల్యకనిష్ఠికమ్ । స్వేనాంగుళిప్రమాణేన దైర్ఘ్యంస్యాద్ద్వాదశాంగుళమ్ । కర్కంధూప్రవహచ్ఛిద్రం శ్రేష్ఠమన్యద్యథావయః । వింశద్వాదశ షడ్వర్షే ద్వాదశాష్టషడంగులమ్ । కర్కంధుకసతీనాగ్ర ముఖంవిద్రవహామితి ॥"

వస్తిప్రయోగసాధనమయిన యంత్రము (అనగా చిమ్మనగొట్టము) రుజువుగ, శుద్ధముగ, నునుపుగ, గుండ్రముగ, గుళియొక్క ముఖముతో తుల్యమైన ముఖముగలదిగ ఆవుతోకతో సమానమయిన యాకారముగలదిగ, సుప్రవాహముగ (అనగా బాగుగా నీరుపారతగిన ద్వారముగలదిగ), 3 కర్ణికలుగలదిగ నుండవలయును. వస్తిని 3 భాగములను చిమ్మనగ్రోవిలో ప్రయోగించు విషయములో కర్ణిక మూలభాగమునందు మర్యాదగా (అనగా కొసలో) నుండును. వస్తియొక్క అగ్రభాగమునందు 2 కర్ణికలును మూలమునందుగాని లేక మధ్యమునందుగాని 1 కర్ణికయు గలిగియుండవల

యును. ఆ యంత్రముయొక్క మూలభాగము రోగియొక్క బొటన వ్రేలితో తుల్యమైన స్థౌల్యముగలదిగ, మధ్యభాగము దగ్గఱ వ్రేలితోతుల్యమైన స్థౌల్యముగలదిగ, అగ్రభాగము చిటికెన వ్రేలితోతుల్యమైన స్థౌల్యముగలదిగనుండుట ప్రశస్తము. మఱియు నా యంత్రముయొక్క నిడుపు రోగియొక్క అంగుళప్రమాణమువలన 12 అంగుళములుగలదిగ, రేగుగింజ లోనప్రవేశించతగిన ద్వారముగలదిగనుండుట శ్రేష్ఠంబు. ఈ యంత్రము వయస్సు కనుగుణముగను. 20 - 12 - 6 యీసంవత్సరములయందు యథాక్రమముగ 12-8-6 అంగుళప్రమాణము నిడుపుగలదిగను, రేగుగింజ, సతీనము (అనగా లంకలు) వీనియగ్రభాగమున లెనుందునట్టి ముఖము (అనగా ద్వారము) గలదిగనుండవలయునని ఖరనాదుడు చెప్పుచున్నాడు.

"షట్ ద్వాదశాష్టాంగుళసమ్మితాని షడ్వింశతీద్వాదశవర్షజానామ్ స్యుర్మహాత్కర్కంధుసతీనవాహీంఛిద్రాన్యపిహితానిచైవ । యథావయోంగుష్ఠకనిష్ఠికాభ్యాం మూలాగ్రయోస్స్యాత్ పరిణాహః ॥"

వయోనుగుణముగా 6 - 20 - 12 వయస్సుగలవారలకు వస్తియొక్క యంత్రము 6 - 12 - 8 అంగుళము నిడుపుగలదిగ, రేగుగింజ, లంకలు వీనిని వహించునట్టి ఛిద్రముగలదిగ, మూలభాగము, అగ్రభాగము వీనియందు క్రమముగా బొటనవ్రేలు చిటికెన వ్రేలు వీనితో సమానమైన స్థౌల్యముగలదిగ నుండవలయును అని చరకాచార్యుడు చెప్పుచున్నాడు.

## వస్తియంత్ర - ద్వార ప్రమాణము.

శ్లో॥ పూర్ణేఽబ్దేంఽగులమాదాయ తదర్ధార్ధప్రవర్ధితమ్ ।
త్ర్యంగులంపరమంఛిద్రం మూలేగ్రేవహతేఽయుయత్ ॥ 13.
ముద్గంమాషంకలాయంచ క్లిన్నంకర్కంధుకంక్రమాత్ ।

తా॥ ఒక సంవత్సరము పూర్తియైనది మొదలుకొని 1 అంగుళప్రమాణముగల ద్వారము, దానికిపైన నాయా వయస్సునకుతగినటుల కాలు కాలు యంగుళము చొప్పున వృద్ధి చేయబడిన ప్రమాణముగలద్వారము, 3 అంగుళములకు అధికపడని అఖరుప్రమాణముగలద్వారము వస్తియంత్రముయొక్క మూలభాగమునందుండవలయును. అది యెట్లనగా:— మొదటి సంవత్సరము మొదలుకొని 6 సంవత్సరములు పూర్తియగువరకు 1 అంగుళప్రమాణము, 7-వ సంవత్సరము మొదలుకొని 11 సంవత్సరములు పూర్తియగువరకు $1\frac{1}{4}$ అంగుళప్రమాణము, 12 సంవత్సరములు మొదలుకొని 16 సంవత్సరములవరకు $1\frac{1}{2}$ అంగుళప్రమాణము, 16-వ సంవత్సరములో $1\frac{3}{4}$ అంగుళప్రమాణము



17-వ సంవత్సరములో 2 అంగుళముల ప్రమాణము, 18-వ సంవత్సరములో $2\frac{1}{4}$ అంగుళప్రమాణము, 19-వ సంవత్సరములో $2\frac{1}{2}$ అంగుళప్రమాణము, 20-వ సంవత్సరములో $2\frac{3}{4}$ అంగుళప్రమాణము, 21-వ సంవత్సరములో 3 అంగుళముల ప్రమాణము యంత్రముయొక్క ద్వారమని క్రమముగ తెలియవలయును. ఇవి యంత్రద్వారములకు ఉత్కృష్టమైన ప్రమాణము. 1 సంవత్సరముపూర్తియైన 1 అంగుళప్రమాణము ద్వారమని చెప్పినందుచేతనే 1 సంవత్సరమునకు లోబడియుండువారికి $\frac{1}{2}$ అంగుళప్రమాణము ద్వారమని స్వబుద్ధిచే నూహించుకొనవలయును. మఱియును యంత్రముయొక్క అగ్రద్వారము మొదటి సంవత్సరము మొదలుకొని క్రమముగా పెసలు, మినుములు, బోడసెనగలు, పాకము చేయబడిన బోడసెనగలు, రేగుగింజ వీనిని వహించునట్టి ప్రమాణము గలదిగనుండవలయును. అనగా 1 సంవత్సరము మొదలుకొని 6 సంవత్సరములు పూర్తియగువరకు పెసలగింజను వహించునట్టి అగ్రద్వారము, 7 సంవత్సరములు మొదలుకొని 11 సంవత్సరములు పూర్తియగువరకు మినపగింజను వహించునట్టి అగ్రద్వారము, 12 సంవత్సరములు మొదలుకొని 15 సంవత్సరములకులోగా బోడసెనగలను వహించునట్టి అగ్రద్వారము, 16 సంవత్సరములు మొదలుకొని 20 సంవత్సరములవరకు పక్వమైన బోడసెనగలను వహించునట్టి అగ్రద్వారము, 21-వ సంవత్సరము మొదలుకొని రేగుగింజను వహించునట్టి అగ్రద్వారము యంత్రమునకు కలిగియుండవలయునని భావము. ఒక సంవత్సరమునకు లోబడినవానికి పెసలను వహించునట్టి ప్రమాణముగల ద్వారమును కల్పింపజనదు:—"త్ర్యంగుళంపరమంఛిద్రం" అని చెప్పినందుచేతనే నేత్రముయొక్క స్థౌల్య దైర్ఘ్యప్రమాణములను వైద్యుడు స్వబుద్ధిచే కల్పించుకొనవలయునని భావంబగుచున్నది. మూలాగ్రద్వారప్రమాణములను చెప్పినందుచే వానికనుగుణముగా స్థౌల్య దైర్ఘ్యములను సులభముగా కల్పించుకొనదగునని యోచించి తంత్రకారుడు గ్రంథవిస్తరభయముచే నిచట జెప్పకవిరమించెను.

## వస్తియంత్ర - కర్ణికా క్రమము.

శ్లో॥ మూలఛిద్రప్రమాణేన ప్రాంతేఘటితకర్ణికమ్ ॥ 14.
వర్త్యగ్రేపిహితంమూలే యథాస్వంద్వ్యంగుళాంతరమ్ ।
కర్ణికాద్వతయంనేత్రే కుర్యాత్

తా॥ మూలభాగమునందుండు ఛిద్రమునకు తుల్యమయిన ప్రమాణమువలన అగ్రభాగమునందు గుదమునందధికముగా ప్రవేశించకుండా నడ్డగించునట్టి ఛత్రాకారమయిన కర్ణికగలదిగ, అగ్రభాగమునందువర్తిచే మూయబడినదిగ, మూలభాగము

నందు యథాక్రమముగా (అనగా 1 సంవత్సరము మొదలగువయస్సు కనుగుణముగా) వానివానియంగుళి ప్రమాణమువలన 2 అంగుళములువదలి 2 కర్ణికలు గలదిగ నేత్రము నిర్మించవలయును.

వస్తియంత్రాగ్రమునందు - అజాదివస్తి సంయోజనము.

శ్లో॥ తత్రచయోజయేత్ ॥ 15.

అజావిమహిషాదీనాం వస్తింసుమృదితందృఢమ్ ।

కషాయరక్తంనిశ్ఛిద్రగ్రంథిగంధశిరంతనుమ్ ॥ 16.

గ్రంథితంసాధుసూత్రేణ సుఖసంస్థాప్యభేషజమ్ ।

తా॥ బాగుగ మర్దనము చేయబడినదిగను, దృఢముగను, కరక్కాయ మొదలగు కషాయములచే రక్తవర్ణముగలదిగను, ఛిద్రము, గ్రంథి, గంధము, సిరలు వీనిరహితముగను, సూక్ష్మముగను సూత్రములచే బాగుగకట్టబడినదిగను, ప్రయాసలేకనే ఔషధమునుంచతగినదిగనుండు మేకపోతు, ఆడుమేక, దున్నపోతు యీ మొదలగు వాని వస్తిని (అనగా మూత్రకోశమును) యంత్రముయొక్క 2 కర్ణికలయందు చేర్చవలయును. ‘‘అజాదీనాం’’ అని చెప్పినందుచేతనే ఆడుమేక, దున్నపోతు ఇవి గ్రాహ్యంబగుచుండినను యితరజంతువులయొక్క వస్తికంటె మేకపోతు, ఆడుమేక, దున్నపోతు వీనియొక్కవస్తి వస్తికర్మయందు మిగుల సుశ్రేష్ఠమైనదని తెలియ పరచునిమిత్తము ‘‘అవి మహిషాదీనాం’’ అని ప్రత్యేకముగా జెప్పబడినది. ఆది శబ్దమువలన ఆవు, ఇఱ్ఱి, పంది, దున్నపోతు యీ మొదలగు వాని వస్తులనుకూడా గ్రహించుకొనవలయును.

అజాదివస్త్య - భావమునందు - ఛాగాద్యవయవ సంయోగము.

శ్లో॥ వస్త్యభావేంకపాదం వాన్యసేద్వాసోథవాఘనమ్ ॥ 17.

తా॥ పై జెప్పిన మేకపోతు మొదలగువానియొక్క వస్తిలభించనియెడల అంకపాదమును (అనగా మేకపోతు నల్ల యిఱ్ఱి యీ మొదలగు జంతువులయొక్క అవయవవిశేషమును) యంత్ర కర్ణికలయందు జేర్చవలయును. లేక వస్త్రమునైనను దట్టముగ చుట్టవలయును.

నిరూహవస్తి - కషాయ - ప్రమాణము.

శ్లో॥ నిరూహమాత్రాప్రథమే ప్రకుంచోవత్సరాత్పరమ్ ।

ప్రకుంచవృద్ధిఃప్రత్యబ్దం యావత్ షట్ ప్రసృతాస్తతః ॥ 18.



ప్రసృతంవర్ధయేదూర్ధ్వం ద్వాదశాష్టాదశస్యతు ।

ఆసప్తతేరిదంమానం;దశైవప్రసృతాఃపరమ్ ॥ 19.

తా॥ మొదటి సంవత్సరమునందు కషాయము, స్నేహము వీనితోగూడియుండు నిరూహవస్తియొక్క ప్రమాణము ప్రకుంచము. (అనగా ఒక పలము) ఇటుల జెప్పినందుచే నొక సంవత్సరమునకు తగ్గిన 6 మాసములు మొదలగు కాలములయందు పై జెప్పిన వచనమునసురించి $\frac{1}{2}$ పలము, $\frac{3}{4}$ పలము ప్రమాణమని స్వబుద్ధిచే నూహించుకొనవలయునని భావంబగుచున్నది. 1 సంవత్సరమునకు పైన 6 ప్రసృతములగువరకు (అనగా 12 పలములగువరకు) ఒక్కొక ప్రకుంచముచొప్పున ప్రతి సంవత్సరమునందును వృద్ధిచేయుచూరావలయును. దానికిపైన ప్రతి సంవత్సరమునందును ఒక్కొక ప్రసృతముచొప్పున వృద్ధిచేయుచూరావలయును. 12 సంవత్సరములుగలవానికి 12 పలములు నిరూహవస్తియొక్క కషాయప్రమాణమని తెలియవలయును. 13-వ సంవత్సరము మొదలుకొని 17 సంవత్సరములవరకు క్రమముగా ప్రతి సంవత్సరమునందును రెండు రెండు పలములచొప్పున నిరూహవస్తి కషాయప్రమాణమును వృద్ధిచేయుచూరావలయును. 18-వ సంవత్సరమునకు 12 ప్రసృతములు (అనగా 24 పలములు) నిరూహవస్తి కషాయప్రమాణము. ఈ ప్రమాణమును 70 సంవత్సరములవరకు నుపయోగించవలయును. 70 సంవత్సరములకుపైన నిరూహవస్తియొక్క ప్రమాణము 10 ప్రసృతములు. (అనగా 20 పలములు.) 70 సంవత్సరములకుపైన 20 పలములకుపైన నిరూహవస్తి కషాయప్రమాణమును వృద్ధి చేయంజనదు.

అనువాసన - వస్తి ప్రమాణము.

శ్లో॥ యథాయథంనిరూహస్య పాదోమాత్రానువాసనే ।

తా॥ ఒకసంవత్సరముగలవానికిగాని లేక 21 సంవత్సరములవయస్సుగలవాడు యీ మొదలగువారికిగాని నిరూహవస్తిప్రమాణములు యెంత చెప్పబడియున్నదో అందులో 4-వ భాగము యథాక్రమముగా అనువాసనవస్తిలో ప్రమాణమని తెలియవలయును. అదియెట్లనగా :—ఒకపలము నిరూహవస్తి ప్రమాణముగలవానికి 1 కర్ష ప్రమాణము (అనగా $\frac{1}{4}$ పలము) అనువాసనవస్తి ప్రమాణము. ఇటులనే వయస్సుకు తగినటుల అన్నిస్థలములయందును అనువాసనవస్తిప్రమాణము నూహించుకొనవలయును.

అనువాసన - వస్తి క్రమము.

శ్లో॥ ఆస్థాప్యంస్నేహితంస్విన్నం శుద్ధంలబ్ధబలంపునః ॥ 20.

అన్వాసనార్హంవిజ్ఞాయ పూర్వమేవానువాసయేత్ ।
శీతేవసంతేచదివా రాత్రౌ కేచిత్తతోన్యదా ॥ 21.
అభ్యక్తస్నాతముచితాత్ పాదహీనంహితంలఘు ।
అస్నిగ్ధరూక్షమశితం సానుపానంద్రవాదిచ ॥ 22.
కృతచంక్రమణంముక్త విణ్మూత్రంశయనేసుఖే ।
నాత్యుచ్ఛ్రితేనచోచ్ఛీర్షే సంవిష్టంవామపార్శ్వతః ॥ 23.
సంకోచ్యదక్షిణంసక్థి ప్రసార్యచతతోపరమ్ ।

తా॥ నిరూహవస్తికి అర్హుడు, స్నిగ్ధుడు, స్విన్నుడు, ఊర్ధ్వాధోభాగముల యందు వమనవిరేచనరూపమైన శుద్ధిని జేసుకొని మరలబలమును జెందినవాడునగు పురుషుడే అనువాసనవస్తికర్మకు అర్హుడని తెలిసికొని వానికి పూర్వదినమునందు వైద్యుడు అభ్యంజనస్నానముచేయించి వాడు అభ్యాసముగభుజించుదానికంటె $\frac{1}{4}$ భాగము తక్కువగ, పథ్యముగ, లఘువుగ, కొంచెముస్నిగ్ధముగ, రూక్షగ, అనుపానముతో గూడినదిగనుండు ద్రవాదిరూపమైన యాహారములను భుజింపజేసి కొంచెముగ సంచారముచేయించి మలమూత్రోత్సర్జనముచేయించి సుఖకరమైనదియును, మిగుల పొడవు మిగులపొడవైన తలగడలేనిదియునునగు శయనమునందు వామపార్శ్వముగా కుడితొడను ముడుచుకొని ఎడమతొడనుజాచుకొని పరుండియుండునటుల నాజ్ఞాపించి హేమంతము, శిశిరము, వసంతము, యీఋతువులయందు మధ్యాహ్నకాలములో నిరూహవస్తికితోలుత అనువాసనవస్తిని చేయించవలయును. హేమంత, శిశిర, వసంత, ఋతువులకంటె నితరమైన గ్రీష్మ, వర్ష, శరదృతువులలో రాత్రులయందు అనువాసనవస్తిని చేయించదగునని కొందరాచార్యులు వచించెదరు. అయితే ధన్వంతరి మతానుసారులు సర్వఋతువులయందురాత్రులలో అనువాసనవస్తినంగీకరించుటలేదు. కావున నే:—

"నరాత్రౌ ప్రణయేత్స్నేహం దోషోత్క్లేశోభిరాత్రిజః। స్నేహోవీర్యయుతఃకుర్యా దాధ్మానంగౌరవంజ్వరమ్ ॥"

అనగాదోషప్రకోపము రాత్రులయందుకలుగును. కాబట్టి రాత్రులయందు ప్రయోగించబడినస్నేహము వీర్యముతోగూడినదై ఆధ్మానము, గురుత్వము, జ్వరము, వీనిని గలుగజేసునని ధన్వంతరిమతమునను సరించి అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది, "ద్రవాదిచ" అను ఆదిశబ్దమువలన "ద్రవోష్ణమనభిష్యంది" అను వచనముచే పైజెప్పిన యాహారములను గ్రహించుకొనవలయును.



"అతిస్నిగ్ధాశినోప్యుభయమార్గాత్ స్నేహోమదమూర్ఛాఅగ్నిసాదహృల్లాసాదీన్ జనయతి।రూక్షాశినోవిష్టంభబలవర్ణహానించ। అల్పమాత్రద్రవాశినోవిసృష్టవిణ్మూత్రస్య వానావృతోసతదావరణాద్వ్యాపదమితి॥"

అతిస్నిగ్ధమయిన యాహారమును భుజించినవానికి ఉపయోగించబడిన స్నేహవస్తి (అనగా అనువాసనవస్తి.) మదము, మూర్ఛ, అగ్నిమాంద్యము, హృల్లాసము యీమొదలగు నుపద్రవములను, రూక్షగలయన్నమును భుజించినవానికి మలబంధము, బలము, వర్ణము వీనికి హానినిగలుగజేసును. స్వల్పప్రమాణముగలిగినట్టియు, ద్రవముగనుండునట్టియు అన్నమునుభుజించినవాడు, మలమూత్రములను విసర్జించినవాడు వీరలకు స్నేహవస్తి యేఆపత్తునుగలుగజేయనేరదు. అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది. "సంకోచ్యదక్షిణంసక్థిం" అనుచో దక్షిణసక్థిని వామసక్థి పైనునుచుకొనవలయునని వృద్ధవైద్యులు అర్థము చేయుచున్నారు.

"శయనేనాభ్యుచ్ఛ్రితేంస్వాస్తృతే ఈషదున్నత పాదదేశేవామపార్శ్వేన ప్రాక్శిరసంసంవేశయేత్ ॥"

మిగుల పొడవులేనిదియును, కొంచెము ఉన్నతమైన పాదప్రదేశముగలదియును, మంచిబట్టలచే పరచబడినదియునైన శయనమునందు వామపార్శ్వముగా తూర్పుతలనునుచుకొని యుండునటుల పరుండబెట్టవలయునని అష్టాంగ సంగ్రహమునందు చెప్పబడియున్నది.

## అనువాసనవస్తి - ప్రయోగక్రమము.

శ్లో॥ అథాస్యనేత్రంప్రణయే త్స్నిగ్ధేస్నిగ్ధముఖంగుదే ॥ 24.
ఉచ్ఛ్వాస్యవస్తే * ర్వదనే బద్ధేహస్తమకంపయన్ ।
పృష్ఠవంశంప్రతితతో నాతిద్రుతవిలంబితమ్ ॥ 25,
నాతివేగంనవామందం సకృదేవప్రపీడయేత్ ।

తా॥ వస్తియొక్క ముఖములో ఉచ్ఛ్వాసవాతము పూరణముచేసి బైలుపడకుండునటులబంధించి స్నిగ్ధమయిన ముఖముగల యంత్రమును పైజెప్పినప్రకారము పరుండియుండురోగియొక్క స్నిగ్ధమయిన గుదప్రదేశములో నతిత్వరపడక నతివిళంబము చేయకుండానునిచి అతివేగము అతిమందములేకుండా పృష్ఠవంశమున కభిముఖముగా ఒకసారే పర్యాయము హస్తమును కదలించకుండా ప్రయోగించవలయును.

* ర్వదనంబద్ధ్వా ఇతిపా.

శ్లో॥ సావశేషంచకుర్వీత వాయుః శేషేహితిష్ఠతి ॥ 26.

తా॥ శేషించియుండు స్నేహములో వాతముండును. కాబట్టి స్నేహమును (అనగా అనువాసనవస్తిని) సావశేషముగా ప్రయోగించవలయును.

అధికస్నేహవస్తి - ప్రయోగ కర్తవ్యము.

శ్లో॥ దత్తేతూత్తానదేహస్య పాణినాతాడయేత్స్ఫిజౌ ।
తత్పార్ష్ణిభ్యాంతథాశయ్యాం పాదతశ్చత్రిరుత్క్షిపేత్ ॥ 27.

తా॥ స్నేహవస్తి నధికముగా ప్రయోగించి యుండునపుడు వెల్లకిలపరుండి యుండురోగియొక్క స్ఫిక్కుప్రదేశములను హస్తములచే తాడనముచేయవలయును. అదేప్రకారము పార్ష్ణులవలన స్ఫిక్కుప్రదేశములయందును తాడనము చేయవలయును. పిదప శయనమును పాదమువలన 3 పర్యాయములు పొడవుగనెత్తవలయును.

శ్లో॥ తతః ప్రసారితాంగస్య సోపధానస్యపార్ష్ణికే ।
ఆహన్యాన్ముష్టినాంగంచ స్నేహేనాభ్యజ్యమర్దయేత్ ॥ 28.
వేదనార్తమితిస్నేహో నహిశీఘ్రంనివర్తతే ।
యోఽప్యశ్శీఘ్రంనివృత్తేస్యః స్నేహోఽతిష్ఠన్నకార్యకృత్ ॥ 29.

తా॥ పిదప ప్రసారితమయిన (అనగా పరచబడిన) శరీరముగలవాడు, ఉపధానము (అనగా తలగడతోగూడియుండువాడు) నగురోగియొక్క పార్ష్ణిప్రదేశమునందు ముష్టిచేగుద్దవలయును. మఱియు నారోగి వేదనవలన మిగుల పీడితుడుగనుండుటవలనను, స్నేహము శీఘ్రముగ నివర్తించకుండుటవలనను, వానియంగమునందు తైలాది స్నేహములచే నభ్యంజనముచేయించి మర్దించవలయును. స్నేహము శీఘ్రముగనివర్తించినచో స్నేహకర్మయొక్క ఫలమునుకలుగజేయనేరదు. కావున మరల స్నేహప్రయోగము చేయవలయును.

స్నేహవస్త్యనంతరము - లఘు భోజనము.

శ్లో॥ దీప్తాగ్నింత్వాగతస్నేహం సాయాహ్నేభోజయేల్లఘు ।

తా॥ అగ్నిదీపనముగలపురుషునికి స్నేహము బైలువెడలియుండునపుడు సాయంకాలమునందు లఘువైన యాహారమును భుజింపజేయవలయును.

స్నేహాకర్షణ కాలము.

శ్లో॥ నివృత్తికాలః పరమః త్రయోయామాస్తతఃపరమ్ ॥ 30.



అహోరాత్రముపేక్షేత పరతఃఫలవర్తిభిః ।
తీక్ష్ణైర్వావస్తిభిఃకుర్యా ద్యత్నంస్నేహనివృత్తయే ॥ 31.

తా॥ స్నేహముయొక్క పరమమైన (అనగా ఉత్కృష్టమైన) నివృత్తికాలము 3 యామములు. దానికిపైన ఒక అహోరాత్రము నుపేక్షించవలయును. (అనగా నా స్నేహము నాకర్షించుటకై ఒక అహోరాత్రమువరకు యత్నము చేయంజనదని భావము.) ఒక అహోరాత్రమునకుపైన అర్శఃచికిత్సితాధ్యాయములో జెప్పబడియుండు ఫలవర్తులచేగాని, వస్తికల్పములోజెప్పబడు తీక్ష్ణమైన వస్తులచేగాని, స్నేహాకర్షణమునుగురించి యత్నించవలయును.

స్నేహము - బైలువెడలకుండునపుడు - శుంఠీధాన్యాంబు పానము.

శ్లో॥ అతిరౌక్ష్యాదనాగచ్ఛన్న చేజ్జాడ్యాదిదోషకృత్ ।
ఉపేక్షేతైవహితతోఽధ్యుషితశ్చనిశాంపిబేత్ ॥ 32.
ప్రాతర్నాగరధాన్యాంభః కోష్ణంకేవలమేవవా ।

తా॥ అధికరూక్షతవలన బైలువెడలకుండునట్టి స్నేహము జడత్వము, అగ్నిమాంద్యము యీ మొదలగు దోషములను చేయకుండినచో దానినుపేక్షించవచ్చును. (అనగా బైలుపరచుటయందెత్నించకూడదని భావము.) పిదప నొకరాత్రియంతయు నిరాహారముగనుండి మరుదినముయొక్క ప్రాతఃకాలమునందు శొంఠి, ధనియాలు వీని యుక్తముగ కాచబడిన సుఖోష్ణమైన ఉదకమునుగాని, శొంఠి, ధనియాలు వీని రహితముగనుండు ఉష్ణోదకమునుగాని పానముచేయవలయును.

తృతీయపంచమాది - దివసములయందు - అనువాసనవస్తి క్రమము.

శ్లో॥ అన్వాసయేత్తృతీయేఽహ్ని పంచమేవాపునశ్చతమ్ ॥ 33.
యథావాస్నేహపక్తిఃస్యా దతోఽతుల్యల్బణమారుతాన్ ।
వ్యాయామనిత్యాన్దీప్తాగ్నీన్ రూక్షాంశ్చప్రతివాసరమ్ ॥ 34.

తా॥ ఆరోగికి మరల 3-వ దినమునగాని లేక 5-వ దినమునగాని అనువాసనవస్తి చేయించవలయును. లేక రోగియొక్క అగ్ని బలమునకనుసరించి స్నేహపాకముకలుగు నటుల 2-వ దినమునందు కూడా అనువాసనవస్తి చేయించవలయును. మఱియు వాతాధిక్యము వ్యాయామముచేయునట్టి స్వభావము, విశేషముగ నగ్నిదీపనము, రూక్ష ఇవిగలవారలకు ప్రత్యహము అనువాసనవస్తినే చేయించవలయును.

శ్లో॥ ఇతిస్నేహైస్త్రిచతురైః స్నిగ్ధేస్రోతోవిశుద్ధయే ।
నిరూహంశోధనంయుంజ్యా దస్నిగ్ధేస్నేహనంతనోః ॥ 35.

తా॥ ఈప్రకారము 3 లేక 4 సంఖ్యగల అనువాసనవస్తులవలన రోగి స్నిగ్ధుడైయుండగా స్రోతోవిశోధనార్థమై శోధనకరమైన నిరూహవస్తిని ప్రయోగించవలయును. రోగి అస్నిగ్ధుడైయుండగా మరల శరీరమునకు స్నేహకర్మను చేయవలయును.

## నిరూహవస్తి ప్రయోగము.

శ్లో॥ పంచమేథతృతీయేవా దివసేసాధకేశుభే ।
మధ్యాహ్నేకించిదావృత్తే ప్రయుక్తేబలిమంగలే ॥ 36.
అభ్యక్తస్వేదితోత్సృష్ట మలంనాతిబుభుక్షితమ్ ।
అవేక్ష్యపురుషందోష భేషజాదీనిచాదరాత్ ॥ 37.
వస్తింప్రకల్పయేద్వైద్య స్తద్విద్యైర్బహుభిస్సహ ।

తా॥ పిదప అనువాసనవస్తిని చేసిన 3-వ దినమునందుగాని లేక 5-వ దినమునందుగాని మధ్యాహ్నముకొంచెము వాలినపిదప శుభకరమైన దినమునందు బలిపూజాదికర్మలను సలిపి అభ్యంజన స్వేదకర్మలంజేసుకొనినవాడును, మలమూత్రాదులను విసర్జించినవాడును. మిక్కిలి ఆకలిలేనివాడును నగురోగియొక్క ప్రకృతి, దోషము, ఔషధము, సాత్మ్యము, బలము, యీ మొదలగువానిని బాగుగనాలోచించి "నిరూహమాత్రాప్రథమే" అనిపై జెప్పియుండుప్రకారము వయస్సు కనుగుణమైన నిరూహవస్తిప్రమాణమును తెలిసికొని వైద్యశాస్త్రమునందు నిపుణులుగనుండునట్టి యనేకులతోకూడా మిక్కిలి ప్రయత్నముతో నిరూహవస్తిని ప్రయోగించవలయును.

## నిరూహవస్తి కల్పన.

శ్లో॥ క్వాథయేద్వింశతిపలం ద్రవ్యస్యాష్టౌఫలానిచ ॥ 38.

తా॥ వస్తికల్పములో నిరూహవస్తికై చెప్పబడియుండు (20) పలముల ప్రమాణముగల ద్రవ్యములను, (8) మ్రంగకాయలను, (16) భాగములధికముగనుండు జలములోజేర్చి చాతుర్భాగావశేషముగా కాచవలయును.



## వాతాదులయందు - నిరూహవస్తి - స్నేహ ప్రమాణము.

శ్లో॥ తతఃక్వాథాచ్చతుర్థాంశం స్నేహంవాతేప్రకల్పయేత్ ।
పిత్తేస్వస్థేచషష్ఠాంశ మష్టమాంశంకఫాధికే ॥ 39.

తా॥ వాతాధిక్యముగల పురుషునియందు పై జెప్పబడినప్రకారము చేయబడిన కషాయమునకు 4-వ భాగము స్నేహమును చేర్చవలయును. (అనగా నిరూహవస్తియొక్క కషాయ ప్రమాణము 12 ప్రసృతములు. అనగా 24 పలములు. దానిలో స్నేహము 6 పలములు చేర్చవలయునని భావము.) పిత్తాధిక్యముగల పురుషునియందును, స్వస్థుడుగనుండు పురుషునియందును పై జెప్పిన క్వాథములో 6 వ భాగము (అనగా 4 పలములు) స్నేహమును చేర్చవలయును. కఫాధిక్యముగల పురుషునియందును పై జెప్పినక్వాథములో అష్టమాంశము (అనగా 3 పలములు) స్నేహమును చేర్చవలయును. వాతపిత్తకఫములు మూడునధికముగనుండునపుడును, స్వస్థముగనుండునపుడును అష్టమాంశము (అనగా 3 పలములు) స్నేహమును చేర్చవలయును.

"యోహిసంచాలయేత్సుప్తం వనేసింహంకరాదిభిః । సదోషాంశ్చాలయేత్స్వస్థా న్ప్రచ్ఛర్దనవిరేచనైః ॥"

స్వస్థముగనుండు వాతాదిదోషములను ఛర్దనవిరేచనములచే చలింపచేయుట, వనమునందు నిద్రించుచుండు సింహమును హస్తాదులచే తాడనముచేసి మేల్కొలుపునటుల, అపాయకరము. కావునవాతాదులు స్వస్థముగనుండునపుడు వమనవిరేచనాదులను చేయించకూడదని యితరతంత్రకారులు నిషేధించుచున్నారు. అట్లుండగా స్వస్థునికి నిరూహవస్తిని మూలశ్లోకమునందు చెప్పియుండుట అసంగతమనే శంకగలుగును. అయితే "శీతోద్భవందోషచయంవసంతే" అనిఋతుచర్యాధ్యాయమునందు స్వస్థునికికూడా వమనవిరేచనాదులను యీతంత్రకారుడు జెప్పియున్నాడు. అట్లగుటచే పైజెప్పిన యోహిసంచాలయేదిత్యాదివచనము శిష్టవ్యవహారవిరుద్ధంబగుటచే యీతంత్రకారునికి అనభిమతమనిభావము.

శ్లో॥ సర్వత్రచాష్టమంభాగం కల్కాద్భవతివాయథా ।
నాత్యచ్ఛసాంద్రతావస్తేః

తా॥ వాతపిత్తకఫములు మూటియందును కల్కద్రవములో 8-వ భాగము (అనగా 3 పలములు) స్నేహమును చేర్చవలయును. వస్తిమిగులతేటగ, ఘనముగనుండకుండునటుల కల్కమును సిద్ధముచేయవలయును.

### నిరూహవస్తి - ద్రవ్యసమ్మేళన క్రమము.

శ్లో॥ ఫలమాత్రంగుడస్యచ ॥ 40.
మధుపట్వాదిశేషంచయుక్త్యా

తా॥ ఆకల్కమునందు ఒకపలప్రమాణము బెల్లమును, తేనె, పటు (అనగా లవణము) యీమొదలగు శేషద్రవ్యములను, యుక్తిచే జేర్చుకొనవలయును. అదియెట్లనగా:—మాక్షికము 4 పలములు, సైంధవలవణము 1 కర్షప్రమాణము; అటులనేకొన్నిచోట్ల యవక్షారము 1 కర్ష ప్రమాణము అని తెలియవలయును. “పట్వాది” అను ఆదిశబ్దమువలన మాంసరసము, సుర, ఆసవము, మూత్రము, క్షీరము, కాంజికము అనువానిని గ్రహించుకొనవలయును.

### నిరూహవస్తి - ప్రయోగ క్రమము.

శ్లో॥ సర్వంతదేకతః ।
ఉష్ణాంబుకుంభీబాష్పేణ తప్తంఖజసమాహతమ్ ॥ 41.
ప్రక్షిప్యవస్తౌ ప్రణయేత్పాయానాత్యుష్ణశీతలమ్ ।
నాతిస్నిగ్ధంనవారూక్షం నాతితీక్ష్ణంనవామృదు ॥ 42.
నాత్యచ్ఛసాంద్రంనోనాతి మాత్రంనాపటునాతచ ।
లవణంతద్వదమ్లంచ

తా॥ పైజెప్పియుండుసమస్తద్రవ్యముల నొకపాత్రలోజేర్చి ఔషధపాకాధిక్యపరిహారార్థమై ఉష్ణోదకముతోగూడియుండు కుంభముయొక్క వేడిమివలన పాత్రయందలిద్రవ్యములను తప్తముజేసి గరిటెవలన బాగుగకలియబెట్టి పైయధ్యాయములో జెప్పబడినబ్రహ్మదక్షేత్యాది మంత్రముచే నభిమంత్రించిఅత్యుష్ణము, అతిశీతలము, అతిస్నిగ్ధము, అతిరూక్షము, అతితీక్ష్ణము, అత్యచ్ఛము (అనగా అతిపేట), అతిమృదుత్వము, హీనప్రమాణము, ప్రమాణాధిక్యము, లవణాధిక్యము, అమ్లాధిక్యము లేకుండునటుల పైయౌషధమును వస్తిలోజేర్చి గుదమునందు ప్రయోగించవలయును.

### మతాంతర - నిరూహవస్తి - ద్రవ్యసంయోగ క్రమము.

శ్లో॥ పఠన్త్యన్యేతుతద్విదః ॥ 43.
మాత్రాంత్రిపలికాంకుర్యాత్ స్నేహమాక్షికయోఃపృథక్ ।
కర్షార్థంమాణిమంథస్య స్వస్థేకల్కపలద్వయమ్ ॥ 44.



సర్వద్రవాణాం శేషాణాం పలానిదశకల్పయేత్ ।
మాక్షికంలవణంస్నేహ కల్కంక్వాథమితిక్రమాత్ ॥ 45.
ఆవపేతనిరూహాణా మేషసంయోజనేవిధిః ।

తా॥ స్నేహము, మాక్షికము వీనిని ప్రత్యేకముగ 3 పలములు, మాణిమంథము (అనగా సైంధవలవణము) $\frac{1}{2}$ కర్షప్రమాణము, స్వస్థునికి కల్కము 2 పలములు, యితరమయిన సమస్తరసద్రవ్యములు 10 పలములు, యీప్రకారము చేర్చవలయునని వస్తికర్మయందు పాండిత్యముగల యితరులు వచింపుచున్నారు. ఒకభాండములోమాక్షికమునుతొలుతవేసి మర్దనముచేసి పిదపదానిలోలవణమునువేసి బాగుగ మర్దించి మిశ్రముచేయవలయును. పిదపస్నేహమును, దానికితర్వాత కల్కమును, దానికితర్వాతక్వాథమును యిటులక్రమముగ మిశ్రముచేయువలయును. ఇటుల మిశ్రముచేయబడినద్రవ్యములు సమరసములుగలవిగనగును. ద్రవ్యములకు సమరసములుగలిగినచో నిరూహవస్తికి సమ్యగ్యోగముగలుగును. నిరూహవస్తిద్రవ్యములైన మాక్షికాదులయొక్క మిశ్రమునందును యిదియే విధియని తెలియవలయును.

### నిరూహవస్తి - ప్రయోగానంతర కర్తవ్యము.

శ్లో॥ ఉత్తానేదత్తమాత్రేతు నిరూహేతన్మనాభవేత్ ॥ 46.
కృతోపధానస్సంజాత వేగశ్చోత్కటకఃసృజేత్ ।

తా॥ నిరూహవస్తి ప్రయోగించబడినతోడనే వెల్లకిలపరుండి తలగడమీద నానుకొని నిరూహ వేగమునందు మిగుల అవధానముగలవాడై యుండవలయును. నిరూహవేగముకలుగునపుడు నిరాటంకముగా వదలవలయును.

### వేగాభావమునందు - మరల - నిరూహవస్తి క్రమము.

శ్లో॥ ఆగతౌపరమఃకాలో ముహూర్తోమృత్యవేపరమ్ ॥ 47.
తత్రానులోమికంస్నేహ క్షారమూత్రామ్లకల్పితమ్ ।
త్వరితంస్నిగ్ధతీక్ష్ణోష్ణం వస్తిమన్యం ప్రపీడయేత్ ॥ 48.
విదధ్యాత్ఫలవర్తింవా స్వేదనోత్రాసనాదిచ ।

తా॥ నిరూహవేగముయొక్క ఆగమనకాలము ఒకముహూర్తము. దానికి పైబడిన ఆగమనకాలము మరణముకొరకగును. నిరూహవస్తివేగము ఒకముహూర్తమునకుపైన బైలువెడలకుండుపక్షములో అనులోమకరమయినట్టియు, స్నేహము, యవక్షారము, గోమూత్రము, తక్రము, కాంజికము యీమొదలగు అమ్లద్రవ్యములచే సిద్ధము

చేయబడినట్టియు, స్నిగ్ధముగ తీక్ష్ణముగ ఉష్ణముగనుండునదియునైన వేరేనిరూహవస్తిని త్వరగా ప్రయోగించవలయును. లేక అర్శశ్చికిత్సితాధ్యాయములో జెప్పియుండు మఱ్ఱింగకాయతోగూడినఫలవర్తినైనా ప్రయోగించవలయును. మఱియును స్వేదకర్మ, భయపరచుట వీనినికూడా చేయవలయును.

## ద్వితీయ - తృతీయాది - నిరూహవస్తి ప్రయోగములు.

శ్లో॥ స్వయమేవనివృత్తేతు ద్వితీయోవస్తిరిష్యతే ॥ 49.
తృతీయోపిచతుర్థోపి యావద్వాసునిరూఢతా ।

తా॥ ఫలవర్తిప్రయోగము మొదలగు శ్రమలేకనే స్వయముగా నిరూహవస్తి బైలుపడినయెడల 2, 3, లేక 4 పర్యాయములుగాని, లేక శరీరమునందు బాగుగ నిరూఢత్వముగలుగువఱకుగాని నిరూహవస్తిని ప్రయోగించవలయును. ఇటుల జెప్పుటచే తొలుత ప్రయోగించబడిన నిరూహవస్తి ఫలవర్తి ప్రయోగము మొదలగు ప్రయాసమువలన బైలువెడలునపుడు మఱియొకనిరూహవస్తిని ప్రయోగింపజనదని భావంబగుచున్నది.

## నిరూహవస్తి - సమ్యగ్యోగ లక్షణము.

శ్లో॥ విరిక్తవచ్చయోగాదీన్ విద్యాత్

తా॥ నిరూహవస్తియొక్క సమ్యగ్యోగాదులను విరిక్తునివలెనే తెలియవలయును. విరిక్తునియొక్క సమ్యగ్యోగాదులు వమనవిరేకాధ్యాయమునందు "హృత్పార్శ్వశుద్ధి" అనువచనము మొదలుకొని "భవంత్యతి విరిక్తస్యతథాతివమనాదయః" అనువచనమువరకు జెప్పబడియున్నది.

## నిరూహవస్తి - సమ్యగ్యోగమునంగు పథ్యము.

శ్లో॥ యోగేతుభోజయేత్ ॥ 50.
కోష్ణేనవారిణాస్నాతం తనుధన్వరసౌదనమ్ ।

తా॥ నిరూహవస్తియొక్క సమ్యగ్యోగము కలిగియుండునపుడు రోగినిసుఖోష్ణమైన యుదకములోస్నానముచేయించి లఘువైన జాంగలమాంసరసము, అన్నము వీనిని భుజింపజేయవలయును. "యూషక్షీరరసైః క్రమాత్" అనగాయూషము, క్షీరము, మాంసరసము అనువవి పథ్యకరములని ఉత్తరత్ర జెప్పబడుటచే నిచట జాంగల మాంసరసము, అన్నము వీనిని భుజింపజేయవలయునని జెప్పినది అసంగతమనుశంకగలుగును. అయితే ప్రాయశః నిరూహవస్తి వాతవికారశమనార్థమే చెప్పబడియున్నది. దానియందు మాంసరసము అన్నము ఇవియే ఉత్కృష్టమైన పథ్యము. కాబట్టి



ఉత్తరత్ర జెప్పబడు యూషక్షీరాదులు ఆయాదోషానుగుణముగా జెప్పబడినవగుటవలన ప్రకృతమునందెట్టిథ విరోధమును లేదు. దోషశుద్ధి వమనవిరేచనములవలన ప్రవరూపమైనవస్తువులచే జేయించబడునపుడు పేయాదిక్రమము పథ్యముగనగుచుటుల నిరూహవస్తియందును పేయాదిక్రమమే పథ్యముగ కావచ్చునని చెప్పుటయుక్తము కాదు. ఏలననగా:—విరేకవమనములచే జాఠరాగ్ని స్థానము మూయబడుచున్నది. దానివలన నగ్నిమాంద్యముకలుగును. కాబట్టి వమనవిరేకములయందు పేయాదిక్రమము పథ్యముగ జెప్పబడినది. నిరూహవస్తియైననో నాభియొక్క ఊర్ధ్వభాగమును జెందకనే దోషములను బయలుపరచును. కాబట్టి యీనిరూహవస్తియందు అగ్నిమాంద్యముకలుగుటలేదు. దానంజేసియే యిచట పేయాదిక్రమము పథ్యముకానేరదు. మఱియు నిరూహవస్తి వాతవికారశమనార్థము చెప్పబడియుండుటవలన నిచట మాంసరసౌదనమే యుక్తమైనపథ్యము.

శ్లో॥ వికారాయేనిరూహస్య భవంతి ప్రచలైర్మలైః ॥ 51.
తేసుఖోష్ణాంబుసిక్తస్య యాంతిభుక్తవతశ్శమమ్ ।

తా॥ నిరూహవస్తియందు స్వస్థానమునంగుండి చెలించియుండు వాతాదిదోషములచే గలుగువికారములు సుఖోష్ణమైన ఉదకములో స్నానముచేసి భుజించినవానికి శాంతిజెందును. కాబట్టి నిరూహవస్తి చేయించుకొనినవాడు సమ్యగ్యోగము గలిగియుండునపుడు సుఖోష్ణోదకములో స్నానముచేసి భుజించుటయావశ్యకము.

## నిరూహానంతరము - అనువాసనవస్తి.

శ్లో॥ అథవాతార్దితంభూయ స్సద్యఏవానువాసయేత్ ॥ 52.

తా॥ నిరూహవస్త్యనంతరము వాతపీడితుడుగ నుండుపురుషునికి ఆదినమునందే అనువాసనవస్తి చేయించవలయును.

## అనువాసనవస్తి సమ్యగ్యోగాదులు.

శ్లో॥ సమ్యక్హీనాతియోగాశ్చ తస్యస్యుఃస్నేహపీతవత్ ।

తా॥ అనువాసనవస్తియొక్క సమ్యగ్యోగ, హీనయోగ, అతియోగములు స్నేహపాన సమ్యగ్యోగాదులవలెనేయుండును. స్నేహపానముయొక్క సమ్యగ్యోగాదులు "వాతానులోమ్యం" అనుశ్లోకము మొదలుకొని "ఘ్రాణవక్త్రగుదస్రవాః" అనునంతవరకు పూర్వమే చెప్పబడియున్నది.

## ప్రకారాంతరాను - వాసనవస్తి సమ్యగ్యోగము.

శ్లో॥ కించిత్కాలంస్థితోయశ్చ సపురీషోనివర్తతే ॥ 53.

సానులోమానిలఃస్నేహ స్తత్సిద్ధమనువాసనమ్ ।

తా॥ స్వల్పకాలమువరకు కోష్ఠమధ్యములోనుండి పిదప పురీషము, అనులోమ వాతము, వీనితోకూడా స్నేహముబయలుపడుట సిద్ధమైన (అనగా రోగనివృత్తి కరమైన) అనువాసనమని తెలియవలయును.

## శ్లేష్మాదిరోగములయందు - అనువాసనవస్తి ప్రయోగక్రమము.

శ్లో॥ ఏకంత్రీన్వాబలాసేతు స్నేహవస్తీన్ప్రకల్పయేత్ ॥ 54.
పంచవాసప్తవాపిత్తే నవైకాదశవానిలే ।
పునస్తతోప్యయుగ్మాంస్తు పునరాస్థాపనంతతః ॥ 55.

తా॥ శ్లేష్మరోగమునందు 1 లేక 3 అనువాసనవస్తులను చేయవలయును. పిత్తరోగమునందు 5 లేక 7 అనువాసనవస్తులను చేయవలయును. వాతరోగమునందు 9 లేక 11 అనువాసనవస్తులను చేయవలయును. తర్వాత బేసియైన అనువాసనములను చేయవలయును. పిదప మరల నిరూహవస్తిని చేయవలయును. వాతపీడితునికి:—
“ వ్యాయామనిత్యాన్దీప్తాగ్నీన్ రూక్షాంశ్చప్రతివాసరమ్ ”
అనిపూర్వముచెప్పిన వచనప్రకారము జంటయైన అనువాసనవస్తులను చేయవలయును.

## నిరూహవస్తియందు పథ్యము.

శ్లో॥ కఫపిత్తానిలేష్వన్నం యూషక్షీరరసైక్రమాత్ ।

తా॥ శ్లేష్మము, పిత్తము, వాతము, యీరోగములయందు నిరూహవస్తి చేయించుకొనినవాడు యథాక్రమముగాయూషము, క్షీరము, మాంసరసము, వీనితోడ నన్నమునుభుజించుట పథ్యకరంబు.

## వాతమునందు - నిరూహవస్తి క్రమము.

శ్లో॥ వాతఘ్నౌషధనిఃక్వాథ స్త్రివృతాసైంధవైర్యుతః ॥ 56.
వస్తిరేకోనిలేస్నిగ్ధః స్వాద్వమ్లోష్ణరసాన్వితః ।

తా॥ తెల్లతెగడ, సైంధవలవణము, వీనితోగూడినదిగ, స్నిగ్ధముగ, మధురామ్లలవణరసయుక్తముగనుండు వాతహరమైన ఔషధములు (అనగా దశమూలాదులు) వీనియొక్క కషాయముచే వాతమునందు ఒకనిరూహవస్తిచేయుట హితకరము.



## పిత్తమునందు - నిరూహవస్తి క్రమము.

శ్లో॥ న్యగ్రోధాదిగణక్వాథా * పత్రకాదిసితాయుతౌ ॥ 57.
పిత్తేస్వాదుహిమౌసాజ్య క్షీరేక్షురసమాక్షికౌ ।

తా॥ న్యగ్రోధాదిగణకషాయము, పత్రకాదిగణకషాయము, పంచదార, ఘృతము, క్షీరము, చెఱకురసము, మాక్షికము, వీనితోగూడియుండు 2 నిరూహవస్తులు పిత్తమునందుహితకరము.

## కఫమునందు - నిరూహవస్తి క్రమము.

శ్లో॥ ఆరగ్వధాదినిఃక్వాథ వత్సకాదియుతాస్త్రయః ॥ 58.
రూక్షాఃసక్షౌద్రగోమూత్రా స్తీక్ష్ణోష్ణకటుకాఃకఫే ।

తా॥ ఆరగ్వధాదిగణకషాయము, వత్సకాదిగణకషాయము, మాక్షికము, గోమూత్రము, వీనితోగూడినదిగ, రూక్షముగ, తీక్ష్ణముగ, ఉష్ణముగ, కటువుగనుండు 3 నిరూహవస్తులు కఫమునందుహితకరము.

## సన్నిపాతమునందు - వస్తి క్రమము.

శ్లో॥ త్రయశ్చసన్నిపాతేపి దోషాన్ఘ్నంతియతఃక్రమాత్ ॥ 59.

తా॥ సన్నిపాతమునందును 3-డే వస్తులు హితకరము. ఏలననగా:—అవి క్రమముగా 3 దోషములను హరింపజేసును.

## మతాంతరమునందు - వస్తి నియమము.

శ్లో॥ త్రిభ్యఃపరంవస్తిమతో నేచ్ఛంత్యన్యేంచికిత్సకాః ।
నహిదోషశ్చతుర్థోస్తి పునర్దీయేతయంప్రతి ॥ 60.

తా॥ కావున 3 నిరూహవస్తులకంటె నధికమైననిరూహవస్తులనుకొన్ని వైద్యులంగీకరించుటలేదు. ఏలననగా:-నాలుగవనిరూహవస్తియేదోషమునుద్దేశించి ప్రయోగించవలయునో అటువంటి నాలుగవదోషములేకుండుటవలన అని తెలియవలయును.

శ్లో॥ ఉత్క్లేశనంశుద్ధికరం దోషాణాంశమసంక్రమాత్ ।
త్రీన్షడ్వాకల్పయేద్వస్తి మిత్యన్యేపిప్రచక్షతే ॥ 61.

---

* పద్మకాది ఇతిపా.

తా॥ దోషములను స్థానములోనుండి చెలింపజేసుట, శుద్ధిజేసుట, శమనముచేయించుట, వీటినిమిత్తము యథాక్రమముగా 3 నిరూహవస్తులను ప్రయోగించవలయునని యితరవైద్యులు చెప్పుచున్నారు.

### దోషాద్యనుగుణముగా - వస్తి ప్రయోగము.

శ్లో॥ దోషౌషధాదిబలత స్సర్వమేతత్ప్రమాణయేత్ ।

తా॥ కావున నిరూహవస్తిప్రయోగవిషయములో వాతాదిదోషములు, ఔషధము, సాత్మ్యము, యీ మొదలగువాని ననుసరించి పైజెప్పినవస్తులను ప్రయోగించవలయును.

శ్లో॥ సమ్యఙ్నిరూఢలింగంతు నాసంభావ్యనివర్తయేత్ ॥ 62.

తా॥ నిరూహముయొక్క సమ్యగ్యోగము కలుగకుండువరకు నిరూహవస్తిని నిలుపజేయనదు.

### కర్మాఖ్య - వస్తి విశేషము.

శ్లో॥ ప్రాక్స్నేహఏకఃపంచాంతే ద్వాదశాస్థాపనానిచ ।
సాన్వాసనానికర్మైవం వస్తయస్త్రింశదీరితాః ॥ 63.

తా॥ తొలుతఒకస్నేహవస్తి, అంతమునందు 5 స్నేహవస్తులు, అనువాసనముతోగూడియుండు 12 నిరూహవస్తులు (అనగా తొలుతనిరూహము పిదప అనువాసనము యీప్రకారము 24 వస్తులు) ఇటుల 30 వస్తులు కర్మయని బలుంగును.

### కాలమను - వస్తి భేదము.

శ్లో॥ కాలఃపంచదశైకోత్ర ప్రాక్స్నేహోంతేత్రయస్తథా ।
షట్పంచవస్త్యంతరితాః

తా॥ తొలుతస్నేహవస్తి 1. అంతమునందు స్నేహవస్తులు 3, 5 నిరూహవస్తులచే అంతరితమైన 6 స్నేహవస్తులు (అనగా తొలుతస్నేహము పిదప నిరూహము యీప్రకారము 11 వస్తులు) ఇటుల 15 వస్తులు కాలమనిచెప్పబడును.

### యోగమను - వస్తి భేదము.

శ్లో॥ యోగోష్టౌవస్తయోత్రతు ॥ 64.
త్రయోనిరూహాస్స్నేహాశ్చ స్నేహావాద్యంతయోరుభౌ ।

తా॥ నిరూహవస్తులు 3, స్నేహవస్తులు 3, మొదట, అంతమునస్నేహవస్తులు 2, ఇటుల 8 వస్తులు యోగమనిచెప్పబడును.



### స్నేహ - నిరూహ - వస్త్యాధిక్య నిషేధము.

శ్లో॥ స్నేహవస్తింనిరూహంవా నైకమేవాతిశీలయేత్ ॥ 65.
ఉత్క్లేశాగ్నివధౌస్నేహా న్నిరూహాన్మరుతోభయమ్ ।

తా॥ స్నేహవస్తి, లేకనిరూహవస్తి వీనిలోనొకదానినే విశేషముగా ప్రయోగింపజేయనదు. స్నేహవస్తి నధికముగ బ్రయోగించుటచే ఉత్క్లేశము, అగ్నిమాంద్యము కలుగును. నిరూహమునధికముగ సేవించుటచే వాతరోగముకలుగును.

### నిరూహానువాసన వస్త్యర్హులు.

శ్లో॥ తస్మాన్నిరూఢఃస్నేహ్యఃస్యా న్నిరూహ్యశ్చానువాసితః ॥ 66.

తా॥ కావున నిరూహవస్తి చేయించుకొనినవాడు స్నేహవస్తికి అర్హుడుగనగును. అటులనే అనువాసనవస్తి చేయించుకొనినవాడు నిరూహవస్తికి అర్హుడుగనగును.

### వస్తికర్మ ఫలము.

శ్లో॥ స్నేహశోధనయుక్త్యైవం వస్తికర్మత్రిదోషజిత్ ।

తా॥ ఈప్రకారము పూర్వోక్తస్నేహశోధనయుక్తిచే సేవించబడిన వస్తికర్మ త్రిదోషములనుజయించును.

### మాత్రా వస్తి.

శ్లో॥ హ్రస్వయాస్నేహపానస్య మాత్రయాయోజితస్సమః ॥ 67.
మాత్రావస్తిఃస్మృతఃస్నేహః

తా॥ హ్రస్వమైనమాత్రతోడ (అనగా రెండుయామములలో జీర్ణమగునట్టి స్నేహమాత్రతోడ) ప్రయోగించబడిన స్నేహవస్తి మాత్రావస్తియని సద్వైద్యులచే జెప్పబడును.

“ షట్పలాతుభవేజ్జ్యేష్ఠా త్రిపలామధ్యమాభవేత్ । కనీయస్యర్ధపలా త్రిధామాత్రానువాసనే ॥”

6 పలములు ఉత్తమమాత్ర, 3 పలములు మధ్యమమాత్ర, $1\frac{1}{2}$ పలము హ్రస్వమాత్ర ఇటుల 3 ప్రకారములుగా అనువాసనవస్తిలో స్నేహమాత్ర యితరులచే చెప్పబడియున్నది.

## మాత్రావస్తి - సేవన ఫలము.

శ్లో॥ శీలనీయస్సదాచసః ।
బాలవృద్ధాధ్వభారస్త్రీ వ్యాయామాసక్తచింతకైః ॥ 68.
వాతభగ్నబలాల్పాగ్ని నృపేశ్వరసుఖాత్మభిః ।
దోషఘ్నోనిష్పరీహారో బల్యఃసృష్టమలస్సుఖః ॥ 69.

తా॥ ఆమాత్రావస్తిని బాలురు, వృద్ధులు, మార్గసంచారము, భారమును మోసియుట, స్త్రీసంయోగము, వ్యాయామము వీనియందాసక్తిగలవారు, చింతాక్రాంతులు, వాతముచే నపహరించబడిన బలముగలవారు, అగ్నిమాంద్యముగలవారు, రాజులు, మిగుల సౌఖ్యమునుగోరువారు వీరలు సర్వకాలములయందు సేవించవలయును. సేవించినచో దోషములనుపోగొట్టి బలమునుగలుగజేసును. మలమును బైలుపరచును. సుఖమునుగలుగజేసును. చెరుపును చేయనేరదు.

## ఉత్తర వస్తి.

శ్లో॥ వస్త్రారోగేషునారీణాం యోనిగర్భాశయేషుచ ।
ద్విత్రాస్థాపనశుద్ధేభ్యో విదధ్యాద్వస్తిముత్తరమ్ ॥ 70.

తా॥ స్త్రీపురుషులయొక్క వస్తిస్థానములో గలుగు రోగములయందును, స్త్రీలయొక్క యోని, గర్భాశయము వీనియందుగలుగు రోగములయందును, 2 లేక 3 సంఖ్యగల నిరూహవస్తులచే శుద్ధులుగనుండు స్త్రీపురుషులకును పిదప ఉత్తరవస్తినిచేయించవలయును. గుదమునకంటె ఉత్తరమార్గముగ ప్రయోగించబడుటవలన నీవస్తికి ఉత్తరవస్తియను నామముకలిగినది.

## ఉత్తరవస్తి - యంత్ర లక్షణము.

శ్లో॥ ఆతురాంగులమానేన తన్నేత్రంద్వాదశాంగుళమ్ ।
వృత్తంగోపుచ్ఛవన్మూల మధ్యయోఃకృతకర్ణికమ్ ॥ 71.
సిద్ధార్థకప్రవేశాగ్రం శ్లక్ష్ణంహేమాదిసంభవమ్ ।
కుందాశ్వమారసుమనః పుష్పవృంతోపమందృఢమ్ ॥ 72.

తా॥ ఉత్తరవస్తియొక్కయంత్రము రోగియొక్క అంగుళములవలన 12 అంగుళములప్రమాణము నిడుపుగలదిగ, ఆవుతోకవలె వర్తులముగ, మూలమునందు మధ్యమునందు కర్ణికలుగలదిగ, కొనయందు తెల్లఆవగింజ లోనప్రవేశించతగిన ద్వారముగలదిగ, నున్నగ, స్వర్ణాదులచే నిర్మించబడినదిగ, మృదువుగ, కుందము (అనగా మొల్ల) వాడగన్నేరు, జాజిఅనువాని పుష్పములయొక్క తొడిమలతో సమానమయినదిగ, దృఢముగనుండవలయును. ఇది పురుషులకుపయోగించునట్టి ఉత్తరవస్తియంత్రమని తెలియవలయును.



## ఉత్తరవస్తియందు స్నేహమాత్ర.

శ్లో॥ తస్యవస్తిర్మృదులఘు ర్మాత్రాశుక్తిర్వికల్ప్యవా ।

తా॥ ఆయంత్రమునందు మృదువుగ లఘువుగనుండు వస్తిని చేర్చవలయును. ఉత్తరవస్తియందు 2 కర్షములప్రమాణముగల స్నేహమునుగాని లేక బలము, వయస్సు, సత్వము, దేహము, సాత్మ్యము యీమొదలగువానిని విచారించి వానివానికనుగుణముగాగాని స్నేహమాత్రను ప్రయోగించవలయును.

## ఉత్తరవస్తి - ప్రయోగ క్రమము.

శ్లో॥ అథస్నాతాశితస్యాస్య స్నేహవస్తివిధానతః ॥ 73.
ఋజోస్సుఖోపవిష్టస్య పీఠేజానుసమేమృదా ।
హృష్టేమేఢ్రేస్థితేచర్జౌ శనైః స్రోతోవిశుద్ధయే ॥ 74.
సూక్ష్మాంశలాకాంప్రణయే త్తయాశుద్ధేనుసేవనీమ్ ।
ఆమేహనాంతంనేత్రంచ నిష్కంపంగుదవత్తతః ॥ 75.
* పీడితేంతర్గతేస్నేహే స్నేహవస్తిక్రమోహితః ।

తా॥ స్నేహవస్తిలోజెప్పియుండు విధిప్రకారము స్నానముచేసి భుజించినవాడై (అనగా స్నేహవస్తిలో జెప్పియుండునట్టి యాహారములను భుజించినవాడై) ఋజువుగనుండువాడు, మోకాలంతపొడవుగల ఆసనమునందు సుఖముగ కూర్చుండియుండువాడు నగుపురుషునియొక్క మేఢ్రము నిట్రబొడుచుకొని ఋజువుగనుండునపుడు సూక్ష్మమైన శలాకను స్రోతోమార్గశుద్ధ్యర్థమై మెల్లగ ప్రవేశింపజేయవలయును. శలాకు మేఢ్రము శుద్ధమైయుండగా సేవనీనాడిమొదలు మేఢ్ర అగ్రభాగమువరకు (అనగా 6 అంగుళములవరకు) గుదమునందు అనువాసనాదివస్తులను ప్రయోగించునటులనే ఆ యంత్రమును కదిలించకుండా ప్రయోగించవలయును. ప్రయోగించిన పిదప స్నేహము అంతర్గతమైయుండగా అనువాసన వస్తిలో జెప్పియుండు విధులను (అనగా అరచేతులచే స్ఫిక్‌దేశములయందు తాడనాదులను) చేయవలయును.

---

* పీడితేనుగతే ఇతిపా.

శ్లో॥ వస్తీననేనవిధినా దద్యాత్త్రీంశ్చతురోపివా ॥ 76.
అనువాసనవచ్ఛేషం సర్వమేవాస్యచింతయేత్ ।

తా॥ పై జెప్పిన క్రమమువలన 3 లేక 4 ఉత్తరవస్తులను ప్రయోగించవలయును. శేషించియుండు తక్కిన విధులవన్నిటిని అనువాసనమువలెనే యోచించుకొనవలయును.

"యథాశేషం ప్రవేశ్యాథ స్నేహస్యాగ్ధపలంనయేత్ । ప్రత్యాగతే ద్వితీయంవా తృతీయంవా ప్రదాపయేత్ । సచేదనువసేత్త్వత్ర స్యాత్త్రియేయంవిశేషతః । పిప్పల్యారగ్వధాంగార ధూమవత్సకసైంధవైః । మూత్రామ్లపిష్టైర్గుళికా స్వర్షపామాషసన్నిభాః । ఛాయానుశుష్కాస్తాశ్శిశ్నే దద్యాత్స్నేషపసన్నిభాః । పూర్వంమాషోపమాఃపశ్చాత్తాభిః స్నేహంసమానయేత్ । స్నేహేప్రత్యాగతేచస్యాదానువాసనికోవిధిః॥"

ఆ యంత్రముకొంచెముపైట మిగిలియుండునటుల శిశ్నములో ప్రవేశింపజేసి ½ పలము స్నేహములోన బ్రవేశించునటుల జేయవలయును. ఆ స్నేహము బైలుపడునపుడు 2 లేక ఆ 3 వర్తులు ప్రయోగించవలయును. ఆ స్నేహము బైలుపడకుండా లోననే నిలిచినయెడల పిప్పలి, రేలబొగ్గు. కరుధూపము, కొడిసె, సైంధవలవణము వీనిని గోమూత్రము, కాంజికామ్లము వీనితో బాగుగమర్దించి ఆవాలు, మినుములు వీనితో సమానమైన గుళికలుచేసి నీడనెండించి మేఢ్రమునందు తొలుత ఆవాలంత ప్రమాణము గల గుళికలను పిదప మినుములంత ప్రమాణముగల గుళికలను లోనప్రయోగించి ఆ స్నేహమును బైటికితేవలయును. స్నేహము బైలువెడలునపుడు అనువాసనములో జెప్పియుండువిధులను చేయవలయునని ఖరనాదమునందు చెప్పబడియున్నది.

## స్త్రీలకు - ఉత్తరవస్తి కాలము.

శ్లో॥ స్త్రీణామార్తవకాలేతు యోనిర్గృహ్ణాత్యపావృతేః ॥ 77.
విదధీతతదాతస్మా దనృతావపిచాత్యగే ।
యోనివిభ్రంశశూలేషు యోనివ్యాపదసృగ్దరే ॥ 78.

తా॥ "ఋతుస్తుద్వాదశనిశాః ఇత్యాది" వచనములచే జెప్పబడిన ఋతుకాలమునందు స్త్రీలకు యోనిమూయబడకుండుటవలన ఉత్తరవస్తిని గ్రహించును. ఇతర కాలములయందు యోనిమూయబడియుంటవలన గర్భమువలెనే స్నేహవస్తినికూడా గ్రహించకుండును. కాబట్టి యోనిమూయుబడకుండు ఋతుకాలమునందే ఉత్తరవస్తిని



చేయవలయును. యోనివిభ్రంశము, యోనిశూల, యోనివ్యాపత్తు, అసృగ్దరము యీ మొదలగుకష్టమైన రోగములుగలుగునపుడు ఋతుకాలమునకు వ్యతిరిక్తమైన కాలము నందుకూడా స్త్రీలకు ఉత్తరవస్తిని చేయువలయును.

## స్త్రీల - ఉత్తరవస్తి - యంత్ర లక్షణము.

శ్లో॥ నేత్రందశాంగుళంముద్గ ప్రవేశంచతురంగులమ్ ।
అపత్యమార్గేయోజ్యంస్యా ద్వ్యంగులంమూత్రవర్త్మని ॥ 79.
మూత్రకృచ్ఛ్రవికారేషు బాలానాంత్వేకమంగుళమ్ ।

తా॥ స్త్రీలకుప్రయోగించునట్టి ఉత్తరవస్తి యంత్రము 10 అంగుళములు నిడుపు, పెసరగింజ ప్రవేశించతగిన ద్వారముగల అగ్రప్రదేశము, పై జెప్పిన గోపుచ్ఛాకారము మొదలగు లక్షణములుగలదిగనుండవలయును. స్త్రీలకు ఉత్తరవస్తి చేయునపుడు ఆ యంత్రమును గర్భమార్గమునందు 4 అంగుళములు ప్రవేశింపజేయవలయును. రజస్వలకాని స్త్రీలకు మూత్రకృచ్ఛ్రాది రోగములలో మూత్రమార్గమునందు 2 అంగుళములు లోనయంత్రమును ప్రవేశింపజేయవలయును. బాలస్త్రీలకు మూత్రకృచ్ఛ్రాదిరోగములు కలిగియుండునపుడు 1 అంగుళప్రమాణముగల యంత్రమును మూత్రద్వారమునందు ప్రవేశింపజేయవలయును. "చతురంగులంయోజ్యం" అని చెప్పినందుచే నాయంత్రము లోనధికముగా ప్రవేశించకుండుటకై 4 అంగుళములకు పైన ఆ యంత్రమునకు కర్ణికయుండవలయునని స్పష్టమగుచున్నది.

## స్త్రీలకు - ఉత్తరవస్తి - స్నేహ ప్రమాణము.

శ్లో॥ ప్రకుంచోమధ్యమామాత్రా బాలానాంశుక్తిరేవతు ॥ 80.

తా॥ స్త్రీలకు ఉత్తరవస్తియందు స్నేహముయొక్క ప్రకుంచము మధ్యమమాత్ర, బాలురకు స్నేహముయొక్క శుక్తిప్రమాణము మధ్యమమాత్ర అని తెలియవలయును. మఱియును స్త్రీలకు ఉత్తమ, కనిష్ఠమాత్రలను ప్రయోగింపంజనదు.

## స్త్రీలకు - ఉత్తరవస్తి - ప్రయోగ క్రమము.

శ్లో॥ ఉత్తానాయాశ్శయానాయా స్సమ్యక్సంకోచ్యసక్థినీ ।
ఊర్ధ్వజాన్వాస్త్రిచతురా నహోరాత్రేణయోజయేత్ ॥ 81.
వస్తీంస్త్రిరాత్రమేవంచ స్నేహమాత్రాంవివర్ధయేత్ ।

తా॥ వెల్లకిలపరుండియుండునదియును, పొడువుగనెత్తబడినమోకాళ్ళుగలదియునగుస్త్రీకి తొడలను సంకోచముచేయించి 3 లేక 4 ఉత్తరవస్తులను ఒక అహోరాత్రమునందు ప్రయోగించవలయును. ఇటుల 3 దినములు ఉత్తరవస్తి చేయవల

యును. అటులజేయునపుడు స్నేహమాత్రను యథాక్రమముగా ½ కర్షము, కర్షము యీ ప్రమాణముచొప్పున వృద్ధిచేయవలయును. “ ఉత్తానాయాశ్శయానాయాః ” అని చెప్పియుండుటచే బోర్లగిల పరుండియుండునపుడును, ప్రక్కవాటుగా పరుండియుండునపుడును, కూర్చుండియుండునపుడును, స్త్రీలకు ఉత్తరవస్తిచేయకూడదని భావంబగుచున్నది.

శ్లో॥ త్ర్యహమేవచవిశ్రమ్య ప్రణిదధ్యాత్పునస్త్ర్యహమ్ ॥ 82.

తా॥ ఇటుల 3 దినములు ఉత్తరవస్తినిప్రయోగించి మరల 3 దినములువదలి మరల 3 దినములు పూర్వోక్తక్రమముగా ఉత్తరవస్తిని ప్రయోగించవలయును. ఇటులనే పురుషులయొక్క మేఢ్రమునందు ఉత్తరవస్తిప్రయోగము చేయవలయును.

వమనవిరేచనాది - కాలనిర్ణయము.

శ్లో॥ పక్షాద్విరేకోవమితే తతఃపక్షాన్నిరూహణమ్ ।
సద్యోనిరూఢశ్చాన్వాస్యః సప్తరాత్రాద్విరేచితః ॥ 83.

తా॥ ఉత్తమమైన శుద్ధిచే శుద్ధుడైన వమితునికి ఒక పక్షమునకు తర్వాత విరేకముచేయించవలయును. ఏలననగా:—ఉత్తమశుద్ధిచే శుద్ధుడైనవమితునికి 7 దినములలో పేయాదిక్రమముగా ప్రకృతిభోజనముకలుగుచున్నది. పిదప 7 దినములలో ఒక దినమువిడిచి ఒక దినము అనువాసనవస్తి ప్రయోగముచేయుటచే స్నిగ్ధుడుగనగుచున్నాడు. పిదప విరేచనము చేయించుకొనినవానికి 1 పక్షమునకుపైన నిరూహవస్తి చేయించవలయును. ఏలననగా:—విరేకము చేయించుకొనినవానికి 7 దినములలో ప్రకృతిభోజనముకలుగును. పిదప 7 దినములలో 1 దినమువిడిచి 1 దినము అనువాసనవస్తిని చేయుటచే స్నిగ్ధుడుగనగుచున్నాడు. నిరూహవస్తి చేయించుకొనినవానికి ఆదినమునందే అనువాసనవస్తిని చేయించవలయును. ఈయర్థమునే యీతంత్రకారుడు,—

“ అథవాతార్దితంభూయ స్సద్యఏవానువాసయేత్ ॥”

అనువచనముచే పూర్వమే చెప్పియున్నాడు. విరేకముచేయించుకొనినవానికి 7 దినములలో ప్రకృతిభోజనము కలుగుటవలన 7 దినములకుపైన అనువాసనవస్తిని చేయించవలయును.

వస్తికర్మదోషమును - హరింపజేసెడి క్రమము.

శ్లో॥ యథాకుసుంభాదియుతాత్తోయాద్రాగంహరేత్పటః ।
తథా ద్రవీకృతాద్దేహా ద్వస్తిర్నిర్హరతేమలాన్ ॥ 84.



తా॥ కుసుంభ కుంకుమాది ద్రవ్యములతోగూడియుండు ఉదకములోనుంచబడిన వస్త్రము కుసుంభాదులను గ్రహించకుండా యెఱుపు వర్ణమునుమాత్రము గ్రహించునటులనే ద్రవముగజేయబడిన దేహములో ధాతువులను వస్తికర్మహరించకుండా ఆధాతువులలో మిశ్రముగనుండు దోషములను మాత్రము హరింపజేసును.

వస్తికర్మ ప్రశంస.

శ్లో॥ శాఖాగతాఃకోష్ఠగతాశ్చరోగా మర్మోర్ధ్వసర్వావయవాంగజాశ్చ । యేసంతితేషాంనతుకశ్చిదన్యో వాయోఃపరంజన్మనిహేతురస్తి ॥ 85 ॥ విట్ శ్లేష్మపిత్తాది మలాచయానాం విక్షేపసంహారకరస్సయస్మాత్ । తస్యాతివృద్ధస్యశమాయ నాన్య ద్వస్తేర్వినా భేషజమస్తికించిత్ ॥ 86.

తా॥ శాఖలయందు (అనగా 2 తొడలు, 2 హస్తములయందు) జనించినదియును, కోష్ఠమునందు (అనగామహాస్రోతస్సుయందు) జనించినదియును, మర్మములు, మెడకొంకులకు పైబడినభాగములు, సర్వాంగము, అవయవములు వీనియందు జనించినదియును నగురోగములయొక్క ఉత్పత్తియందు వాతమునకంటె ముఖ్యమైన వేరే హేతువుయేదియును లేదు. ఏలననగా:—వాతము పురీష, శ్లేష్మ, పిత్త, మూత్ర, స్వేదాది మలసమూహముయొక్క విక్షేపము (అనగా చలనము) సంహారము వీనికి కారణముగనుండును. కాబట్టి వాతప్రకోపశమనార్థమై వస్తికర్మకంటె వేరెయొవ్విధమైన యౌషధమునులేదు. వాతముచలనముగలదియగుటచే పిత్తశ్లేష్మములను స్వస్థానములోనుండి చలింపజేసి బైలుపరచును. పిత్తశ్లేష్మములు చలనములేనివియగుటచే వాతమును చలింపజేయుటయందసమర్థములుగనుండును. మఱియును వాతహరణరూపమగు స్నేహస్వేదాద్యనేక చికిత్సలుండినను నవివాతమును నిశ్శేషముగా హరింపజేయుటయందసమర్థములుగనుండుటవలన వానినీతంత్రకారుడు గౌరవించకనుపేక్షించెను. మెడకొంకులకుపైన జనించునవి ముఖరోగాదులు. జ్వరాదులుసర్వాంగ జనితంబులు. శ్విత్రకుష్ఠాదులు అవయవజనితరోగంబులు. వాతము ముఖ్యమైన హేతువని చెప్పినందుచేతనే పిత్తశ్లేష్మములు ముఖ్యహేతువుకాకుండా వాతమునకు ఉపబలముగనుండునని యేర్పడుచున్నది. పైజెప్పిన రోగములనుగురించి ఉత్తరతంత్రములోపంచవిధులు స్పష్టముగా వివరించబడును.

శ్లో॥ తస్మాచ్చికిత్సార్ధఇతి ప్రదిష్టః కృత్స్నాచికిత్సాపిచవస్తిరేకైః ।
తథానిజాగంతువికారకారి రక్తౌషధత్వేనసిరావ్యధోపి ॥ 87.

తా॥ సర్వదోషములలో ప్రధానముగనుండు వాతమును శమనముచేయుటచే వస్తికర్మ చికిత్సలో ½ భాగమని ఆచార్యులచే జెప్పబడినది. కొన్నియాచార్యులు వస్తికర్మనే సంపూర్ణమైన చికిత్సయని చెప్పుచున్నారు. వస్తికర్మనే అర్ధచికిత్సయని, సంపూర్ణమైన చికిత్సయని చెప్పుపక్షములో సైద్వ్యావధాది విభాగములను, యితర చికిత్సలను విశేషముగ జెప్పునట్టి శాస్త్రములు వ్యర్థములగుననే యాక్షేపముకలుగును. అయినప్పటికిని వాతరోగములు 80 విధములని చెప్పబడియున్నవి. పిత్తశ్లేష్మరోగములు 2-నుచేరి 60 విధములనిచెప్పబడియున్నవి. పిత్తశ్లేష్మములకంటె ప్రధానముగనుండు వాతమునకు వస్తికర్మ ప్రధానచికిత్సయగుటవలన చికిత్సలోవస్తికర్మ అర్ధాంశమని చెప్పబడినది. లేక పిత్తము, శ్లేష్మము, మలము, వీనితోగూడియుండువాతమును వస్తికర్మనిశ్శేషముగా హరింపజేయుటవలన వస్తికర్మ సంపూర్ణమైనచికిత్సయని కొన్నియాచార్యులచే జెప్పబడినది.

"యానీహకర్మాణ్యుక్తాని విసర్పవినివృత్తయే । ఏకతస్తానిసర్వాణి రక్తమోక్షణమేకతః ॥"

విసర్పరోగనివృత్త్యర్థమై చెప్పబడియుండు సమస్తమైన చికిత్సలు 1 భాగము, రక్తమోక్షణము 1 భాగము, అనిచరకాచార్యుడుకూడా పైప్రకారమేచెప్పియున్నాడు వాతాదిదోషములచే జనించిననిజరోగములను. విషము, అగ్ని యీమొదలగువానిచే జనించిన ఆగంతుకరోగములను కలుగజేయునట్టిరక్తమునకు సిరావేధనము ముఖ్యచికిత్సగనుండుటవలన నాసిరావేధనమును చికిత్సార్ధభాగమని ఆచార్యులచే జెప్పబడినది. శీతోష్ణస్నిగ్ధరూక్షాదిచికిత్సలచే సాధ్యముగనుండు యితరమైనరోగములుకూడా సిరావేధనమువలన నివృత్తియగుచున్నది. కాబట్టి సిరావేధనమే సంపూర్ణమైన చికిత్సయని మతికొందరాచార్యులు వచింపుచున్నారు.

ఏకోనవింశాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు.

# వింశాధ్యాయము.

---

పంచకర్మలయొక్క ప్రస్తావమువలన వమన, విరేక, అనువాసన, నిరూహకర్మలంజెప్పి తదనంతరము యీయధ్యాయమునందు నస్యవిధిజెప్పబడుచున్నది.

## నస్యవిధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోనస్యవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ వస్తివిధ్యధ్యాయానంతరము నస్యవిధినిదెలిపెడు నస్యవిధ్యధ్యాయమును వివరించెదము.

### నస్యార్హమైన రోగములు.

శ్లో॥ ఊర్ధ్వజత్రువికారేషు విశేషాన్నస్యమిష్యతే ।
నాసాహిశిరసోద్వారం తేనతద్వ్యాప్యహంతితాన్ ॥ 1.

తా॥ మెడక్రొంకులకుపైనజనించు శిరోరోగము మొదలగువానియందు నస్యకర్మవిశేషముగా హితకరమైనదని ఆచార్యులచే జెప్పబడియున్నది. ఏలననగా:— నాసికము శిరస్సునకు ద్వారముగనుండుటవలన దానిమూలముగా నస్యము కర్ణములు, శృంగాటకము, నేత్రములు, కంఠము, శిరస్సు, ముఖము యీ మొదలగువానియందు ప్రవేశించి శిరమునందు వ్యాపించి వానియందు జనించునట్టి రోగములనుపోగొట్టును. "విశేషాత్" అని చెప్పినందుచేతనే పైజెప్పిన ఊర్ధ్వజత్రు రోగములయందు వమనసిరావ్యధాది చికిత్సలనుకూడా చేయందగునని భావంబగుచున్నది.

### నస్యత్రైవిధ్యము.

శ్లో॥ విరేచనంబృంహణంచ శమనంచత్రిధాపితత్ ।

తా॥ నస్యము విరేచనము, బృంహణము, శమనము అని 3 విధంబులు.

### విరేచన - నస్యోపయోగము.

శ్లో॥ విరేచనంశిరశ్శూల జాడ్యస్యందగలామయే ॥ 2.

శోఫగండక్రిమిగ్రంథి కుష్ఠాపస్మారపీనసే ।

తా॥ విరేచనమను నస్యము శిరశ్శూల, జడత్వము, స్యందము, కంఠరోగము, శోఫ, గండరోగము, కృమిరోగము, గ్రంథి, కుష్ఠము, అపస్మారము, పీనసము వీనియందు హితకరమైనది. ఊర్ధ్వజత్రురోగములలో చేరని అపస్మారముకూడా విరేచనమను నస్యముచే శమించుటవలన ఊర్ధ్వజత్రురోగములతో కూడా జేర్చి చెప్పబడినది. మఱియును విరేచనమును నస్యము కఫప్రకోపము, నోటియందరుచి, వాసన తెలియకుండుట. యీ మొదలగు రోగములయందును హితకరమైనదని తెలియవలయును.

## బృంహణ - నస్యోపయోగము.

శ్లో॥ బృంహణంవాతజేశూలే సూర్యావర్తేస్వరక్షయే ॥ 3.
నాసాస్యశోషేవాక్సంగే కృచ్ఛ్రబోధేఽపబాహుకే ।

తా॥ వాతజశూల, సూర్యావర్తమను శిరోరోగము, స్వరహాని, నాసికములు, నోరుయెండుట, వాగ్బంధము, అతి కష్టముమీద కండ్లుతెరుచుట, అపబాహుకమను వాతరోగము, వీనియందు బృంహణమను నస్యము హితకరమైనది.

## శమన - నస్యోపయోగము.

శ్లో॥ శమనంనీలికావ్యంగ కేశదోషాక్షిరాజిషు ॥ 4.

తా॥ నీలిక, వ్యంగము, తలవెంట్రుకలురాలుట, నేత్రరాజి, వీనియందుశమనమను నస్యముహితకరమైనది. నీలిక, వ్యంగము అనునీ 2 రోగములు క్షుద్రరోగప్రకరణమునందు చెప్పబడును.

## విరేచన నస్యోత్పత్తి.

శ్లో॥ యథాస్వంయోగికైఃస్నేహైర్యథాస్వంచప్రసాధితైః ।
కల్కక్వాథాదిభిశ్చాథ్యం మధుపట్వాసవైరపి ॥ 5.

తా॥ ఆయారోగానుగుణముగా మిరియములు, శొంఠి యీ మొదలగు ద్రవ్యములచే సంస్కారము చేయబడిన యోగార్హమైన అవతైలము మొదలగు వానిచేతను, కఫహరమయిన దింటెన మొదలగు వానికల్కము, క్వాథము, స్వరసము, యీ మొదలగువానిచేతను, తేనె, సైంధవాదిలవణములు, అసవమను మద్యవిశేషము, వీనిచేతను విరేచనమను నస్యముగలుగును.



## బృంహణ - శమన నస్యోత్పత్తి.

శ్లో॥ బృంహణంధన్వమాంసోత్థ రసాసృక్ఖపురైరపి ।
శమనంయోజయేత్పూర్వైః క్షీరేణచజలేనచ ॥ 6.

తా॥ జాంగలదేశమునజనించిన మాంసరసములచేతను, జాంగలదేశమునజనించిన జంతువులయొక్క రక్తములచేతను, ఖపురము (అనగాచెట్టుబంకలు) చేతను, పైజెప్పిన తీక్ష్ణగుణరహితమైన స్నేహములచేతను, బృంహణమను నస్యముగలుగును. పూర్వము చెప్పిన తీక్ష్ణగుణరహితమైన ఘృతాది స్నేహములచేతను, మాంసాదులచేతను, క్షీరము, ఉదకము వీనిచేతను శమనమనునస్యముగలుగును.—

“తత్రవాతాభిభూతేశిరసిదంతకేశశ్మశ్రుశాతదారుణకర్ణశూలక్ష్వేడనతిమిరస్వరోపఘాతనాసారోగముఖశోషేషు అకాలపలితప్రాదుర్భావేదారుణప్రతిబోధేవాతపైత్తికేషుచాన్యేషు ముఖరోగేషు వాతహరద్రవ్యసిద్ధేనస్నేహేనబృంహణమేవనస్యందేయమ్ । విరేచనంకఫాభివ్యాప్తకంఠశిరసాంనిద్రాభిభూతానాం శిరోగౌరవశూలార్ధావభేదక కృమిప్రతిశ్యాయాపస్మారఘ్రాణాజ్ఞానేష్వన్యేషు చోర్ధ్వజత్రుగదేషు కఫజేషువికారేషు।సమ్యగ్విరిక్తశిరసిసర్పిర్నస్తోనిషేచయేత్ । అవపీడంతుశిరసోవిరేచనవదభిష్యందసర్పదష్టవిసంజ్ఞేభ్యోదద్యాత్ । శిరోవిరేచనద్రవ్యాణామన్యతమమాసాద్యావపీడయేత్ । చేతోవికారక్రిమివిషాభిపన్నానాం చూర్ణంప్రధమేత్ । శర్కరేక్షురసఘృత మాంసరసానామన్యతమం క్షీణానాం శోణితపిత్తేచదద్యాత్ । కృశదుర్బలభీరుణాంసుకుమారస్యయాపితాస్సృజః స్నేహాశ్శిరశ్శోధ్యఃకల్కస్తైర్భోన్యథాహితః ॥”

ఆ 3 విధనస్యములలో శిరము వాతపీడితముగనుండునపుడును, దంతములు, కేశములు, శ్మశ్రువులు (అనగాగడ్డము, మీసముల వెంట్రుకలు) ఇవి ఊడిపడుట, దారుణమైన కర్ణశూల, క్ష్వేడనమను కర్ణరోగము, తిమిరవాతము, స్వరభంగము, నాసికారోగము, ముఖశోష, అకాలమున తలవెంట్రుకలునెరయుట, అతికష్టముమీద నేత్రములుతెరుచుట, యీ మొదలగు రోగములయందును, వాతపిత్తములచే గలిగిన యితరమైన ముఖరోగములయందును, వాతహరద్రవ్యములవలన సిద్ధముచేయబడిన స్నేహముచే బృంహణమను నస్యమునే చేయవలయును. కఫముచేవ్యాప్తమైన కంఠము, శిరముగలవారికిని,

నిదురచేపీడించబడినవారికిని, శిరోగౌరవము, శిరశ్శూల, అర్ధావభేదకము, కృమి రోగము, పీనసము, అపస్మారము, గంధాజ్ఞానముగలవారికిని, మెడకొంకులకు పైభాగమునందు యితరమైన రోగములుగలవారికిని, కఫజనితమైనరోగములుగలవారికిని, విరేచననస్యమును ప్రయోగించవలయును. బాగుగ విరేకమైనశిరముగలవారికి నాసికా ద్వారమువలన ఘృతమును ప్రయోగించవలయును. అభిష్యందము, సర్పదష్టవిషము, ఇవిగలవారలకు అవపీడనమనునస్యమును ప్రయోగించవలయును. మఱియు నాఅవపీడనమనునస్యమును శిరోవిరేచన ద్రవ్యములలో నేదైనా నొకదానిచేజేయవలయును. చిత్తవికారము, కృమిరోగము, విషము, వీనిచే పీడింపబడినవారికి చూర్ణమును ధమనముచేయవలయును. క్షీణులు, రక్తపిత్తరోగులు వీరలకు శర్కర, చెఱుకురసము, ఘృతము, మాంసరసము వీనిలోదేనిచేనైనా నస్యమును ప్రయోగించవలయును. కృశులు దుర్బలులు, భయపడువారు, సుకుమారులు, రక్తమోక్షణము చేయించుకొనినవారు వీరలకు శిరస్సును శోధించునట్టి స్నేహముగాని, కల్కముగాని హితకరమని సుశ్రుతమునందు చెప్పబడియున్నది.

మర్శ - ప్రతిమర్శనస్య స్నేహభేదములు.

శ్లో॥ మర్శశ్చప్రతిమర్శశ్చ దిధాస్నేహోమాత్రయా ।

తా॥ ఈనస్యభేదములయందు స్నేహము మాత్రా భేదముచేత మర్శము, ప్రతి మర్శము అనిద్వివిధంబుగనగును.

శిరోవిరేచన నస్యము.

శ్లో॥ కల్కాద్యైరవపీడస్తు తీక్ష్ణైర్మూర్ధవిరేచనః ॥ 7.

తా॥ అవపీడనమనునస్యము కల్కాదులచే జేయవలయునే కాని స్నేహముచే జేయంజనదు. మఱియు నాఅవపీడనము తీక్ష్ణమైన శుంఠ్యాదులయొక్క కల్కము, క్వాథము, రసము యీ మొదలగువానిచే జేయవలయునే కాని మృదువైన ద్రవ్యములచే జేయంజనదు. అవపీడనమను నస్యమునకు శిరోవిరేచనమనియు నామాంతరముగలదు.

శమనమును - విరేచన నస్యము.

శ్లో॥ ధ్మానంవిరేచనశ్చూర్ణో

తా॥ మిరియములు మొదలగువానిచే జేయబడినదియును, దోషములను బైలుపరచునదియునైన చూర్ణము ధ్మానమను పేరంబరంగునట్టి నస్యముగనగును.



విరేచన - నస్యోపయోగ క్రమము.

శ్లో॥ యుంజ్యాత్తింముఖవాయునా ।
షడంగులద్విముఖయా నాడ్యాభేషజగర్భయా ॥ 8.
సహిభూరితరందోషం చూర్ణత్వాదపకర్షతి ।

తా॥ ఆరు అంగుళములు నిడుపుగలదియును, ఊర్ధ్వాధో భాగములయందు రంధ్రముగలదియును, లోనత్రికటుకము మొదలగు నౌషధములచూర్ణముచే నిండించబడినదియునగు గొట్టముచే నాచూర్ణమును ముఖవాతమువలన లోనప్రవేశింపజేయవలయును. మఱియు నాచూర్ణములోనుండు అనేక దోషములను బైలుపరచును. అటులనేకల్కక్వాథాదులను ప్రయోగించవలయును. లోనుండు దోషములను వెలిపరచుటచే దీనికి విరేచనమను నామముకలిగినది.

నస్యౌషధ - ప్రమాణ వివరము.

శ్లో॥ ప్రదేశిన్యంగులీపర్వ ద్వయాన్మగ్నసముద్ధృతాత్ ॥ 9.
యావత్పతత్యసౌబిందు ర్దశాష్టౌషట్క్రమేణతే ।
మర్శస్యోత్కృష్టమధ్యోనా మాత్రాస్తావచక్రమాత్ ॥ 10.
బిందుద్వయోనాఃకల్కాదేః

తా॥ ఔషధములో జుట్టనవ్రేలిని 2 గణుపులవరకు లోనమునుగునటుల ప్రవేశింపజేసి దానితో బొట్టనవ్రేలినిజేర్చి యెత్తినయెడల నెంతయౌషధమువచ్చునో అది బిందువనబడును. అట్టి 10, 8, 6 సంఖ్యగలబిందువులు యథాక్రమముగా మర్శమను నస్యముయొక్క ఉత్కృష్టమాత్రగ, మధ్యమమాత్రగ, కనిష్ఠమాత్రగనగును. (అనగా 10 బిందువులు ఉత్కృష్టమాత్రయని, 8 మధ్యమమాత్రయని, 6 కనిష్ఠమాత్రయని భావము.) యథాక్రమముగా 2 బిందువులు తగ్గించబడినయెడల పైజెప్పినమాత్రలే కల్కస్వరసాదులకు ఉత్కృష్ట, మధ్యమ, కనిష్ఠమాత్రలుగనగును. (అనగా కల్కస్వరసాదులకు 8 బిందువులు ఉత్కృష్టమాత్రయని, 6 మధ్యమమాత్రయని, 4 కనిష్ఠమాత్రయని తాత్పర్యము.)

నస్యకర్మానర్హులు.

శ్లో॥ యోజయేన్నతునావనమ్ ।
తోయమద్యగరస్నేహ పీతానాంపాతుమిచ్ఛతామ్ ॥ 11.

భుక్తభక్తశిరఃస్నాత స్నాతుకామస్రుతాసృజామ్ ।
నవపీనసవేగార్త సూతికాశ్వాసకాసినామ్ ॥ 12.
శుద్ధానాం దత్తవస్తీనాం తథానార్తవదుర్దినే ।
అన్యత్రాత్యయికాద్వ్యాధేః

తా॥ ఉదకము, మద్యము, విషము, స్నేహము, వీనిని పానముచేసినవారు, పానముచేయుట కిచ్ఛయించువారు, అన్నమునుభుజించినవారు, శిరస్స్నానముచేసినవారు, చేయనిచ్ఛయించువారు, రక్తమోక్షణముచేయించుకొనినవారు, నూతనమయిన పీనసరోగముగలవారు, మలాదివేగములచే పీడించబడినవారు, ప్రసవించిన స్త్రీ, శ్వాసకాసరోగములుగలవారు, వమనవిరేచనములు చేయించుకొనినవారు, వస్తికర్మ చేయించుకొనినవారు. యీ మొదలగువారికిని, వర్షఋతువుకు వ్యతిరిక్తమైన దుర్దినమునందును, నస్యప్రయోగముచేయంజనదు. అయితే కష్టమైన రోగముగలిగియుండునపుడు పైనిషేధమును పాటించక నస్యప్రయోగము చేయవలయును. ఉదకాదులను పానముచేసినవారికిని, పానముచేయ నిచ్ఛయించువారికిని నస్యప్రయోగము చేసినయెడల నాసికము ముఖము వీనియందురోగములను శరీరమునందు తిమిరవాతమును, శిరోరోగములను గలుగజేసును. అన్నమును భుజించినవారికి నస్యప్రయోగము చేసినయెడల దోషములు ఊర్ధ్వస్రోతోమార్గముల నావరించివమనము, శ్వాసము కాసము, పీనసము, యీ రోగములనుగలుగజేసును. శిరస్స్నానముచేసినవారికి నస్యప్రయోగముచేసినయెడల శిరస్సు, నేత్రములు, కర్ణములు, వీనియందుశూల, కంఠరోగము, పీనసము, హనుస్తంభము, మన్యాస్తంభము, అర్దితవాతము, శిరఃకంపము యీ రోగములనుగలుగజేసును. స్నానముచేయనిచ్ఛయించువారికి నస్యప్రయోగముచేసినయెడలశిరమునందు దోషము స్తబ్ధమైజడత్వము, అరుచి, పీనసము యీరోగములనుగలుగజేసును. రక్తమోక్షణముచేయించుకొనినవారికి నస్యప్రయోగము చేసినయెడల శరీరకార్శ్యము, అరుచి, అగ్నిమాంద్యముగలుగును. నూతనమైన పీనసరోగముగలవారికి నస్యప్రయోగముచేసినయెడల స్రోతోమార్గప్రతిబంధమువలన గాఢమైన పీనసరోగము, కృమిరోగము, దురద, విచర్చిక అనునీరోగములుగలుగును. మలమూత్రాదివేగములవలన పీడించబడినవారికి నస్యప్రయోగముచేసినయెడల మలాదిధారణమువలన గలుగునట్టి రోగములను మిక్కుటముగాగలుగజేసును. ప్రసవించినస్త్రీకి నస్యప్రయోగముచేసినయెడల రక్తమోక్షణము చేయించుకొనినవానికి నస్యప్రయోగముచే జనించునట్టి రోగములేగలుగును. శ్వాసకాసరోగములుగలవారికి నస్యప్రయోగముచేసినయెడల వ్యాధి వృద్ధిజెందును. వమనవిరేచనములు చేయించుకొనినవారికి నస్యప్రయోగము చేసిన



యెడల శ్వాసము, కాసము, స్వరహాని, ఇంద్రియనాశము, శిరోగురుత్వము, కృమిరోగము, దురదగలుగును. వస్తికర్మచేయించుకొనినవారికి నస్యప్రయోగముచేసినయెడల వారిస్రోతోమార్గములు తెరవబడియుండుటవలన ఆనస్యము అధికముగా శరీరమునందు వ్యాపించి శ్వాసకాసాది రోగములను గలుగజేసును. వర్షఋతువుకంటె వ్యతిరిక్తమైన దుర్దినములయందు నస్యప్రయోగముచేసినయెడల శైత్యమువలన శీఘ్రములోనే శిరోరోగము, కంపము, స్తబ్ధత్వము, నోటిలోపలిదౌడ, నేత్రములు వీనియందు దురద, పాకము, మన్యాస్తంభము, కంఠరోగము, పీనసము, అరూంషిక యీ రోగములుగలుగును. ఇటువంటి నస్యదోషములు గలుగునపుడు ఆయాదోషముల యొక్క స్థానమును, దోషాధిక్యమును, ఆలోచించిస్నేహము, స్వేదము, శిరోవిరేకము ముఖలేపము, సేకము, తీక్ష్ణమైన అవపీడనము, ధూమము, గండూషము యీ మొదలగువానిని ఆయాదోషానుగుణముగా ప్రయోగించవలయును.—

"గర్భిణ్యాశ్చభక్తద్వేష జ్వరమూర్ఛార్ధావభేదకాస్స్యుః । అపత్యంచ వికలేంద్రియమున్మాదాపస్మారయుక్తంవాస్యాత్ । తత్రగర్భిణీరూక్షే నస్యకర్మణివర్షా భూకాకోలీకపికచ్ఛూభిఃశృతంపయఃపిబేత్ । బలావిదార్యంశుమతీమేదాభిరైవభిరేవచశృతం హవిర్వాతహరసిద్ధశ్చస్నేహశ్శిరో వస్తౌకర్ణపూరణేచయోజ్యః । సర్వంచబృంహణమన్నపానమ్ ॥"

గర్భిణీస్త్రీకి నస్యప్రయోగమువలన అన్నద్వేషము, జ్వరము, మూర్ఛ, అర్ధావభేదకము అనునీ రోగములుగలుగును. మఱియునుగర్భస్థశిశువుకు ఇంద్రియవైకల్యముగాని, లేక ఉన్మాద అపస్మారరోగములుగాని గలుగును. రూక్షకరమైన నస్యకర్మనుచేయించుకొనినగర్భిణిస్త్రీ గలిజేరు, కాకోలి, దురదగొండి వీనియుక్తముగ కాచబడినపాలను పానముచేయవలయును. మఱియు ముత్తవపులగము, నేలగుమ్మడు, ముయ్యాకుపొన్న, మేద వీనియుక్తముగ కాచబడినపాలనుగాని, ముత్తవపులగము మొదలగువానితోజేర్చి పక్వముచేయబడిన ఘృతమునుగాని ఉపయోగపరచవలయును. వాతహరద్రవ్యములచే సిద్ధముచేయబడిన స్నేహమును శిరోవస్తియందును, కర్ణపూరణమునందును ఉపయోగపరచవలయును. మఱియును బృంహణమైన సర్వాన్నపానములనుకూడా ఉపయోగపరచవలయును.

## నస్య - ప్రయోగ కాలము.

శ్లో॥ అథనస్యం ప్రయోజయేత్ ॥ 13.
ప్రాతఃశ్లేష్మణిమధ్యాహ్నే పిత్తేసాయంనిశోశ్చలే ।

తా॥ శ్లేష్మరోగములలో ప్రాతఃకాలమునందును, పిత్తరోగములలో మధ్యాహ్నమునందును, వాతరోగములలో సాయంకాలము రాత్రి వీనియందును నస్యప్రయోగము చేయవలయును.—

"లాలాస్రావసుప్తిప్రలాపదంతకటకటాయనక్రథనకృచ్ఛ్రోన్మీలనపూతిముఖకర్ణనాదార్దితశిరోరోగశ్వాసకాసోన్నిద్రేషు రాత్రౌ"

జొల్లుకారుట, నిద్రించునపుడు ప్రలాపించుట, కటకటయని దంతములనుకొరుకుట, నిద్రలోమూలుగుట, అతికష్టముమీద నేత్రములుతెరుచుట, నోటియందు దుర్గంధము వేసుట, కర్ణములయందుఘోష, అర్దితవాతము, శిరోరోగము, శ్వాసకాసములు, నిద్రాధిక్యము యీరోగములయందు రాత్రులయందు నస్యప్రయోగము చేయవలయును. అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

శ్లో॥ స్వస్థవృత్తేతుపూర్వాహ్ణే శరత్కాలవసంతయోః ॥ 14.
శీతేమధ్యందినే గ్రీష్మే సాయంవర్షాసుసాతపే ।

తా॥ స్వస్థవృత్తునికి శరద్వసంత ఋతువులయందు ప్రాతఃకాలమునందును, హేమంతశిశిరఋతువులయందు మధ్యాహ్నమునందును, గ్రీష్మ ఋతువునందు సాయంకాలమునందును, వర్ష ఋతువునందు సూర్యుడు ప్రకాశింపుచు యెండతోగూడుకొని యుండునపుడును, నస్యప్రయోగము చేయవలయును.

## వాత - హిధ్మాదిరోగములయందు - నస్యప్రయోగ కాలము.

శ్లో॥ వాతాభిభూతేశిరసి హిధ్మాయామపతానకే ॥ 15.
మన్యాస్తంభేస్వరభ్రంశే సాయంప్రాతర్దినేదినే ।
ఏకాహాంతరమన్యత్ర సప్తాహంచతదాచరేత్ ॥ 16.

తా॥ వాతపీడతోగూడియుండు శిరముగలవానికిని, హిధ్మ, అపతానకము, మన్యాస్తంభము, స్వరభ్రంశము, అనునీ రోగములయందును ప్రతిదినము సాయం ప్రాతఃకాలములయందు నస్యప్రయోగము చేయవలయును. పైజెప్పినవానికంటె నితరరోగములయందు మధ్య నొక్కొకదినము వదలి 7 దినములు సాయంప్రాతఃకాలములయందు నస్యప్రయోగము చేయవలయును. అయితే 7 దినములకుపైన నస్యప్రయోగము చేయంజనదు.

## నస్యప్రయోగ క్రమము.

శ్లో॥ స్నిగ్ధస్విన్నోత్తమాంగస్య ప్రాక్కృతావశ్యకస్యచ ।
నివాతశయనస్థస్య జత్రూర్ధ్వం స్వేదయేత్పునః ॥ 17.



అథోత్తానర్జుదేహస్య పాణిపాదే ప్రసారితే ।
కించిదున్నతపాదస్య కించిన్మూర్ధనినామితే ॥ 18.
నాసాపుటంపిధాయైకం పర్యాయేణనిషేచయేత్ ।
ఉష్ణాంబుతప్తంభైషజ్యం ప్రణాడ్యాపిచునాథవా ॥ 19.

తా॥ శిరమునకు తొలుత స్నేహకర్మ పిదప స్వేదకర్మ చేయించుకొనినవాడును, తొలుత నావశ్యకమైన మలమూత్రోత్సర్గదంత ధావనాదికృత్యములను చేసినవాడును, వాతములేని ప్రదేశమునందు శయనముచేయుచుండువాడు నగుపురుషునికి మెడకొంకులకు పైభాగమునందు మరల స్వేదకర్మచేయించవలయును. పిదప ఋజువుగా వెల్లకిలపరుండియుండు శరీరముగలవాడు, కొంచెము పొడవుగ నెత్తబడిన కాళ్లుగలవాడు నగుపురుషునియొక్క హస్తపాదములను బాగుగజాచునటులను, శిరమును కొంచెము వంగునటులను చేయించి ఒకనాసికాద్వారమునుమూసి గొట్టముచేగాని, ప్రత్తిచేగాని, ఉష్ణజలముచేతప్తమైన యౌషధమును పర్యాయముగా ప్రయోగించవలయును. పర్యాయమనగా:—ఒకనాసికనుమూసి మఱియొక దానిలో నౌషధమునువిడిచి దానిని మూసి మఱియొక దానిలో నౌషధమును విడుచుటయని యర్థము.

## నస్యప్రయోగానంతర కర్తవ్యము.

శ్లో॥ దత్తేపాదతలస్కంధ హస్తకర్ణాదిమర్దయేత్ ।

తా॥ అటుల నస్యప్రయోగముచేయుచుండగా అఱకాలు, భుజములు, హస్తములు, చెవులు, మెడ, నుదురు వీనిని మర్దించవలయును:—

"వస్త్రాచ్ఛాదితనేత్రాయ ప్రదేశిన్యోన్నామితనాసికాగ్రాయ దక్షిణహస్తేన స్నేహముష్ణాంబుతప్తం రజతాదిశుక్తీనామన్యతమస్థం అనవచ్ఛిన్నధారంసించేత్ ॥"

నస్యకర్మజేసుకొనువాని నేత్రములను వస్త్రముచేమూసి నాసికాగ్రమును జుట్టనవ్రేలివలన నూర్ధ్వముగనెత్తి ఉష్ణోదకముచే తప్తముగను, రజతాది పాత్రలయందుంచబడినదిగ నుండుయౌషధమును దక్షిణహస్తముచే నొకటే ధారగవిడువవలయునని సుశ్రుతమునందు చెప్పబడియున్నది.

శ్లో॥ శనైరుచ్ఛింద్యనిష్ఠీవేత్పార్శ్వయోరుభయోస్తతః ॥ 20.

తా॥ అటుల మర్దించినపిదప కఫమునుభుజించకుండా మెల్లగపార్లి కఫముతో గూడియుండు మలములను 2 పార్శ్వములవలన కారియుమివేయవలయును. అటుగాక

భుజించినచో జాఠరాగ్నినాశము దోషవృద్ధిగలుగును. ఒక పార్శ్వముచే కారియుమి వేసినచో ఔషధము సర్వసిరలయందు వ్యాపించనేరదు.

## నస్యప్రయోగ క్రమము.

శ్లో॥ ఆభేషజక్షయాదేవం ద్విస్త్రిర్వాపనస్యమాచరేత్ ।

తా॥ పైజెప్పిన క్రమప్రకారము ఔషధము నిశ్శేషమగువరకు 2 పర్యాయములుగాని లేక 3 పర్యాయములుగాని నస్యమును ప్రయోగించవలయును. నస్యమాత్రను ఒకటేమారు వేయవలయును. ఔషధమును హీనప్రమాణముగా ప్రయోగింపంజనదు. ఏలననగా:—హీనప్రమాణముగా ప్రయోగించబడిన యౌషధము దోషములను స్వస్థానములోనుండి చలింపజేసి వెలుపరచక గురుత్వము, అరుచి, కాసము, ప్రసేకము, పీనసము, వాంతి, కంఠరోగము యీ మొదలగువానిని గలుగజేసును. అధికమాత్రగా ప్రయోగించబడిన యౌషధము అతియోగమువలన విశేషదోషములనుగలుగజేసును. ఒకటేపర్యాయము ఔషధమునుయావత్తు ప్రయోగించిన యెడల శిరోరోగము, పీనసము, ఘ్రాణక్లేదము, ఉచ్ఛ్వాసము వెడలకుండుట యీ మొదలగు నుపద్రవములను గలుగజేసును, నస్యౌషధమును అత్యుష్ణముగా ప్రయోగించినయెడల తాపము, పాకము, జ్వరము, రక్తాంగత్వము, మూర్ఛ, భ్రమగలుగును. అతిశీతముగా ప్రయోగించినయెడల హీనమాత్రగల నస్యౌషధప్రయోగమునకు జెప్పబడినరోగములనే గలుగజేసును. మిగులపొడవుగనెత్తబడిన శిరముగలవానికి నస్యప్రయోగముచేసినయెడల హీనమాత్రవిషయములో జెప్పబడిన రోగములేగలుగును. మిక్కుటముగవంచబడిన శిరముగలవానికి నస్యౌషధప్రయోగము చేసినయెడల నాయౌషధము శరీరమునందధికముగా వ్యాపించి మూర్ఛ, జడత్వము, జ్వరము వీనిని గలుగజేసును. శరీరమును సంకోచపరచుకొని యుండువానికి నస్యౌషధప్రయోగము చేసినయెడల అదిధమనులయందు బాగుగా వ్యాపించకనే దోషములను స్వస్థానములోనుండి చలించునటుల మాత్రముజేసును.

## నస్యజ - మూర్ఛా చికిత్స.

శ్లో॥ మూర్ఛాయాంశీతతోయేన సించేత్పరిహరన్ శిరః ॥ 21.

తా॥ నస్యప్రయోగముచేయునపుడు మూర్ఛగలుగుపక్షములో శీతోదకము వలన శిరస్సు తప్ప తక్కినయంగములను తడుపవలయును.—

"నచనస్యేదీయమానేకోపహాస వ్యవహారస్వప్నోచ్ఛేదనాన్యాచరేత్ । తథాహిశిరోరుక్ప్రతిశ్యాయ కాసతిమిరఖలితపలితవ్యంగతిలకాలకముఖ



దూషకానాంసంభవః ॥"

నస్యప్రయోగము చేయునపుడు కోపము, నవ్వు, సంభాషణము, శరీరచలనము, ఉచ్ఛేదనము యీ మొదలగువానిని చేయంజనదు. చేసినచో శిరోరోగము, పీనసము, కాసము, తిమిరము, ఖలితము, పలితము, వ్యంగము, తిలకాలకము, ముఖదూషకము అనునీ రోగములుగలుగును. అని సంగ్రహమునందు చెప్పబడియున్నది.

## విరేచన - నస్యానంతర కర్తవ్యము.

శ్లో॥ స్నేహంవిరేచనస్యాంతే దద్యాద్దోషాద్యపేక్షయా ।

తా॥ విరేచన నస్యముయొక్క అంతమునందు దోష, దేశ, సాత్మ్యములకనుగుణముగా స్నేహప్రయోగము చేయవలయును.—

"అథనస్యార్హంనరమవ్యాహతవేగం ధౌతాంతర్బహిర్ముఖమవస్థిత శిరసంప్రాయోగిక ధూమపాన విశుద్ధస్రోతసం శ్వాస్తీర్ణనివాతశయనస్థముత్తానశీర్షమీషదున్నతపాదం ప్రసారితచరణంచ జతూర్ధ్వంపాణితాపేనపునఃపునఃస్వేదయేత్ ॥"

మలమూత్రాదివేగముల నడ్డగించనివాడు, శుద్ధమైన అంతర్బహిర్ముఖముగలవాడు, కొంచెమువంచబడిన శిరముగలవాడు, ధూమపానముచే శుద్ధమైన స్రోతస్సులుగలవాడు, గాలిలేనిప్రదేశమునందు బాగుగపరచబడిన శయనములో కొంచెముయెత్తుగనుండు దిండునుతలక్రిందనునుచుకొని వెల్లకిలపరుండియుండువాడు, కొంచెముపొడవుగనెత్తబడి జాచబడినపాదములుగలవాడు నగునస్యార్హపురుషునికి మెడకొంకులపైభాగములో పాణితాపముచే పలుమారు స్వేదకర్మచేయించవలయును. అని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది.

శ్లో॥ నస్యాంతేవాక్ఛతంతిష్ఠేదుత్తానః

తా॥ నస్యప్రయోగముయొక్క అంతమునందు 100 మాత్రాకాలము వెల్లకిలపరుండినవాడై నిద్రించవలయును.

శ్లో॥ ధారయేత్తతః ॥ 22.

ధూమంపీత్వాకవోష్ణాంబు కబళాన్ కంఠశుద్ధయే ।

తా॥ పిదప కంఠశుద్ధ్యర్థము ఆయాయోగములలో జెప్పియుండు విరేచనాది ధూమపానములలో దేనినైన నొకదానిని పానముజేసి కొంచెము ఉష్ణముగనుండు

ఉదకకబళములను ధరించవలయును. పిదప స్నేహపానమునందు చెప్పియుండువిధుల ననుష్ఠించవలయును.

బాగుగ - స్నిగ్ధమైన - శిరో లక్షణము.

శ్లో॥ సమ్యక్స్నిగ్ధేసుఖోచ్ఛ్వాస స్వప్నబోధాక్షపాటవమ్ ॥ 23.

తా॥ శిరము బాగుగా స్నిగ్ధమైయుండునపుడు సుఖముగ ఉచ్ఛ్వాస నిశ్వాసములు, సుఖకరమైననిద్ర, సుఖముగనిదురలోనుండి మేలుకొనుట, ఇంద్రియ పాటవము ఇవిగలుగును.

“సమ్యక్స్నిగ్ధేమూర్ధ్నివిరిక్తేవాసుఖోచ్ఛ్వాసనిశ్వాససుఖసుప్తబోధాక్షి పాటవానిస్యుః”

అనిపైయర్థమే అష్టాంగసంగ్రహమునందును చెప్పబడియున్నది.

రూక్షగనుండు - శిరో లక్షణము.

శ్లో॥ రూక్షేఽక్షిస్తబ్ధతాశోషో నాసాస్యేమూర్ధశూన్యతా ।

తా॥ శిరస్సు రూక్షగనుండునపుడు నేత్రములయందు స్తబ్ధత్వము, నాసికము, ముఖము వీనియందుశోష, మూర్ధశూన్యత గలుగును.

అతిస్నిగ్ధ - శిరో లక్షణము.

శ్లో॥ స్నిగ్ధేతికండూర్గురుతా ప్రసేకారుచిపీనసాః॥ 24.

తా॥ శిరస్సు అతిస్నిగ్ధముగనుండునపుడు గురద, గురుత్వము, నోటనీరూరుట, అరుచి, పీనసముగలుగును.

సువిరిక్త - శిరో లక్షణము.

శ్లో॥ సువిరిక్తేఽక్షిలఘుతా స్వరవక్త్రవిశుద్ధయః ।

తా॥ శిరము బాగుగ విరేకమైయుండగా నేత్రములకు లఘుత్వము, స్వరశుద్ధి, ముఖశుద్ధి, (అనగా నోటిశుద్ధి) గలుగును.

దుర్విరిక్తాది - శిరో లక్షణము.

శ్లో॥ దుర్విరిక్తేగదోద్రేకః క్షామతాతివిరేచితే ॥ 25.

తా॥ శిరమునందు బాగుగవిరేకముకాకుండునపుడు రోగాధిక్యముగలుగును. అతివిరేకముగలిగినపుడు కార్శ్యముగలుగును.



ప్రతిమర్శ - స్నేహ ప్రయోగార్హులు.

శ్లో॥ ప్రతిమర్శఃక్షత * క్షామబాలవృద్ధసుఖాత్మసు ।
ప్రయోజ్యోఽకాలవర్షేపి

తా॥ క్షతుడు, కృశుడు, బాలుడు, వృద్ధుడు, సుఖి, వీరి విషయమునందును, అకాలవర్షమునందును, పైజెప్పిన ప్రతి మర్శమును ప్రయోగించవలయును.

ప్రతిమర్శ - స్నేహ నిషిద్ధులు.

శ్లో॥ నత్వేష్టోదుష్టపీనసే ॥ 26.
మద్యపీతేఽబలశ్రోత్రే కృమిదూషితమూర్ధని ।
ఉత్క్లిష్టోత్క్లిష్టదోషేచ హీనమాత్రతయాహిసః ॥ 27.

తా॥ నాసారోగ ప్రకరణములోజెప్పబడు దుష్టపీనసరోగముగలవాడు, మద్యపానముచేసినవాడు, కర్ణద్వార ప్రతిబంధముగలవాడు, కృములచే దూషించబడిన శిరముగలవాడు, వృద్ధిజెందినదియును, స్వస్థానములోనుండి చలించినదియునైన దోషములుగలవాడు యీమొదలగువారలకు ప్రతిమర్శమును ప్రయోగించంజనదు. ఏలననగా:—ప్రతిమర్శము హీనమాత్రగలదిగనుండుటవలన దోషములను స్వస్థానములోనుండి చలింపజేసును.

ప్రతిమర్శ - ప్రయోగ కాలము.

శ్లో॥ నిశాహర్భుక్తవాంతాహః స్వప్నాధ్వశ్రమరేతసామ్ ।
శిరోభ్యంజనగండూష ప్రస్రావాంజనవర్చసామ్ ॥ 28.
దంతకాష్ఠస్యహాసస్య యోజ్యోంతేఽసౌద్విబిందుకః ।

తా॥ రాత్రి, మధ్యాహ్నము, భోజనము, వమనము, పగటినిద్ర, మార్గసంచారము, శ్రమ, మైథునము, శిరోభ్యంగము, గండూషము, మూత్రోత్సర్జనము, అంజనము, మలవిసర్జనము, దంతకాష్ఠభక్షణము, నవ్వుఅనునీ 15 కాలములయొక్క అంతమునందు 2 బిందువుల ప్రమాణముగల పైజెప్పిన ప్రతిమర్శమను నస్యమును ప్రయోగించవలయును.

ప్రతిమర్శ - ప్రయోగ ఫలము.

శ్లో॥ పంచసుస్రోతసాంశుద్ధిః క్లమనాశస్త్రిషుక్రమాత్ ॥ 29.

* క్షీణ ఇతి పా.

దృగ్బలంపంచసుతతో దంతదార్ఢ్యంమరుచ్ఛమః ।

తా॥ ప్రతిమర్శమను నస్యమును పైజెప్పిన 15 కాలములలో రాత్రి, మధ్యాహ్నము, భోజనము, వమనము, పగటినిద్ర అనునీ ఐదింటియొక్క అంతమునందు ప్రయోగించినయెడల స్రోతస్సులకు శుద్ధిగలుగును. మార్గసంచారము, శ్రమ, మైథునము అనునీ మూటియొక్క అంతమునందు ప్రయోగించినయెడల శ్రమనశించుటయే గాక మనఃప్రసాదము, శిరోలాఘవముగలుగును. శిరోభ్యంగము, గండూషము, మూత్రోత్సర్గము, అంజనము, మలోత్సర్జనము అనునీ ఐదింటియొక్క అంతమునందు ప్రయోగించినయెడల దృష్టికిబలముగలుగును. దంతకాష్ఠము, నవ్వు వీనియంతమునందు ప్రయోగించినయెడల యథాక్రమముగా దంతములకు దృఢత్వము, వాతశమనము గలుగును.

## నస్యధూమాది - ప్రయోగానర్హులు.

శ్లో॥ ననస్యమూనసప్తాబ్దే నాతీతాశీతివత్సరే ॥ 30.
నచోనాష్టాదశేధూమః కబళోనోనపంచమే ।
నశుద్ధిరూనదశమే నచాతిక్రాంతసప్తతౌ ॥ 31.

తా॥ ఏడు సంవత్సరముల వయస్సుకు లోబడినవానికిని, 80 సంవత్సరముల వయస్సుకు పైబడినవానికిని నస్యప్రయోగము చేయంజనదు. 18 సంవత్సరములు పూర్తికాకుండువానికి ధూమమును ప్రయోగించంజనదు. 5 సంవత్సరములు పూర్తికానివానికి కబళమును ప్రయోగించంజనదు. 10 సంవత్సరములకంటె తక్కువైన వయస్సుగలవారికిని, 70 సంవత్సరముల వయస్సుకు పైబడినవారికిని వమనవిరేకము మొదలగు శుద్ధిప్రయోగము చేయంజనదు.

## ప్రతిమర్శ ప్రశంస.

శ్లో॥ ఆజన్మమరణంశస్తః ప్రతిమర్శస్తువస్తివత్ ।
మర్శవచ్చగుణాన్కుర్యాత్సహినిత్యోపసేవనాత్ ॥ 32.
నచాత్రయంత్రణానాపి వ్యాపదోభయమర్శవద్భయమ్ ।

తా॥ ప్రతిమర్శమునునస్యము వస్తివలెనే జననము మొదలుకొని మరణమువరకు హితముగనుండును. మఱియు నాప్రతిమర్శము మర్శమునుదానివలెనే సుఖోచ్ఛ్వాసాదిగుణములను సదాభ్యాసమువలన గలుగజేసును. ప్రతిమర్శమను నస్యమునందు "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" శ్లోకములచేజెప్పబడినపథ్యము ననుసరించవలసిన నిర్బంధము లేదు. మర్శమునందుగలుగు నేత్రస్తబ్ధత్వాది రోగభయమును లేదు.



## నస్యవిషయమునందు - తైల ప్రాశస్త్యము.

శ్లో॥ తైలమేవచనస్యార్థే నిత్యాభ్యాసేనశస్యతే ॥ 33.
శిరసఃశ్లేష్మధామత్వాత్ స్నేహాఃస్వస్థస్యనేతరే ।

తా॥ శిరస్సు కఫమునకుస్థానము. అట్లగుటవలన తైలము నిత్యాభ్యాసముచే నస్యవిషయమునందు శ్రేష్ఠముగనుండును. ఇతరమైన స్నేహములు శ్లేష్మకారులగుటచే నస్యవిషయమునందు అశ్రేష్ఠంబులు.

## మర్శ - ప్రతిమర్శ - గుణ భేదములు.

శ్లో॥ ఆశుకృచ్చిరకారిత్వం గుణోత్కర్షాపకృష్టతా ॥ 34.
మర్శేచప్రతిమర్శేచ విశేషోనభవేద్యది ।
కోమర్శంసపరీహారం సాపదంచభజేత్తతః ॥ 35.
అచ్ఛపానవికారాఖ్యౌ కుటీవాతాతపస్థితీ ।
అన్వాసమాత్రావస్తీచ తద్వదేవచనిర్దిశేత్ ॥ 36.

తా॥ మర్శము శీఘ్రముగా గుణమునుగలుగజేసును. ప్రతిమర్శము ఆలస్యముమీద గుణమును గలుగజేసును. మర్శము ఉత్కృష్టమైన గుణములుగలది. ప్రతిమర్శము హీనమైనగుణములుగలది. మర్శమునందును ప్రతిమర్శమునందును భేదము లేక పోవునేని పరిహారముతోను వ్యాపత్తుతోను గూడినదిగనుండు మర్శము నొకడును సేవించనేరడు. (కాబట్టి యీ 2-టికి భేదము చెప్పబడినది.) మర్శ, ప్రతిమర్శ భేదమువలెనే అచ్ఛపానము, వికారము అనెడి పేర్లుగల స్నేహములకును, కుటీప్రవేశము, వాతాతపస్థితి అనెడిపేర్లుగల 2 రసాయనములకును, అనువాసనవస్తి, మాత్రావస్తి, అనునీ 2 వస్తికర్మలకును యథాక్రమముగా శీఘ్రకారిత్వము, ఉత్కృష్టగుణము, చిరకారిత్వము, హీనగుణముగలిగియుండునని తెలియవలయును.

## అణుతైల లక్షణము.

శ్లో॥ జీవంతీజలదేవదారుజలదత్వక్సేవ్యగోపీ హిమందార్వీత్వఙ్మ
ధుకప్లవాగురువరాపుండ్రాహ్వబిల్వోత్పలమ్ । ధావన్యౌ
సురభిఃస్థిరేకృమిహరంపత్రంత్రుటింరేణుకం కింజల్కంకమ
లాహ్వయంశతగుణేదివ్యేంభసిక్వాథయేత్ ॥ 37 ॥ తైలా
ద్రసందశగుణంపరశేష్య తేన తైలంపచేచ్చసలిలేనదశైవ

వారాన్ । పాకేక్షిపేచ్చదశమేసమమూజదుగ్ధం నస్యంమహా
గుణముశంత్యణుతైలమేతత్ ॥ 38.

తా॥ మనుబాల, కురువేరు, దేవదారు, తుంగముస్తెలు, లవంగపుచెక్క, వట్టివేరు, సుగంధిపాల, కర్పూరము, మ్రానిపసపు, ఇప్ప, ప్లవంఅనగా కలుజువ్వి, అగరు, త్రిఫలములు, పౌండరీకము, మారేడు, కలువ, ములక, వాకుడు, అందుగు, ముయ్యాకుపొన్న, కోలపొన్న, వాయువిడంగములు, తాళిసెపత్రి, ఏలకలు, రేణుకలు, పూదారములు, తామరపువ్వు అనునీద్రవ్యములను తైలమునకంటె 100 భాగము లధికముగనుండు దివ్యోదకములోవేసి తైలమునకంటె 10 భాగము లధికముగా రసము శేషించునటుల కషాయముకాచి ఆకషాయముచే తైలమును 10 మార్లు పాకము చేయవలయును. 10-వ పాకములో తైలమునకు సమముగ మేకపాలనుచేర్చి మరలపాకము చేయవలయును. ఇటులజేసినయెడల నిది గుణాధిక్యముగల అణుతైలమనబడునని వైద్యశాస్త్రజ్ఞులువచించెదరు. అణుతైలమనగా:—సూక్ష్మరూపముగల యింద్రియముల లోను, స్రోతస్సులలోను ప్రవేశించతగిన తైలమనియర్థము.

నస్యశీలన ఫలము.

శ్లో॥ ఘనోన్నతప్రసన్నత్వక్ స్కంధగ్రీవాస్యవక్షసః ।
దృఢేంద్రియా స్త్వపలితా భవేయుర్నస్యశీలినః ॥ 39.

తా॥ నస్యపరిశీలన చేయుచుండుమనుజులు గట్టిగ, ఉన్నతముగ, ప్రసన్నముగనుండుత్వక్కు, భుజములు, మెడ, ముఖము, రొమ్ముగలవారుగ, ఇంద్రియపుష్టి గలవారుగ, పలితములేనివారుగ నయ్యెదరు.

వింశాధ్యాయము, ముగిసెను.

---

శ్రీరస్తు.

# ఏకవింశతితమాధ్యాయము.

---

ఊర్ధ్వాంగచికిత్సాప్రసంగమువలన నస్యవిధ్యధ్యాయానంతరము ధూమపానవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

ధూమపాన - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోధూమపానవిధి మధ్యాయంవ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః ॥

తా॥ నస్యవిధ్యధ్యాయానంతరము ధూమపానవిధ్యధ్యాయమును వివరించెదము.

ధూమపాన ప్రయోజనము.

శ్లో॥ జతూర్ధ్వంకఫవాతోత్థ వికారాణామజన్మనే ।
ఉచ్ఛేదాయచజాతానాం పిబేద్ధూమంసదాత్మవాన్ ॥ 1.

తా॥ బుద్ధిమంతుడగుమనుజుడు (అనగా హితాహారవిహారముల సేవించుచుండువాడు) మెడకొంకులకు ఊర్ధ్వప్రదేశమునందు శ్లేష్మవాతములచే రోగములు గలుగకుండుటకును, జనించిన రోగనివారణార్థంబును ధూమము నెల్లపుడు పానము చేయవలయును.

వాతాదులయందు - ధూమప్రయోగ క్రమము.

శ్లో॥ స్నిగ్ధోమధ్యఃసతీక్ష్ణశ్చ వాతేవాతకఫేకఫే । యోజ్యో౽ః

తా॥ ధూమము స్నిగ్ధము, మధ్యము, తీక్ష్ణము అనిత్రివిధంబు. ఆ 3 విధములైన ధూమములను వాతాదులయందు యథాక్రమముగా (అనగా వాతమునందు స్నిగ్ధధూమమును వాతకఫమునందు మధ్యధూమమును, కఫమునందు తీక్ష్ణధూమమును) ప్రయోగించవలయును.

రక్తపిత్తాదిరోగములయందు - ధూమపాన నిషేధము.

శ్లో॥ నరక్తపిత్తార్తి విరిక్తోదరమేహిషు ॥ 2.

తిమిరోర్ధ్వానిలాధ్మాన రోహిణీదత్తవస్తిషు ।
మత్స్యమద్యదధిక్షీర క్షౌద్రస్నేహవిషాశిషు ॥ ౩.
శిరస్యభిహతేపాండు రోగేజాగరితేనిశి ।

తా॥ రక్తపిత్తము, ఉదరరోగము, మేహరోగము, తిమిరము, ఊర్ధ్వవాతము, ఆధ్మానము, రోహిణి అనునీరోగములుగలవారు, విరేకము, వస్తికర్మ వీనిని చేయించు కొనినవారు; మత్స్యములు, మద్యము, పెరుగు, పాలు, తేనె, స్నేహము, విషము వీనిని భుజించినవారు; శిరోభిఘాతము, పాండురోగముగలవారు; రాత్రిజాగరణము చేసినవారు వీరలుధూమపానముచేయంజనదు. వాతము, వాతకఫము, కఫము వీని యందు ధూమపానము చేయవలయునని పూర్వశ్లోకములో చెప్పినందుచేతనే పిత్త రోగముగలవారు స్నేహపానముచేయకూడదని సిద్ధంబగుచున్నది. అట్లుండగా రక్త పిత్తరోగి ధూమపానముచేయకూడదని మరల నిషేధించినది అసంగతమనే యాక్షే పముకలుగును. అయితే వాతప్రకృతిగలమనునికి వాతపిత్త రోగముగలిగినపుడు ప్రకృతి కనుగుణమైన చికిత్సచేయవలయుననెడి యుద్దేశముతో వైద్యాధముడు భ్రాంతిచేధూమపానము చేయించును కాబట్టి అధూమపానమును నిషేధించుటకై రక్తపిత్తరోగి ధూమపానముచేయకూడదని మరల జెప్పబడినది. లేక పిత్త ప్రకృగలతిమనుజునికి శ్లేష్మరోగము ప్రకోపించియుండునపుడు ధూమపానమును నిషేధించుటకై పిత్తరోగిధూమపానము చేయకూడదని మరలనిచట జెప్పబడినది. కాబట్టి యేయొక్క ఆక్షేపమునకు ఆధారముకనుపడదు. యవాగూపానముచేసినవారుకూడా ధూమపానముచేయకూడదని కొందరాచార్యులువచించెదరు.

అకాల - ధూమపాన దోషము.

శ్లో॥ రక్తపిత్తాంధ్యబాధిర్య తృణ్మూర్ఛామదమోహకృత్ ॥ 4.
ధూమోఽకాలేఽతిపీతోవా

తా॥ అకాలమునందును లేక పైజెప్పినరక్తపిత్తాది రోగములయందును పానము చేయబడినధూమము, అధికముగ పానముచేయబడిన ధూమము, ఇవి రక్తపిత్తము, అంధత్వము, చెవిటితనము, దప్పి, మూర్ఛ (అనగా సంజ్ఞానాశము), మదము, మోహము (అనగా చిత్తనాశము) వీనిని గలుగజేసును.

ధూమపాన - దోష శమనోపాయము.

శ్లో॥ తత్రశీతోవిధిర్హితః ।

తా॥ పైజెప్పిన రక్తపిత్తాదిరోగములలో యథాక్రమముగ ఘృతపానము, నస్యము, లేపము, పరిషేకము యీ మొదలగు శీతకరమైన చికిత్సలుహితకరంబులు.



త్రివిధ - ధూమపాన కాలము.

శ్లో॥ క్షుతజృంభితవిణ్మూత్ర స్త్రీసేవాశస్త్రకర్మణామ్ ॥ 5.
హాసస్యదంతకాష్ఠ స్యధూమమంతేపిబేన్మృదుమ్ ।
కాలేష్వేషునిశాహార నావనాంతేచమధ్యమమ్ ॥ 6.
నిద్రానస్యాంజనస్నాన చ్ఛర్దితాంతేవిరేచనమ్ ।

తా॥ తుమ్ము, ఆవలింత, మలోత్సర్జనము, మూత్రోత్సర్జనము, మైథునము, శస్త్రకర్మ, హాస్యము, దంతకాష్ఠభక్షణము అనునీ ౮ కృత్యములయొక్క అంతమునందు మృదువైన స్నేహనమను ధూమమును పానముచేయవలయును. పైజెప్పిన తుమ్ము మొదలగు వానియంతమునందును, రాత్రిభోజనము, నస్యము లేక నావనము, అను వానియంతమునందును, మధ్యమధూమమును పానముచేయవలయునని. నిద్ర, నస్యము అంజనము, స్నానము, ఛర్ది, వీనియంతమునందు విరేచనమను ధూమమును పానము చేయవలయును. నావనము, నస్యము, అనునొకటే యర్థముగల శబ్దము లిచటప్రయో గించబడియుండుటచే స్నిగ్ధమైన నస్యముయొక్క అంతమునందు స్నిగ్ధమైన ధూమ మును పానము చేయవలయుననియును, తుమ్ము మొదలగువానియంతమునందు ఆచా ర్యోపదేశముచే స్నిగ్ధమైన ధూమమును పానముచేయవలయుననియును, మధ్యాహ్న ముయొక్క అంతమునందు మధ్యమమైన ధూమమును పానముచేయవలయుననియును, భావంబగుచున్నది. “కాలేషు” అనుబహువచన ప్రయోగమువలన పైజెప్పిన తుమ్ము మొదలగు వానియంతమునందు మధ్యమధూమపానమును, నిద్ర, నస్యము యీ మొద లగువానియంతమునందు విరేచనధూమపానమును చేయవలయునని తాత్పర్యము.

ధూమపాన - యంత్ర లక్షణము.

శ్లో॥ వస్తినేత్రసమద్రవ్యం త్రికోశంకారయేదృజు ॥ 7.
మూలాగ్రేంగుష్ఠకోలాస్థి ప్రవేశంధూమనేత్రకమ్ ।

తా॥ ధూమపానమునకు సాధనమైనయంత్రము వస్తినేత్రమునకు చెప్పబడిన ధాతువు, మ్రాను, గజదంతము, వెదురు యీ మొదలగువానిచే ౩ గణుపులుగలదిగ, వంకరలేనిదిగ మూలాగ్రభాగములయందు యథాక్రమముగా బొట్టనవ్రేలు, రేగుగింజ ఇవి ప్రవేశించతగినద్వారముగలదిగ నుండునటుల శిల్పిచేజేయించవలయును.

ధూమపాన - యంత్ర ప్రమాణము.

శ్లో॥ తీక్ష్ణస్నేహనమధ్యేషు త్రీణిచత్వారిపంచచ ॥

అంగుళానాంక్రమాత్పాతుః ప్రమాణేనాష్టకానితత్ ।

తా॥ తీక్ష్ణము, స్నేహము, మధ్యము అనునీ 3 ధూమపానములయందు యంత్రము యథాక్రమముగా 24, 32, 40, అంగుళములనిడుపు గలదిగనుండవలయును. (అనగా తీక్ష్ణమను ధూమపానములో ధూమపానయంత్రము పానముచేయువాని యంగుళముచే 24 అంగుళములు నిడుపుగలదిగ, స్నేహనధూమములో 32 అంగుళములనిడుపుగలదిగను మధ్యమధూమములో 40 అంగుళములు నిడుపుగలదిగ నుండవలయుననిభావము.) అనేకగణుపులు, సూక్ష్మత్వము, దైర్ఘ్యము, ఇవి ధూమయంత్రమునకు గలిగియుండవలయును. ఇటులనుండినచో ధూమము నేత్రములు చెవులు యీ మొదలగునింద్రియములకు బాధను గలుగజేయనేరదు. మఱియును:—

“ దూరాద్వినిర్గతఃపర్వ చ్ఛిన్నోనాడీతనూకృతః । నేంద్రియంబాధతే ధూమః ”

దూరములోనుండి వచ్చునదియును, గణుపులచే నడ్డగించబడినదియును, యంత్రద్వారముచే కృశముగజేయబడినదియునునగు ధూమము ఇంద్రియములను బాధించకుండును, అని పై యర్థమునే చరకాచార్యుడుకూడా జెప్పియున్నాడు.

ధూమపాన క్రమము.

శ్లో॥ ఋజూపవిష్టస్తచ్చేతా వివృతాస్యస్త్రిపర్యయమ్ ॥ 9.
పిధాయచ్ఛిద్రమేకైకం ధూమంనాసికయాపిబేత్ ।

తా॥ మనుజుడు రుజువుగకూర్చుండి ధూమపానమునందే మనస్సునునిచి నోరునుతెరచికొని ఆక్షేపము, విసర్గము, ఆవపనము అను 3 పర్యాయములచే నొక్కొక నాసికాద్వారమును మూసుకొని మఱియొక నాసికాద్వారమువలన నాధూమమును పానముచేయవలయును. (అనగా ఒక నాసికాద్వారమును మూసుకొని మఱియొక నాసికాద్వారమువలన ధూమమునాకర్షించుకొని ధూమమును పానముచేయవలయుననియును, మఱియొక నాసికాద్వారమును మూసుకొని ఆ ధూమమును మఱియొక నాసికాద్వారమువలన వెలుపరచవలయుననియును భావము.)

నాసాది - రోగములయందు - ధూమపాన క్రమము.

శ్లో॥ ప్రాక్పిబేన్నాసయోత్క్లిష్టే దోషేఘ్రాణశిరోగతే ॥ 10.
ఉత్క్లేశనార్థంవక్త్రేణ విపరీతంతుకంఠగే ।



తా॥ నాసికనుజెందియుండు దోషముగాని, లేక శిరమునుజెందియుండు దోషముగాని స్వస్థానములో నుండి చలించియుండగా తొలుత నాసికమువలన ధూమమును పానముచేయవలయును. పై జెప్పినదోషములు స్వస్థానములోనుండి చలించకుండునపుడు తచ్చలనార్థమై ముఖమువలన తొలుత ధూమమును పానముచేసి పిదప నాసికమువలన పానముచేయవలయును. దోషములుకంఠము నడ్డగించియుండగా ఆ కంఠగతదోషము స్వస్థానములోనుండిచలించుటకై ధూమమును విపరీతముగ పానముచేయవలయును. విపరీతమనగా:—తొలుత నాసికమువలన పానముచేసిపిదప ముఖమువలన పానముచేయవలయునని యర్థము.

ధూమోత్సర్గ క్రమము.

శ్లో॥ ముఖేనైవవమేద్ధూమం నాసయాదృగ్విఘాతకృత్ । 11.

తా॥ నాసికముచేగాని ముఖముచేగాని పానముచేయబడిన ధూమమును ముఖమువలన వెలిపరచవలయునేకాని నాసికమువలనవెలిపరచంజనదు. ఏలననగా:—నాసికమువలన వెలిపరచబడిన ధూమము నేత్రములకు తిమిరముమొదలగు రోగములను గలుగజేయును.

శ్లో॥ ఆక్షేపమోక్షైఃపాతవ్యో ధూమస్తుత్రిస్త్రిభిస్త్రిభిః ।

తా॥ మూడుమూడు ఆక్షేపములవలన 3 మార్లు ధూమమును పానముచేయవలయును. ఆక్షేపమనగా:—పొగను లోనికి ఆకర్షించుట. మోక్షము అనగా:—పొగను బయలుపరచుట.

ధూమపాన సంఖ్య.

శ్లో॥ అహ్నఃపిబేత్సకృత్స్నిగ్ధం ద్విర్మధ్యంశోధనంపరమ్ ॥ 12.
త్రిశ్చతుర్వా

తా॥ స్నిగ్ధమను ధూమమును దినమునందొకమారు పానముచేయవలయును. మధ్యమమనుధూమమును 1 దినమునకు 2 మార్లు పానముచేయవలయును. తీక్ష్ణమను ధూమమును 1 దినమునకు 3 మార్లుగాని లేక 4 మార్లుగాని పానము చేయవలయును.

స్నిగ్ధ - ధూమ ద్రవ్యములు.

శ్లో॥ మృదౌతత్ర ద్రవ్యాణ్యగురుగుగ్గులుః ।
ముస్తస్థౌణేయశైలేయ నలదోశీరవాలకమ్ ॥ 13.
వరాంగకౌంతీమధుక బిల్వమజ్జైలవాలుకమ్ ।

శ్రీవేష్టకంసర్జరసో ధ్యామకంమదనంప్లవమ్ ॥ 14.
సల్లకీకుంకుమంమాషా యవాఃకుందురకంతిలాః ।
స్నేహాఃఫలానాంసారాణాం మేదోమజ్జావసాఘృతమ్ ॥ 15.

తా॥ ఆ 3 విధములైన ధూమములలో అగరు, గుగ్గిలము, తుంగముస్తెలు, స్థౌణేయము, జాతిపువ్వు, తెల్లవట్టివేరు, వట్టివేరు, కురువేరు, లవంగపు చెక్క, రేణుకలు, యష్టిమధుకము, మారేడుగుజ్జు, కూతురుబుడమ, శ్రీవేష్టకము, సర్జరసము, కామంచిపూరి, మ్రంగ, ప్లవం (అనగా కలుజువ్వి), అందుగు, కుంకుమపువ్వు, మినుములు, యవలు, కుందురుష్కము, నువ్వులు, కొండగోలుగు, నారికేళము యీమొదలగు ఫలములయొక్క స్నేహములు, చంద్ర, వేగిస మొదలగువానియొక్క స్నేహములు, మేదస్సు, మజ్జ, వస, ఆవునెయ్యి, అనునవి స్నిగ్ధమను ధూమోపయుక్తద్రవ్యములు

శమన - ధూమ ద్రవ్యములు.

శ్లో॥ శమనేసల్లకీలాక్షా పృథ్వీకాకమలోత్పలమ్ ।
న్యగ్రోధోదుంబరాశ్వత్థ ప్లక్షరోధ్రత్వచస్సితా ॥ 16.
యష్టీమధుఃసువర్ణత్వక్ పద్మకంరక్తయష్టికా ।
గంధాశ్చాకుష్ఠతగరాః

తా॥ అందుగు, లక్క, బొంతయేలకలు, తామరపువ్వు, నల్లకలువ, మఱ్ఱి, మేడి, రావి, జువ్వి, లొద్దుగు వీనియొక్కపట్టలు, శర్కర, యష్టిమధుకము, సువర్ణత్వక్, పుష్కరమూలము, మంజిష్ఠ, చెంగల్వకోష్ఠు, గ్రంథితగరము తప్ప యితరమైన గంధద్రవ్యములు అనునవి శమనధూమోపయుక్త ద్రవ్యములు.

తీక్ష్ణ - ధూమ ద్రవ్యములు.

శ్లో॥ తీక్ష్ణేజ్యోతిష్మతీ * నిశా ॥ 17.
దశమూలమనోహ్వాలం లాక్షా శ్వేతాఫలత్రయమ్ ।
గంధద్రవ్యాణితీక్ష్ణాని గణోమూర్ధవిరేచనః ॥ 18.

తా॥ వెక్కుడుతీగె, పసుపు, దశమూలములు, మణిశిల, లక్క, తెల్లగలిజెరు, త్రిఫలములు, తీక్ష్ణమయిన గంధద్రవ్యములు, చెంగల్వకోష్ఠు, గ్రంథితగరము యీమొదలగు తీక్ష్ణద్రవ్యములును, శోధనాదిగణము అనగా: "వేల్లాపామార్గేత్యాది"

* నిశే ఇతిపా.



వచనముచే అష్టాంగసంగ్రహములో జెప్పియుండు శిరోవిరేచనద్రవ్యములును తీక్ష్ణధూమోపయుక్తద్రవ్యములు.

ధూమపాన - వర్తి విధానము.

శ్లో॥ జలేస్థితామహోరాత్ర మిషీకాంద్వాదశాంగుళామ్ ।
పిష్టైర్ధూమౌషధై రేవం పంచకృత్వః ప్రలేపయేత్ ॥ 19.
వర్తిరంగుష్ఠవత్థూలా యవమధ్యాయథాభవేత్ ।
ఛాయాశుష్కాంవిగర్భాంతాం స్నేహాభ్యక్తాంయథాయథమ్॥20
ధూమనేత్రార్పితాంపాతు మగ్నిప్లుష్టాంప్రయోజయేత్ ।

తా॥ 12 అంగుళములు నిడుపుగల ఇషీక అనగా దర్భమూలమును 1 యహోరాత్రము జలములోవేసియునిచి ధూమపానమునకై జెప్పబడిన యౌషధములనుపిండి వలెబిసికి ఆ ఇషీకపై 5 మార్లు పూయవలయును. అటుల పూసినయెడల 1 అంగుష్ఠప్రమాణమంతలావు, యవలు ప్రవేశించతగిన మధ్యద్వారముగల నొక వర్తిగనగును. ఆ వర్తిని నీడనెండించి పిదప దాని మధ్యమునందుండు ఇషీకనెత్తివేసి యథాక్రమముగ ఘృతము మొదలగు స్నేహములచే దడిపి ధూమయంత్రద్వారములో నునిచి కొసయందు నిప్పుచేకాల్చి ధూమపానార్థమై ప్రయోగించవలయును.

మఱియొకవిధమగు - ధూమపాన క్రమము.

శ్లో॥ శరావసంపుటచ్ఛిద్రే నాడీంన్యస్యదశాంగుళామ్ ॥ 21.
అష్టాంగుళాంవావక్త్రేణ కాసవాన్ధూమమాపిబేత్ ।

తా॥ మూకుడుయొక్క సంపుటములో ద్వారముచేసి యా ద్వారమునందు 10 లేక, 8 అంగుళముల ప్రమాణముగల గొట్టమునునిచి దానిమార్గమువలన ముఖముచే ధూమమును కాసరోగముగలవాడు పానముచేయువలయును. అది యెట్లనగా:— పొగలేకుండు చంద్ర, రేగు, యీమొదలగు కట్టెలయొక్క గట్టియైన అంగారశకలముల నొకమూకుడులో సంపూర్ణముగవేసి దానిలో స్నేహముతోగూడియుండు కాసహారచూర్ణమునుగాని గుళికలనుగాని వేసి మధ్యలో ద్వారముగల 1 మూకుడుచే మూసి ఆద్వారమునందు 8 లేక 10 అంగుళములుగల 1 గొట్టమునునిచి కాసరోగముగలవాడు నోటిచే ధూమమును పానముచేయవలయును.

### ధూమపాన ఫలము.

శ్లో॥ కాసశ్వాసఃపీనసోవిస్వరత్వం పూతిర్గంధఃపాండుతా కేశదోషః॥22.
కర్ణాస్యాక్షిస్రావకండ్వార్తిజాడ్యం తంద్రాహిధ్మాధూమపం
నస్పృశంతి ॥ 22½.

తా॥ కాసము, శ్వాసము, పీనసము, స్వరవికారము, ముఖము, నాసికము, వీనియందుదుర్గంధము, ముఖమునందు పాండువర్ణము, కేశదోషము (అనగా వెంట్రుకలకు శ్వేతపింజరాదివర్ణములు) కర్ణ, ముఖ, నేత్రములయందు స్రావము, దురద, శూల, జడత్వము. తంద్ర, హిధ్మ, అనునీ రోగములు ధూమపానముచేయువానికి గలుగనేరవు.

ఏకవింశతితమాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు.

# ద్వావింశతితమాధ్యాయము.

### గండూషాది విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతోగండూషాదివి ధిమధ్యాయంవ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ ధూమపాన విధ్యధ్యాయానంతరము గండూషకబళాదివిధులను తెలియపరచునట్టి గండూషాది విధ్యధ్యాయమును వివరించెదము.

### చతుర్విధ గండూషములు.

శ్లో॥ చతుష్ప్రకారోగండూషః స్నిగ్ధఃశమనశోధనౌ । రోపణశ్చ

తా॥ గండూషము స్నిగ్ధము, శమనము, శోధనము, రోపణము అని 4-గు విధంబులు.

### గండూష - ప్రయోగ క్రమము.

శ్లో॥ త్రయస్తత్ర త్రిషుయోజ్యాశ్చలాదిషు ॥ 1.
అంత్యోవ్రణఘ్నః

తా॥ పై జెప్పిన 4 విధములైన గండూషములలో స్నిగ్ధము మొదలగు 3 గండూషములను వాతాది 3 దోషములయందు యథాక్రమముగా (అనగా వాతమునందు స్నిగ్ధమను గండూషమును, పిత్తమునందు శమనమను గండూషమును, కఫమునందు శోధనమను గండూషమును) ప్రయోగించవలయును. రోపణమను గండూషము వ్రణమునుపోగొట్టును. కాబట్టి దానిని వ్రణమునం దుపయోగపరచవలయును.

### స్నిగ్ధగండూష లక్షణము.

శ్లో॥ స్నిగ్ధోత్ర స్వాద్వమ్లపటుసాధితైః । స్నేహైః

తా॥ ఆ గండూషములలో స్నిగ్ధమనుగండూషము మధురముగ, అమ్లముగ, లవణముగనుండు ద్రవ్యములచే సిద్ధముచేయబడిన స్నేహములవలన జనించును.

శమన - గండూష లక్షణము.

శ్లో॥ సంశమన * స్తిక్త కషాయమధురౌషధైః ॥ 2.

తా॥ సంశమనమను గండూషము తిక్తముగ, కషాయముగ, మధురముగనుండు చేదుపొట్ల, వేప, నేరేడు, మామిడి, ఇప్ప అనువానికషాయము, శర్కరోదకము, క్షౌద్రము యీ మొదలగు నౌషధములచే సిద్ధమగును.

శోధన - గండూష లక్షణము.

శ్లో॥ శోధన స్తిక్తకట్వమ్ల పటూష్ణైః

తా॥ శోధనమను గండూషము తిక్తముగ, కటువుగ, అమ్లముగ, లవణముగ, ఉష్ణముగనుండు యౌషధములచే సిద్ధమగును.

రోపణ - గండూష లక్షణము.

శ్లో॥ రోపణః పునః । కషాయతిక్తకైః

తా॥ రోపణమను గండూషము కషాయముగ, తిక్తముగనుండు యౌషధములచే సిద్ధమగును.

గండూషములయందు స్నేహాద్యుపయోగము.

శ్లో॥ తత్ర స్నేహః క్షీరం మధూదకమ్ ॥ 3.
శుక్తం మద్యం రసం మూత్రం ధాన్యామ్లం చ యథాయథమ్ ।
కల్కైర్యుక్తం విపక్వం వా యథాస్పర్శం ప్రయోజయేత్ ॥ 4.

తా॥ పైజెప్పిన గండూషములలో స్నేహము, క్షీరము, మధూదకము, శుక్తము, మద్యము, మాంసరసము, మూత్రము, ధాన్యామ్లము, వీటిని ఆయాదోషానుగుణముగా కల్కములతోగలిపి పక్వముజేసి శీతలముగగాని, ఉష్ణముగగాని ప్రయోగించవలయును.

దంతహర్షాదులయందు - తిలకల్కోదకోపయోగము.

శ్లో॥ దంతహర్షే దంతచాలే ముఖరోగే చ వాతికే ।
సుఖోష్ణమథవా శీతం తిలకల్కోదకం హితమ్ ॥ 5.

* స్నిగ్ధ ఇతి పా.



తా॥ దంతహర్షము, దంతచలనము, ముఖరోగము, వాతరోగము వీనియందు దోషానుగుణముగా సుఖోష్ణముగగాని, శీతలముగగానినుండు తిలకల్కోదకము హితకరమైనది.

గండూషధారణమునందు తైలోపయోగము.

శ్లో॥ గండూషధారణే నిత్యం తైలం మాంసరసోఽథవా ।

తా॥ గండూష ధారణమునందెల్లపుడు తైలము, లేక మాంసరసము హితకరమైనది.

కొన్నిరోగములయందు ఘృతాద్యుపయోగము.

శ్లో॥ ఊషాదాహాన్వితే పాకే క్షతే వాగంతుసంభవే ॥ 6.
విషక్షారాగ్నిదగ్ధే చ సర్పిర్ధార్యం పయోఽథవా ।

తా॥ సర్వాంగతాపము, తాపము, వీనితోగూడియుండు పాకము, ఆగంతుక విషము, క్షారాగ్నులచే గలిగినదాహము వీనియందు ఘృతముగాని లేక క్షీరముగాని గండూషమునందు హితకరమైనది.

మాక్షిక - గండూషధారణ గుణము.

శ్లో॥ వైశద్యం జనయత్యాస్యే సందధాతి ముఖవ్రణాన్ ॥ 7.
దాహతృష్ణాప్రశమనం మధుగండూషధారణమ్ ।

తా॥ మాక్షిక గండూషధారణము నోటియందు నైర్మల్యమును గలుగజేసును. నోటివ్రణములనార్చును. తాపమును, దప్పిని శమనముజేసును.

ధాన్యామ్ల - గండూషధారణ గుణము.

శ్లో॥ ధాన్యామ్లమాస్యవైరస్య మలదౌర్గంధ్యనాశనమ్ ॥ 8.

తా॥ ధాన్యామ్ల గండూషము నోటియొక్క అరుచి, మలము, దౌర్గంధ్యము వీనిని హరింపజేసును.

శ్లో॥ తదేవాలవణం శీతం ముఖశోషహరం పరమ్ ।

తా॥ మఱియు నాధాన్యామ్లమునే లవణముతో జేర్చకుండా నుపయోగపరచినయెడల మిగుల శీతలముగనుండును. మిక్కుటముగ ముఖశోషను హరింపజేసును.

క్షారోదక - గండూష గుణము.

శ్లో॥ ఆశు క్షారాంబుగండూషో భినత్తి శ్లేష్మణశ్చయమ్ ॥ 9.

తా॥ స్వర్జికము మొదలగు క్షారములతోగూడియుండు ఉదకముయొక్క గండూషము శ్లేష్మసమూహము నతిశీఘ్రములో హరింపజేసును.

### ఉష్ణోదక - గండూష గుణము.

శ్లో॥ సుఖోష్ణోదకగండూషై ర్జాయతేవక్త్రలాఘవమ్ ।

తా॥ సుఖోష్ణముగనుండు ఉదకముయొక్క గండూషము ముఖలాఘవమును గలుగజేసును.

### గండూష - ధారణ క్రమము.

శ్లో॥ నివాతేసాతపేస్విన్న మృదితస్కంధకంధరః ॥ 10.
గండూషమపిబన్కించి దున్నతాస్యోవిధారయేత్ ।

తా॥ తొలుత స్వేదకర్మనుచేయించుకొని పిడపభుజములు, కంధరము (అనగా మెడ) వీనియందు మర్దనముచేయించుకొనినపురుషుడు యెండతోగూడి గాలి లేకుండు ప్రదేశమునందొకింత ముఖము నూర్ధ్వముగనెత్తుకొని గండూషమును పానముచేయకుండా నోటియందు ధరించవలయును.

### గండూష - ధారణ కాలము.

శ్లో॥ కఫపూర్ణాస్యతాయావ త్స్రవద్ఘ్రాణాక్షతాథవా ॥ 11.

తా॥ నోరు కఫముచే పూర్ణముగువరకుగాని, లేక నాసికము, నేత్రములు వీనియందు స్రావముగలుగువరకుగాని గండూషమును ధరించుకొని యుండవలయును. ఇటుల 5 లేక 7 పర్యాయములుగాని లేక స్వస్థతగలుగువరకుగాని గండూషమును ధరించవలయును.

### గండూష - కబల స్వరూపము.

శ్లో॥ అసంచార్యోముఖేపూర్ణే గండూషఃకబలోన్యథా ।

తా॥ నోరును కదలించుట కశక్యముగనుండునటుల సంపూర్ణముగా నౌషధమును ప్రయోగించుట గండూషమనబడును. నోరును కదలించుటకు శక్యముగనుండునటుల నౌషధమును అసంపూర్ణముగ ప్రయోగించుట కబళమనబడును.

### మన్యాదిరోగములయందు కబళోపయోగము.

శ్లో॥ మన్యాశిరఃకర్ణముఖాక్షిరోగాః ప్రసేకకంఠామయవక్త్రశోషాః ॥
హృల్లాసతంద్రారుచిపీనసాశ్చ సాధ్యావిశేషాత్కబలగ్రహేణ ।



తా॥ పెడతలపెద్దనరము, శిరస్సు, చెవులు, నోరు, నేత్రములు అను వానియందు గలుగురోగములును, ప్రసేకము, నానావిధమైన కంఠరోగములు, ముఖశోష, హృల్లాసము, తంద్ర, అరుచి, పీనసము అనునీరోగములును, విశేషముగా కబళధారణముచే చికిత్సార్హంబులుగనుండును.

### త్రివిధ - ప్రతి సారణము.

శ్లో॥ కల్కోరసక్రియాచూర్ణం త్రివిధంప్రతిసారణమ్ ॥ 13.

తా॥ ప్రతిసారణము కల్కము (అనగా జలాదులచే నూరబడినది) రసక్రియ (అనగా మాక్షికాదులచే ద్రవముగజేయబడినది) చూర్ణము అని 3 విధంబులు.

### ప్రతిసారణ - ప్రయోగ క్రమము.

శ్లో॥ యుంజ్యాత్తత్ కఫరోగేషు గండూషవిహితౌషధైః ।

తా॥ శ్లేష్మరోగములయందు శోధన గండూషోపయుక్తమగు నౌషధములచే నా ప్రతిసారణమును ప్రయోగించవలయును. ఇచట "గండూషవిహితౌషధైః" అని సామాన్యముగ జెప్పియుండినను పై జెప్పినచికిత్స కఫరోగవిషయమైనందున శోధనగండూషములో జెప్పియుండుయౌషధములచే ప్రతిసారణమును చేయవలయునని తాత్పర్యము.

### త్రివిధ - ముఖా లేపము.

శ్లో॥ ముఖాలేపస్త్రిధాదోష విషహావర్ణకృచ్చసః ॥ 14.

తా॥ ముఖాలేపము దోషఘ్నము, విషఘ్నము, వర్ణకరము అని త్రివిధంబు.

### ముఖాలేప - ప్రయోగ క్రమము.

శ్లో॥ ఉష్ణోవాతకఫేశస్తః శేషేష్వత్యర్థశీతలః ।

తా॥ వాతశ్లేష్మరోగమునందు ఉష్ణముగనుండు ముఖాలేపము హితకరము. పిత్తమునందును, వాతాధిక్యమునందును, మిగుల శీతలముగనుండు ముఖాలేపము హితకరము.

### ముఖాలేప ప్రమాణము.

శ్లో॥ త్రిప్రమాణశ్చతుర్భాగ త్రిభాగార్ధాంగులోన్నతిః ॥ 15.

తా॥ పైజెప్పిన 3 విధములగు ముఖాలేపములు యథాక్రమముగా 4-గుభాగముల ఔన్నత్యము, 3 భాగములఔన్నత్యము, అర్ధాంగుళౌన్నత్యము అని 3 విధ

ప్రమాణములుగలవై యుండును. (అనగా దోషఘ్నముఖాలేపము 1 అంగుళప్రమాణము దళముగలదిగ, విషఘ్నముఖాలేపము $\frac{3}{4}$ అంగుళప్రమాణము దళముగలదిగ, వర్ణకర ముఖాలేపము $\frac{1}{2}$ అంగుళ ప్రమాణము దళముగలదిగ నుండవలయునని భావము).

### ముఖాలేప - ధారణ క్రమము.

శ్లో॥ అశుష్కస్యస్థితిస్తస్య శుష్కోదూషయతిచ్ఛవిమ్ ।
తమార్ద్రయిత్వాపనయే త్తదంతేఽభ్యంగమాచరేత్ ॥ 16.

తా॥ ఆ ముఖాలేపములను యెండకుండానుండువరకు నునుచుట ప్రశస్తము. ఎండినచో చర్మమును చెరిచివేసును. కాబట్టి ముఖాలేపనము యెండినయెడల దానిని తడిపి యెత్తివేసి పిదప నభ్యంగము చేసుకొనవలయును.

### ముఖాలేపనమునందు - దివాస్వాపాది నిషేధము.

శ్లో॥ వివర్జయేద్దివాస్వప్న భాష్యాగ్న్యాతపశుక్క్రుధః ।

తా॥ ముఖాలేపనము చేసుకొనినవాడు పగటినిద్ర, సంభాషణము, అగ్ని, ఎండ, శోకము, క్రోధము వీనిని వర్జించవలయును. ఏలననగా:——పగటినిద్ర మొదలగువానివలన దురద, శోఫ, పీనసము, దృష్టిమాంద్యము మొదలగు నుపద్రవములు గలుగును.

### పీనసాదులయందు - ముఖాలేప నిషేధము.

శ్లో॥ నయోజ్యఃపీనసేఽజీర్ణే దత్తనస్యేహనుగ్రహే ॥ 17.
అరోచకేజాగరితే

తా॥ పీనసరోగి, అజీర్ణరోగి, నస్యము చేయించుకొనినవాడు, హనుగ్రహరోగి అరోచకముగలవాడు, జాగరణము చేసినవాడు వీరలకు ముఖాలేపమును ప్రయోగించంజనదు.

### ముఖాలేప - సేవన ఫలము.

శ్లో॥ నచహంతిసుయోజితః ।
అకాలపలితవ్యంగ వలీతిమిరనీలికాః ॥ 18.

తా॥ విధిప్రకారము సేవించబడిన యీముఖాలేపము అకాలమునందు తెలనెరయుట, వ్యంగము, వళులు, తిమిరము, నీలిక, యీమొదలగు రోగములను హరింపజేసును.



### షడ్విధ - ముఖాలేపములు.

శ్లో॥ కోలమజ్జావృషామూలం శాబరంగౌరసర్షపాః ।
సింహీమూలంతిలాఃకృష్ణా దార్వీత్వఙ్నిస్తుషాయవాః ॥ 19.
దర్భమూలహిమోశీర శిరీశిరీషమిసితండులాః ।
కుముదోత్పలకల్హార దూర్వామధుకచందనమ్ ॥ 20.
కాలేయకతిలోశీర మాంసీతగరపద్మకమ్ ।
తాలీసగుంద్రాపుండ్రాహ్వ యష్టీకాశనతాగురుః ॥ 21.
ఇత్యర్ధార్ధోదితాలేపా హేమంతాదిషుషట్స్మృతాః ।

తా॥ రేగుగుజ్జు, అడ్డసరపువేళ్ళు, తెల్లలొద్దుగు, తెల్లావాలు, వీనిచే సిద్ధము చేయబడిన కోలమజ్జాది ముఖాలేపము 1. ములకవేళ్ళు, నల్లనువ్వులు, పసుపు, మ్రానిపసుపు, లవంగపుచెక్క, ఊకలేనియవలు, వీనిచే సిద్ధము చేయబడిన సింహీమూలాది ముఖాలేపము 2, దుర్భవేరు ; కర్పూరము; వట్టివేరు; దిరిసెనము; సదాపబియ్యము వీనిచే సిద్ధము చేయబడిన దర్భమూలాది ముఖాలేపము 3, తెల్లకలువ ; నల్లకలువ; చెంగలువ; గరికెగడ్డి; యష్టిమధుకము; చందనము వీనిచే సిద్ధము చేయబడిన కుముదాది ముఖాలేపము 4. శ్రీగంధము, నువ్వులు, వట్టివేరు, జటామాంసి, గ్రంధితగరము ; పుష్కరమూలము వీనిచే సిద్ధము చేయబడిన కాలేయకాది ముఖాలేపము 5, తాళిసెపత్రి; భద్రముస్తెలు; ప్రపౌండరీకము; యష్టిమధుకము ; వేగిస; అగరు వీనిచే సిద్ధము చేయబడిన తాళీసాది ముఖాలేపము 6. ఈ 6 విధములైన ముఖాలేపములు హేమంతాది ఋతువులయందు యథాక్రమముగా (అనగా కోలమజ్జాది ముఖాలేపము హేమంతఋతువునందును, సింహీమూలాది ముఖాలేపము శిశిరఋతువునందును, దర్భమూలాది ముఖాలేపము వసంతఋతువునందును, కుముదాది ముఖాలేపము గ్రీష్మఋతువునందును, కాలేయకాది ముఖాలేపము వర్షాకాలమునందును, తాళీసాదిముఖాలేపము శరత్కాలమునందును) హితకరములని మునులచే జెప్పబడియున్నవి.

### ముఖాలేప గుణము.

శ్లో॥ ముఖాలేపనశీలానాం దృఢంభవతిదర్శనమ్ ॥ 22.
వదనంచాపరిమ్లానం శ్లక్ష్ణంతామరసోపమమ్ ।

తా॥ ముఖాలేపనము నభ్యసించుమనుజులకు దృష్టి దృఢముగనగును. మఱియును ముఖము వాడక మృదువై తామరపుష్పముతో సమానముగ నగును.

శిరస్సు - కుపయుక్తమగు - చతుర్విధ తైలములు.

శ్లో॥ అభ్యంగసేకపిచవో వస్తిశ్చేతిచతుర్విధమ్ ॥ 23.
మూర్ధతైలంబహుగుణం తద్విద్యాదుత్తరోత్తరమ్ ।

తా॥ శిరమునందుపయోగించబడు తైలములు అభ్యంగము, సేకము (అనగా శిరమునందు తైలమును ధారగావిడుచుట), పిచు (అనగా ప్రత్తినిగాని లేక వస్త్ర ఖండమునుగాని తైలముచేదడిపి శిరము పైనునుచుట), వస్తి (అనగా ఉత్తరత్ర జెప్పబడు శిరోవస్తి విధిప్రకారము శిరమునందు తైలమునుధరించుట), అని 4 విధంబులు. ఆ 4 విధములైన తైలములు ఉత్తరోత్తరము యథాక్రమముగా (అనగా అభ్యంగమునకంటే సేకము, దానికంటె పిచువు, దానికంటెవస్తి) బహుగుణములుగలవియని తెలియవలయును.

అభ్యంగ - తైలోప యోగము.

శ్లో॥ తత్రాభ్యంగః ప్రయోక్తవ్యో రౌక్ష్యకండూమలాదిషు ॥ 24.

తా॥ ఆ నాలుగువిధములగు తైలములలో అభ్యంగమను తైలమును రూక్షము, దురద, మలము యీ మొదలగు నుపద్రవములయందు ప్రయోగించవలయును.

పరిషేక - తైలోప యోగము.

శ్లో॥ అరూంషికాశిరస్తోద దాహ పాక వ్రణేషుతు । పరిషేకః

తా॥ పరిషేకమను తైలమును అరూంషిక, శిరమునందుశూల, తాపము, పాకము, వ్రణము వీనియందు ప్రయోగించవలయును.

పిచుతైలోప యోగము.

శ్లో॥ పిచుః కేశ శాతస్ఫుటనధూపనే ॥ [నేత్రస్తంభేచ] 25.

తా॥ పిచువను తైలమును వెంట్రుకలూడుట, వెంట్రుకచీలుట, ధూపనము, నేత్రస్తంభము వీనియందు ప్రయోగించవలయును.

వస్తితైలోప యోగము.

శ్లో॥ వస్తిస్తు ప్రసుప్త్యర్దితజాగరే ।
నాసాస్యశోషతిమిరే శిరోరోగేచదారుణే ॥ 26.

తా॥ వస్తియను తైలమును ప్రసుప్తివాతము, అర్దితవాతము, జాగరణము, నాసికము, ముఖము వీనియందలి శోషము, తిమిరరోగము, దారుణమైన శిరోరోగము, వీనియందు ప్రయోగించవలయును



శిరోవస్తి - ప్రయోగ క్రమము.

శ్లో॥ విధిస్తస్యనిషణ్ణస్య పీఠేజానుసమేమృదా ।
శుద్ధాక్తస్విన్నదేహస్య దినాంతేగవ్యమాహిషమ్ ॥ 27.
ద్వాదశాంగులవిస్తీర్ణం చర్మపట్టంశిరస్సమమ్ ।
ఆకర్ణబంధనస్థానం లలాటేవస్త్రవేష్టితే ॥ 28.
చైలవేణికయాబద్ధ్వా మాషకల్కేనలేపయేత్ ।
తతోయథావ్యాధిశృతం స్నేహంకోష్ణంనిషేచయేత్ ॥ 29.
ఊర్ధ్వంకేశభువోయావద్ద్వ్యంగులం

తా॥ తొలుతవమనాదులచే శుద్ధముగ, తైలాదులచే నభ్యక్తముగ, స్వేదకర్మచే స్విన్నముగనుండు శరీరముగలవాడును, మోకాటిపొడవుగలిగి మృదువుగనుండు ఆసనమునందు కూర్చుండియుండువాడునైన పురుషునికి సాయంకాలమునందుగాని లేక రాత్రియందుగాని లలాటమునందు వస్త్రమునుచుట్టి 12 అంగుళముల ప్రమాణముతో గూడినట్టియు, శిరమునకు సమమైనదియు, చెవివరకు కట్టతగినదియునైన గోచర్మపట్టమునుగాని మహిషచర్మపట్టమునుగాని చీలవేణికచేత (అనగావస్త్రఖండముచేత) శిరమునందుకట్టి దానిపై మాషకల్కమును లేపనముచేసి పిదపవ్యాధి, దోషము, దూష్యము వీనికనుగుణముగా పక్వముచేయబడినదియును, సుఖోష్ణముగనుండునదియునైన స్నేహమును కేశప్రదేశమునకుపైన రెండంగుళముల ప్రమాణము ఆసేచనముచేయవలయును. ఇదియ శిరోవస్తియొక్కవిధి.

"అథశుద్ధతనోస్సాయంరాత్రౌవానివాతస్థస్య స్వభ్యక్తస్విన్నస్యసోపాశ్రయాసనోపవిష్టస్య కేశాంతేశ్లక్ష్ణంత్ర్యంగులంమాషపిష్టేన సూక్ష్మేణ సద్యస్సుఖాంబునామృదితేన ఉభయతః ప్రదిగ్ధంవస్త్రపట్టం బధ్నీయాత్ । తతస్తస్యోపరిసంధాయవస్తింవస్తిమూలంచదృఢమవలీకం సమంచైలవేణికయాబద్ధ్వాపునర్మాషపిష్టేనో పరిస్రావిక్కృత్వాయథా వ్యాధిదోషదూష్యహితసిద్ధమన్యతమంస్నేహంసుఖోష్ణమాసేచయేత్ ॥"

వమనవిరేచనాదులచే శుద్ధమైనశరీరముగలవాడును, అభ్యంగము, స్వేదకర్మ వీనిని జేయించుకొనినవాడుననగు పురుషునిని సాయంకాలమునందుగాని లేక రాత్రియందుగాని వాతములేకుండు ప్రదేశములో కొంచెము పొడవుగనుండు ఆసనమునందు సుఖముగాకూర్చుండబెట్టి ఉష్ణోదకముచే బాగుగ మర్దనముచేయబడిన సూక్ష్మమయిన

మినుపపిండిని 3 అంగుళముల వెడల్పుగలదిగను, సన్నగనుండు వస్త్రపట్టముయొక్క యిరుప్రక్కలయందుపూసి వానికే శాంతమునందు దృఢముగకట్టి పిదప దానిపై వస్తి యొక్క మూలమును సంధానముచేసి గట్టిగ, సమముగ చైలవేణికచేకట్టి మరల మినుపపిండిని దానిపైపూసి పిదప వ్యాధి, దోషము, దూష్యము వీనికనుగుణముగా సిద్ధముచేయబడిన ఘృతము మొదలగుస్నేహములలో దేనినైనానొకదానినిసుఖోష్ణముగా ఆసేచనము చేయవలయును; అని అష్టాంగసంగ్రహమునందు శిరోవస్తివిధానము చెప్పబడియున్నది.

## శిరోవస్తి - ధారణకాల ప్రమాణము.

శ్లో॥ ధారయేచ్ఛ్రుతమ్ । ఆవక్త్రనాసికోత్క్లేదాత్

తా॥ ఆ స్నేహమును నాసికము, నోరు వీనియందు స్రావముగలుగువరకు ధరించవలయును.

శ్లో॥ దశాష్టౌషట్చ్ఛ్లాదిషు ॥ [మాత్రాసహస్రాణ్య] 30.

తా॥ వాతాదిదోషములలో యథాక్రమముగా (అనగా వాతములో 10,000 మాత్రాకాలమును, పిత్తములో 8000 మాత్రాకాలమును, కఫములో 6000 మాత్రాకాలమును) శిరోవస్తిస్నేహమును ధరించవలయును.

శ్లో॥ రుజేత్వేకం

తా॥ రోగములేకుండా స్వస్థవృత్తుడుగనుండువాడు 1000 మాత్రాకాలము ఆ శిరోవస్తిస్నేహమును ధరించవలయును.

## శిరోవస్త్యనంతర కర్తవ్యము

శ్లో॥ స్కంధాదిమర్దయేత్ । ముక్తస్నేహస్య

తా॥ పిదప శిరోవస్తిని విప్పివేసి వానియొక్క భుజములు, శిరస్సు, మెడ యీమొదలగు వానినిమర్దించి పిదప ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది వచనములచే పూర్వము చెప్పబడిన విధులనన్నిటి నాచరింపంజేయవలయును.

## శిరోవస్తి - సేవనకాల నియమము.

శ్లో॥ పరమం సప్తాహంతస్యసేవనమ్ ॥ 31.

తా॥ ఆ శిరోవస్తియొక్క ముఖ్యమైనసేవనకాలము 7 దినములు. ఇటుల చెప్పుటచే 3 లేక 4 లేక 7 దినములు శిరోవస్తిని చేయవలయునని భావించుచున్నది.



## కర్ణపూరణ - ధారణ కాలము.

శ్లో॥ ధారయేత్పూరణంకర్ణే కర్ణమూలంవిమర్దయన్ ।
రుజఃస్యాన్మార్దవంయావ న్మాత్రాశతమవేదనే ॥ 32.

తా॥ కర్ణపీడ శాంతియగువరకు కర్ణమూలమునుమర్దనముచేయుచూ కర్ణపూరణమునుధరించవలయును. స్వస్థవృత్తుడుగనుండునపుడు ఆకర్ణపూరణమును 100 మాత్రాకాలము ధరించవలయును.

## మాత్రా లక్షణము.

శ్లో॥ యావత్పర్యేతిహస్తాగ్రం దక్షిణంజానుమండలమ్ ।
నిమేషోన్మేషకాలేన సమంమాత్రాతుసాస్మృతా ॥ 33.

తా॥ దక్షిణహస్తాగ్రము దక్షిణజానుమండలమును నిమేషోన్మేషకాలముచే సమముగా నెంతకాలములో చుట్టివచ్చునో అట్టికాలము మాత్రయనబడునని మునులచే జెప్పబడియున్నది.

## మూర్ధతైల - సేవన ఫలము.

శ్లో॥ కచసదనసితత్వపింజరత్వం పరిస్ఫుటనంశిరసఃసమీరరోగాన్ ।
జయతిజనయతీంద్రియప్రసాదం స్వరహనుమూర్ధబలంచ
మూర్ధతైలమ్ ॥ 34.

తా॥ శిరస్తైలము తలవెంట్రుకలూడుట, తలవెంట్రుకలు తెల్లనగుట, తలవెంట్రుకలు పింజరవర్ణముగనగుట, కొసలోచీలుట యీమొదలగువానిని శిరమున జనించు వాతరోగములను హరింపజేసును. మఱియు నింద్రియములకు నైర్మల్యమును స్వరము, కటుమర్లు, శిరస్సు వీనికి బలమునుగలుగజేసును.

ద్వావింశతితమాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు.

# త్రయోవింశతితమాధ్యాయము.

---

జత్రూర్ధ్వరోగప్రస్తావముచే నేత్రములయొక్క ఆశ్చ్యోతన అంజనాదివిధులు యీయధ్యాయమునందు చెప్పబడుచున్నవి.

## ఆశ్చ్యోతనాంజన - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాత ఆశ్చ్యోతనాంజన విధిమధ్యాయంవ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ గండూషాది విధ్యధ్యాయానంతరము ఆశ్చ్యోతనము, అంజనము అను నీ విధులను తెలియపరచునట్టి ఆశ్చ్యోతనాంజన విధ్యధ్యాయమును వివరించెదము.

## నేత్రరోగములయందు ఆశ్చ్యోతనము.

శ్లో॥ సర్వేషామక్షిరోగాణా మాదావాశ్చ్యోతనంహితమ్ ।
రుక్తోదకండూఘర్షాశ్రుదాహ * రోగనిబర్హణమ్ ॥ 1.

తా॥ సమస్తమైన నేత్రరోగములకు తొలుత ఆశ్చ్యోతనము హితకరము. ఆ ఆశ్చ్యోతనము నేత్రములయందుపీడ, నేత్రములయందు సూదులచే బొడుచునటుల వేదన, నేత్రములయందుదురద, నేత్రఘర్షము, కంటిలో నీరుకారుట, నేత్రములయందుమంట వీనిని హరింపజేయును. ఆశ్చ్యోతనమనగా:—

“ఉన్మీలితేక్ష్ణిసృజ్మధ్యే బిందుభిర్ద్వ్యంగుళాద్ధితమ్”

ఆనెడి వచనప్రకారము నేత్రములను తెరచి 2 అంగుళముల పొడవులోనుండి ఔషధ బిందువులను విడుచుటయని యర్థము.

“అన్యక్తేష్వేవరుజానిష్వేనం తుల్యగుణంపున్యక్తపరిహారేణ అక్షికోశే లేపనంతచ్చబిడాలకసంజ్ఞకమ్ ॥”

రోగము స్పష్టముగ తెలియకుండునపుడు రెప్పలనువదలి నేత్రకోశములో జేయబడు ఆ లేపనము ఆశ్చ్యోతనముతో సమానమైన గుణముగలదై యుండును. ఆ ఆలేపనము బిడాలకమను పేరంబఱగుచును; అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

---

* రోగ ఇతిపా.



## వాతాదిజనిత - నేత్రరోగములయందు ఉష్ణాద్యాశ్చ్యోతనము.

శ్లో॥ ఉష్ణంవాతేకఫేకోష్ణం తచ్ఛీతంరక్తపిత్తయోః ।

తా॥ ఆఆశ్చ్యోతనము వాతములో ఉష్ణముగను, కఫములో కించదుష్ణముగను, రక్తములోను, పిత్తములోను శీతలముగనుండుట హితకరము.

## ఆశ్చ్యోతన విధి.

శ్లో॥ నివాతస్థస్యవామేన పాణినోన్మీల్యలోచనమ్ ॥ 2.
శుక్త్యాప్రలంబయాన్యేన పిచువర్త్యాకనీనికే ।
దశద్వాదశవాబిందూన్ ద్వ్యంగులాదవసేచయేత్ ॥ 3.
తతః ప్రమృజ్యమృదునా చైలేనకఫవాతయోః ।
అన్యేనకోష్ణపానీయ ప్లుతేనస్వేదయేన్మృదు ॥ 4.

తా॥ గాలిలేనిప్రదేశమునందు రోగినికూర్చుండబెట్టి వానినేత్రములనువైద్యుడు వామహస్తముచే తెరిచి నేత్రములకు 2 అంగుళములపొడవులోనుండి పిచువర్తిచేతగాని లేక వ్రేలాడుచుండు శుక్తిచేతగాని 10 లేక 12 బిందువులను దక్షిణహస్తముచే నల్లగ్రుడ్డుపై విడువవలయును. పిదప మృదువుగ శుద్ధముగనుండు వస్త్రఖండముచే నేత్రమునను తుడిచి సుఖోష్ణమైన ఉదకములోతడుపబడినట్టియు, మృదువైనట్టియు, మఱియొక వస్త్రఖండమును నేత్రములపై మృదువుగనద్దుటచే స్వేదకర్మచేయించవలయును. ఈ విధిని వాత, కఫసంబంధముగల నేత్రరోగములయందు చేయవలయునేకాని పిత్తరక్తసంబంధముగల నేత్రరోగములయందు చేయంజనదు,

## అత్యుష్ణాశ్చ్యోతనాది జనితోపద్రవములు.

శ్లో॥ అత్యుష్ణతీక్ష్ణంరుగ్రాగ దృఙ్నాశాయాక్షిసేచనమ్ ।
అతిశీతంతుకురుతే నిస్తోదస్తంభవేదనాః ॥ 5.
కషాయవర్త్మతాంఘర్షం కృచ్ఛాదున్మేషణంబహు ।
వికారవృద్ధిమత్యల్పం సంరంభమపరిస్రుతమ్ ॥ 6.

తా॥ అత్యుష్ణముగ, అతితీక్ష్ణముగనుండుఆశ్చ్యోతనము నేత్రములకురోగమును, ఎఱుపువర్ణమును, నేత్రనాశమును గలుగజేయును. అతిశీతలముగనుండు ఆశ్చ్యోతనము నేత్రములయందు సూదులచేబొడుచునటుల వేదన, నేత్రస్తంభము, నేత్రశూల, నేత్రములుకలకబాఱుట, నేత్రఘర్షము (అనగా ఒకటితో నొకటి యంటుకొనుట)

యీ మొదలగువానిని గలుగజేయును. అధికముగజేయబడిన ఆశ్చోతనము అతికష్టము మీద నేత్రములను తెరుచునటులజేయును. మిగుల నల్పముగచేయబడిన ఆశ్చోతనము నేత్రవికారములను వృద్ధిజేయును. అపరిస్రుతమైన ఆశ్చోతనము నేత్రములకుక్షోభను గలుగజేయును.

ఆశ్చోతనా - ద్యౌషధ కృత్యము.

శ్లో॥ గత్వాసంధి * శిరోఘ్రాణ ముఖస్రోతాంసిభేషజమ్ ।
ఊర్ధ్వగాన్నయనేన్యస్తమపవర్తయతేమలాన్ ॥ 7.

తా॥ నేత్రములయందు ప్రయోగించబడిన ఔషధము నేత్రకోశసంబంధము గల సంధులు, శిరస్సు, నాసికము, ముఖము వీనియందలి స్రోతోమార్గములంజెంది ఊర్ధ్వాంగములలోనుండి మలములను బయలుపరచును.

అంజన ప్రయోగము.

శ్లో॥ అథాంజనంశుద్ధతనోర్నేత్రమాత్రాశ్రయేమలే ।
పక్వలింగేల్పశోఫార్తి కండూపైచ్ఛిల్యలక్షితే ॥ 8.
మందఘర్షాశ్రు † రాగేక్ష్ణి ప్రయోజ్యంఘనదూషికే ।
అక్ష్ణిపిత్తకఫాసృగ్భిర్మారుతేసవిశేషతః ॥ 9.

తా॥ వమనాదులచే శుద్ధమైన శరీరముగల పురుషునికి మలము శరీరమునందు వ్యాపించకుండా నేత్రములనాశ్రయించియుండునపుడు స్వల్పమైనశోఫ, అధికమైన దురద, పిచ్ఛిలత్వము మొదలగుపక్వలక్షణములుగలుగును. [illegible] స్వల్పమయినఘర్షము, కంటినీరు, ఊపస్రవము, అధికమైనమలము ఇవిగల నేత్రమునందును పిత్తము, కఫము, రక్తము, వాతము వీనిచే పీడితముగనుండు నేత్రమునందును విశేషముగా అంజనమును ప్రయోగించవలయును.

త్రివిధాంజనము.

శ్లో॥ లేఖనంరోపణంవృష్టి ప్రసాదనమితి త్రిధా । అంజనం

తా॥ అంజనము లేఖనము, రోపణము, దృష్టిప్రసాదనము, అని 3 విధంబులు. లేఖనమనగా :—శుక్రార్మాదిరోగములను శస్త్రముచే [illegible] యని యర్థము. రోపణమనగా:—[illegible] రోగములను మాన్పునదియని యర్థము. దృష్టిప్రసాదనమనగా:—నేత్రములను నిర్మలముగజేయునది యని యర్థము.

* సిరా ఇతిపా. † రాగేక్ష్ణ ఇతిపా.



మఱియును తంత్రాంతరములలో జెప్పబడియుండు స్నేహనమను అంజనము రోపణము, దృష్టిప్రసాదనము అనునీ 2 విధములగు అంజనములలో నంతర్గతంబై యుండుటవలన నీతంత్రకారుడు ప్రత్యేకముగా జెప్పకవిరమించెను.

లేఖనాంజనము.

శ్లో॥ లేఖనంతత్రకషాయామ్లపటూషణైః ॥ 10.

తా॥ ఆ 3 విధములైన అంజనములలో లేఖనమనుఅంజనము కషాయము, అమ్లము, లవణము, కటు అనునీ రసములుగల వస్తువులచే సిద్ధంబగును. దానిని శుక్రార్మాదిరోగములలో ప్రయోగించవలయును.

రోపణాంజనము.

శ్లో॥ రోపణంతిక్తకైర్ద్రవ్యైః

తా॥ రోపణమను అంజనము తిక్తరసముగల ద్రవ్యములచే సిద్ధంబగును.

ప్రసాదనాంజనము.

శ్లో॥ స్వాదుశీతైః ప్రసాదనమ్ ।

తా॥ ప్రసాదనమను అంజనము మధురముగ, శీతలముగనుండు ద్రవ్యములచే సిద్ధంబగును. మఱియును మధురముగ, శీతలముగనుండుద్రవ్యములచే సిద్ధముచేయబడిన చూర్ణరూపమైనఅంజనము అధిక తాపముగలనేత్రములలో ప్రయోగించబడునపుడు దానికి ప్రత్యంజనమను సంజ్ఞ గలుగును.
"తీక్ష్ణాంజనాభితప్తేనయనేతత్ప్రసాదనమ్ । ప్రయుజ్యమానంలభతే ప్రత్యంజనసమాహ్వయమ్ ॥"
తీక్ష్ణమయిన అంజనప్రయోగముచే తాపమునుజెందియుండు నేత్రతాపశాంత్యర్థమై ప్రయోగించబడు ప్రసాదనాంజనము ప్రత్యంజనమనుపేరంబఱంగునని అధికపాఠము కొన్నిగ్రంథములయందు గన్పట్టుచున్నది.

అంజన - శలాకా లక్షణము.

శ్లో॥ దశాంగులాతనుర్మధ్యే శలాకాముకులాననా ॥ 11.
ప్రశస్తాలేఖనేతామ్రీ రోపణేకాలలోహజా ।
అంగులీచసువర్ణోత్థా రూప్యజాచప్రసాదనే ॥ 12.

తా॥ అంజనప్రయోగమునందు 10 అంగుళములు నిడుపుగలదిగను, అలచంద లంత దళముగలదిగను, మధ్యలో నొకింతసన్నగను, మొగ్గవంటి ముఖముగలదిగనుండు

శలాకు ప్రశస్తము. లేఖనాంజనప్రయోగమునందు తామ్రముచేజేయబడిన శలాకు ప్రశస్తము. రోపణాంజనములో ఇనుముచే జేయబడినశలాకు, అంగుళులు (అనగా వ్రేళ్ళు) ఇవి ప్రశస్తంబులు. ప్రసాదనమను అంజనములో సువర్ణముచే జేయబడిన శలాకు, రజతముచేజేయబడినశలాకు ఇవి ప్రశస్తంబులు.

## త్రివిధాంజన కల్పన.

శ్లో॥ పిండోరసక్రియాచూర్ణ స్త్రిధైవాంజనకల్పనా।
గురౌమధ్యేలఘౌదోషే తాఃక్రమేణప్రయోజయేత్॥ 13.

తా॥ పిండము, రసక్రియ (అనగా ద్రవరూపమగు అంజనము) చూర్ణము అని అంజనకల్పన 3 విధంబులు. ఈ 3 విధములైనఅంజనములను యథాక్రమముగా (అనగా దోషమధికముగనుండునపుడు పిండమును, మధ్యమముగనుండునపుడు రసక్రియను, స్వల్పముగనుండునపుడు చూర్ణమును) ప్రయోగించవలయును. పిండమనగా:—

"పిండీకబలికా ప్రోక్తా బద్ధ్యతేపట్టవస్త్రకైః"

అనెడి వచనముచొప్పున ఔషధములనునూరి ముంటగజేసి నేత్రములపై నునిచి వస్త్రపట్టముచే కట్టుతగిన అంజనమని యర్థము.

## పిండాంజనాది ప్రమాణము.

శ్లో॥ హరేణుమాత్రంపిండస్య వేల్లమాత్రారసక్రియా।
తీక్ష్ణస్యద్విగుణంతస్యమృదునః

తా॥ తీక్ష్ణద్రవ్యములచేజేయబడిన పిండమనుసంజ్ఞగల అంజనమునకు ఒకహరేణువు (అనగా బోడసెనగలంత) ప్రమాణమని, మృదుద్రవ్యములచేజేయబడిన పిండమనుసంజ్ఞగల అంజనమునకు 2 హరేణువులు ప్రమాణమని, రసక్రియయను సంజ్ఞగల అంజనమునకు 1 విడంగము ప్రమాణమని వైద్యులు వచించెదరు.

## చూర్ణాంజన ప్రమాణము.

శ్లో॥ చూర్ణితస్యచ॥ 14.
ద్వేశలాకేతుతీక్ష్ణస్య తిస్రస్స్యురితరస్యచ।

తా॥ తీక్ష్ణద్రవ్యములచేజేయబడిన చూర్ణమనుసంజ్ఞగల అంజనములో 2 శలాకులు ప్రమాణమనియు, మృదుద్రవ్యములచేజేయబడిన చూర్ణమనుసంజ్ఞగలఅంజనములో 3 శలాకులు ప్రమాణమనియు, వైద్యులు వచించెదరు.



"లేఖనమంజనంతామ్రరజతకాంస్యాన్యన్యతమేషుధార్యమ్। రోపణం సువర్ణపటశంఖాన్యతమేషు। ప్రసాదనంస్ఫటికస్లతషు చందనాన్యతమేషు ధార్యమ్। ఏవంహ్యంజనమవ్యాపన్నగుణంభవతి। వర్తేర్ఘర్షణార్థంశిలా నిమ్నమధ్యాఽనుద్గారిణీపంచాంగులాతా త్ర్యంగుళవిస్తారా॥"

లేఖనమను అంజనమును తామ్రము, రజితము, కంచు అనువానిలో దేనిచేనైనిజేయబడినపాత్రలో నుంచవలయును. రోపణమను అంజనమును సువర్ణపాత్ర, గవ్వ, శంఖము వీనిలోదేనియందేని ఉంచవలయును. ప్రసాదనమనుఅంజనమును స్ఫటికము, జువ్విచెక్క, చంతనపుచెక్క, వీనిలో దేనిచేనైని జేయబడిన పాత్రయందుంచవలయును. ఇటుల నంజనము నునిచిన వానిగుణము చెడకుండును. మఱియు నాఅంజన వర్తిని నూరునట్టి శిల మధ్య పల్లముగను, ఱాయి తెగనిదిగను, 5 అంగుళములు నిడుపు, 3 అంగుళములు వెడల్పుగలదిగ నుండవలయునని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది.

"పిండస్యతీక్ష్ణద్రవ్యస్య మృదుద్రవ్యకృతస్యచ। హరేణుమాత్రం ద్విగుణం ప్రమాణంకథయంత్యపి। రసక్రియాయామప్యాహు ర్విడంగ ఫలమాత్రకమ్। శలాక్యాద్విగుణాంతీక్ష్ణే చూర్ణేచత్రిగుణాంమృదౌ॥"

అనగా తీక్ష్ణద్రవ్యములచేజేయబడిన పిండమనుఅంజనమునకు 1 హరేణువు ప్రమాణమనియు, మృదుద్రవ్యములచే జేయబడిన పిండమనుఅంజనమునకు 2 హరేణువులు ప్రమాణమనియు, రసక్రియయను అంజనమునకు 1 విడంగము ప్రమాణమనియు, తీక్ష్ణద్రవ్యములచేజేయబడిన చూర్ణమనుఅంజనమునకు 2 శలాకులు ప్రమాణమనియు, మృదుద్రవ్యములచేజేయబడిన చూర్ణమనుఅంజనమునకు 3 శలాకులు ప్రమాణమనియు నధికపాఠము కొన్నిగ్రంథములయందు గనపట్టుచున్నది.

## అంజన - ప్రయోగ కాలము.

శ్లో॥ నిశిస్వప్నేనమధ్యాహ్నే *మ్లానేచోష్ణగభస్తిభిః॥ 15.
అక్షిరోగాయదోషాస్స్యు ర్వర్ధితోత్పీడితద్రుతాః।
ప్రాతస్సాయంచతచ్ఛాంత్యై వ్యభ్రేర్కేఽతోంజయేత్సదా॥

తా॥ రాత్రి, నిద్ర, మధ్యాహ్నము అను నీకాలములయందును, ఉష్ణకరమైన సూర్యకిరణములు, మద్యపానము యీమొదలగువానిచే [illegible] యుండు

* పానానోష్ణగభస్తిభిః ఇతిపా.

నపుడును, అంజనమును ప్రయోగింపంజనదు. అంజనప్రయోగము చేసినచో దోషములు వృద్ధిని, ప్రకోపమును జెంది ద్రవించి నేత్రములయందు రోగములను గలుగజేయును. కావున నట్టిరోగశాంత్యర్థమై సూర్యుడు మేఘములచే మాయాబడకుండునపుడు సాయం ప్రాతఃకాలములయందు అంజనమును ప్రయోగించవలయును.

### మతాంతరమునందు - అంజనప్రయోగ కాలము.

శ్లో॥ వదంత్యన్యేతునదివా ప్రయోజ్యంతీక్ష్ణమంజనమ్ ।
విరేకదుర్బలంచక్షు రాదిత్యం ప్రాప్యసీదతి ॥ 17.

తా॥ మధ్యాహ్నమునందు తీక్ష్ణమయిన అంజనమును ప్రయోగింపంజనదు. ఏలననగా :— నేత్రములు తీక్ష్ణాంజనముచే మిక్కుటముగ నీరును స్రవింపజేసి దుర్బలముగనై సూర్యకిరణసంబంధమువలన చెరుపును జెందును. అని కొందరాచార్యులు వచించెదరు.

శ్లో॥ స్వప్నేనరాత్రౌ కాలస్య సౌమ్యత్వేనచతర్పితా ।
శీతసాత్మ్యాద్రుగాగ్నేయీ స్థిరతాంలభతేపునః ॥ 18.

తా॥ రాత్రులయందు నిద్రచేతను, రాత్రికాలము సౌమ్యముగనుండుటచేతను తృప్తిని జెందియుండునట్టియు, అధికముగా తేజస్సంబంధముగలిగియుండునట్టియు; శీతలమైనవస్తువునందు సాత్మ్యమును జెందియుండునట్టియునగుదృష్టి తీక్ష్ణాంజనప్రయోగముచే క్షోభను జెందినప్పటికి మరల స్థైర్యమును జెందును. కాబట్టి రాత్రులయందు తీక్ష్ణాంజనమును ప్రయోగించవలయును.

శ్లో॥ అత్యుద్రిక్తేబలాసేతు లేఖనీయేధవాగదే ।
కామమహ్న్యపినాత్యుష్ణే తీక్ష్ణమక్ష్ణిప్రయోజయేత్ ॥ 19.

తా॥ కఫము మిగులనధికముగనుండునపుడును లేక లేఖనక్రియకు అర్హమైన శుక్రార్మ మొదలగు రోగములయందును, మధ్యాహ్నమునందు అత్యుష్ణము లేకుండునపుడు తీక్ష్ణాంజనమును ప్రయోగింపందగును. అత్యుష్ణముగనుండుమధ్యాహ్నమునందు తీక్ష్ణాంజనప్రయోగము చేసినయెడల కాలము, అంజనము అను నీ 2 తీక్ష్ణముగ నుండుటవలన దృష్టికి చెరుపును గలుగజేయును.

శ్లో॥ అశ్మనోజన్మలోహస్య తతఏవచతీక్ష్ణతా ।
ఉపఘాతోపితేనైవ తథానేత్రస్యతేజసః ॥ 20.



తా॥ లోహమునకు పాషాణములోనుండి ఉత్పత్తియు, ఆ పాషాణముచేతనే తీక్ష్ణత్వమును, మఱియు నాపాషాణములోనుండి చెరుపునెటులగలుగునో అట్లైయగు ననే నేత్రములకును అగ్నిరూపమైనతేజస్సులోనుండిఉత్పత్తియు, సూర్యరూపమైన తేజస్సులోనుండి దర్శనసామర్థ్యరూపమయిన తీక్ష్ణత్వమును, అత్యుష్ణముగనుండు ఆసూర్యరూపమైన తేజస్సులోనుండి చెరుపునుగలుగును. కాబట్టిమధ్యాహ్నమునందు అంజనప్రయోగము చేయకూడదని కొన్నియాచార్యులువచించెదరు.

### రాత్ర్యంజనప్రయోగ - మత దూషణము.

శ్లో॥ నరాత్రావపిశీతేతి నేత్రేతీక్ష్ణాంజనంహితమ్ ।
దోషమస్రావయత్ స్తంభ కండూజాడ్యాదికారితత్ ॥ 21.

తా॥ రాత్రులయందు నేత్రము కఫాధిక్యమువలన నతిశీతలముగనుండునపుడు తీక్ష్ణాంజనప్రయోగము హితకరమయినదికాదు. ఏలననగా ;— రాత్రికాలము సౌమ్యముగనుండుటవలన నపుడుప్రయోగించబడినతీక్ష్ణాంజనము దోషములను స్రవింపజేయక, దురద, జడత్వము, స్తంభము యీమొదలగునుపద్రవములను గలుగజేయును. కాబట్టి "స్వప్నేనరాత్రౌకాలస్యేత్యాది" శ్లోకముచే పూర్వము చెప్పియుండు రాత్ర్యంజనప్రయోగమతము యుక్తియుక్తముకాదు.

### అంజన - ప్రయోగ నిషిద్ధులు.

శ్లో॥ నాంజయేద్భీతవమిత విరిక్తాశితవేగితే ।
క్రుద్ధజ్వరితతాంతాక్షి శిరోరుక్ శోకజాగరే ॥ 22.
అదృష్టేర్కే-శిరఃస్నాతే పీతయోర్ధూమమద్యయోః ।
అజీర్ణేగ్న్యర్క-సంతప్తే దివాసుప్తేపిపాసితే ॥ 23.

తా॥ భయపడినవాడు, వమనకర్మ చేయించుకొనినవాడు, విరేకమునకుదీసికొనినవాడు, అపుడేభుజించినవాడు, మలమూత్రాదివేగము, కోపము, జ్వరము, అతిసూక్ష్మముగ, అతిప్రకాశముగనుండు వస్తుదర్శనముచే శ్రమనుజెందిన నేత్రములు, శిరోరోగము, దుఃఖము, వీనిలోనేదైనా నొకయుపద్రవముగలవాడు, జాగరణము, శిరఃస్నానము, మద్యపానము, ధూమపానము, వీనిలో దేనినైనా నొకదానింజేసినవాడు, అజీర్ణరోగి, అగ్ని, సూర్యుడు, వీరలచే తపించపడినవాడు, దివాస్వాపము చేసినవాడు, దప్పిగలవాడు, ఇట్టివారియొక్క నేత్రములయందు వైద్యుడు అంజనప్రయోగము చేయంజనదు. మఱియునటులనే మేఘాదులచే సూర్యుడుమాయబడి కంటికి తెలియరాకుండునపుడును అంజనప్రయోగము చేయంజనదు.

నిషిద్ధాంజనములు.

శ్లో॥ అతితీక్ష్ణమృదుస్తోక బహ్వచ్ఛఘనకర్కశమ్ ।
అత్యర్థశీతలంతప్త మంజనంనావచారయేత్ ॥ 24.

తా॥ అతితీక్ష్ణముగ, అతిమృదువుగ, అత్యల్పముగ, అత్యధికముగ, అతి తేటగ, అతిగట్టిగ, అతికఠినముగ, అతిశీతలముగ, అతితప్తముగనుండు అంజనమును ప్రయోగింపంజనదు.

"సుఖోపవిష్టస్యాతురస్య సూపవిష్టోవైద్యోవామాంగుష్ఠే నోత్తరం వర్త్మ కృష్ణభాగస్యాధఃకనీనికాదపాంగంయావదంజనంనయేత్ ॥"

వైద్యుడు సుఖముగగూర్చుండినవాడై ఆసనమునందు సుఖముగ గూర్చుండియుండు రోగియొక్క కంటిపై రెప్పను వామాంగుష్ఠముచే పొడవుగనెత్తిపట్టుకొని కంటిలోని నల్లగ్రుడ్డుకు క్రిందిప్రదేశమునందు నల్లగ్రుడ్డు మొదలుకొని కంటికొనవరకును అంజనము వేయవలయునని అంజనవిధి తంత్రాంతరమునందు జెప్పబడియున్నది.

అంజన - ప్రయోగానంతర కర్తవ్యము.

శ్లో॥ అథానున్మీలయన్ దృష్టిమంతఃసంచారయేచ్ఛనైః ।
అంజితేవర్త్మనీకించిచ్చాలయేచ్చైవమంజనమ్ ॥ 25.
* తీక్ష్ణంవ్యాప్నోతిసహసా నచోన్మేషనిమేషణమ్ ।
నిష్పీడనంచవర్త్మభ్యాం క్షాళనంవాసమాచరేత్ ॥ 26.

తా॥ పిదప అంజనస్వరూపాదులను తెలుసుకొని నేత్రములకు అంజనమును ప్రయోగించియుండునపుడు నేత్రములను తెరవక దృష్టిని లోననే మెల్లగసంచరింపం జేయవలయును. మఱియు రెప్పలనుకూడా కొంచెముగా చలింపంజేయవలయును. ఇటులజేసినయెడల అంజనము నేత్రములయందంతట శీఘ్రముగవ్యాపించును. ఈ విధికి వ్యతిరిక్తముగా ఉన్మేషనిమేషములనుచేయంజనదు. అటులనే రెప్పలచేనేత్రములనణచంజనదు. నేత్రముల నుదకముచేగడుగంజనదు.

నేత్రాంజన ప్రక్షాళనము.

శ్లో॥ అపేతౌషధసంరంభం నిర్వృతంనయనంయదా ।
వ్యాధిదోషర్తుయోగ్యాభిరద్భిః ప్రక్షాళయేత్తదా ॥ 27.

* నేత్రం ఇతిపా.



తా॥ ఔషధవేగమంతయు నివర్తించి నేత్రములు సుఖముగనుండునపుడు అభిష్యందాదిరోగములు, వాతాదిదోషములు, వసంతాదిఋతువులు, వీనికి యోగ్యమైన ఉదకములచే నేత్రములను ప్రక్షాళనముచేయవలయును.

శ్లో॥ దక్షిణాంగుష్ఠకేనాక్షి తతోవామంసవాససా ।
ఊర్ధ్వంవర్త్మనిసంగృహ్య శోధ్యంవామేనచేతరత్ ॥ 28.

తా॥ ప్రక్షాళనముచేసినపిదప పైరెప్పనుయెత్తిపట్టుకొని వస్త్రముతో గూడియుండు దక్షిణాంగుష్ఠముచే వామనేత్రమును, వస్త్రముతోగూడియుండువామాంగుష్ఠముచే దక్షిణనేత్రమును, శుద్ధిజేయవలయును. (అనగా తుడుపవలయునని యర్థము.)

శ్లో॥ వర్త్మప్రాప్తాంజనాద్దోషో రోగాన్కుర్యాదతోన్యథా ।

తా॥ ఆటుల శుద్ధిజేయక నుపేక్షించినయెడల రెప్పలోనుండు అంజనముచే జనించినదోషము రోగములనుగలుగజేసును. కాబట్టి నేత్రములను శుద్ధిజేయవలయును.

తీక్ష్ణాంజనాది ప్రయోగము.

శ్లో॥ కండూజాడ్యేంజనంతీక్ష్ణం ధూమంవాయోజయేత్పునః ॥ 29.

తా॥ దురద, జడత్వము ఇవికలిగియుండునపుడు తీక్ష్ణమయినఅంజనమునుగాని లేక తీక్ష్ణమైన ధూమమునుగాని ప్రయోగించవలయును.

శ్లో॥ తీక్ష్ణాంజనాభితప్తేతు * పూర్ణంప్రత్యంజనంహితమ్ ॥ 29½.

తా॥ తీక్ష్ణాంజనముచే తాపమునుజెందియుండు నేత్రమునందు ప్రత్యంజనము హితకరముగనుండును.

త్రయోవింశతితమాధ్యాయము, ముగిసెను.

* తూర్ణం ఇతిపా.

శ్రీరస్తు.

# చతుర్వింశతితమాధ్యాయము.

ఆశ్చ్యోతన, అంజనములచే నేత్రములకు తఱుచుగా దౌర్బల్యము కలుగును. కాబట్టి తన్నివారణార్థము తర్పణాద్యుపయోగ మావశ్యకము. కావున ఆశ్చ్యోతనాంజన విధ్యధ్యాయానంతరము తర్పణపుటపాకవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

## తర్పణపుటపాక — విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాత స్తర్పణపుటపాక విధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః॥
ఇతిహస్మాహు రాత్రేయాదయో మహర్షయః॥

తా॥ ఆశ్చ్యోతనాంజన విధ్యధ్యాయానంతరము తర్పణము, పుటపాకము, వీని విధిని తెలియపరచునట్టి తర్పణపుటపాక విధ్యధ్యాయమును వివరించెదము.

## తర్పణ ప్రయోగము.

శ్లో॥ నయనే తామ్యతి స్తబ్ధే శుష్కే రూక్షేభిఘాతితే।
వాతపిత్తాతురే జింహే శీర్ణపక్ష్మావిలేక్షణే। 1.
కృచ్ఛ్రోన్మీలశిరాహర్ష శిరోత్పాతతమోర్జునైః।
స్యందమంథాన్యతోవాత వాతపర్యాయశుక్రకైః॥ 2.
ఆతురే శాంతరాగాశ్రు శూలసంరంభదూషికే।
నివాతే తర్పణం యోజ్యం శుద్ధయో ర్మూర్ధకాయయోః॥ 3.
కాలే సాధారణే ప్రాతః సాయం చోత్తానశాయినః।

తా॥ నేత్రములు వాడియుండుట, స్తబ్ధముగనుండుట, శుష్కముగనుండుట, రూక్షముగనుండుట, అభిఘాతమును జెందియుండుట, వాతపిత్తములచే పీడితములుగనుండుట, ఱెప్పవెంట్రుకలూడుట, స్పష్టముగ చూపులేకుండుట, నేత్రరోగప్రకరణమునందు ఉత్తరత్ర జెప్పబడు కృచ్ఛ్రోన్మీలనము, సిరాహర్షము, సిరోత్పాతము,



తమస్సు, అర్జునము, స్యందము, మంథము, అన్యతోవాతము, వాతపర్యాయము, శుక్రకము అనునీ రోగములచే నేత్రములు పీడితములుగనుండుట, నస్యమునకు అనర్హముగనుండుట, నేత్రములయందు ఎఱుపువర్ణము, కంటినీరు, శూల, పుసి ఇవి శాంతమయియుండుట, ఇట్టి కాలములయందు శిరస్సును, దేహమును, వమనవిరేచననస్యములచే శుద్ధిచేయించి వసంతము మొదలగు సాధారణకాలములయందు సాయంకాలమునందుగాని లేక ప్రాతఃకాలమునందుగాని గాలి, ఎండ, దుమ్ము, పొగ మొదలగునవి లేకుండు ప్రదేశములో శయనమునందు వెల్లకిల పరుండియుండువానికి తర్పణక్రియను చేయవలయును.

## తర్పణ విధానము.

శ్లో॥ యవమాషమయీం పాలీం నేత్రకోశాద్బహిస్సమామ్॥ 4.
ద్వ్యంగులోచ్చాం దృఢాం కృత్వా యథాస్వం సిద్ధమావపేత్।
సర్పిర్నిమీలితే నేత్రే తప్తాంబుప్రవిలాపితమ్॥ 5.

తా॥ నేత్రకోశమునకు వెలపట యిరుపార్శ్వములయందు 2 అంగుళముల పొడవుగలదిగ, మిట్టపల్లములు లేనిదిగ, దృఢముగనుండు పాళిని (అనగా పాదిని) యవలపిండి మినుపపిండి వీనిచే జేసి దోషదూష్యములకనుగుణముగా సిద్ధము చేయబడిన ఘృతమును బాగుగా కాచబడిన ఉష్ణోదకముచే కరిగించి మూయబడియుండు నేత్రముపై విడువవలయును.

శ్లో॥ నక్తాంధ్యవాతతిమిర కృచ్ఛ్రబోధాదికే వసామ్।
ఆపక్ష్మాగ్రాత్

తా॥ రేచీకటి, వాతరోగము, తిమిరము, కృచ్ఛ్రోన్మీలనము, యీ మొదలగు రోగములయందు దోషదూష్యాదులకనుగుణముగా సిద్ధము చేయబడిన వసను (అనగా మాంసములోని క్రొవ్వును) ఉష్ణోదకముచే కరిగించి కంటిఱెప్ప వెంట్రుకలు మునుగువరకు విడువవలయును.

## తర్పణ - క్రియా - ధారణ కాలము.

శ్లో॥ అథోన్మేషం శనైస్తస్య కుర్వతః॥ 6.
మాత్రాం విగణయేత్తత్ర వర్త్మసంధిసితాసితే।
దృష్టౌ చ క్రమశో వ్యాధౌ శతం త్రీణి చ పంచ చ॥ 7.
శతాని సప్త చాష్టౌ చ దశ మంథే వసానిలే।
పిత్తే షట్ స్వస్థవృత్తే చ బలాసే పంచ ధారయేత్॥ 8.

తా॥ పై జెప్పిన ఘృతాది ప్రక్షేపానంతరము రోగి మెల్లమెల్లగ నేత్రోన్మీలనము చేయుచుండునపుడు వర్త్మ, సంధి, సిత, అసిత, దృష్టి అను నీ నేత్రరోగములయందు యథాక్రమముగా 100, 300, 500, 700, 800 (అనగా వర్త్మరోగమునందు 100, సంధి రోగమునందు 300, సిత రోగమునందు 500, అసిత రోగమునందు 700, దృష్టిరోగమునందు 800) మాత్రల నెంచవలయును. మంథరోగమునందు 1000 వాతరోగమునందు 1000, పిత్తరోగమునందును, నీరోగముగ నుండునపుడును 600, కఫమునందు 500 మాత్రలనెంచవలయును. అటుల మాత్రలనెంచువరకు నారోగి ఘృతమును నేత్రములందు ధరించుకొనియుండవలయును.

## తర్పణానంతర కర్తవ్యము.

శ్లో॥ కృత్వావాంగేతతోద్వారం స్నేహంపాత్రేతుగాలయేత్ ।
పిబేచ్చధూమంనేక్షేత వ్యోమరూపంచభాస్వరమ్ ॥ 9.

తా॥ పై జెప్పిన మాత్రాకాలమువరకు ఆ ఘృతమును ధరించినపిదప కంటికొనయందు పై జెప్పిన పాళిలో ద్వారము చేసి దానివలనవచ్చునట్టి స్నేహము నొకపాత్రలో దీసుకొనవలయును. పిదప సక్తువులపిండిచే అక్షికోశమునుతుడిచి కఫోపశమనార్థమై ధూమపానము చేయించి పిదప నేత్రమునుకడిగి మాత్రగా భోజనముచేయించవలయును. మఱియు నారోగి మధ్యాహ్నమునం దాకాశమును, ఎండను, ప్రకాశమైన రూపములను చూడంజనదు.

## వాతాదిదోషములయందు - తర్పణ క్రమము.

శ్లో॥ ఇత్థంప్రతిదినంవాయౌ పిత్తేత్వేకాంతరంకఫే ।
స్వస్థేచద్వ్యంతరం దద్యాదాతృప్తేరితియోజయేత్ ॥ 10.

తా॥ పై జెప్పిన క్రమప్రకారము వాతములో ప్రతిదినము తర్పణక్రియను చేయుచుండవలయును. పిత్తములో మధ్య నొక్కొకదినము విడిచి తర్పణక్రియను చేయుచుండవలయును. కఫమునందును, స్వస్థముగనుండునపుడును మధ్య రెండు రెండు దినములను విడిచి తర్పణక్రియను చేయుచుండవలయును. ఈ ప్రకారము నేత్రములు తృప్తిగలుగువరకు తర్పణక్రియను చేయుచుండవలయును.

## తృప్తాది లక్షణము.

శ్లో॥ ప్రకాశక్షమతాస్వాస్థ్యం విశదంలఘులోచనమ్ ।
తృప్తేవిపర్యయోఽతృప్తేఽతిస్నిగ్ధే శ్లేష్మజారుజః । 11.



తా॥ నేత్రములకు పూర్తిగా తృప్తికలిగియుండునపుడు ప్రకాశమైనవస్తువును, కాంతిని, సహించతగినశక్తి నేత్రములకుకలుగును. మఱియు నేత్రములు నిర్మలముగ, లఘువుగ, స్వస్థముగనగును. నేత్రములు తర్పణక్రియచే పూర్తిగా తృప్తిజెందకుండునపుడు ప్రకాశము మొదలగువానిని సహించకుండుట, స్వస్థతలేకుండుట, నైర్మల్యరహితముగనుండుట, గురుత్వము యీ మొదలగు లక్షణములుగలుగును. నేత్రములకు తర్పణక్రియచే నతితృప్తికలిగియుండునపుడు దురద మొదలగు కఫసంబంధమైన రోగములు గలుగును.

## పుటపాక విధి.

శ్లో॥ స్నేహపీతాతనురివ క్లాంతాదృష్టిర్హిసీదతి ।
తర్పణానంతరంతస్మాద్దృగ్బలాధానకారిణమ్ ॥ 12
పుటపాకంప్రయుంజీత పూర్వోక్తేష్వేవయక్ష్మసు ।

తా॥ స్నేహపానముచేసి యుండు నేత్రము స్నేహపానముచేసియుండు దేహమువలెనే బడలికనుజెంది దౌర్బల్యమునుజెందును. కాబట్టి తర్పణానంతరము నేత్రములకు బలమునిచ్చునట్టి పుటపాకమును తర్పణసాధ్యరోగములయందు చేయవలయును.

## దోషానుగుణ పుటపాకము.

శ్లో॥ సవాతేస్నేహనశ్శ్లేష్మసహితేలేఖనోహితః ॥ 13.
దృగ్దౌర్బల్యేనిలేపిత్తే రక్తేస్వస్థేప్రసాదనః ।

తా॥ వాతములో స్నేహనమను పుటపాకము హితకరము, కఫయుక్తవాతములో లేఖనమనుపుటపాకము హితకరము. నేత్రదౌర్బల్యము, వాతము, పిత్తము, రక్తము, స్వాస్థ్యము, వీనియందు ప్రసాదనమను పుటపాకము హితకరము.

## స్నేహన - పుటపాక కల్పన.

శ్లో॥ భూశయప్రసహానూప మేదోమజ్జావసామిషైః ॥ 14.
స్నేహనంపయసాపిష్టైర్జీవనీయైశ్చకల్పయేత్ ।

తా॥ బిలేశయము (అనగా కప్ప, ఉడుము, మొదలగుజంతువులు), ప్రసహము (అనగా ఆవు, గాడిదె మొదలగు జంతువులు), అనూపము (అనగా మహామృగము, వారిచరము, వారిశయము మొదలగుజంతువులు) అనువానియొక్క మేదస్సు, మజ్జ, వస మాంసము, వీనిచేతను, స్నేహము క్షీరము వీనిచే బిసుకబడిన జీవంతి, కాకోళి మొదలగు జీవనీయద్రవ్యములచేతను, స్నేహనమను పుటపాకమును సిద్ధముచేయవలయును.

### లేఖన - పుటపాక కల్పన.

శ్లో॥ మృగపక్షియకృన్మాంస ముక్తాయస్తామ్రసైంధవైః ॥ 15.
స్రోతోజశంఖఫేనాలైః ర్లేఖనఃమస్తుకల్పితైః ।

తా॥ హరిణము మొదలగు మృగములు, విష్కిరము ప్రతుదము మొదలగు పక్షులు, అనువానిమాంసములు, ముత్తియములు, ఇనుము, తామ్రము, సైంధవలవణము, స్రోతోంజనము, శంఖము, సముద్రపునురుగు, వీనిని మస్తువుతోజేర్చికలిపి లేఖనమనుపుటపాకమును సిద్ధముచేయవలయును. దీనియందు జాంగలమృగ, పక్షిమాంసములను చేర్చుకొనవలయును.

### ప్రసాదన - పుటపాక కల్పన.

శ్లో॥ మృగపక్షియకృన్మజ్జా వసాంత్రహృదయామిషైః ॥ 16.
మధురైస్సఘృతైస్స్తన్య క్షీరపిష్టైః ప్రసాదనమ్ ।

తా॥ మృగము, పక్షి మొదలగువానియొక్క యకృత్తు, మజ్జ, వస, ఆంత్రము (అనగా ప్రేగులు), హృదయమాంసము వీనిని మధురవర్గములో జెప్పబడిన ఘృతముల చేతను, స్త్రీస్తన్యక్షీరముచేతను పిసికి ప్రసాదనమను పుటపాకమును సిద్ధము చేయవలయును.

### పుటపాక - ప్రయోగ క్రమము.

శ్లో॥ బిల్వమాత్రంపృథక్ పిండం మాంసభేషజకల్కయోః ॥ 17.
ఉరుబూకవటాంభోజ పత్రైస్స్నేహాదిషుక్రమాత్ ।
వేష్టయిత్వామృదాలిప్తం ధవధన్వనగోమయైః ॥ 18.
పచేత్ప్రదీప్తైరగ్న్యాభం పక్వంనిష్పీడ్యతద్రసమ్ ।
నేత్రేతర్పణవద్యుంజ్యాత్

తా॥ పైజెప్పిన స్నేహాదిపుటపాకములలోజెప్పియుండుమాంసమును, ఔషధకల్కమును వేర్వేరుగా మారేడుకాయంత ఉంటగజేసి వానిని యథాక్రమముగా ఆముదపాకులు, మఱ్ఱియాకులు, తామరాకులు, వీనిచేజుట్టి వానిపై కృష్ణమృత్తికను, 2 అంగుళములప్రమాణము లేపనముచేసి యథాక్రమముగాచండ్రకఱ్ఱలు, తిరుమంగలి కఱ్ఱలు, ఏరుపిడకలు, అనువానిచే పాకముచేయవలయును. (అనగా మాంసము, ఔషధకల్కము వీనిపిండమును స్నేహనపుటపాకములో ఆముదపాకులచేజుట్టి చండ్రకఱ్ఱలచే



మంటవేసి పాకముచేయవలయును. లేఖనపుటపాకములో మఱ్ఱియాకులచేజుట్టి తిరుమంగలికఱ్ఱలచేమంటవేసి పాకముచేయవలయును. ప్రసాదనమను పుటపాకములో తామరాకులచేజుట్టి ఏరుపిడకలచేమంటవేసి పాకముచేయవలయును అని తాత్పర్యము.) పైజెప్పినపిండములు ఎఱ్ఱగకాలి నిప్పువలెనుండునపుడువాని పక్వంబులైనవని తెలుసుకొని వానిని గ్రహించి వానిపైజేసియుండు లేపనమును, పత్రములను తీసివేసి శుద్ధమయిన వస్త్రములోనునుచుకొని దానిరసమునపిండితీసుకొని యారసమును తర్పణక్రియవలెనే నేత్రములయందు ప్రయోగించవలయును.

శ్లో॥ శతంద్వేత్రీణిధారయేత్ ॥ 19.
* లేఖనస్నేహనాంత్యేషు

తా॥ లేఖనము, స్నేహనము, ప్రసాదనము, అను నీ పుటపాకములను యథాక్రమముగా (అనగాలేఖనపుటపాకమును 100 మాత్రాకాలమువరకును, స్నేహనపుటపాకమును 200 మాత్రాకాలమువరకును, ప్రసాదనపుటపాకమును 300 మాత్రాకాలమువరకును) ధరించవలయును.

శ్లో॥ పూర్వౌకోష్ణౌహిమోఽపరః ।

తా॥ స్నేహన, లేఖన పుటపాకములను సుఖోష్ణముగా ప్రయోగించవలయును. ప్రసాదనమను పుటపాకమును శీతలముగా ప్రయోగించవలయును.

### పుటపాకానంతర ధూమపానము.

శ్లో॥ ధూమపోంతేతయోరేవ

తా॥ స్నేహన, లేఖన, పుటపాకములయొక్క అంతమునందుమాత్రము కఫశమనార్థము ధూమపానముచేయవలయును.

### పుటపాక - సమ్యగ్యోగాదులు.

శ్లో॥ యోగాస్తత్రచతృప్తివత్ ॥ 20.

తా॥ పైజెప్పిన పుటపాకములయొక్క సమ్యగ్యోగ, అయోగ, అతియోగములను తర్పణక్రియయొక్క సమ్యగ్యోగ, అయోగ, అతియోగములవలెనే తెలుసుకొనవలయును.

### తర్పణ - పుటపాకానర్హులు.

శ్లో॥ తర్పణంపుటపాకంచ నస్యానర్హేనయోజయేత్ ।

---

* యాతుస్నేహనమధ్యేషు ఇతిపా.

తా॥ తర్పణము, పుటపాకము యీ 2-ని నస్యకర్మకు అనర్హుడుగనుండువాని విషయమునందు ప్రయోగించఁజనదు.

తర్పణాదులయందు హితాహారాదులు.

శ్లో॥ యావంత్యహానియుంజీత ద్విస్తతో హితభాగ్భవేత్ ॥ 21.

తా॥ ఎన్నిదినములు తర్పణము, పుటపాకము వీనిం జేసుకొనుచున్నాడో అంతకంటె ద్విగుణకాలమువరకు హితాహారవిహారాదులను సేవించుచుండవలయును.

శ్లో॥ మాలతీమల్లికాపుష్పై ర్బద్ధాక్షో నివసేన్నిశి ।

తా॥ తర్పణపుటపాకములను చేయించుకొనినవాడు రాత్రియందు జాజిపూలు, మల్లెపూలు వీనిని నేత్రములపైనునిచి కట్టుకొనియుండవలయును.

నస్యకర్మాద్యావశ్యకత్వము.

శ్లో॥ సర్వాత్మనా నేత్రబలాయయత్నంకుర్వీత నస్యాంజనతర్పణాద్యైః ॥
దృష్టిశ్చనష్టావివిధంజగచ్చ తమోమయం జాయత ఏకరూపమ్ ॥

తా॥ నేత్రములకు బలముగలుగుటకై మనుజుడు నస్యము, అంజనము, తర్పణము యీ మొదలగువానిని సర్వప్రకారములచే జేయించుకొనుటకు యత్నించవలయును. ఏలననగా:—నేత్రములు నష్టములు నేని వివిధప్రపంచము తమస్స్వరూపముగలదియై యేకరూపముగ గనుపించును.

చతుర్వింశతితమాధ్యాయము, ముగిసెను.

---

శ్రీరస్తు.

# పంచవింశతితమాధ్యాయము.

వస్తి, నస్యము, అంజనము, క్షారకర్మ, అగ్నికర్మ యీ మొదలగునవి యంత్రసాధ్యంబగుటవలన అంజనవిధ్యధ్యాయానంతరము యంత్రవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

## యంత్ర - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతో యంత్రవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయో మహర్షయః ॥

తా॥ అంజనవిధ్యధ్యాయానంతరము యంత్రవిధ్యధ్యాయమును వివరించెదము. యంత్రమనగా.—శస్త్రమునకు వ్యతిరిక్తంబైన ఘటకారు, చిమటా, శ్రావణము, శలాకు, యీ మొదలగు మొక్కగనుండునాయుధములని యర్థము.

యంత్ర నిరూపణము.

శ్లో॥ నానావిధానాంశల్యానాం నానాదేశ * ప్రబాధినామ్ ।
ఆహర్తుమభ్యుపాయోయ స్తద్యంత్రంయచ్చదర్శనే ॥ 1.
అర్శోభగందరాదీనాం శస్త్రక్షారాగ్నియోజనే ।
శేషాంగపరిరక్షాయాం తథావస్త్యాదికర్మణి ॥ 2.
ఘటికాలాబుశృంగంచ జాంబవోష్ఠాదికానిచ ।

తా॥ నానావిధమైన శరీరప్రదేశములను బాధించుచుండునట్టి శల్యము, వెదురు, పాషాణము మొదలగు నానావిధశల్యములను దర్శించుటకును, ఆకర్షణము చేయుటకును, అర్శస్సు, భగందరము, నాడీవ్రణము యీ మొదలగురోగములలో శస్త్రక్షారాగ్నికర్మల చేయునపుడు నీరోగముగనుండు యితరఅంగములనురక్షించుటకును, వస్త్యాదికర్మలం జేయుటకును సాధనముగనుండునది యంత్రమనబడును. మతియును పిచువుచే (అనగా ప్రత్తిగుడ్డచే) రక్తమునాకర్షించుటకు సాధనముగనుండుచిన్నకుండ సొరకాయ

* ప్రవేశినాం ఇతిపా.

బుట్ట, పశువులు మొదలగువాని కొమ్ములు, జాంబనోష్ఠము (అనగా నేరేడు విత్తుతో తుల్యమైనముఖముగల ఒకవిధమగు శలాకాయంత్రము) యీ మొదలగునవియును యంత్రములనబడును.

"యంత్రశతమేకోత్తరమత్రహస్తమేవప్రధానతమం యంత్రాణామవగచ్ఛ । కింకారణమ్ । యస్మాద్ధస్తాదృతేయంత్రాణామప్రవృత్తిరేవ తదధీనత్వాద్యంత్రకర్మణామ్। తత్రమనశ్శరీరాబాధకరాణిశల్యాని తేషామాహరణోపాయోయంత్రాణి ॥ తాణిషట్ప్రకారాణి । తద్యథా । స్వస్తికయంత్రాణి సందంశయంత్రాణి తాలయంత్రాణి నాడీయంత్రాణి శలాకాయంత్రాణి ఉపయంత్రాణిచేతి ॥ తత్ర చతుర్వింశతిః స్వస్తికయంత్రాణి । ద్వేసందంశయంత్రే ద్వేఏవ తాలయంత్రే వింశతిర్నాడ్యః అష్టావింశతిశ్శలాకాః పంచవింశతిరుపయంత్రాణి ॥"

యంత్రములు 101. మనశ్శరీరంబులకు గడుబాధంగలుగజేయు శల్యములందీయుటకై సాధనంబులుగనుండు పటకారు, చిమిటా, [illegible]వణము, శలాక యీ మొదలగునవి యంత్రములనబడును. సమస్తయంత్రవ్యాపారంబులు హస్తాధీనంబులైయుండుటంజేసి హస్తము అన్నిటిలోను ప్రధానంబైయుండును. యంత్రములు స్వస్తికయంత్రంబులనియు, సందంశయంత్రంబులనియు, తాలయంత్రంబులనియు, నాడీయంత్రంబులనియు, శలాకాయంత్రంబులనియు, ఉపయంత్రంబులనియు 6 విధంబులు. వానిలో స్వస్తికయంత్రములు 24 విధంబులుగ, సందంశయంత్రములు 2 విధంబులుగ, తాలయంత్రములు 2 విధంబులుగ, నాడీయంత్రములు 20 విధంబులుగ, శలాకాయంత్రములు 28 విధంబులుగ, ఉపయంత్రములు 25 విధంబులుగనుండును; అని సుశ్రుతమునందు జెప్పబడియున్నది. ఈయంత్రములను ఇండియాదేశములోని పూర్వీకపుశస్త్రవైద్యులు 2 కార్యములయందుపయోగించు చుండిరి. అవియెవ్వి యనగా: మొదటిది ఆకస్మికమువలన మనుజునిశరీరములో ప్రవేశించిన పనసగల రాతిగుండ్లు, [illegible] యందు సన్నముగనుండు వెనుకట్లు యీ మొదలగువానినాకర్షించుటకును, వ్యాధులచేగలుగు కణుతులనాకర్షించుటకును, [illegible] ములో శరీరమునందు ప్రవేశించిన బాణముయొక్క కొనమొదలగువానిందీయుటకును, [illegible], [illegible], నాసికము, యోని, భుజములు యీ మొదలగువానిం జెందియుండు శల్యములందీయుటకును, గర్భములో మృతిజెందిన శిశువు, అగ్నిపము, రాళ్ళు, పుచ్చిపోయియున్న దంతములు, మూత్రకోశములో జేరియుండు రాళ్ళు, యీ మొదలగువానిందీయుటకును, [illegible] [illegible]



మును పరీక్షించుటకును, అర్శస్సు, భగందరము యీ మొదలగురోగములయందు శస్త్రక్షారాగ్నికర్మాదులజేయుటకును అని తెలియవలయును.

## యంత్ర - నిర్మాణ క్రమము.

శ్లో॥ అనేకరూపకార్యాణి యంత్రాణివివిధాన్యతః ॥ ౩.
వికల్పయేత్కల్పయేద్బుద్ధ్యా

తా॥ స్వస్తికాదియంత్రములు కంకముఖము (అనగా రాబులుగువంటిముఖము) మొదలగు ననేక విధములగు నాకారములు, అస్థ్యాదులనుజెందియుండు శల్యములను బయలుపరచుట మొదలగు ననేకవిధములగు కృత్యములుగలవిగ నుండును. కావున నా స్వస్తికాదియంత్రములను బుద్ధిచే బాగుగనాలోచించి ఆయాకార్యముల కనుగుణముగా నిర్మించుకొనవలయును.

"తాణిప్రాయశోలోహానిభవంతి తత్ప్రతిరూపకాణివా తదలాభే। తత్రనానాప్రకారాణాంవ్యాలానాంమృగపక్షిణాం ముఖైర్ముఖానియంత్రాణాం ప్రాయశః సదృశానితస్మాత్తత్సారూప్యా దాగమాదుపదేశాదన్యయంత్రదర్శనాద్యుక్తితశ్చకారయేత్ ॥ సమాహితానియంత్రాణిఖరశ్లక్ష్ణముఖానిచ। సుదృఢానిసురూపాణిసుగ్రహాణిచకారయేత్ ॥"

పైజెప్పిన యంత్రంబులనన్నిటిని తఱుచుగ లోహములచే జేయవలయును. ఇట్టి లోహయంత్రంబులు సమయమునకు సంఘటించకున్న వయ్యైశల్యస్థానంబులకుపయుక్తంబగు దారు మొదలగువానిచేజేయబడిన యంత్రముల నుపయోగింపందగును. మఱియు నీ యంత్రంబులు నానావిధ మృగపక్షి సర్పాదులముఖముతో తుల్యమైన ముఖముగలవిగ నుండుంగాన నందుకొన్నిటిని సారూప్యమువలనను, కొన్నిటిని శాస్త్రజ్ఞానమువలనను, కొన్నిటినిగురూపదేశమువలనను, మఱికొన్నిటినియితరయంత్రములంజూచుటవలనను, మఱికొన్నిటిని నిజయుక్తివైశద్యంబువలనను జేయందగును. యంత్రంబులన్నిటినిసమంబులుగను, సునుపుగల తీక్ష్ణముఖంబులుగలవిగను, దృఢంబులుగను, చూచుటకు సొగసుగను, సొగసైన పిడులతోగూడినవిగను జేయించవలయును అనిసుశ్రుతమునందుచెప్పబడియున్నది.

శ్లో॥ యథాస్థూలంతువక్ష్యతే ।

తా॥ ఇచట స్థూలముగా యంత్రములు చెప్పబడును. కావున వానివలెనే సూక్ష్మములగు నితరయంత్రములనుకూడా స్వబుద్ధిచే కల్పనజేసికొనవలయును.

## స్వస్తిక - యంత్ర నిరూపణము.

శ్లో॥ తుల్యానికంకసింహర్క్ష కాకాదిమృగపక్షిణామ్ ॥ 4.
ముఖైర్ముఖానియంత్రాణాం కుర్యాత్తత్సంజ్ఞకానిచ ।
అష్టాదశాంగులాయామా న్యాయసానిచభూరిశః ॥ 5.
మసూరాకారపర్యంతైః కంఠేబద్ధానికీలకైః ।
విద్యాత్స్వస్తికయంత్రాణి మూలేఽంకుశనతానిచ ॥ 6.
తైర్దృఢైరస్థిసంలగ్న శల్యాహరణమిష్యతే ।

తా॥ స్వస్తికయంత్రములను కంకము, సింహము, ఋక్షము యీ మొదలగు మృగములు, కాకము మొదలగుపక్షులు వీనిముఖములతో తుల్యమయిన ముఖములు (అనగా శల్యమును తీయునట్టి పాద్య్వములు లేక నోళ్ళు) గలవిగ, 18 అంగుళముల నిడుపు, కొనయందు చిఱుసెనగలయాకారముగల కీలకములచే (అనగా మేకులచే) * కంఠప్రదేశమునందు బంధనము, మూలప్రదేశమునందు (అనగా యంత్రమును చేతితో పట్టుకొనునట్టి స్థలమునందు) అంకుశమువలె నొకింత వంకరగలవిగ, తెలుచుగ అయోమయములుగ నిర్మించవలయును. అటుల నిర్మించబడు స్వస్తికయంత్రములను ముఖానుగుణమగు నామములే కలుగును. (అనగా కంకముఖమువలెనుండు స్వస్తిక యంత్రమునకు కంకముఖమను నామమును, సింహముఖమువలెనుండుస్వస్తికయంత్రమునకు సింహముఖమను నామమును, యిటుల రూపానుగుణముగా నామములు గలుగును. అని తాత్పర్యము.) దృఢముగనుండు కంకముఖము మొదలగు స్వస్తికయంత్రములచే అస్థినాశ్రయించియుండు శల్యములను తీసివేయవలయును.

"తత్రస్వస్తికయంత్రాణ్యష్టా దశాంగులప్రమాణాని సింహవ్యాఘ్ర వృకతరక్ష్వృక్షద్వీపమార్జారసృగాలమృగైర్వారుక కాకకంకకురరభాస శశఘాత్యులూకచిల్లిశ్యేనగృధ్రక్రౌంచ భృంగరాజాంజలికర్ణావభంజన నందిముఖముఖాని మసూరాకృతిభిః కీలైరవబద్ధానిమూలేఽంకుశవదా వృత్తవారంగాణ్యస్థివిదష్టశల్యోద్ధరణార్థముపదిశ్యంతే ॥"
అను వచనముచే స్వస్తికయంత్రములు 18 అంగుళములు నిడుపుగలిగి సింహము, వ్యాఘ్రము (అనగా పెద్దపులి), వృకము (అనగా తోడేలు), తరక్షు (అనగాసివంగి) ఋక్షము (అనగా ఎలుగుగొడ్డు), ద్వీపి (అనగా చిరుతపులి,) మార్జాలము (అనగా

* కంఠప్రదేశమనగా :—ఆయుధముయొక్క 2 ముక్కలను నొకటిగజేర్చి మేకుచే బంధించబడు ప్రదేశము.



పిల్లి), సృగాలము (అనగా నక్క), మృగము (అనగా జింక), ఐర్వారుకము, కాకము (అనగా కాకి), కంకము (అనగా రాబులుగు), కురరము (అనగాకలహంస,) భాసము (అనగా పీతిరిగద్ద), శశఘాతి (అనగా భైరవడేగ) ఉలూకము (అనగా గుడ్లగూబ,) చిల్లి (అనగా చిందపిట్ట), శ్యేనము (అనగా డేగ), గృధ్రము (అనగా గద్ద), క్రౌంచపక్షి, భృంగరాజము (అనగా కూకటిమూగపిట్ట), అంజలికర్ణము (అనగా చుంచు), అవభంజనము, నంది (అనగా ఎద్దు,) వీనిముఖంబులం బోలిన (అనగా నోళ్ళంబోలిన) ముఖంబులంగలిగి చిఱుసెనగలవంటి కీలకములచే (అనగాఆణులచే) బిగియింపంబడి యంకుశపు పిడివంటిపిడిచేనుండవలయుననియు, అవి అస్థిగతశల్యంబులందీయనుపయుక్తంబగుననియు, సుశ్రుతమునందు చెప్పబడియున్నది.

## సందంశ - యంత్ర నిరూపణము.

శ్లో॥ కీలబద్ధవిముక్తాగ్రౌ సందంశౌషోడశాంగులౌ ॥ 7.
త్వక్సిరాస్నాయుపిశిత లగ్నశల్యాపకర్షణౌ ।

తా॥ చిఱుసెనగలయాకారముగల కీలకములచే ముఖప్రదేశమునందు బంధించబడియుండు సందంశయంత్రము 1, ముఖప్రదేశమునందు బంధించబడకుండా విడువబడియుండు సందంశయంత్రము 1, ఇటులసందంశయంత్రములు 2 విధంబులు. వానిలో బంధనముతోగూడియుండు సందంశయంత్రము కమ్మరవానికారనబడును. దీనినే కొందరు పటకారయనియుననియెదరు. బంధనములేకుండు సందంశయంత్రము నీరుకారనబడును. సందంశమను 2 యంత్రములు 16 అంగుళములనిడుపుగలవిగనుండును. వీనిని త్వక్కు, సిరలు, స్నాయువులు, మాంసము, వీనినాశ్రయించియుండు శల్యములందీయుటయందుపయోగించవలయును.

## పక్ష్మాద్యాకర్షణ - సందంశ యంత్రము.

శ్లో॥ షడంగులోఽన్యోహరణే సూక్ష్మశల్యోపపక్ష్మణామ్ ॥ 8.

తా॥ మఱియు నొకవిధమగు సందంశయంత్రముకలదు. అది 6 అంగుళముల నిడుపుగలదిగనుండును. అది నాసారోమాదులు, కంటిఱెప్ప వెంట్రుకలు యీ మొదలగు సూక్ష్మమైన శల్యముల నాకర్షించుటయందుపయోగించును. దీనినే కొందరు ముచుండియనియుననియెదరు.

## ముచుండీ - యంత్ర నిరూపణము.

శ్లో॥ ముచుండీసూక్ష్మదంతర్జు ర్మూలేరుచకభూషణా ।
గంభీరవ్రణమాంసానా మర్మణశ్ఛేషితస్యచ ॥ 9.

తా॥ ముచుండియను నామముగలయంత్రము సూక్ష్మమైన దంతములుగలదిగను, వంకరలేనిదిగను, మూలప్రదేశమునందు (అనగా పట్టుకొనునట్టి స్థలమునందు) ఉంగరములవలె నుండువలయములతో గూడినదిగనుండును. ఇదిగంభీరమైన వ్రణము నందుండు మాంసముల నాకర్షించుటయందును, ఛేదించగా శేషించియుండు అర్శోరోగము నాకర్షించుటయందు నుపయోగించును. ముచుండియను యంత్రముయొక్క ఉంగరములను పట్టుకొని వదిమినచో నది మాంసాదుల నాకర్షణముచేసును.

## తాలయంత్ర నిరూపణము.

శ్లో॥ ద్వేద్వాదసాంగులేమత్స్య తాలవద్ద్వ్యేకతాలకే।
తాలయంత్రేస్మృతేకర్ణ నాడీశల్యాపహారిణీ॥ 10.

తా॥ తాలయంత్రము 12 అంగుళముల నిడుపుగలదిగను, మత్స్యముయొక్క నోటిలోపలి దౌడవంటి యాకారముగలదిగనుండును ఈ తాలయంత్రము ద్వితాలకము (అనగా నిరుపార్శ్వములయందు మత్స్యముఖాకారముగలది) ఏకతాలకము (అనగా ఒక పార్శ్వమునందు మత్స్యముఖాకారముగలది) అని 2 విధంబులు. ఇవి కర్ణ-నాడీశల్యముల నాకర్షణము చేయుటయం దుపయోగించును.

## నాడీయంత్ర నిరూపణము.

శ్లో॥ నాడీయంత్రాణిసుషిరా ణ్యేకానేకముఖానిచ।
స్రోతోగతానాంశల్యానా మామయానాంచదర్శనే॥ 11.
క్రియాణాంసుకరత్వాయ కుర్యాదాచూషణాయచ।
తద్విస్తారపరీణాహ దైర్ఘ్యం స్రోతోనురోధతః॥ 12.

తా॥ నాడీయంత్రములు వస్తియంత్రములవలె ద్వారములు గలవిగనుండును. వానిలోగొన్నిటికి ఏకద్వారము కొన్నిటికి అనేకద్వారములు గలిగియుండును. ఇవి కర్ణము మొదలగు స్రోతస్సులను జెందియుండు శల్యములను, కంఠము మొదలగు స్రోతస్సులను జెందియుండురోగములను దర్శించుట (అనగా కనిపెట్టుట) యందును, శస్త్రకర్మ, క్షారకర్మ, అగ్నికర్మ, ప్రక్షాళనము, ఔషధప్రయోగము యీ మొదలగు కర్మలను సుఖముగా జేయుటయందును, విషదష్టముగనుండు అంగములు మొదలగు వానిని ఆ చూషణము చేయుటయందును (అనగాజుర్రుటయందును) ఉపయోగించును (రెండు ద్వారములుగల నాడీయంత్రమును ఆ చూషణమునందును, అనేక ద్వారములు గల నాడీయంత్రమును లోపనుండు శల్యములను వెలుపలికి విడలింపజేయుటయందును, ఏకద్వారముగల నాడీయంత్రమును శస్త్రక్షారాగ్ని ప్రక్షాళనౌషధప్రయోగములయం



దును ఉపయోగించవలయును.) మఱియు నా నాడీయంత్రములను అనువాసనవస్తి, ఉత్తరవస్తి, నస్యము, వీనికర్మలయం దుపయోగించువాడులవలె నాయాస్రోతస్సుల కనుగుణముగా వెడల్పు, నిడుపు గలవిగజేయించుకొనవలయును.

## కంఠశల్యావలోకన - నాడీ యంత్రము.

శ్లో॥ దశాంగుళార్ధనాహాంతః కంఠశల్యావలోకనే। నాడీ

తా॥ కంఠముయొక్క లోభాగమును జెందియుండు శల్యములంజూచుటకై ఉపయోగించు నాడీయంత్రము 10 అంగుళములునిడుపు, 5 అంగుళములు వెడల్పుగలదిగ నుండవలయును.

## శల్యాహరణ - నాడీ యంత్రము.

శ్లో॥ పంచముఖచ్ఛిద్రా చతుష్కర్ణస్యసంగ్రహే॥ 13.
వారంగస్యద్వికర్ణస్య త్రిచ్ఛిద్రాతత్ప్రమాణతః।

తా॥ నాలుగు కర్ణములుగల వారంగమును (అనగా ఖడ్గము మొదలగువానిపిడులను) ఆకర్షించుటకై ఉపయోగించునట్టి నాడీయంత్రము 5 ముఖద్వారములుగలదిగ నుండవలయును. 2 కర్ణములుగలవారంగము వాకర్షించుటకై ఉపయోగించెడు నాడీయంత్రము 3 ముఖద్వారములుగలదిగ నుండవలయును.

## శరీరాంతర్గత - శల్యావలోకన - నాడీ యంత్రము.

శ్లో॥ వారంగకర్ణసంస్థానా నాహదైర్ఘ్యానురోధతః॥ 14.
నాడీలేవంవిధాశ్చాన్యా ద్రష్టుంశల్యానికారయేత్।

తా॥ శరీరాంతర్గతమైన శల్యములను చూచుటకు వారంగముయొక్క కర్ణము, ఆకారము, వెడల్పు, నిడుపు వీని కనుగుణముగా యితరమైన నాడీయంత్రములనుకూడా చేయించుకొనవలయును.

## శల్యనిర్ఘాతన - నాడీ యంత్రము.

శ్లో॥ పద్మకర్ణికయామూర్ధ్ని సదృశీద్వాదశాంగుళా॥ 15.
చతుర్థసుషిరానాడీ శల్యనిర్ఘాతినీమతా।

తా॥ శిరః ప్రదేశమునం పద్మకర్ణికతో (అనగా తామరదుద్దుతో) సమానముగను, 12 అంగుళముల నిడుపుగలదిగను, అంగుళప్రమాణముగల ద్వారముగలదిగనుండు నాడీయంత్రము శల్యనిర్ఘాతిని యనబడును. దీనిని శల్యములను నశింపజేయుటయం దుపయోగించవలయును.

## అర్శోనాడీ - యంత్ర నిరూపణము.

శ్లో॥ అర్శసాంగోస్తనాకారం యంత్రకంచతురంగులమ్ ॥ 16.
నాహేపంచాంగుళంపుంసాం ప్రమదానాంషడంగులమ్।
ద్విచ్ఛిద్రందర్శనేవ్యాధే రేకచ్ఛిద్రంతుకర్మణి ॥ 17.
మధ్యేస్యత్ర్యంగులంఛిద్ర మంగుష్ఠోదరవిస్తృతమ్ ।
అర్ధాంగుళోచ్ఛ్రితోద్వృత్త కర్ణికంతుతదూర్ధ్వతః ॥ 18.
శమ్యాఖ్యంతాదృగచ్ఛిద్రం యంత్రమర్శః ప్రపీడనమ్ ।

తా॥ అర్శోరోగ చికిత్సోపయోగయంత్రము గోస్తనాకారముగను, 4 అంగుళములు నిడుపుగలదిగనుండవలయును. మఱియునది పురుషులకైన యెడల 5 అంగుళములు వెడల్పు, స్త్రీలకైనయెడల 6 అంగుళములు వెడల్పుగలదై యుండవలయును. ఏలననగా:—స్త్రీలయొక్క గుదము స్వభావముగనే పెద్దదిగనుండును. వ్యాధిని చూచునట్టి అర్శోయంత్రము 1, శస్త్రక్షారాగ్ని కర్మలంజేయునట్టి అర్శోయంత్రము 1, అర్శస్సును పీడించునట్టి (అనగానలుపునట్టి) యంత్రము 1, ఇటుల అర్శోయంత్రములు 3 విధంబులు. వానిలో వ్యాధిని చూచునట్టియంత్రము యిరుపార్శ్వములయందు ద్వారములుగలదిగ నుండవలయును. శస్త్రక్షారాగ్ని కర్మలంజేయునట్టి యంత్రము ఒకపార్శ్వమున ద్వారముగలదిగనుండవలయును. శస్త్రక్షారాగ్ని కర్మోపయుక్తయంత్రమునకు మధ్యమునందు 3 అంగుళములు నిడుపు, అంగుష్ఠమధ్యతుల్యమైన వరివిగల ద్వారమును. దానికిపైన $\frac{1}{3}$ అంగుళము ఉన్నతముగ గుండ్రముగనుండు కర్ణికయును గలిగియుండవలయును. పైజెప్పిన 3-వదియగు అర్శోయంత్రము శమ్యయను పేరంబరగును. ఇది అర్శోయంత్ర తుల్యలక్షణముగలదిగను, ద్వారములేనిదిగనుండవలయును. ఇది అర్శోరోగమును పీడించుటయందు (అనగానలుపుటయందు) ఉపయోగించును.

## భగందరనాడీ - యంత్ర నిరూపణము.

శ్లో॥ సర్వథాపనయేదోష్ఠం ఛిద్రాదూర్ధ్వంభగందరే ॥ 19.

తా॥ భగందరయంత్రము ద్వారమునకుపైని ద్వారాకారములచే ఓష్ఠములేనిదిగనుండవలయును.

## ఘ్రాణార్బుదార్శసయుక్తనాడీ యంత్రము.

శ్లో॥ ఘ్రాణార్బుదార్శసామేక ఛిద్రానాడ్యంగులద్వయా ।
ప్రదేశినీపరీణాహా స్యాద్భగందరయంత్రవత్ ॥ 20.



తా॥ ఘ్రాణార్బుదము, ఘ్రాణార్శస్సు అను నీరోగములయందుపయోగించునట్టి నాడీయంత్రము ఏకద్వారముగలదిగను, 2 అంగుళములు నిడుపుగలదిగను, ప్రదేశినీ (అనగా జుట్టనవ్రేలికి) తుల్యమయినవెడల్పుగలదిగను, భగందరయంత్రమువలె ఓష్ఠములేనిదిగనుండవలయును.

## అంగుళిత్రాణక యంత్రము.

శ్లో॥ అంగుళిత్రాణకందాంతం వార్క్షంవాచతురంగులమ్ ।
ద్విచ్ఛిద్రంగోస్తనాకారం తద్వక్త్రవివృతౌసుఖమ్ ॥ 21.

తా॥ అంగుళిత్రాణకమను యంత్రము దంతముచేగాని, కాష్ఠముచేగాని చేయబడినదిగను, 4 అంగుళములప్రమాణముగలదిగను, ఇరుపార్శ్వములయందుద్వారములుగలదిగను, అర్శోరోగయంత్రమువలె గోస్తనాకారముగలదిగనుండవలయును. మఱియు నా యంత్రముచే నోరును సులభముగ తెరచుటకు సాధనముగనుండును. అంగుళిత్రాణకమనగా,-దంతములచే గాయముతగులకుండా వ్రేళ్ళనుకాపాడునట్టియంత్రము.

## యోనివ్రణ - దర్శననాడీ యంత్రము.

శ్లో॥ యోనివ్రణేక్షణంమధ్యే సుషిరంషోడశాంగులమ్ ।
ముద్రాబద్ధంచతుర్భిత్తమంభోజముకులాననమ్ ॥ 22.
చతుశ్శలాకమాక్రాంతం మూలేతద్వికసేన్ముఖే ।

తా॥ యోనియందుండునట్టి వ్రణమునుచూచునట్టియంత్రము మధ్యమునందు ద్వారము, 16 అంగుళములు నిడుపుగలదిగను, తిరుగునట్టియుంగరములతో గూడినదిగను, 4 పత్రములు, 4 శలాకలుగలదిగను, తామరమొగ్గతోసమానమైనఅగ్రభాగము గలదిగనుండవలయును. మఱియు నాయంత్రమూలమునందుండు శలాకనీడ్చుటవలన దానిముఖము వికసించును.

## వ్రణక్షాళనాది - నాడీ యంత్రము.

శ్లో॥ యంత్రేనాడీవ్రణాభ్యంగ క్షాళనాయషడంగులే ॥ 23.
వస్తియంత్రాకృతీమూలే ముఖేంగుష్ఠకలాయఖే ।
అగ్రతోఒకర్ణికేమూలే నిబద్ధమృదుచర్మణీ ॥ 24.

తా॥ నాడీవ్రణములయొక్క అభ్యంగప్రక్షాళనములయందుపయోగించునట్టి యంత్రములు 2 విధంబులు. అవి 6 అంగుళములనిడుపు, వస్తియంత్రమునకు తుల్యమయినయాకారము (అనగాగోపుచ్ఛాకారము), మూలమునందు బొట్టనవ్రేలితోతుల్య

మయినద్వారము, ముఖమునందు బోడసెనగలతో తుల్యమయిన ద్వారముగలవిగను, అగ్రభాగమునందు కర్ణికలులేనివిగను, మూలములో 2 కర్ణికలుగలవిగను, మూలములో వస్తిపుటకాకారమయిన మృదువగుచర్మముచే కట్టబడినవిగనుండవలయును.

ఉదకోదర - నాడీ యంత్రము.

శ్లో॥ ద్విద్వారానలికాపిచ్ఛ నలికావోదకోదరే ।

తా॥ ఉదకోదరరోగమునందు జలమును స్రవింపజేయుటకై యుపయోగించెడు నాడీయంత్రము ఇరుపార్శ్వములయందు ద్వారములుగలదిగనుండవలయును; లేక నెమలి ఈకచే జేయబడినదిగగాని నుండవలయును.

శ్లో॥ ధూమవస్త్యాదియంత్రాణి నిర్దిష్టానియథాయథమ్ ॥ 25.

తా॥ ధూమపానము, వస్తికర్మ యీమొదలగువానియం దుపయోగించునట్టి నాడీయంత్రములు ధూమపానాద్యధ్యాయములయందు చెప్పబడియున్నవి.

శృంగ యంత్రము.

శ్లో॥ త్ర్యంగులాస్యంభవేచ్ఛృంగం చూషణేऽష్టాదశాంగులమ్ ।
అగ్రేసిద్ధార్థకచ్ఛిద్రం సునద్ధంచూచుకాకృతి ॥ 26.

తా॥ దుష్టమయిన వాతము, విషము, రక్తము, ఉదకము, దుష్టమయిన చనుబాలు, వీనిం జీల్చుటయందుపయోగించెడు శృంగయంత్రము (అనగా పశువుల కొమ్ములు, చిమ్మనగ్రోవి మొదలగునవి) 3 అంగుళములు వెడల్పుగల ముఖద్వారముగలదిగను, 18 అంగుళములు నిడుపుగలదిగను, అగ్రభాగమునందు (అనగా జీల్చుటకు శరీరములోనుంచబడు ప్రదేశమునందు) ఆవగింజంతద్వారముగలదిగను, స్త్రీచన్ను మొనయొక్క యాకారముగలదై బాగుగకట్టబడినదిగ నుండవలయును.

అలాబు యంత్రము.

శ్లో॥ స్యాద్ద్వాదశాంగులోऽలాబుర్నాహేత్వష్టాదశాంగులః ।
చతుస్త్ర్యంగులవృత్తాస్యో దీప్తోంతః శ్లేష్మరక్తహృత్ ॥ 27.

తా॥ అలాబుయంత్రము (అనగాసొరకాయబుర్ర) 12 అంగుళములునిడుపు, 18 అంగుళములువెడల్పు, 4 లేక 3 అంగుళములు గుండ్రముగనుండునట్టి ముఖముగలదిగను, లోభాగములో భుజపత్రి మొదలగువానిని కాలచే జ్వలింపబడునదిగ నుండవలయును. ఇది దుష్టమయిన శ్లేష్మమును, రక్తమును హరింపజేయును.

ఘటీ యంత్రము.

శ్లో॥ తద్వద్ఘటీహితాగుల్మవిలయోన్నమనేచసా ।



తా॥ ఘటీయంత్రము (అనగాచిన్నకుండ) పైజెప్పిన అలాబుయంత్రముతో తుల్యమయిన నిడుపు, వెడల్పు, కృత్యముగలదిగనుండును. అయితే ఘటీయంత్రము గుల్మమును నశింపజేయుటయందును పొడవుగ నెత్తుటయందును హితకరమయినది.

శలాకాయంత్ర స్వరూపము.

శ్లో॥ శలాకాఖ్యానియంత్రాణి నానాకర్మాకృతీనిచ ॥ 28
యథాయోగప్రమాణాని

తా॥ శలాకాయను పేరంబఱంగుయంత్రములు నానావిధమైనయాకారములు, కృత్యములుగలవిగ మఱియు నాయాయోగములకు తగిన ప్రమాణముగలవిగ నుండును. ఈకచేజేయబడినదిగగాని నుండవలయును.

గండూపద - ముఖశలాకా యంత్రములు.

శ్లో॥ తేషామేషణకర్మణి । ఉభేగండూపదముఖే

తా॥ పైజెప్పిన శలాకాయంత్రములలో గండూపదములకు (అనగాఎఱ్ఱలకు) సమానమైనముఖముగల 2 శలాకాయంత్రములుగలవు. అవి ఏషణమను కర్మయందు (అనగా వ్రణమార్గమును పరీక్షించుటయందు) ఉపయోగించును.

మసూరదళవక్త్ర - శలాకా యంత్రములు.

శ్లో॥ స్రోతోభ్యశ్శల్యహారిణీ ॥ 29.
మసూరదళవక్త్రేద్వే స్యాతామష్టనవాంగులే ।

తా॥ చిఱుసెనగలపప్పుకు తుల్యమైనముఖముగలవిగను, 8, 9 అంగుళముల నిడుపుగలవిగనుండునట్టి 2 శలాకాయంత్రములుగలవు; అవి స్రోతస్సులలోనుండి శల్యములను బైలుపరచుటయందుపయోగించును.

శంకు వివరణము.

శ్లో॥ శంకవష్టౌ తా॥ శంకులు 6.

సర్పముఖ - శంకు యంత్రము.

శ్లో॥ ఉభౌతేషాంషోడశద్వాదశాంగులౌ ॥ 30.
వ్యూహనేऽహిఫణావక్త్రౌ ।

తా॥ వానిలో సర్పముయొక్క పడిగెవంటిముఖముగల శంకులు 2 గలవు. అవి 16 లేక 12 అంగుళములు నిడుపుగలవిగనుండును. వానిని వ్యూహనకర్మయందు (అనగా వ్రేలునటులజేయుటయందు) ఉపయోగించవలయును.

శరపుంఖ - శంకు యంత్రము.

శ్లో॥ ద్వాదశద్వాదశాంగులౌ । చాలనేశరపుంఖాఖ్యౌ

తా॥ శరపుంఖమను శంకులు 2 గలవు. అవి 10 లేక 12 అంగుళములునిడుపుగలవిగను, బాణముయొక్క పింజమువంటి ముఖముగలవిగనుండును. వాటిని చాలనకర్మయందు (అనగా కదిలించుటయందు) ఉపయోగించవలయును.

బడిశ - శంకు యంత్రము.

శ్లో॥ ఆహార్యే బడిశాకృతీ ॥ 31.

తా॥ బడిశము (అనగా గాలము) యొక్క యాకారముగలవిగనుండు శంకులు 2 గలవు. అవి ఆకర్షణకర్మయందుపయోగించును.

గర్భ - శంకు యంత్రము.

శ్లో॥ సతోఽగ్రేశంకునాతుల్యో గర్భశంకురితిస్మృతః ।
అష్టాంగులాయతస్తేన మూఢగర్భంహరేత్ స్త్రియాః ॥ 32.

తా॥ అగ్రభాగమునందు వంకరగను, కీలకముయొక్క ఆకారముగలదిగను, 8 అంగుళములు నిడుపుగలదిగనుండునది గర్భశంకువని మునులచే చెప్పబడుచున్నది. దానిచే స్త్రీలయొక్క మూఢగర్భమును బైలుపరచవలయును.

అశ్మర్యాకర్షణ - సర్పఫణాఖ్య - శంకు యంత్రము.

శ్లో॥ అశ్మర్యాహరణేసర్ప ఫణావద్వక్త్రమగ్రతః ।

తా॥ సర్పఫణమనుయంత్రము అగ్రభాగమునందు పాముపడగవంటి ముఖముగలదిగనుండును. దీనిచే అశ్మరినాకర్షణము చేయవలయును.

దంతాకర్షణ - శరపుంఖ - ముఖాఖ్య - శంకు యంత్రము.

శ్లో॥ శరపుంఖముఖందంతపాతేసంచతురంగులమ్ ॥ 33.

తా॥ 4 అంగుళములునిడుపుగల శరపుంఖమనుయంత్రము గలదు. అది బాణముయొక్క పింజముతో సమానమయినముఖముగలదిగనుండును. దీనిచే చలింపుచుండు దంతములను, క్రిములు మొదలగువానిచే బక్షించబడినదంతములను తీసివేయవలయును

శలాకా - భేదనీయము యోగములు.

శ్లో॥ కార్పాసవిహితోష్ణీషాః శలాకాఃషట్ప్రమార్జనే ।
పాయ్వాసన్నదూరార్థే ద్వేదశద్వాదశాంగులే ॥ 34.



ద్వేషట్సప్తాంగులేఘ్రాణే ద్వేకర్ణేఽష్టనవాంగులే ।

తా॥ క్షారక్లేదాదులను ప్రక్షాళనముజేసి శుద్ధిచేయుటకై కొనలలో ప్రత్తిచే జుట్టబడినశలాకలు 6 గలవు. వానిలో 10 అంగుళములు నిడుపుగలశలాక 1, 12 అంగుళములు నిడుగలశలాక 1, ఇటుల 2 శలాకలుగలవు, 10 అంగుళములు నిడుపుగలశలాకను గుదములో సమీపమునందును. 12 అంగుళములు నిడుపుగల శలాకను దూరమునందు ప్రయోగించవలయును. 6 అంగుళముల నిడుపుగల శలాక 1, 7 అంగుళములునిడుపుగలశలాక 1, ఇటుల 2 శలాకలుగలవు. అందు 6 అంగుళములు నిడుపుగలశలాకను నాసికములో సమీపమునందును, 7 అంగుళములు నిడుపుగల శలాకను దూరమునందును ప్రయోగించవలయును. అటులనే 8 అంగుళములునిడుపుగలశలాక 1, 9 అంగుళములునిడుపుగలశలాక 1, ఇటుల 2 శలాకలుగలవు. అందు 8 అంగుళములు నిడుపుగల శలాకను కర్ణములోసమీపమునందును, 9 అంగుళములు నిడుపుగల శలాకను దూరమునందును ప్రయోగించవలయును.

కర్ణశోధన - శలాకా యంత్రము.

శ్లో॥ కర్ణశోధనమశ్వత్థ పత్రప్రాంతంస్రువాననమ్ ॥ 35.

తా॥ కర్ణశోధనమను పేరుగలశలాకాయంత్రము రావియాకుయొక్క కొనతో సమానమైన కొనగలదిగను, గెరిటవంటి ముఖముగలదిగ నుండవలయును.

క్షారాగ్ని - కర్మోపయుక్త శలాకలు.

శ్లో॥ శలాకాజాంబవోష్ఠానాం క్షారేగ్నౌచపృథక్త్రయమ్ ।
యుంజ్యాత్ స్థూలాణుదీర్ఘాణాం

తా॥ స్థూలముగ, సూక్ష్మముగ, దీర్ఘముగనుండు శలాకలు 3. అటులనే జాంబవోష్ఠములు 3. ఇటుల 6 శలాకాయంత్రములుగలవు. వీటిని క్షారకర్మయందుపయోగించవలయును. మఱియును స్థూలముగ, సూక్ష్మముగ, దీర్ఘముగనుండుశలాకలు 3. అటులనే జాంబవోష్ఠములు 3. ఇటుల 6 శలాకాయంత్రములుగలవు. వీటిని అగ్నికర్మయందుపయోగించవలయును. క్షారాగ్ని కర్మోపయుక్త శలాకాయంత్రములు పైజెప్పిన ప్రకారము 12 విధంబులుగనుండునని తెలుసుకొనవలయును.

ఆంత్ర - వృద్ధ్యుపయుక్త శలాకా.

శ్లో॥ శలాకామంత్ర * వర్ధ్మని ॥ 36.
మధ్యోర్ధ్వవృత్తదండాంచ మూలేచార్ధేందుసన్నిభామ్ ।

* వర్త్మని ఇతిపా.

తా॥ అంత్రవృద్ధియందు మధ్యభాగమునకు పైన గుంత్రముగను, దండాకారముగను, మూలభాగమునందు అర్ధచంద్రాకారముగనుండునట్టి శలాకను నుపయోగించవలయును.

నాసార్శాదులయం - దుపయోగించెడి - కోలాస్థి శలాకా.

శ్లో॥ కోలాస్థిదళతుల్యాస్యా నాసార్శోర్బుదదాహకృత్ ॥ 37.

తా॥ కోలాస్థిదళము (అనగా రేగుగింజ పప్పునకు) సమానమైన ముఖముగల శలాకను నాసార్శస్సు, నాసార్బుదము, వీనియందు అగ్నికర్మజేయునపు డుపయోగించవలయును.

క్షార - కర్మోపయుక్త శలాకా.

శ్లో॥ అష్టాంగులానిమ్నముఖాస్తిస్రఃక్షారౌషధక్రమే ।
కనీనీమధ్యమానామి నఖమానసమైర్ముఖైః ॥ 38.

తా॥ చిటికెనవ్రేలు, నడిమివ్రేలు, దర్భవ్రేలు, వీనియొక్క నఖములకుసమానమైన వెడల్పుగలవిగను, పల్లముగనుండు ముఖములుగలవిగను, 8 అంగుళములు నిడుపుగలవిగనుండు 3 శలాకలుగలవు. వానిని క్షారౌషధప్రయోగమునం దుపయోగించవలయును.

శ్లో॥ స్వంస్వముక్తానియంత్రాణి మేఢ్రశుద్ధ్యాంజనాదిషు ।

తా॥ మేఢ్రశుద్ధి, అంజనము, యీ మొదలగు పనులయందును, ఉత్తరవస్త్యాదులయందు నుపయోగించెడి యంత్రములు ఆయా ప్రకరణములయందు పూర్వమే చెప్పబడియున్నవి.

ఉప యంత్రములు.

శ్లో॥ అనుయంత్రాణ్యయస్కాంత రజ్జువస్త్రాశ్మముద్గరాః ॥ 39.
వధ్రాంత్రజిహ్వావాలాశ్చ శాఖానఖముఖద్విజాః ।
కాలఃపాకఃకరఃపాదో భయంహర్షశ్చతద్విధాః ॥ 40.
ఉపాయవిత్ప్రవిభజే దాలోచ్యవిషయంధియా ।

తా॥ ఉపాయము తెలిసియుండు వైద్యుడు అయస్కాంతము, దారము, వస్త్రపట్టములు, రాయి, సుత్తె, (అనగా సమ్మెట) తోలువారు, ప్రేగులు, నాలుక, వెంట్రుకలకట్ట, వ్రేళ్ళు, నఖము, నోరు, పంటి, కాలము, పాకము, హస్తము, పాదము, భయము, సంతోషము అనునీ 19 ఉపయంత్రములను, వానియొక్క నిర్ఘాతనాదికర్మలను బుద్ధిచే బాగుగ నాలోచించి ప్రయోగించవలయును.



యంత్ర కృత్యములు.

శ్లో॥ నిర్ఘాతనోన్మథనపూరణమార్గశుద్ధి సంవ్యూహనాహరణబంధన
పీడనాని ॥ 41.
ఆచూషణోన్నమననామనచాలభంగ వ్యావర్తనర్జుకరణాని
చయంత్రకర్మ ।

తా॥ నిర్ఘాతనము (అనగా తుండించుట) ఉన్మథనము (అనగా చిలుకుట) పూరణము (అనగా సంధానము చేయుట) మార్గశుద్ధి (అనగా మూత్రద్వారములో శలాకు వేయుట) వ్యూహనము (అనగా అంగములను వ్రేంగనటులజేయుట) ఆహరణము (అనగా బైలుపరచుట) బంధనము (అనగా కట్టుకట్టుట) పీడనము (అనగా పిసుకుట) ఆచూషణము (అనగా జుర్రుట) ఉన్నమనము (అనగా పొడవుగనెత్తుట) నామనము (అనగా వంచుట) చాలనము (అనగా స్థానాంతరమునకు కదలించుట) భంగము (అనగా విరుచుట) వ్యావర్తనము (అనగా త్రిప్పుట) ఋజుకరణము (అనగా నిడుపుగజేయుట) యీ మొదలగునవి యంత్రకర్మములు. చకారమువలన ప్రక్షాళనము కూడా యంత్రముయొక్క కర్మయని తెలియవలయును.

కంకముఖ - యంత్ర శ్రేష్ఠత్వము.

శ్లో॥ నివర్తతేసాధ్వవగాహతేచ గ్రాహ్యంగృహీత్వోద్ధరతేచ
యస్మాత్ ॥ 42.
యంత్రేష్వతఃకంకముఖంప్రధానం స్థానేషుసర్వేష్వధి
కారియచ్చ ॥ 42½.

తా॥ కంకముఖయంత్రము లోనికేగి బైటవచ్చును. లోన బాగుగా ప్రవేశించును. లోనగ్రహించవలసిన వస్తువులను గ్రహించుకొని బైటికి తీసుకొని వచ్చివిడుచును. సర్వప్రదేశములయందు ప్రవేశించతగిన యధికారముకలది. కాబట్టి సమస్తమైన యంత్రములలో కంకముఖమను యంత్రము ప్రధానంబు.—

"తత్రాతిస్థూలమసార మతిదీర్ఘమతిహ్రస్వమగ్రాహి విషమగ్రాహి వక్రంశిథిలమత్యున్నతంమృదుకీలం మృదుముఖంమృదుపాశమితిద్వాదశయంత్రదోషాః ॥ ఏతైర్దోషైర్వినిర్ముక్తం యంత్రమష్టాదశాంగులమ్ । ప్రశస్తంభిషజాజ్ఞేయంతద్ధికర్మసుయోజయేత్ ॥"

మిక్కిలి లావుగనుండుట, దృఢముగలేకుండుట, మిక్కిలి పొడవుగనుండుట, కడు కుఱచగనుండుట, శల్యోద్ధరణమునందనస్థామగనుండుట, శల్యములను విషమముగ గ్రహించుట, వంకరగనుండుట, శిథిలముగనుండుట, మిక్కిలి యున్నతముగనుండుట, సారములేని కీళ్ళుంగలిగియుండుట, మందమగు యగ్రంబుల గలిగియుండుట, శిథిలమైన దారములం గలిగియుండుట అను 12 దోషంబు లీయంత్రంబులకు వెలయు. కావున వైద్యుడు పైదోషరహితమయి 18 అంగుళముల ప్రమాణముగల యంత్రం బన్నిట నెక్కుడనియెంచి యట్టి దానిచే పై జెప్పిన నిర్ఘాతనాది క్రియల జేయం దగును. అని సుశ్రుతమునందు చెప్పబడియున్నది.

పంచవింశతితమాధ్యాయము, ముగిసెను.

# అష్టాంగహృదయమను

## బాహటము.


## యంత్రాధ్యాయము.

శ్రీరస్తు.


శ్రీమద్ధన్వంతరయేనమః.

# అష్టాంగహృదయమను బాహటము.


## యంత్రములు.



సింహముఖస్వస్తిక యంత్రము.




మృగముఖస్వస్తిక యంత్రము.




వ్యాఘ్రముఖస్వస్తిక యంత్రము.







సృగాలముఖస్వస్తిక యంత్రము.




అవభంజనస్వస్తిక యంత్రము.



క్రౌంచస్వస్తిక యంత్రము.



నాసాశోధన యంత్రము.




శల్యనిర్ఘాతననాడీ యంత్రము.



కార్పాససహిత శలాకా.




క్షారకర్మోపయుక్త శలాకా.




అగ్నికర్మోపయుక్తశలాకా.





గర్భయంత్రము.



కర్ణ శల్యాదర్శనవాడీయంత్రములు.







ధూమపానయంత్రములు.

---

శ్రీరస్తు.

# షడ్వింశతితమాధ్యాయము

యంత్రవిధ్యధ్యాయానంతరము శస్త్రస్వరూపవిజ్ఞానార్థము శస్త్రవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

## శస్త్ర - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతశ్శస్త్రవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః॥

తా॥ యంత్రవిధ్యధ్యాయానంతరము శస్త్రస్వరూపమును తెలియపరచునట్టి శస్త్రవిధ్యధ్యాయమును వివరించెదము.

## శస్త్ర స్వరూపము.

శ్లో॥ షడ్వింశతిస్సుకర్మారైర్ఘటితానియథావిధి।
శస్త్రాణిరోమవాహీని బాహుళ్యేనాంగులానిషట్॥ 1.
సురూపాణిసుధారాణి సుగ్రహాణిచకారయేత్।
అకరాళానిసుధ్మాత సుతీక్ష్ణావర్తితేఽయసి॥ 2.
సమాహితముఖాగ్రాణి నీలాంభోజచ్ఛవీనిచ।
నామానుగతరూపాణి సతాసన్నిహితానిచ॥ 3.
జ్యోత్స్నార్ధచతుర్థాంశ ఫలాన్యేకైకశోపిచ।
ప్రాయోద్విత్రాణియుంజీత తాని స్థానవిశేషతః॥ 4.

తా॥ శస్త్రములు 26 విధంబులు. అవి తఱుచుగ 6 అంగుళములు నిడుపుగలవిగ, శస్త్రకర్మయందు సమర్థులగువారిచే విధిప్రకారము చేయబడినవిగ, రోమములను ఛేదించుటయందు సమర్థములుగ, బాగుగకరిగించబడినఉక్కు, ఇనుము వీనిచేజేయబడినవిగ, మంచిరూపముగలవిగ, చూచుటకుసొగసుగ, మంచిపదునుగలవిగ, సుఖముగపట్టుకొనతగిన పిడులుగలవిగ, బాగుగాజేయబడిన అగ్రభాగములుగలవిగ, నల్లకలువరేకువలె కాంతిగలవిగ, పేరుకుతగిన యాకారములుగలవిగ, ఎల్లపుడు తన సమీపమునందుంచు

కొనతగినవిగ, శస్త్రముయొక్క నిడుపులో 8-వ భాగము (అనగాముప్పాతికభాగము) ఫలము (అనగా అలుగు) గలవిగనుండవలయును. మఱియు నాశస్త్రములను తలుచుగ నొక్కొకటిగగాని, లేక స్థానవిశేషానుగుణముగా రెంటినిగాని, లేక మూటినిగాని ప్రయోగింపవలయును.

## మండలాగ్ర శస్త్రము.

శ్లో॥ మండలాగ్రంఫలేతేషాం తర్జన్యంతర్నఖాకృతి।
లేఖనేఛేదనేయోజ్యం పోథకీశుండికాదిషు॥ 5.

తా॥ ఆశస్త్రములలో మండలాగ్రమనునది జుట్టనవ్రేలియొక్క లోనఖమువంటి యాకారముగల అలుగునుగలదైయుండును. దీనిని పోథకీ, శుండికా, వర్త్మయీ మొదలగురోగములలో లేఖనము ఛేదనము వీనింజేయుటయం దుపయోగించవలయును.

## వృద్ధిపత్ర శస్త్రము.

శ్లో॥ వృద్ధిపత్రంక్షురాకారం ఛేదభేదనపాటనే।
ఋజ్వగ్రమున్నతేశోఫే గంభీరేచతదన్యథా॥ 6.
నతాగ్రంపృష్ఠతో

తా॥ వృద్ధిపత్రమను పేరుగలశస్త్రము క్షురము (అనగా మంగలకత్తి) యొక్క యాకారము, వంకరలేనియగ్రభాగముగలదిగనుండును. దీనిని ఉన్నతమైనశోఫలో ఛేదనము, భేదనము, పాటనము, వీనింజేయుటయం దుపయోగించవలయును. గంభీరమైనశోఫలో పృష్ఠ ప్రదేశమునందు వంగియుండునట్టి యగ్రభాగముగల వృద్ధిపత్రమను శస్త్రమును ప్రయోగించవలయును.

## ఉత్పలశస్త్రము - అధ్యర్ధధార శస్త్రము.

శ్లో॥ దీర్ఘహ్రస్వవక్త్రం * యథాశయమ్।
ఉత్పలాధ్యర్ధధారాఖ్యే ఛేదనేభేదనే

తా॥ ఉత్పలపత్రము, అధ్యర్ధధారము అనెడి పేర్లుగల 2 శస్త్రములు యథాక్రమముగా దీర్ఘముగ, హ్రస్వముగనుండునట్టి ముఖములుగలవిగనుండును. (అనగా ఉత్పలమను శస్త్రము దీర్ఘముఖముగలదిగ అధ్యర్ధధారమను శస్త్రము హ్రస్వముఖముగలదిగనుండునని భావము.) వీనినిఛేదన, భేదనములయం దుపయోగించవలయును.

---

* యథాక్రమమ్ ఇతిపా.



## సర్పవక్త్ర శస్త్రము.

శ్లో॥ తథా॥ [ సర్పాస్యంఘ్రాణకర్ణార్శశ్ఛేదనేర్ధాంగుళంఫలే। ] 7.

తా॥ సర్పవక్త్రమను శస్త్రము సర్పముఖముతో తుల్యమైనముఖము, అర్ధాంగుళమునిడుపైన అలుగుగలదిగనుండును. దీనిని ఘ్రాణార్శస్సు, వీనిఛేదనభేదనములయం దుపయోగించవలయును.

## ఏషణీ శస్త్రము.

శ్లో॥ గతేరన్వేషణేశ్లక్ష్ణా గండూపదముఖైషిణీ॥ 8.
భేదనార్థేఽపరాసూచీ ముఖామూలనివిష్టఖా।

తా॥ ఏషణియను పేరుగలశస్త్రము మృదువైన స్పర్శము, గండూపదము (అనగా ఎఱ్ఱల) యొక్కముఖమువంటి ముఖముగలదిగనుండును. దీనిని వ్రణముయొక్క గతిని శోధించుటయం దుపయోగించవలయును. ఏషణియను మఱియొక శస్త్రము సూదివంటి ముఖముగలదిగ, మూలభాగమునందు (అనగా పట్టుకొనునట్టి ప్రదేశమునందు) ద్వారముతోగూడినదిగ నుండును. దీనినిభేదనమునం దుపయోగించవలయును.

## వేతసపత్ర శస్త్రము.

శ్లో॥ వేతసంవ్యధనే

తా॥ ప్రబ్బలియాకువంటి యాకారముగల వేతసమనుశస్త్రము 6 అంగుళములు నిడుపుగలదిగనుండును. దీనినివ్యధనమునం దుపయోగించవలయును.

## శరార్యాస్య శస్త్రము.

శ్లో॥ స్రావ్యే శరారాస్యంత్రికూర్చకే॥ 9.

తా॥ శరార్యాస్యము అనుశస్త్రమును త్రికూర్చకమునందును, స్రావ్యమునందును, ఉపయోగించవలయును. శరార్యాస్యము (అనగా ఆడేలు) యొక్క ముఖముతో తుల్యమైన యాకారముగలశస్త్రము.

## కుశాటా శస్త్రము.

శ్లో॥ కుశాటావదనేస్రావ్యే ద్వ్యంగుళంస్యాత్తయోఃఫలమ్।

తా॥ కుశాటాయను శస్త్రమును ముఖమునం దుపయోగించవలయును. శరార్యాస్యము, కుశాటా వీనియొక్క అలుగు 2 అంగుళములు నిడుపుగలదైయుండును.

### అంతర్ముఖ శస్త్రము.

శ్లో॥ తద్వదంతర్ముఖంతస్య ఫలమధ్యర్ధమంగులమ్ ॥ 10.

తా॥ అంతర్ముఖమను పేరుగల శస్త్రము కుశాటాయనుశస్త్రమునకు తుల్యముగ నుండును. మఱియు నాఅంతర్ముఖశస్త్రముయొక్క ఆలుగు $1\frac{1}{2}$ అంగుళ ప్రమాణము గలది.

### అర్ధచంద్రానన శస్త్రము.

శ్లో॥ అర్ధచంద్రాననంచైతత్

తా॥ అర్ధచంద్రాననమను శస్త్రము కుశాటాయను శస్త్రమునకు తుల్యముగ నుండును.

### వ్రీహివక్త్ర శస్త్రము.

శ్లో॥ తథాధ్యర్ధాంగుళంఫలే ।
వ్రీహివక్త్రంప్రయోజ్యంచ తచ్ఛిరోదరయోర్వ్యధే ॥ 11.

తా॥ వ్రీహివక్త్రమనుశస్త్రము $1\frac{1}{2}$ యంగుళమునిడుపుగల అలుగుతో గూడియుండును. దీనిని సిరావ్యథ, ఉదరవ్యథ వీనియందుపయోగించవలయును.

### కుఠారీ శస్త్రము.

శ్లో॥ పృథుఃకుఠారీగోదంత సదృశార్ధాంగులాననా ।
తయోర్ధ్వదండయావిధ్యే దుపర్యస్థ్నాంస్థితాంసిరామ్ ॥ 12.

తా॥ కుఠారియను శస్త్రము (అనగా గొడ్డలి) విస్తీర్ణముగను, గోదంతమునకు సదృశమయిన $\frac{1}{2}$ అంగుళమునిడుపుగల ముఖముగలదిగనుండును. ఊర్ధ్వభాగమునందు దండముగల కుఠారియనుశస్త్రముచే అస్థులకుపైనుండు సిరలను వేధించవలయును.

### తామ్ర శలాకా.

శ్లో॥ తామ్రీశలాకాద్విముఖీ ముఖేకురవకాకృతిః ।
లింగనాశంతయావిధ్యేత్

తా॥ తామ్రముచేజేయబడిన శలాకాయను శస్త్రము 2 ముఖములుగలదిగ, గోరింటపువ్వునకు సమానమయినయాకారమువంటిముఖముగలదిగనుండును. దానిచే కఫోత్థపటలమను సంజ్ఞగల లింగనాశమును వేధించవలయును.



### అంగులి శస్త్రము.

శ్లో॥ కుర్యాదంగుళిశస్త్రకమ్ ॥ 13.
ముద్రికానిర్గతముఖం ఫలేత్వర్ధాంగులాయతమ్ ।
యోగతోవృద్ధిపత్రేణ మండలాగ్రేణవాసమమ్ ॥ 14.
తత్ప్రదేశిన్యగ్రపర్వ ప్రమాణార్పణముద్రికమ్ ।
సూత్రబద్ధంగళస్రోతో రోగచ్ఛేదనేభేదనే ॥ 15.

తా॥ అంగుళిశస్త్రము ముద్రికలోనుండి (అనగా ఉంగరములోనుండి) వెలివడియుండుముఖముగలదిగను, $\frac{1}{2}$ అంగుళమునిడుపుగల అలుగుతోగూడినదగను, వృద్ధిపత్రముతోగాని, మండలాగ్రముతోగాని తుల్యమయిన ఆకారముగలదిగను, వైద్యుడు తన జుట్టనవ్రేలియొక్క అగ్రపర్వములో ధరించతగిన ఉంగరముతోగూడినదిగనునుండవలయును. దీనిని దారముచే మణిబంధమునందుకట్టుకొని కంఠస్రోతోగతరోగములను ఛేదించుటయందు భేదించుటయందు నుపయోగిరిచవలయును.

### బడిశ శస్త్రము.

శ్లో॥ గ్రహణేశుండికార్మాదేః బడిశంసునతాననమ్ ।

తా॥ బడిశమను శస్త్రము అంకుశమువలె వంగినముఖముగలదిగనుండును. దీనిని శుండికా, అర్మ, ప్రతిజిహ్వికా యీమొదలగువానిని గ్రహించుటయందుపయోగించవలయును.

### కరపత్ర శస్త్రము.

శ్లో॥ ఛేదేఽస్థ్నాంకరపత్రంతు ఖరధారందశాంగులమ్ ॥ 16.
విస్తారేద్వ్యంగుళంసూక్ష్మ దంతంసుత్సరుబంధనమ్ ।

తా॥ కరపత్రమను శస్త్రము (అనగాఱంపము) తీక్ష్ణమయినపదును, 10 అంగుళములునిడుపు, 2 అంగుళములువిస్తారము, సూక్ష్మమైనదంతములుగలదిగ, మంచిపిడితో గూడినదిగనుండును. ఇది అస్థులను ఛేదించుటయందుపయోగించును.

### కర్తరీ శస్త్రము.

శ్లో॥ స్నాయుసూత్రకచచ్ఛేదే కర్తరీకర్తరీనిభా ॥ 17.

తా॥ కర్తరియనుశస్త్రము కత్తెరతోసమానముగనుండును. ఇది స్నాయువులు, సూత్రము, కేశములు వీనిని ఛేదించుటయందుపయోగించును.

## నఖ శస్త్రము.

శ్లో॥ వక్రర్జుధారంద్విముఖం నఖశస్త్రనవాంగుళమ్ ।
సూక్ష్మశల్యోద్ధృతిచ్ఛేద భేద * ప్రచ్ఛనలేఖనే ॥ 18.

తా॥ నఖమను శస్త్రము వంకరగ, ఋజువైన పదునుగల 2 ముఖములుగలదిగ (అనగా ఒకముఖము వంకరగ, మఱియొకముఖము ఋజువుగ) 9 అంగుళములునిడుపు గలదిగనుండును. ఇది సూక్ష్మమయిన శల్యములందీయుటయందును, నఖములను ఛేదించుటయందును, భేదించుటయందును, చివ్వుటయందును, గీచుటయందును నుపయోగించును.

## దంత - లేఖన శస్త్రము.

శ్లో॥ ఏకధారంచతుష్కోణం ప్రబద్ధాకృతిచైకతః ।
దంతలేఖనకంతేన శోధయేద్దంతశర్కరామ్ ॥ 19.

తా॥ దంతలేఖనమను శస్త్రము ఒకప్రదేశమునందు పదునుతోగూడినదిగను, 4-గు కోణములుగలదిగను, ఒకప్రదేశమునందు కట్టబడినదిగనుండును. దానిచే దంతశర్కరను శోధించవలయును.

## సూచీ వివరము.

శ్లో॥ వృత్తాగూఢదృఢాఃపాశే తిస్రఃసూచ్యోత్రసీవనే ।
మాంసలానాంప్రదేశానాం త్ర్యశ్రాత్ర్యంగులమాయతా ॥ 20.
అల్పమాంసాస్థిసంధిస్థ వ్రణానాంద్వ్యంగులాయతా ।
వ్రీహివక్త్రాధనుర్వక్రా పక్వామాశయమర్మసు ॥ 21.
సాసార్ధద్వ్యంగులా

తా॥ పైజెప్పిన శస్త్రములలో కుట్టుటయందు గుండ్రముగను, దారములో గుచ్చిచుట్టబడినవిగను, దృఢముగనుండు 3 సూదులుగలవు. వానిలో నధికమాంసముగల శరీరప్రదేశములనుకుట్టుటయందు త్ర్యశ్రముగను (అనగా కోసయుండు 3 పార్శ్వములుగలదిగను) 3 అంగుళములు నిడుపుగలదిగనుండుసూచిని (అనగా సూదిని) యుపయోగించవలయును. అల్పమాంసముగలప్రదేశములను, సంధులు, అస్థులు వీని నాశ్రయించియుండు వ్రణములనుకుట్టుటలో 2 అంగుళములునిడుపు గుండ్రమైముఖముగల

* ప్రచ్ఛన్న ఇతి పా.



సూది నుపయోగించవలయును. పక్వాశయము, ఆమాశయము, మర్మస్థానము వీనియందుండు వ్రణములనుకుట్టుటలో వ్రీహి (అనగా వడ్లవంటి) ముఖముగలదిగను, ధనుస్సువలె వంకరగను, 2½ అంగుళమునిడుపుగలదిగనుండుసూది నుపయోగించవలయును.

## కూర్చ శస్త్రము.

శ్లో॥ సర్వ వృత్తాస్తాశ్చతురంగులాః ।
కూర్చస్సప్తైకపీఠస్థాః సప్తాష్టౌవాసుబంధనాః ॥ 22.
సయోజ్యోనీలికావ్యంగ కేశశాతనకుట్టనే ।

తా॥ సర్వత్రగుండ్రముగను, 4 అంగుళములు నిడుపుగలవిగను, మంచిబంధనముతోగూడినవిగను, 7 లేక 8 సంఖ్యగలవిగనుండు సూదుల గుండ్రముగనుండు ఒకటే పీఠమునందునుచుట కూర్చశస్త్రమనబడును. దీనికే సూచీకూర్చమనియు నామముగలదు. దీనిని నీలికా, వ్యంగము, కేశశాతనము, ఛేదనము, వీనియందుపయోగించవలయును.

## ఖజ శస్త్రము.

శ్లో॥ అర్ధాంగుళైర్ముఖైర్వృత్తై రష్టాభిఃకంటకైఃఖజః ॥ 23.
పాణిభ్యాంమథ్యమానేన ఘ్రాణాత్తేనహరేదసృక్ ।

తా॥ అర అంగుళమునిడుపుగల కొసతోగూడినవిగ, గుండ్రముగనుండు 8 సూదులంగలది ఖజశస్త్రమనబడును. హస్తములచే నాసికములో ఖజమనుశస్త్రమును చిలికిరక్తస్రావము చేయించవలయును.

## యూథికా శస్త్రము.

శ్లో॥ వ్యధనేకర్ణపాలీనాం యూథికాముకులాననా ॥ 24.

తా॥ యూథికయను శస్త్రము మొగ్గవంటి ముఖముగలదైయుండును. ఇదికర్ణపాళులను (అనగా చెవితమ్మెలను) వేధించుటయం దుపయోగించును.

## ఆరా శస్త్రము.

శ్లో॥ ఆరార్ధాంగులవృత్తాస్యా తత్ప్రవేశాతథోర్ధ్వతః ।
చతురస్రాతయావిధ్యేచ్ఛోఫంపక్వామసంశయే ॥ 25.
కర్ణపాళీంచబహుళాం

తా॥ ఆరాయను పేరుగలశస్త్రము $\frac{1}{2}$ అంగుళము గుండ్రముగనుండు ముఖము గలదిగను, $\frac{1}{2}$ అంగుళము లోన ప్రవేశించతగినదిగను, ఊర్ధ్వభాగమునందు 4 కోణములుగలిగి $\frac{1}{2}$ అంగుళము నిడుపుగలదిగనుండును. శోఫయొక్క పక్వ, అపక్వవిషయమునందు సంశయముగలుగునపుడు ఆరాయనుశస్త్రముచే నాశోఫను వేధించవలయును. మఱియునధిక మాంసముగల కర్ణపాళినికూడా ఆరాయనుశస్త్రముచేతనే వేధించవలయును.

## కర్ణవేధినీ శస్త్రము.

శ్లో॥ * బహులాయాశ్చశస్యతే ।
సూచీత్రిభాగసుషిరా త్ర్యంగులాకర్ణవేధనీ ॥ 26.

తా॥ మూడవభాగమునందు ద్వారముగలదిగను, 3 అంగుళములు నిడుపుగలదిగనునుండుసూది కర్ణవేధినియని చెప్పబడును. కర్ణవేధినియనుసూదికూడా అధికమాంసముగల కర్ణపాళిని వేధించుటయందు ప్రశస్తంబైనది.

## ఉపశస్త్రములు.

శ్లో॥ జలౌకఃక్షారదహన కాచోపలనఖాదయః ।
అలోహాన్యనుశస్త్రాణి తాన్యేవంచవికల్పయేత్ ॥ 27.
అపరాణ్యపియంత్రాదీ న్యుపయోగంచయౌగికమ్ ।

తా॥ జలగలు, క్షారము, అగ్ని, గాజు, రాయి, నఖము యీమొదలగునవి ఉపశస్త్రములు. ఇవి లోహసంబంధ రహితమైనవి. నఖాదులను అది శబ్దముచేత అయస్కాంతము, శేకుయాకు, నల్లవావిలియాకు యీమొదలగు వానిని గ్రహించుకొనవలయును. ఇటులనే సద్వైద్యుడగువాడు స్వబుద్ధిచే నితరమైనయంత్రాంగులను, తగుపయోగమును ఊహించుకొనవలయును.

## శస్త్ర కృత్యములు.

శ్లో॥ ఉత్పాట్యపాట్యసీవ్యైష్య లేఖ్య† ప్రచ్ఛనకుట్టనమ్ ॥ 28.
ఛేద్యంభేద్యంవ్యధోమంథో గ్రహోదాహశ్చతత్క్రియాః ।

తా॥ ఉత్పాట్యము (అనగా పెళ్ళగించుట), పాట్యము (అనగా చీల్చుట), సీవ్యము (అనగాకుట్టుట), ఏషము (అనగా వ్రణమార్గమును పరీక్షించుట), లేఖ్యము (అనగా గీయుట), ప్రచ్ఛనము (అనగా చెక్కుట), కుట్టనము (అనగా పొడుచుట), ఛేద్యము (అనగాఛేదించుట), భేద్యము (అనగా బ్రద్దలుసేయుట), వేధనము (అనగా వేధించుట), మంథము (అనగా చిలుకుట), గ్రహణము (అనగా పట్టుకొనుట), దాహము (అనగా కాల్చుట), ఇవి పైజెప్పిన 26 శస్త్రములయొక్క కృత్యములని తెలియవలయును. ఉత్పాట్యమునందు నఖమను శస్త్రమును, పాటనమునందు వృద్ధిపత్రాదిశస్త్రములను, సీవ్యమునందు సూదులను, లేఖనమునందు మండలాగ్రాది శస్త్రములను, భేదనమునందు ఏషణి, సూచీముఖము అనునీ శస్త్రములను, వేధనమునందు వేతసాది శస్త్రములను, మంథనమునందు ఖజమనుశస్త్రమును, గ్రహణమునందు సందంశమను యంత్రమును, దాహమునందు శలాకాదులను ప్రయోగించవలయును.

## శస్త్ర దోషములు.

శ్లో॥ కుంఠఖండతనుస్థూల హ్రస్వదీర్ఘత్వవక్రతాః ॥ 29.
శస్త్రాణాంఖరధారత్వ మష్టౌదోషాః ప్రకీర్తితాః ।

తా॥ కుంఠత్వము (అనగా మొక్కగనుండుట), ఖండత్వము (అనగా కొనవిరిగియుండుట), తనుత్వము (అనగా అతిసన్నముగనుండుట), స్థౌల్యము (అనగా అతిలావుగనుండుట), హ్రస్వత్వము (అనగా మిక్కిలి కుఱచగనుండుట), దైర్ఘ్యము (అనగా మిక్కిలి నిడుపుగనుండుట), వక్రత (అనగా వంకరగనుండుట), ఖరధారత్వము (అనగా అధికపదును గలిగియుండుట), ఇటుల శస్త్రదోషములు 8 యని బుధులచే జెప్పబడియున్నవి.

## శస్త్ర - గ్రహణ విధి.

శ్లో॥ ఛేదభేదనలేఖ్యార్థం శస్త్రంవృంతఫలాంతరే ॥ 30.
తర్జనీమధ్యమాంగుష్ఠై ర్గృహ్ణీయాత్సుసమాహితః ।

తా॥ ఛేదనము, భేదనము, లేఖనము, అనునీ కర్మలయందు జుట్టనవ్రేలు, నడిమివ్రేలు, బొట్టనవ్రేలు, వీనిచే శస్త్రము యొక్క పిడి, అలుగు, వీనిమధ్యభాగమునందు బహుజాగరూకుడై పట్టుకొనవలయును.

శ్లో॥ విస్రావణానివృంతాగ్రే తర్జన్యంగుష్ఠకేనచ ॥ 31.

తా॥ రక్తాదులను స్రవింపజేయునట్టి శరార్యాస్యము మొదలగు శస్త్రములను వృంతమునందు (అనగా పిడియొక్క అగ్రభాగమునందు) జుట్టనవ్రేలు, బొట్టనవ్రేలు వీనిచే పట్టుకొనవలయును.

శ్లో॥ తలప్రచ్ఛన్నవృంతాగ్రం గ్రాహ్యంవ్రీహిముఖంముఖే

* శరార్యేవంచశస్యతే ఇతిపా.
† ప్రచ్ఛన్న ఇతిపా.

తా॥ వ్రీహిముఖమను నాయుధముయొక్క అగ్రభాగమును అఱచేతిచే మూసుకొని ముఖభాగమునందు పట్టుకొనవలయును.

శ్లో॥ మూలేష్వాహరణార్థేతు క్రియాసౌకర్యతోఽపరమ్ ॥ 32.

తా॥ ఆకర్షణార్థమైన శస్త్రములను మూలభాగమునందు పట్టుకొనవలయును. ఇతరమైన శస్త్రముల నేవిధముగపట్టుకొనిన క్రియలను సుఖముగ జేయుట కనుకూలించునో ఆత్తెఱంగునవానింబట్టుకొనవలయును.

శస్త్ర - కోశ లక్షణము.

శ్లో॥ స్యాన్నవాంగులవిస్తార స్సుఘనోద్వాదశాంగులః ।
క్షౌమపత్రోర్ణ కౌశేయ దుకూలమృదుచర్మజః ॥ 33.
విన్యస్తపాశస్సుస్యూత స్సాంతరోర్ణార్థశస్త్రకః ।
శలాకాపిహితాస్యశ్చ శస్త్రకోశస్సుసంచయః ॥ 34.

తా॥ శస్త్రకోశము (అనగా ఆయుధములనుంచునట్టిపొర) 9 అంగుళములు వెడల్పుగలదిగను, మిగులగట్టిదిగను, 12 అంగుళములు నిడుపుగలదిగను, క్షౌమము (అనగా నారబట్టవస్త్రము), పత్రోర్ణము (అనగా తెల్లపట్టు), కౌశేయము (అనగా దశరీబట్టతోస్తా మొదలైన పురుగులవలన బుట్టేబట్టలు), దుకూలము (అనగా పట్టువస్త్రము), మృదువైన చర్మములు, వీనిచే జేయబడినదిగను, పాశముతో (అనగా త్రాడుతో) గూడినదిగను, బాగుగ కుట్టబడినదిగను, శలాకచే మూయబడిన ముఖము గలదిగను, సొగసైనసంచయముతో (అనగాఅరలతో) గూడినదిగనునుండవలయును.

“నిశాతనీతుశస్త్రాణాం సూక్ష్మాశిలై కామాషముద్గప్రభా ॥”

శస్త్రములను పదునుబెట్టునట్టిరాయి మినుములు, పెసలు వీనివంటికాంతిగలదిగనుండవలయునని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది.

జలూకా ప్రయోగము.

శ్లో॥ జలౌకసస్తుసుఖనాం రక్తస్రావాయయోజయేత్ ।

తా॥ సుఖిగానుండు మనుజులకు రక్తస్రావము చేయించుటకై జలగలను ప్రయోగించవలయును;

జలగలు విషముతోగూడినవి, విషరహితమయినవి అని 2 విధంబులు. వానిలో విషముతోగూడియుండు జలగలను



రక్తస్రావమునం దుపయోగించుట అపాయకరంబు. అట్లగుటచే వానిలక్షణములు తొలుత జెప్పబడుచున్నవి.

విషయుక్త - జలూకా లక్షణము.

శ్లో॥ దుష్టాంబుమత్స్యభేకాహి శవకోథమలోద్భవాః ॥ 35.
రక్తాః శ్వేతాభృశంకృష్ణా శ్చపలాఃస్థూలపిచ్ఛిలాః ।
ఇంద్రాయుధవిచిత్రోర్ధ్వ రాజయోరోమశాశ్చతాః ॥ 36.
సవిషావర్జయేత్

తా॥ దుష్టమైన ఉదకము, మత్స్యములు, కప్ప, పాము, వీనిశవములయొక్క కోథము, మూత్రపురీషాది మలములు వీనిలోనుండి జనించినజలగలు విషముతోగూడియుండును. అవి రక్తవర్ణము, తెలుపువర్ణము, మిగుల కృష్ణవర్ణముగలవిగ, స్థూలముగ పిచ్ఛిలముగ, ఇంద్రధనుస్సువలె చిత్రవర్ణముగల ఊర్ధ్వరేఖలుగలవిగ, విశేషరోమములతోగూడినవిగ నుండును. కావున విషముతోగూడియుండునట్టి జలగలను రక్తస్రావమునందు వర్జించవలయును.

విషయుక్త - జలూకోపద్రవములు.

శ్లో॥ తాభిః కండూ*పాకజ్వర భ్రమాః ।
విషపిత్తాస్రనుత్కార్యం తత్ర

తా॥ విషముతో గూడియుండు జలగలను మోహముచే రక్తస్రావమునం దుపయోగించిన యెడల దురద, పాకము, జ్వరము, భ్రమ, తాపము, శోఫ, మూర్ఛయీ మొదలగు నుపద్రవములుగలుగును. దానియందు విషము, పిత్తరక్తము వీనిని హరించజేయునట్టి చికిత్సలను చేయవలయును.

విషరహిత - జలూకా లక్షణము.

శ్లో॥ శుద్ధాంబుజాఃపునః ॥ 37.
నిర్విషాఃశైవలశ్యావా వృత్తానీలోర్ధ్వరాజయః ।
కషాయపృష్ఠా స్తన్వంగ్యః కించిత్పీతోదరాశ్చయాః ॥ 38.

తా॥ శుద్ధమైన ఉదకములో జనించినజలగలు, చెంగలువ, కలువ, తామరపువ్వు, అధికమైనజలము, పాచి, వీనిలోజనించినజలగలు, ఇవినిర్విషములుగనుండును,

* పాండు ఇతిపా.

మఱియు నాజలగలు పాచివలె కపిలవర్ణముగలవిగ, గుండ్రముగ, నీలవర్ణముగల ఊర్ధ్వ రేఖలుగలవిగ, కషాయవర్ణముగల (అనగా మఱ్ఱిమొదలగువాని పట్టలకు సమానమైన వర్ణముగల) పృష్ఠభాగమునుగలవిగ, కృశమైనశరీరముగలవిగ, ఒకింతపీతవర్ణముగల ఉదర ప్రదేశముగలవిగనుండును.

## రక్తముచేమదించియుండు - జలగల స్వరూపము.

శ్లో॥ తాఅప్యసమ్యగ్వమనా త్ప్రతితంచనిపాతనాత్ ।
సీదంతీస్సలిలంప్రాప్య రక్తమత్తాఇతిత్యజేత్ ॥ 39.

తా॥ అనిర్విషమైన జలగలుకూడా దుష్టరక్తమునుబాగుగా వమనముచేయకుండుటవలనను, ఎల్లప్పుడు దుష్టరక్తమును పానముచేయుచుండుటవలనను జలపూరితమగు నొక భాండములో సంచరించక సంకటపడుచుండును. కావున వానిని రక్తముచే మదించినవానిగనెఱింగి రక్తస్రావమునందు వర్జించవలయును.

## జలూకా - ప్రయోగ క్రమము.

శ్లో॥ అథేతరానిశాకల్క యుక్తేంభసిపరిప్లుతాః ।
అవంతిసోమేతక్రేవాపునశ్చాశ్వాసితాజలే ॥ 40.
లాఘవేగృహ్ణతే * మృత్స్నాంగ శస్త్రరక్తనిపాతనైః ।
పిబంతీరున్నతస్కంధా శ్ఛాదయేన్మృదువాససా ॥ 41.

తా॥ పిదప పసుపు కల్కముతోగూడియుండు ఉదకములోగాని లేక కాంజికములోగాని లేక తక్రములోగాని తేలునవిగ, మరల శుద్ధమైన ఉదకములో నీద తగినవిగ, ఉత్సాహముతోగూడియుండునవిగనుండు జలగలను శరీరప్రదేశమునందు ఘృతము లేక శ్రేష్ఠమైనమృత్తిక వీనిని లేపనము చేయుటచేతగాని లేక శస్త్రముచే రక్తస్రావము చేయించుటచేతగాని, కరచునటుల జేయవలయును. శిరము నెత్తుకొని రక్తపానము చేయుచుండుయాజలగను సూక్ష్మమైన వస్త్రముచే మూయవలయును. ఇటుల మూసినయెడల ఈగ మొదలగువానియొక్క యుపద్రవములేకుండుటవలన నా జలగలు శరీరమునందు బాగుగనంటుకొనును.

## జలగలు - దుష్టరక్తమును పానముచేసెడి క్రమము.

శ్లో॥ సంపృక్తాద్దుష్టశుద్ధాత్ ప్రాగ్జలౌకా దుష్టశోణితమ్ ।
ఆదత్తే ప్రథమంహంసః క్షీరంక్షీరోదకాదివ ॥ 42.

---

* మృత్స్నస్య ఇతిపా.



తా॥ హంస క్షీరముతోగూడియుండు ఉదకములోనుండి క్షీరమునుమాత్రము గ్రహించునటులనే ఆ జలగలు పరస్పరము మిళితముగనుండు దుష్టశుద్ధ రక్తములలో నుండి దుష్టరక్తమునుమాత్రము తొలుత గ్రహించును.

## జలూకాదంశ మోక్షణము.

శ్లో॥ దంశస్యతోదేకండ్వాంవా మోక్షయేద్వామయేచ్చతామ్ ।

తా॥ కరచినస్థలమునందు పీడగాని, దురదగాని గలుగునపుడు శుద్ధరక్త రక్షణార్థంబై జలగను విడిపించవలయును. మఱియునది రక్తపానమునం దాసక్తివలన విడువకుండినచో దానిముఖముపై పసుపుచూర్ణమునుగాని, లవణచూర్ణమునుగాని వేసి విడిపించి పిదప నా జలగకు వమనముచేయించవలయును. "తాం" అను ఏకవచన ప్రయోగముచే నొక్కొకజలగగా విడువవలయుననియును, ఏకకాలమునందన్ని జలగలను విడువకూడదనియు స్పష్టంబగుచున్నది.

## జలూకా - వమన క్రమము.

శ్లో॥ పటుతైలాక్తవదనాం శ్లక్ష్ణకండనరూక్షితామ్ ॥ 43.

తా॥ జలగయొక్క ముఖమునందు సైంధవలవణముతో గూడియుండు తైలమునుపూసి సూక్ష్మమయిన బియ్యపుకణములను దానిపై జల్లుటచే వమనము చేయించవలయును.

## జలూకా - వమనానంతర కర్తవ్యము.

శ్లో॥ రక్షేద్రక్తమదాద్భ్యాయః సప్తాహంతానపాతయేత్ ।

తా॥ వమనముచేసియుండు యాజలగలకు రక్తమదముగలుగకుండా రక్షించుటకై మఱల 7 దినములవరకు వానిని బ్రయోగింపంజనదు.

## వమనముచే - జలగలకుగలుగు గుణము.

శ్లో॥ పూర్వవత్పటుతాదార్ఢ్యం సమ్యగ్వాంతేజలౌకసామ్ ॥ 44.

తా॥ జలగలకు బాగుగా వమనంబైనయెడల పూర్వమువలెనే పటుత్వము, దార్ఢ్యముగలుగును.

## వమనాధిక్యముచే - జలగలకుగలుగు ఉపద్రవము.

శ్లో॥ క్లమోతియోగాన్మృత్యుర్వా

తా॥ జలగలకు అధికముగా వమనంబులైనయెడల బడలికగాని లేక మరణముగాని కలుగును.

## వమనాభావముచే - జలగలకుగలుగు దోషము.

శ్లో॥ దుర్వాంతే స్తబ్ధతామదః ।

తా॥ జలగలకు బాగుగా వమనము కాకుండునపుడు స్తబ్ధత్వము, మదము గలుగును.

శ్లో॥ * అన్యత్రాన్యత్ర తాః స్థాప్యా ఘటేమృత్స్నాంబుగర్భిణి॥ 45.
లాలాదికోథనాశార్థం సవిషాస్స్యుస్తదన్వయాత్ ।

తా॥ జలగలు నిర్విషంబులుగనుండినను వానికి లాలామూత్రపురీషాదిసంబంధముచే దోషము కలుగును. కావున తచ్ఛమనార్థమై ప్రశస్తమైన మృత్తికతోగూడియుండుజలముచే పూరితమయిన వేర్వేరుకుండలయందు 3 దినముల కొకమారుగాని లేక 5 దినములకొకమారుగాని ఆ జలగలను విడువవలయును. అటు కాదేని నవి పైజెప్పిన లాలాగులసంబంధమువలన విషయుక్తంబులుగ నగును.

## అశుద్ధ రక్తస్రావము.

శ్లో॥ అశుద్ధౌ స్రావయేద్దంశాన్ హరిద్రాగుడమాక్షికైః॥ 46.

తా॥ రక్తము అశుద్ధముగనుండునటుల తెలియవచ్చినయెడల జలగలు కరిచిన స్థలములో పసుపు, బెల్లము, తేనె, వీనిచే మరల రక్తమును స్రవింపజేయవలయును.

## ఘృతపిచు ప్రయోగము.

శ్లో॥ శతధౌతాజ్యపిచవ స్తతో లేపాశ్చశీతలాః ।

తా॥ పిదప ననేకపర్యాయములు కడుగబడిన ఘృతపిచువులను ప్రయోగించవలయును. మఱియును శీతలముగనుండు యష్టిమధుకము, చందనము, వట్టివేరు యీమొదలగు లేపనములనుకూడా చేయవలయును.

## దుష్ట - రక్తస్రావ ఫలము.

శ్లో॥ దుష్టరక్తాపగమనాత్సద్యో † రోగరుజాంశమః ॥ 47.

---

* “గుల్మార్శోవిద్రధీకుష్ఠ వాతరక్తగలామయాన్ । నేత్రరుగ్విషవీసర్పాన్ శమయంతిజలౌకసః ॥”
గుల్మము, అర్శస్సు, విద్రధి, కుష్ఠము, వాతరక్తము, కంఠరోగము, నేత్రరోగము విషము, విసర్పి వీనిని జలగలు శమింపజేసును. అనెడి ప్రక్షిప్తపాఠంబిచట గన్పట్టుచున్నది.

† రాగ ఇతిపా.



తా॥ దుష్టరక్తము వెలిపడుటవలన రోగము, పీడ యీమొదలగునవి తత్క్షణముననే శాంతిజెందును. మఱియును వాపు, శైథిల్యము, దాహము ఇవికూడా శాంతిజెందును.

## పర్యుషిత రక్తస్రావము.

శ్లో॥ అశుద్ధంచలితంస్థానాత్స్థితంరక్తం వ్రణాశయే ।
అమ్లీభవేత్పర్యుషితం తస్మాత్తత్స్రావయేత్పునః ॥ 48.

తా॥ అశుద్ధమయిన రక్తము స్వస్థానములోనుండిచలించి వ్రణస్థానమునుజెంది చిరకాలమువరకుండినచో అమ్లభావమును జెందును. కాబట్టి దానిని మరల స్రవింపజేయవలయును.

## పిత్తదుష్ట - రక్తస్రావమునందు అలాబుప్రయోగ నిషేధము.

శ్లో॥ యుంజ్యాన్నాలాబుఘటికా రక్తేపిత్తేనదూషితే ।
తాసామనలసంయోగాత్

తా॥ రక్తము పిత్తముచే దూషింపబడియుండునపుడు అలాబును, ఘటికను, ప్రయోగించంజనదు. ఏలననగా :—అలాబుఘటికలకు అగ్ని సంయోగముగలిగి యుండుటచే నవి పిత్తరక్తములను ప్రకోపింపజేసును.

## కఫవాత - దుష్టరక్త స్రావణోపాయము.

శ్లో॥ యుంజ్యాచ్ఛకఫవాయునా ॥ 49

తా॥ రక్తము కఫవాతముచే దూషించబడియుండునపుడు దానిని స్రవింపజేయుటకై అలాబు, ఘటిక వీనిని ప్రయోగించవలయును.

## కఫదుష్ట - రక్తస్రావమునందు - శృంగ నిషేధము.

శ్లో॥ కఫేనదుష్టంరుధిరం నశృంగేణవినిర్హరేత్ । స్కన్నత్వాత్

తా॥ కఫముచే దూషించబడిన రక్తము స్కన్నముగ (అనగా దట్టముగ) నుండుటవలన దానిని శృంగముచే బైలుపరచంజనదు. ఏలననగా:—శృంగమునకు అగ్ని సంయోగములేకుండుటవలన కఫదుష్టమైన రక్తమును స్రవింపజేయుటకు సామర్థ్యము లేకుండును.

## వాతపిత్త - దుష్టరక్త స్రావణోపాయము.

శ్లో॥ వాతపిత్తాభ్యాం దుష్టంశృంగేణనిర్హరేత్ ॥ 50.

తా॥ వాతపిత్తములచే దూషించబడిన రక్తమును శృంగములచే బైలుపరచవలయును.

### రక్తస్రావణ క్రమము.

శ్లో॥ గాఢంబధ్వోపరిదృఢం రజ్జ్వాపట్టేనవాసమమ్ ।
స్నాయుసంధ్యస్థిమర్మాణి త్యజన్ * ప్రచ్ఛానమాచరేత్ ॥ 51.
అధోదేశప్రవిసృతైః పదైరుపరిగామిభిః ।
నగాఢఘనతిర్యగ్భిర్నపదేపదమాచరేత్ ॥ 52.
† ప్రచ్ఛానేనైకదేశస్థం గ్రథితంజలజన్మభిః ।
హరేచ్ఛృంగాదిభిస్సుప్తమసృగ్వ్యాపిసిరావ్యధైః ॥ 53.

తా॥ సిరావ్యధచేయుతగిన శరీరపైభాగమును దారముచేగాని, వస్త్రపట్టముచేగాని బంధించి యాప్రదేశమునందుండు స్నాయువులను, అస్థులను, సంధులను, మర్మములనువదలి అధోదేశము, ఊర్ధ్వదేశము పీనియందు వ్యాపించునవియును, గట్టిగ, తీక్ష్ణముగ, అడ్డముగనుండకుండునవియును నగు శలాకచే పొడవవలయును. శలాకపైశలాకను ప్రయోగింపంజనదు. మఱియు నేకదేశమునందుండు రక్తమును శలాకచే పొడిచి ఆకర్షించవలయును. గ్రంథి, అర్బుదము యీమొదలగు రోగములయందు గడ్డకట్టియుండు రక్తమును జలగలచే బైలుపరచవలయును. సుప్తముగ (అనగా నిశ్చేతనముగ) నుండురక్తమును శృంగాములచేతను, సర్వశరీరమునందు వ్యాపించుచుండురక్తమును సిరావేధనముచేతను, హరింపజేయవలయును.

శ్లో॥ § ప్రచ్ఛానంపిండితేవాస్యాత్

తా॥ రక్తము గడ్డకట్టియుండునపుడు శలాకను ప్రయోగింపందగును.

శ్లో॥ అవగాఢేజలౌకసః ।

తా॥ రక్తము లోతులో ప్రవేశించియుండునపుడు జలగలను ప్రయోగించవలయును.

శ్లో॥ త్వక్స్థేఽలాబుఘటీశృంగం

తా॥ రక్తము చర్మమునాశ్రయించియుండునపుడు ఘటి, శృంగము, వీనిని [illegible]యోగించవలయును.

* [illegible] ఇతిపా. † ప్రచ్ఛానే ఇతిపా. § ప్రచ్ఛానం ఇతిపా.



శ్లో॥ సిరైవవ్యాపకేఽసృజి ॥ 54.

తా॥ సర్వశరీరములో వ్యాపించియుండురక్తమును స్రవింపజేయుటయందు సిరావేధనముచేయవలయును.

### మతాంతరమునందు - రక్తస్రావ క్రమము.

శ్లో॥ వాతాదిధామవాశృంగ జలౌకోలాబుభిఃక్రమాత్ ।

తా॥ వాతాదిదోషస్థానములను జెందియుండు రక్తమును యథాక్రమముగా (అనగా వాతస్థానగత రక్తమును శృంగముచేతను, పిత్తస్థానగతరక్తమును జలగలచేతను, శ్లేష్మస్థానగతరక్తమును అలాబుచేతను) హరింపజేయవలయును.

### రక్తస్రావానంతర కర్తవ్యము.

శ్లో॥ స్రుతాసృజఃప్రదేహాద్యైః శీతైస్స్యాద్వాయుకోపతః ॥ 55.
సతోదకంమాశోఫస్తం సర్పిషోష్ణేనసేచయేత్ ॥ 55½.

తా॥ రక్తమోక్షణము చేయించుకొనిన పురుషునికి శీతలమైన ప్రలేపములచే వాతముప్రకోపించి పోట్లు, దురద వీనితోగూడియుండు శోఫను గలుగజేయును. కావున నటువంటిశోఫను ఉష్ణమైనఘృతముచే సేచనముచేయవలయును.

షడ్వింశతితమాధ్యాయము, ముగిసెను.

శ్రీ ర స్తు.

# సప్తవింశాధ్యాయము.

పూర్వాధ్యాయమునందు రక్తమోక్షణోపాయమైన శృంగము మొదలగువానింజెప్పి "ప్రచ్ఛన్నేనైకదేశస్థమిత్యాది" వాక్యముచే శృంగాదివిషయములు కూడా జెప్పబడినవి. మఱియును సిరావ్యధనుగురించి విశేషముగా జెప్పవలసియుండుటచే తద్విషయమై వేరొక యధ్యాయము చెప్పబడుచున్నది.

## సిరావ్యధ - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతస్సిరావ్యధవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ శస్త్రవిధ్యధ్యాయానంతరము సిరావిధిని తెలియవలయునట్టి సిరావ్యధ విధ్యధ్యాయమును వివరించెదను. సర్వశరీరమునందు రక్తమును వ్యాపింపజేసెడి బోలు నరములు సిరలనబడును.

### శుద్ధరక్త లక్షణము.

శ్లో॥ మధురంలవణంకించి దశీతోష్ణమసంహితమ్ ॥
పద్మేంద్రగోపహేమావి శశలోహితలోహితమ్ ॥ 1
లోహితంప్రవదేచ్ఛుద్ధం తనోస్తేనైవచస్థితిః ।

తా॥ మధురముగ, ఒకింతఉప్పగ, కొంచెముఉష్ణముగ, కొంచెము శీతలముగ, ద్రవముగ, పద్మము, ఇంద్రగోపపురుగులు, బంగారము, వీనివలెనెఱ్ఱగ, మేక, చెవుల పిల్లి, వీనిరక్తమువలె నెఱుపువర్ణముగలదిగనుండు రక్తము శుద్ధమయినదని తెలియవలయును. మఱియు నటువంటిశుద్ధమయిన రక్తముచేతనే శరీరము స్థిరముగనిలుచును. శుద్ధరక్తము అనేకవర్ణములుగలదిగ నగుపడుటచే పద్మాదిదృష్టాంతము లిచట చెప్పబడినవి.



### రక్తదోషము.

శ్లో॥ తత్పిత్తశ్లేష్మలైః ప్రాయో దూష్యతే

తా॥ మఱియు నారక్తము తఱుచుగ పిత్తకరమైన ఉప్పు, కారము, తీక్ష్ణము యీ మొదలగు వస్తువులచేతను, మినుములు, నువ్వులు యీ మొదలగు శ్లేష్మకరమయిన వస్తువులచేతను, పూర్వజన్మార్జితకర్మచేతను దూషించబడును. మఱియును శరత్కాల స్వభావమువలన వాతకర ద్రవ్యములచేకూడా రక్తము ఒకానొకపుడు దూషించబడును. కాబట్టి ప్రాయః అనుపదము మూలమునందు ప్రయోగించబడినది.

### రక్తదోష - జనిత రోగములు.

శ్లో॥ కురుతేతతః ॥ 2.
విసర్పవిద్రధిప్లీహ గుల్మాగ్నిసదనజ్వరాన్ ।
ముఖనేత్రశిరోరోగ మదతృట్ లవణాస్యతాః ॥ 3.
కుష్ఠవాతాస్రపిత్తాస్ర కట్వమ్లోద్గిరణభ్రమాన్ ।
శీతోష్ణస్నిగ్ధరూక్షాద్యై రుపక్రాంతాశ్చయేగదాః ॥ 4.
సమ్యక్సాధ్యానసిధ్యంతి తేచరక్తప్రకోపజాః ।

తా॥ ఆరక్తంబటుల దూషింపబడుటవలన విసర్పము, విద్రధి, ప్లీహము, గుల్మము, అగ్నిమాంద్యము, జ్వరము, ముఖరోగము, నేత్రరోగము, శిరోరోగము, మదము, దప్పి నోరు ఉప్పగనుండుట, కుష్ఠము వాతరక్తము, పిత్తరక్తము, ఒకానొకపుడు కారముగ మఱియొకపుడు పుల్లగనుండు తేనుపులు, భ్రమ, వీనినిగలుగజేసును. మఱియు శీతలము, ఉష్ణము, స్నిగ్ధము, రూక్ష యీ మొదలగు చికిత్సలవలన ననుకూలమును జెందకుండు సాధ్యరోగములుకూడా రక్తప్రకోపముచేతనే జనించినవియని తెలియవలయును.

### సిరావ్యధ విధి.

శ్లో॥ తేషుస్రావయితుంరక్త ముద్రిక్తంవ్యధయేత్సిరామ్ ॥ 5.

తా॥ పైజెప్పిన విసర్పాది రోగములయందు ప్రకోపమును జెందియుండు రక్తమును స్రవించజేయుటకై సిరలను వేధించవలయును.

### సిరావేధనమునకు అనర్హులు.

శ్లో॥ నతూనషోడశాతీత సప్తత్యబ్దస్రుతాసృజామ్ ।
అస్నిగ్ధాస్వేదితాత్యర్థ స్వేదితానిలరోగిణామ్ ॥ 6.

గర్భిణీసూతికాజీర్ణ పిత్తాస్రశ్వాసకాసినామ్ ।
అతీసారోదరచ్ఛర్ది పాండుసర్వాంగశోఫినామ్ ॥ 7.
స్నేహపీతే ప్రయుక్తేషు తథాపంచసుకర్మసు ।
సాయం త్రితాంసిరాంవిధ్యేన్నతిర్యఙ్నాప్యనుత్థితామ్ ॥ 8.
నాతిశీతోష్ణవాతాభ్రే ష్వన్యత్రాత్యయికాద్గతాత్ ।

తా॥ 16 సంవత్సరములవయస్సునకు లోబడినవారు, 70 సంవత్సరములవయస్సునకు పైబడినవారు, రక్తస్రావము చేయించుకొనినవారు, అస్నిగ్ధులు, స్వేదకర్మ చేయించుకొనినవారు, అధికముగ స్వేదకర్మజేయించుకొనినవారు, గర్భిణులు, ప్రసవించినస్త్రీ, వాతరోగము, అజీర్ణము, పిత్తరక్తము, శ్వాసము, కాసము, అతిసారము, ఉదరరోగము, ఛర్ది, పాండువు, సర్వాంగములయందుశోఫ యీరోగములుగలవారు అట్టివారికి సిరావేధ చేయంజనదు. మఱియును స్నేహపానము చేసినపుడును, వమనాది పంచకర్మలు చేయబడియుండునపుడును, సిరావేధజేయంజనగు. సిరనుబంధించకుండా వేధింపంజనదు. అడ్డముగ వేధింపంజనదు. పొడవుగ లేవకుండుసిరను వేధింపంజనగు. అతిశీతలముగగాని లేక అత్యుష్ణముగగాని నుండుకాలమునందును, అధికమైనవాతముతోగూడియుండు కాలమునందును, ఆకాశము మేఘములచే నావరించబడియుండినపుడును సిరావేధనము చేయంజనదు. మఱియు నతికష్టమైనరోహిణి, విషాదిక యీమొదలగు రోగములయందుతప్ప తక్కినరోగములలో పై జెప్పిన కాలములయందు సిరావేధనము చేయంజనదు. అతికష్టమైన రోగముగలిగియుండునపుడు శీతోష్ణవృష్టులకు తగినటుల ప్రతీకారము చేసి సిరావేధంజేయవలయును.

శిరోనేత్రరోగములయందు - వేధించతగిన సిరలు.

శ్లో॥ శిరోనేత్రవికారేషు లలాట్యాంమోక్షయేత్సిరామ్ ॥ 9.
అపాంగ్యాముపనాస్యాంవా

తా॥ శిరము, నేత్రములు వీనిలోజనించురోగములయందు లలాటమునందుండు సిరను వేధించవలయును. లేక అపాంగము నందుండు (అనగా కంటి కొనయందుండు) సిరనుగాని, నాసికాసమీపము నందుండు సిరనుగాని వేధించవలయును.

కర్ణరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ కర్ణరోగేషుకర్ణజామ్ ।

తా॥ కర్ణరోగములయందు కర్ణసమీపమునందుండు సిరను వేధించవలయును.



నాసారోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ నాసారోగేషునాసాగ్రేస్థితాం

తా॥ నాసికారోగములయందు నాసికాగ్రమునందుండు సిరను వేధించవలయును.

పీనసరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ నాసాలలాటయోః ॥ [పీనసే] 10.

తా॥ పీనసరోగమునందు నాసిక, లలాటము వీనియందుండు సిరను వేధించవలయును.

ముఖరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ ముఖరోగేషు జిహ్వోష్ఠహనుతాలుగాః ।

తా॥ ముఖరోగములలో నాలుక, పెదవి, కటుమర్లు, నోటిలోపలిదౌడ వీనియందుండుసిరలను వేధించవలయును.

జతూర్ధ్వ - రోగములయందు - సిరా వేధనము.

శ్లో॥ జతూర్ధ్వంగ్రంథిషుగ్రీవా కర్ణశంఖశిరఃశ్రితాః ॥ 11.

తా॥ మెడకొంకులకు పైభాగమునందు జనించుగ్రంథులలో మెడ, చెవులు, కణత, శిరస్సు వీనినాశ్రయించియుండు సిరలను వేధించవలయును.

ఉన్మాదరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ ఉరోఽపాంగలలాటస్థా ఉన్మాదే

తా॥ ఉన్మాదమునందు రొమ్ము, కంటికొన, లలాటము, వీనినాశ్రయించియుండు సిరలనువేధించవలయును.

అపస్మారరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ ఉపస్మృతౌపునః
హనుసంధౌసమస్తేవా సిరాంభ్రూమధ్యగామినీమ్ ॥ 12.

తా॥ అపస్మారములో కటుమర్ల సంధియందుండు సిరనుగాని, లేకకటుమర్లయందంతట వ్యాపించియుండు సిరనుగాని లేక కనుబొమలకు మధ్యమునం దూర్ధ్వముఖముగ వ్యాపించియుండుసిరనుగాని వేధించవలయును.

విద్రధి - పార్శ్వశూల - వీనియందు - సిరా వేధనము.

శ్లో॥ విద్రధౌపార్శ్వశూలేచ పార్శ్వకక్షా స్తనాంతరే ।

తా॥ విద్రధి, పార్శ్వశూల వీనియందు పార్శ్వమునందుండుసిరను, చంక, స్తనములు వీనిమధ్యమునందుండుసిరను వేధించవలయును.

తృతీయక - జ్వరమునందు - సిరా వేధనము.

శ్లో॥ తృతీయకేఽంసయోర్మధ్యే

తా॥ తృతీయకజ్వరమునందు భుజశిరస్సుల సంధియందుండు సిరను వేధించవలయును.

చాతుర్థిక - జ్వరమునందు - సిరా వేధనము.

శ్లో॥ స్కంధస్యాధశ్చతుర్థకే ॥ 13.

తా॥ చాతుర్థికజ్వరములో భుజశిరస్సులకు క్రిందిభాగమునందుండు సిరను వేధించవలయును.

గ్రహణీరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ ప్రవాహికాయాంశూలిన్యాం శ్రోణితోద్వ్యంగులేస్థితామ్ ।

తా॥ శూలతోగూడియుండు ప్రవాహికారోగమునందు కటిప్రదేశమునకుపైన 2 అంగుళమునందుండు సిరను వేధించవలయును.

శుక్ర - రోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ శుక్రమేఢ్రామయేమేఢ్రే

తా॥ శుక్రరోగము, మేఢ్రరోగము వీనియందు మేఢ్రమునందుండు సిరను వేధించవలయును.

గళగండమునందు - సిరా వేధనము.

శ్లో॥ ఊరుగాంగళగండయోః ॥ 14.

తా॥ రెండు విధములైన గళగండరోగములయందు తొడయందుండుసిరను వేధించవలయును.

గృధ్రసీరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ గృధ్రస్యాంజానునోధస్తా దూర్ధ్వంవాచతురంగులే !



తా॥ గృధ్రసీరోగమునందు మోకాలునకు క్రిందిభాగమునందుగాని లేక పైభాగమునందుగాని 4 అంగుళములయందుండు సిరను వేధించవలయును.

అపచీరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ ఇంద్రవస్తేరధోపచ్యాం ద్వ్యంగుళే

తా॥ అపచీరోగమునందు ఇంద్రవస్తిమర్మమునకు అధోభాగములో 2 అంగుళములయందుండు సిరను వేధించవలయును.

సక్థిరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ చతురంగుళే ॥ [ఊర్ధ్వంగుల్ఫస్యసక్థ్యర్తౌ] 15.

తా॥ సక్థిపీడయందు చీలమండయొక్క ఊర్ధ్వభాగములో 4 అంగుళములయందుండుసిరను వేధించవలయును.

క్రోష్టుక - శీర్షమునందు - సిరా వేధనము.

శ్లో॥ తథాక్రోష్టుకశీర్షకే ।

తా॥ క్రోష్టుకశీర్షకమను ఊర్ధ్వాంగవాతరోగమునందు పై జెప్పినప్రకారము చీలమండయొక్క ఊర్ధ్వభాగములో 4 అంగుళములయందుండు సిరను వేధించవలయును.

పాదదాహాదిరోగములయందు - సిరా వేధనము.

శ్లో॥ పాదదాహేఖుడేహర్షే విపాద్యాంవాతకంటకే ॥ 16.

చిప్పేచద్వ్యంగులేవిద్ధ్యే దుపరిక్షిప్రమర్మణః ।

తా॥ పాదదాహము, ఖుడము, పాదహర్షము, విపాది, వాతకంటకము, చిప్పము యీరోగములయందు క్షిప్రమర్మమునకు పైభాగమున 2 అంగుళములయందుండుసిరను వేధించవలయును.

విశ్వాచీరోగమునందు - సిరా వేధనము.

శ్లో॥ గృధ్రస్యామివవిశ్వాచ్యాం

తా॥ విశ్వాచీరోగములో గృధ్రసీరోగమునందు చెప్పిన సిరనే వేధించవలయును.

వేధనార్హమైన - సిరలగుపడనపుడు - సిరావేధన క్రమము.

శ్లో॥ యథోక్తానామదర్శనే ॥ 17.

మర్మహీనేయథాసన్నే దేశేఽన్యాంవ్యధయేత్సిరామ్ ।

తా॥ ఆయారోగములకు పైజెప్పిన సిరలు కనుబడకుండునపుడు మర్మప్రదేశమునువదలి ఆసిరకు సమీపప్రదేశమునందుండు వేరేసిరను వేధించవలయును.

సిరావేధన క్రమము.

శ్లో॥ అథస్నిగ్ధతనుఃసజ్జ సర్వోపకరణోబలీ ॥ 18॥

కృతస్వస్త్యయనఃస్నిగ్ధ రసాన్నప్రతిభోజితః ।

అగ్నితాపాతపస్విన్నో జానూచ్చాసనసంస్థితః ॥ 19.

మృదుపట్టాత్తకేశాంతో జానుస్థాపితకూర్పరః ।

ముష్టిభ్యాంవస్త్రగర్భాభ్యాం మన్యేగాఢంనిపీడయేత్ ॥ 20.

దంతప్రపీడనో * త్కాస గండాధ్మానానిచాచరేత్ ।

తా॥ స్నిగ్ధమయినశరీరముగలవాడు, వస్త్రము, పీడపాదకము, స్నేహము, గ్లైరికము యీమొదలగు ఉపకరణములను సిద్ధముచేసుకొనినవాడు, పుష్టివంతుడునగు పురుషుడు బలిని, మంగళహోమమునుచేసుకొని స్నిగ్ధమైన రసముతోగూడియుండు అన్నమునుభుజించి అగ్నితాపము, ఎండ వీనిచేస్విన్నుడై మోకాలంత పొడవుగల ఆసనమునందు కూర్చుండినవాడై సూక్ష్మమయిన వస్త్రపట్టముచేకట్టబడిన కేశములు, మోకాలుపైనునచబడిన మోచేతులుగలవాడై వస్త్రమును లోన నిముడ్చుకొనియుండు పిడికళ్ళచే పెడతలపెన్నరములను దృఢముగా పీడించవలయును. మఱియు నట్టిపురుషుడు దంతప్రపీడనము (అనగా పండ్లు కొరుకుట), ఉత్కాసము, ఆధ్మానము, వీనిని కూడా చేయవలయును.

శ్లో॥ పృష్ఠతోయంత్రయేచ్చైనం వస్త్రమానేష్టయన్నరః ॥ 21.

కంధరాయాంపరిక్షిప్య స్యన్యాంతర్వామతర్జనీమ్ ।

ఏషోంతస్ముఖవర్జానాం సిరాణాంయంత్రణేవిధిః ॥ 22.

తా॥ పై జెప్పినప్రకారము కూర్చుండియుండుగొగిక పృష్ఠదేశమునందును (అనగా వీపుయందును) గొంతుయందును వస్త్రమునుచుట్టి దానిమధ్యయందు ఎడమ

* చ్ఛ్వాస ఇతిపా.



జొట్టనవ్రేలును దృఢముగనునిచి సిరలను కట్టవలయును. ఇది ముఖములో నుండుసిరలు తప్ప యితరమైన సిరలనుకట్టునట్టివిధియని తెలియవలయును.

శ్లో॥ తథామధ్యమయాంగుళ్యా వైద్యోంగుష్ఠవిముక్తయా ।
తాడయేత్

తా॥ అటుల కట్టినపిదప బొట్టనవ్రేలితోచేరకుండు ఎడమచేతియొక్క మధ్యమాంగుళిచే నాసిరనువైద్యుడు కొట్టవలయును.

శ్లో॥ ఉత్థితాంజ్ఞాత్వా స్పర్శాంగుష్ఠ ప్రపీడనైః ॥ 23.

కుఠార్యాలక్షయేన్మధ్యే వామహస్తగృహీతయా ।

ఫలోద్దేశేసునిష్కంపం సిరాంతద్వచ్చమోక్షయేత్ ॥ 24.

తా॥ పిదప స్పర్శముచేగాని, లేక బొట్టనవ్రేలివలన నదుముటచేగాని ఉత్థితమైన (అనగా పైకిలేచిన) సిరలను తెలుసుకొని యాసిరయొక్క మధ్యములో ఫలోద్దేశములనునిచి కదలకుండా ఎడమచేతితో పట్టుకొనబడిన కుఠారియను నాయుధముచే సిరనుగుర్తుపెట్టుకొనవలయును.

శ్లో॥ తాడయన్పీడయేచ్చైనాం విధ్యేద్వ్రీహిముఖేనతు ।

తా॥ వ్రీహిముఖమను నాయుధముచే మరల నాసిర నొకమారుతాడనముచేసి బొట్టనవ్రేలిచే బాగుగనదుముకొని వ్రీహిముఖమను నాయుధముచేతనే ఆసిరను వేధించవలయును.

నాసికా - సమీప - సిరావేధన క్రమము.

శ్లో॥ అంగుష్ఠేనోన్నమయ్యాగ్రే నాసికాముపనాసికామ్ ॥ 25.

నాసికాగ్రభాగమును బొట్టనవ్రేలిచే పొడవుగనెత్తిపట్టుకొని నాసికాసమీపమునందుండు సిరను వేధించవలయును.

జిహ్వాధోభాగ - సిరావేధన క్రమము.

శ్లో॥ అభ్యున్నతవిదష్టాగ్ర జిహ్వస్యాథతదాశ్రయామ్ ।

తా॥ పైతాలు ప్రదేశమున కభిముఖముగా నాలుకం దీసుకొనివచ్చి యానాలుకయొక్కకొసన్యుదంతములచే బాగుగాకరుచుకొనియుండునపుడు నాలుకకుఅధోభాగమునందుండు సిరను వేధించవలయును.

### మెడయందు - సిరావేధన క్రమము.

శ్లో॥ యంత్రయేత్ స్తనయోరూర్ధ్వం గ్రీవాశ్రితసిరావ్యధే ॥ 26.

తా॥ మెడనాశ్రయించియుండు సిరలను వేధించునపుడు స్తనములయొక్క పై ప్రదేశమునందు వస్త్రముచే చుట్టవలయును.

శ్లో॥ పాషాణగర్భహస్తస్య జానుస్థే ప్రసృతే భుజే ।
కుక్షేరారభ్య మృదితే విధ్యేద్బద్ధోర్ధ్వపట్టకే ॥ 27.

తా॥ రాయిని హస్తమునందుంచుకొనియుండు పురుషునియొక్క హస్తములు, మోకాళ్ళపై చాచబడియుండునపుడు కుక్షి మొదలుకొని మెడవరకు మర్దనముచేసి వేధించవలసిన స్థలమునకుపైన వస్త్రమునుకట్టి మెడసిరను వేధించవలయును.

### హస్త - సిరావేధన క్రమము.

శ్లో॥ విధ్యేద్ధస్తసిరాం బాహావనాకుంచితకూర్పరే ।
బద్ధ్వాసుఖోపవిష్టస్య ముష్టిమంగుష్ఠగర్భిణీమ్ ॥ 28.
ఊర్ధ్వం వేధ్యప్రదేశాచ్చ పట్టికాం చతురంగులే ।

తా॥ సుఖముగా కూర్చుండియుండు పురుషుడు వంచబడని మోచేతులుగలవాడైయుండునపుడు బొటనవ్రేలు అరచేతిలో గూఢముగనుండునటుల ముష్టినిపట్టించి వేధించవలసిన స్థానమునకుపైన 4 అంగుళములయందు వస్త్రపట్టమునుకట్టి హస్తసిరను వేధించవలయును.

### పార్శ్వ - సిరావేధన క్రమము.

శ్లో॥ విధ్యేదాలంబమానస్య బాహుభ్యాం పార్శ్వయోస్సిరామ్ ॥ 29.

తా॥ హస్తములచే కర్రను పట్టుకొని వ్రేలాడుచుండునపుడు పార్శ్వములయందలి సిరను వేధించవలయును

### మేఢ్ర - సిరావేధన క్రమము.

శ్లో॥ ప్రహృష్టే మేహనే

తా॥ మేఢ్రము హృష్టముగనుండునపుడు మేఢ్రమునందుండు సిరను వేధించవలయును.

### జంఘా - సిరావేధన క్రమము.

శ్లో॥ జంఘాసిరాం జానున్యకుంచితే ।



తా॥ మోకాళ్ళు వంచబడకుండునపుడు పిక్కయందుండు సిరను వేధించవలయును.

### పాద - సిరావేధన క్రమము.

శ్లో॥ పాదే తు సుస్థితేఽధస్తాజ్జానుసంధేర్నిపీడితే ॥ 30.
గాఢం కరాభ్యామాగుల్ఫం చరణే తస్య చోపరి ।
ద్వితీయే కుంచితే కించిదారూఢే హస్తవత్తతః ॥ 31.
బద్ధ్వా విధ్యేత్సిరాం

తా॥ పాదమును భూమియందు సుఖముగానునుచుకొనియుండునపుడు మోకాలు సంధికిక్రింద చీలమండవరకు దృఢముగా హస్తములచేమర్దించి క్రిందనునిచియుండు కాలుపై 2-వ కాలును కొంచెమువంచి యునుచుకొనియుండగా వేధించవలసిన స్థానమునకుపైన 4 అంగుళములయందు వస్త్రపట్టమునుకట్టి పాదసిరను వేధించవలయును.

శ్లో॥ ఇత్థమనుక్తేష్వపి కల్పయేత్ ।
తేషు తేషు ప్రదేశేషు తత్తద్యంత్రముపాయవిత్ ॥ 32.

తా॥ ఉపాయమునెఱిగిన వైద్యుడు చెప్పబడని యితరమైన ఆయా అవయవములయందును పైజెప్పిన రీతిగా స్వబుద్ధిచే యుక్తప్రకారము యంత్ర వేధనక్రమము కల్పించుకొనవలయును.

### వ్రీహిముఖ - కుఠారికా - శస్త్ర ప్రయోగము.

శ్లో॥ మాంసలే నిక్షిపేద్దేశే వ్రీహ్యాస్యం వ్రీహిమాత్రకమ్ ।
యవార్ధమస్థ్నాముపరి సిరాం విధ్యన్ కుఠారికామ్ ॥ 33.

తా॥ అధికమాంసముగల శరీరావయవములయందు వ్రీహిముఖమను శస్త్రమును వడ్లగింజంత ప్రమాణము ప్రయోగించవలయును. మఱియును అస్థులపై నుండుసిరలను వేధించునపుడు కుఠారికయనుశస్త్రమును అర్ధయవప్రమాణము ప్రయోగించవలయును.

### సమ్యగ్వేధ లక్షణము.

శ్లో॥ సమ్యగ్విద్ధే స్రవేద్ధారాం యంత్రే ముక్తే తు న స్రవేత్ ।

తా॥ బాగుగ వేధించబడినసిరయందు రక్తముధారగస్రవించును. దానియందలి కట్టును విప్పివేయగానే రక్తము స్రవించనేరదు.

దుర్విద్ధ - అతివిద్ధ లక్షణము.

శ్లో॥ అల్పకాలంవహత్యల్పం దుర్విద్ధాతైలచూర్ణనైః ॥ 34.
సశబ్దమతివిద్ధాతు స్రవేద్దుఃఖేనధార్యతే ।

తా॥ బాగుగ వేధించబడని సిర స్వల్పకాలమువరకు స్వల్పముగ రక్తమును స్రవింపజేయును. అధికముగవేధించబడినసిర శబ్దముతో రక్తము నధికముగ స్రవింపజేయును. అరక్తము తైలము, చూర్ణము వీనిచే బహుకష్టముమీద నిలుచును.

రక్తము - స్రవించకుండుటకు హేతువు.

శ్లో॥ భీమూర్ఛాయంత్రశైథిల్య కుంఠశస్త్రాతితృప్తయః ॥ 35.
క్షామత్వవేగితాస్వేదా రక్తస్యాస్రుతిహేతవః ।

తా॥ భయము, మోహము, యంత్రశైథిల్యము (అనగా దృఢముగా యంత్రమును ప్రయోగించకుండుట), పదునులేనిశస్త్రము, అధికతృప్తి, దౌర్బల్యము, మలమూత్రాదివేగము గలిగియుండుట, స్వేదములేకుండుట, ఇవి రక్తస్రావము గలుగకుండుటకు హేతువులని తెలియవలయును. మఱియును పైజెప్పినభయాదులు రక్తము స్రవించకుండుటకు కారణముగనుండుటచే భయాదులు కలిగియుండునపుడు రక్తస్రావము చేయఁజనదు అని తాత్పర్యము.

రక్తము - బాగుగ స్రవించకుండునపుడు - వేల్లాది లేపనము.

శ్లో॥ అసమ్యగస్రే స్రవతి వేల్లవ్యోషనిశానతైః ॥ 36.
సాగారధూమలవణ తైలైర్దిహ్యాత్సిరాముఖమ్ ।

తా॥ రక్తము బాగుగాస్రవించకుండినయెడల వాయువిడంగములు, త్రికటుకములు, పసుపు, గ్రంథితగరము, ఇంటిధూమము, లవణము, తైలము వీనిచే సిరయొక్కముఖమునందు లేపనము చేయవలయును.

రక్తము - బాగుగ - స్రవించునపుడు - తైలాది లేపనము.

శ్లో॥ సమ్యక్ప్రవృత్తేకోష్ణేన తైలేనలవణేనచ ॥ 37.

తా॥ రక్తము బాగుగా స్రవించునపుడు కొంచెము ఉష్ణముగనుండు తైలము, లవణము వీనిచే శిరాముఖమునందు లేపనము చేయవలయును.

దుష్టరక్త - స్రావ క్రమము.

శ్లో॥ అగ్రే స్రవతిదుష్టాస్రం కుసుంభాదివపీతికా ।



తా॥ రాగము, పీతికా వీనితో మిశ్రముగనుండు కుసుంభాపువ్వులలోనుండి తొలుత పీతిక స్రవించునటులనే దుష్టరక్తము, శుద్ధరక్తము, వీని మిశ్రితముగనుండు సిరలలోనుండి తొలుత దుష్టరక్తము స్రవించును.

విశేష - రక్తస్రావ నిషేధము.

శ్లో॥ సమ్యక్స్రుత్వాస్వయంతిష్ఠేచ్ఛుద్ధంతదితినాహరేత్ ॥ 38.

తా॥ దుష్టరక్తము బాగుగా స్రవించిన పిదప శుద్ధరక్తముస్వయత్నము లేకనే నిలిచిపోవునెడలతలంపుతో రక్తమును విశేషముగాస్రవింపజేయంజనదు. ఏలవనగా:- రక్తము ప్రాణాధారమునకు హేతువుగనుండును.

మూర్ఛ - గలిగియుండునపుడు - రక్తస్రావ నిషేధము.

శ్లో॥ యంత్రంవిముచ్యమూర్ఛాయాం వీజితేవ్యజనైఃపునః ।
స్రావయేన్మూర్ఛతిపున స్త్వపరేద్యుస్త్ర్యహేపివా ॥ 39.

తా॥ సిరావేధజేయునపుడు మూర్ఛగలిగినయెడల యంత్రమును తీసివేసి విసెనకఱ్ఱలవలనవిసురుటచే రోగిని ఓదార్చి మరల రక్తమును స్రవింపజేయవలయును. మరల నారోగి మూర్ఛజెందినయెడల అశుద్ధరక్తమునుకూడా ఆ దినమునందు స్రవింపజేయక మరుదినమునందుగాని లేక మూడవ దినమునందుగాని స్రవింపజేయవలయును.

వాతదుష్ట - రక్త లక్షణము.

శ్లో॥ వాతాచ్ఛ్యావారుణంరూక్షం వేగస్రావ్యచ్ఛఫేనిలమ్ ।

తా॥ వాతమువలనశ్యామవర్ణము, ఎఱుపువర్ణము, రూక్షము, తీవ్రమైనస్రావము నైర్మల్యము, నుఱుగు వీనితోగూడియుండు రక్తము స్రవించును.

పిత్తదుష్ట - రక్త లక్షణము.

శ్లో॥ పిత్తాత్పీతాసితంవిస్ర మస్కందుష్ణాత్సచంద్రకమ్ ॥ 40.

తా॥ పిత్తమువలన పీతవర్ణము, నల్లవర్ణము, దుర్గంధము, చంద్రకము వీనితోగూడినదిగ, దట్టముగనుండు రక్తము స్రవించును.

కఫదుష్ట - రక్త లక్షణము.

శ్లో॥ కఫాత్స్నిగ్ధమసృక్పాండు తంతుమత్పిచ్ఛిలంఘనమ్ ।

తా॥ కఫమువలన స్నిగ్ధము, తెలుపువర్ణము, తంతువులు వీనితోగూడినదిగ, గట్టిగ, పిచ్ఛిలముగనుండు రక్తము స్రవించును.

### సంసర్గ - దుష్టరక్త లక్షణము.

శ్లో॥ సంసృష్టలింగంసంసర్గాత్

తా॥ దోషసంసర్గమువలన పైజెప్పిన వాతపిత్తకఫసంసర్గలక్షణములతోఁగూడియుండు రక్తము స్రవించును.

### సన్నిపాత - దుష్టరక్త లక్షణము.

శ్లో॥ త్రిదోషంమలినావిలమ్ ॥ 41.

తా॥ త్రిదోషములచే మలినముగ, కలకబారినదిగ నుండురక్తము స్రవించును.

### అశుద్ధరక్త - స్రావ ప్రమాణము.

శ్లో॥ అశుద్ధంబలినోఽప్యస్రం నప్రస్థాత్స్రావయేత్పరమ్ ।

తా॥ బలిష్ఠుఁడుగనుండుపురుషునికికూడా ప్రస్థమునకధికముగా అశుద్ధరక్తమును స్రవించునటులజేయంజనదు.

### అధికరక్త - స్రావ జనితోపద్రవములు.

శ్లో॥ అతిస్రుతౌహిమృత్యుస్స్యాద్దారుణావాచలామయాః ॥ 42.

తా॥ అధికముగా రక్తస్రావము చేయించినయెడల మరణముగాని లేక దారుణమైన వాతరోగములుగాని కలుగును.

### అధిక - రక్తస్రావ చికిత్స.

శ్లో॥ తత్రాభ్యంగరసక్షీర రక్తపానానిభేషజమ్ ।

తా॥ అధిక రక్తస్రావమునందు అభ్యంగముచేయుట, మాంసరస, క్షీర, రక్తములపానముచేయుట ఇవి యౌషధంబులు.

### రక్తస్రావానంతర కర్తవ్యము.

శ్లో॥ స్రుతేరక్తేశనైర్యంత్రమపనీయహిమాంబునా ॥ 43.
ప్రక్షాళ్యతైలప్లోతాక్తం బంధనీయంసిరాముఖమ్ ।

తా॥ బాగుగారక్తము స్రవించియుండగా మెల్లమెల్లగా యంత్రమునువిడిపించి సిరాముఖమును శీతోదకముచే గడిగిదానిపై తైలమునుపూసి బంధించవలయును.

### పునః - రక్త స్రావము.

శ్లో॥ అశుద్ధంస్రావయేద్భూయః సాయమహ్న్యపరేఽపివా ॥ 44.



తా॥ రక్తమువాతాదులచే దుష్టమైయుండినయెడల నాదినముయొక్క సాయంకాలమునందుగాని లేక మరుదినమునందుగాని మరలరక్తమును స్రవింపజేయవలయును.

శ్లో॥ స్నేహోపస్కృతదేహస్య పక్షాద్వాభృశదూషితమ్ ।

తా॥ లేక నారోగియొక్క దేహమునందు స్నేహకర్మచేయించి మిక్కిలిదుష్టముగనుండు రక్తమును ఒకపక్షమునకుపైన మరల స్రవింపజేయవలయును. పై జెప్పిన ప్రకారము అశుద్ధమైన రక్తమును రోగాద్యనుగుణముగా సాయంకాలమునందుగాని, లేక మరుదినమునందుగాని, లేక ఒక పక్షమునకుపైనగాని ప్రస్థప్రమాణమే స్రవింపజేయవలయును. అయితే రక్తమును ప్రస్థమున కధికముగా స్రవింపజేయంజనదు.

"వమనేచవిరేకేచ రక్తాతీసారయోరపి । సార్ధత్రయోదశపలం ప్రస్థమాహుర్మనీషిణః ॥"

వమనము, విరేకము, రక్తస్రావము, అతిసారము వీనియందు ($13\frac{1}{2}$) పలము 1 ప్రస్థమని పండితులు వచించెదరని తంత్రాంతరమునందు ప్రస్థపరిమాణము చెప్పబడుచున్నది.

### సావశేష - దుష్టరక్త స్రావము.

శ్లో॥ కించిద్ధిశేషేదుష్టాస్రే నైవరోగోఽతివర్తతే ॥ 45.
సశేషమప్యతోధార్యం నచాతిస్రుతిమాచరేత్ ।

తా॥ దుష్టరక్తము కొంచెము శేషించియుండినను దానిచేరోగము అధికపడనేరదు. కాబట్టి దుష్టరక్తంబుండినను దానిని సశేషముగధరించవలయునే కాని అధికముగా స్రావముజేయించంజనదు. ఏలననగా:—రక్తము ప్రాణాధారముగనుండును.

"సశేషందుష్టరుధిర మపికుర్యాద్విచక్షణః । నచాతిప్రసృతింకుర్యాత్ శేషంసంశమనైర్జయేత్ ॥"

సమర్థుడగు వైద్యుడు దుష్టరక్తమునుకూడా కొంచెము శేషించియుండునటుల స్రవింపజేయవలయునే కాని అధికముగా స్రవింపజేయంజనదు. అయితే శేషించియుండు దుష్టరక్తమును సంశమనౌషధములచే చికిత్సింపవలయును. అని సుశ్రుతమునందుచెప్పబడియున్నది.

### అవశిష్ట - దుష్టరక్త - స్రావ క్రమము.

శ్లో॥ హరేచ్ఛృంగాదిభిశ్శేషం ప్రసాదమథవానయేత్ ॥ 46.
శీతోపచారపిత్తాస్రక్రియాశుద్ధివిశోషణైః ।
దుష్టంరక్తమనుద్రిక్త మేవమేవప్రసాదయేత్ ॥ 47.

తా॥ స్రవించి శేషించియుండు దుష్టరక్తమును శృంగము, సొరకాయబుఱ్ఱ, ఘటికా యీమొదలగువానిచే వెలిపరచవలయును. లేక నాదుష్టరక్తమును శీతోపచారము, పిత్తరక్తచికిత్స, వమనవిరేచనాదిరూపమయినశుద్ధి, లంఘనరూపమయిన [illegible]ణము, వీనిచే ఉద్రేకము జెందకుండునటులుండజేసి పిదప నాదుష్టరక్తమునకు దోషములను పోకడచి ప్రసన్నత్వమును గలుగజేయవలయును. స్రవించి శేషించియుండు దుష్టరక్తమునకు పూర్వోక్త శీతోపచారములచే ప్రసన్నత్వమును గలుగజేయవలయునే కాని సిరావ్యధాదులచే నాదుష్టరక్తమును వెలిపరచంజనదు. ఏలననగా:—సిరావ్యధాదులచే ఉద్రేకమును జెందకుండునట్టి రక్తమును వెలిపరచుట అపాయకరంబు.

అధికరక్త - స్రావమునందు - స్తంభన క్రియ.

శ్లో॥ రక్తేత్వతిష్ఠతిక్షిప్రం స్తంభినీమాచరేత్క్రియామ్ ।

తా॥ రక్తము నిలువక స్రవించుచుండగా నతిశీఘ్రములో నిక జెప్పబడు స్తంభనక్రియను జేయవలయును.

స్తంభన - క్రియా విశేషము.

శ్లో॥ రోధ్రప్రియంగుపత్తంగమాషయష్ట్యాహ్వగైరికైః ।
మృత్కపాలాంజనక్షౌమమషీక్షీరిత్వగంకురైః ।
విచూర్ణయేద్వ్రణముఖం పద్మకాదిహిమంపిబేత్ ॥ 40.

తా॥ లొద్దుగు, ప్రేంకణము, రక్తచందనము, మినుములు, అతిమధురము కావిరాయి, చిల్లపెంకు, అంజనము, పట్టువస్త్రముయొక్క మషి, క్షీరవృక్షములయొక్క పట్టలు, చిగుళ్ళు వీనిచే వ్రణముఖమును మూయవలయును. మఱియును పద్మకాదిగణములచే సిద్ధము చేయబడిన శీతలమైనకషాయమును పానము చేయవలయును.

శ్లో॥ తామేవవాసిరాంవిద్ధ్యేద్వ్యధాత్తస్మాదనంతరమ్ ।

తా॥ పిదప తొలుత వేధించిన సిరయందు వేధించియుండు ప్రదేశమునకు సమీపమున మరల వేధించవలయును.

శ్లో॥ సిరాముఖంచత్వరితం దహేత్తప్తశలాకయా ॥ 50.

తా॥ లేక నా సిరాద్వారమును శీఘ్రములో అగ్నితప్తమయిన శలాకచే దహింపజేయవలయును.

రక్తస్రావానంతర - హితాహారాది - సేవన క్రమము.

శ్లో॥ ఉన్మార్గగాయంత్రనిపీడనేన స్వస్థానమాయాంతిపునర్నయావత్ ।



దోషాః ప్రదుష్టారుధిరంప్రపన్నా స్తావద్ధితాహారవిహారభాక్స్యాత్ ॥ 51.

తా॥ యంత్రపీడనముచే స్వమార్గమును వదలి మార్గాంతరమును జెందియుండునవియునుదుష్టంబై దుష్టమయినరక్తమును జెందియుండునవియును నగు వాతాదిదోషములు మరల స్వస్థానమును జెందువరకు హితాహారవిహారములం జేయుచుండవలయును.

శ్లో॥ నాత్యుష్ణశీతంలఘుదీపనీయం రక్తేఽపనీతేహితమన్నపానమ్ ।
తదాశరీరంహ్యనవస్థితాస్రం అగ్నిర్విశేషాదితిరక్షణీయః ॥ 52.

తా॥ కాబట్టి రక్తస్రావము చేయించియుండగా అత్యుష్ణము, అతిశీతలము కానిదియును, స్వభావముచేతను మాత్రచేతను లఘువుగ, సంస్కారాదులచే అగ్నిదీపనకారిగనుండునదియునునగు అన్నపానములు హితకరంబులు. ఏలననగా:—ఆ కాలమునందు శరీరము అతిచంచలమయిన రక్తముతోగూడియుండును. రక్తము శరీరమునకాధారము. ఆరక్తమునకు పిత్తము ఆధారము; పిత్తమునకు అగ్ని ఆధారము; కాబట్టి అతియత్నముచే అగ్నిని రక్షించవలయును. అత్యుష్ణముగనుండు అన్నపానము రక్తమును జెరుచును. అతిశీతలముగనుండు అన్నపానము అగ్నిమాంద్యమును గలుగజేసును.

శ్లో॥ ప్రసన్నవర్ణేంద్రియమింద్రియార్థా నిచ్ఛంతమవ్యాహతపక్తృవేగమ్ । సుఖాన్వితంపుష్టిబలోపపన్నం విశుద్ధరక్తం పురుషంవదంతి ॥ 53.

తా॥ ప్రసన్నమయినవర్ణము, ఇంద్రియములుగలవాడు, స్వభావముగ శబ్దాదివిషయములనిచ్ఛయించువాడు, చెరచబడని జాఠరాగ్నివేగముగలవాడు, ఆరోగ్యముతోగూడియుండువాడు, పుష్టిబలముగలవాడునగు పురుషుడు శుద్ధమయిన రక్తము గలవాడని సద్వైద్యులు వచించెదరు. (అనగా శుద్ధమైన రక్తముగల శరీరమునకు పైజెప్పిన ప్రసన్నవర్ణేంద్రియత్వాదులు లక్షణమని భావము.) శుద్ధమయిన రక్తలక్షణము "మధురంలవణమిత్యాది" శ్లోకముచే నీ యధ్యాయప్రారంభమునందే చెప్పబడియున్నది.

సప్తవింశాధ్యాయము, ముగిసెను.

శ్రీ రస్తు

# అష్టవింశాధ్యాయము.

సిరావ్యధవిధ్యధ్యాయమునందు సకల శరీరవ్యాపియగు శల్యరూపమైన రక్తమును సిరావేధనోపాయము చేత వెలిపరచునట్టి విధిచెప్పబడినది. ఇకశల్యాహరణ విధ్యధ్యాయమునందు శరీరముయొక్క ఏకదేశమునందుండు లోహాదిరూపమైన శల్యలక్షణము, వానిని వెలిపరచునట్టి ఉపాయము మొదలగునవి జెప్పబడును.

## శల్యాహరణ - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతశ్శల్యాహరణవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః ॥

తా॥ సిరావ్యధవిధ్యధ్యాయానంతరము శల్యములను వెలిపరచునట్టి క్రమమును తెలియపరచెడి శల్యాహరణ విధ్యధ్యాయమును వివరించెదను.

## శల్యములకు - పంచవిధ గతులు.

శ్లో॥ వక్రర్జుతిర్యగూర్ధ్వాధ శ్శల్యానాంపంచధాగతిః ।

తా॥ వక్రగతి, ఋజుగతి, తిర్యగ్గతి, ఊర్ధ్వగతి, అధోముఖగతిఅని శల్యములయొక్క గమనము, 5 విధములుగనుండును. శల్యములు ఒకానొకపుడు వక్రముగ ప్రవేశించి అడ్డముగగాని లేక ఊర్ధ్వముగగాని లేక అధోముఖముగగాని వ్యాపించును. ఒకానొకపుడు ఋజువుగ ప్రవేశించి అడ్డముగగాని లేక ఊర్ధ్వముగగాని లేక అధోముఖముగగాని వ్యాపించును. ఇటుల శల్యములకు 5 విధములైనగతులు గలిగియుండునని తెలియవలయును.

## అంతశ్శల్య - సామాన్య లక్షణము.

శ్లో॥ ధ్యామంశోఫంరుజానంతం స్రవంతంశోణితంముహుః ॥ 1.
అభ్యుద్గతంబుద్బుదవ త్పిటికోపచితంవ్రణమ్ ।
మృదుమాంసంవిజానీయా దంతశ్శల్యంసమాసతః ॥ 2.



తా॥ శ్యామవర్ణముగను, శోఫగలదిగను, పీడతోగూడినదిగను, పలుమారురక్తమును స్రవింపజేయునదిగను, ఒకింత ఉన్నతముగను, బుద్బుదతుల్యముగను, పిటికలచే వ్యాప్తముగను, మృదువైన మాంసముగలదిగనుండు వ్రణము అంతశ్శల్యముగలదియని సంక్షేపముగా దెలిసికొనవలయును.

## చర్మగత - శల్య లక్షణము.

శ్లో॥ విశేషాత్వగ్గతేశల్యే వివర్ణఃకఠినాయతః । శోఫోభవతి

తా॥ త్వక్కు నాశ్రయించియుండు శల్యములో శోఫ, వికారవర్ణము, కాఠిన్యము, దీర్ఘత్వము యీలక్షణములు విశేషముగా గలిగియుండును. మఱియునుపూర్వ శ్లోకములోజెప్పియుండు శ్యామవర్ణము మొదలగు సామాన్యలక్షణములన్నియు సర్వ శల్యములయందు గలిగియుండునని తెలియందగును.

## మాంసగత - శల్య లక్షణము.

శ్లో॥ మాంసస్థే చోషశ్శోఫోవివర్ధతే ॥ 3.
పీడనాక్షమతాపాక శ్శల్యమార్గోనరోహతి ।

తా॥ మాంసము నాశ్రయించియుండుశల్యములో చోష (అనగా సర్వాంగమునందువ్యాపరించియుండునదియును, అతిదారుణమయి మనస్సుకు అతిసంకటమును గలుగజేయునదియునైన తాపము) గలుగును. శోఫ వృద్ధిజెందును. పీడను సహించకుండుట, పాకము ఇవిగలుగును. శల్యముయొక్కమార్గము మానకుండును.

## పేశీగత - శల్య లక్షణము

శ్లో॥ పేశ్యంతరగతేమాంస ప్రాప్తవచ్ఛ్వయథుంవినా 4.

తా॥ శల్యము పేశీయొక్క మధ్యమునుజెందియుండెగా పైజెప్పిన మాంసగత శల్యోపద్రవములే గలుగును. అయితే వాపుమాత్రముగలుగదు. పేశీ అనగా దీర్ఘతంత్వాకృతిగల మాంసావయవ విశేషమని యర్థము.

## స్నాయుగత - శల్య లక్షణము.

శ్లో॥ ఆక్షేపస్నాయుజాలస్య సంరంభస్తంభవేదనాః ।
స్నాయుగేదుర్హారంచైతత్ ।

తా॥ శల్యము స్నాయువులనుజెందియుండునపుడు స్నాయుసమూహములు యీడ్చుకొనుట, క్షోభ, స్తబ్ధత్వము, శూల గలుగును. ఈస్నాయుగతమైన శల్యము బహుప్రయాసచే వెలిపడును.

### సిరాగత - శల్య లక్షణము.

శ్లో॥ సిరాధ్మానంసిరాశ్రితే॥ 5.

తా॥ శల్యము సిరనాశ్రయించియుండునపుడు సిరలకు ఆనాహముగలుగును. ఆనాహమనగా ఉబ్బుట.

### స్రోతోగత - శల్య లక్షణము.

శ్లో॥ స్వకర్మగుణహానిస్స్యాత్ స్రోతసాం స్రోతసిస్థితే।

తా॥ శల్యము స్రోతస్సులనుజెందియుండునపుడు ఆ స్రోతస్సులకు తమతమ కర్మ, గుణములయందు హానిగలుగును. అదియెట్లనగా:—శల్యము కంఠగతస్రోతస్సును జెందియుండునపుడు పానము, భక్షణము, వీనికి ప్రతిబంధకమును గలుగజేసును. మఱియు నాస్రోతస్సులకు నిర్గుష్టత్వము మొదలగుగుణములును కొరవడును. ఇటులనే యితరమైన స్రోతస్సులయొక్క కర్మహానిని గుణహానిని తెలుసుకొనవలయును.

### ధమనీగత - శల్య లక్షణము.

శ్లో॥ ధమనిస్థేఽనిలో రక్తం ఫేనయుక్తముదీరయేత్ ॥ 6.
నిర్యాతిశబ్దవాన్ స్యాచ్చ హృల్లాసస్సాంగవేదనః।

తా॥ శల్యము ధమనినాశ్రయించియుండునపుడు వాయువు నురుగుతోగూడియుండు రక్తమును బయలుపరచును. వాతము శబ్దసహితముగ బయలువెడలును. అంగపీడతోగూడిన హృల్లాసముగలుగును.

### అస్థిసంధిగత - శల్య లక్షణము.

శ్లో॥ సంఘుష్టోబలవానస్థి సంధిప్రాప్తేఽస్థిపూర్ణతా॥ 7.

తా॥ శల్యము అస్థిసంధులనాశ్రయించియుండునపుడు బలవత్తరమైన శోథ, అస్థిపూరణముగలుగును.

### అస్థిగత - శల్య లక్షణము.

శ్లో॥ నైకరూపారుజోఽస్థిస్థే శోఫః

తా॥ శల్యము అస్థినాశ్రయించియుండునపుడు భిన్న, రుగ్ణ, స్ఫుటిత, పీడిత ప్రాయమైన అనేకవిధములయినపీడలు, శోఫ గలుగును.

### సంధిగత - శల్య లక్షణము.

శ్లో॥ తద్వచ్చసంధిగే। చేష్టానివృత్తిశ్చభవేత్



తా॥ శల్యము సంధినిజెందియుండునపుడు అస్థినాశ్రయించియుండుశల్యమునకు జెప్పబడినఉపద్రవములును, వ్యాపారహానియును గలుగును. అస్థిసంధులనాశ్రయించియుండుశల్యమునకు లక్షణము పూర్వముచెప్పబడినది. ఇపుడుజెప్పినది రక్తశరీరసంధినాశ్రయించియుండు శల్యమునకు లక్షణమని తెలియవలయును. శరీరసంధియనగా అస్థిసంధులకంటె వేఱైనదియని యర్థము. అటులనే "శరీరసంధీనాదిశ్య" అని రాజయక్ష్మనిదానమునందు యీతంత్రకారుడు చెప్పబోవుచున్నాడు.

### కోష్ఠ - మర్మగత - శల్య లక్షణము.

శ్లో॥ ఆటోపఃకోష్ఠసంశ్రితే॥ 8.
ఆనాహోఽన్నశకృన్మూత్ర దర్శనంచ వ్రణాననే।
విద్యాన్మర్మగతంశల్యం మర్మవిద్ధోపలక్షణైః॥ 9.

తా॥ శల్యము కోష్ఠమునుజెందియుండునపుడు క్షోభము, కడుపుబ్బరము వ్రణముఖమునందు అన్న, మల, మూత్ర, దర్శనముగలుగును. మర్మగతమయిన శల్యమునందు మర్మవేధమునకు జెప్పియుండు లక్షణములే గలుగునని తెలిసికొనవలయును.

"దేహప్రసుప్తిర్గురుతా సంమోహశ్శీతకామతా। స్వేదోమూర్ఛావమిశ్శ్వాసో మర్మవిద్ధస్యలక్షణమ్॥"

శరీరము చచ్చుబారుట, గురుత్వము, మోహము, శీతపదార్థమునందిచ్ఛ, స్వేదము, మూర్ఛ, వాంతి, శ్వాసము, ఇని మర్మవేదవమునకు లక్షణము అని అష్టాంగసంగ్రహములో జెప్పబడియున్నది.

శ్లో॥ యథాస్వంచపరిస్రావైః * స్త్వగాదిషువిభావయేత్।

తా॥ శ్యామవర్ణము, శోఫ, ఇత్యాదిపూర్వోక్త సామాన్య లక్షణములచే మాత్రము శల్యములను తెలిసికొనుటకష్టము త్వక్కు మొదలగు స్థలములంజెందియుండు శల్యములకు జెప్పియుండు విశేషలక్షణములచేతను, ఆయాశల్యములయొక్క స్రావముచేతను, త్వగాదులయందుండు శల్యములం దెలిసికొనవలయును.

శ్లో॥ రుహ్యతేశుద్ధదేహానా మనులోమస్థితంతుతత్॥ 10.
దోషకోపాభిఘాతాది క్షోభాద్భూయోఽపిబాధతే।

తా॥ పైజెప్పిన శల్యము అనులోమముగనుండినయెడల వమనవిరేచనాదులచే శుద్ధమయిన దేహముగలవారికి ఆరినటులనేయుండును. మఱియు నాశల్యము బాగుగ

* స్తథారూపైర్విభావయేత్ ఇతిపా.

నారకుండుటవలన వాతాదిదోషప్రకోపము, అభిఘాతము యీ మొదలగు క్షోభలచే మరల బాధించును.

### చర్మనష్ట - శల్య జ్ఞానోపాయము.

శ్లో॥ త్వఙ్నష్టేయత్రతత్రస్యు రభ్యంగస్వేదమర్దనైః॥ 11.
రాగరుగ్దాహసంరంభా యత్రచాజ్యంవిలీయతే।
ఆశుశుష్యతిలేపోవా తత్ స్థానంశల్యవద్వదేత్ ॥ 12.

తా॥ ఏప్రదేశమునందు అభ్యంగ, స్వేద, మర్దనములచే ఎఱుపువర్ణము, శూల, తాపము, క్షోభగలుగునో, పేరిన నెయ్యి నునిచినతోడనే కరిగిపోవునో లేక చందనాదిలేపనముచేసిన అతిశీఘ్రములో యెండిపోవునో, అట్టి స్థానమునందు శల్యము చర్మమునందు నష్టమయియున్నదని తెలియవలయును.

### మాంసనష్ట - శల్య జ్ఞానోపాయము.

శ్లో॥ మాంసప్రనష్టంసంశుద్ధ్యా కర్శనాచ్ఛ్లథతాంగతమ్ ।
క్షోభాద్రాగాదిభిశ్శల్యం లక్షయేత్

తా॥ మాంసమునందు నష్టమయినశల్యము వమనవిరేచనశుద్ధులచే కృశత్వమును జెంది శైథిల్యమును జెందును. మఱియు నా మాంసనష్టశల్యమును ఆ క్షోభయుక్తమైన శూలలచేతను, చర్మమునం దెఱుపువర్ణము మొదలగువానిచేతను తెలిసికొనవలయును.

### పేశ్యాదినష్ట - శల్య జ్ఞానోపాయము.

శ్లో॥ తద్వదేవచ ॥ [పేశ్యస్థిసంధికోష్ఠేషు నష్టం] 13.

తా॥ పేశి, అస్థిసంధి, కోష్ఠము, వీనియందు నష్టమయినశల్యమును పైజెప్పిన మాంసనష్టశల్య లక్షణములచేతనే తెలిసికొనవలయును.

### అస్థినష్ట - శల్య జ్ఞానోపాయము.

శ్లో॥ అస్థ్నితులక్షయేత్ ।
అస్థ్నామభ్యంజనస్వేద బంధపీడనమర్దనైః॥ 14.
ప్రసారణాకుంచనతః సంధినష్టంతథాస్థివత్ ।

తా॥ అస్థులలో నష్టమైయుండుశల్యమును అస్థులయొక్క అభ్యంగన, స్వేదన, బంధన, పీడన, మర్దన, ప్రసారణ, ఆకుంచనములచే దెలిసికొనవలయును. సంధులలో



నష్టమయినశల్యమును అస్థులయందు నష్టమయిన శల్యమునకు చెప్పియుండు లక్షణములచే దెలిసికొనవలయును.

### స్నాయ్వాదినష్ట - శల్య జ్ఞానోపాయము.

శ్లో॥ నష్టేస్నాయుసిరాస్రోతో ధమనీష్వసమేపథి ॥ 15.
అశ్వయుక్తంరథంఖండ చక్రమారోప్యరోగిణమ్ ।
శీఘ్రన్నయేత్తత స్తస్య సంరంభాచ్ఛల్యమాదిశేత్ ॥ 16.
మర్మనష్టంపృథఙ్నోక్తం తేషాంమాంసాదిసంశ్రయాత్ ।

తా॥ శల్యము స్నాయువులు, సిరలు, స్రోతస్సులు, ధమనులు వీనియందు నష్టమైయుండగా మిట్టపల్లముగల మార్గములయందు విరిగిన చక్రములుగల అశ్వయుక్తమైన రథములో శల్యముగల రోగినెక్కించి అతిశీఘ్రముగ అశ్వమునుతోలవలయును. దానివలన రథమునందుండు రోగికి గలుగు క్షోభవలన శల్యస్థానమును తెలుసుకొనవలయును. మర్మములు మాంసాదుల నాశ్రయించియుండుటచేతను, మాంసమునకంటె మర్మములు వేరుగలేకుండుటచేతను, ఆ మర్మమునందు నష్టమయినశల్యమును ప్రత్యేకముగా నిచటజెప్పక విరమించబడెను.

### నష్టశల్య - స్థానసామాన్య లక్షణము.

శ్లో॥ సామాన్యేనసశల్యంతు క్షోభిణ్యాక్రియయాసరుక్ ॥ 17.

తా॥ క్షోభను గలుగజేయుతగిన క్రియలచేత (అనగా శ్వసనము, ప్రాణాయామము యీ మొదలగుక్రియలచేత) యేస్థానము ఉపద్రవముతో గూడియుండునో అట్టివానిని శల్యముతోగూడినస్థానమని సామాన్యముగా తెలిసికొనవలయును.

### అదృశ్య - శల్యాకారము.

శ్లో॥ వృత్తంపృథుచతుష్కోణం త్రిపుటంచసమాసతః ।
అదృష్టశల్యసంస్థానం వ్రణాకృత్యావిభావయేత్ ॥ 18.

తా॥ వర్తులము, స్థౌల్యము, చతుష్కోణము, త్రికోణము, ఇవి సంక్షేపముగా అదృశ్యముగనుండు శల్యములకు ఆకారములు. ఆ వ్రణాకారమువలన శల్యమును తెలిసికొనవలయును.

### అదృశ్య - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ తేషామాహరణోపాయా ప్రతిలోమానులోమకౌ ।

తా॥ దృశ్యముకాకుండుశల్యములయొక్క ఆకర్షణోపాయము, ప్రతిలోమను అనులోమము అనిద్వివిధంబు. ప్రతిలోమమనగా:—శరీరాంతః ప్రవేశము లేకుండుట అనులోమమనగా:—శరీరాంతః ప్రవేశముతోఁగూడియుండుట అని యర్థము.

శ్లో॥ అర్వాచీనపరాచీనే నిర్హరేత్తద్విపర్యయాత్ ॥ 19.

తా॥ మఱియు నాప్రతిలోమ, అనులోమోపాయములయొక్క విపర్యయము వలన అర్వాచీనము, పరాచీనములగుశల్యముల నాకర్షణము చేయవలయును. ఎట్లనగా: ప్రతిలోమములో అర్వాచీనము నాకర్షణము చేయవలయును. అనులోమములో పరాచీనము నాకర్షణము చేయవలయును.

## తిర్యగ్గత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ సుఖాహార్యంయతశ్ఛిత్వా తతస్తిర్యగ్గతంహరేత్ ।

తా॥ తిర్యగ్గతమయిన శల్యమును శరీరములో నేప్రదేశమునందలి మాంసాదులనుఛేదించి సుఖముగ నాకర్షించతగునో అట్టి ప్రదేశమునందు ఛేదించి ఆశల్యము నాకర్షణము చేయవలయును.

శ్లో॥ శల్యంనవిర్ఘాత్యమురః కక్షావంక్షణపార్శ్వగమ్ ॥ 20.

ప్రతిలోమమనుత్తుండం ఛేద్యంపృథుముఖంచయత్ ।

తా॥ ఱొమ్ము, చంకలు, గజ్జలు, ప్రక్కలు, వీనినాశ్రయించియుండుశల్యము, ప్రతిలోమముగనుండు శల్యము, వెలపట బుద్బుదమువలె ఉన్నతముగనుండనుండు శల్యము, విస్తీర్ణమయినముఖముగల శల్యము, ఇవి నిర్ఘాత్యములుకావు అనగా ఛేదించతగినవికావు అని యర్థము.

## శల్య - విశేషాకర్షణ నిషేధము.

శ్లో॥ నైవాహరేద్విశల్యఘ్నం నష్టంవానిరుపద్రవమ్ ॥ 21.

తా॥ విశల్యఘ్నశల్యమును (అనగా ఆకర్షణముచేయగానే మనుజునిచంపునట్టి శల్యమును) ఆకర్షణము చేయుంజనదు. నష్టమై (అనగా దృశ్యముకాకుండా) ఉపద్రవమును గలుగజేయకుండు శల్యము నాకర్షణము జేయుంజనదు.

## హస్తముచే - శల్యాకర్షణము.

శ్లో॥ అథాహరేత్కరప్రాప్యం కరేణైవ

తా॥ చేతికి చిక్కునట్టిశల్యమును హస్తముచేతనే ఆకర్షణము చేయవలయునే కాని కంకముఖాద్యాయుధములవలన నాకర్షణము చేయుంజనదు.



## దృశ్యశల్యాకర్షణోపాయము.

శ్లో॥ తరత్సునః ।

దృశ్యంసింహాహిమకర వర్మికర్కటకాననైః ॥ 22.

తా॥ హస్తమునకుదొరకనట్టియు, కంటికగుబడునదియునగుశల్యమును సింహము, సర్పము, మొసలి, వర్మియనుమత్స్యము, ఎండ్రపీత వీనిముఖమువంటి ముఖములుగల యంత్రములచే నాకర్షణము చేయవలయును.

## అదృశ్య - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ అదృశ్యంవ్రణసంస్థానాత్ గృహీతుంశక్యతేయతః ।

కంకభృంగాహ్వకురర శరారీవాయసాననైః ॥ 23.

తా॥ కంటికగుపడని శల్యమును వ్రణముయొక్క యాకారమువలన బాగుగా నిశ్చయించుకొని ఆశల్యమును రాబులుగు, భృంగాహ్వము, కురరపక్షి, ఆడేలు, కాకి వీనిముఖమువంటిముఖముగల యంత్రములచే నాకర్షణము చేయవలయును.

## త్వగాది - గతశల్యాకర్షణోపాయము.

శ్లో॥ సందంశాభ్యాంత్వగాదిస్థం

తా॥ త్వక్కు, సిరలు, స్నాయువులు, మాంసము యీ మొదలగువానియందుండుశల్యమును సందంశమను నాయుధముచే (అనగా క్రమ్మరవాని పటకారలచే) నాకర్షణము చేయవలయును.

శ్లో॥ తాలాభ్యాంసుషిరంహరేత్ ।

తా॥ త్వక్కు మొదలగువానియందుండు సుషిరశల్యమును తాలయంత్రములచే నాకర్షణము చేయవలయును.

## రంధ్రగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ సుషిరస్థంతునళకైః

తా॥ సుషిరమునందుండు (అనగా రంధ్రమునందుండు) శల్యమును నాడీ యంత్రములచే నాకర్షణము చేయవలయును.

## అనుక్త - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ శేషంశ్శేషైర్యథాయథమ్ ॥ 24.

శస్త్రేణవావిశస్యాదౌ తతోనిర్లోహితం వ్రణమ్ ।
కృత్వాఘృతేనసంస్వేద్య బద్ధ్వాచారికమాదిశేత్ ॥ 25.

తా॥ ఇతరమయినశల్యములను తక్కిన యితరయంత్రములచే అనుకూలానుగుణముగా నాకర్షణముచేయవలయును. లేక శస్త్రముచే ముందుగా మాంసాదులనుఛేదించి పిదప వ్రణమునందలిరక్తమునుపోకడచి ఘృతముచే స్వేదకర్మనుచేయించి వస్త్రపట్టము మొదలగువానిచే ఘృతమధువులనుకట్టి స్నేహవిధియందు చెప్పబడిన "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విధుల ననుసరింపజేయవలయును.

సిరాగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ సిరాస్నాయువిలగ్నంతు చాలయిత్వాశలాకయా ।

తా॥ సిరలు, స్నాయువులు వీనియందుండుశల్యమును శలాకుచే కదిలించి ఆకర్షణము చేయవలయును.

హృదయగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ హృదయేసంస్థితంశల్యం త్రాసితస్యహిమాంబునా ॥ 26.
తతఃస్థానాంతరంప్రాప్త మాహరేత్తద్యథాయథమ్ ।

తా॥ హృదయము నాశ్రయించియుండుశల్యము శీతజలముచే భయపరచబడిన పురుషునికి స్థానాంతరమునుజెందును. కావున నట్టి స్థానమును తెలిసికొని దానిని తగుమైనయంత్రములచే నాకర్షణముచేయవలయును.

స్థానాంతరగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ యథామార్గందురాకర్ష మన్యతోప్యేనమాహరేత్ ॥ 27.

తా॥ ఇతరప్రదేశమును జెందియుండుశల్యము అధికప్రయాసచే నాకర్షణము చేయతగినదిగనుండినయెడల దానినికూడా స్వమార్గమునను తీసుకొనివచ్చి పైజెప్పిన ప్రకారమే ఆకర్షణముచేయవలయును. అదియెట్లనగా :— హృదయము నాశ్రయించియుండుశల్యము స్థానాంతరమును జెందినపిదప నెటుల నాకర్షించబడునో అట్లేయింగు ననే వేరుప్రదేశమునంగుండు శల్యమునుకూడా తగుమైన యుపాయముచే సరియైన మార్గమునకు తీసుకొనిరావలయును.

అస్థిగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ అస్థివిదష్టైసరంపద్భ్యాం పీడయిత్వావినిర్హరేత్ ।
ఇత్యశక్యేసుబలిభి సుగృహీతస్యకంపితః ॥ 28.



తథాప్యశక్యేవారంగం వక్రీకృత్యధనుర్జ్యయా ।
సుబద్ధంవక్రకటకే బద్ధ్వాయాత్సుసమాహితః ॥ 29.
సుసంయతస్యపంచాంగ్యా వాజినఃకశయాథతమ్ ।
తాడయేదితిమూర్ధానం వేగేనోన్నమయన్యథా ॥ 30.
ఉద్ధరేచ్ఛల్యమేవంవా శాఖాయాంకల్పయేత్తరోః ।
బద్ధ్వాదుర్బలవారంగం కుశాభిశ్శల్యమాహరేత్ ॥ 31.
శ్వయథుగ్రస్తవారంగం శోఫముత్పీడ్యయుక్తితః ।

తా॥ శల్యము అస్థిలోజేరియుండునపుడు బలిష్ఠుడుగనుండు పురుషునికాళ్ళచే నదుముకొని దాని నాకర్షణముచేయవలయును. ఇట్టి యుపాయముచేతకూడా నాశల్యము నాకర్షణముచేయుట కశక్యముగనుండినయెడల వైద్యుడు వానిని బలిష్ఠులగు పరిచారకులచేదృఢముగ పట్టుకొనునటులజేసి కంకముఖాద్యాయుధములచే నాకర్షణము చేయవలయును. ఇట్టియుపాయముచేతకూడా శల్యము నాకర్షించుట కశక్యముగనుండినయెడల వారంగమును (అనగా శస్త్రాదిస్వరూపముగల శల్యముయొక్క కొసను) వంచి దానిని స్నాయువులు మొదలగువానిచే నిర్మించబడిన విల్లుత్రాడుచే బాగుగ కట్టి పిదప పంచాంగియను బంధనముచే బాగుగా కట్టబడియుండు గుఱ్ఱముయొక్క వక్రకటకములో (అనగా నోటికళ్ళెములో) వైద్యుడు జాగరూకుడై యా విల్లుత్రాడునుకట్టి పిదప నాగుఱ్ఱము తలను పొడవుగనెత్తుకొని బలముచే శల్యము నెటుల నాకర్షణముజేసునో అట్లేయింగున దానిని జాటిచేకొట్టవలయును. పంచాంగియనగా :- 4-గు కాళ్ళను మూతినిజేర్చి కట్టునట్టికట్టు లేక పైజెప్పినప్రకారము వారంగమును వంకరగజేసి దానిని విల్లుత్రాడుచేకట్టి మిగుల జాగరూకతగలవైద్యుడు గొప్పవృక్షముయొక్క శాఖను పరిచారకులచే వంచునటులజేసి అది పరిచారకులచే విడువబడగానే పొడవుగలేచి యెటుల నాశల్యమును శీఘ్రముగ నాకర్షణముచేసునో అట్లేయింగున శల్యాకర్షణార్థము ఆ శాఖలో విల్లుత్రాడును కట్టవలయును. వారంగము దుర్బలముగనుండినయెడల దానిని కుశాదులచే (అనగా వెదురుమొదలగువాని కంబులచే) గట్టి ఆశల్యము నాకర్షణముచేయవలయును. వారంగము శోఫచే మూయబడియుండినయెడల యుక్తిచే పైభాగమునందుండుశోఫను బోకడచి శల్యము నాకర్షణము చేయవలయును.

ఉత్తుండిత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ ముద్గరాహత్యయాడ్యాని ఘాతోత్తుండితంహరేత్ ॥ 32.

తైరేవచానయేన్మార్గ మమార్గోత్తుండితంతుయత్ ।

తా॥ ఉత్తుండితమయిన (అనగా బుద్బుదమువలె వెలపట నభిముఖముగవచ్చియుండు) శల్యమును ముద్గరముచే (అనగా కమ్మరవాని సమ్మెటచే) కొట్టబడిననాడీయంత్రముచే గదిలించి (అనగా శల్యపార్శ్వములయందు నాడీయంత్రము నునిచి ముద్గరముచే కొట్టికదిలించి) ఆకర్షణము చేయవలయును. ముద్గరమని జెప్పినది పాషాణాదులకు ఉపలక్షణము. కావున పాషాణాదులచేతను కొట్టికదిలించి ఉత్తుండితమగు శల్యము నాకర్షించందగును. అమార్గముగా ఉత్తుండితమగు శల్యమును ముద్గరాదులచేతనే సరియైనమార్గమునకు తీసుకొనివచ్చి ఆకర్షణము చేయవలయును.

భల్లాదిశల్యాకర్షణోపాయము.

శ్లో॥ మృదిత్వాకర్ణినాంకర్ణం నాడ్యాస్యేననిగృహ్యావా ॥ 33.

తా॥ భల్లము (అనగా బాణము) మొదలగువానియొక్క కర్ణములను విరిచి దాని నాకర్షించవలయును. లేక నాడీముఖమును వాయూధముచే పట్టుకొనిగాని నాకర్షించవలయును.

కర్ణరహిత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ అయస్కాంతేననిష్కర్ణం వివృలాస్యమృజుస్థితమ్ ।

తా॥ కర్ణములేనిదియును, ప్రకాశమయినముఖముగలదియును, ఋజువుగనుండునదియునగు శల్యమును అయస్కాంతముచే నాకర్షించవలయును.

పక్వాశయ - గతశల్యాకర్షణోపాయము.

శ్లో॥ పక్వాశయగతంశల్యం విరేకేణవినిర్హరేత్ ॥ 34.

తా॥ పక్వాశయమును జెందియుండినట్టి శల్యమును విరేచనములచే వెలిపరచవలయును.

శ్లో॥ దుష్టవాతవిషస్తన్య రక్తతోయాదచూషణైః ।

తా॥ దుష్టమయినవాతము, విషము, స్తన్యము, రక్తము, ఉదకము యీ మొదలగువానిని చూషణములచే బయలుపరచవలయును. 'చూషణైః' అను బహువచన ప్రయోగముచే శృంగము మొదలగువానిచేతను వెలిపుచ్చందగునని యూహింపదగియున్నది.

కంఠస్రోతోగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ కంఠస్రోతోగతేశల్యే సూత్రంకంఠే ప్రవేశయేత్ ॥ 35.



బిసేనాత్తేతతశ్శల్యే బిసంసూత్రంసమంహరేత్ ।

తా॥ శల్యము కంఠగతస్రోతస్సులను జెందియుండగా కార్పాసతంతువులను తామరతూండ్లతో జేర్చి కంఠమునందు ప్రవేశింపజేయవలయును. పిదప నా శల్యము తామరతూండ్లలో నంటుకొనును. అటులనంటుకొనినశల్యమును, తామరతూండ్లసూత్రమును యేకకాలమునందు వెలిపరచవలయును.

కంఠగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ నాడ్యాగ్నితాపితాంక్షిప్త్వా శలాకామప్సునిరీకృతామ్ ॥ 36.
ఆనయేజ్జాతుషంకంఠాత్

తా॥ లత్తుకసంబంధముగలశల్యము కంఠస్రోతస్సులయందు ప్రవేశించియుండగా కంఠమునందు నాడీయంత్రమును ప్రవేశింపజేసి దానియందుండు ద్వారమూలముగా అగ్నిచే తప్తమయిన శలాకను ప్రవేశింపజేసి లత్తుకసంబంధముగలశల్యముకరిగి శలాకులో నంటుకొనగానే శలాకు నుదకముచేజల్లార్చి శల్యము నాకర్షించవలయును.

శ్లో॥ జతుదిగ్ధామజాతుషమ్ ।

తా॥ లత్తుకసంబంధములేని మ్రాను, వెదురు యీ మొదలగుశల్యములు కంఠస్రోతస్సుల నాశ్రయించియుండునపుడు లక్కపూయబడియుండు శలాకను అగ్నిచే తపింపజేసి పూర్వమువలె నాడీయంత్రద్వార మూలముగా కంఠములో ప్రవేశింపజేసి శల్యము నాకర్షించవలయును.

శ్లో॥ కేశోందుకేనపీతేన ద్రవైఃకంటకమాక్షిపేత్ ॥ 37.
సహసాసూత్రబద్ధేనవమతః

తా॥ మత్స్యాదులయొక్క కంటకము మాంసముతోడ భుజించబడి కంఠస్రోతస్సును జెందియుండగా కేశసమూహమును నిడుపుగ సన్నముగనుండు నూలుతో కట్టి దానిని వమనద్రవ్యములతో సిద్ధముచేయబడిన ఉదకము మొదలగువానితోడ పానముచేసి వమనముచేయునపుడు శల్యమును పైనూత్రముచే నతిశీఘ్రముగా నాకర్షించవలయును.

శ్లో॥ తేనచేతరత్ ।

తా॥ కేశసమూహము అజ్ఞానముచే అన్నసహితముగ భుజించబడి కంఠస్రోతస్సును జెందియుండగా నిడుపుగ దృఢముగ సన్నముగనుండు సూత్రములో కంటకమునుకట్టి వమనకరద్రవ్యములచే సిద్ధముచేయబడిన ఉదకములోవేసి పానముచేయించి

వమనము చేయునపుడు శీఘ్రముగ దాని నాకర్షించవలయును. అటుల జేయుటచే కంఠమునందు గాయముగలిగినయెడల తేనె, ఘృతము, శర్కర వీనితో కీరియుండు త్రిఫలములను కంఠముపై బూయవలయును.

"అస్థిశల్యమన్యద్వాతిర్యక్‌స్థితమపేక్ష్య కేశోండుకం దృఢదీర్ఘసూత్రబద్ధం ద్రవభక్తోపహితం పాయయేద్వామయేచ్చ । వమతశ్చ కంఠశల్యైకదేశసక్తం సూత్రం సహసాత్వాక్షిపేన్మృదునా వా దంతధావనకూర్చకేనాహరేత్ప్రణుదేద్వా ॥"

అస్థిని జెందియుండునట్టి శల్యమునుగాని, అడ్డముగ వ్యాపించియుండు శల్యమునుగాని ఆకర్షించుటకై దృఢముగ, దీర్ఘముగనుండు సూత్రములో కట్టబడిన కేశసమూహమును ద్రవమయిన ఆహారముతోడ జేర్చి పానము చేయించి తోడనే దానిని వమనము చేయించవలయును. వమనము చేయునపుడు కంఠగతములయిన శల్యములో తగులుకొనియుండు యా సూత్రమును శీఘ్రముగా నీడ్వవలయును. లేక మృదువుగనుండు దంతధావన కూర్చముచేగాని ఆ శల్యము నాకర్షించవలయును. అని సుశ్రుతమునందు చెప్పబడియున్నది.

## ముఖనాసికాగత - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ అశక్యం ముఖనాసాభ్యామాహర్తుం పరతోనుదేత్ ॥ 38.

తా॥ ముఖము, నాసికము, వీనిని జెందియుండు శల్యమును ముఖనాసికములచే నాకర్షించుటకు సాధ్యముకానియెడల యితరమార్గముచే బయలుపరచవలయును. ఇటుల జెప్పుటచే నాశల్యము నేదోయొకయుపాయమువలన కోష్ఠమును జెందునటుల చేయవలయునని భావంబగుచున్నది.

## కబళ - శల్యాంతః - ప్రవేశోపాయము.

శ్లో॥ అప్పానస్కంధఘాతాభ్యాం గ్రాసశల్యం ప్రవేశయేత్ ।

తా॥ గ్రాసశల్యమును ఉదకపానము, స్కంధాఘాతము (అనగా ముష్ట్యాదులచే భుజశిరస్సులయందు కొట్టుట) వీనిచే కోష్ఠమధ్యమును జెందునటుల జేయవలయును.

## నేత్రము - వ్రణము - వీనియందలి - శల్యా - కర్షణోపాయము.

శ్లో॥ సూక్ష్మాణ్యక్షివ్రణశల్యాని క్షౌమవాలజలైర్హరేత్ ॥ 39.

తా॥ నేత్రములు, వ్రణములు వీనియందుండు సూక్ష్మములయిన శల్యములను క్షౌమము (అనగా తెలిపట్టువస్త్రము) వాలము, ఉదకము, వీనిలో దేనిచేనైనా బయలు



పరచవలయును. (అనగా ఆయాశల్యములకు తగినటుల నొకకాలమునందు క్షౌమముచేతను, మఱియొకపుడు వాలముచేతను, వేఱొకపుడు ఉదకముచేతను బయలుపరచవలయునని భావము.)

## ఉదక - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ అపాంపూర్ణంవిధుచుయాదవాక్ఛిరసమాయతమ్ ।
వామయేద్వాముఖంభస్మరాశౌవానిఖనేన్నరమ్ ॥ 40.

తా॥ తటాకాదులయందకస్మాత్తుగబడుటచే నుదకమువలన పూరితముగనుండు ఉదరముగల మనుజునిని తలక్రిందుగ త్రిప్పి దీర్ఘముగజేసి విదిలించి పిదప వైద్యుడు వమనము చేయించవలయును. లేక ముఖమువరకు (అనగా నోటివరకు) భస్మరాశి (అనగా బూడిదెసమూహము) లోనైనా పూడ్చవలయును.

"ఉదకపూర్ణస్యచక్రాద్యారోపణేన ఉదకనిస్సారఃకార్యః ॥"

ఉదకపూరితమయిన ఉదరముగలమనుజునిని చక్రాదులయం దారోపణము చేయించుట వలన ఉదకమును వెలిపరచవలయును. అని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది.

## కర్ణ - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ కర్ణేంబుపూర్ణే హస్తేన మథిత్వా తైలవారిణీ ।
క్షిపేదధోముఖంకర్ణం హన్యాద్వాచూషయేతవా ॥ 41.

తా॥ కర్ణములు ఉదకముచే పూరితంబులగునపుడు తైలము, ఉదకము అను నీ 2-టిని మిశ్రముజేసి హస్తములచేమథించి కర్ణములలో వేయవలయును. లేక కర్ణము నధోముఖముగనైనా కొట్టవలయును. లేక శృంగాదులచే చూషణమునైనా చేయవలయును.

## కర్ణగత - కీటాద్యాకర్షణోపాయము.

శ్లో॥ కీటే స్రోతోగతే కర్ణం పూరయేల్లవణాంబునా ।
శుక్తేనవాసుఖోష్ణేన మృతే క్లేదహరోవిధిః ॥ 42.

తా॥ చీమలు, నల్లజెఱ్ఱి యీమొదలగు పుఱుగులు చెవులయందు ప్రవేశించియుండగా లవణమిశ్రితముగనుండు ఉదకముచేగాని, సుఖోష్ణమయినశుక్తముచేగాని కర్ణమును పూరణము చేయవలయును. మఱియు నా పుఱుగులు మరణమును జెందిన పిదప క్లేదహరమయిన విధిని చేయవలయును.

జాతుషాది - శల్య విలయము.

శ్లో॥ జాతుషంహేమరూప్యాది ధాతుజంచచిరస్థితమ్ ।
ఊష్మణాప్రాయశశ్శల్యం దేహజేనవిలీయతే ॥ 43.

తా॥ లక్కతోకసంబంధముగలవియును, స్వర్ణము, రజతము యీమొదలగు ధాతువులచేజేయబడినవియునైన శల్యములు శరీరమునందు చిరకాలమువరకునుండినయెడల దేహజనితమయినఉష్ణముచే తఱుచుగా కరిగిపోవును.

మృదాది - శల్య - విలయాభావము.

శ్లో॥ మృద్వేణుదారుశృంగాస్థి దంతబాలోపలానిచ ।
శల్యానినవిశీర్యంతే శరీరేమృణ్మయానివా ॥ 44.

తా॥ మృత్తు, వెదురు, మ్రాను, శృంగము, అస్థి, దంతము, బొచ్చు వీని సంబంధముగలశల్యములు దేహసంబంధమయిన ఉష్ణముచే కరగనేరవు.

విషాణాది - శల్య భంగము.

శ్లో॥ విషాణవేణ్వయస్తాల దారుశల్యంచిరాదపి ।
ప్రాయోనిర్భుజ్యతేతద్ధి పచత్యాశుపలాసృజీ ॥ 45.

తా॥ శృంగము, వెదురు, ఇనుము, తాటి, మ్రాను, వీనిసంబంధముగల శల్యములు చిరకాలముమీద తఱుచుగా విరిగిపోవును. ఎలవనగా: — ఆ శల్యమున్న ప్రదేశములోనే మాంసము, రక్తము వీనిని పాకముజేయును.

మాంసప్రవిష్టి - శల్యాకర్షణోపాయము.

శ్లో॥ శల్యేమాంసావగాఢేచ నదేశోనవిదహ్యతే।
తతస్తంమర్దనస్వేద శుద్ధికర్షణబృంహణైః ॥ 46.
తీక్ష్ణోపనాహపానాన్న ఘనశస్త్రపదాఙ్కనైః ।
పాచయిత్వాహరేచ్ఛల్యం పాటనైషణభేదనైః ॥ 47.

తా॥ శల్యము మాంసములో దాగియుండునపుడు ఆ శల్యమున్న ప్రదేశము పాకము జెందకుండినచో ఏప్రదేశమునందు శల్యముండునో ఆప్రదేశమును మర్దనము చేతను, ఒకానొకపుడు స్వేదనముచేతను, ఒకానొకపుడు వమనాదిశుద్ధిచేతను, ఒకానొకపుడు కర్షణముచేతను, ఒకానొకపుడు బృంహణముచేతను, ఒకానొకపుడు తీక్ష్ణమయిన ఉపనాహస్వేదముచేతను, ఒకానొకపుడు తీక్ష్ణమయిన అన్నపానములచేతను, ఒకానొకపుడు శస్త్రముచేతను యథాక్రమముగా పాకముచేయించి పాటనము వ్రణభేదనము వీనిచే శల్యమును బయలుపరచవలయును.



శ్లో॥ శల్యప్రదేశయంత్రాణా మవేక్ష్యబహురూపతామ్ ॥
తైస్తైరుపాయైర్మతిమాన్ శల్యంవిద్యాత్తథాహరేత్ ॥ 48.

తా॥ ధాతువులు, శృంగము, వెదురు, యీ మొదలగు ననేకవిధ శల్యభేదములను, త్వక్కు-మాంసము మొదలగు ననేకవిధప్రదేశభేదములను, స్వస్తికము మొదలగు ననేకవిధయంత్రభేదములను బుద్ధిమంతుడగువైద్యుడు బాగుగ దెలిసికొని యిదివరకు జెప్పబడినవియును, జెప్పబడనవియునైన ఉపాయములచే శల్యముల నాకర్షించవలయును.

“ వ్రణేప్రసన్నేప్రాంతేషు నాతిస్పర్శాసహిష్ణుతా। అల్పేశోఫేచతాపేచ నిశ్శల్యమితినిర్దిశేత్ ॥”
వ్రణము ప్రసన్నముగనుండుట, సమీపప్రదేశమునందు స్పర్శను సహించకుండుట. స్వల్పమయినవాపు, స్వల్పమయినతాపముగలిగియుండుట, ఇట్టిలక్షణములచే శల్యము లేదని తెలిసికొనవలయును.

అష్టవింశాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు

# ఏకోనత్రింశాధ్యాయము.

పూర్వాధ్యాయమునందు “శస్త్రేణవావిశస్యాద్వా” అనగా తొలుత శస్త్రముచే మాంసాదులను ఛేదించి అని చెప్పియుండుటవలన నీయధ్యాయమునందు శస్త్రకర్మవిధి చెప్పబడుచున్నది.

## శస్త్రకర్మ - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతశ్శస్త్రకర్మవిధిమధ్యాయం వ్యాఖ్యాస్యామః ।
ఇతిహస్మాహురాత్రేయాదయోమహర్షయః ॥

తా॥ శల్యాహరణవిధ్యధ్యాయానంతరము శస్త్రకర్మజేయవలసిన క్రమమును తెలియజేసెడు శస్త్రకర్మ విధ్యధ్యాయమును వివరించెదము.

## శోఫ - చికిత్సా క్రమము.

శ్లో॥ వ్రణాస్సంజాయతే ప్రాయః పాకాచ్ఛ్వయథుపూర్వకాత్ ।
తమేవోపచరేత్తస్మా ద్రక్షన్పాకంప్రయత్నతః ॥ 1.
సుశీతలేపసేకాస్ర మోక్షసంశోధనాదిభిః ।

తా॥ తొలుత వాపుతోగూడియుండునట్టి పాకముచే తఱుచుగా వ్రణములగును. కావున ఆ పాకమును ప్రయత్నపూర్వకముగా స్పర్శముచేతను, వీర్యముచేతను, శీతలముగనుండు లేప సేకములచేతను, రక్తమోక్షణముచేతను, వమనవిరేచనాది శుద్ధుల చేతను, కషాయపాన, ఘృతపానాదులచేతను, రక్షించుచు ఆ వాపును చికిత్సించవలయును. మఱియును వాపు, పాకములేకనే శస్త్రాదివ్యాధిసూతముచే వ్రణములగును. కావున తఱుచుగా అను నర్థమును తెలియజేసెడు ‘ప్రాయః’ అను పదము యిచట ప్రయోగించబడినది.

## ఆమశోఫ లక్షణము.

శ్లో॥ శోఫోల్పోల్పోష్ణసంశ్చ సమస్సవర్ణఃకఠినస్థిరః ॥ 2.



తా॥ ఆమమైన శోఫ స్వల్పముగ, స్వల్పమైన ఉష్ణము, శూల వీనితోగూడినదిగ, చర్మముతో సమానమైన వర్ణముగలదిగ, పక్వమైనశోఫవలె మృదువుగనుండక కఠినముగ స్థిరముగనుండును.

## పచ్యమాన - శోఫ లక్షణము.

శ్లో॥ పచ్యమానోవివర్ణస్తు రాగీవ స్తిరివాతతః ।
స్ఫుటతీవసనిస్తోద స్సాంగమర్ద విజృంభికః ॥ 3.
సంరంభారుచిదాహోషా తృట్జ్వరానిద్రతాన్వితః ।
స్త్యానంవిష్యందయత్యాజ్యం వ్రణవత్స్పర్శనాసహః ॥ 4.

తా॥ పచ్యమానమను శోఫ వివర్ణముగ, ఎఱుపువర్ణముగలదిగ, వాతముచే పూరితముగనుండు తిత్తివలె స్తబ్ధముగ, బద్దలగునటుల నెల్లపుడు పీడాయుక్తముగ, అవయవములయొక్క క్షోభ, ఆవలింత వీనితోగూడినదిగ, సంరంభము (అనగా వాక్కుచే జెప్పనశక్యంబును, తనచేమాత్రము తెలియతగినదియును, అనేక రూపములతోగూడినదియును, అంగములయందు ఉపద్రవము, విఘట్టనము, ఛేదనము, దంశనము యీ మొదలగు ఉపద్రవములు) అరుచి, సర్వాంగమునందు వ్యాపించితీవ్రముగనుండునట్టి తాపము, మనస్సునకు దేనియందును ప్రవృత్తిలేకుండునట్టి ఘోరమైనతాపము, దప్పి, జ్వరము, నిదురపట్టకుండుట, వీనితోగూడినదిగనుండును. ఆపచ్యమానమనుశోఫపై పేరిన ఘృతము నునిచిన కరుగునటులజేసును. వ్రణమువలె స్పర్శమును సహించనేరదు.

## పక్వశోఫ లక్షణము.

శ్లో॥ పక్వేఽల్ప * వేగతామ్లానిః పాండుతావలిసంభవః ।
నామోంతేషూన్నతిర్మధ్యే కండూశోఫాతిమార్దవమ్ ॥ 5.
స్పృష్టేపూయస్యసంచారో భవేద్వస్తావివాంభసః ।

తా॥ శోఫ పక్వమైయుండగా స్వల్పవేగము, వాడియుండుట, పాండురవర్ణము, వళులు, అంచులయందుపల్లము, మధ్యమునందున్నతము, దురద, శోఫతగ్గియుండుట యీ లక్షణములుగలుగును. ఆ శోఫలో స్పర్శించునపుడు వస్తియందు ఉదక సంచారమువలెనే పూయసంచారము కలుగును.

## శోఫపాక నిదానము.

శ్లో॥ శూలంనర్తేనిలాద్దాహః పిత్తాచ్ఛోఫఃకఫోదయాత్ ॥ 6.
రాగోరక్తాచ్చపాకస్స్యా దతోదోషైస్సశోణితైః ।

---

* వేదనా ఇతిపా.

వాతములేకనే శూలగలుగనేరదు. పిత్తములేకనే తాపము (అనగా మంట) గలుగనేరదు. కఫములేకనే శోఫగలుగనేరదు. రక్తములేకనే యెఱుపువర్ణముగలుగ నేరదు. కాబట్టి రక్తముతోగూడియుండునట్టి వాతాది సర్వదోషములచేతనే శోఫ పాకమునుజెందును.

పాకాధిక్య - శోఫ లక్షణము.

శ్లో॥ పాకేతివృత్తేసుషిర స్తనుత్వగ్దోషభక్షితః ॥ 7.
వలీభిరాచితశ్శ్యావ శ్శీర్యమాణతనూరుహః ।

తా॥ పాకము అతిక్రాంతమైయుండగా శోఫయొక్క ప్రదేశము డొల్లముగ, మృదువైన చర్మముగలదిగ, చీముచే భక్షించబడినదిగ, వళులచే వ్యాప్తముగ, శ్యామ వర్ణముగలదిగ, రోమములు రాలిపోయినదిగ నుండును.

రక్తపాక లక్షణము.

శ్లో॥ కఫజేషుతుశోఫేషు గంభీరంపాకమేత్యసృక్ ॥ 8.
పక్వలింగంతతోఽస్పష్టం యత్రస్యాచ్ఛీతశోఫతా ।
త్వక్సావర్ణ్యంరుజోఽల్పత్వం ఘనస్పర్శత్వమశ్మవత్ ॥ 9.
రక్తపాకమితిబ్రూయా త్తంప్రాజ్ఞోముక్తసంశయః ।

తా॥ కఫాధిక్యముచేగలిగిన శోఫలయందు రక్తము గంభీరమైన పాకమును జెందును. అదిమిక్కుటముగ లోనమరిగియుండుటవలన నేత్రములకగపడదు. కాబట్టి పక్వలక్షణము స్పష్టముగదెలియనేరదు. ఆ పాకములో శీతగుణసంబంధముచే శీతల మైన శోఫయును, చర్మముతో సమానమైనవర్ణమును, స్వల్పమైనపీడయును, వేళ్లు మొదలగువానిచే తాకినరాయివలె కఠినమైన స్పర్శయునుగలిగియుండును. అట్టి శోఫయొక్కపాకమును బుద్ధిమంతుడగు వైద్యుడు సంశయరహితుడై రక్తపాకమని చెప్పుటయేకాకుండా దానియందు శోఫలేదనియు జెప్పవలయును.

శ్వయథుపాక దారణము.

శ్లో॥ అల్పసత్వేఽబలే బాలేచాత్యర్థముద్ధతే ॥ 20.
దారణంమర్మసంధ్యాది స్థితేచాస్యత్రపాటనమ్।

తా॥ స్వల్పబలముగలవాడు, బలములేనివాడు, బాలుడు, వీరికిజనించియుండు శోఫయందును, పాకముచే మిక్కిలి అతిక్రాంతమైన శోఫయందును.—



“గుగ్గుల్వతసిగోదంత స్వర్ణక్షీరీకపోతవిట్। క్షారౌషధానిక్షారాశ్చ పక్వ శోఫవిదారణమ్ ॥”

అని వ్రణప్రతిషేధాధ్యాయములోజెప్పబడు గుగ్గులు, అగసి, గోదంతము, స్వర్ణక్షీరి, పావురపిట్టమలము, క్షారౌషధము, క్షారములు యీమొదలగు దారణద్రవ్యములచే దారణముచేయవలయును. మర్మము, సంధులు యీమొదలగువానియందుండు శోఫ యందును దారణద్రవ్యములచే దారణముచేయవలయును. దారణమునకు యోగ్యమని చెప్పబడినస్థానములకంటె నితరస్థానములయందుండుశోఫయందు శస్త్రముచేపాటనము చేయవలయును.

ఆమశోఫ - దారణ - జనితోపద్రవములు.

శ్లో॥ ఆమచ్ఛేదేసిరాస్నాయు వ్యాపదోసృగతిస్రుతిః ॥ 11.
రుజోతివృద్ధిర్దరణం విసర్పోవాక్షతోద్భవః ।

తా॥ ఆమమయినశోఫము శస్త్రముచే ఛేదించునపుడు సిరలు, స్నాయువులు, వీనికి వ్యాపత్తు మఱియు నధిక రక్తస్రావము, పీడాధిక్యముగలుగును. వివరణము (అనగా స్ఫుటనము) లేక గాయముచేజనించు విసర్పరోగము గలుగును.

శ్లో॥ తిష్ఠ * న్నంతఃపునఃపూయ స్సిరాస్నాయ్వసృగామిషమ్ ॥ 12.
వివృద్ధోదహతిక్షిప్రం తృణోలపమివానలః ।

తా॥ చీము లోప్రదేశమునందుండినదై మరల విశేషముగా వృద్ధిజెంది సిరలు స్నాయువులు, రక్తము, మాంసము వీనిని అగ్నితృణములను దహింపజేయునటుల శీఘ్రముగా దహింపజేసును.

ఆమపాక - చ్ఛేద నిషేధము.

శ్లో॥ యశ్ఛినత్త్యామమజ్ఞానా ద్యశ్చపక్వముపేక్షతే ॥ 13.
శ్వపచావివవిజ్ఞేయా తావనిశ్చితకారిణౌ ।

తా॥ ఏ పురుషుడు అజ్ఞానముచే ఆమమయిన శోఫను ఛేదించునో, పక్వమైన శోఫను ఛేదనముచేయక నుపేక్షించునో అటుల బాగుగాయోచించి చేయకుండు ఆ యిరువురుపురుషులు రోగిని జంపుదురు. కావున వారిని చండాలురతో సమానులుగా తెలియవలయును,

---

స్పక్వే ఇతిపా.

## శస్త్రకర్మ - పూర్వకర్తవ్యము.

శ్లో॥ ప్రాక్శస్త్రకర్మణశ్చేష్టం భోజయేదన్నమాతురమ్ ॥ 14.
పానపంపాయయేన్మద్యం తీక్ష్ణంయోవేదనాక్షమః ।

తా॥ శస్త్రకర్మకుముందు రోగికి యిష్టమైన అన్నమును (అనగా వ్రణమునందపథ్యముగనుండు అన్నమునుకూడా బలముగలుగుటకై) భోజనము చేయించవలయును. శస్త్రపీడను సహించలేనిరోగికి మద్యపానాభ్యాసముకలిగియుండినచో అధిక మదకరమైనమద్యమును పానము చేయించవలయును.

శ్లో॥ సమూర్ఛత్యన్నసంయోగాన్మత్తశ్శస్త్రంనబుధ్యతే ॥ 15.

తా॥ అన్నోపయోగమువలన మోహమును జెందనేరదు. తీక్ష్ణమయినమద్యపానముచే మదించియుండురోగి తన శరీరమునందు ప్రయోగించబడుశస్త్రమును తెలిసికొననేరదు. (అనగా శస్త్రోపద్రవముచే చలించకుండునని తాత్పర్యము.)

## అశ్మరీరోగాదులయందు - శస్త్రకర్మకు - పూర్వము.

## అన్నాది నిషేధము.

శ్లో॥ అన్యత్రమూఢగర్భాశ్మ ముఖరోగోదరాతురాత్ ।

తా॥ మూఢగర్భము, అశ్మరి, ముఖరోగము, ఉదరరోగము యీ రోగములు గలవారిని వర్జించి యితరమైనరోగులకు యిష్టమయిన అన్నాదులను, మద్యపానమును చేయించవలయును.

## శస్త్రప్రయోగ క్రమము.

శ్లో॥ అథాహృతోపకరణం వైద్యః ప్రాఙ్ముఖమాతురమ్ ॥ 16.
సమ్ముఖోయంత్రయిత్వాశు న్యస్యేన్మర్మాదివర్జయన్ ।
అనులోమంసునిశితం శస్త్రమాపూయదర్శనాత్ ॥ 17.
సకృదేవాహరేత్తచ్చ

తా॥ పిదప తత్కాలయోగ్యమయిన యంత్రములు, శస్త్రములు, అగ్ని, జాంబవోష్ఠము, దూదితోగూడియుండు బట్ట, స్నేహనము, మధుకల్కము యీమొదలగు వానిని తన సమీపమునందు సిద్ధముగానుంచుకొనియుండువాడును, తూర్పుముఖముగా కూర్చుండియుండురోగికి అభిముఖముగా (అనగా పశ్చిమముఖముగా) నుండువాడునగు వైద్యుడు యంత్రణముచేసి మర్మసిరాదులను వర్జించి మిక్కిలి పదునుగల శస్త్రమును విలంబము చేయకుండా అనులోమముగా ప్రయోగించవలయును. ఆ శస్త్రమును చీముకనుబడువరకు నొకటేసారిగా ప్రయోగించవలయును. మఱియు దానిమీద నే యాయుధమును ఉంచియుండకూడదు.



శ్లో॥ పాకేతుసుమహత్యపి ।
పాటయేద్వ్యంగులంసమ్యగ్ద్వ్యంగులత్ర్యంగులాంతరమ్ ॥ 18.
ఏషిత్వాసమ్యగేషిణ్యా పరితస్సునిరూపితమ్ ।
అంగులీనాలవాలైర్వా యథా * దేశంయథాశయమ్ ॥ 19.

తా॥ మహత్తయిన పాకములో తత్పార్శ్వమునందు 2 లేక 3 అంగుళముల ప్రదేశమునువిడిచి 2 అంగుళములపరిమాణముగల మఱియొక వ్రణమునుచేసి అంతటను బాగుగ చూచి ఏషిణియను నాయుధముచేగాని, వ్రేళ్ళచేగాని, పద్మోత్పలాది నాళములచేగాని, పందిమొదలగు జంతువులయొక్క వాలములచేగాని వాతాదిదోష, వ్రణస్థానానుగుణముగా శుద్ధిజేయవలయును.

శ్లో॥ యతోగతాంగతింవిద్యా దుత్సంగోయత్రయత్రచ ।
తత్రతత్రవ్రణంకుర్యా త్సువిభక్తంనిరాశయమ్ ॥ 20.
ఆయతంచవిశాలంచ యథాదోషోనతిష్ఠతి ।

తా॥ ఏయేప్రదేశమునందు బహుదూరము నాడివ్యాపించియుండునో దానిం దెలుసుకొని ఆయాప్రదేశమునందును ఏయే శోఫప్రదేశమునం దౌన్నత్యము గలిగియుండునో దానిందెలుసుకొని ఆయాప్రదేశమునందును, పార్శ్వాదివిభాగములుగలదిగ, చీము మొదలగు దోషస్థానములు లేనిదిగ, దీర్ఘముగ, విస్తీర్ణముగ, నుండు వ్రణమును చేయవలయును. ఇటులజేసిన చీము మొదలగుదోషములు వ్రణమునందు లేకుండును

## శస్త్రకర్మయందు - వైద్యగుణ ప్రాశస్త్యము.

శ్లో॥ శౌర్యమాశుక్రియాతీక్ష్ణం శస్త్రమస్వేదవేపథు ॥ 21.
అసంమోహశ్చవైద్యస్య శస్త్రకర్మణిశస్యతే ।

తా॥ వైద్యునికి పాటనము మొదలగు శస్త్రకర్మలయందు ధైర్యము, హస్తచాతుర్యము (అనగా శీఘ్రములో పాటనాదికృత్యములను చేయు సామర్థ్యము) తీక్ష్ణమయినశస్త్రము, స్వేదము, కంపము లేకుండుట, తత్కాలోచితకార్యములయందు మోహము లేకుండుట, ఇవి ప్రశస్తంబు. వైద్యునికి శస్త్రకర్మయందు ధైర్యము ప్రశస్త

---

దోషం ఇతిపా.

మని చెప్పినందుచేతనే ధైర్యముగలవానికి స్వేదము, కంపము లేకుండునని యేర్పడుచున్నది. అయినప్పటికి ఉష్ణకాలవశముచేగాని ప్రకృతివశముచేగాని యెవనికైనా నొకవైద్యునికి స్వేదము, కంపముగలుగును. తత్పరిహారార్థము ప్రత్యేకముగా "అస్వేదవేపథు" అని చెప్పబడినది. స్వేదముతోగూడియుండు వైద్యుడు శస్త్రకర్మ చేయుటకై యత్నించునపుడు వానికి శస్త్రగ్రహణమే సాధ్యముకానేరదు. అటులనే కంపముతోగూడినవానికిని శస్త్రగ్రహణము సాధ్యముకానేరదు. కావున నా స్వేదకంపములు లేకుండుట యుక్తము.

### లలాటాదులయందు - ఛేదన క్రమము.

శ్లో॥ తిర్యక్ఛింద్యాల్లలాటభ్రూ దంతవేష్టకజత్రుణి ॥ 22.
కుక్షికక్షాక్షికూటోష్ఠ కపోలగళవంక్షణే ।

తా॥ లలాటము, కనుబొమలు, దంతవేష్టకము (అనగా ఇగుళ్ళు), మెడఱొంకులు, ఉదరము, చంకలు, అక్షికూటము, పెదవులు, చెక్కిళ్ళు, కంఠము, గజ్జలు వీనియందు అడ్డముగా ఛేదనము చేయవలయును.

### తిర్యక్ఛేద - నిషిద్ధ స్థలములు.

శ్లో॥ అన్యత్రచ్ఛేదనాత్తిర్యక్ సిరాస్నాయువిపాటనమ్ ॥ 23.

తా॥ పైచెప్పినవానికంటె నితరప్రదేశములయందు అడ్డముగా ఛేదనము చేయుటవలన సిరలు, స్నాయువులు భంగమునొందును.

### శస్త్ర - ప్రయోగానంతర కర్తవ్యము.

శ్లో॥ శస్త్రేణచారితేవాగ్భిః శీతాంభోభిశ్చరోగిణమ్ ।
ఆశ్వాస్యపరితోంగుళ్యా పరిపీడ్యవ్రణంతతః ॥ 24.
క్షాళయిత్వాకషాయేణ ప్లోతేనాంభోపనీయచ ।
గుగ్గుల్వగురుసిద్ధార్థ హింగుసర్జరసాన్వితైః ॥ 25.
ధూపయేత్పటుషడ్గ్రంథా నింబపత్రైర్ఘృతప్లుతైః ।

తా॥ శస్త్రమును ప్రయోగించునపుడు తత్కాలోచితముగ స్వస్థుడవైతివి. భయపడవలదు అని యీప్రకారముగా మధురమైనవార్తలచేతను, శీతోదకపరిషేకముచేతను రోగిని. ఓదార్చి ఆవ్రణమును 4 ప్రక్కలయందు వ్రేళ్ళచేపిసికి దానియందుండు చీము మొదలగు దోషములను వెలిపరచి పిదప మధుయష్ట్యాదులచే సిద్ధము చేయు



బడిన కషాయముచేగడిగి ప్రత్తినూలుచే నిర్మించబడిన వస్త్రముచేతుడిచి గుగ్గులు, అగురు, తెల్లావాలు, ఇంగువ, సర్జరసము, వీనితోగూడినదిగను, అధికమైనఘృతముతో జేర్చబడినదిగనుండు సైంధవలవణము, నల్లయతివస, వేపాకు వీనిచే నావ్రణమునకు ధూపము వేయవలయును. మఱియు నీయర్థమే:—

"గుగ్గుల్వాదిభిరేవచశయనం ధూపయేదేతైర్ద్రవ్యైశ్చబహుఘృతైః"

అనువచనముచే అష్టాంగసంగ్రహములోను చెప్పబడియున్నది.

### వ్రణమునందు - వర్తి ప్రయోగము.

శ్లో॥ తిలకల్కాజ్యమధుభి ర్యథాస్వంభేషజేనచ ॥ 26.
దిగ్ధాంవర్తింతతోదద్యాత్తైరేవాచ్ఛాదయేచ్చతామ్ ।

తా॥ పిదప యథాక్రమముగా తిలకల్కము, ఘృతము, తేనె, వీనిచేపూయబడిన కార్పాసమయమైన వత్తిని ఆవ్రణములో ప్రవేశింపజేయవలయును. మఱియు నావ్రణములో వేయబడినవత్తిని అతిలకల్కాదులచేతనే మూయవలయును. యథాక్రమమనగా:—వాతవ్రణమునందు తిలపిష్టముచే పూయుబడినవత్తిని, పిత్తవ్రణమునందు ఘృతముచేపూయబడినవత్తిని, కఫవ్రణమునందు తేనెచే పూయబడినవత్తిని ప్రవేశింపజేసి మూయవలయుననియర్థము. సర్వదోషములలో నేక: కాలమునందు తిలకల్కము, ఘృతము, తేనె యీమూటిచే పూయబడినవత్తిని ప్రయోగించవలయునని కొందరువచించెదరు.

### వ్రణాచ్ఛాదనము.

శ్లో॥ ఘృతాక్తైస్సక్తుభిశ్చోర్ధ్వం

తా॥ వత్తికిపైన ఘృతయుక్తమైన సక్తువులచే మూయవలయును.—

"నాతిభ్రష్టయవసక్తుభిర్ఘృతాక్తైరోభ్యజనాంతేం భసాదక్షిణాం గుళీభిః సుమృదితై రేవచ్ఛాదయేత్ ॥"

రోగిభుజించినపిదప కొంచెముగవేయించబడిన యవసక్తువులలో నెయ్యినిచేర్చి ఉదకముతోడ దక్షిణహస్తముయొక్క వ్రేళ్ళచేబాగుగమర్దనముచేసి ఆసక్తువులచే నావత్తిని మూయవలయును. అని అష్టాంగ సంగ్రహమునందు చెప్పబడియున్నది.

### వ్రణబంధన క్రమము.

శ్లో॥ ఘనాంకబళికాంతతః ॥ 27.

నిధాయయుక్త్యాబధ్నీయాత్ప్లోటేనసుసమాహితమ్ ।
పార్శ్వేసవ్యేఽపసవ్యేవా నాధస్తాన్నచోపరి ॥ 28.

తా॥ వ్రణములోపల ప్రయోగించబడినవత్తిని మూసినపిదప అనేకవస్త్రఖండములనుచేర్చి సిద్ధముచేయబడినఘనమైన కబళికనుదానిపైనునిచి దళమైనవస్త్రఖండముచే దోషము, కాలము వీనికనుగుణమైనయుక్తిచేత వామపార్శ్వమునందుగాని, దక్షిణపార్శ్వమునందుగాని వ్రణమునతిజాగ్రతతో కట్టవలయును. మఱియును వ్రణమునధోభాగమునందును, ఊర్ధ్వభాగమునందును కట్టంజనదు. దోషము, కాలము వీనికనుగుణమైన యుక్తియనగా:—

" వాతశ్లేష్మోద్భవాంస్తత్ర ద్విస్త్రిర్వావేష్టయేద్వ్రణాన్ । సకృదేవపరిక్షిప్య రక్తపిత్తాభిఘాతజాన్ ॥ తథా ॥ శస్త్రక్షతరుజాయాంతు ప్రతతాయాంయష్టిమధుక సర్పిషోష్ణేన వ్రణంసించేత్ । ఉదకుంభాదాపోగృహీత్వా ప్రోక్షయేత్పరితఉపచరేత్ ॥"

వాతశ్లేష్మములచే జనించినవ్రణములను వస్త్రపట్టముచే 2 చుట్లుగాని, లేక 3 చుట్లుగాని చుట్టికట్టవలయును. రక్తపిత్త, అభిఘాతములవలన జనించినవ్రణములను ఒకే చుట్టుచుట్టి కట్టవలయును. అని అష్టాంగసంగ్రహములో జెప్పబడియున్నది. శస్త్రముయొక్క గాయముచేగలిగినవ్రణమును ఉష్ణమైన యష్టిమధుకములో గూడియుండు ఘృతముచేతడుపవలయును. మఱియు ఉదకకుంభములోనుండి జలమునెత్తి దానిపై చల్లుచుండవలయును. అని అష్టాంగసంగ్రహములో జెప్పబడియున్నది.

## వ్రణబంధన పట్టములు.

శ్లో॥ శుచిసూక్ష్మదృఢాఃపట్టాః కబళ్యస్సనికేశికాః ।
ధూపితామృదవశ్లక్ష్ణా నిర్వలీకా వ్రణేహితాః ॥ 29.

తా॥ తెల్లగ, సూక్ష్మముగ, గట్టిగనుండుపట్టములు వ్రణమునందు హితకరంబులు. ఘృతముచే ధూపమువేయబడినదిగ, మృదువుగ, నునుపుగలదిగ, ముడుపులులేనిదిగ, పట్టవర్తులతోగూడినదిగనుండు కబళికలు వ్రణమునందు హితకరంబులు.

## వ్రణరక్షణము.

శ్లో॥ కుర్వీతానంతరంతస్య రక్షాంరక్షోనిషిద్ధయే ।
బలించోపహరేత్తేభ్యః



తా॥ పిదప శస్త్రకర్మచేయబడిన రోగియొక్క వ్రణమునందు మాంసమునుభుజించునట్టి రాక్షసులు సోకకుండునటుల రక్షచేయవలయును. మఱియు నారాక్షసులకును బలులనివ్వవలయును.

## మూర్ధౌషధ ధారణము.

శ్లో॥ సదామూర్ధ్నావధారయేత్ ॥ 30.
లక్ష్మీంగుహామతిగుహాం జటిలాం బ్రహ్మచారిణీమ్ ।
వచాంఛత్రామతిచ్ఛత్రాం దూర్వాంసిద్ధార్థకానపి ॥ 31.

తా॥ సర్వకాలమునందును ముడుగుదామర, నక్కతోకపొన్న, ముయ్యాకుపొన్న, జటామాంసి, బ్రహ్మచారిణి (అనగా గంటుభారంగి), వస, సదాప, నులితడ, గరిక, తెల్లావాలు అనునీమహౌషధులను శిరమునందు ధరించవలయును.

## వ్రణితోపచారము.

శ్లో॥ తతస్స్నేహాదివేశోక్తం తస్యాచారంసమాదిశేత్ ।

తా॥ పిదప నావ్రణితునికి స్నేహపానవిధియందు చెప్పబడిన "ఉష్ణోదకోపచారీస్యాదిత్యాది" విధుల నుపదేశించవలయును.

## వ్రణమునందు - దివాస్వాప నిషేధము.

శ్లో॥ దివాస్వప్నో వ్రణేకండూ రాగరుక్ఛోఫపూయకృత్ ॥ 32.

తా॥ పగటినిద్రచే వ్రణమునందు దురద, ఎఱుపువర్ణము, శూల, శోఫ, చీముఇవిగలుగును. కాబట్టి వ్రణితుడు పగటినిద్రను వర్జించవలయును.

## వ్రణమునందు - స్త్రీదర్శనాది నిషేధము.

శ్లో॥ స్త్రీణాంతుస్మృతిసంస్పర్శ దర్శనైశ్చలితస్రుతే ।
శుక్రేవ్యవాయజాన్దోషా నసంసర్గేప్యవాప్నుయాత్ ॥ 33.

తా॥ స్త్రీలయొక్క స్మరణము, స్పర్శము, దర్శనము, వీనిచే రేతస్సు స్వస్థానములోనుండి చలించి స్రవించినయెడల స్త్రీయొక్క సంసర్గమైథునములు లేకుండినను, మైథునముచేగలుగునట్టి దోషములుగలుగును. కాబట్టి స్త్రీలయొక్క స్మరణము, దర్శనము, స్పర్శనము యీమొదలగువానిని వ్రణితుడు వర్జించవలయును.

## వ్రణమునందు పథ్యము.

శ్లో॥ భోజనంతుయథాసాత్మ్యం యవగోధూమషష్టికాః ।
మసూరముద్గతువరీ జీవంతీసునిషణ్ణకాః ॥ 34.

శాలిమూలకవార్తాక తండులీయకవాస్తుకమ్ ।
కారవేల్లకకర్కోటక పటోలజటుకాఫలమ్ ॥ 35.
సైంధవందాడిమంధాత్రీం ఘృతంతప్తహిమంజలమ్ ।
జీర్ణశాల్యోదనంస్నిగ్ధ మల్పముష్ణంద్రవోత్తరమ్ ॥ 36.
భుంజానోజాంగలైర్మాంసైః శీఘ్రంవ్రణమపోహతి ।

తా॥ యవలు, గోధుమలు, షష్టికములు, చిఱుసెనగలు, పెసలు, కందులు మొదలగుధాన్యములను, ముసుబాల, చెంచలికూర, లేతముల్లంగి, వంకాయ, చిర్రికూర, చక్రవర్తికూర, కాకరకాయ, ఆగాకర, పొట్లకాయ, తక్కోలబుండు, అనునీ శాకములను, సైంధవలవణము, దాడింబ, ఉసిరికకాయ, ఘృతము, బాగుగా కాచి చల్లార్చిన ఉదకము, పురాణముగనుండు శాలితండులములయన్నము, వీనిని సాత్మ్యమనుగుణముగ (అనగా ఎవనెవనికేది అభ్యాసమువలన హితముగనుండునో ఆప్రకారముగ) జాంగల మాంసము, స్నేహము వీనితోడ అల్పముగ, ఉష్ణముగ, ద్రవోత్తరముగభుజించు వ్రణితునికి శీఘ్రముగ వ్రణముఆరును.

శ్లో॥ అశితంమాత్రయాకాలే పథ్యంయాతిజరాంసుఖమ్ ॥ 37.
అజీర్ణేత్వనిలాదీనాం విభ్రమోబలవాన్భవేత్ ।
తతశ్శోఫరుజాపాక దాహానాహానవాప్నుయాత్ ॥ 38.

తా॥ యుక్తమైనకాలమునందు మాత్రగా భుజించబడిన పథ్యము సుఖముగా జీర్ణమునుపొందును. కాబట్టి పథ్యమును మాత్రగా కాలమునందు భుజించవలయును. అజీర్ణముగనుండునపుడు వాతాదులకు బలవత్తరమయిన ప్రకోపము దానిచే శోఫ, శూల, పాకము, సర్వాంగతాపము, కడుపుబ్బరము యీమొదలగునవిగలుగును. కావున నెపుడును అజీర్ణముగలుగునటుల జేయంజనదు.

## వ్రణమునందు వర్జ్యాహారాదులు.

శ్లో॥ నవధాన్యంతిలాన్మాషాన్ మద్యంమాంసమజాంగలమ్ ।
క్షీరేక్షువికృతీరమ్లం లవణంకటుకంత్యజేత్ ॥ 39
యచ్చాన్యదపివిష్టంభి విదాహిగురుశీతలమ్ ।
వర్గోఽయంనవధాన్యాది ర్వ్రణినస్సర్వదోషకృత్ ॥ 40.

తా॥ నూతనధాన్యము, నువ్వులు, మినుములు, మద్యము, జాంగలదేశమునందు జనించని మాంసము, క్షీరవికారము, ఇక్షువికారము, అమ్లము, లవణము, కారము,



విష్టంభకారిగ, విదాహిగ, గురువుగనుండు యితరమయినవస్తువులు, శీతోదకము మొదలగు తలమైనవస్తువులు, వీనిని వ్రణితుడు త్యజించవలయును. నవధాన్యాదివర్గము వ్రణితునికి సర్వదోషములను గలుగజేయును.

"నవధాన్యంవిష్టంభిమాషకలాయకులుత్థనిష్పావశింబీశీతాంబు మద్యేక్షు క్షీరపిష్టతిలవికృతిశుష్కశాకపిణ్యాకహారితకామ్లలవణకటుక క్షారవృష్యామిషాణివర్జయేత్ ॥"

నూతనధాన్యము, కఫకరమైన వస్తువులు, మినుములు, బోడసెనగలు, ఉలవలు, అనుములు, కందిపొట్టు మొదలయినవి, శీతోదకము, మద్యము, చెఱుకు, పాలు, పిండి, నువ్వులు వీనివికారములు, ఎండినశాకములు, తెలికపిండి, మునగాకు, ఆమ్లము, లవణము, కారము, క్షారము, శుక్రవృద్ధికరమయిన మాంసములు వీనిని వర్జించవలయును. అని అష్టాంగసంగ్రహమునందు చెప్పబడియున్నది.

శ్లో॥ మద్యంతీక్ష్ణోష్ణరూక్షామ్ల మాశువ్యాపాదయేద్వ్రణమ్ ।

తా॥ తీక్ష్ణముగ, ఉష్ణముగ, రూక్షముగ, అమ్లముగనుండు మద్యము శీఘ్రములో వ్రణమునుజెందును. కావుననట్టి మద్యమును వర్జించవలయును.

"సస్నేహంమధురప్రాయం నాతితీక్ష్ణమకర్కశమ్ । తనుయత్సుఖపేయంచ మార్ద్వీకేషుతదుత్తమమ్ ॥"

స్నేహముతోగూడినదిగ, మధురముగ, అతితీక్ష్ణము, అతికాఠిన్యములేనిదిగ, తేటగ, సుఖముగ పానముచేయతగినదిగనుండు మద్యము మార్ద్వీకమద్యములలో ఉత్తమమైనదని తంత్రాంతరమునందు చెప్పబడియున్నది. కాబట్టి మార్ద్వీకాదితుల్యముగనుండు మద్యము, రోద్రాసవము మొదలగుమద్యము ఇవి సాత్మ్యముగనుండుటచే వానిని కొంచెముగా పానముచేయవచ్చును.

## వ్రణోపచారము.

శ్లో॥ వాలోశీరైశ్చవీజ్యేత నచైనంపరిఘట్టయేత్ ॥ 41.
నతుదేన్నచకండూయే చ్చేష్టమానశ్చపాలయేత్ ।
స్నిగ్ధవృద్ధద్విజాతీనాం కథాశ్శృణ్వన్మనఃప్రియాః ॥ 42॥
ఆశావాన్వ్యాధిమోక్షాయ క్షిప్రంవ్రణమపోహతి ।

తా॥ వాలము, వట్టివేరు, వీనిచే వ్రణమును విసరవలయును. వ్రణము నణచకూడదు. బొడవకూడదు. గోకకూడదు. ఏదోనొకవ్యాపారమునుచేయుచునే అవ్రణ

మును కాపాడవలయును. స్నేహితులు, వృద్ధులు, బ్రాహ్మణులు వీరిమూలముగా మనస్సుకు ప్రియమయిన కథలనువినుచు రోగవిమోచనమునందాశగలవ్రణితుడు శీఘ్రముగా వ్రణమును పోగొట్టుకొనును.

ద్వితీయదివసమున - వ్రణప్రక్షాళన నిషేధము.

శ్లో॥ తృతీయేహ్నిపునఃకుర్యాద్వ్రణకర్మచపూర్వవత్ ॥ 43.
ప్రక్షాళనాదిదివసే ద్వితీయేనాచరేత్

తా॥ మూడవదినమునందు మరల ప్రక్షాళనాదికర్మలను మునుపటివలెనే చేయవలయును. 2-వ దినమునందు వ్రణప్రక్షాళనాది కృత్యములను చేయంజనదు.

శ్లో॥ తథా । తీవ్రవ్యథోవిగ్రథితశ్చిరాత్సంరోహతివ్రణః ॥ 44.

తా॥ రెండవదినమునందు ప్రక్షాళనముచేసినయెడల నా వ్రణము తీవ్రమైన ఉపద్రవములుగలదిగ, గ్రంథులతోగూడినదిగనై చిరకాలము మీద అణును.

వ్రణవర్జనీయ వర్త్యాదులు.

శ్లో॥ స్నిగ్ధాంరూక్షాంశ్లథాంగాఢాం దుర్న్యస్తాంచవికేశికామ్ ।
వ్రణేనదద్యాత్కల్కంచ స్నేహాత్క్లేదోవివర్ధతే ॥ 45
మాంసచ్ఛేదోతిగాఢాత్స్యాద్దరణంశోణితాగమః ।
శ్లథాతిగాఢదుర్న్యస్తైర్వ్రణవర్త్మావఘర్షణమ్ ॥ 46.

తా॥ స్నిగ్ధముగ, రూక్షముగ, శిథిలముగ, గట్టిగ, ప్రవేశించుట కసాధ్యముగ నుండు వికేశికయనువత్తిని వ్రణమునందుంచంజనదు. అటులనే అతి స్నిగ్ధముగ, అతి రూక్షముగ, శిథిలముగ, గట్టిగనుండుకల్కమును వ్రణములో ప్రయోగించంజనదు. ద్రవమయినవస్తువులో చేర్చి పిష్టముచేయబడిన ఔషధము కల్కమని చెప్పబడును. "అతిస్నేహాత్ క్లేదః" అధికస్నేహముచే క్లేదముకలుగునని అష్టాంగసంగ్రహమునందు జెప్పబడియున్నది. పైజెప్పినవత్తి అతిస్నేహముతోగూడియుండుటవలన క్లేదమును వృద్ధిజేసును. మఱియు నావత్తి అతిరూక్షముగనుండుటవలన మాంసచ్ఛేదము, అతిపీడ, దరణము, విశేషముగా రక్తస్రావము వీనిని గలుగజేసును. వత్తి శిథిలముగ, అతి లావుగ, లోనప్రవేశింపజేయుట కశక్యముగనుండుటవలన వ్రణమార్గమునకు ఒరుపును గలుగజేసును.



వికేశికా - వత్తి ప్రయోజనము.

శ్లో॥ సపూతిమాంసంసోత్సంగం సగతింపూయగర్భిణమ్ ।
వ్రణంవిశోధయేచ్ఛీఘ్రం స్థితాహ్యంతర్వికేశికా ॥ 47.

తా॥ దుర్గంధమైన మాంసముతో గూడినదిగ, మధ్య ఔన్నత్యముగలదిగ వ్యాపించుస్వభావముగలదిగ, లోన చీముగలదిగనుండు వ్రణమును వికేశికయనువత్తి శీఘ్రములో శుద్ధిజేసును. కాబట్టి వికేశికయనువత్తిని వ్రణములోపల ప్రయోగించవలయును.

ఛేదించబడిన వ్రణోపచారము.

శ్లో॥ వ్యమ్లంతుపాటితంశోఫం పాచనైస్సముపాచరేత్ ।
భోజనైరుపనాహైశ్చ నాతివ్రణవిరోధిభిః ॥ 48.

తా॥ పక్వమైన వ్రణమును అపక్వమని అజ్ఞానముచే ఛేదించినయెడల వ్రణమునకు మిగుల అవిరోధిగ, పాచనముగ (అనగా అమ్లకటుకతీక్ష్ణ, ఉష్ణలవణప్రాయముగ) నుండుభోజనములు ఉపనాహములు వీనిచే నుపచరించవలయును.

కుట్టతగిన వ్రణములు.

శ్లో॥ సద్యస్సద్యోవ్రణాన్సీవ్యే ద్వివృతానభిఘాతజాన్ ।
మేదోజాన్లిఖితాన్గ్రంథీన్ హ్రస్వాఃపాలీశ్చకర్ణయోః ॥ 49.
శిరోక్షికూటనాసౌష్ఠ గండకర్ణోరుబాహుషు ।
గ్రీవాలలాటముష్కస్ఫిక్ మేఢ్రపాయూదరాదిషు ॥ 50.
గంభీరేషుప్రదేశేషు మాంసలేష్వచలేషుచ ।

తా॥ కర్ణపాలులు (అనగా చెవితమ్మెలు), శిరస్సు, అక్షికూటము, నాసికము పెదవులు, చెక్కిళ్ళు, చెవులు, తొడలు, హస్తములు, కంఠము, లలాటము, వృషణములు, పిఱుదులు, మేఢ్రము, గుదము, ఉదరము. యీ మొదలగు నవయవములయందును, గంభీరముగను, అధికమాంసముగలవిగను, చలించకుండునవిగ నుండు ప్రదేశము నందును అభిఘాతముచేజనించి విస్తీర్ణమయిన ముఖముగల సద్యోవ్రణములను తత్క్షణముననే సూదులచేకుట్టవలయును. మఱియు మేదస్సుచేగలిగిన గ్రంథులనుగీచితోడనే సూదులచే కుట్టవలయును. "వివృతాన్" అని చెప్పినందుచే సంకోచమైన ముఖము గలవ్రణములను కుట్టకూడదని భావంబగుచున్నది. అభిఘాతముచేగలిగిన సద్యోవ్రణ

ములు చిరకాలమైనచో వానినికూడా కుట్టకూడదని తెలియపరచుటకై "సద్యః" అనుపదము ప్రయోగించబడినది.

కుట్టతగని వ్రణములు,

శ్లో॥ నతుసంధుణకక్షాదా వల్పమాంసచలేవ్రణాన్ ॥ 51.
వాయునిర్వాహిణశ్శల్య గర్భాన్ క్షారవిషాగ్నిజాన్ ।

తా॥ అల్పమాంసము గలదిగ, చంచలముగనుండుగజ్జలు, చంకలు, యీ మొదలగు ప్రదేశములయందు దభిఘాతముచేగలిగిన వ్రణములనుకుట్టంజనదు. అటులనే వాయువును వెలిపరచునట్టి వ్రణములను, లోన శల్యముతోగూడియుండు వ్రణములను, క్షారవిషాగ్నులచేగలిగిన వ్రణములను కుట్టంజనదు. విశేషమాంసముగల ఉదరాది ప్రదేశములయందుజనించియుండు వ్రణములను కుట్టవలయునని చెప్పినందుచేతనే అల్పమాంసముగలప్రదేశములయందుండు వ్రణములను కుట్టకూడదని అర్థము సిద్ధంబగుచున్నది. అయినప్పటికి అల్పమాంసముగలదిగ, చంచలముగనుండునట్టి ప్రదేశములయందు అభిఘాతమువలన జనించినవ్రణముల నెపుడును కుట్టంజనదని తెలియపరచుటకై యీ శ్లోకము చెప్పబడినది.

వ్రణములను - కుట్టునట్టి క్రమము.

శ్లో॥ సీవ్యేచ్చలాస్థిశుష్కాస్ర తృణరోమాపనీయతు ॥ 52.
ప్రలంబిమాంసంవిచ్ఛిన్నం నివేశ్యస్వనివేశనే ।
సంధ్యస్థ్యవస్థితేరక్తే స్నాయ్వాసూత్రేణవల్కలైః ॥ 53.
సీవ్యేన్నదూరేనాసన్నే గృహ్ణాన్నాల్పంనవాబహు ।

తా॥ స్థానములోనుండి చలించినఅస్థులు, ఎండినరక్తము, తృణము, రోమములు వీటినియెత్తి పారవేసి శస్త్రాదులచే కోయబడి వ్రేలుచుండు మాంసమును, సంధిని, అస్థిని స్వస్థానమునందునిచి రక్తమును స్రవించకుండునపుడా వ్రణమును స్నాయువుచేతగాని, పిండిబండ మొదలగు వృక్షములయొక్క పట్టలలోని సూత్రముచేతగాని కుట్టవలయును, కుట్టునపుడు అతిదూరమునందును, అతిసమీపమునందును కుట్టంజనదు. మఱియును వ్రణభాగమును మిగుల నల్పముగ కాని, మిక్కిలి అధికముగగాని గ్రహించి కుట్టంజనదు.

సీవనానంతరకర్తవ్యము.

శ్లో॥ సాంత్వయిత్వాతతశ్చార్తం వ్రణేమధుఘృతద్రుతైః ॥ 54.



అంజనక్షౌమజమషీ ఫలినీశల్లకీఫలైః ।
సరోధ్రమధుకైర్దిగ్ధే యుంజ్యాద్బంధాధిపూర్వవత్ ॥ 55.

తా॥ అటుల కుట్టిన పిదప శీతోదకమును పైనచల్లుట, విసనకఱ్ఱలచే విసురుట యీ మొదలగువానిచే రోగిని ఓదార్చి తేనె, ఘృతము వీనితోడజేర్చి కలియబెట్టబడిన అంజనము, వెలిపట్టువస్త్రముయొక్క మషి, ప్రేంకణము, అందుగుపండు, లొద్దుగు, ఇప్ప వీనిచే వ్రణమునకు లేపనముజేసి పై జెప్పినప్రకారము కషాయముచే ప్రక్షాళనమును కబళిక మొదలగువానిని ప్రయోగించవలయును.

రక్తరహితోష్మ - వ్రణసీవన క్రమము.

శ్లో॥ వ్రణోనిశ్శోణితోష్మాయః కించిదేవావలిఖ్యతమ్ ।
సంజాతరుధిరంసీవ్యే త్సంధానంహ్యస్యశోణితమ్ ॥ 56.

తా॥ రక్తములేకుండు ఓష్మముగల వ్రణమును శస్త్రముచే నొకింత గీచి రక్తము స్రవింపుచుండగా ఆవ్రణమును కుట్టవలయును. అది యేలననగా :—రక్తము వ్రణమును సంధానముచేసును.

వ్రణ బంధనము.

శ్లో॥ బంధనానితుదేశాదీన్ వీక్ష్యయుంజీత తేషుచ ।

తా॥ ఆవికాజినము మొదలగుబంధములను దేశకాలసాత్మ్యాదులనాలోచించి ఆయా వ్రణమునకు తగినటుల చేయవలయును.

వ్రణబంధన స్వరూపము.

శ్లో॥ ఆవికాజినకౌశేయ ముష్ణంక్షౌమంతుశీతలమ్ ॥ 57.
శీతోష్ణంతూలసంతాన కార్పాసస్నాయువల్కజమ్ ।

తా॥ ఆవికాజినము (అనగా మేకచర్మము) కౌశేయము (అనగా దళిరీబట్ట తాస్తా మొదలయిన పురుగులవలన బుట్టేబట్టలు) ఇవి ఉష్ణవీర్యముగలవి. క్షౌమము (అనగా వెలిపట్టువస్త్రము) శీతవీర్యముగలది. తూలసంతానమను బంధనము (అనగా బూరుగుదూది సూత్రములచేజేయబడిన బంధనము) ప్రత్తినూలుచేజేయబడినబంధనము స్నాయువుచే జేయబడిన బంధనము, పట్టలచేజేయబడిన బంధనము ఇవి శీతోష్ణవీర్యముగలవి.

వ్రణ - బంధనోపయుక్త ద్రవ్యములు.

శ్లో॥ తామ్రాయస్త్రపుసీసాని వ్రణేమేదఃకఫాధికే ॥ 58.

భంగేచయుంజ్యాత్ఫలకం చర్మవల్కకుశాదిచ ।

తా॥ మేదస్సు, కఫము ఇవిఅధికముగనుండువ్రణములో తామ్రము, ఇనుము తగరము, సీసము, వీటిని రేఖసార్థముపయోగించవలయును. విరిగిన అంగములను బంధించుటలో పై జెప్పిన తామ్రాదులను ద్రాను మొదలగువానిపలకలు, చర్మము, వృక్షములయొక్కపట్టలు, వెదురు మొదలగువానిబద్దలు వీనినుపయోగించవలయును.

## వ్రణబంధ భేదములు.

శ్లో॥ స్వనామానుగతాకారా బంధాస్తుదశపంచచ ॥ 59.
కోశస్వస్తికముత్తోలీ చీనదామానువేల్లితమ్ ।
ఖట్వావిబంధస్థగికా వితానోత్సంగగోఫణాః ॥ 60.
యమకంమండలాఖ్యంచ పంచాంగీచేతియోజయేత్ ।
యోయత్రసునివిష్టస్స్యాత్తం తేషాంతత్రబుద్ధిమాన్ ॥ 61.

తా॥ కోశము, స్వస్తికము, ముత్తోళి, చీనము, దామము, అనువేల్లితము, ఖట్వము, విబంధము, స్థగికా, వితానము, ఉత్సంగము, గోఫణము, యమకము, మండలాఖ్యము, పంచాంగి అని 15 విధబంధములుగలవు. ఇవి తమ పేరుకుతగిన యాకారములుగలవిగనుండును. కోశాది 15 బంధములలో దేని కేస్థలమునంగుకట్టిన యుచితంబుగనుండునో దానిని బుద్ధిమంతుడగువైద్యుడాస్థలమునం దుపయోగించవలయును. అదియెట్లన్న :—కోశమనుబంధమును వ్రేళ్ళగణుపులయందును, స్వస్తికమను బంధనమును సంధి, కూర్చము, కనుబొమలు, స్తనాంతరము (అనగా ఇరుస్తనములకు మధ్యప్రదేశము), చంకలు, నేత్రములు, చెక్కిళ్ళు, కర్ణములు వీనియందును, ముత్తోళిని మెడ, మేఢ్రము వీనియందును, చీనమును కంటికొనలయందును, దామనుసంధి, గజ్జలు మొదలగుప్రదేశములయందును, అనువేల్లితమును చేతులు, కాళ్ళు యీమొదలగు శాఖలయందును, ఖట్వనుసంధి, కటుమడ్లు చెక్కిళ్ళు వీనియందును విబంధమును ఉదరము, తొడలు, వీపు వీనియందును, స్థగికను బొట్టనవ్రేళ్ళు, మేఢ్రము, అంత్రవృద్ధి, మూత్రవృద్ధి వీనియందును, వితానమనుశిరము మొదలగు గొప్పఅంగములయందును, ఉత్సంగమును వ్రేలుచుండు బాహు మొదలగు అంగములయందును, గోఫణమును నాసికము, పెదవులు, గెడ్డము, తొడలు వీనియందును, యమకమును యమళవ్రణములయందును, మండలమును గుండ్రముగనుండు అంగములయందును, పంచాంగిని మెడకొంకులకు పైభాగమునందును ప్రయోగించవలయుననుట.



## దృఢబంధ - నార్హా స్థానములు.

శ్లో॥ బద్ధ్నీయాద్గాఢమూరుస్ఫిక్కక్షావంక్షణమూర్ధసు ।

తా॥ తొడలు, పిఱుదులు, చంకలు, గజ్జలు, శిరస్సు వీనియందు దృఢముగా కట్టవలయునేకాని వదులుగా కట్టంజనదు.

## సమబంధ - నార్హా స్థానములు.

శ్లో॥ శాఖావదనకర్ణోరః పృష్ఠపార్శ్వగళోదరే ॥ 62.
సమంమేహనముష్కేచ

తా॥ కాళ్ళు మొదలగుశాఖలు, ముఖము, కర్ణములు, ఱొమ్ము, పృష్ఠము, పార్శ్వములు, కంఠము, ఉదరము, మేఢ్రము, వృషణము వీనియందు సమముగా కట్టవలయును.

## శిథిలబంధ - నార్హా స్థానములు.

శ్లో॥ నేత్రేసంధిషుచశ్లథమ్ ।

తా॥ నేత్రములు, సంధులు, వీనియందు వదులుగాకట్టవలయును.

## వాతశ్లేష్మజ - వ్రణబంధన క్రమము.

శ్లో॥ బద్ధ్నీయాచ్ఛిథిలస్థానే వాతశ్లేష్మోద్భవేసమమ్ ॥ 63.
గాఢమేవసమస్థానే భృశంగాఢంతదాశ్రయే ।

తా॥ శిథిలమైన బంధముచెప్పబడిన స్థానమునందుగలిగెడు వాతశ్లేష్మ వ్రణములను సమముగా కట్టవలయునేకాని గట్టిగను, శిథిలముగనుకట్టంజనదు. సమమయిన బంధము చెప్పబడిన స్థానమునందుగలిగెడు వాతశ్లేష్మవ్రణములను మిగుల దృఢముగా కట్టవలయును. దృఢబంధముచెప్పబడిన స్థానములయందుగలిగెడు వాతశ్లేష్మవ్రణములను మిక్కిలి దృఢముగాకట్టవలయును.

శ్లో॥ శీతేవసంతేచతథా మోక్షణీయాత్ర్యహాత్త్ర్యహాత్ ॥ 64.

తా॥ వాతశ్లేష్మములచేగలిగిన వ్రణములను హేమంతశిశిర వసంతకాలములయందు 3 దినములకొకమారు విప్పికట్టవలయును.

## పిత్తరక్తజ - వ్రణబంధన క్రమము.

శ్లో॥ పిత్తరక్తోత్థయోర్బంధో గాఢస్థానేసమోమతః ।
సమస్థానేశ్లథోనైవ శిథిలస్యాశయేతథా ॥ 65.

తా॥ దృఢబంధము చెప్పబడినస్థానమునందు గలిగెడు పిత్తరక్త వ్రణములకు సమమయినబంధము చేయవలయును. సమమైనబంధము చెప్పబడియుండు స్థానమునందు (అనగా శాఖావదనాదులయందు) పిత్తరక్తముచే గలిగిన వ్రణములకు శిథిలమయినబంధము చేయవలయును. శిథిలమయినబంధము చెప్పబడిన స్థానమునందు బంధమే చేయంజనదు.

శ్లో॥ సాయంప్రాతస్తయోర్మోక్షో గ్రీష్మేశరదిచేష్యతే।

తా॥ పిత్తరక్తముచే జనించిన వ్రణములను సాయంప్రాతఃకాలములయందు విప్పికట్టవలయును. ఇతరదోషములచేజనించిన వ్రణములనుకూడా గ్రీష్మశరదృతువులలో సాయంప్రాతఃకాలములయందు విప్పికట్టవలయును.

బంధనరహిత - వ్రణోపద్రవములు.

శ్లో॥ అబద్ధోదంశమశక.శీతవాతాదిపీడితః ॥ 66.
దుష్టీభవేచ్చిరంచాత్ర నతిష్ఠేత్స్నేహభేషజమ్ ।
కృచ్ఛ్రేణశుద్ధింరూఢింవా యాతిరూక్షోవివర్ణతామ్ ॥ 67.

తా॥ కట్టబడకుండువ్రణము ఈగలు, దోమలు, శీతలము, వాతము, పొగ, ధూళి వీనిచేపీడించబడినదై దుష్టముగనగును. మఱియు నావ్రణమునందు బంధము లేకనే ఉపయోగించబడిన వ్రణహారమయిన స్నేహాద్యౌషధములు చిరకాలమువరకు నుండనేరవు. బంధనమునుచేయుటకు బాగుగానుపచరించినప్పటికి వ్రణము బహుకష్టముమీద శుద్ధినిజెంది ఆరును. కష్టముచే నావ్రణము ఆరినను శరీరమునకంటె విరుద్ధమైన వర్ణమును జెందును.

వ్రణబంధన గుణము.

శ్లో॥ బద్ధస్తుచూర్ణితోభగ్నో విశ్లిష్టఃపాటితోఽపివా ।
ఛిన్నస్నాయుసిరోస్థ్యాశు సుఖంసంరోహతివ్రణః ॥ 68.
ఉత్థానశయనాద్యాసు సర్వేహాసునపీడ్యతే ।

తా॥ కట్టబడినవ్రణము అస్థినాశ్రయించినదిగ, భగ్నముగ, సంధిస్థానమునకంటె నితరమయినస్థానము నాశ్రయించినదిగ, పాటితముగ, సర్వత్రదేశము నాశ్రయించినదిగ, స్నాయువు, సిరలు ఛేదించబడినదిగనుండినను బంధనమాహాత్మ్యమువలన సుఖముగ నారిపోవును. లేచుట, పరుండుట యీమొదలగు సర్వచేష్టలయందును వ్రణమును పీడించంజనదు.



బంధన - సాధ్య వ్రణములు.

శ్లో॥ ఉద్వృత్తౌష్ఠస్సముత్సన్నో విషమఃకఠినోఽతిరుక్ ॥ 69.
సమోమృదురరుక్క్షిప్రం వ్రణశ్శుద్ధ్యతిరోహతి ।

తా॥ ఊర్ధ్వమునందు వర్తులాకారమయిన ఓష్ఠముగల వ్రణము, చుట్టూఉన్నతముగనుండువ్రణము, విషమమయిన యాకారముగల వ్రణము, కఠినమైన వ్రణము, అతిపీడగలవ్రణము, యీ 5 విధములగు వ్రణములు బంధనమాహాత్మ్యమువలన సమముగ, మృదువుగ, పీడారహితముగనై శీఘ్రములో శుద్ధిజెంది మానును.

స్థిరాది వ్రణౌషధోపయోగము.

శ్లో॥ స్థిరాణామల్పమాంసానాం రౌక్ష్యాదనుపరోహతామ్ ॥ 70.
ప్రచ్ఛాద్యమౌషధంపత్రై ర్యథాదోషంయథర్తుచ ।
అజీర్ణతరుణాచ్ఛిద్రై స్సమంతాత్సునివేశితైః ॥ 71.
ధౌతైరకర్కశైఃక్షీరీ భూర్జార్జునకదంబజైః ।

తా॥ స్థిరములుగ (అనగా దీర్ఘకాలమువరకు నారకపీడించునవిగ) స్వల్పమైన మాంసముగలవిగ, రౌక్ష్యమువలన ఆరనవిగనుండు వ్రణాదులపై కల్కస్నేహాదిరూపమైన ఔషధమునుంచి రాలనివిగ, నూతనముగ, ఛిద్రములులేనివిగ, ఉదకాదులచే నిర్మలముగ జేయబడినవిగ, కాఠిన్యరహితముగనుండు జిల్లేడు, భుజపత్రి, మద్ది, కడిమి వీనియాకులను వ్రణముపైనంతట నునిచి వాతాదిదోషములు, ఋతుభేదములు వీనికనుగుణముగా (అనగా వాతవ్రణములో హేమంతశిశిర ఋతువులయందు స్నిగ్ధముగ, ఉష్ణముగనుండు పత్రములచేతను, పిత్తవ్రణములో గ్రీష్మకాలమునందు శీతస్వభావముగలపత్రములచేతను, కఫవ్రణములో ఉష్ణకాలమునందురూక్షముగ, ఉష్ణముగనుండు పత్రములచేతను) మూయవలయును. ఇటులనే సాధారణమయినకాలమునందును, మిశ్రదోషమునందును, ఊహించుకొనవలయును.

కుష్ఠాది వ్రణములయందు - బంధన విషేధము.

శ్లో॥ కుష్ఠినామగ్నిదగ్ధానాం పిటికామధుమేహినామ్ ॥ 72.
కర్ణికాశ్చోందురువిషే క్షారదగ్ధావిషాన్వితాః ।
నమాంసపాకేచబధ్నీయా ద్గుదపాకేచదారుణే ॥ 73.
శీర్యమాణాస్సరుగ్దాహా శ్శోఫావస్థావిసర్పిణః ।

తా॥ కుష్ఠురోగియొక్క వ్రణములను, అగ్నిదాహమువలన గలిగినవ్రణములను, పిటిక, మధుమేహముగలవారియొక్క వ్రణములను, ఎలుకవిషముచేగలుగు శోథరూపమైన కర్ణికలను, క్షారదాహముచేగలిగినవ్రణములను, విషముతోగూడియుండువ్రణములను, మాంసపాకమువలనగలిగిన వ్రణములను, దారుణమైన గుదపాకమువలనగలిగిన వ్రణములను, మాంసముకుళ్ళి రాలుచూ శూల, సర్వాంగతాపము, శోఫ, విసర్పావస్థ వీనితోగూడియుండువ్రణములను బంధింపంజనదు.

## అరక్షిత వ్రణోపద్రవములు.

శ్లో॥ అరక్షయా వ్రణేయస్మిన్ మక్షికానిక్షిపేత్క్రిమీన్ ॥ 74.
తేభక్షయంతిఃకుర్వంతి రుజాశోఫాస్రసంస్రవాన్ ।

తా॥ రక్షించకుండుటచే నేవ్రణమునందు యీగెలు క్రిములనునుమనో అట్టి వ్రణమును క్రిములు భక్షించుచు శూలను, శోఫను, రక్తస్రావమును గలుగజేసును.

## క్రిమియుక్త - వ్రణ చికిత్స.

శ్లో॥ సురసాదిప్రయుంజీత తత్రధావనపూరణే ॥ 75.
సప్తపర్ణకరంజార్క నింబరాజాదనత్వచః ।
గోమూత్రకల్కితోలేప స్సేకఃక్షారాంబునాహితః ॥ 76.
ప్రచ్ఛాద్యమాంసపేశ్యావా వ్రణంతానాశునిర్హరేత్ ।

తా॥ అట్టివ్రణములో సురసాదిగణమును ప్రక్షాళనపూరణములయందు నుపయోగించవలయును. మఱియు నావ్రణమునందు ఏడాకులరటి, క్రానుగు, జిల్లేడు, వేము, పాలమ్రాను వీనిపట్టలను గోమూత్రముచేనూరి కల్కముచేసి లేపనముచేయుటయేగాక క్షారోదకముచే సేకమునుచేయుట హితకరము. లేకనావ్రణమును మాంసపేశిచే మూసి క్రిములను శీఘ్రముగా బయలుపరచవలయును.

## వ్రణమును - త్వరపడి నార్పకూడదనుట.

శ్లో॥ నచైనంత్వరమాణోంత స్సదోషముపరోహయేత్ ॥ 77.
సోఽల్పేనాప్యపచారేణ భూయోవికురుతేయతః ।

తా॥ వ్రణములోపల దోషముతో గూడుకొనియుండునపుడు వైద్యుడు త్వరపడి దానినారునటుల జేయంజనదు. ఏలననగా:—ఆ వ్రణము తత్కాలమునందారినను లోన దోషముండుటచే స్వల్పమయిన అపచారముచేతనే మరల వికారమును జెందును,



## వ్రణరోపణానంతర వర్జనీయములు.

శ్లో॥ రూఢేప్యజీర్ణవ్యాయామ వ్యవాయాదీన్వివర్జయేత్ ॥ 78.
హర్షంక్రోధంభయంవాపి యావదాస్థైర్యసంభవాత్ ।
ఆదరేణానువర్త్యోఽయం మాసాన్షట్సప్తవావిధిః ॥ 79.

తా॥ వ్రణము ఆరియుండినను అజీర్ణకరమయినవస్తువులు, వ్యాయామము, మైథునము, సంతోషము, కోపము, భయము, వీనిని 6 లేక 7 మాసములవరకుగాని లేక బలముగలుగువరకుగాని వర్జించవలయును.

## అనిర్దిష్ట - వ్రణచికిత్సా ప్రకారము.

శ్లో॥ ఉత్పద్యమానాసుచతాసుతాసు వార్తాసుదోషాదిబలానుసారీ ।
తైస్తైరుపాయైః ప్రయతశ్చికిత్సే దాలోచయ న్విస్తర
ముత్తరోక్తమ్॥ 80.

తా॥ ఆయాయవస్థలు గలుగుచునుండగా వాతాదిదోషములు, దేశము, కాలము, వీనిబలమునను సరించువాడును, జాగ్రతతోగూడినవాడునునగు వైద్యుడు ఉత్తరతంత్రములో వ్రణభంగవిధానమునందు సవిస్తరముగ జెప్పియుండు విషయమును బాగుగా పర్యాలోచనచేసి ఆయావ్రణములకు జెప్పియుండు ఉపాయములచే చికిత్సించవలయునేకాని స్వేచ్ఛగా నేదియును చేయంజనను.

ఏకోనత్రింశాధ్యాయము, ముగిసెను.

శ్రీరస్తు.

# త్రింశాధ్యాయము.

---

శస్త్రసాధ్యమైనరోగములు పాటనాదిశస్త్రకర్మలచే చికిత్సింపబడునటులనే క్షారాగ్నికర్మలచేతను చికిత్సింపబడును. కాబట్టి శస్త్రవిధ్యధ్యాయానంతరము క్షారాగ్నికర్మవిధ్యధ్యాయము చెప్పబడుచున్నది.

## క్షారాగ్నికర్మ - విధ్యధ్యాయ ప్రారంభము.

సూ॥ అథాతఃక్షారాగ్నికర్మ విధిమధ్యాయంవ్యాఖ్యాస్యామః।
ఇతిహస్మాహురాత్రేయా దయోమహర్షయః॥

తా॥ శస్త్రవిధ్యధ్యాయానంతరము క్షారకర్మ, అగ్నికర్మ వీని విధిని తెలియజేసెడు క్షారాగ్నికర్మ విధ్యధ్యాయమును వివరించెదము. క్షారాగ్నికర్మలలో క్షారము బాహ్యాభ్యంతరములయం దుపయోగింపబడుటచే తొలుత జెప్పబడుచున్నది.

## క్షార ప్రాశస్త్యము.

శ్లో॥ సర్వశస్త్రానుశస్త్రాణాం క్షారశ్శ్రేష్ఠోబహూనియత్।
ఛేద్యభేద్యాదికర్మాణి కురుతేవిషమేష్వపి॥ 1.
దుఃఖావచార్యశస్త్రేషు తేనసిద్ధిమువాగాత్సువ।
అతికృచ్ఛ్రేషురోగేషు యచ్చపానేపియుజ్యతే॥ 2.

తా॥ సమస్తమైన శస్త్రములు, [illegible] శస్త్రములు వీనిలో క్షారము మిగుల శ్రేష్ఠమైనది. ఏలననగా:— క్షారము ఛేద్యము, భేద్యము, లేఖనము, పాటనము, యీ మొదలగు అనేకకర్మలను జేయును. [illegible] రోగములచే గలిగిన [illegible] అర్బుదము యీ మొదలగు రోగములయందు [illegible] నుండు ప్రదేశములయందును, శస్త్రకర్మచే [illegible] గా ప్రకోపమును జెందిన అతికష్టసాధ్యములగు [illegible] రోగములయందును, క్షారము ఉపయోగించదగినదిగనుండును. మఱియు [illegible] శరీరాం



తర్గత రోగశాంత్యర్థమై పానవిధియందును ఉపయోగించబడుచున్నది. ''పానేపి'' అను అపిశబ్దమువలన బాహ్యరోగనివృత్త్యర్థమై లేపనమునందుకూడా క్షారముఉపయోగించబడునని యర్థంబగుచున్నది.

## అర్శోఽగ్నిరోగాదులయందు - క్షార పానము.

శ్లో॥ సపేయోర్శోఽగ్నిసాదాశ్మ గుల్మోదరగరాదిషు।

తా॥ మఱియు నాక్షారము అర్శస్సు, అగ్నిమాంద్యము, అశ్మరి, గుల్మము, ఉదరరోగము, విషము, ఆనాహము, శూల వీనియందు పానముచేయతగినదిగనుండును.

## మషాదిరోగములయందు - క్షార లేపనము.

శ్లో॥ యోజ్యస్సాక్షాన్మషశ్విత్ర బాహ్యార్శఃకుష్ఠసుప్తిషు॥ 3.
భగందరా * ర్బుదగ్రంథి నాడీదుష్టవ్రణాదిషు।

తా॥ మఱియు నాక్షారము మషము, శ్విత్రము, బాహ్యార్శస్సు, కుష్ఠము, సుప్తిరోగము, భగందరము, అర్బుదము, గ్రంథి, దుష్టమయిన నాడీవ్రణమువీనియందు లేపనముచే నుపయోగించతగినది. ''నాడీవ్రణాది'' అను ఆదిశబ్దమువలన చర్మము, కిలాసము, వర్ధ్మము, తిలకము యీ మొదలగురోగములయందును క్షారలేపనముచేయవలయునని అర్థంబగుచున్నది.

## పిత్తాదిరోగములయందు - క్షార నిషేధము.

శ్లో॥ నతూభయోపిమోక్తవ్యః పిత్తేరక్తేబలేఽబలే॥ 4.
జ్వరేఽతిసారేహృన్మూర్ధ రోగేపాండ్వామయేఽరుచౌ।
తిమిరేకృశసంశుద్ధా శ్వయథౌసర్వగాత్రగే॥ 5.
భీరుగర్భిణ్యృతుమతీ ప్రోద్వృత్తఫలయోనిషు।
అజీర్ణేఽన్నేశిశౌవృద్ధే ధమనీసంధిమర్మసు॥ 6.
తరుణాస్థిసిరాస్నాయు సేవనీగలనాభిషు।
దేశేఽల్పమాంసేవృషణ మేఢ్రస్రోతోనఖాంతరే॥ 7.
వర్త్మరోగాదృతేఽక్ష్ణోశ్చ శీతవర్షోష్ణదుర్దినే।

తా॥ పైజెప్పినప్రకారము పానలేపనభేదములచే ద్వివిధముగనుండు క్షారములను పిత్తరోగము, రక్తరోగము, విశేషబలము, దౌర్బల్యము, జ్వరము, అతిసారము,

---

పచి ఇతిపా.

హృద్రోగము, శిరోరోగము, పాండురోగము, అరోచకము, తిమిరరోగము, సర్వాంగశోఫ అను నీ రోగములయందును; వమనవిరేచనాది శుద్ధిజేసుకొనినవాడు, భీతుడు, గర్భిణి, ఋతుమతి, ఉత్తరతంత్రములో గుహ్యరోగప్రకరణములో జెప్పబడు ప్రోద్వృత్తఫల యోనిరోగము (అనగా:—

„ వేగాదావర్తనాద్యోనిం ప్రపీడయతిమారుతః । సఫేనిలంరజఃకృచ్ఛ్రా దుదావృత్తంవిముంచతి । ఇయంయాపదుదావర్తా ”

అను వచనముచొప్పున వాతము వేగముగచుట్టుటచే యోనినిపీడించి నురుగుతోగూడి యుండురజస్సును బహుకష్టముమీద స్రవింపజేయునట్టి ఉదావర్తరోగము) గలస్త్రీ అజీర్ణరోగి, శిశువులు, వృద్ధులు, వీరియందును; ధమనులు, సంధులు, మర్మము, తరుణాస్థి, సిరలు, స్నాయువులు, సేవనీలు, కంఠము, నాభి, అను శరీరప్రదేశములయందును; స్వల్పమాంసముగల ప్రదేశమునందును; వృషణము, మేఢ్రము, స్రోతస్సు, నఖమధ్యము, వీనియందును ప్రయోగించజనదు. *అటులనే కంటియొక్క వర్త్మరోగమునందుతప్ప యితరమయినరోగములయందును ప్రయోగించజనదు. వర్త్మరోగమునందు క్షారము ఉపయోగించతగినదేను. మఱియు క్షారమును హేమంతము, శిశిరము, వర్షము, గ్రీష్మము అనునీకాలములయందును, మేఘములచే మూయబడిన మధ్యాహ్నముగల దుర్దినములయందును ప్రయోగించజనదు.

### మధ్యమక్షార - పాక విధానము.

శ్లో॥ కాలముష్కకశమ్యాక కదలీపారిభద్రకాన్ ॥ 8.
అశ్వకర్ణమహావృక్ష పాలాశాస్ఫోతవృక్షకాన్ ।
ఇంద్రవృక్షార్కపూతీక నక్తమాలాశ్వమారకాన్ ॥ 9.
కాకజంఘామపామార్గ మగ్నిమంథాగ్నితిల్వకాన్ ।
సార్ద్రాన్సమూలశాఖాంశ్చ ఖండశఃపరికల్పితాన్ ॥ 10.
కోశాతకీశ్చతస్రశ్చ శూకనాళంయవస్యచ ।
నివాతేనిచయీకృత్య పృథక్తానిశిలాతలే ॥ 11.
ప్రక్షిప్యముష్కకచయే సుధాశ్మానిచదీపయేత్ ।
తతస్తిలానాంకుంతాశై దగ్ధ్వాఽగ్నౌవిగతేప్యథ ॥ 12.
కృత్వాసుధాశ్మనాంభస్మ ద్రోణంత్వితరభస్మనః ।
ముష్కకోత్తరమాదాయ ప్రత్యేకంజలమూత్రయోః ॥ 13.



గాలయేదర్ధభారేణ మహతావాససాచతత్ ।
యావత్పిచ్ఛిలరక్తాచ్ఛ స్తీక్ష్ణోజాత స్తదాచతమ్ ॥ 14.
గృహీత్వాక్షారనిస్యందం పచేల్లోహ్యంవిఘట్టయన్ ।
పచ్యమానేతత స్తస్మిం స్తాస్సుధాభస్మశర్కరాః ॥ 15.
శుక్తిక్షారపంకశంఖ నాభీశ్చాయసభాజనే ।
కృత్వాగ్నివర్ణాన్బహుశః క్షారోత్థేకుడవోన్మితే ॥ 16.
నిర్వాప్యపిష్ట్వాతేనైవ ప్రతీవాపంవినిక్షిపేత్ ।
శ్లక్ష్ణంశకృద్దక్షశిఖి గృధ్రకంకకపోతజమ్ ॥ 17.
చతుష్పాత్పిత్తపిత్తాల మనోహ్వాలవణానిచ ।
పరితస్సుతిరాంచాతో దర్వ్యాతమవఘట్టయేత్ ॥ 18.
సబాష్పైశ్చయదోత్తిష్ఠే ద్బుద్బుదైశ్లేహవద్ఘనః ।
అవతార్యతతశ్శీఘ్రో యవరాశావయోమయే ॥ 19.
స్థాప్యోయంమధ్యమఃక్షారో

తా॥ నల్లమొక్కపుచెట్టు, రేల, అరటి, వేము, ఏపిచెట్టు, బొంతజెముడు, మోదుగు, విష్ణుక్రాంతము, నరదీవృక్షము, కొడిసె, జిల్లేడు, నెమలడుగుమ్రాను, క్రానుగు, గన్నేరు, వెలమసంధి, ఉత్తరేణు, తక్కెడ, చిత్రమూలము, ఎఱ్ఱలొద్దుగు వీటిలో ప్రతిదానిని సమూలముగను, శాఖాసహితముగను, పచ్చిదిగను గ్రహించి కత్తిమొదలగువానిచే ఖండఖండములుగజేసి ప్రత్యేకప్రత్యేకముగా నుంచుకొనవలయును. ఇటులనే 4-గు విధములగు బీరలు (అనగా బీర, పెద్దబీర, ఏనుగుబీర, చేదుబీర), యవశూకము, యవనాళము, వీనిని ఖండఖండములుగజేసి ప్రత్యేకప్రత్యేకముగా నుంచుకొనవలయును. పైజెప్పినప్రకారము ప్రత్యేక ప్రత్యేకముగనుంచియుండు నల్లమొక్కపుచెట్టు మొదలగువాని ఖండములను, 4-గు విధములగు బీరలు మొదలగువానిఖండములను గాలిలేకుండుప్రదేశములో కత్తిరిజాయిపై వెస్వేరుగను, గుంపుగుంపుగను పరచి వానిపై సున్నపురాళ్ళనువేసి నువ్వులదంట్లచే ప్రత్యేకప్రత్యేకముగా కాల్చవలయును. నిప్పు చల్లారినపిదప సున్నపురాళ్ళయొక్క భస్మమును ద్రోణప్రమాణము ప్రత్యేకముగ నెత్తియించుకొనవలయును. మఱియు నితరమైన రేలమొదలగు ద్రవ్యభస్మముల నొక ద్రోణప్రమాణమును, నల్లమొక్కపుచెట్టు భస్మమును ద్రోణమునకంటె నధికముగ నెత్తియించుకొని $\frac{1}{2}$ భారము జలముచేతను, $\frac{1}{2}$

భారము మూత్రముచేతను, ప్రత్యేకప్రత్యేకముగా క్షారస్రావముగలుగువరకు, విశాల మైనవస్త్రముచే గాలనముచేయవలయును. పిచ్ఛిలముగ, రక్తవర్ణముగ, నిర్మలముగ, తీక్ష్ణముగ నాక్షారము స్రవించునపుడు దానిని ఇనుపపాత్రలోజేకొని స్నేహపాక విధిచే గరిటెవలన కలియబెట్టుచు పాకముచేయవలయును. పాకంబగుచుండు క్షార స్రావములో 8 పలములను ఉక్కుపాత్రలోజేకొని ప్రత్యేకముగ నుంచుకొనవలయును. పిడస శస్త్రులు (అనగా ప్రాణివిశేషములయొక్క అస్థులు). క్షారపంకము (అనగా ప్రలేపకము), శంఖనాభి, వీనిని ఇనుపపాత్రలోవేసి అగ్నివర్ణమువలె నెర్రగ వేయిచి పలుమారు పైజెప్పిన క్షారస్రావములలో నుంచుటచే చల్లార్చి పిదప ప్రత్యేకముగ నెత్తియునిచియుండు సున్నపురాళ్ళభస్మమును; కోడి, నెమలి, డేగ, రాబందు, పావురపిట్ట అనువానిమలములను; పశువుమొదలగు చతుష్పాదజంతువులు, పక్షులు, అనువాని పిత్తములను; హరిదళము, మనోశిలా, సైంధవము మొదలగు లవణములను పైజెప్పిన శస్త్రులు మొదలగువానితోడజేర్చి తాతి పైనునిచి ప్రత్యేకముగ నెత్తియునిచియుండు క్షారస్రావముచే నున్నగనూరిబిసికి పాకంబగుచుండు క్షారస్రావములో ప్రతీవాపమును (అనగా కల్కమును) వేయవలయును. ప్రతీవాపమనగా:—ద్రవద్రవ్యములలో ద్రవ్యాంతరములనుజేర్చి నున్నగనూరి బిసికివేయబడునదియనియర్థము. అటుల ప్రతీవాపము జేసినపిదప 4,గు ప్రక్కలయందు గరిటచే బాగుగా కలియబెట్టవలయును. ఎప్పుడాక్షారస్రావము ఉష్ణముగనుండు బుద్బుదములతోడ గట్టిగనై లేహ్యమువలె పొడవుగనేమనో (అనగా పాకమువలన నెపుడుగట్టిగనై, లేహాతుల్యముగనై గరిటెలోనంటుకొనివచ్చునో) అపుడు దానిని పొయిమీదనుండి దించుకొని యినుపపాత్రయందునిచి చల్లార్చి యావరాశిలోనుంచవలయును. ఇదియు మధ్యమక్షార పాకవిధానము.

## మృదు - క్షార విధానము.

శ్లో॥ నత్రుపిష్ట్వాక్షిపేన్మృదౌ । నిర్వాప్యాపనయేత్

తా॥ మృదువైనక్షారమును పైజెప్పిన మధ్యమక్షారమువలెనే పాకముచేయవలయును. అయితే పాకమగుచుండునపుడు దానిలో సున్నపురాళ్ళభస్మము, శస్త్రులు మొదలగువానిని వేసి తర్వాతను దించివేయవలయునేకాని పైజెప్పినమధ్యమక్షారములో జెప్పియుండునటుల ప్రతీవాపద్రవ్యములనునూరి వేయవలసినదిలేదు.

## తీక్ష్ణ - క్షార విధానము.

శ్లో॥ తీక్ష్ణేపూర్వవత్ప్రతివాపనము ॥ 20.



తథాలాంగలికాదంతి చిత్రకాతివిషానచాః ।
స్వర్జికాకనకాక్షీరి హింగుపూతీకపల్లవాః ॥ 21.
తాలపత్రీబిడంచేతి సప్తరాత్రాత్పరంతుసః । యోజ్యః

తా॥ తీక్ష్ణమైనక్షారమునుకూడా పైజెప్పిన మధ్యమక్షారమువలెనే పాకముచేసి మధ్యమక్షారమునకు జెప్పియుండు ప్రతీవాపద్రవ్యములతోడ పొత్తిగడ్డ, దంతి, చిత్రమూలము, అతివస, వస, స్వర్జికాక్షారము, హేమమాక్షికము, ఇంగువ, నెమలడుగుచిగుళ్ళు, సదాప, బిడాలవణము, వీనినికూడాజేర్చి బాగుగనూరి తీక్ష్ణమైన క్షారస్రావములో ప్రతీవాపము వేయవలయును. ఈతీక్ష్ణమైనక్షారమును 7 దినములకు పైన నుపయోగింపందగును.

## తీక్ష్ణ - క్షారోప యోగము.

శ్లో॥ తీక్ష్ణోనిలశ్లేష్మ మేదోజేష్వర్బుదాదిషు ॥ 22.

తా॥ తీక్ష్ణమైనక్షారమును వాతము, శ్లేష్మము, మేదస్సు, వీనిచేగలిగిన అర్బుదాదిరోగము లధికముగనుండునపుడుమాత్రమే ప్రయోగించవలయును. మఱియును అర్బుదాదిరోగములు మధ్యముగనుండునపుడు యితరక్షారములను ప్రయోగించవలయును. అర్బుదాదియను ఆదిశబ్దమువలన తీక్ష్ణక్షారముచే సాధ్యమగు నితరరోగములయందును ఆక్షారమునుపయోగించవలయునని భావంబగుచున్నది.

## మధ్యమ - క్షారోప యోగము.

శ్లో॥ మధ్యేష్వేవచమధ్యో

తా॥ వాతకఫమేదస్సులచేగలిగిన అర్బుదాదిరోగములు మధ్యమముగనుండునపుడు (అనగా అధికముగాకను, తగ్గకను, సమముగనుండునపుడు) మధ్యమక్షారమును ప్రయోగించవలయును.

## మృదు - క్షారోప యోగము.

శ్లో॥ ఉచ్యఃపిత్తాస్రగుదజన్మసు ।

తా॥ మృదువైనక్షారమును పిత్తరక్తముచేజనించిన అర్శోరోగమునందు ప్రయోగించవలయును. పిత్తరక్తముచేజనించిన అర్శోరోగములయందు తీక్ష్ణమధ్యక్షారములను ప్రయోగింపంజనదు.

## క్షారాంబు సంయోగము.

శ్లో॥ బలార్థంక్షీణపానీయే క్షారాంబుపునరావపేత్ ॥ 23.

తా॥ ఆక్షారము ద్రవహీనమై గట్టిగనగునపుడు దానికి బలముకలుగుటకై మరల క్షారవిధిచే కాచబడిన క్షారోదకమును దానిలో జేర్చవలయును.

### క్షార గుణములు.

శ్లో॥ నాతితీక్ష్ణో మృదుః శ్లక్ష్ణః పిచ్ఛిలశ్శీఘ్రగస్సితః ।
శిఖరీసుఖనిర్వాప్యో నవిష్యందీనచాతిరుక్ ॥ 24.
క్షారోదశగుణశ్శస్త్ర తేజసోరపికర్మకృత్ ।

తా॥ క్షారము అతితీక్ష్ణరహితముగను, మృదువుగను, శ్లక్ష్ణముగను, పిచ్ఛిలముగను, శీఘ్రములో వ్యాపరించునదిగను, శిఖరముగలదిగను (అనగా పిటికలనుగలుగజేయతగినదిగను) పులికడుగు మొదలగువానిచే సుఖముగా శమింపజేయతగినదిగను, స్రావరహితముగను, మిగులపీడనుగలుగజేయనదిగను ఇటుల 10 గుణములుగలదిగనుండును. మఱియు నీక్షారము శస్త్రముయొక్క ఛేదనపాటనలేఖనాదికృత్యములను వ్యాధిశమనరూపమగు అగ్నికృత్యములనుజేసును.

"అత్యుష్ణోతిశీతో ఽతితీక్ష్ణోతిమృదురతితనుగతి ఘనోతిపిచ్ఛిలోతివిసర్ప హీనౌషధో హీనపాకశ్చ ॥"
అత్యుష్ణము, అతిశీతలము, అతితీక్ష్ణము, అతిమృదుత్వము, మిక్కిలి తేటగనుండుట, అతిగట్టిగనుండుట, అతిపిచ్ఛిలత్వము, అతివిసర్పిగనుండుట, హీనమైన ఔషధములో గూడియుండుట, హీనపాకము అను 10 దోషములు క్షారమునకుగలవని అష్టాంగసంగ్రహములో జెప్పబడియున్నది.

శ్లో॥ ఆచూషన్నివసంరంభా ద్గాత్రమాపీడయన్నివ ॥ 25.
సర్వతోనుసరందోషా నున్మూలయతిమూలతః ।
కర్మకృత్వాగతిరుజః స్వయమేవోపశామ్యతి ॥ 26.

తా॥ క్షారము తనవేగమువలన శరీరమును చూషణము చేయునటులను, పీడించునటులనుండును. సర్వశరీరమునందు వ్యాపించి శస్త్రసాధ్యమైన దోషములను వేరుతో నాశముజేసును. అటుల తనదాహాదికృత్యములను చేసినపిదప రోగము నివృత్తియై యుండుపురుషునికి స్వయముగనే శమనమునుజెందును.

### అర్శాదిరోగములయందు - క్షారోపయోగ క్రమము.

శ్లో॥ క్షారసాధ్యేగదేభిన్నే లిఖితే స్రావితేథవా ।
క్షారంశలాకయాదత్వా ప్లోతిప్రావృతదేహయా ॥ 27.



మాత్రాశతముపేక్షేత

తా॥ క్షారసాధ్యముగనుండు అర్శోర్బుదాదిరోగములు ఛేదించబడియుండునపుడును, లేఖనముచేయబడియుండునపుడును (లేఖనము అనగా శస్త్రముచే గీచుట) లేక రక్తస్రావము చేయించబడియుండునపుడును, వస్త్రఖండముచే చుట్టబడిన శలాకచే క్షారమును ప్రయోగించి 100 మాత్రాకాలమువరకు నుపేక్షించవలయును. (అనగా పులికడుగు మొదలగువానిచే నాక్షారమును శమనముచేయకూడదని భావము.) భిన్నే, లేఖితే, అనిచెప్పియుండుటచే ఛేదనాదికర్మలంజేసినపుడుమాత్రము క్షారమును ప్రయోగించవలయుననియును, ఇతర కాలమునందు ప్రయోగించకూడదనియును స్పష్టమగుచున్నది.

శ్లో॥ తత్రార్శసావృతాననమ్ । హస్తేనయంత్రంకుర్వీత

తా॥ క్షారసాధ్యమైన అర్శోరోగమునందు క్షారప్రయోగముజేసి 100 మాత్రాకాలమువరకు అర్శోయంత్రముయొక్క ముఖమును హస్తముచే మూసుకొనియుండవలయును.

### వర్త్మరోగాదులయందు-క్షార లేపము.

శ్లో॥ వర్త్మరోగేషువర్త్మనీ ॥ 28.
నిర్భుజ్యపిచునాచ్ఛాద్య కృష్ణభాగంవినిక్షిపేత్ ।
పద్మపత్రతనుః క్షారలేపో ఘ్రాణార్బుదేషుచ ॥ 29.

తా॥ క్షారసాధ్యమైన వర్త్మరోగములయందు నేత్రములయొక్క వర్త్మప్రదేశములను కుటిలములుగజేసి తారకప్రదేశమును (అనగా నల్లగుడ్డును) ప్లోతి మొదలగువానిచేజేయబడిన పిచువుచే మూసి క్షారమును ప్రయోగించవలయును. మఱియు నానేత్రములయందు తామరపువ్వురేకంతదళముగల క్షారలేపమును చేయవలయునేకాని గుదార్శస్సునందుచేయునటుల దళముగా లేపనము చేయంజనదు. మఱియు నాసికార్బుదరోగములయందును తామరపువ్వురేకువలె సన్నముగ క్షారలేపనము చేయువలయును.

### ఘ్రాణార్బుదమునందు - క్షార లేపము.

శ్లో॥ ప్రత్యాదిత్యంనిషణ్ణస్య సమున్నమ్యాగ్రనాసికామ్ ।
మాత్రావిధార్యః పంచాశత్

తా॥ నాసికార్బుదరోగములయందు పురుషుడుసూర్యాభిముఖముగ కూర్చుండి నాసికాగ్రమును పొడవుగనెత్తుకొని క్షారలేపమును 50 మాత్రాకాలమువరకు ధరించు

కొనియుండవలయును. వర్త్మరోగములో నేత్రస్థానము మిగుల సుకుమారముగ నుండుటవలన క్షారలేపనమును మిగులనల్పమైన మాత్రాకాలమువరకు ధరించవలయును.

## కర్ణార్శస్సునందు - క్షార లేపము.

శ్లో॥ తద్వదర్శసికర్ణజే ॥ 30.

తా॥ కర్ణములో గలుగు అర్శోరోగమును నాసికార్శస్సువలెనే చికిత్సింపవలయును. (అనగా తామరపువ్వురేకుతో సమానమైన యాకారముగల క్షారలేపమును 50 మాత్రాకాలమువరకు ధరించవలయునని యర్థము.)

## క్షార - ప్రమార్జనాది కృత్యము.

శ్లో॥ క్షారం ప్రమార్జనేనాను పరిమృజ్యావగమ్య చ ।
సుదగ్ధం ఘృతమధ్వక్తం తత్పయోమస్తుకాంజికైః ॥ 31.
నిర్వాపయేత్తతస్సాజ్యైః స్వాదుశీతైః ప్రదేహయేత్ ।

తా॥ క్షారలేపమును నిర్ణయమైనకాలమువరకు ధరించిన పిదప వస్త్రము మొదలగువానిచే తుడిచి అర్శోర్బుదాదిస్థానములు క్షారముచే బాగుగదగ్ధమైనవానిని తెలుసుకొని క్షారముచేదగ్ధమైయుండు యాస్థానములయందు ఘృతము, తేనె వీనిని లేపనముచేసి పిదప మధురముగ, శీతలముగనుండు క్షీరము, మస్తు, పులికడుగు వీనిలో ఘృతమునుజేర్చి ఆస్థానమునుతడిపి క్షారవేగమును శమనము చేయించవలయును.

## క్షారకర్మయందు పథ్యము.

శ్లో॥ అభిష్యందీనిభోజ్యాని భోజ్యాని క్లేదనాయ చ ॥ 32.

తా॥ పిదప శ్లేష్మకరమైన మినుములు, పెరుగు మొదలగు అన్నపానములు వీటిని క్షారముచేదగ్ధమైయుండుస్థానములు శిథిలమగుటకై భుజింపజేయవలయును.

శ్లో॥ యదిచస్థిరమూలత్వాత్ క్షారదగ్ధం నశీర్యతే ॥
ధాన్యామ్లబీజయష్ట్యాహ్వతిలైరాలేపయేత్తతః ॥ 33.

తా॥ క్షారముచేదగ్ధమైయుండు రోగస్థానము దృఢమైనమూలముగలదిగాను శ్లేష్మకరమైన యాహారాదులచే శిథిలము కానుండినయెడల ఆరోగస్థానమునందు ధాన్యామ్లబీజము (అనగా అన్నము), అతిమధురము, నువ్వులు వీనిని లేపనము చేయవలయును.



## వ్రణహార - తిలకల్క లేపము.

శ్లో॥ తిలకల్కస్సమధుకో ఘృతాక్తో వ్రణరోపణః ।

తా॥ యష్టిమధుకము, ఘృతము వీనితోగూడియుండు తిలకల్కము వ్రణము మార్చును.

## క్షార - సమ్యగ్దగ్ధ లక్షణము.

శ్లో॥ పక్వజంబ్వసితంసన్నం సమ్యగ్దగ్ధం

తా॥ క్షారముచే బాగుగాదగ్ధమైనస్థానము పండిన నేరేడు పండువలెనల్లగ, పల్లముగనుండునని తెలియవలయును.

## క్షార - దుర్దగ్ధ లక్షణము.

శ్లో॥ విపర్యయే ॥ [తామ్రతాతోదకండ్వాద్యైర్దుర్దగ్ధం] 34.

తా॥ దగ్ధమైనస్థానము పండిన నేరేడుపండువలె నల్లగనుండకుండా ఎఱుపువర్ణము, పోట్లు, దురద, శోఫ, విస్ఫోటము వీనితోగూడియుండినయెడల బాగుగా దగ్ధముకాలేదని తెలిసికొనవలయును.

## దుర్దగ్ధమునందు పునర్దాహము.

శ్లో॥ తంపునర్దహేత్ ।

తా॥ బాగుగాదగ్ధముకాని స్థానమును మరల క్షారప్రయోగముచే దహింపజేయవలయును.

## క్షారాతి - దగ్ధ లక్షణము.

శ్లో॥ అతిదగ్ధే స్రవేద్రక్తం మూర్ఛాదాహజ్వరాదయః ॥ 35.

తా॥ క్షారముచే మిక్కుటముగా దగ్ధమైయుండునపుడు రక్తముస్రవించును. మఱియును మూర్ఛ, తాపము, జ్వరము యీ మొదలగు నుపద్రవములుగలుగును. జ్వరాదియను ఆదిశబ్దమువలన విసర్పము, శోఫ, విశేషముగా సర్వాంగములయందు తాపము, విస్ఫోటము యీ మొదలగు నుపద్రవములుగలుగునని భావంబగుచున్నది.

## గుదాతి - దాహోపద్రవములు.

శ్లో॥ గుదేవిశేషాద్విణ్మూత్రసంరోధోతిప్రవర్తనమ్ !
పుంస్త్వోపఘాతో మృత్యుర్వా గుదస్యశాతనాద్ధ్రువమ్ ॥ 36.

తా॥ క్షారకర్మచే గుదమువిశేషముగా దగ్ధమయియుండునపుడు మలమూత్రములు వెడలకుండుట, ఒకానొకపుడు మలమూత్రములధికముగ వెడలుట, పైశ్లోకములో జెప్పియుండు రక్తస్రావాద్యుపద్రవములు, శుక్రక్షయముచే స్త్రీసంభోగమునందు అసామర్థ్యముగలుగును. లేక గుదము విదారణమగుటచే మరణము నిశ్చయముగ గలుగును.

## నాసాతి - దాహోపద్రవములు.

శ్లో॥ నాసాయాంనాసికావంశ దరణాకుంచనోద్భవః ।
భవేచ్చవిషయాజ్ఞానం

తా॥ క్షారకర్మచే నాసికను అధికముగ దగ్ధమయియుండగా నాసికాదండము వగులుట, ముడుచుకొనుట, వాసనతెలియకుండుట అనునీ లక్షణములుగలుగును.

## కర్ణాద్యతి - దాహోపద్రవములు.

శ్లో॥ తద్వచ్ఛ్రోత్రాదికేష్వపి ॥ 37.

తా॥ క్షారకర్మచేచెవులు, నేత్రములు, రసనను ఇవి అధికముగ దగ్ధమయియుండగా ఆయాయింద్రియములకు విషయజ్ఞానముగలుగును.

## క్షారాతి - దాహ శమనోపచారము.

శ్లో॥ విశేషాదత్ర సేకోమ్లైర్లేపో మధుఘృతంతిలాః ।
వాతపిత్తహరాచేష్టా సర్వైవశిశిరాక్రియా । 38.

తా॥ శరీరప్రదేశములు క్షారముచేనధికముగ దగ్ధమయియున్నపుడు విశేషముగా పులిగడుగుమొదలగువానిచే సేకము, తేనె, ఘృతము, నువ్వులు వీనిచేలేపము, వాతపిత్తహరముగ, శీతముగనుండు సర్వమైన క్రియలు విశేషముగ హితకరములు.

‘‘ పాయయేతాతియోగేన తంశీఘ్రగసఘృతందధి । సగుడంవా సమస్తుం వా
తైలంవాసనీరోపలమ్ ’’

క్షారకర్మచేనతిదగ్ధుడైన పురుషునికి అతిశీఘ్రముగా ఘృతముతోగూడియుండు పెరుగునుగాని, లేకబెల్లముతోగూడియుండు పెరుగునుగాని, బెల్లముతోగూడియుండు మస్తువునుగాని, ఖండదారతోగూడియుండు తైలమునుగాని పానముచేయించవలయును. అని అష్టాంగసంగ్రహములో చెప్పబడియున్నది.



శ్లో॥ అమ్లోహిశీతస్స్పర్శేన క్షారస్తేనోపసంహితః ।
యాత్యాశుస్వాదుతాంతస్మా దమ్లైర్నిర్వాపయేత్తరామ్ ॥ 39.

తా॥ పులిగడుగు స్పర్శముచేశీతలముగనుండును. మఱియు నాపులిగడుగుసంబంధమువలన క్షారముతత్క్షణముననే కటుకలవణాది గుణములనువిడిచి మాధుర్యమును జెందును. కాబట్టి పులిగడుగుమొదలగువానిచే క్షారదగ్ధమయిన స్థలమును విశేషముగా శమనముచేయించవలయును. నిర్వాపయేత్తరాం అని చెప్పియుండుటవలన ఒకానొకపుడు దేశము, సాత్మ్యము, బలము యీమొదలగువాని ననుసరించి క్షీరముమొదలగువానిచేతను క్షారదగ్ధస్థానమును శమింపజేయందగునని భావంబగుచున్నది.

## అగ్నికర్మకు శ్రేష్ఠత్వము.

శ్లో॥ అగ్నిఃక్షారాదపిశ్రేష్ఠ స్తద్దగ్ధానామసంభవాత్ ।
భేషజక్షారశస్త్రైశ్చ నసిద్ధానాం ప్రసాధనాత్ ॥ 40.

తా॥ క్షారమునకంటె అగ్నిమిగులప్రశస్తమైనది. ఏలననగా:—అగ్నిచేదగ్ధమైన అర్శస్సు మొదలగురోగములు మరల జనించకుండును. మఱియు నౌషధము, క్షారము, శస్త్రము వీనిచే శాంతిజెందకుండురోగములను అగ్నికర్మశమింపజేసును.

## అగ్ని - కర్మోపయోగ స్థలములు.

శ్లో॥ త్వచిమాంసేసిరాస్నాయు సంధ్యస్థిషుసయుజ్యతే ।

తా॥ అగ్నికర్మచర్మము, మాంసము, సిరలు, స్నాయువులు, సంధులు, అస్థులు వీనియందుపయోగించబడును.

## మషాది - రోగములయందు - చర్మ దాహము.

శ్లో॥ మషాంగగ్లానిమూర్ధార్తి మంథకీలతిలాదిషు ॥ 41.
త్వగ్దాహోవర్తిగోదంత సూర్యకాంతశరాదిభిః ।

తా॥ మషము, అంగగ్లాని, శిరోరోగము, మంథము, కీలము, తిలము యీమొదలగురోగములయందు వర్తి (అనగాపిచువర్తి) గోదంతము, సూర్యకాంతము, బాణము, యీమొదలగువానిచే చర్మమునందు అగ్నిదాహముచేయవలయును. ‘‘ కీలతిలాదిషు ’’ అనుఆదిశబ్దమువలన క్షుద్రరోగాధ్యాయమునందుచెప్పబడు యితరరోగములయందును చర్మమునకు అగ్నిదాహముచేయవలయునని అర్థంబగుచున్నది.

అర్శాది - రోగములయందు - మాంస దాహము.

శ్లో॥ అర్శోభగందరగ్రంథి నాడీదుష్టవ్రణాదిషు ॥ 42.
మాంసదాహోమధుస్నేహ జాంబవౌష్ఠగుడాదిభిః ।

తా॥ అర్శస్సు, భగందరము, గ్రంథి, నాడీరోగము, దుష్టవ్రణము యీ మొదలగు (అనగా అర్బుదము, గండమాల) అనునీరోగములయందు తేనె, స్నేహము, జాంబవౌష్ఠమనుశలాకు, బెల్లము యీ మొదలగువానిచే మాంసమునందు అగ్నిదాహము చేయవలయును. అనగా:—ఒకానొకప్పుడు తేనెచేతను, ఒకానొకపుడు ప్రత్యేకముగా స్నేహములచేతను, ఒకానొకపుడు జాంబవౌష్ఠమను శలాకుచేతను అని తెలియవలయును.

శ్లిష్టవర్త్మ - రోగములయందు - సిరా దాహము.

శ్లో॥ శ్లిష్టవర్త్మన్యసృక్స్రావ నీల్యసమ్యగ్వ్యథాదిషు ॥ 43.
సిరాదిదాహస్తైరేవ

తా॥ శ్లిష్టవర్త్మ, రక్తస్రావము, నీల్యము, సమ్యగ్వ్యథ, యీ మొదలగు వానియందు పైజెప్పిన తేనెమొదలగువానిచేతనే సిరాదాహము చేయవలయును.

అగ్ని - కర్మకు అనర్హులు.

శ్లో॥ నదహేత్క్షారవారితాన్ ।
అంతశ్శల్యాసృజోభిన్న కోష్ఠాన్ భూరివ్రణాతురాన్ ॥ 44.

తా॥ క్షారకర్మయందనర్హులు, లోనశల్యరూపమగు రక్తముగలవారు, భిన్నమైన కోష్ఠముగలవారు, అధికముగా వ్రణములచే పీడితులుగనుండువారు వీరికి అగ్నిదాహము చేయుంజనదు. అగ్నిదాహమనగా:—అగ్నిచేత తప్తమైన శలాకాదులచే రక్షచేయుట.

అగ్ని - కర్మ - సమ్యగ్దగ్ధోప చారము.

శ్లో॥ సుదగ్ధంఘృతమధ్వక్తం స్నిగ్ధశీతైః ప్రదేహయేత్ ।

తా॥ రోగస్థానము అగ్నిచేబాగుగ దగ్ధమైనదని తెలుసుకొని దానియందు ఘృతము, తేనె వీనిని అభ్యంగముచేయించి స్నిగ్ధముగ, శీతలముగనుండు అతిమధురము, పొన్నగంటివేరు యీ మొదలగువానిని లేపనముచేయవలయును.

అగ్ని - కర్మ - సమ్యగ్దాహ లక్షణము.

శ్లో॥ తస్యలింగంస్థిరేరక్తే [illegible] ॥ 45.
[illegible] ।



తా॥ దహించుకాలమునందు ప్రవర్తించురక్తమునిలుచునపుడు ఆ స్థానము బుద్బుదశబ్దము, లసికవీనితోగూడినదిగ (లసిక అనగా కుశశస్త్రములచే గాయముగలుగు నపుడు తొలుతజలమువలె గనుపించునది) పక్వమైనతాటిపండు, పావురపిట్ట వీనితో సమానమైనవర్ణముగలదిగ, అధికమైనవేదనలేనిదై సుఖముగనారతగినదిగనుండును. ఇటులనుండుట బాగుగదగ్ధమైన స్థానముయొక్కలక్షణమని తెలియవలయును.

అగ్ని - కర్మ - దుగ్దాహ - అతిదాహ - సామాన్య లక్షణము.

శ్లో॥ ప్రమాదదగ్ధవత్సర్వం దుర్దగ్ధాత్యర్థదగ్ధయోః ॥ 46.

తా॥ దుర్దగ్ధము, అతిదగ్ధము, వీనియొక్కలక్షణము ప్రమాదముచేగలిగిన అగ్నిదగ్ధముతోతుల్యముగనుండును.

చతుర్విధ - దుర్దగ్ధ లక్షణము.

శ్లో॥ చతుర్ధాతత్తుతుత్థేన సహ

తా॥ అట్టి ప్రమాదదగ్ధము తుత్థదగ్ధలక్షణముతోడ 4 విధంబులు. ఎట్లన్న:—ఆలోచించకుండా అజాగ్రతగాజేయబడిన అగ్నిదాహము ఒకానొకపుడు సమ్యగ్దగ్ధలక్షణముగలదిగ, ఒకానొకపుడు దుర్దగ్ధలక్షణముగలదిగ, ఒకానొకపుడు అతిదగ్ధలక్షణముగలదిగ, ఒకానొకపుడు తుత్థదగ్ధలక్షణముగలదిగనుండును.

తుత్థదగ్ధ లక్షణము.

శ్లో॥ తుత్థస్యలక్షణమ్ ।
త్వగ్వివర్ణోష్యతేత్యర్థం నచస్ఫోటసముద్భవః ॥ 47.

తా॥ చర్మము మిగులవివర్ణముగనగుట, మిక్కుటముగ పీడగలుగుట, స్ఫోటకములుగలుగకుండుట, ఇవితుత్థదగ్ధముయొక్కలక్షణము.

దుర్దగ్ధ లక్షణము.

శ్లో॥ సస్ఫోటదాహతీవ్రోషం దుర్దగ్ధం

తా॥ స్ఫోటకములు, తాపము, అతితీవ్రమయిన అంతస్తాపము ఇవిగలుగుట దుర్దగ్ధముయొక్కలక్షణము.

అతిదగ్ధ లక్షణము.

శ్లో॥ అతిదాహతః ।
మాంసలంబనసంకోచ దాహధూపనవేదనాః ॥ 48.

సిరాదినాశస్తృణ్మూర్ఛా వ్రణగాంభీర్యమృత్యవః ।

తా॥ అతిదాహమువలన రోగస్థానమునందు మాంసము వ్రేలాడుట, సిరలు మొదలగువానికి సంకోచము, తాపము, ధూమాపనము (అనగా పొగలేచుట) వేదన, సిరాదులకు నాశము, గంభీరమయిన వ్రణము (అనగా లోతుగనుండు వ్రణము) మరణము, ఇవిగలుగును.

తుత్థదగ్ధ చికిత్స.

శ్లో॥ తుత్థస్యాగ్నిప్రతపనం కార్యముష్ణంచభేషజమ్ ॥ 49.
స్త్యానేస్రేవేదనాత్యర్థం విలీనేమందతారుజః ।

తా॥ తుత్థదగ్ధములో గడ్డకట్టియుండురక్తము ద్రవించుటకై అగ్నితాపమును, ఉష్ణమయినయౌషధమును చేయవలయును. ఏలననగా:—తుత్థదగ్ధస్థానములోరక్తము పేరి గడ్డకట్టియుండునపుడు విశేషముగా పీడగలుగును. రక్తము ద్రవించియుండునపుడు ఆయుపద్రవములు నివర్తించును.

దుర్దగ్ధ చికిత్స.

శ్లో॥ దుర్దగ్ధేశీతముష్ణంచ యుంజ్యాదాదౌతతోహిమమ్ ॥ 50.

తా॥ దుర్దగ్ధములో తొలుత శీతలముగ, ఉష్ణముగనుండు ఔషధమును ప్రయోగించి పిదప శీతలముగనుండు ఔషధమును ప్రయోగించవలయును.

సమ్యగ్దగ్ధ చికిత్స.

శ్లో॥ సమ్యగ్దగ్ధేతుగాక్షీరి ప్లక్షచందనగైరికైః ।
లింపేత్సాజ్యామృతైరూర్ధ్వం పిత్తవిద్రధివత్క్రియా ॥ 51.

తా॥ సమ్యగ్దగ్ధములో ఘృతము, తిప్పతీగె, వీనితోగూడియుండు గవక్షీరి, జువ్వి, చందనము, జేగురురాయి, వీనిచే తొలుత ప్రలేపమునుచేసి పిదప పిత్తవిద్రధికి జెప్పియుండు క్రియలను చేయవలయును.

అతిదగ్ధ చికిత్స.

శ్లో॥ అతిదగ్ధేద్రుతంకుర్యాత్సర్వంపిత్తవిసర్పవత్ ।

తా॥ అతిదగ్ధములో పిత్తవిసర్పమునకు జెప్పియుండు బాహ్యాభ్యంతరౌషధములను శీఘ్రముగా జేయవలయును.



స్నేహదగ్ధ చికిత్స.

శ్లో॥ స్నేహదగ్ధేభృశతరం రూక్షంతత్రతుయోజయేత్ ॥ 52.

తా॥ స్నేహదగ్ధములో మిక్కుటముగా రూక్షకరమైనయౌషధములను ప్రయోగించవలయును. (తు) అనుశబ్దమువలన తలుచుగారూక్షకరమైనప్రలేపాదులను, దేహము, దేశము, కాలము, సాత్మ్యము వీనికనుగుణముగా నాయాయవస్థకుతగినటుల స్నిగ్ధమైన ఔషధాదులను విధిప్రకారము ప్రయోగించవలయునని యర్థంబగుచున్నది.

సూత్రస్థాన నిగమనము.

శ్లో॥ సమాప్యతేస్థానమిదం హృదయస్యరహస్యవత్ ।

తా॥ హృదయమువలె నతిరహస్యార్థములంగల అష్టాంగహృదయమను నీతంత్రముయొక్క సూత్రస్థానము ముగించబడుచున్నది.

శ్లో॥ అత్రార్థాస్సూత్రితాస్సూక్ష్మాః ప్రతన్యంతేహిసర్వతః ॥ 53.

తా॥ ఈ స్థానమునందతిసూక్ష్మబుద్ధిగలవారలచే నెఱుంగదగిన యర్థములు సూచనగా జెప్పబడియున్నవి. ఈ యర్థములే సమస్తతంత్రములయందు విస్తరింపబడును.

త్రింశాధ్యాయము, ముగిసెను.

---

ఇతి శ్రీ వైద్యపతి సింహగుప్తసూను వాగ్భట్ట
విరచితాయాం అష్టాంగహృదయ సంహితాయాం
ఆంధ్ర తాత్పర్య సహితాయాం
ప్రథమం సూత్రస్థానం
సంపూర్ణమ్.

---

Printed at the Hindu Ratnakaram Press, Madras.

END OF
TITLE